# సకల ధర్మసారం రామచరితం

రామాయణం సకల ధర్మాలనిధి. రామాయణ కథానాయకుడు ధర్మాలన్నీ మూర్తీభవించినట్టున్న శ్రీరామచంద్రుడు. ఇంతటి సకల ధర్మసారం కనుకనే రామాయణం నేటికీ ధర్మాలన్నిటికీ ప్రామాణికమైంది. రామాయణానికి బ్రహ్మదేవుడి ఆశీస్సులు ఉన్నాయి. అదెలాగంటే మహర్షి వాల్మీకి ఆదికవే కాక వేదాంతి, దార్శనికుడు, తపస్వి, ప్రజలకు మార్గదర్శకుడు కూడా. అలాంటి వాల్మీకి రామాయణ రచన కోసం బ్రహ్మ నుంచి ప్రేరణ పొందాడు. ఓ

ధర్మపథం

రోజున ఆయన శిష్యులతో కలిసి తమాసా నదీ తీరానికి స్నానం కోసం వెళ్లినప్పుడు క్రౌంచపక్షుల జంటలోని మగపక్షిని ఓ వేటగాడు బాణంతో కొట్టాడు. ఆ దెబ్బకు ఆ పక్షి కింద పడి ప్రాణాలను విడిచింది. ఆ దృశ్యాన్ని చూసిన మహర్షి హృదయం కరుణ రసంతో ద్రవించింది. కళ్లు చెమ్మగిల్లాయి. కంఠం గద్గదమైంది. వెంటనే 'మానిషాద' అనే శ్లోకం ఆయన నోటివెంట అప్రయత్నంగా వచ్చింది. మనసు ఎంతో కల్లోలమైంది. ఆ పరిస్థితులలో మరోసారి బ్రహ్మదేవుడు వాల్మీకికి ధైర్యం చెప్పి ఆశీర్వదించాడు.

### రాముడి ప్రతి కదలికలోనూ ధర్మం

వాల్మీకి శోకంతో చెప్పిన శ్లోకం ఛందోబద్ధమైనదని, దాన్ని అనుసరించి రామాయణ మహాకావ్యాన్ని రచించమని అన్నాడు. రామాయణం లోకాలలో పర్వతాలు, నదులు ఉన్నంత కాలం విరాజిల్లుతూ శాశ్వత కీర్తిని సంపాదించుకొని ఉంటుందని చెప్పాడు. బ్రహ్మదేవుడి ఆ మాటలు వాల్మీకికి మరింత ప్రేరణనిచ్చాయి. ఆ వెంటనే ఆయన యోగాసీనుడై రామచరితంలోని ఘట్టాలను, దృశ్యాలను తన మనోనేత్రంతో చూడగలిగాడు. ఆ వెంటనే రామాయణ రచనకు అంకురార్పణ జరిగింది. రామాయణ మహాకావ్యంలో రామకథ, సీతాచరిత్రం, రావణ వధ వర్ణితమైనట్లు పైపైకి కనిపిస్తుంది కానీ లోతుగా పరిశీలిస్తే మానవాళికి పనికివచ్చే ఎన్నెన్నో జీవన మార్గదర్శక సూత్రాలు కనిపిస్తాయి. కాస్తంత ఓపిగ్గా శ్రద్ధగా రామాయణాన్ని చదవాలని పెద్దలు చెప్పేది అందుకే. రామాయణంలోని



రాముడు, సీతాదేవి లోకాలకు ఆదర్శలే కాదూ ఆరాధ్య దేవతలు కూడా. రామాయణంలో రాముడి ప్రతి కదలికలోనూ ధర్మం, మిత్రధర్మం, భాతృధర్మం, భర్తృధర్మం, శిష్యధర్మం, శత్రుధర్మం ఇలాంటి ధర్మాలన్నీ కనిపిస్తాయి. సీతాదేవి ఆదర్శ స్త్రీమూర్తి ఎలా ఉండాలో తెలియచెప్పింది. అందుకే రామాయణాన్ని ధర్మశాస్త్రనిధి అని అంటారు. మానవ జీవితంలో ధర్మార్థకామాలనే మూడు పురుషార్థాలను సాధించటం అవసరం. అయితే ఈ మూడిటికీ ధర్మమే మూలం. ధర్మబద్ధం కాని అర్థం, కామం అనే పురుషార్థాలు రెండూ అనర్థహేతువులవుతాయి.

### విశిష్ట గుణాలున్న ఉత్తమ పురుషుడు

ధర్మానికి విరుద్ధంగా స్వార్థంతో రాజ్యరూపంలో అర్థాన్ని కట్టబెట్టాలని చూసిన కైక లోకనిందుకు గురైంది. అలాగే ధర్మాన్ని విడిచిపెట్టి కామంతో కళ్లు మూసుకుపోయిన రావణుడు అపకీర్తి పాలయ్యాడు. ధర్మబద్ధుడై రాజ్యాన్నే తృణప్రాయంగా విడిచిపెట్టిన శ్రీరాముడు లోకానికంతటికీ ఆరాధ్యుడయ్యాడు. అంతేకాక ధర్మాన్ని రక్షించినవాడిని ధర్మమే రక్షిస్తుందన్న సూక్తిని రుజువుచేశాడు. శ్రీరామచంద్రుడిలో ఇంకా ఎన్నెన్నో ధర్మాలు ఇమిడిఉన్నాయి. రామాయణ ప్రారంభంలో వాల్మీకి మహర్షి దగ్గరకు నారద మహర్షి వచ్చినప్పుడు వాల్మీకి నారదుడి ముందు తన మనస్సులోని సందేహాలను ఉంచాడు. సద్గుణ సంపన్నుడు, ఎటువంటి విపత్కర పరిస్థితులలోనూ తొణకనివాడు, లౌకిక అలౌకిక ధర్మాలను బాగా తెలిసినవాడు, శరణాగతవత్సలుడు, ఎలాంటి క్లిష్టపరిస్థితులలోనూ ఆడితప్పనివాడు, నిశ్చలమైన సంకల్పం కలవాడు, సదాచారసంపన్నుడు, సకల ప్రాణులకు హితాన్ని కలిగించేవాడు, సకల శాస్త్ర కుశలుడు, సర్వ కార్యధురంధరుడు, తన దర్శనంతో అందరినీ సంతోషింపచేసేవాడు, ధైర్యశాలి, అరిషడ్వర్గాలను జయించినవాడు, చక్కని రూపలావణ్యాలతో శోభిల్లేవాడు, ఎవరిపైనా అసూయలేనివాడు, రణరంగంలో కోపిస్తే దేవాసురులను సైతం భయకంపితులను చేసేవాడు అయిన మహాపురుషుడు ఎవరైనా ఉన్నారా? అని వాల్మీకి తన మనసులోని సందేహాన్ని నారదుడి ముందుంచాడు. అప్పుడు ఆ నారదుడు అలాంటి ఉత్తమ గుణాలన్నీ ఒక్కరిలోనే ఉండటం చాలా కష్టం. అయినా అలాంటి విశిష్ట గుణాలన్నీ ఉన్న ఉత్తమ పురుషుడొకడు ఉన్నాడు. ఆయనే శ్రీరామచంద్రుడు అని నారదుడు వివరించాడు. ఈ నారద వాల్మీకి సంభాషణలో శ్రీరామచంద్రుడు ఎంతటి ధర్మాత్ముడో, సద్గుణ సంపన్నుడో అవగతమవుతుంది. అలాంటి సద్గుణాలనిధిలాంటి రామచరితాన్ని చదివినవారికి, తెలుసుకొన్నవారికి ఆ గుణాలు అబ్బుతాయన్న ఆలోచనతోనే సకల ధర్మశాస్త్ర నిధి అయిన రామాయణాన్ని, ధర్మాలన్నీ మూర్తీభవించిన శ్రీరామచంద్రుడిని గురించి తెలుసుకోమంటున్నారు మన పెద్దలు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## చెట్టుకొట్టి పైన వేసుకోవటం

జాతీయాలు నుడికారాలు

పనికిమాలిన పని, చేసి నష్టపోవటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. దారి పక్కన ఓ చెట్టుందట. దాని వల్ల ఏ ఇబ్బందీ ఎవరికీ కలగటంలేదు. ఎండపాటివేళ ఎవరైనా ఆ చెట్టుకింద నీడలో కాసేపు విశ్రాంతి పొందుతున్నారు కూడా. అలాంటి చెట్టును ఏ పనీలేని ఓ వ్యక్తి చూసి ఏదో ఓ పని చెయ్యాలి కదాని దాన్ని కొట్టడం ప్రారంభించాడు. అది విరిగి అతడి మీదే పడింది. అలాంటి పనికిమాలిన పనులను చేసి ఎవరైనా నష్టపోతున్నప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

## నూకాంబిక ఆలయంలో భక్తుల సందడి

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** కొత్త అమావాస్య జాతర సందర్భంగా అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి దర్శనానికి భక్తులు బారులుతీరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారిని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి ప్రత్యేక నైవేద్యం కోసం దర్శనం నిలిపివేశారు. తిరిగి ఉగాది పర్వదినం సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి దర్శనం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.



అలంకరణలో నూకాంబిక అమ్మవారు

## జైన మందిరంలో పూజలు

**మెదక్, న్యూస్‌టుడే:** కొల్చారంలోని ప్రఖ్యాత 1008 దిగంబర పార్శ్వనాథ జైనమందిరంలో సికింద్రాబాద్, హైదరాబాద్ జైన సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఔరంగాబాద్ దామోదర్‌పండిత్‌జీ పర్యవేక్షణలో మహావీర్ పండిత్‌జీ, తుల్జన్ పండిత్ జీల ఆధ్వర్యంలో ఆలయంలోని దిగంబర పార్శ్వనాథ ఏకశిలా విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు.



రథంపై శ్రీ లక్ష్మీనరసింహుడు

## జై నరసింహ.. జయ జయ నరసింహ

**మెదక్, న్యూస్‌టుడే:** విమాన రథంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వేలసంఖ్యలో ఆదివారం నాచగిరికి తరలివచ్చారు. స్వామివారి నవవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన స్వామివారి రథోత్సవ ఊరేగింపు తెల్లవారు జామున 5 గంటలకు మొదలయింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు అశేష భక్తజనావళి జయజయధ్వానాల మధ్య సర్వాలంకారశోభితుడైన స్వామివారు విమాన రథంపై కొలువుదీరి ఆలయ పురవీధుల్లో ఊరేగారు. ఆలయ ప్రధానార్చకులు కృష్ణమాచారి నేతృత్వంలో అర్చకులు, పురోహితులు పూజలు నిర్వహించారు. నరసింహునికి జై.. అంటూ భక్తులు స్వామిరథాన్ని ముందుకు లాగారు. అనంతరం స్వామిని ప్రధానాలయానికి తరలించారు. అంతకు ముందు శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆనందపరిచాయి. ప్రత్యేక పూజలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, తెదేపా నాయకుడు ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట గజ్వేల్-తూప్రాన్ రహదారిపై సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

ఆంధ్రావని

## సుబ్రహ్మణ్యస్వామి ఆరాధనతో శుభాలు



విజయానంద తీర్థస్వామిజీ

**ఏలూరు , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** దేవసేనాని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆరాధించిన వారికి సకల శుభాలు చేకూరతాయని పరమహంస పరివ్రాజకాచార్య శ్రీదత్త విజయానంద తీర్థస్వామిజీ పేర్కొన్నారు. దొండపాడులోని శ్రీవరదత్తనాథక్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మండల అభిషేక మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు.

## పుట్టపర్తి సాయిబాబాపై త్వరలో సినిమా

**విజయవాడ, న్యూస్‌టుడే:** ఎందరో భక్తుల ప్రేమాభిమానాలు చొరగొన్న పుట్టపర్తి సాయిబాబాపై సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తానని ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ అన్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ పుట్టపర్తి సాయిబాబా పాత్రలో తమిళనటుడు దిలీప్ నటిస్తున్నారన్నారు. వీటితో పాటు అర్జున్ హీరోగా సెంటిమెంట్ చిత్రాన్ని తీస్తున్నామని, దీని షూటింగ్ శ్రీలంకలో జరుగుతుందని చెప్పారు. అంకుల్... ఆంజనేయులు పేరుతో మరో సినిమా ప్రతిపాదన కూడా చర్చల్లో ఉందన్నారు. దేవుళ్లు సినిమా తరహాలో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు.



ఆశీర్వచన మండపంలో సినీ దర్శకుడు కోడి రామకృష్ణ

## శ్రీగిరిపై వైభవంగా రథోత్సవం

**కర్నూలు, న్యూస్‌టుడే:** ఉగాది పర్వదినం సందర్భంగా మహాదేవుడు శ్రీమల్లికార్జునస్వామి రథోత్సవం శ్రీగిరిపై భక్తజనాన్ని ఆధ్యాత్మిక పరవశులను చేసింది. దేవేరి భ్రమరాంబికతో కలిసి మల్లిఖార్జునుడు వీధుల్లో విహరించి అభయహస్తం అందించారు. వివిధ వర్ణాల పుష్పాలతో శోభాయమానంగా అలంకీకృతమైన రథంపై వారి వైభవం భక్తులకు నేత్రానందం కలిగించింది. ఉగాది మహోత్సవాల నాలుగోరోజున కన్నడ భక్తులతో శ్రీశైలం వీధులు పోటెత్తాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆలయంలో విశేష పూజలు నిర్వహించి మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక సంబరాల నడుమ రథశాల వద్దకు తీసుకు వచ్చారు. అర్చకులు, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామశివాచార్య మహాస్వామి మంగళహారతిచ్చి రథోత్సవం ప్రారంభించారు. అనంతరం అశేష జనవాహిని నడుమ రథశాల నుంచి నంది మండపం వరకు రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవం ఎదుట కళాకారులు కోలాటం, చెక్కభజన, గిరిజన మహిళల నృత్యం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. 'హర హర మహాదేవ.. మమ్మేలు జగదీశా' అంటూ అరటి పళ్లను విసిరి భక్తిని చాటుకున్నారు. సాయంత్రం శ్రీభ్రమరాంబికాదేవి రమావాణీ సేవిత రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



రథోత్సవంలో భక్తులు

# రామకథాసుధ.. తరగని ఆనందమే సదా!

మానవాళికి పాపాల ఫలితంగా సంక్రమించే వ్యథలను పోగొట్టే సుధలాంటిది రామకథ. అందుకే రామకథను సుధ అని నిర్ధరించి చెబుతుంటారు పెద్దలు. రామకథాసుధాపానము చేసేది ఎన్నటికో అంటూ అమృతమయమైన రామనామాన్ని ఎప్పుడెప్పుడు అందామా? ఎప్పుడెప్పుడు విందామా? అని అనుకొంటూ తపించి పోతుంటారు భక్తులు. త్యాగరాజస్వామిలాంటి మహనీయులు ఆ రామకథాసుధను తనివితీరా పానం చేసినందు వల్లనే నేటికీ కీర్తికాయంతో ఈ లోకంలో నిలిచి ఉండగలుగుతున్నారు. 'రామ' అని అనటానికి నోరు తిరక్కపోయినా 'మర' అంటూ నిరంతరం జపించినందువల్ల రామనామ జప ఫలసిద్ధి కలిగి ఓ సాధారణ వ్యక్తి రామాయణాన్ని రాయగలిగినంతటి వాల్మీకిగా మారిపోయాడు. రామకథ వింటే చాలు. రామ స్వరూపాన్ని తలచుకొంటే చాలు. మనసులో ఉన్న మాలిన్యాలు తొలిగి మనిషి మనీషిగా మానవత్వం మూర్తీభవించిన మహత్తర శక్తిస్వరూపుడిగా మారుతాడు. ఈ సత్యం ఈనాటికీ లోకంలో బహుళ ప్రచారంలో ఉంది. అందుకే రామాలయం లేని గ్రామం కానీ, రాముడంటే తెలియని భారతీయుడు కానీ ఉండడు అని పెద్దలు గట్టిగా చెబుతుంటారు. రామకథ వింటే నిజంగా మనసు మాలిన్యం తొలగి రాక్షసత్వం పోయి మనిషి మనిషీ అవుతాడా? అని అంటే కచ్చితంగా అయితీరుతాడు అని వివరించి చెబుతోంది స్కంద పురాణాంతర్గతంగా ఉన్న శ్రీమద్రామయణ మాహాత్మ్యం.

## గురువుకు కోపం వస్తే..?

మహామహా పాపాలలో గురునింద, గురువును అవమానపరచటం అనేవి కూడా ఉన్నాయి. దైవానికి కోపం వచ్చినా శాంతపరచటానికి, శాపం నుంచి విముక్తి పొందటానికి కొద్దోగొప్పో మార్గాలున్నాయామో కానీ గురువుకు కోపం వచ్చి శపిస్తే ఆ శాపం నుంచి బయటపడటం అంత సామాన్యమైన పనేమీ కాదు. అలాంటి పాపాల ప్రక్షాళనకు దివ్యౌషధం ఒక్క రామాయణమే. రామాయణ కథాశ్రవణం అనే దివ్యాయుధం ఉంటే పాపాల పెను



భూతాన్ని ఇట్టే నరికేసి శాంతిని పొందొచ్చు అని గురుశాపానికి గురైనా శాంతిని పొందొచ్చు అని గురుశాపానికి గురైన సౌదాముడనే వ్యక్తి కథ నిరూపిస్తుంది. గురుశాపం కారణంగా ఆ వ్యక్తి బ్రహ్మరాక్షసుడిగా మారిపోయాడు. గురువును అవమానపరచటమనేది అక్షరాలా రాక్షసత్వానికి ప్రతీక. అందుకే గురువును అవమానించిన ఆ వ్యక్తి దానికి తగిన ఫలితంగా రాక్షసుడిగానే మారిపోయాడు. తనకు ఇష్టం లేకుండానే ఎన్నెన్నో పాపపు పనులను చేస్తూ రాక్షసుడిగా మారి దారుల వెంట, డొంకల వెంట వెళుతున్న అందరినీ పీక్కుతినటం ప్రారంభించాడు. ఆ పనులను చేసేటప్పుడు తన మీద తనకు అసహ్యం కలిగినా గురువు ఇచ్చిన శాపం నుంచి తప్పించుకొనేందుకు అవకాశమే దొరకటం లేదు. అయితే అతడు అంతకుముందు చేసుకున్న పుణ్యఫలమో ఏమో ఓ రోజున గర్గుడు అనే ముని ఆ రాక్షసుడు ఉంటున్న ప్రాంతం నుంచే వేరొక చోటికి వెళ్లసాగాడు. మార్గమధ్యలో బ్రహ్మరాక్షసుడున్నాడన్న సంగతికానీ, ఎందరెందరినో ఆ రాక్షసుడు పొట్టనపెట్టుకున్నాడన్న సంగతి కానీ ఆ ఆచార్యుడికి తెలియవు. సమీపంలోని గంగానదిలో స్నానం చేసి కాసిని గంగాజలాన్ని వెంటతీసుకొని రామనామాన్ని జపించుకొంటూ అటుగా వచ్చాడు. ముందుగా ఆ రాక్షసుడు ఆ ఆచార్యుడిని పట్టి చంపి తిందామనుకున్నాడు. కానీ ఆయన నోటినుంచి వినిపిస్తున్న రామనామ ధ్వని అంతటి బ్రహ్మరాక్షసుడిని శాంతస్వభావుడిగా మార్చేసింది.

## బ్రహ్మరాక్షసుడికి విముక్తి

గర్గుడు బ్రహ్మరాక్షసుడిని చూసి అతడి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. అతడికి ఆ పాపమంతాపోయి మళ్లీ మామూలుగా అయ్యేందుకు తొమ్మిది రోజులపాటు రామాయణ కథను వినమని, రామనామాన్ని జపిస్తూ ఉండమని చెప్పాడు. అప్పుడు ఆ బ్రహ్మరాక్షసుడు తనను ఏ గ్రామవాసులు, నగరవాసులు దగ్గరకు రానివ్వరని తనను చూసి అందరూ పారిపోతుంటారు కనుక ఇక తాను ఎవరి వల్ల రామకథను వినగలను? అని బాధపడసాగాడు. రామమంత్ర శ్రవణం అతనిలో కొద్దిగా ఆలోచనను రేకెత్తించింది. వెంటనే గర్గాచార్యుడికి నమస్కరించి తన మనసులోని మాటను చెప్పి తనకు తొమ్మిది రోజులపాటు రామాయణ కథను వినిపించమని వేడుకొన్నాడు. గర్గాచార్యుడు పరోపకార బుద్ధితో ఆ కోర్కెను మన్నించాడు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో రామకథను విని శాపం నుంచి బయటపడి బ్రహ్మరాక్షసత్వాన్ని పోగొట్టుకొని మళ్లీ తన అసలు రూపాన్ని పొందగలిగాడు సౌదాముడు. ఇలా ఈ కథ రామాయణ శ్రవణఫలితాన్ని చక్కగా వివరిస్తోంది. అందుకే ఈనాటికీ వసంత నవరాత్రుల సమయాలలో రామాయణ కథాగానాలు, ప్రవచనాలు, రామనామ జపయజ్ఞాలు నిరంతరం జరుగుతూ ఉండటం కనిపిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# అంగరంగ వైభవం.. అంజన్న గ్రామోత్సవం

**అనంతపురం, గుంతకల్లు, న్యూస్‌టుడే:** కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు సోమవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం రాత్రి అంజన్న గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా యాగశాలలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా పూలతో అలంకరించారు. వేదపండితులు పూజలు చేసిన అనంతరం విగ్రహాలను రథంలో కొలువదీర్చారు. ఆలయ ఉపకమిషనరు సురేష్‌బాబు రథం ముందు పూజలు చేశారు. భక్తుల జై హనుమాన్..జై భజరంగభళి.. జయ జయ ధ్వానాల మధ్య రథం ముందుకు కదిలింది. వేదపండితులు సీతారాములు, ఆంజనేయస్వామిని కీర్తిస్తూ ప్రజలందరూ చల్లగా ఉండేవిధంగా దీవించాలంటూ వేదమంత్రాలు చదివారు. ముందుగా గుడి చుట్టూ ప్రదక్షిణ అనంతరం కసాపురం గ్రామంలో ఊరేగింపు సాగింది. భక్తులు ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. రాత్రి బస చేసిన భక్తులకు కాలక్షేపానికి ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహ్లాదపరిచాయి. బెంగుళూరు కళాకారుడు విజయకుమార్ భరత నాట్య ప్రదర్శనతో ఔరా అనిపించారు..



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

## రేకు మడచటం

కొట్టడం, అణచటం, అణగగొట్టడం లాంటి అర్థాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. రేకుతో పాత్రలను కానీ, ఇతర పరికరాలను కానీ తయారుచేసే విధానాన్ని అనుసరించి ఈ జాతీయం ప్రయోగంలోకి వచ్చింది. రేకును మడిచిన తర్వాత దాన్ని అలాగే ఉంచరు. వంపు మీద సుత్తితో అణగగొడతారు. ఈ పనిని దృష్టిలో ఉంచుకొనే ఈ జాతీయం రూపొందింది.

# ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే :** నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకొన్నారు. స్వామికి అభిషేకం, అర్చనలు, ఉమాదేవికి కుంకుమార్చన పూజలు చేశారు.



స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

# కల్పవృక్ష వాహనంపై కోదండరాముడు

**తిరుపతి , న్యూస్‌టుడే:** తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై సీతా సమేత లక్ష్మణ రాములవారు ఊరేగుతూ భక్తులను అలరించారు. రాత్రి సర్వభూపాల వాహనంలో సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు గజరాజులు ఠీవిగా కదులుతుండగా, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలు, డప్పు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి వాహనసేవలు ముందుకుసాగాయి. భక్తులు కర్పూర హారతులు సమర్పించి పండ్లు, ఫలహారాలు నైవేద్యంగా సమర్పించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.



సర్వభూపాల వాహనంపై విహరిస్తున్న కోదండరాముడు

## శాకంబరిగా లలితాదేవి

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** జయనామ సంవత్సర ఉగాది సందర్భంగా యానాంలోని పడవలరేవు వీధిలో గల లలితాదేవి ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆలయ కమిటీ 150 కిలోల వివిధ రకాలు కూరగాయలను సమకూర్చగా అర్చకుడు గణేష్ అంతరాలయం, గర్భాలయం, అమ్మవారి విగ్రహం, ఉత్సవ విగ్రహాలకు కూరగాలతో అలంకరింపచేసారు. జయనామ ఉగాది పురస్కరించుకుని వందల సంఖ్యలో హాజరైన భక్తులు శాకంబరిగా కనిపించిన లలితాదేవిని భక్తి శ్రద్ధలతో కొలుచుకున్నారు. లలితాదేవి దివ్యమంగళరూపం ఎంతో తేజోమయంగా కనిపించింది.

# వేడుకగా ఉగాది ఆస్థానం

## సిద్దయ్య స్వామికి భక్తిశ్రద్ధలతో పూలచాదర్

**కడప, న్యూస్‌టుడే :** కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియశిష్యుడు సిద్ధయ్య స్వాముల సన్నిధిలో సోమవారం ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. తెలుగు నూతన జయనామ సంవత్సరాదిని పురస్కరించుకుని మండలంలోని ముడమాల గ్రామంలో వెలసిన సిద్ధయ్య స్వామి సన్నిధిలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. వంశపారంపరంగా ప్రతి ఏటా స్వామి వారికి తొలిపూజలు అందిస్తున్న ఖాజీపేట మండలం సన్నపల్లె గ్రామానికి చెందిన కనపర్తి, తుమ్మలూరు కుటుంబసభ్యులు సోమవారం సిద్ధయ్యగారి మఠం చేరుకున్నారు. ముడమాల గ్రామం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మఠం సన్నిధికి చేరుకొని పూలచాదర్‌ను స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలసన్నిధిలో కాలజ్ఞాని బ్రహ్మంగారు తన శిష్యుడైన సిద్ధయ్యకు ఇచ్చిన అంగుళీకం, మంత్రదండాలను స్పృశించి తన్మయత్వం పొందారు. ఈ క్రతువు ముగియడంతో సాధారణ భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అనుమతిచ్చారు. కార్యక్రమంలో కనపర్తి సిద్ధారెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, తుమ్మలూరు వీరరవీంద్రారెడ్డి, వీరారెడ్డి, పాపిరెడ్డి, చంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యర్రమాచు సుదర్శనరెడ్డిలు పాల్గొన్నారు.



సిద్దయ్య స్వామి జీవసమాధికి పూలచాదర్‌ను అలంకరిస్తూ...

# ఎప్పుడేం చేయాలో చక్కగా చెప్పిన రామయ్య

శ్రీరామచంద్రుడిలోని ఆదర్శ గుణగణాలు ఎన్నెన్నో. రామాయణం ఆది నుంచి అంతం దాకా అనేక సందర్భాల్లో ఆ గుణగణాలన్నీ ప్రత్యక్షమవుతూ ఉంటాయి. ఇటువంటి వాటిలో కొన్ని రామాయణం అయోధ్యకాండలో కనిపిస్తాయి. వనవాసానికి వెళ్లిన అన్న రామచంద్రుడిని వెతుక్కుంటూ భరతుడు వచ్చినప్పుడు ఆ అన్నకు, తమ్ముడికి నడుమ జరిగిన కుశల ప్రశ్నల్లోనే శ్రీరాముడి ఆదర్శ గుణగణాలన్నీ కనిపిస్తాయి. ఒక

ధర్మపథం

వ్యక్తి బిడ్డగా తల్లిదండ్రులకు, శిష్యుడిగా గురువుకు, పాలకుడిగా ప్రజలకు లేదా ఉద్యోగస్థుడిగా ఉన్నతాధికారులకు ఎలా సేవలు చేయాలి, తన కర్తవ్యాలను ఎలా నిర్వర్తించాలి అనే విషయాలన్నీ ఈ సంభాషణలో కనిపిస్తాయి. బిడ్డ తండ్రికి చక్కగా సేవలు చేయాలి. ఆ బిడ్డే రాజైతే అధిక శాస్త్రపరిజ్ఞానం కలిగిన వారు చెప్పిన కర్తవ్యబోధలను ఆచరిస్తుండాలి. శాస్త్రవిధి తెలిసిన పురోహితుడితో ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ యజ్ఞయాగాలు, హోమాలు చేయాలో అక్కడ వాటన్నిటినీ చేయిస్తుండాలి. దేవతలను, తల్లిదండ్రులను, గురువులను, వృద్ధులను, పండితులను, వైద్యులను గౌరవిస్తుండాలి. శాస్త్ర పండితులైన మంత్రులు మంత్రాలోచనను రహస్యంగా ఉంచుతున్నారా? లేదా? అన్న విషయాన్ని గమనించుకొంటుండాలి.

### తెలివైన అంతరంగికులతో మంతనాలు

తెల్లవారుజామునే లేచి మంత్రులతో మంత్రాలోచన చేయాలి. కేవలం తానొక్కడే ఆలోచించడం కానీ, లేదా తన ఆలోచనను బహిరంగంగా చిన్నాపెద్దా అందరిముందు ఉంచటం కానీ చేయకూడదు. ఎందుకంటే కేవలం ఒక్కడే ఆలోచించి నిర్ణయం తీసుకొన్నా ఆ నిర్ణయం సరిగా ఉండకపోవచ్చు. కనిపించిన వారందరితోనూ తన మనసులోని మాటను చెప్పి అందరితోనూ ఆలోచన చేసినా ఆ విషయాలు అందరికీ తెలిసిపోయి రహస్యం అని లేకుండా పోయే ప్రమాదం వస్తుంది. అందుకే ప్రతి వ్యక్తీ తెలివైన అంతరంగికులు కొద్దిమందితో మాత్రమే మంత్రాలోచన చేసి నిర్ణయాలు తీసుకొంటుండాలి. సకాలంలో చేసిన ప్రయత్నం కొద్దిపాటి శ్రమతోనే ఫలిస్తుంది. అందుకే నిర్ణయాలు చురుగ్గా తీసుకొంటుండాలి. ఉపాయం చేతకానీ, ఊహ చేతకానీ మంత్రులు చేసే ఆలోచనలు శత్రువులదాకా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తనకెంతటి అభిమానులైనా సరే మూర్ఖులను విడిచిపెట్టడమే మేలు. వెయ్యిమంది మూర్ఖులను చేరదీయటం కన్నా ఒక్క పండితుడిని చేరదీయడం ఎంతో మేలు. సమర్థులైన సేవకులను ఉత్తమమైన పనులకోసం, సామాన్యమైన సామర్థ్యం ఉన్నవారిని సామాన్యమైన పనులకోసం, అతితక్కువ సామర్థ్యం ఉన్నవారిని చిన్నచిన్న పనులకోసం ఉపయోగిస్తుండాలి. తాత ముత్తాతల నుంచి ఇంట్లో పని చేస్తున్నవారిని, చాలాకాలం నుంచి నమ్మకంగా ఉన్నవారిని శ్రేష్ఠమైన పనులను చేయటానికి ఉపయోగించాలి. అంతరంగికుల నడుమ విభేదాన్ని కలిగిస్తున్నవారిని వెంటనే దూరం చేయాలి. అలా చేయకపోతే మొత్తం వ్యవస్థంతా పాడైపోయే ప్రమాదముంది.



### వారి ఆపదలను తొలగించాలి

పాలకుడన్నవాడు సైన్యానికి తగినంత ఆహారాన్ని, ఎంత ఇవ్వాలో అంత జీతాన్ని ఎప్పటికప్పుడు ఇస్తుండాలి. జీతంకానీ, ఆహారంకానీ తగిన సమయంలో అందకపోతే సేవకులు పాలకుడి మీద కోపించి ఎదురుతిరుగుతారు. ఇక దాంతో ఎన్నెన్నో అనర్థాలు ముంచుకొస్తాయి. పాలకుడనేవాడు శత్రువుల విషయంలో తెలివిగా ప్రవర్తిస్తుండాలి. స్వదేశీయుడు, సమర్థుడు, కచ్చితంగా నిజం చెప్పేవాడు, సమయస్ఫూర్తి కలిగినవాడు అయిన పండితుడిని మాత్రమే దూతగా పెట్టుకోవాలి. శత్రువుల కదలికల విషయంలో ఎంతో మెలకువగా ఉండాలి. వ్యవసాయదారులు, గోసంరక్షణతో జీవితాన్ని గడిపేవారికి ఎప్పటికప్పుడు తగిన వసతులను కల్పిస్తూ రక్షణ ఇవ్వాలి. వారి ఆపదలను తొలగించటంలో ఆలస్యం చెయ్యకూడదు. పాలకుడనేవాడు ధర్మమార్గంలో వెళుతూ ధర్మంగా ప్రజలను రక్షించాలి. అప్పుడే ప్రజలంతా ప్రభువుకు అనుకూలంగా ఉంటారు. అలాగే స్త్రీలను గౌరవిస్తూ రక్షించాలి. ఏనుగులను, గుర్రాలను, ఇంకా అలాంటి జంతువులను, ఆ జంతువులు ఉండే అడవులను రక్షించడం పాలకుడి బాధ్యత. ఇలాంటి పనులన్నీ భరతుడు చేస్తున్నాడా? లేదా? అని రాముడు కుశలప్రశ్నల నడుమ అడిగాడు. అంటే అలా ధర్మబద్ధంగా నడుచుకొనే పాలకుడు ప్రజల మెప్పు పొందితీరుతాడని అవగతమవుతుంది. ఇన్ని ధర్మవిశేషాలు, ఆదర్శ గుణాలు ఉన్నాయి కనుకనే రామచంద్రుడిని ఈనాటికీ అంతా ఆదర్శ ధర్మమూర్తి అని అంటున్నారు.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు



రాజమండ్రి పుష్కరఘాట్ వద్ద తలంబ్రాలను తీసుకువెళ్తున్న భక్తులు

# కోటితలంబ్రాలకు గోదావరి హారతి



రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే: కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షురాలు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో కోటితలంబ్రాలకు హారతి ఉత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం పుష్కరఘాట్ వద్ద మహిళలు తీసుకువచ్చిన కోటితలంబ్రాలకు వేదమంత్రాలతో అర్చన చేశారు. 8 మండలాల్లో 30 గ్రామాలకు చెందిన వెయ్యిమంది భక్తులు ఒక్కొక్కరు 10 వేల చొప్పున ధాన్యాన్ని గోటితో వొలిచారు. ఇలా వొలిచిన 220 కిలోల బియ్యాన్ని సీతారాముల కల్యాణానికి భద్రాచలం తీసుకువెళ్తున్న సందర్భంగా గోదావరి వద్ద పూజలు నిర్వహించారు. 108 మంది మహిళలు కల్యాణం అప్పారావు నేతృత్వంలో సీతారాముల అష్టోత్తరం, విష్ణుసహస్రనామ పారాయణ నిర్వహించారు. కోటితలంబ్రాలను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

## చేదోడువాదోడు

జాతీయాలు నుడికారాలు

పనికి, మాటకు సహాయపడటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. చేయి+తోడు చేదోడు, వాయి+తోడు వాదోడు అనే రూపాలుగా అయ్యాయి. ఈ రెండు రూపాల కలయికతో ఏర్పడిన జాతీయం ఇది. పనిచేయటానికి సహకరించేది చేయి. మాట్లాడటానికి ఉపయోగపడేది వాయి(నోరు). ఈ అర్థంలో ఎవరైనా పనిలో సాయపడుతూ పనిపూర్తిగా జరగటానికి మాట సహాయం చేస్తున్నప్పుడు ఈ జాతీయం వాడటం కనిపిస్తుంది.

## వైభవంగా చౌడేశ్వరీ ఉట్ల మానోత్సవం

తిరుపతి, న్యూస్‌టుడే: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీ అమ్మవారి తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి జ్యోతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి తిరునాళ్ల కోసం రాయలసీమలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం పోటెత్తింది. అమ్మ వారిని ప్రత్యేక పుష్పపల్లకిలో సింహవాహనంలో ఘనంగా ఊరేగించారు. తొగటివీర క్షత్రియులు 45 మంది భక్తులు అమ్మ వారికి ప్రత్యేకంగా జ్యోతులు తయారు చేసి అమ్మవారి ఎదుట నాట్యం చేశారు. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండంలోకి దూకి అమ్మవారి పట్ల భక్తి భావాన్ని చాటుకున్నారు.

ఆంధ్రావని

# పల్లకీలో ఊరేగిన శ్రీవారు

ఖమ్మం, న్యూస్‌టుడే: జమలాపురం దివ్య క్షేత్రంలో వేంకటేశ్వరుడి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన మంగళవారం ఆలయ ప్రాంగణంలో శ్రీవారు, అమ్మవార్లను ముస్తాబు చేసి కొండ చుట్టూ పల్లకీలో ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రాంగణంలో గోపూజ చేశారు. ప్రధాన హోమాల అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈవో వెచ్చా నరసింహారావు, ఉప ప్రధాన అర్చకుడు శ్రీనివాస్‌శర్మ, వేద పండితులు కొత్తూరి కోటేశ్వరశాస్త్రి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగిస్తున్న అర్చకులు



విశేషాలంకరణలో దాసాంజనేయస్వామి

## ఘనంగా ప్రారంభమైన 'రామనామ' సప్తాహం

భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే: మారుతీ టాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని మంగళవారం ఆలయ ప్రాంగణంలో 'రామనామ సప్తాహం' ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 8వ తేదీ మంగళవారం శ్రీరామ నవమి వరకు 8 రోజుల పాటు ఈ సప్తాహం జరుగుతుందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, సహస్ర సిందూరార్చన, ఐదు వేల తమలపాకులతో పూజలు ఆలయ అర్చకుడు భాస్కరశర్మ నిర్వహించారు. రాత్రి వివిధ పుష్పాలతో తమలపాకులతో విశేషాలంకరణ చేశారు. వెండి పుష్పాలతో ఆంజనేయస్వామి, సువర్చలాదేవికి పూజలు జరిగాయి.

# అశ్వవాహనంపై దేవదేవుడు



నిజరూపాలంకారంలో భ్రమరాంబికాదేవి

కర్నూలు, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ఐదు రోజులపాటు జరిగిన శ్రీజయనామ సంవత్సర ఉగాది మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మంగళవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్లకు అశ్వవాహన సేవ జరిగింది. భ్రమరాంబాదేవి నిజాలంకారంలో భక్తులకు దివ్యమంగళ స్వరూపంతో దర్శనమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీస్వామి, అమ్మవార్లకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులకు ఆలయ ఉత్సవం జరిపారు. ఉత్సవంలో చెక్కభజనలు, అగ్నికీల విన్యాసాలు, కళాకారులు విచిత్ర వేషధారణతో ఆకట్టుకున్నారు. ఆలయ ఏఈవో సి.రాజశేఖర్, ధర్మకర్త సీతారామసుబ్బయ్య, ప్రధానార్చకులు రాచయ్యస్వామి, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# అయోధ్యానగరి.. అదో దివ్యభూమి!

‘మంగళం కోసలేంద్రాయ మహానీయ గుణాత్మమే” అంటూ శ్రీ రామచంద్రుడిని ఇప్పటికీ అంతా స్తుతిస్తుండటం కనిపిస్తుంది. రాముడు కోసల దేశపు ప్రభువు. ఆ దేశానికి రాజధాని అయోధ్య. ఆ దేశం, ఆ ముఖ్యపట్టణం ఆనాడు ఎంత గొప్పగా ఉండేవో రాముడు భరతుడితో మాట్లాడిన సందర్భంలో ప్రకటితమవుతుంది. రామాయణం అయోధ్యకాండ నూరో సర్గలో అయోధ్య, కోసల దేశాల విశేషాలు కనిపిస్తాయి. రఘు

ధర్మపథం

వంశంలో ఉన్న పూర్వులు అసహాయశూరులు. అలాంటి ఎందరెందరో రాజులకు శత్రుదుర్భేద్యమైన అయోధ్యా నగరం రాజధానిగా ఉండేది. అంత పటిష్ఠంగా ఉండి శత్రువులెవరు ఆ నగరాన్ని సమీపించే పరిస్థితి లేనందువల్లే ఆ నగరానికి అయోధ్య అనే పేరు సార్థకమైంది. నగరం నాలుగు దిక్కులా దృఢమైన ద్వారాలుండేవి. లోపల ఎప్పుడూ రథ, అశ్వ, గజ బలాలు సంసిద్ధంగా ఉండేవి. వేల సంఖ్యలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు నిరంతరం తమ తమ ధర్మాలను నిర్వర్తిస్తూ ఉండేవారు.

### అందరూ ఇంద్రియ నిగ్రహం గలవారే..

అయోధ్యానగర ప్రజలంతా ఇంద్రియ నిగ్రహం కలవారు, ఎంతో ఉత్సాహవంతులు. అందుకే అయోధ్యానగర ప్రజలు అందరు ఎంతోగొప్పగా చెప్పుకొంటుండేవారు. ఆ నగరం లోపల వివిధ ఆకారాలు గల రాజభవనాలు, మందిరాలు ముచ్చటగా ఉండి నగర శోభను ఇనుమడింపచేస్తుండేవి. అక్కడ నిరంతరం అసంఖ్యాక విద్వాంసులు కనిపిస్తుండేవారు. సమస్త సంపదలకు, అంతులేని సుఖ సంతోషాలకు నిలయంగా అయోధ్యా నగరం భాసిల్లుతూ ఉండేది. అంతటి గొప్ప రాజధాని నగరం ఉన్న దేశమే కోసల దేశం. ఆ ఒక్క నగరమే అలా ఉంటే ఇక ఆ దేశ పరిస్థితి దానికంటే ఇంకా ఎన్నో రెట్లు గొప్పగా ఉండేది. ఆ దేశమంతటా అశ్వమేథాది మహాయజ్ఞాలు మొదటి నుంచే జరగటం పరిపాటి. అక్కడ తరతరాలుగా ప్రజలకు ఆయువు, ఆరోగ్యం, భాగ్యాలకు కొదవలేదు, ఒక్కమాటలో చెప్పాలంటే అదొక దివ్యభూమి. ఆ దేశంలో ప్రజలలో భక్తిప్రపత్తులను పెంపొందించేందుకు అధిక సంఖ్యలో చక్కటి దేవాలయాలుండేవి. బాటసారులకు దాహం తీరుస్తూ, వారికి హాయినిచ్చే చలివేంద్రాలు ఎన్నెన్నో ఉండేవి. ఆ దేశంలోని చెరువులు ప్రజల స్నానాది అవసరాలను తీర్చుతూ ప్రకృతిసిద్ధమైన సహజసౌందర్యంతో అలరారుతుండేవి. కోసల దేశంలోని స్త్రీలు, పురుషులు



అయోధ్య నగరం

నిరంతరం సుఖసంతోషాలతో హాయిగా ఉండేవారు. ధర్మనిర్ణయ సభలతోనూ, సమాజానికి సంబంధించిన ఉత్సవాలతోనూ కోసల దేశం ప్రతిరోజు కళకళలాడుతుండేది. పచ్చని పంటచేలు, పశుసంపద వర్ధిల్లుతుండేది. హింస కానీ, మద్యమాంసాల వినియోగం కానీ కోసల దేశంలో లేనేలేదు. రఘువంశ రాజులేలిన కోసల దేశంలోని ప్రజలు వర్షాల మీద మాత్రమే ఆధారపడి వ్యవసాయం చేసేవారు కాదు. నదీజల సౌకర్యాలను వినియోగించుకుంటూ వ్యవసాయాన్ని చక్కగా వృద్ధి చేసుకుంటూ దేశాన్ని రమణీయంగా సస్యశ్యామలంగా ఉంచుతుండేవారు.

### మచ్చుకైనా లేరు పాపులు...

పెద్దపులులులాంటి క్రూరజంతువుల బాధలు, అగ్నిభయం, చోరభయం ఉండేవే కావు. పాడిపంటలతోనే కాక సహజవనరులు, ఖనిజపంపదలతో విలసిల్లుతుండేది కోసల దేశం. అక్కడ పాపపు పనులు చేసేవారు మచ్చుకు కూడా ఎక్కడ ఉండేవారు కాదు. వ్యవసాయం, పశుపాలన, వాణిజ్యం తదితర వృత్తుల్లో జీవించేవారు. సుఖశాంతులతో ఉంటూ క్రయవిక్రయాది వ్యాపారాలను వృద్ధి చేస్తుండేవారు. అలాంటి ఉత్తమ కోసల దేశం, ఆ దేశ రాజధాని అయిన అయోధ్యానగరం అన్నీ బాగానే ఉన్నాయి కదా అని భరతుడిని శ్రీరాముడు అడిగాడు. రాముడు చెప్పిన ఈ విషయాలలో ఆనాటి ప్రజల నాగరికతా విశేషాలు, నగర నిర్మాణ చాతుర్యాలు, కేవలం వర్షాధారిత పంటలేకాక, నదీజలాలను సద్వినియోగం చేసుకొనే నీటిపారుదల సౌకర్యాలు ఎన్నెన్నో గొప్పగొప్పగా ఉండేవని అవగతమవుతుంది. ధర్మబద్ధమైన పాలనతో ప్రభువులు, అంతే ధర్మబద్ధమైన జీవన విధానాలతో ప్రజలు ఆనాడు నడుచుకున్నారు. ఇంతటి గొప్పతనం మన భారతావనిలో కొన్ని యుగాల ముందే విలసిల్లిందంటే అది కచ్చితంగా ఈ దేశ ఔన్నత్యానికి, ప్రతిష్టకు గీటురాయిలాంటిదే. ఇలాంటి విషయాలను నేటి తరం తెలుసుకొన్నప్పుడు ఈ దేశం మీద ప్రేమ, భక్తి పెరిగితీరుతాయి. అందుకే నేటి యువతరం రామాయణాన్ని చదవాలని, మన దేశం గొప్పతనం తెలుసుకోవాలని పెద్దలు చెబుతున్నారు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# ఘనంగా పాదుకా పట్టాభిషేకం

**హనుమాన్‌జంక్షన్ , కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** బాపులపాడు మండలం అంపాపురంలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా పాదుకా పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తూ ఉత్సవ వేదిక వద్దకు తీసుకువచ్చి, చినజీయరుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుముందు తీర్థగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా రామాయణ పారాయణం సాగించి, రాములవారి పాదుకలకు పట్టాభిషేకం జరిపారు. ఇదే సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. మాచినేని కోటేశ్వరరావు, భవానీ దంపతులు, సర్పంచి కాకాని సంజయ్, మాజీ సర్పంచి కడియాల రమేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు, అన్నే శ్రీనివాసరావు, కల్యాణ్, అల్లంశెట్టి శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



రామాయణ పారాయణం చేస్తున్న చినజీయరుస్వామి

ఆంధ్రావని

## నిమ్మకాయవాటం

**చే**తిలో సులువుగా ఇమిడేది, అనుకూలంగా ఉండేది, ఇబ్బంది పెట్టనిది అనేలాంటి అర్థాలలో ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది. నిమ్మకాయ చేతిలో సులభంగా ఇముడుతుంది. చేతిలో పెట్టుకోని గుప్పిట మూసేందుకు వీలుగా తగిన పరిమాణంలో ఉంటుంది. నిమ్మకాయను అలా ఒక చోటు నుంచి

జాతీయాలు నుడికారాలు

మరొక చోటుకు తీసుకువెళ్లటం ఎంతో సులువుగా ఉంటుంది. ఇంత సులభంగా చెయ్యటానికి ఏ పనైనా కనిపిస్తునప్పుడు ఆ పనిని ఈ జాతీయంతో సూచిస్తుంటారు.



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

## భద్రకాళీ.. నమోస్తుతే!

**వరంగల్, న్యూస్‌టుడే:** నగరంలోని భద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం భద్రకాళి అమ్మవారికి లక్ష పువ్వులతో పుష్పార్చన చేశారు. అర్చకులు పార్నంది నర్సింహామూర్తి, తాతాభట్ల నర్సింహామూర్తి, గుదిమెళ్ల విజయకుమారాచార్యులు, టక్కర్సు సత్యం, రామకృష్ణ మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి పసుపు గులాబీలు, తులసీ దళాలు నివేదించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కట్టా అంజనీదేవి గులాబీ పువ్వులు సమర్పించారు. భద్రకాళి తల్లిని చామంతి, తులసీ మాలతో అలకరించారు. గురువారం అమ్మవారికి కనకాంబరాలతో పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఈవో అంజనీదేవి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు టి.వీరన్న, టి.సునీల్ కుమార్, ఆర్. బలరామారావు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవమూర్తులు

## అప్పన్న స్వామికి సహస్రనామార్చన

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సహస్ర నామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది. పూజల్లో పాల్గొన్న భక్తులను పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఉదయం స్వామికి నిత్యకల్యాణోత్సవం, వింజామర సేవలు, తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి తిరు కల్యాణోత్సవాలకు సంబంధించి ఆలయవర్గాలు వైదిక పరమైన ఏర్పాట్లను చేపట్టారు.

## సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు



**శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనం అందించారు. వైకానస ఆగమ సలహాదారుడు సుందరవరదన్ శ్రీవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు.** – మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే

## గజ..హనుమంత వాహనాలపై రాముడి తేజసం

**తిరుపతి , న్యూస్‌టుడే:** శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై రాములవారు భక్తులకు అభయమిచ్చారు. ఉదయం వాహన సేవ అనంతరం కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం కన్నుల పండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, వివిధ రకాల పండ్ల రసాలతో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవర్లకు అభిషేకం చేశారు. సాయంత్రం వసంతోత్సవం, తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ఊంజల్ సేవను నిర్వహించారు. తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని 50 శ్రీరామ ఆలయాల నిర్వాహకులు రాముల వారికి వస్త్రాలు సమర్పించారు. రామచంద్ర పుష్కరిణి నుంచి తితిదే డీపీపీ ప్రత్యేక అధికారి రఘునాథ్, డిప్యూటీ ఈవో ఉమాపతిరెడ్డి వస్త్రాలను తిరుపతి నగరంలో మేళతాళాలు, భజనలు, కోలాటాలతో ప్రదర్శనగా శ్రీకోదండరామస్వామి ఆలయానికి చేరుకున్నారు.



హనుమంత వాహనంపై శ్రీకోదండరాముడు

# పాలకుడు తప్పక పాటించాల్సినవి...

సమాజంలో సామాన్య మానవుడు కావచ్చు లేదా ప్రజాపాలకుడు కావచ్చు ఎవరైనా సరే ఎవరు ఎవరితో ఎంతలో ఉండాలో అంతలో ఉండాలి. అలా ఉన్నప్పుడే అంతా ఆనందమయం, శాంతిమయంగా ఉంటుంది. ఈ విషయాలన్నీ తెలిసి ఆచరించినవాడు కనుకనే శ్రీరామచంద్రుడు ఈనాటికీ అందరికీ ఆదర్శ పురుషుడుగా ఉన్నాడు. రామాయణం అయోధ్యకాండ నూరో సర్గలో వనవాసం చేస్తున్న రాముడి దగ్గరకు భరతుడు వచ్చినప్పుడు రాముడు కుశల ప్రశ్నలు అడిగాడు. ఆ ప్రశ్నల్లోనే సమాజం మీద రాముడికి ఉన్న అవగాహన ఎంతటిదో స్పష్టమవుతుంది. అంతటి అవగాహన ఉన్న నాయకుడు కనుకనే రాముడు ఆనాడు భరతుడికే కాదూ ఈనాటి భారత పౌరులందరికీ ఆదర్శ గుణగణాలను నేర్పే ప్రత్యక్ష దైవస్వరూపుడైన గురువుగా కనిపిస్తున్నాడు. ప్రజా పాలకుడన్నవాడు ఎప్పుడూ ఉదయంపూట పది గంటలకో, పదకొండు గంటలకో నిద్రలేవటం మంచిది కాదు. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానాదికాలన్నీ ముగించుకొని చక్కగా అలంకరించుకొని రాజమార్గంలో ఓ మంచి ప్రదేశంలో ఉండి పౌరులందరికీ దర్శనం ఇవ్వాలి. అంతమాత్రం చేత మరీ అందరితోనూ కలిసిపోయి తన ఉనికిని పోగొట్టుకోకూడదు. ఎవరితో ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి. ఈ సూత్రాన్ని తన దగ్గర పనిచేసే ఉద్యోగుల విషయంలో కొంత గట్టిగానే అమలుచేయాలి. ఉద్యోగులందరూ జంకూగొంకు లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు పై అధికారి దగ్గరకు రావటం, లేదంటే అసలు భయపడిపోయి దగ్గరకే రాకుండా దూరంగా ఉండటం రెండూ మంచివి కావు. పాలనా వ్యవహారాల్లో పట్టూవిడుపులు అవసరం.



### శిక్షించే విషయంలో అప్రమత్తత అవసరం

మంచి ప్రజాపాలకుడిగా పేరు తెచ్చుకోవాలనుకున్నవాడు ధనధాన్యాలు, రక్షణ సంబంధమైన యంత్రాలు, వాటిని నిర్వహించే ఉద్యోగులు, యోధులులాంటివారందరినీ ఎప్పటికప్పుడు సరిచూసుకుంటుండాలి. ప్రభుత్వానికి సంబంధించిన ఆదాయ వ్యయాలు సమతూకంగా ఉండేలా చూడాలి. అనవసర విలాసాలకు అధిక వ్యయాన్ని చెయ్యకూడదు. కోశాగారంలోని ధనం దైవకార్యాలకు, తల్లిదండ్రుల సేవలకు, పండితులకు, అన్నదానాలకు, యోధులకు, మిత్రులకు తగిన విధంగా వినియోగిస్తుండాలి. పాలకుడు నేరారోపణల విషయంలో ఎంతో జాగ్రత్త వహించాలి. ముద్దాయిలను న్యాయశాస్త్ర నిపుణులచేత లోతుగా విచారణ జరిపించాలి. అంతేకానీ తొందరపడి శిక్షలు విధించకూడదు. నేరస్థులని నిర్ధరణ అయిన తర్వాత వారిని విడిచిపెట్టకూడదు. అయితే న్యాయశాస్త్ర నిపుణులైనవారు ధనలోభంతోకానీ, పక్షపాతబుద్ధితోకానీ నిర్దోషులను దోషులుగా నిర్ణయిస్తుంటే చూస్తూ ఊరుకోకూడదు. ఎందుకంటే నిర్దోషులు అవమాన భారంతో కన్నీరు కారుస్తారు. అలాంటి వారి ఉసురు ప్రజాపాలకుడి కుమారులకు, పశుసందలకు కొట్టి సమస్తాన్నీ నాశనం చేస్తుంది. వృద్ధులు, పిల్లలు, విద్యావంతులు వచ్చి కలిసినప్పుడు వారికి ఏదో ఒక వస్తువును బహుమానంగా ఇస్తుండాలి. మిత్రభావంతో ఊరట కలిగించే మంచిమంచి మాటలతో వారిని సంతృప్తి పరుస్తుండాలి. గురువులకు, వృద్ధులకు, తాపసులకు, దేవతలకు, అతిథులకు, దేవమందిరాలలో ఉన్న మహావృక్షాలకు, పండితులకు నమస్కరిస్తుండాలి. అలాగే దినచర్యలో పూర్వాహ్ణ సమయంలో ధర్మకార్యాలను చేస్తుండాలి. అపరాహ్ణ సమయంలో అర్థార్జనకు సంబంధించిన కార్యాలను నిర్వర్తిస్తుండాలి. అంతే కానీ దీనికి భిన్నంగా వ్యవహరించటం కానీ, అసలు ధర్మార్థ కార్యాలను మానేసి కామంతో సుఖభోగాల మీదనే మనసును నిల్పటం కానీ చెయ్యకూడదు.

ధర్మపథం

### చేయకూడనివి ఇవే...

ప్రజా పాలకుడైనవాడు కచ్చితంగా ఓ పద్నాలుగు పనులను చెయ్యకూడదు. నాస్తికత్వం, అబద్ధం ఆడటం, క్రోధం, ఏమరుపాటు, కర్తవ్యాలను ఉపేక్షిస్తూ కాలయాపన చేయటం, జ్ఞానులను దర్శించకుండా ఉండటం, సోమరితనం, పంచేంద్రియాలకు వశుడై ఉండటం, రాజ్యకార్యాల విషయంలో మంత్రులతో చర్చించకుండా తానొక్కడే ఆలోచించడం, విషయం మీద అవగాహన లేనివారితో సమాలోచన చేయటం, నిశ్చయించిన పనులను వెంటనే ప్రారంభించకపోవటం, రహస్య విషయాలను దాచలేకపోవటం, మంగళకరాలైన ఆచారాలను పాటించకుండా ఉండటం, శత్రువులందరి మీదకు ఒకే సమయంలో దండెత్తటం అనే పనులను రాజు ఎప్పుడూ చేయకూడదు. ఈ రాజదోషాలను విడిచిపెట్టినవాడే సమర్థుడైన పాలకుడిగా మనగలుగుతాడు. ఇలా ఏ పనులను ఎంత వరకు చేయాలో, ఎవరిని ఎంతలో ఉంచాలో, ఎవరితో ఎలా ఉండాలో అలా ఉన్నప్పుడే ప్రజాపాలకుడు కావచ్చు లేదా సామాన్య పౌరుడేకావచ్చు జీవితాలలో విజయాన్ని సాధించటం వీలుపడుతుంది. ఈ జీవన మార్గదర్శక సూత్రాలు రాముడి నోటి వెంట రామాయణంలో మానవాళికి అందాయి.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# రాములోరి పెళ్లికి... కోటి తలంబ్రాలు

భద్రాచలం బయలుదేరిన భక్తబృందం



తలపై తలంబ్రాలు పెట్టుకుని రామనామస్మరణ చేస్తున్న మహిళలు

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** భద్రాచలం సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు సిద్ధమయ్యాయి. రాములోరి పెళ్లికి తలంబ్రాలను సమర్పించేందుకు భక్తబృందం భద్రాచలం బయలుదేరి వెళ్లింది. కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం నిర్వాహకులు కల్యాణం అప్పారావు నేతృత్వంలో ఈ మహత్తర కార్యక్రమం రూపుదిద్దుకుంది. భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి తూర్పు నుంచి తలంబ్రాలు తరలివెళ్లడం వరుసగా ఇది మూడోసారి. కోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు 75 రోజుల సమయం పట్టింది. ఇందుకు 1000 మంది భక్తులు పాల్గొన్నారు. ప్రధానంగా మహిళలే ప్రముఖ పాత్ర పోషించారు. తలంబ్రాల తయారీకి 300కేజీల ధాన్యం వాడారు. 10,000 గింజలు చొప్పున ఒక ప్యాకెట్ రూపంలో చేసి భక్తులకు అందజేశారు. జిల్లాలోని 8 మండలాల్లో 20గ్రామాలకు చెందిన రామభక్తులు తలంబ్రాలను తయారు చేశారు.

### 'ఒడ్లు ఒలుపు.. శ్రీరాముని పిలుపు'

భద్రాచలం రాములోరికి కోటి తలంబ్రాల తయారికి 'ఒడ్లు ఒలుపు... శ్రీరాముని పిలుపు' పేరుతో శ్రీకారంచుట్టారు. శ్రీరామ నామస్మరణతో ఒడ్లు గింజలను ఒలిచి తలంబ్రాలను తయారు చేశారు. పచ్చని పల్లెల్లో ఆధ్యాత్మిక చింతనతో గింజలను ఒలిచి రంగురంగులతో అలంకరించిన కలశాల్లో కోటి తలంబ్రాలు భద్రమై భద్రాచలం పయనమయ్యాయి.



## సింహవాహనంపై రామచంద్రుడు

**వసంత నవరాత్రుల్లో భాగంగా ఒంగోలు పోలీసు మైదానంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు.** – ఒంగోలు, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే

## వైభవంగా శ్రీవారి రథోత్సవం



**కొడంగల్, మహబూబ్‌నగర్ జిల్లా, న్యూస్‌టుడే:** వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి రథంపై ఊరేగింపుగా వెళ్తూ జాతర స్థలంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల చివరి రోజు కావడంతో ఉదయం స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

## కనకదుర్గకు కనకాంబరాలతో అర్చన

**విజయవాడ, న్యూస్‌టుడే:** చైత్రమాస వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు కనకాంబర పుష్పాలతో అభిషేకం జరిగింది. లలితా సహస్రనామాలతో అమ్మవారికి అర్చన చేసిన రుత్వికులు కనకాంబరాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ రెండుగంటల పాటు సాగిన అభిషేకాన్ని భక్తులతో పాటు ఉభయదాతలు తిలకించారు. అర్చన అనంతరం అమ్మవారికి హారతి సమర్పణతో పుష్పార్చన ముగిసింది. కార్యక్రమంలో దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మోకాలిలో మెడనరం పట్టు...

జాతీయాలు నుడికారాలు

విచారాన్ని నటించటం, మోసంతో మాయ చేయాలని చూడటం అనేలాంటి అర్థాల్లో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. మెడ ప్రాంతంలో మెడనరం పట్టిదంటే అర్థం ఉంది. అలా కాకుండా ఎందుకలా విచారంగా, బాధగా ఉన్నావు అనంటే మోకాలిని చూపించి మోకాలిలో మెడనరం పట్టింది అందుకే బాధగా ఉందని ఎవరైనా చెబితే అది కచ్చితంగా బాధను నటించటమే అవుతుంది. అలా మోసంగా, మాయగా ఎవరైనా మాటలు చెబుతున్నప్పుడు ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తుంది.

ఆంధ్రావని

# పులకించిన బంటుమిల్లి



పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు

**బంటుమిల్లి, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** బంటుమిల్లిలో ప్రతిష్ఠించనున్న వెంకటేశ్వరస్వామి, అమ్మవారి విగ్రహాలను గురువారం సాయంత్రం బంటుమిల్లి పురవీధుల్లో ఊరేగించారు. వందలాది భక్తులు ప్రదర్శనలో పాల్గొన్నారు. వెంకటేశ్వర స్వామి, గోదాదేవి, పద్మావతి అమ్మవార్ల వేషాలు దరించిన పిల్లలు ప్రదర్శనలో అకట్టుకున్నారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన నిత్యానంద స్వామి గురువారం మధ్యాహ్నం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కాంతి కేంద్ర వ్యవస్థాపకులు వెంకటచలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# రాముడికే నాస్తికవాదం వినిపించిన ముని!

రామాయణ కాలంనాడు కూడా నాస్తిక ధోరణిలో కొందరుండేవారు. దేవుడు లేడు. ఏమీలేదు. పిండ ప్రదానాలులాంటవన్నీ అర్థరహితాలని వాదించే వారుండేవారు. అలాంటి నాస్తికవాదంతో జాబాలి అనే పండితుడు నేరుగా శ్రీరామచంద్రుడి మనసునే మారుద్దామనుకున్నాడు. అయితే సత్యస్వరూపుడు, సత్యం కోసమే నిలబడినవాడు అయిన శ్రీరామచంద్రుడు నాస్తిక వాదాన్ని ఓడించి తన సత్యనిష్ఠను ప్రతిష్ఠించాడు. దీనికి సంబంధించిన కథాసందర్భం రామాయణం అయోధ్యకాండ నూట ఎనిమిదో సర్గలో కనిపిస్తుంది. వనవాసం చేస్తున్న శ్రీరామచంద్రుడి దగ్గరకు భరతుడితోపాటు ఇతర రుషులు, మునులు చాలామంది వచ్చారు. అందులో జాబాలి అనే పండితుడు కూడా ఒకడున్నాడు. జాబాలి శ్రీరామచంద్రుడిని అయోధ్యకు రమ్మని, రాజ్యాన్ని ఏలమని సూచించాడు. అప్పుడెప్పుడో తండ్రి చెప్పిన మాటనే విని సుఖాలను వదులుకోవటం మంచిది కాదన్నాడు. రాముడిలాంటి ప్రజ్ఞాశాలి, మనోబలసంపన్నుడు ఒక అజ్ఞానిలాగా నిరర్థకమైన ఆలోచనలను మనసులోకి రానీయకూడదన్నాడు. ఆయన ఇంకా ఇలా వివరించాడు.



### జీవనమంటే సత్రంలో బస

'ఈ లోకంలో ఎవరు ఎవరికి బంధువులు? ఎవరివల్ల ఎవరికి లాభం? ఏ ప్రాణి అయినా ఒంటరిగానే పుడుతుంది. ఒంటరిగానే మరణిస్తుంది. ఇతడు నా తండ్రి, ఈమె నా తల్లి అని మమకారాలను పెట్టుకొనేవారిని పిచ్చివారుగా భావించాలి. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఎవరూ ఎవరికీ ఏమీ కారు. ఈ లోకంలో పుట్టి జీవనం సాగించటం ఎలాంటిదంటే ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేటప్పుడు మధ్యలో ఏదైనా ఓ సత్రంలో ఓ రాత్రి బసచేయటం లాంటిది. ఆ రాత్రి తెల్లవారిన తర్వాత ఆ బాటసారి సత్రాన్ని విడిచి ముందుకు పోతుంటాడు. అలాగే

ధర్మపథం

తల్లిదండ్రులు, ఇల్లు, సంపదలు అనే వాటితో ఉండే సంబంధాలన్నీ క్షణికాలే. అందుకే సజ్జనులు వాటి మీద ఆసక్తిని పెంచుకోకూడదు. ఈ అరణ్యవాస జీవితం ఎంతో కష్టంతో కూడుకున్నది. అక్కడ అయోధ్య నీ కోసం సకల సంపదలతో తులతూగుతూ ఎదురు చూస్తోంది. అక్కడికి వెళ్లి దేవేంద్ర భోగాలను హాయిగా అనుభవించు. దశరథుడు నీకు ఏమీ కాడు. నీవు కూడా ఆయనకు ఏమీ కావు. ప్రాణి పుట్టుక అనేది స్త్రీగర్భంలో శుక్రశోణితాల కలయిక వల్ల జరుగుతుంది. దశరథ మహారాజు తాను చేరాల్సిన చోటికే చేరాడు. ఆయనకు ప్రాప్తించిన మరణం సమస్త ప్రాణులకు సహజం. ఆ విషయాన్ని గమనించక నీవు బాధపడుతున్నావు. అందుబాటులో ఉన్న సుఖభోగాలను అనుభవించక కేవలం ధర్మాచరణలోనూ, ధనార్జనలోనూ మునిగి ఉండేవారిని చూస్తుంటే జాలి కలుగుతుంటుంది.

ధర్మాచరణ పేరుతో బతికి ఉన్నంతకాలం దుఃఖాలను అనుభవించి చివరకు మట్టిపాలు కావటం తప్ప మరొకటి ఏమీ ఉండదు.

### హేతుబద్ధంగా తిరస్కరించిన శ్రీరాముడు

ఈ లోకంలో అష్టకా శ్రాద్ధాలను, ఆబ్దిక శ్రాద్ధాలను పెడుతుంటారు. శ్రాద్ధం పెట్టేటప్పుడు శ్రాద్ధాన్నం పితృదేవతలకు చెందుతుందని చెబుతుంటారు. కానీ బాగా ఆలోచించి చూస్తే ఆ శ్రాద్ధాన్నం ఇక్కడే నశించిపోవటం కనిపిస్తుంటుంది. అలాంటి అన్నాన్ని మృతులైనవారు, పితృదేవతలు ఎలా తింటారు? శ్రాద్ధ సమయంలో భోక్తలు తిన్న అన్నం పితృదేవతల శరీరానికి చేరుతుందంటారు. అలా అయితే దూరదేశానికి వెళ్లిన వారి కోసం ఇంటిదగ్గర ఉన్నవారు కానీ, మరొకరు కానీ అన్నం తింటే వారికి ఆకలి తీరటం లేదు కదా? దేవతలను ఆరాధించండి అని, దానాలు చెయ్యండి అని దీక్షతో యజ్ఞాలను నిర్వహించండి అని, తపస్సులు చేయండి అని ఎన్నెన్నో గ్రంథాలు చెబుతున్నాయి. ఇదంతా చూస్తే ఇతరుల సంపదలను అపహరించటంలో ఆరితేరిన వారు దానధర్మాలవైపు ప్రజల మనస్సును మారుస్తున్నారేమో అని అనిపిస్తుంది. ఈ లోకంలోని సుఖాలే వాస్తవాలు. పరలోకం అనేది లేనేలేదు. ఈ విషయాన్ని కొందరు గట్టిగా చెబుతున్నారు కూడా. కనుక తండ్రి మాట కోసం రాజ్యాన్ని స్వీకరించను అని అనటం పద్ధతిగా లేదు అని జాబాలి రాముడితో నాస్తిక వాదాన్ని వినిపించాడు. ఇదంతా చూస్తే రామాయణ కాలంలో కూడా నాస్తికవాదులు కొందరున్నారని అవగతమవుతుంది. అయితే ఆ నాస్తికవాదాన్ని ఆ తర్వాత శ్రీరామచంద్రుడు అంతే హేతుబద్ధంగా తిరస్కరించి ఆస్తిక వాదాన్ని సత్యధర్మ ఆచరణ విశిష్టతను వివరించి చెప్పాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## నూలిగాయ

జాతీయాలు నుడికారాలు

దిష్టి తగలకుండా ఉండేందుకు కట్టుకొనే పూస అని అర్థం. దిష్టిపిడత, దిష్టిబొమ్మ, దిష్టితాడు లాంటివన్నీ దీనికి సమానార్థకాలే. దిష్టిదోషం తగలకుండా ఉండేందుకు ఉపయోగించే నూలిగాయ కానీ, ఇతర వస్తువులుకానీ అందంగా కాక అందవికారంగా ఉంటుంటాయి. అలా అందవికారంగా ఎవరైనా కనిపిస్తున్నప్పుడు వారిని ఈ జాతీయంతో సూచించడం గమనార్హం.



హంస వాహనంపై విహరిస్తున్న స్వామి వారు

# భక్తజన సందోహం

## హంసవాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

**కరీంనగర్, న్యూస్‌టుడే :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రుల సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారు హంస వాహనంపై విహరించారు. నవరాత్రులు వివిధ రూపాలలో ఉన్న వాహనాలపై ఊరేగింపు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ మిగితా వాహనాలు లేకపోవడంతో మళ్లీ అవే వాహనాలను వినియోగిస్తున్నారు. ఆలయంలో స్వామివారికి ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజను వైభవంగా నిర్వహించారు. శ్రీసీతారామచంద్రస్వామివారలకు పంచోపనిషత్తుద్వారా అభిషేకం నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో అష్టావధాని తిగుళ్ల శ్రీహరిశర్మచే పురాణ ప్రవచనం గావించారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామివారలకు అర్చకులు సదస్య పూజ నిర్వహించారు.

# సహస్ర దీపాలంకరణ ఉత్సవం



సహస్ర దీపాలంకరణతో వెలుగొందుతున్న శ్రీవారు

**మంగళగిరి (గుంటూరు జిల్లా), న్యూస్‌టుడే:** మంగళగిరి పట్టణంలోని లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తులను ఆస్థాన ముఖ మండపంలో ఊయలపై ఉంచారు. వివిధ రకాల పూలతో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని అలంకరించారు. కైంకర్యపరులు రూ.3516 చెల్లించి ముందుకు వచ్చి సహస్ర దీపాలంకరణ ఉత్సవాన్ని నిర్వహించారు. దీపకాంతులలో శ్రీవారి ఉత్సవమూర్తులు దేదీప్యమానంగా వెలుగొందాయి. ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

ఆంధ్రావని



పల్లకీలో ఉత్సవమూర్తులు

# కమనీయం.. రథోత్సవం

**కర్నూలు, న్యూస్‌టుడే:** జయజయ ధ్వానాలు.. మంగళ వాయిద్యాలు.. వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య వీరభద్రుడి రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఆస్పరి మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కైరుప్పలలో కొలువైన వీరభద్రుడి బ్రహోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథాన్ని భక్తులు భక్తితో లాగి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. ఉదయం ఆలయంలో స్వామివారి మూల విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ముస్తాబు చేసిన రథంపై వీరభద్రస్వామి, భద్రకాళీ దేవతామూర్తులను ఉంచి ప్రదర్శన నిర్వహించారు. రథశాల నుంచి బసవన్న స్వామి గుడి వరకు రథాన్ని లాగారు. ఈ ఉత్సవానికి కర్ణాటకాంధ్ర ప్రాంతం నుంచి వేల మంది భక్తులు తరలి వచ్చారు. రథానికి అట్టేకల్లు గ్రామానికి చెందిన రంగస్వామి కుటుంబం రూ. 35 వేల రుద్రాక్షల మాలను వేసి అలంకరించారు. ఈ రుద్రక్షమాల రథానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సైలు లక్ష్మీనారాయణ, కిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పుస్తకం మంచి మిత్రుడితో సమానం

## నంది అవార్డు గ్రహీత సిధారెడ్డి

**మెదక్, న్యూస్‌టుడే:** పుస్తకం మంచి మిత్రుడితో సమానమని నంది అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి అన్నారు. సిద్దిపేటకు చెందిన ఎన్ఆర్ఐ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో ఇతర పుస్తకాలు చదవాలని సూచించారు. విజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసం, మంచి లక్షణాలను అలవర్చి ఉన్నత స్థాయికెదిగేందుకు పుస్తకాలు ఉపకరిస్తాయన్నారు. ఇన్నాళ్లూ పాలకులు తెలంగాణ చరిత్ర పుస్తకాల్లో లేకుండా చేశారని ఆరోపించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా ఈ ప్రాంత ఎన్ఆర్ఐలు సంస్కృతి వికాసానికి 'జంబి' పేరిట త్రైమాసిక పత్రిక, వెబ్‌సైట్‌ను ప్రారంభించారని తెలిపారు. హైదరాబాద్‌ను తాను అభివృద్ధి చేశానంటూ ఓ నాయకుడంటున్నారని ఆయన చేసింది కేవలం హైదరాబాద్ విచ్ఛిన్నం అని ఆరోపించారు. నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరముందన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా సంస్కృతిని అందరికితెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నామని ఎన్ఆర్ఐలు రవీంద్రారెడ్డి, అనిల్, వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాలకు రూ.10వేల విలువైన కథలు, కవితలు ఉన్న విద్యార్థులకవసరమైన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్రీలత, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రావు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిధారెడ్డి

# కల్యాణ క్రతువుకు అంకురార్పణ

**భద్రాచలం, న్యూస్‌టుడే:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైభవంగా ఆరంభమయ్యాయి. పవిత్ర గోదావరి నది నుంచి మంగళవాయిద్యాల నడుమ తీర్థబిందెను తీసుకొచ్చి మూలవిరాట్ ఉత్సవ అనుజ్ఞతో క్రతువును కనుల పండువలా నిర్వహించారు. శ్రీరామ నవమి 8న జరగనున్న నేపథ్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, నవ కలశ స్నపనం, భగవత్ ప్రార్థన చేశారు. కల్యాణ క్రతువులో పాల్గొనే వారికి దీక్షా వస్త్రాలను అందించారు. పుట్టమన్ను తెచ్చి పాలికలో పోసి అంకురార్పణ చేశారు. ఇదే ఈ వేడుకలో ప్రధానమైంది. పుట్టమన్ను తెచ్చేటప్పుడు ఆధ్యాత్మికత సంతరించుకుంది. జైశ్రీరాం నినాదాలు మిన్నంటాయి. అంకురార్పణ హోమం, వాస్తు హోమం చేశారు.

**గోటి తలంబ్రాల అందజేత:** తూ.గో. జిల్లా కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం నిర్వాహకులు కల్యాణ అప్పారావు ఆధ్వర్యంలో రెండు నెలల పాటు శ్రీరామ జపయజ్ఞం చేసి గోటితో కోటిన్నర తలంబ్రాలను తయారు చేశారు. ఎనిమిది మండలాల్లోని 30గ్రామాలకు చెందిన 300మంది గోటితో ఒలిచి సంప్రదాయబద్ధంగా వీటిని తెచ్చారు. కలశాలను తలపై పెట్టుకుని శోభాయాత్రగా ఆలయ ప్రదక్షిణ చేశారు. దర్శనం అనంతరం స్వామి వారి కల్యాణానికి గోటితో వొలిచిన కోటి తలంబ్రాలను, కూరగాయలను సమర్పించారు.




గోటి తలంబ్రాలతో శోభాయాత్ర చేస్తున్న దృశ్యం

**పాదయాత్రగా వస్తూ... తలంబ్రాలు తెస్తూ:** ప.గో.జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి ముళ్లపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో 1000 మంది భక్త బృందం పాదయాత్ర చేపట్టింది. 20లక్షల గోటి తలంబ్రాలతో 120కి.మీ. నడిచి వీరు 7న ఇక్కడకు చేరుకుంటారు. ఇలా పాదయాత్రగా తలంబ్రాలను తేవడం ఇది 13వ సారి అని నిర్వాహకులు తెలిపారు.

# కలియుగంలో పాపనాశిని రామనామమే!

మనకున్న నాలుగు యుగాలలో కృతయుగంలో ధ్యానంవల్ల, త్రేతాయుగంలో యజ్ఞాలవల్ల, ద్వాపరంలో ఆరాధనతోనూ, కలియుగంలో భగవన్నామస్మరణతోనూ పాపాలను పోగొట్టుకోవచ్చని పురాణాలన్నీ వివరించి చెబుతున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న కలియుగంలో రామనామ స్మరణ చేయడంవల్ల విశేష ఫలితాన్ని పొందవచ్చని పెద్దలందరూ వివరించి చెబుతున్నారు. రామనామానికి ఎందుకంత విశిష్టత చేకూరిందని చెప్పటానికి అనేకానేక ఉదాహరణలున్నాయి. అలాంటి వాటిలో మొదటి ఉదాహరణ రెండు పవిత్ర మంత్రాలలోని రెండు బీజాక్షరాల కలయిక అని చెప్పేదే. ఓంనమోనారాయణాయ అనేది అష్టాక్షరీ మంత్రం. నమశ్శివాయ అనేది పంచాక్షరీ మంత్రం. అష్టాక్షరిలోని 'రా' పంచాక్షరిలోని 'మ' పక్కపక్కన చేరి 'రామ' అనే అమృత నామంగా అయింది. రెండు గొప్పగొప్ప మంత్రాలను ఏకకాలంలో జపించినంతటి పుణ్యఫలం రామనామ జపానికి ఈ కారణంచేతనే కలుగుతుంది. 'రామ' శబ్దాన్ని విడిగా చూస్తే ర+ఆ+మ అనే మూడు బీజాక్షరాల కలయికగా కనిపిస్తుంది. ఇందులో 'ర' అగ్నిబీజాక్షరం, 'ఆ' సూర్యబీజాక్షరం, 'మ' చంద్రబీజాక్షరం. అగ్ని బీజాక్షరమైన 'ర' కర్మలను నశింపచేసి మోక్షాన్ని ఇస్తుంది. సూర్య బీజాక్షరమైన 'ఆ' మోహాంధకారాలను పోగొడుతుంది. చంద్రబీజాక్షరమైన 'మ' తాపత్రయాలను హరిస్తుంది. రామనామశక్తి ఇంత గొప్పది. అలాగే ర, ఆ, మ మూడు త్రిమూర్తులకు ప్రతీకలు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే ఆ త్రిమూర్తులు. అలా చూస్తే రామనామ జపం సృష్టి, స్థితి, లయ కారకులు ముగ్గురి కృపను పొందటానికి వీలుకలిగిస్తుంది.

### జీవాత్మ, పరమాత్మల ఐక్యానికి ప్రతీక

'రామ' అనే రెండక్షరాలు జీవాత్మకు, పరమాత్మకు కూడా ప్రతీకలని, జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని ప్రకటించే శక్తి రామనామానికి అందుకే ఉదంటారు పెద్దలు. 'రామ' నామాన్ని జపించేటప్పుడు 'రా' అనే పలికే సమయంలో అప్పటిదాకా దేహంలో ఉన్న పాపాలన్నీ బయటకుపోతాయి. 'మ' అని అన్నప్పుడు నోరు మూతపడి ఇక పాపాలేనీ లోపలకు పాకుండా ఉంటాయి. ఇలా ఎన్నెన్నో ఉదాహరణలు రామనామస్మరణ విషయంలో లోకంలో బహుళ ప్రచారంలో ఉన్నాయి. రామనామంతోపాటు శ్రీరామజయరామ జయజయరామ అనే మరో అద్భుమైన దివ్యమంత్రం ఉంది. ఈ మంత్రంలోని శ్రీరామ అనేది శ్రీరాముడిని ఆవాహన చేసేందుకు, జయరామ అనేది రాముడిని స్తుతించేందుకు, జయజయరామ అనేది రాముడి విషయంలో సంపూర్ణ సమర్పణ భావాన్ని ప్రకటించేందుకు ఉపకరిస్తాయి. ఓ రామా నేను నిన్ను స్తుతిస్తున్నాను. నీ శరణు కోరుతున్నాను. నన్ను కరుణించు అనే అర్థాన్ని శ్రీరామ జయరామ జయజయరామ ప్రతిపాదిస్తుంది. తనను శరణన్న వారిని శీఘ్రంగా ఆదుకోవటం ఆ రామ ప్రభువు తొలి కర్తవ్యంగా భావిస్తాడు. అందుకే ఈ మంత్ర జపం చేసిన ఎందరెందరో మహనీయులకు రామదర్శనం కలిగిందని లోకంలో ఎందరో మహానుభావుల చరిత్రలు వివరిస్తున్నాయి. శ్రీరామ జయరామ జయజయరామ అనే మంత్రం ఆవిర్భావం గురించి ఓ ప్రధాన ఇతివృత్తం రామభక్తులు ఉన్నచోట వినిపిస్తుంటుంది. రావణ వధానంతరం రాముడు అయోధ్యను రాజధానిగా చేసుకొని రాజ్యమేలుతున్న రోజులవి. కష్టాలను పోగొట్టేందుకు తగిన మంత్రాన్ని ఆవిర్భవింపచేసే దిశగా ఆలోచించసాగాడు. అప్పుడాయనకు ఓ ఆలోచన తట్టింది. ఓ రోజున శ్రీరామచంద్రుడు నిండుకొలువు తీరి ఉన్నాడు. ఆ కొలువులో శ్రీరాముడి గురువు విశ్వామిత్రుడు రాముడి బంటు హనుమంతుడు కూడా ఉన్నాడు. నారదుడు కొలువు ప్రారంభానికి ముందుగా హనుమ దగ్గరకు వెళ్లి కొలువు ప్రారంభంలో అందరికీ నమస్కరించే సమయంలో ఒక్క విశ్వామిత్రుడికి తప్ప అందరికీ నమస్కరించమని చెప్పాడు. దేవర్షి చెబుతున్నాడు కదాని హనుమ అలాగే చేశాడు. ఆ తర్వాత నారదుడు విశ్వామిత్రుడి దగ్గరకు వెళ్లి అందరినీ గౌరవించిన హనుమ నిన్ను గౌరవించలేదు కనుక రాముడికి చెప్పి శిక్షపడేలా చేయమని అన్నాడు. విశ్వామిత్రుడు నారదుడి మాయమాటల్లో పడి రాముడికి హనుమ ప్రవర్తన బాగాలేదని మరుసటి రోజు సాయంత్రంలోపల మరణదండన విధించమని అన్నాడు.





### అలా ఆవిర్భవించిందీ మంత్రం

రాముడు ఆలోచనలో పడ్డాడు. ఆజ్ఞాపిస్తున్నది తన గురువు. తాను దండించాల్సింది తన భక్తుడిని. ఎలా అని అనుకొంటూ ఆ రోజుకు సభ చాలించాడు. హనుమ సభ ముగియగానే నారదుడి దగ్గరకొచ్చి ఆ సంకటస్థితి నుంచి బయటపడేలా చేయమన్నాడు. అప్పుడు నారదుడు మరుసటి రోజు సూర్యోదయం కంటే ముందు లేచి సరయూ నదిలో స్నానం చేసి శ్రీరామ జయరామ జయజయరామ అనే మంత్రాన్ని జపించు, అన్ని కష్టాలు అవే తొలగిపోతాయి అని చెప్పాడు. హనుమ అలాగే చేశాడు. మరునాడు గురువు ఆజ్ఞ పాటించేందుకు రాముడు సంసిద్ధుడై హనుమ మీదకు ఎన్నెన్నో బాణాలను సంధించాడు. నిరంతరం శ్రీరామ జయరామ జయజయరామ అని నామజపం చేస్తున్న హనుమను ఆ బాణాలేవీ తాకలేకపోయాయి. వెంటనే నారదుడు విశ్వామిత్రుడి దగ్గరకు వెళ్లి తాను భగవంతుడికన్నా భగవన్నామమే గొప్పదని నిరూపించేందుకు, మానవాళికి పుణ్యాన్ని ప్రసాదించే మహామంత్రాన్ని ఆవిర్భవింపచేసేందుకు తానే అలా ఓ చిన్న నాటకాన్ని ఆడానని చెప్పాడు. వెంటనే రాముడి దగ్గరకు వెళ్లి హనుమ మీదకు బాణాలను సంధించవద్దని చెప్పమని కోరాడు. విశ్వామిత్రుడు అలానే చేశాడు. పరిస్థితంతా ప్రశాంతమైంది. రాముడు, విశ్వామిత్రుడు తదితరులంతా హనుమను ఆశీర్వదించారు. అలా శ్రీరామజయరామ జయజయరామ అనే గొప్ప మంత్రం ఆవిర్భవించిందని పెద్దలు, రామతత్త్వ ప్రచారకులు, రామ ఉపాసకులు వివరిస్తున్నారు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## కొరకరానికొయ్య

పనికిరానిది, మాటవిననివాడు అనేలాంటి అర్థాల్లో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. కొరికి తినగలిగింది అయితే దాన్ని చక్కగా ఆస్వాదించి ఆనందించటానికి అవకాశముంటుంది. అలా కాకుండా కొరకటానికి, కొరికి తినటానికి పనికిరాని ఓ కొయ్య ముక్కను ఇచ్చి ఎవరినైనా తినమంటే అది సాధ్యపడకపోగా దానివల్ల ఎలాంటి ప్రయోజనమూ సమకూరదు. ఇలాగే సమాజంలో కొంతమంది మనుషులుంటారు. వారిని ఎన్ని రకాలుగా అడిగినా పనిచేసిపెట్టరు. వారు సమీపంలో ఉన్నారన్నమాటేకానీ ఏ ఉపయోగమూ వారివల్ల సమకూరదు. ఇలాంటి వారిని గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.



నెమలి వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారలు

## వైభవంగా మహాభిషేకం

**కరీంనగర్, న్యూస్‌టుడే :** శ్రీరాజరాజేశ్వరక్షేత్రంలో వసంత నవరాత్రుల సందర్భంగా సీతారాములకు అయిదుగురు రుత్వికులచే మహాభిషేకం పూజను నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపం ఎదురుగా హోమం ఘనంగా చేశారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేక పూజను 11మంది రుత్రికులు ఘనంగా నిర్వహించారు. త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తోత్సవం, హవనం, హోమాలు నిర్వహించారు. రామాలయంలో సదస్యం నిర్వహించారు. రాత్రి వేళల్లో పెద్ద సేవలో భాగంగా నెమలివాహనంపై అనంతపద్మనాభస్వామిని, శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి వారలను అందంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. నెమలివాహనంపై స్వామివారలను పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులు పట్టి స్వామివారిని దర్శించుకుని తరించారు. ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది.

## దాసుని భక్తికి పరవశించిన శ్రీరాముడు

**తిరుపతి, న్యూస్‌టుడే:** పట్టాభిరామాలయ సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా.. రెండో రోజైన ఆదివారం హనుమంత వాహన సేవ వైభవంగా జరిగింది. రాత్రి ప్రియభక్తుడైన హనుమంతుని భుజ స్కందాలు అధిరోహించిన స్వామి వాల్మీకిక్షేత్రంలోని మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా భక్తులు పిండి దీపాలతో స్వామివారికి స్వాగతం పలికారు. అంతకు మునుపు ఉదయం సుప్రభాత సేవతో పూజాధికాలు ప్రారంభమయ్యాయి. తదుపరి స్వామివారికి తోమాల సేవ, పంచాంగశ్రవణం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. తదుపరి ముత్యపు పందిరి వాహనాన్ని అధిరోహించిన సీతారాములు వాల్మీకిక్షేత్రంలోని మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అలరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ఊంజల్ మండపం ఎదుట అన్నమాచార్య సంకీర్తనలు అలపిస్తుండగా..మంగళ వాయిద్యాల నడుమ స్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, కోలాటాలు, చక్కభజనలు ఆకట్టుకున్నాయి. తితిదే వేద పాఠశాల పండితులు అనంత వేంకట దీక్షితులు, ఆలయ పరంపర అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పూజాధికాలు పర్యవేక్షించారు.



బంగారు హనుమంత వాహనంపై శ్రీరాముడు

## నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** ఉత్తరాంధ్రలో పేరుపొందిన గవరపాలెం నూకాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జాతర సందర్భంగా విశాఖ, గాజువాక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏప్రిల్ తొలి ఆదివారం కావడంతో ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి భారీగా వచ్చారు. ఉదయం 8 గంటల నుంచే రద్దీ పెరిగింది. సర్వదర్శనానికి రెండుగంటల సమయం పట్టింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకుస్వచ్ఛంద సంస్థలు సేవలు అందించాయి. బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఛైర్మన్ బొడ్డేడ అప్పారావు ప్రారంభించారు. క్లబ్ ఛైర్మన్ పెంటకోట నరసింగరావు, అధ్యక్ష, కార్యదర్శులు పి.ఎస్.అప్పారావు,కర్రి గంగాధరరావు పాల్గొన్నారు. విశాఖ ఫైనాన్సియర్స్ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సంఘ ఛైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధ రాము, ఆడారి చిన వీరునాయుడు హాజరయ్యారు. దేవస్థానంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాలక వర్గం, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ విక్రమ్‌జిత్ దుగ్గల్

### ఆలయంలో సందడి

పట్టణంలోని నూకాంబిక ఆలయంలో ఆదివారం సందడి నెలకొంది. కొత్త అమావాస్య జాతర తొలి ఆదివారం పురస్కరించుకుని అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ విక్రమ్‌జిత్ దుగ్గల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు ఆలయానికి విచ్చేసిన డీఎస్పీ వీఎస్ఆర్ మూర్తి, స్పెషల్ బ్రాంచి సీఐ కిరణ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఘనంగా ధ్వజారోహణం



ఘనంగా అగ్నిమదనం

**ఖమ్మం, న్యూస్‌టుడే:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. యాగశాలలో అగ్నిప్రతిష్ఠ, అగ్నిమదనం సాగాయి. రెండు రకాల చెట్ల చెక్కలతో అగ్నిని పుట్టించి బ్రహ్మోత్సవాన్ని నిర్వహించారు. శనివృక్ష గర్భం నుంచి అగ్నిని ఆవిర్భవింపజేసి హోమం చేయాలన్నదే శాస్త్రం. అలా శాస్త్రోక్త పద్ధతిలో జమ్మిచెట్టు, రావిచెట్టు చెక్కల ద్వారా అగ్నిమదనం చేశారు. ఇది భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెక్కల నుంచి అగ్ని పుట్టడంతో భక్తులు పాహిరామ ప్రభో అంటు నీరాజనాలు పలికారు. ఈ అగ్నిహోత్రాన్ని యాగశాలలోని హోమగుండంలో ఉంచారు. అక్కడ అగ్ని ప్రతిష్ఠ ప్రారంభించారు. యాగశాలలో అదివాసం చేసి ఉన్న గరుడ పటానికి పూజలు చేశారు. ఈ పటాన్ని స్వామివారితోపాటు ఆలయంలోనే ఊరేగింపుగా ధ్వజస్తంభం వరకు తీసుకెళ్లారు. అక్కడ ధ్వజపటాన్ని ఎగుర వేయడాన్నే ధ్వజారోహణంగా పండితులు అభివర్ణించారు. ధ్వజపటాన్ని ధ్వజ స్తంభం పైన ఎగురవేసి బ్రహ్మోత్సవ శోభను మరింత పెంచారు. ప్రసాదాన్ని గరుడమూర్తికి ఆరగింపు చేసి ఆ ముద్దలను భక్తులకు అందజేశారు. ఈ ప్రసాదం స్వీకరిస్తే చక్కని సంతానం కలుగుతుందని శాస్త్రం చెబుతున్నందున విశేష సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ప్రసాదం పొందేందుకు అమితాసక్తి కనబరిచారు.

# రాముడికి వానర దండు సాయం



**రా**వణాసురుడి బాధలకు ఓర్వలేక దేవతలంతా కలిసి బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్లి మొరపెట్టుకున్నారు. కానీ బ్రహ్మదేవుడు తానేమీ చేయలేనని విష్ణుమూర్తి దగ్గరకు వెళ్లమని చెప్పాడు. శ్రీమహావిష్ణువు ఆ దేవతలందరికీ అభయమిస్తూ తాను మనిషిగా జన్మించి రామావతారంలో రావణుడిని సంహరిస్తానని చెప్పాడు. ఈ సంఘటన జరగడానికి పూర్వం బ్రహ్మదేవుడు దేవతలను, రుషులను, గంధర్వులను ఇతర దేవజాతుల వారందరినీ పిలిపించి శ్రీరాముడికి సహాయం చేయడం కోసం వానరులను, ఎలుగుగొడ్లను, ఆవుతోక వంటి తోక కలిగిన గోకుచ్ఛులు, కిన్నెర, విద్యాధర, గంధర్వ, అప్సరస, నాగకన్యల, రుక్షల వలన వానర సంతతిని సృష్టించమని ఆజ్ఞాపించాడు.

### వానర సంతతి సంగతులు

అలా జన్మించిన సంతతి అంతా కేవలం ఒక చోటనే కాక భూమి నాలుగు చెరగులా వ్యాపించింది. హిమాలయ, వింధ్య, కైలాస, మందర, మహేంద్ర, ధ్రూమ, అంజన తదితర పర్వతాలలోనూ మేరు, ఉదయగిరి తదితర ప్రాంతాలలోనూ, చందన తోటలు, సరస్సులు, సముద్రాలు, నదీతీరాలు, రుష్యాశ్రమాలులాంటి ప్రదేశాలలోనూ ఆ వానరులంతా నివసించేవారు. వారంతా మైత్రేయ తదితర మద్యాలను తాగుతూ ఉండేవారు. వారిలో కొంతమంది పది, వంద, వెయ్యి ఏనుగుల బలం, మరికొంతమంది అంతకంటే ఎక్కువ బలం కలవారు ఉండేవారు. వారి శరీరాలు కొండలంత పరిమాణంలో ఉండేవి. వికృత రూపాలతో, వికృత భావాలతో వానరులు సంచరిస్తుండేవారు. కానీ వారి శరీరం మాత్రం సూర్యకాంతితో తేజోరిల్లుతుండేది. జుట్టు బంగారుఛాయతో సింహపు జుట్టును పోలి ఉండేది. కొన్ని కొన్ని వానరాల శరీరాలు చంద్ర, పద్మకేసర వర్ణాలతో ఉండేవి. ఈ వానరలంతా కామరూపులుగా, మాయావులుగా, సింహపరాక్రములుగా ఉండేవారు. వీరంతా ఎంతో బుద్ధిమంతులు, నీతిమంతులు, ఎన్నెన్నో ఉపాయాలు తెలిసినవారు. యుద్ధాలలో వేరే ఆయుధాలను ప్రయోగించకుండా తమ గోళ్ల కోరలనే ఆయుధాలుగా ఉపయోగిస్తుండేవారు. రాళ్లతోనూ, చెట్లతోనూ పోరాడటం వీరికి వెన్నతో పెట్టిన విద్య. శత్రువులను

ధర్మపథం

జయించటమే కానీ పరాజయం అనేది వీరికి తెలియదు. ఇటువంటి వారిలో ఎందరెందరో ప్రముఖులున్నారు. వారిలో నీలుడు, ఉల్కాముఖుడు, అసంగుడు అనేవారు అగ్నివల్ల జన్మించారు. నలుడు విశ్వకర్మ కుమారుడు. ఇతడు తండ్రిలాగానే శిల్పవిద్యా ప్రవీణుడు. సుషేణుడు మరీచి మహర్షికి పుత్రుడు. ఇతడే వాలి భార్య అయిన తారకు తండ్రిగా బాధ్యతలను స్వీకరించాడు. తేజస్సులో ఇంద్రుడికి, వేగంలో గరుత్మంతుడికి సాటి అయిన వాడితడు. గొప్ప బుద్ధిపరాక్రమాలు కలిగనవాడు కూడా. అశ్వినీ దేవతలకు మైందుడు, ద్వివిదుడు అనే ఇంద్రవానరులు జన్మించారు. వీరు దైవసైన్యాన్ని జయించి అమృతాన్ని తాగారు. గంధమాదనుడు యముడికి జన్మించాడు. తార తండ్రి అయిన సుషేణుడు కాక మరో ఇద్దరు సుషేణులు కూడా ఉన్నారు. వారిలో ఒకడు వరుణ దేవుడికి జన్మించాడు. రెండోవాడు ధర్మదేవత పుత్రుడు. శరభుడు అనేవాడు పర్జన్యుడికి కుమారుడు. దధిముఖుడు, చంద్రపుత్రుడు, శ్వేతుడు, జ్యోతిర్ముఖుడు సూర్యుడికి జన్మించారు. హేమకూటుడు వరుణుడికి పుత్రుడు. సుదుద్దరుడు వసువుకి జన్మించాడు. నముఖుడు, దుర్ముఖుడు, వేగదర్శి, బ్రహ్మపుత్రులు, కథసుడు అనే వానరుడు దేవరాక్షస యుద్ధంలో దేవతలకు సహాయం చెయ్యటానికి ఒక గంధర్వకన్యకు జన్మించాడు. ఇతడు ఇంద్ర పరాక్రమం కలిగి కుబేరుడి పర్వతం మీద వానరులతో సంచరిస్తుంటాడు. సన్నాదనుడు అనే వానర శ్రేష్ఠుడు కొన్ని యోజనాల ఎత్తైన శరీరంతో ఉండేవాడు. ఇతడు ఎప్పుడూ దేవతలకు సహాయం చేస్తుండేవాడు. వానరులలో ఎక్కువ పరాక్రమం గల సావర్ణి మేరుపర్వతం మీద నివసిస్తుండేవాడు. వాళ్లందరినీ శతవలి అనే వానరరాజు పాలిస్తుండేవాడు. శతవలి ప్రతిరోజూ సూర్యుడిని ఉపాసించేవాడు. ఇతడు శౌర్యం, బలం, పరాక్రమం, పౌరుషం కలిగినవాడు. గోమతి నదీతీరంలో సంకోచపర్వతం మీద నివసించే వానరులకు కుముదుడు రాజుగా ఉండేవాడు. రంభుడు వింధ్య, కృష్ణగిరి, సహ్యా, సుదర్శన పర్వత ప్రాంతాలలో ఉండే వానరులకు రాజు శరభుడు. వినతుడు అనేవాడు వర్ణాస నదీ ప్రాంతాన్ని ఏలేవాడు.

### జాంబవంతుడి పరాక్రమం..

సమాధి అనేవాడు గంగాతీరంలో ఉసీరబీజం అనే పర్వతం మీద నివస్తున్న వానర సేనలకు నాయకుడు. పూర్వం ఒకసారి ఏనుగులకు, వానరాలకు గొప్ప యుద్ధం జరిగింది. అప్పుడు ఈ సమాధి అసంఖ్యాక మదగజాలను మట్టుపెట్టాడు. రుక్షలు పెద్దపెద్ద వెంట్రుకలు, నల్లటి శరీరాలు కలిగి గొప్ప పరాక్రమవంతులై ఉండేవారు. వీరు యుద్ధ సమయాలలో కొండ శిఖరాలెక్కి పెద్దపెద్ద కొండరాళ్లను శత్రువుల మీద రువ్వడంలో మంచినేర్పరులు. రాక్షస, పిశాచాలతో సమానమైన బలవంతులు వీరు. మృత్యువుకు కూడా భయపడని ధైర్యవంతులుగా వీరికి పేరుంది. రుక్షవంతం అనే పర్వతం మీద నివసిస్తూ నర్మదా నదీ తీరంలో విహరిస్తుండేవారు వీరు. ఈ వానరులలో ధూమ్రుడు, జాంబవంతుడు అనేవారు బ్రహ్మకు జన్మించారు. ఈ ఇద్దరు వానరులు అందరికంటే మహాబలవంతులు. పెద్దవాడైన ధూమ్రుడు రుక్షకులందరికీ రాజుగా ఉండేవాడు. చిన్నవాడైన జాంబవంతుడు గొప్ప బలపరాక్రమశాలి. ఈ సోదరులిద్దరూ దేవదానవ యుద్ధాలతో ఎప్పుడూ దేవతల పక్షాన నిలిచి దేవతలకు విజయం చేకూరుస్తూ ఉండేవారు. నల్లని ముఖాలు, పెద్దపెద్ద శరీరాలు కలిగి ఎంతో బలవంతులైన గోకుచ్ఛాలు అనే వానరులకు దవాక్షుడు రాజుగా ఉండేవాడు.

### సేన సాయంతోనే..

రామరావణ యుద్ధంలో తరచుగా ఈ కథలో వచ్చిన వానరుల పేర్లన్నీ ఎక్కువగా ప్రస్తావనలో ఉంటాయి. వీరందరినీ సైనికాధ్యక్షులుగా, వానరసేన నాయకులుగా రాముడు నియమించి వీరందరి సహాయ సహకారాలతో రావణాసురుడిని జయించాడు. ఈ వానర సంతతి అంతా కోటానుకోట్ల సంఖ్యలో ఉన్నట్లు రామాయణం పేర్కొంటుంది. అయితే వానర రాజధాని అయిన కిష్కింధను ఏలిన వాలి, సుగ్రీవుడు వారికి మంత్రులుగా ఉన్న హనుమంతుడు, సుషేణుడు, జాంబవంతుడు వంటి వారి పేర్లు మాత్రం రామరావణ యుద్ధసమయంలో కాక అంతకు ముందు నుంచే అందరికీ ఎంతో పరిచయమైనవిగా ఉంటాయి. ఇలా రామదండు విశేషాలు ఈ కథాసందర్భంలో ఉన్నాయి.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## చాముండికి కలువలతో అర్చన



కలువ, చామంతి పుష్పాలతో పూజలందుకుంటున్న దుర్గమ్మ

**విజయవాడ, న్యూస్‌టుడే:** చైత్రమాస వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం జగన్మాత దుర్గమ్మకు కలువ, చామంతులతో అర్చన జరిగింది. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఆశీర్వచన మండపంలో దుర్గమ్మ ఉత్సవమూర్తిని ఉంచి ఎనిమిది రోజులుగా ఎనిమిది రకాల పుష్పాలతో అర్చన జరుగుతోంది. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ లక్షనామాలతో అమ్మవారి పూజ తిలకించేందుకు ఉభయదాతలు పోటీపడ్డారు. పూజా రుసుము చెల్లించిన వీరు స్వయంగా పూజలో పాల్గొన్నారు. పూజ అనంతరం మంత్రపుష్పం, హారతి, ప్రసాదాల పంపిణీ జరిగింది.

ఆంధ్రావని

## స్వామి వారికి అభిషేకం

**ఏలూరు , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** సీతారామస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో తూర్పువీధి సంహాల వీధిలో 60వ శ్రీరామపట్టాభిషేక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. యాజ్ఞీకబ్రహ్మ పరాశరం పట్టాభిరామాచార్యులు ఆధ్వర్యంలో సీతారాములకు 108 కలశాలతో గోక్షీరపంచామృతాభిషేకం చేశారు. స్వామివారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. మండపారాధన, అంకురార్పణ, దీపోత్సవం నిర్వహించారు. భక్తులు విష్ణుసహస్ర నామపారాయణ చేశారు.

## దూసుకెళ్లటం

**వి**జయమార్గంలో వేగంగా పురోభివృద్ధి చెందటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తుంది. అత్యంత వేగాన్ని సూచించటానికి ఈ జాతీయాన్ని వాడుతుంటారు. బాణం

జాతీయాలు నుడికారాలు

దూసుకెళ్లిందిలాంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఈ వేగభావాన్ని సూచించటానికి ఈ జాతీయం ఆవిర్భవించింది. 'వ్యాపారంలో నిన్న మొన్నటిదాకా స్తబ్ధంగానే ఉన్నాడు. ఇటీవలి కాలంలో కొద్దిగా తెలివి ప్రదర్శించి ఊహించనంతగా ముందుకు దూసుకెళ్లాడు' లాంటి సందర్భాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది.





పుష్పాలంకరణలో సోమేశ్వరస్వామి, పార్వతీ అమ్మవారు

## సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు

**భీమవరం , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** గునుపూడి సోమేశ్వరజనార్దన స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని పంచామృతాలతో అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు సోంబాబు, రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం స్వామి, పార్వతీ అమ్మవారికి మధిర అయ్యప్పశర్మ వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు.



సింహ వాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు

## సింహంపై రామయ్య రాజసం

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీపట్టాభిరాముని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో మూడో రోజైన సోమవారం రాత్రి స్వామి సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతసేవతో పూజలు ప్రారంభమయ్యాయి. శుద్ధి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి కల్పవృక్ష వాహనంపై సీతా సమేతంగా ఆశీనులై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. తర్వాత స్వామికి ఊంజల్ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం విశేషాలంకృతులైన స్వామి..సీతాసమేతులై సింహ వాహనాన్ని అధిరోహించి తిరుమాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా మహిళలు పిండి దీపాలతో స్వామికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన చక్క భజనలు, కోలాటాలు, జానపద నృత్యాలు, రామభజనలు ఆకట్టుకున్నాయి.



స్వామి వారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకుడు

## శ్రీవారికి పుష్పయాగం

**ఖమ్మం, న్యూస్‌టుడే:** జమలాపురం దివ్య క్షేత్రంలో వేంకటేశ్వరుడి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శాంతి కల్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని ప్రాకార మండపంలో పుష్పయాగం నిర్వహించారు. గులాబీ, మల్లె, చామంతి, లిల్లీ, గన్నేరు,నంది వర్ధనం, కనకాంబరం, జాజి పూలతో యాగం చేశారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్లను అలంకరించి, అశ్వహనంపై గిరి ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ దర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈవో వెచ్చా నరసింహారావు, ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, వేద పండితులు కొత్తూరి కోటేశ్వరశాస్త్రి, విజయదేవశర్మ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం శ్రీవారు, అమ్మవార్లను హనుమంత వాహనంపై ఉంచి గిరి ప్రదక్షిణలు చేశారు.

# రామాయణ గాథల్లో భేదాలు

వాల్మీకి రామాయణంలో కనిపించని కొన్ని కొన్ని ఘట్టాలు పద్మపురాణంలో కనిపిస్తాయి. ప్రధానంగా ఉత్తర రామాయణానికి సంబంధించి బహుళ ప్రచారంలో ఉన్న కథలు పద్మపురాణం వల్లనే ప్రజల్లోకి వెళ్లాయి. ఇలా ఉండటానికి కారణం కల్పభేదమని ఒక్కొక్క కల్పనలో ఒక్కొక్క విధంగా కథ జరిగి ఉండవచ్చని కూడా పండితులు చెబుతుంటారు. పద్మపురాణం పాతాళ ఖండంలో శ్రీరాముడు చేసిన అశ్వమేధ యాగానికి సంబంధించిన కథ ఉంది. ఆ కథను ఆదిశేషుడు వాత్సాయన మహామునికి చెప్పినట్టుగా సూత మహాముని శౌనకాది మహామునులకు వివరించాడు. ఈ కథలో మూలరామాయణంలో లేని చాలా విషయాలున్నాయి. మూలరామాయణంలో రాముడు చేసిన అశ్వమేధ యాగం కథ సంక్షిప్తంగా ఉంది. అదే కథను పద్మపురాణం బాగా విపులీకరించింది. దీంతోపాటుగానే మరెన్నో ఉపాఖ్యానాలు కూడా వాల్మీకి రామాయణంలో లేనివి పద్మపురాణంలో ఉన్నాయి. అశ్వమేధ యాగం చేసిన తర్వాత అశ్వం వెంట లక్ష్మణుడు వెళ్లినట్లు వాల్మీకి కథలో ఉంది. కానీ పద్మపురాణంలో శత్రుఘ్నుడు అశ్వ రక్షకుడిగా ఉన్నాడు. మూలరామాయణంలో శ్రీరామచంద్రుని చూడటానికి చాలామంది రుషులు వచ్చినట్లు ఆ రుషి బృందంలో అగస్త్యుడు కూడా ఉన్నట్టు ఉంది. కానీ పద్మపురాణంలో అగస్త్యుడు మాత్రమే వచ్చి శ్రీరాముని దర్శించినట్లు ఉంది.

### ఉత్తర రామాయణంలో లేని కథలు

శత్రఘ్నుడు యాగాశ్వాని రక్షిస్తూ వెళుతున్న సందర్భంలో పద్మపురాణంలో సమద మహరాజు కథ, చ్యవన మహర్షి కథ, నీలాచల మాహాత్మ్య కథ, దమనుడు అనేవాడు యాగాశ్వాన్ని బంధించినప్పుడు భరతుడి కుమారుడైన పుష్కలుడు దమనుడితో యుద్ధం చేయడంలాంటివి ఉన్నాయి. అలాగే జనక మహారాజుకు యముడికి జరిగిన సంవాదం, శత్రుఘ్నుడు విద్యున్మాలి ఉగ్రదంష్ట్రులను వధించడం, ఆ తర్వాత హనుమంతుడితోనూ పుష్కలుడితోనూ పాతాళానికి వెళ్లడం, శత్రుఘ్నుడు తదితరులతో రుక్మాంగదుడు యుద్ధం చేయడం, హనుమంతుడికి శివుడికి జరిగిన యుద్ధం, రామచంద్రుడు సాక్షాత్కరించడం, పరమేశ్వరుడు శ్రీరాముడిని స్తుతించడం, సురధుని చరిత్ర ఇలాంటి కథలన్నీ వాల్మీకి రచించిన ఉత్తర రామాయణంలో లేవు. రామాయణ కథాసంగ్రహం పద్మపురాణంలోని పాతాళ ఖండంలో రెండుసార్లు కనిపిస్తుంది. మొదటిసారి శత్రుఘ్నుడు అర్యణ్యక మహారుషిని దర్శించినప్పుడు లోమశ మహారుషి తనకు చెప్పిన రామాయణ కథను అరణ్యకరుషి శత్రుఘ్నుడితో చెప్పడం, రెండోసారి కుశలవులు రామాయణ గానం చేస్తున్న రామకథ కనిపిస్తుంది. ఈ రామకథలో కుశలవులు రామాయణం మొత్తం ఆరు కాండలుగా మాత్రమే చెప్పారు. ఉత్తరకాండను ఆరోదిగా పేర్కొన్నారు. ఈ ఉత్తరకాండలో యజ్ఞవిధానం వరకు ఆ కథలో ఉంది. వాల్మీకి మహర్షి ఏడు కాండలుగా చెప్పిన రామాయణం పద్మపురాణంలో కుశలవులు గానం చేసినప్పుడు ఇలా ఆరు కాండలుగా మారింది. వాల్మీకి ఆశ్రమప్రాంతానికి యాగాశ్వం వచ్చినప్పుడు లవుడు దానిని బంధించాడు. ఆదిశేషుడు కుశలవుల జన్మ వృత్తాంతాన్ని వాత్సాయనుడికి చెబుతూ శ్రీరాముడు సీతాదేవిని పరిత్యజించే సందర్భం నుంచి తన కథనాన్ని ప్రారంభించాడు. ఈ కథలో కూడా వాల్మీకి రామాయణానికి విరుద్ధంగా ఉండే కొన్ని కథలున్నాయి. అందులో ప్రధానంగా గూఢచారులు శ్రీరాముడికి నగరంలో జరిగిన విశేషాలన్నింటిని వివరిస్తూ ఒక రజకుడు తన భార్యను తిట్టి ఇంటి నుంచి వెళ్లగొడుతుండగా ఆ రజకుడి తల్లి వారిస్తుంది. అప్పుడు రజకుడు పరుల పంచన ఉండి వచ్చిన ఇల్లాలిని స్వీకరించడానికి తానేమి శ్రీరాముడిని కానని పలికినట్లు, ఆ మాటలను గూఢచారులు రాముడికి వివరించినట్లు అప్పుడు రాముడు సీతను పరిత్యజించినట్లు ఉంది. కానీ వాల్మీకి రామాయణంలో అలా కాక రాజ్యంలో ఉన్న ప్రజల తమ మాటల సందర్భంలో రాక్షసుడు అపహరించుకుపోయిన భార్యను రాముడు తిరిగి తెచ్చాడని అనుకున్నట్లుగా మాత్రమే ఉంది. శ్రీరాముడు సీతా పరిత్యాగం చేయడానికి కారణం రజకుడి మాటలేనా? ఇంకా ఏవైనా కారణాలున్నాయా? అని వాత్సాయనుడు శేషుడిని అడిగినప్పుడు సీతా పరిత్యాగానికి సంబంధించిన మరొక కథను కూడా వివరించాడు.



### సీతకు చిలుకల శాపం

సీతాదేవి చిన్నతనంలో ఒక ఉద్యానవనంలో ఆడుకుంటుండగా ఒక చెట్టు మీద ఉన్న చిలుకల జంట మానవ భాషలో మాట్లాడుకుంటున్నాయి. వాటిలో మగ చిలుక తన భార్యతో భవిష్యత్తులో రామావతారం జరుగుతుందని సీత అతడి భార్య అవుతుందని పలికింది. ఆ మాటలను విని ఆ చిలుకను తన దగ్గరకు తెచ్చుకొని సీతారాముల కథ మీకు ఎలా తెలిసింది? ఆ విషయాన్ని వివరించమని అడిగింది. అప్పుడు ఆ చిలుక తాము వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఉంటామని, ఆయన రామాయణాన్ని రాసి శిష్యులకు చెబుతుండగా తాము విన్నామని చెబుతుంది. ఆ తర్వాత విడిపించమని సీతను ప్రార్థించాయి. అప్పుడు సీతాదేవి మగచిలుకను మాత్రం వదిలిపెట్టింది. గర్భిణిగా ఉన్న ఆడచిలుకను తన దగ్గరే ఉంచుకుని, ప్రసవించిన తర్వాత విడిచిపెడతానని మగచిలుకతో అంది. మగచిలుక ఎంత బతిమలాడినా సీత ఆడచిలుకను వదిలిపెట్టలేదు. ఆడచిలుక కూడా తాను తన భర్తను విడిచిపెట్టి ఉండలేనని దయచేసి విడిచిపెట్టమని ఎన్నో రకాలుగా ప్రార్థించింది. కాని సీత అందుకు సమ్మతించలేదు. ఆ శోకంతో ఆడచిలుక గుండె పగిలి ప్రాణాలు విడిస్తూ గర్భవతిగా ఉన్న సీతను ఆమె భర్త శ్రీరాముడు విడిచిపెడతాడని శపించింది. అప్పుడు మగచిలుక కూడా తీవ్రంగా శోకిస్తూ తన భార్య నుంచి తనను వేరుచేసిన ఫలితంగా మరుజన్మలో తాను ఒక రజకుడిగా జన్మించి సీతను ఆమె భర్త నుంచి విడదీస్తానని చెప్పి గంగలో మునిగి ప్రాణత్యాగం చేసింది. ఈ కథ మూల రామాయణంలో ఉండదు. వాల్మీకి ఆశ్రమం నుంచి వచ్చిన సీతను భార్యగా స్వీకరించే విషయంలో కూడా పద్మపురాణానికి, వాల్మీకి రామాయణానికి భేదం ఉంది. దీంతోపాటుగా పద్మపురాణంలో ఉన్న సృష్టిఖండంలో శ్వేతోపాఖ్యానం మాత్రం వాల్మీకంలో ఉన్నట్లుగానే యథాతథంగా ఉంది. ఈ కథలాగే బ్రహ్మదత్తోపాఖ్యానం ఉంది కానీ కొంచెం అధిక పాఠసర్గలతో ఉంది. ఇలా వాల్మీకి రామాయణంలోని ఉత్తర రామాయణకథకు పద్మపురాణంలో ఉండే ఉత్తర రామాయణ కథకు కొన్ని భేదాలు కనిపిస్తున్నాయి.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

---

## జగత్కల్యాణం.. కనులారా వీక్షణం



పూజలో అర్చకులు



మంగళ సూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

**శ్రీరామ నవమివేళ భద్రాద్రి భక్తజనంతో పులకించింది. మూలవిరాట్‌కు ముందుగా వివాహ మహోత్సవం నిర్వహించి కల్యాణమూర్తులను మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత మిథిలా స్టేడియంలో పెళ్లి క్రతువు జరిపించారు. గవర్నర్ నరసింహన్ ముత్యాల తలంబ్రాలు తేగా పాహిరామప్రభో అంటూ నీరాజనాలు పలికారు. వీధులన్నీ ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. మూడు లక్షల లడ్డూలను విక్రయించారు. తలంబ్రాల కోసం అమితాసక్తి కనబరిచారు.**

– ఖమ్మం, న్యూస్‌టుడే



ఊరేగింపుగా వస్తున్న సీతారాములు

---

## దుర్గమ్మకు మల్లెలతో అర్చన

**విజయవాడ, న్యూస్‌టుడే:** చైత్ర మాస వసంత నవరాత్రోత్సవాలో భాగంగా చివరి రోజైన మంగళవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు కాగడా మల్లెలతో లక్ష పుష్పార్చన జరిగింది. ఆశీర్వచన మండపంలో దుర్గమ్మ ఉత్సవమూర్తికి లక్షసార్లు స్మరిస్తూ చేసిన పుష్పార్చనను ఉభయదాతలతో పాటు భక్తులు కూడా తిలకించారు. వేదప ండితుల మంత్రోచ్చరణల నడుమ లలితా సహస్రనామ పారాయణం జరిగింది.

---

## వడ్లగింజలో బియ్యపుగింజ

**ర**హస్యం కానీ, ప్రత్యేక అంశం కానీ ఏదీలేదు అని చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడుతుంటారు. వరికంకిలో ఉండే వడ్లగింజ మీద పైన పొట్టు ఉంటుంది. ఆ పొట్టును తీసివేస్తే బియ్యపుగింజ కనిపిస్తుంది. వడ్లగింజలో బియ్యపుగింజ ఉండటం అత్యంత సహజం. అలా అత్యంత సహజమైన విషయమే అని ఏ విషయాన్ని గురించైనా వివరించాల్సి వచ్చినప్పుడు దీని ప్రయోగం కనిపిస్తుంది. కొన్నిచోట్ల ఏదో ఉందని కొంతమంది ఆసక్తిగా ఎదురుచూస్తూ ఆ కనపడని దాని వివరాల కోసం ఇరుగుపొరుగు వారిని అడుగుతుంటారు. అయితే అక్కడున్నది అందరికీ తెలిసిన విషయమేనని చెప్పాలనుకున్నప్పుడు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.

---

## నేత్రపర్వంగా ప్రత్యేకోత్సవం

**శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పెద్దకొటాయి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకార మండపం నుంచి ఉత్సవమూర్తులను ఊంజల్‌సేవ మండపం వద్ద ఉన్న వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. వట్టివేరు తడికల మధ్య ఉత్సవర్లకు ప్రత్యేక చందనాన్ని అద్ది విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య ధూప, దీప, నివేదనాది కైంకర్యాలు ఘనంగా చేపట్టారు.



స్వామి, అమ్మవార్లకు హారతులు ఇస్తున్న అర్చకులు

---

## రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

**అనంతపురం, న్యూస్‌టుడే:** ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వాసుదేవ పుణ్యావాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, కలశస్థాపన, దీక్షాహోమం చేశారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ స్వామివారిని సింహవాహనం, పెద్ద శేషవాహనం, చిన్న శేషవాహనం, హనుమద్, గరుడ, గజ, అశ్వ వాహనాల్లో అలంకరించి సేవలు,పూజలు చేస్తామని ఆలయ ఛైర్మన్ గోపాల్‌రెడ్డి తెలిపారు. 15న ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. చివరిరోజు వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తామని తెలిపారు. భక్తుల కోసం తాడిపత్రి బస్టాండు నుంచి ఆలూరుకోన వరకు బస్సు సౌకర్యం ఉంటుందని తెలిపారు.



ఆలూరుకోన రంగనాథస్వామి

---



## చల్లని రామయ్య... చక్కని సీతమ్మ

కర్నూలు, న్యూస్‌టుడే: **జిల్లా వ్యాప్తంగా అన్ని రామాలయాల్లో ఆదర్శదంపతుల కల్యాణ వేడుకని చూసి భక్తులు తరించారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి.**

# ఆదర్శవంతం వివాహబంధం

మన భారతీయ సంస్కృతిలో వివాహ వ్యవస్థకు ఒక ప్రధాన స్థానం ఉంది. ఒకసారి అగ్నిసాక్షిగా వివాహమైన తర్వాత భార్యాభర్తలు ఇద్దరూ కష్టసుఖాలను సమంగా పంచుకుంటూ జీవించటమనే ఉత్తమ లక్షణం ఈ వివాహ వ్యవస్థలో ఉంది. కాబట్టే దానికి ఈనాటికీ ప్రపంచవ్యాప్తంగా అంతగొప్ప గుర్తింపు లభించింది. మన పతివ్రతలు, ఏక పత్నీవ్రతులు అయిన ఆదర్శనీయులంతా తమ ఆదర్శ దాంపత్య జీవనంతో దివ్య జ్యోతులుగా భాసిల్లుతున్నారు. ఇలాంటి ఆదర్శ దంపతులకు ఉదాహరణగా ఎందరెందరినో చెప్పుకోవచ్చు. కానీ అందులో మౌద్గల్యుడు అనే ముని, ఆయన భార్య అయిన ఇంద్రసేనల దాంపత్య జీవిత విశేషాలు మరింత స్ఫూర్తిదాయకంగా అనిపిస్తాయి.

ధర్మపథం

ముద్గలుడు అనే ఓ మహర్షి కుమారుడే మౌద్గల్యుడు. ఆయన తపోదీక్షలో తండ్రిని మించిన గొప్పవాడిగా పేరు తెచ్చుకున్నాడు. మౌద్గల్యుడు తన తండ్రి గతించిన తర్వాత పెద్దల సూచన మేరకు ఇంద్రసేన అనే ఆమెను వివాహమాడి ఉత్తమ గృహస్థుడిగా జీవితం సాగించసాగాడు. అతి తక్కువ సమయంలోనే ఒక మహామునిగా కూడా పేరు తెచ్చుకున్నాడు. ఇంతటి ఉత్తముడికి పూర్వజన్మ కర్మఫలం వల్ల భయంకరమైన కుష్ఠువ్యాధి సంక్రమించింది. వ్యాధి వల్ల క్రమక్రమంగా మౌద్గల్యుడు కేవలం చర్మం కప్పిన ఎముకలగూడులా మారిపోయాడు. అతడిలోని శాంతగుణమంతా నశించిపోయింది. అతి కోపాన్ని ప్రదర్శిస్తూ ఉండేవాడు. పూర్తిగా వృద్ధాప్య దశ అతడి శరీరానికి సంక్రమించింది. ఇంత హీనస్థితికి మౌద్గల్యుడు చేరినా ఆయన భార్య ఇంద్రసేన మాత్రం భర్తను ఏమాత్రం అసహ్యించుకోకుండా ఆయనకు కావాల్సిన పరిచర్యలన్నీ సక్రమంగా నిర్వర్తిస్తుండేది. మౌద్గల్యుడికి నిజానికి తన తపోబలంతో ఆ వ్యాధి నుంచి రక్షించుకోగల శక్తి ఉన్నప్పటికీ తపోబలాన్ని అనవసరంగా వాడటం ఎందుకని, పూర్వజన్మ కర్మఫలాన్ని అనుభవించి తీరాల్సిందేనన్న ఓ పట్టుదలతో అలాగే కాలక్షేపం చేస్తుండేవాడు. ఇంద్రసేన మాత్రం ఆయనను క్షణకాలంపాటు కూడా విడిచిపెట్టకుండా వివాహబంధ పవిత్రతను పదిమందికీ చాటిచెప్పేలా సేవలు చేస్తూ ఉండేది. ఆ భయంకర వ్యాధి వల్ల ఓ రోజున మౌద్గల్యుడు భోజనం చేస్తుండగా అతడి చేతివేలు ఒకటి ఊడి పడింది. అయినా ఆమె చీదరించుకోలేదు. అలా నిరంతరం ఎంతో ఓపికగా ఆమె భక్తితో తనకు సేవలు చేస్తుండటంతో మౌద్గల్యుడి హృదయం ద్రవించింది. వెంటనే ఆమెను ప్రశంసిస్తూ వరం ఏదైనా కోరుకోమని అన్నాడు. అప్పుడామె ఎంతో భక్తివినయాలతో తనకు కామోపభోగేచ్ఛ అధికంగా ఉందని, కాబట్టి తపశ్శక్తిని వినియోగించి అయిదు రూపాలలో మనోహర ఆకారంతో ఉండి తనకు సుఖాన్ని అందించమని వేడుకుంది. మౌద్గల్యుడు ఆమె కోరికను తీర్చదలిచాడు. వెనువెంటనే తన తపశ్శక్తిని వినియోగించి దివ్యసుందరాకారాలను అయిదింటిని ధరించాడు. ఆ ఆకారాలతో ఇంద్రసేనను వెంటబెట్టుకుని దివ్య రథమెక్కి ఆకాశగంగాజలాలలో స్నానం చేసి చంద్రుడి పవిత్ర ప్రదేశాలలో తన భార్యతో విహరించాడు. అలా అనేక సంవత్సరాల కాలంపాటు జరిగింది. చివరకు పరితృప్తిని చెంది మళ్లీ తపస్సు చేసుకోవటం కోసం వెళ్లిపోయాడు. ఆనాటి ఇంద్రసేన కూడా మరుజన్మలో మళ్లీ మౌద్గల్యుడు తనకు అలా అయిదుగురు భర్తల రూపంలో రావాలని కోరుకుంది.



### ఆమే ద్రౌపది..

ఆ కారణం చేతనే ఆమె ద్రౌపదిగా జన్మించింది. పంచభర్తృక అయింది. ఈ కథాసందర్భంలో పతికి భక్తితో సేవ చేసిన ఇల్లాలుగా ఇంద్రసేన, పత్ని అడిగింది ఎంతటి కష్టతరమైనా ఆమెకు తెచ్చి ఇచ్చి ఆమె సుఖమే తన సంతోషమని భావించుకొనే భర్తగా మౌద్గల్యుడు మనకు కనిపిస్తాడు. వాస్తవానికి మౌద్గల్యుడు ఏనాడో తన తపోబలంతో కుష్ఠువ్యాధిని పోగొట్టుకోగల శక్తి ఉన్నప్పటికీ అలా చేయడం ఇష్టం లేక కర్మఫలాన్ని అనుభవిస్తూనే వచ్చాడు. కానీ తన భార్య కోరిన కోరిక తీర్చటం కోసం ఆ తపోబలాన్ని వెచ్చించి ఆమె కోరికను తీర్చాడు. మన వివాహవ్యవస్థలో ఉన్న పవిత్రబంధం ఇలాంటిదని ఈ కథాసందర్భం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# మా రాజువంటే నువ్వేలే

## రామయ్య తండ్రి..

◆ భద్రాద్రిలో ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం





పట్టాభిషేక క్రతువు నిర్వహిస్తున్న దృశ్యం



**ఆకాశమంత పందిరి.. భూదేవంత అరుగు వేసి.. జగదభిరాముడికి జానకిమాతకు కల్యాణ మహోత్సవం జరిగిన మరుసటిరోజు రాజాధిరాజు రాములవారు పట్టాభిషిక్తులయ్యారు. భద్రాచల దేవాలయంలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ సింహాసనంపై అధిష్ఠించిన రఘువీరుడికి కిరీటాన్ని ధరింపజేయడంతో ఈ ప్రాంతమంతా మరింత శోభాయమానమైంది. భక్తులు కనులారా వీక్షించి తన్మయులయ్యారు. తెల్లవారుజాము నుంచే రాత్రి వరకు మాడవీధులు కళకళలాడాయి. గురువారం ఈ నూతన దంపతులకు ఆశీర్వచనం అందనుంది. బ్రహ్మోత్సవాలు ఈనెల 14 వరకు కొనసాగుతాయి. -న్యూస్‌టుడే, ఖమ్మం**

# ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

**పామర్రు, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** జిల్లాలో మూడో ఆంజనేయ స్వామిగా ప్రసిద్ధిగాంచిన పామర్రు మండలం ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో పుష్యమి నక్షత్ర యుక్త వృషభలగ్నమందు నూతన ధ్వజ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఉదయమే ఆలయానికి చేరుకోగా దేవాదాయ, ధర్మాదాయశాఖ డీఈ ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాళ్లకూరి సిద్ధాంతి పుల్లేటికుర్తి భోగేశ్వరశర్మ, మణిదీప్ శర్మ, వారి శిష్యబృందం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదమంత్రాల నడుమ ధ్వజ, శిఖర, బలిపీట, ఉష్ట్ర, గణపతి విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దాసు గంగాధరరావు, ఆలయ ఈవో ఎస్. వి. ఎస్. శంకరరావు తదితరులు యాగంలో పాల్గొని పూర్ణాహుతి నిర్వహించగా భక్తులు ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న అర్చకులు

ఆంధ్రావని

## వీధిపాలు

ఉపాధి కోల్పోవటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఒక చోట ఆశ్రయం పొందుతున్నప్పుడు గుట్టుగా ఎవరి బతుకులు వారు బతకటం జరుగుతుంటుంది. ఆ ఆశ్రయం పోయినప్పుడు వీధినపడి మళ్లీ ఎక్కడ ఆశ్రయం దొరుకుతుందా అని వెతకాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితులను ప్రతిబింబిస్తుంది ఈ జాతీయం. 'ఆ పరిశ్రమ మూతపడటంతో వందలాదిమంది కార్మికుల జీవితాలు వీధిపాలయ్యాయి' అనే లాంటి సందర్భాలలో ఈ జాతీయం కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

ఘనంగా ముగిసిన

# వసంత నవరాత్రి ఉత్సవాలు

**ద్వారకాతిరుమల,పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రంద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఉపాలయమైన కుంకుళమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముత్తయిదువులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు చేశారు . అనంతరం వేద మంత్రాల, మేళతాళాల నడుమ చండీయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పోలిన శ్రీను 200 తామర పుష్పాలను అమ్మవారి సామూహిక కుంకుమ పూజకు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



కుంకుళమ్మకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

# శ్రీమహాలక్ష్మికి వేద నీరాజనం

**నెల్లూరు , న్యూస్‌టుడే:** నెల్లూరు దర్గామిట్టలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో అనంత శ్రీ విభూషిత శ్రీమత్పరమహంసేత్యాది త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయార్ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ మహాలక్ష్మి యగ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. తొలుత అగ్నిమధనం, అగ్నిప్రతిష్ఠ, ఆచార్య ఋత్విక్ వరణం, వేదపారాయణం, శ్రీమత్ భాగవగత, ద్రవిడ ప్రబంధ, రామాయణం గ్రంథపారాయణం, సుదర్శనేష్ఠి, పుర్ణాహుతి, ప్రధాన యాగశాలలో సాత్తుముర్రై పూజలు వైభవంగా జరిగాయి. సాయంత్రం యాగశాలలో వేద పండితులు దేవతామూర్తులను స్తుతిస్తూ స్తోత్ర పారాయణం నిర్వహించారు. లక్ష్మీదేవికి వేద నీరాజనం సమర్పించుకున్నారు. శ్రీలక్ష్మీదేవికి సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం శ్రీరామానుజ జీయార్‌స్వామి 'భారతీయ సంస్కృతిపై వేదాల ప్రభావం' అనే అంశంపై ప్రవచించారు. వేదానుసారంగా అందరూ ధర్మబద్ధంగా జీవించాలని, ధర్మపరిరక్షణకు పాటుపడాలన్నారు. ప్రవచనాలు నిర్వహించారు.



అలంకారంలో శ్రీ మహాలకి

# అంటరానితనాన్ని నిరసించిన మహారాజు

**భా**రతీయ పురాణ వాఙ్మయం కేవలం ఆధ్యాత్మిక చింతనను సమాజంలో ప్రచారం చేయటమేకాక మానవాళిలో మానవత్వాన్ని నిలిపేందుకు కూడా తగిన విధంగా ఉన్నట్లు కనిపిస్తుంది. శివపురాణంలో కనిపించే ఉద్భటుడి కథ ఇందుకు చక్కని ఉదాహరణ. పూర్వం బల్లకి అనే నగరంలో ఉద్భటుడు అనే పేరు గల పంచమకులజుడు ఉండేవాడు. ఆ నగరాన్ని భోజుడు పరిపాలిస్తుండేవాడు. ఉద్భటుడు పరమ శివభక్తుడు. నైతిక ప్రవర్తనతో నిరంతరం శివధ్యానంలో కాలం గడుపుతూ ఉండేవాడు. ఉద్భటుడిలో ఉన్న సుగుణాలను గమనించిన భోజుడు తాను ఉన్నత కుల సంజాతుడయినప్పటికీ ఉద్భటుడిలోని శివభక్తిని నైతిన ప్రవర్తనకు ఆకర్షితుడై అతడినే తన గురువుగా ఎంచుకున్నాడు. అంతేకాక అంటరానితనాన్ని నిరసిస్తూ ఉద్భటుడి సరసన కూర్చుని సహపంక్తి భోజనం చేస్తుండేవాడు. ఈ విధమైన భోజుడి చర్యలు ఆయన గురువులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులనుకునే వాళ్లకు గిట్టలేదు.

### శ్మశానంలో భూతం రోదన

భోజుడి మనసును మార్చాలని పరిపరి విధాల ప్రయత్నం చేశారు. కానీ వారెదరికీ ఆయన తీసుకున్న నిర్ణయాన్ని మార్పించగల శక్తి లేకపోయింది. వర్ణాశ్రమ ధర్మాలను భోజుడు వ్యతిరేకిస్తున్నాడని వారు భావించారు. అయితే అటువంటి వారి సూచనలను ఏమాత్రం ఆ మహారాజు చెవిన పెట్టలేదు. తాను గురువుగా నమ్మిన ఉద్భటుడిని విడిచిపెట్టలేదు. ఇలా కాలం గడుస్తుండగా సాక్షాత్తు

ధర్మపథం

పరమేశ్వరుడే ప్రజానీకానికి అంటరానితనాన్ని పాటించకూడదని, మనిషి నిర్మలమైన మనసుతో పూజ చేసినప్పుడు అతడిలోని మంచి గుణాన్ని అందరూ మెచ్చుకోవాలని భావించాడు. వెంటనే ఆయన ఉద్భటుడికి సాయుజ్యాన్ని ప్రసాదించాడు. భోజుడు ఉద్భుటుడి భౌతికదేహానికి అంత్యక్రియలు జరిపించాడు. అయితే ఈ సందర్భంలోనే ఒక విచిత్రం జరిగింది. ఉద్భటుడు మరణించిన నాటి రాత్రి నుంచి శ్మశానంలో ఉన్న ఒక పెద్దచెట్టు మీద నుంచి నిరంతరాయంగా ఒక శోకం వినిపించటం ప్రారంభమైంది. ఆ భయంకర రోదనను వినలేక బల్లకి నగర ప్రజలంతా భయానికి గురైయ్యారు. ఈ విషయం రాజు వరకు చేరింది. రాజు వెంటనే తన మంత్రులను పిలిపించి విషయాన్ని కనుక్కోమన్నాడు. మరునాడు భోజుడి దండనాధుడు కొందరు సాయుధలైన పరిచారికులను వెంటపెట్టుకుని రాజుతో సహా శ్మశానానికి బయలుదేరాడు. ఏమి వింత జరుగుతుందో చూద్దామని ఊరి జనమంతా కదిలారు.

### ఆ పొగ తాకితే ఉత్తమ లోకాలకు...

శ్మశానం చేరిన తరువాత రోదన వినిపిస్తున్న మర్రిచెట్టును సమీపించారు. రాజు అందరినీ నిశ్శబ్దంగా ఉండమని చెప్పి గొంతెత్తి ఓ అశరీర భూతమా నువ్వెందుకు ఇలా రోదిస్తున్నావో వివరించు అని అడిగాడు. అప్పుడా అశరీర భూతం తన కథను భోజుడికి ఇలా వివరించింది. 'దయాస్వరూపుడవైన ఓ మహారాజా నాదొక విషాద చరిత్ర. పూర్వం ఒక అగ్రహారంలో ఏడువందల మంది బ్రాహ్మణులం ఉంటూ ఉండేవాళ్లం. ఒకనాడు ఒక శివభక్తుడికి మేము చేసిన అపచారం వల్ల



అతడి శాపానికి గురైయ్యాం. వెంటనే పశ్చాత్తాపం చెంది శాపానికి విమోచనం చెప్పమని ప్రార్థించాం. అప్పుడా శివభక్తుడు పన్నెండువేల సంవత్సరాలపాటు భూతాలుగా ఉన్న తరువాత బల్లకి నగరంలో మీకు మోక్షం లభిస్తుందని చెప్పాడు. అదీ పరమ శివభక్తుడైన ఉద్భటుడు మరణించిన తరువాత అతడికి సంస్కారం జరుగుతుండగా ఆ చితి నుంచి వచ్చిన పొగ సోకి మీరు ఉత్తమ గతులు పొందగలరని శాపాంతరం చెప్పాడు. అప్పటి నుంచి మేము ఇక్కడే ఉంటూ ఉద్భటుడి మరణం కోసం ఎదురు చూస్తున్నాం. ఈ వేళ ఉద్భటుడు మరణించిన తరువాత మీరు అతడికి దహన సంస్కారాలు చేశారు. ఆ పొగసోకి మా వాళ్లంతా ఉత్తమ లోకాలకు వెళ్లగలిగారు. కానీ నేను ఒక్కడినే ఆ సమయంలో అక్కడ లేను. తిరిగి వచ్చి చూసేసరికి ఇంత ఘోరం జరిగి పోయింది' అని మళ్లీ పెద్దగా ఆ భూతం రోదించసాగింది. అప్పుడు మళ్లీ భోజుడు ఇప్పుడు నీ కష్టం పోవటానికి ఏం చేయమంటావో చెప్పు అని అడిగాడు. అప్పుడా భూతం ఉద్భటుడి శరీరానికి చెందిన కొన్ని అస్తులు ఇంకా దహనం కాకుండా అలాగే ఉన్నాయి. కనుక వాటిని మళ్లీ దహనం చేయమని ఆ పొగ సోకి తాను కూడా ఉత్తమలోకాలకు వెళతానని చెప్పింది. వెంటనే భోజుడు అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేశాడు. సంతోషంగా ఆ భూతం ఉత్తమ లోకాలకు వెళ్లిపోయింది. ఈ విషయాన్నంతటినీ చూసినవారు భోజుడు అంటరానితనాన్ని ఎందుకు పాటించలేదో, ఉద్భటుడిని గురువుగా ఎందుకు ఎంచుకున్నాడో తెలుసుకొని ఆనాటి నుంచి రాజు మార్గాన్నే వారు కూడా అనుసరించారు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## పింజం పింజం

జాతీయాలు నుడికారాలు

**మె**త్తపడిపోవటం, ధైర్యం సన్నగిల్లి పోవటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. పింజం అంటే దూది అని అర్థం. దూదిని ఏకితే బాగా మెత్తగా పలుచగా మారిపోతుంది. అంతకు ముందున్న గట్టి రూపం కనిపించదు. అలాగే ఏ సంఘటనైనా చూసి ధైర్యం కోల్పోవటంతో మనిషి మెతక పడుతుంటాడు. అలాంటప్పుడు "నా కళ్లముందే వాడిని కొడుతుండేసరికి నామనసు పింజం పింజం అయింది'. అనే లాంటి సందర్భాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది.

## పట్టాభిరామ.. రవికుల సోమ

**తిరుపతి న్యూస్‌టుడే :** తిరుపతి శ్రీ కోదండరామస్వామి పట్టాభిషేక మహోత్సవం గురువారం కనుల పండువగా సాగింది. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక నర్సింహతీర్థం నుంచి నీటిని తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. స్వామివారు ఊంజలసేవా మండపానికి ఊరేగింపుగా వేంచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. రాజముద్రిక, రాజదండం, కత్తి, ఛత్రం, పాదుకలు, చామరాలు, వజ్ర కిరీట అలంకరణతో కోదండరాముడి రాజసం మరింత ఇనుమడించింది. బుధవారం కల్యాణం జరుగుతున్న సమయంలోనే వరణదేవుడు తిరుపతిని గీష్మతాపం నుంచి శాంతింప చేశారు. రామరాజ్యంలో దేశం ఇలా సుభిక్షంగా ఉండాలనే కల్యాణాలు, పట్టాభిషేకాలు నాటి నుంచి జరుగుతున్నాయని భక్తులు తమ మనోభావాలను వక్తం చేశారు. రాత్రి బంగారు తిరుచ్చిలో సీతారామ లక్ష్మణులు, ప్రత్యేక తిరుచ్చిలో ఆంజనేయస్వామి నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఉన్నతాధికారులు హరీంద్రనాథ్, మురళీకృష్ణారెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల పట్టాభిషేక మహోత్సవం

## జగాలను పాలించే సీతారాములకు వేదాశీర్వచనం



మండపంలో కొలువైన స్వామివారు

**భద్రాచలం, న్యూస్‌టుడే:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. రాష్ట్రంలోని ప్రముఖులైన పండితులు ఇక్కడకు చేరుకుని రామయ్యను దర్శించుకుని సీతారాములకు వేదాశీర్వచనం పలికారు. పండితులు, చతుర్వేద విద్వాంసులు, వేదపండితులు వేద వేదార్థ ఉపన్యాసాలు నిర్వహించారు. దీన్నే సదస్యంగా పండితులు పేర్కొన్నారు. జగాలను ఏలే సీతారాములు మానవ రూపంలో సంచరించిన దేవతలు. ఈ నూతన దంపతులకు మంత్ర రూపంలో అందించే మహదాశీర్వచనం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం తర్వాత మంగళ ఆశీర్వచనం అందించడం ఆనవాయితీగా మారింది. స్వామివారు ఊరేగిన తీరు భక్తులచే నీరాజనాలు పలికించింది. సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు. తిరువారాధాన, బాలభోగ నివేదన, హవనం, సేవాకాలం, బలిహరణం, మంగళశాసనం వైభవంగా జరిపారు.



రామయ్యకు సదస్యం పలుకుతున్న అర్చకులు

## కన్నులపండువగా రథోత్సవం

**నల్గొండ, న్యూస్‌టుడే:** జిల్లాకేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల అనంతరం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం నుంచి రామగిరి, టూటౌన్ పోలీసుస్టేషన్, ఎన్జీ కళాశాల, ఎన్టీఆర్ చౌరస్తా నుంచి శివాజీనగర్ మీదుగా రామాలయం చేరుకుంది. నల్గొండ హన్‌మాన్ భజన మండలి, శాలిగౌరారం దుర్గాభవాని మహిళా భజన మండలి, బాలు చిన్నారుల నృత్య ప్రదర్శన, చెక్క భజన బృందాలు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## హిందూధర్మాన్ని కాపాడేవారే పాలకులు కావాలి

### స్వామి స్వరూపా నందేంద్ర సరస్వతి



పూజలు చేస్తున్న స్వామిజీ

**ఒంగోలు , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా పేర్కొనే రాజకీయ నాయకులు మైనార్టీలను బుజ్జగిస్తూ, వారి ఓట్ల కోసం వెంపర్లాడడం ఎంతవరకు సబబని విశాఖపట్టణం శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. ఒంగోలు సమీపంలోని జాతీయ రహదారిపై పెళ్లూరు వద్ద వనదుర్గ ఆలయ నిర్మాణ పర్యవేక్షణలో భాగంగా ఒంగోలు వచ్చిన ఆయనకు మంగమూరు రోడ్డు పంచముఖ గాయత్రి మందిరం వద్ద భక్తులు ఘనస్వాగతం పలికారు. మందిరంలో పూజల అనంతరం ఆయన ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికలపై స్పందించారు. యూపీఏ నాయకురాలు సోనియాగాంధీ ముస్లిం మత పెద్ద బుఖారీతో చర్చలు జరపడం హిందువులకు ఆందోళన కల్గిస్తోందన్నారు. ఆమెకు హిందువుల సంక్షేమం గురించి పట్టదా, హిందువుల హక్కుల గురించి రాజకీయ పార్టీలు ఆలోచించరా అని ప్రశ్నించారు. ప్రతి రాజకీయ పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో హిందువుల సంక్షేమం కోసం తాము తీసుకోబోయే చర్యలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. హిందువులు ఇప్పటికైనా జాగృతమై తమ మేలు కోరేవారినే పాలకులుగా ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా గోవధ నిషేధ విషయంలో పార్టీలు స్పందించాలని కోరారు. హిందూ దేవాలయాల్లో అన్యమత ప్రచారం జరుగుతున్నా, దేవాదాయ శాఖలో అన్య మతస్థులు అధికారులుగా ఉన్నా, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. శారదా పీఠం ప్రతినిధి గోవింద వఝల కామేశ్వర శర్మ, వనదుర్గ ఆలయం ప్రతినిధులు బచ్చు మాధవ, పసుమర్తి హనుమంత రావు, సముద్రాల సీతారాఘవయ్య, గాయత్రీ మందిర ప్రతినిధులు ఆలపాటి సీతారామయ్య, బొల్లాపల్లి వెంకట సుబ్బారావు, సముద్రాల సుబ్రహ్మణ్యం, నేలభట్ల సదాశివశాస్త్రి, మార్టూరు రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ వీరభద్రుల జననం



మనకు కనిపించే దేవతల్లో భద్రకాళీ వీరభద్రులు కూడా ఉన్నారు. ఈ దేవతలకు దేవాలయాలు కూడా ఉన్నాయి. ఆ దేవాలయాల్లో నిత్యం పూజలు కూడా జరుగుతుంటాయి. అయితే ఈ దేవతలు ఎప్పుడు ఆవిర్భవించారు, ఎందుకు ఆవిర్భవించారు అనే విషయం కొంతమందికి తెలిసి ఉండకపోవచ్చు. అలాంటి వారు స్కందపురాణం ఎనభై రెండో అధ్యాయం చూస్తే భద్రకాళీ వీరభద్రుల ఆవిర్భావ విశేషాలు కనిపిస్తాయి. అలాగే ఆ దేవతలిద్దరూ నెరవేర్చిన కార్యం కూడా తెలుస్తుంది. ఇదే సందర్భంలో ఉజ్జయినిలోని మహాకాలవనంలోని శివలింగ మాహాత్మ్యం కూడా ప్రకటితమవుతోంది.

ధర్మపథం

## సతి ముక్కు మర్దనంతో..

పూర్వం దక్షప్రజాపతి ఓ గొప్పయజ్ఞాన్ని తలపెట్టాడు. అంతగొప్ప యజ్ఞాన్ని చేస్తున్న దక్షుడు సాత్విక భావంతో ఉండాల్సింది పోయి గర్వంతో మధించి ప్రవర్తించసాగాడు. ఆ గర్వాహంకారాల వల్లనే లయకారకుడైన శివుడిని తప్ప దేవతలనందరినీ ఆ యజ్ఞం సందర్భంగా దక్షుడు గౌరవించాడు. ఆ తర్వాత జరిగిన పరిణామాలలో సతికి, శివుడికి బాగా కోపం వచ్చింది. సతీదేవి తన భర్తకు జరిగిన అవమానానికి రోషపడుతూ తన ముక్కును మర్దించింది. వెంటనే ఆ ముక్కు నుంచి ఒక స్త్రీ ఉద్భవించింది. నాలుగు దంతాలు, మూడు కళ్లు, వంకరలు తిరిగిన కనుబొమ్మలు, కవచానికి బిగించిన వడ్డాణం, చేతికి వేళ్లకు తోలు తొడుగులు, ఖడ్గం, ధనుస్సు, అమ్ములపొది, పతాకం కనిపించాయి. ఆ స్త్రీ మూర్తికి వేయి ముఖాలు, నూరు చేతులు, వేయి పాదాలు ఉన్నాయి. ఆమె అడుగు తీసి అడుగేస్తుంటే భూమి దద్దరిల్లింది. ఆ స్త్రీకి సతీదేవి భద్రకాళి అని పేరు పెట్టింది.

## శివపార్వతుల ఆజ్ఞతో..

ఆ వెంటనే ఈశ్వరుడు సతీదేవి మనసులోని భావాన్ని గ్రహించి వెంటనే భద్రకాళిలాగానే మహాభీకరంగా ఉండే ఒక పురుషుడిని ఉద్భవింప చేశాడు. ఆ పురుషుడికి వీరభద్రుడు అని శివుడు పేరు పెట్టాడు. ఆ వెంటనే వినయంతో తనకు నమస్కరిస్తున్న వీరభద్రుడిని భద్రకాళితో కలిసి వెళ్లి దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేయమని ఆజ్ఞాపించాడు శివుడు. భద్రకాళికి సతీదేవి మరికొంతమంది గణాలను సృష్టించి ఇచ్చింది. ఆ మాతృగణాలవారంతా తమ చేతులలో కపాలాలు, కత్తెరలు పట్టుకొని బయలుదేరారు. శివుడు వీరభద్రుడికి మరిన్ని భయంకరమైన గణాలవారిని సృష్టించి ఇచ్చారు. భద్రకాళీ వీరభద్రుల గణాలు. ఆ ఇద్దరు దేవతలు దక్షుడిని, దక్షయజ్ఞాన్ని మాత్రమేకాక ఆ యజ్ఞానికొచ్చిన దేవతలందరినీ చితకబాదారు. కాళ్లుచేతులు తెగినవారు, పళ్లూడినవారు ఇలా ఎన్నో రకాలుగా అక్కడున్న దేవతలంతా క్షతగాత్రులయ్యారు. ఆ తర్వాత శివుడు శాంతించటం, కొందరు దేవతలను అనుగ్రహించటం జరిగింది. ఆ అనుగ్రహ క్రమంలోనే కాళ్లు, చేతులు పోగొట్టుకున్నావారు, పళ్లూడిన దేవతలులాంటి వారంతా మళ్లీ సక్రమంగా వారివారి శరీరాలను పొందేందుకు శివుడు అనుగ్రహించాడు. వారందరినీ మహాకాలవనంలో ఉన్న శివలింగాన్ని దర్శించమని చెప్పాడు. ఆయా దేవతలంతా శివాజ్ఞ మేరకు ఆ శివలింగాన్ని దర్శించి వారివారి శరీరాలను చక్కగా పొందారు. ఆనాడు అలా దేవతలందరికీ తిరిగి మంచి కాయాలను (శరీరాలను) అనుగ్రహించిన కారణంగా మహాకాలవనంలోని శివలింగానికి కాయావరోహణేశ్వరుడు అనే పేరొచ్చింది. ఆ తర్వాత కాలక్రమంలో ఆ శివలింగ దర్శనం మహాపుణ్యప్రదం అని ప్రసిద్ధికెక్కింది. ఎవరి పితరులు నరకంలో ఉన్నారో వారి పుత్రులు ఆ శివలింగాన్ని దర్శిస్తే పితరులకు, వారికి మోక్షం కలుగుతుంది. ఆ శివలింగ దర్శనం ఉత్తమలోక ప్రాప్తిని కలుగచేస్తుంది. ప్రత్యేకించి ద్వాదశినాడు స్నానం చేసి కాయావరోహణేశ్వరుడిని దర్శించినవారికి బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుందని స్కందపురాణం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# చిలుక చదువు

జాతీయాలు నుడికారాలు

ఎంతవరకు చెబితే అంతవరకు మాత్రమే నేర్చుకొనేవారు అంతకంటే ఎక్కువ ఆలోచించలేరు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తుంది. అలాగే చెప్పింది చెప్పినట్లు చెయ్యటం తప్ప విశ్లేషించి పరిస్థితులను సమీక్షించి ఇంకా చెయ్యాల్సింది ఏమైనా ఉంటే చెయ్యలేని వారిని గురించి చెప్పేటప్పుడు కూడా ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది. పూర్వకాలంలో చిలుకలకు పలుకులు నేర్పించే వారని దాన్ని ఆధారంగా చేసుకొని ఈ జాతీయం వెలువడిందన్నది భావన.



రాజరాజేశ్వరీదేవికి పూజా కార్యక్రమాలు చేస్తున్న దృశ్యం

# శంకరమఠంలో లక్ష కుంకుమార్చనలు

**కొవ్వూరు (పశ్చిమగోదావరి జిల్లా), న్యూస్‌టుడే:** రాజరాజేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పాత ఊరులోని జగద్గురు శంకరపీఠంలో రాజరాజేశ్వరిదేవికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయార్చకులు దేవరకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో గణపతిపూజ, నవావరణ పూజ, 120 మంది ముత్తయిదువలతో సామూహిక లక్ష కుంకుమార్చనలు చేశారు. విశాఖపట్టణానికి చెందిన వైద్యులు వట్టిపల్లి చంద్రశేఖరరావు, నాగమణి దంపతులు పీటలపై కూర్చుని పూజాకార్యక్రమాలు చేయించుకున్నారు. అనంతరం రాజరాజేశ్వరిదేవి, దత్తాత్రేయుడు, ఇతర దేవతామూర్తులకు విశేషాలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.



గోప వాహనంపై ఊరేగుతున్న బాలాజీ

# గోపవాహనంపై ఊరేగిన బాలాజీ

**మొయినాబాద్(రంగారెడ్డి జిల్లా), న్యూస్‌టుడే:** చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని గోపవాహనంపై ఊరేగించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను అద్దాల మహల్ పక్కన ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపవాహన సేవ అనంతరం హనుమంత వాహనంపైనా ఊరేగించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

ఆంధ్రావని

# శోభాయమానంగా కుంకుమ పూజలు

**ఖమ్మం, న్యూస్‌టుడే:** శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా ఖమ్మం గాంధీచౌక్ రామాలయం వద్ద ఏర్పాటుచేసిన మండపంలో శుక్రవారం రాత్రి కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. వందల మంది

## భారీగా పాల్గొన్న మహిళలు

మహిళా భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక పండితురాలు సుగ్గల మంజులశ్రీ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. కుంకుమ పూజ జరిగినంత సేపు మంజులశ్రీ రామాయణంలోని ప్రధాన ఘట్టాలను ప్రవచించారు. ఆమె మాట్లాడుతూ కుంకుమ పూజలో దీపారాధన దీపం జ్ఞానానికి మరో రూపమని అన్నారు. మహిళలు చీకటి అనే అజ్ఞానంలో వెలుగు అనే జ్ఞానం కోసం దీపాన్ని వెలిగించి చీకట్లో దాగిన ఏ వస్తువునైనా కనుగొంటారన్నారు. దాని అర్థం మాకు జ్ఞానాన్ని ప్రసాదించు దేవుడా అని ప్రార్థించడమన్నారు. సంస్కృతం భాష మాట్లాడే వారు సంస్కరింపబడతారని అన్నారు. వేదాలను చదవాలంటే సంస్కృతం తెలిసిన వారికే అది సాధ్యమన్నారు. శ్రీరాముడికి అత్యంత ప్రీతిపాత్రులైన భక్తురాలు శబరి అని, ఆమెకు మోక్షం ప్రాప్తించినా కూడా శ్రీరాముని సేవలో తరించాలని ఆయన దర్శన భాగ్యం కోసం ఏళ్ల తరబడి కంటికి రెప్పవేయకుండా ఎదురు చూసిందని అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వజ్రపు అంజయ్య, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్ రావు పాల్గొన్నారు.



పూలతో నిండిన ఉత్సవమూర్తులు



మాట్లాడుతున్న మంజులశ్రీ



తిరుచానూరు ఆస్థాన మండపంలో శోభారాజ్ గాత్ర కచేరి

# అలరించిన శోభారాజ్ గాత్ర కచేరి

**తిరుచానూరు(చిత్తూరు జిల్లా), న్యూస్‌టుడే:** తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆస్థాన మండపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన పద్మశ్రీ శోభారాజ్ గాత్ర కచేరి భక్తులను తన్మయంతో ముంచెత్తింది. ఇందులో భాగంగా కొండలలో.. నెలకొన్న.., జయలక్ష్మి.. వరలక్ష్మి.., అలరులు కురియగ.., అందముగా.. ఆనందంగా... తదితర అన్నమయ్య సంకీర్తలను రాగయుక్తంగా ఆలపించారు. ఆస్థాన మండపం రెండు గంటల పాటు ఆధ్యాత్మిక డోలికల్లో ఓలలాడింది. శ్రీవారి వైభవాన్ని చాటుతూ ఆమె నోట జాలువారిన సంకీర్తనాగానం అందరిని అలరించింది. ఆమెకు గాత్ర సహకారాన్ని మౌతిక, నిత్య, సంపత్‌కృష్ణ అందించారు. కార్యక్రమం అనంతరం ఆమెకు తితిదే అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందజేసి, ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు.

# ఆధ్యాత్మిక ఆనందం.. అప్పన్న కల్యాణోత్సవం



**సింహాచలం (విశాఖపట్నం జిల్లా), న్యూస్‌టుడే:** చైత్రమాసం ఏకాదశి శుభవేళ సింహగిరిపై భక్తికోటి పరంధాముడు అప్పన్నస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. శుక్రవారం సాయంసంధ్య వేళ వైదికవర్గాలు ఆలయ సంప్రదాయం ప్రకారం కొట్నాల ఉత్సవం నిర్వహించి స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకవర్గాలు ధ్వజస్తంభం వద్ద గరుడ పతాకం ఎగురవేసి సకల దేవతలను కల్యాణానికి ఆహ్వానించారు. పట్టువస్త్రాలు ధరించి, బుగ్గన పెళ్లిచుక్కతో రాజధరహాసంతో తిరువీధిగా వచ్చిన అప్పన్న స్వామికి మాడవీధుల్లో జోడు భద్రాల వద్ద ఎదురు సన్నాహ ఉత్సవం వైభవంగా జరిగింది. 10 గంటలకు ఉభయ దేవేరుల సమేతుడైన స్వామిని అందంగా అలంకరించిన రథంపై ఆశీనులను చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి ఆనందగజపతిరాజు రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో వివిధ జిల్లాల కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేవతామూర్తులను కారుణ్య, కౌసల్య, సౌలభ్య, వల్లభ, వాత్సల్య, ఐశ్వర్య, ఆనంద ద్వారాల గుండా కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. ఆలయ పురోహితులు మోర్తా సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చకులు విశ్వక్సేన పూజ నిర్వహించారు. ఉభయ దేవతామూర్తుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ఉంచారు. సర్వాభరణాలతో పెళ్లిపీటలపై కొలువుదీరిన అమ్మవార్ల మెడలో అప్పన్న స్వామి మాంగళ్యధారణ చేశారు. ఆణిముత్యాలు తలంబ్రాలుగా పోశారు.

# బ్రహ్మారథంపై భక్తవత్సలుడు..!

**వాల్మీకిపురం(చిత్తూరు జిల్లా), న్యూస్‌టుడే:** బహ్మాండ నాయకుడు శ్రీరామచంద్రుని రథోత్సవం గురువారం వాల్మీకిక్షేత్రంలో కనులపండువగా జరిగింది. కల్యాణ క్రతువుతో ఒక్కటైన పుణ్య దంపతులకు శుక్రవారం ఉదయం సుగంధ ద్రవ్యాలతో ఊంజల్ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలంకృతులైనసీతారాములు మేష లగ్నంలో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మ రథాన్ని అధిరోహించారు. రామదండు ముందు కదులుతుండగా.. భక్తుల రామనామ స్మరణల ఘోష మిన్నంటగా..దేవదేవుని రథం ముందుకు కదిలింది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన వావిలిపాటి వరమూర్తి రథంపై భక్తులను ఆశీర్వదిస్తూ ముందుకు కదిలారు. దశరథ తనయుని వైభవాన్ని తిలకించేందుకు సదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో తిరువీధులు జనసంద్రమయ్యాయి. రథోత్సవానంతరం ఆలయంలో స్వామికి ధూళి ఉత్సవం నిర్వహించారు.



కనుల పండువగా సాగుతున్న రథోత్సవం

# కంటకేశ్వర మహిమ

ఈశ్వరలింగ విశేషాలలో కంటకేశ్వర లింగానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ లింగ దర్శనం వల్ల శత్రుసంహారం, కార్యసిద్ధి కలుగుతాయని నమ్మకం. ఉజ్జయినిలోని మహాకాలవనంలో ఉన్న లింగాల్లో ఒక లింగంగా కంటకేశ్వరుడిని గురించి ప్రస్తావిస్తోంది స్కంద మహాపురాణం అయిదో ఖండం రెండో భాగంలోని యాభై నాలుగో అధ్యాయం.

### శివలింగ దర్శనంతో..

ఇది కృతయుగం నాటి మాట. ఆ రోజుల్లో ధర్మబద్ధుడైన ఓ రాజు ఉండేవాడు. ఆయన చక్కగా పరిపాలన చేస్తున్నా శత్రురాజులు సమయం చూసుకొని దాడిచేసి ఓడించారు. ఆ రాజు చేసేదేమీలేక సమీప అడవులలోకి చేరాడు. ఆ అడవిలో ఆయనకొక ఆశ్రమం కనిపించింది. అది వసిష్ఠ మహర్షి ఆశ్రమం. రాజు ఆశ్రమంలోకి వెళ్లి వసిష్ఠుడికి నమస్కరించాడు. వసిష్ఠుడు తన యోగబలంతో వచ్చింది సూర్యవంశ రాజని, మంచివాడని ప్రస్తుతం కష్టాలలో ఉన్నాడని తెలుసుకున్నాడు. అంతేకాక ఆ రాజుకు తగిన అతిథి సత్కారాలన్నీ చేసి గౌరవించాడు. ఆ రాజు కూడా తనకు వచ్చిన కష్టాన్నంతా వివరించి చెప్పి కష్టాల నుంచి గట్టెక్కే తరుణోపాయాన్ని సూచించమని వేడుకొన్నాడు. వసిష్ఠుడు రాజును మహాకాలవనానికి వెళ్లమన్నాడు. అక్కడ పృథుకేశ్వర లింగానికి దక్షిణంగా ఒక శివలింగం ఉందని, అక్కడొక ముని ఉంటాడని, ఆయన దగ్గరకు వెళ్లమని చెప్పాడు. వసిష్ఠుడి మాట ప్రకారం ముని దగ్గరకు వెళ్లి నమస్కరించాడు రాజు. రాజును చూడగానే ముని



విషయమంతా గ్రహించాడు. అంతేకాక ఆ రాజు తనకు గత ఏడు జన్మలలో చేసిన ఉపకారాన్నంతటినీ ఒక్కసారి గుర్తుకు తెచ్చుకున్నాడు. ఉపకారికి ఎలాంటి పరిస్థితులలోనైనా ప్రత్యుపకారం చేసి తీరటమే ధర్మం. గతంలో రాజుకు ఉపకారం చేసే అవకాశం దొరకలేదు. ఇప్పుడు దొరికింది కనుక చేసి తీరాలి అని అనుకొన్నాడు ముని. వెంటనే తన మనసులోని మాటను రాజుకు కూడా చెప్పి తనకు సమీపంలో ఉన్న శివలింగానికి నమస్కరించమన్నాడు. అదే సమయంలో ఆ శివలింగ మహిమను దానితోపాటు తన తపశ్శక్తి మహిమను కూడా రాజుకు చూపించాలనుకున్నాడు ముని. ఆ వెంటనే ముని హూంకారాలు చేశాడు. అప్పుడు అప్సరస కన్యలొచ్చి రాజుకు సకల పరిచర్యలు చేశారు. ఇంతలోనే పక్కనున్న శివలింగం నుంచి ప్రళయ కాలం మొదలు సృష్టి జరుగుతున్న తీరంతా కనిపించింది. మళ్లీ అంతలోనే అక్కడొక అందమైన భవనం ప్రత్యక్షమైంది. ఆ మరుక్షణం అక్కడొక పెద్ద శబ్దం వినిపించింది. శబ్దం వచ్చిన ప్రాంతం నుంచి ఇద్దరు స్త్రీలు బయటకొచ్చారు. వారిలో ఒకామె తెల్లని వస్త్రాలను, మరొకామె నల్లని వస్త్రాలను ధరించి కనిపించారు. ఇదేమిటా అని అనుకొనేంతలో మళ్లీ శబ్దం వినిపించింది. ఆ శబ్దం వచ్చిన చోటు నుంచి ఒక మహా పురుషుడు ఉద్భవించాడు. అతడికి రెండు మెడలు, ఆరు ముఖాలు, పన్నెండు పాదాలు ఉన్నాయి. మళ్లీ శబ్దం వినిపించింది. ఈసారి విచిత్రంగా ఏడు భాగాలుగా ఉన్న ఒక పురుషుడు కనిపించాడు.

### కాలచక్ర స్వరూపం

ఈ విచిత్రాలన్నీ రాజుకు ఇలా కనిపించి అలా మాయమైపోయాయి. రాజు ఆసక్తిగా ముని వంక చూస్తూ ఆ కనిపించిందంతా ఏమిటని అడిగాడు. అప్పుడాముని వివరణ ఇచ్చాడు. కనిపించిన నల్లని, తెల్లని వస్త్రాలను ధరించిన స్త్రీలు రేయింబవళ్లు. పురుషుడికి ఉన్న రెండు మెడలు రెండు అయనాలు. ఆరు ముఖాలు ఆరు రుతువులు. పన్నెండు పాదాలు పన్నెండు మాసాలు. ఏడు భాగాలుగా కనిపించిన పురుషుడు సప్తసముద్రాలుగా విడిపోయిన ఒకే మహా సముద్రం. ఇదంతా సంవత్సర స్వరూపమైన కాలచక్రం. ఈ కాలమంతా ఈ మహాకాలవనంలోని శివలింగ ప్రభావమే. ఆ లింగ దర్శనాన్ని చేసుకుంటే మనిషికి కంటకాలైన కష్టాలు, శత్రువులు నశించి కార్యసిద్ధి జరుగుతుంది. కనుక ఆ శివలింగాన్ని దర్శించుకోమని రాజుకు ముని చెప్పాడు. రాజు శివలింగాన్ని దర్శించి నమస్కరించాడో లేదో అంతలోనే ఆయనకొక వర్తమానం వచ్చింది. అతడిని ఓడించిన శత్రువులందరూ నశించారని, వెంటనే రాజ్యాన్నికొచ్చి అధికారాన్ని చేపట్టాలన్నదే ఆ సందేశం. ఆరోజు నుంచి ఆ శివలింగానికి కంటకేశ్వరుడు అనే పేరొచ్చింది. తనను దర్శించుకొన్నవారి కంటకాలన్నీ నశింపచేస్తాడు కనుక అలా ఆ పేరు ఆయనకు స్థిరపడింది. ఈ కథాసందర్భంలో దైవభక్తి సంబంధమైన అంశాలతోపాటు మన మునుల మహిమ స్పష్టమవుతుంది. అలాగే మేలు చేసిన వారికి ప్రత్యుపకారాన్ని చేసి తీరాలనే ఓ సామాజిక సందేశం కూడా ఇక్కడ కనిపిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## ఏడేళ్లకే ఎంత కష్టం
### దాతల కోసం ఎదురుచూపు

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ఆ బాలుడికి ఏడేళ్ల వయసులోనే పెద్ద కష్టం వచ్చింది. మూత్రపిండాలు, కాలేయ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. పలు రకాల పరీక్షలు చేయించగా చివరికి నిమ్స్ ఆసుపత్రి వైద్యులు మరికొన్ని పరీక్షలు చేయించాలని సూచించారు. కాకినాడ- సామర్లకోట రోడ్డులోని ప్రతాప్‌నగర్ వంతెన సమీపంలో నివాసముంటున్న సత్యలక్ష్మికి ఇద్దరు కుమారులు. ఆమె భర్త వడ్రంగి పనిచేసేవాడు. ఆరేళ్ల క్రితం భార్యా పిల్లలను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. పెద్ద కుమారుడు ఏడేళ్ల సత్యానందంకు పచ్చకామెర్లు సోకాయి. అనేక ఆసుపత్రులకు తిప్పిన అనంతరం చివరికి నిమ్స్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. దీనికి సంబంధించిన పరీక్షలు ముంబాయిలో చేయించాలని అక్కడి వైద్యులు సూచించారు. రూ.12 వేల ఖర్చవుతుందని తెలిపారు. సత్యానందం ఏమైనా తింటే మరుక్షణం వాంతులు చేసుకుంటున్నాడు. అప్పుడప్పుడూ రక్తం పడుతోంది. ఆ కుటుంబానికి కూలి పనులే ఆధారం. సత్యలక్ష్మి ప్రస్తుతం తన ఇద్దరు కుమారులతోపాటు ఆమె తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. దాతలు తన బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడి ఆదుకోవాల్సిందిగా సత్యలక్ష్మి ప్రాధేయపడుతోంది.



సత్యానందం



చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని గరుడ వాహనంపై ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో గోవింద నామస్మరణ మారుమోగింది. – మెయినాబాద్, రంగారెడ్డి జిల్లా, న్యూస్‌టుడే

## జాతీయస్థాయి చిత్రకళా ప్రదర్శనలో పురస్కారం

**ఒంగోలు , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా ప్రదర్శనలో ఒంగోలులోని సృష్టి ఆర్ట్ అకాడమీ విద్యార్థిని చెరువు శ్రీలక్ష్మి చిత్రించిన కొండకోన అనే పెయింటింగ్‌కు చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మిని సన్మానించారు. పురస్కారం సాధించిన సందర్భంగా సృష్టి ఆర్ట్ అకాడమీ కార్యదర్శి తిమ్మిరి రవీంద్ర ఆ విద్యార్థిని అభినందించారు. గతంలో కూడా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు.




శ్రీలక్ష్మికి పురస్కారం అందజేస్తున్న అమీర్ ఆర్ట్ అకాడమీ ప్రతినిధులు

## కనులపండువగా ఊంజల్ సేవ

**ఖమ్మం, న్యూస్‌టుడే:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా భద్రాచలం రామాలయంలో శ్రీసీతారామచంద్రుల వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈవో రఘునాథ్ పర్యవేక్షణలో సీతారామచంద్రులకు ఊయల సేవ నిర్వహించారు. దీన్నే ఊంజల్ సేవ అని కూడా అంటారని ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు తెలిపారు. ఈ వేడుక కడురమణీయంగా సాగింది. స్వామిని ఆ ఊయలలో వేంచేయింపజేసి ఉపచార కీర్తనలు ఆలపించారు. ఆస్థాన విద్వాంసులు ఆలపించిన కీర్తనలు అదరహో అనిపించాయి.



స్వామివారి ఊయల సేవలో అర్చకులు

## టాటాలు గుణించటం

తల పొగరుగా ప్రవర్తించటం, నాకేంటట అన్న తీరులో నిర్లక్ష్యంగా వ్యవహరించటం అనేలాంటి అర్థాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. ఎవరెటుపోతే ఏమిటి? అయినా నాకేంటట. ఆ పని చెయ్యకపోతే నన్నెవరేం చేస్తారట అని అనుకొనే తీరును తెలిపేందుకు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.

## తెప్పలపై కోదండరాముడు
### రామచంద్ర పుష్కరిణిలో ప్రారంభమైన తెప్పోత్సవాలు

**తిరుపతి, న్యూస్‌టుడే:** తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామి తెప్పోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం తిరుపతి రామచంద్ర పుష్కరిణిలో సీతారామలక్ష్మణులు విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులై ఐదు పర్యాయాలు తిరిగి భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో తితిదే స్థానిక ఆలయాల ఉపకార్య నిర్వహణాధికారి హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.





తెప్పలపై విహరిస్తున్న సీతాలక్షణ సమేత శ్రీరాముడు (అంతరచిత్రం)లో స్వామివారు

# భార్య ఉంటేనే చెల్లుబాటు!

మానవ లోకంలోనే కాదూ దేవలోకాల్లోనూ పురుషులు చెల్లుబాటు కావాలంటే వారి పక్కన భార్యలు ఉండాల్సిందే అనే ఈ విషయం కొంత ఆశ్చర్యాన్ని కలిగించినా ఇది మాత్రం వాస్తవం అని అంటోంది బ్రహ్మవైవర్త మహాపురాణం ప్రకృతిఖండం ఒకటో అధ్యాయంలోని ఈ కథాంశం. కొంతమంది దేవతలు కొన్నికొన్ని కార్యాలను సఫలం చేయాలంటే వారి భార్యల మీద ఆధారపడి తీరాల్సిందే. ఎందుకంటే ఆ దేవతల భార్యలంతా ప్రకృతికి సంబంధించిన అంశాస్వరూపలు. ఈ క్రమంలో చూస్తే మొదటిగా భార్య మీద ఆధారపడింది సాక్షాత్తూ అగ్నిదేవుడే. ఆయన భార్య పేరు స్వాహాదేవి. యజ్ఞంలో ఆమె లేకుండా హవిస్సులిస్తే దేవతలు ఆ హవిస్సులు తీసుకోలేరు. దక్షిణాదేవి యజ్ఞుడి పత్ని. ఆమె పక్కన లేకపోతే సమస్త కర్మలూ నిష్ఫలం అవుతాయి. స్వధాదేవి పితృ పత్ని. స్వధాకారం లేకుండా పితృకర్మలలో చేసే దానం లాంటివన్నీ వ్యర్థమవుతాయి. వాయువు భార్య స్వస్తిదేవి. ఆమె లేకుండా చేసిన ఆ దాన ప్రదానాలు వ్యర్థమవుతాయి. షష్టిదేవి గణపతి భార్య. అనంతుడి భార్య పేరు పుష్టిదేవి. సంపత్తి ఈశ్వరుడి భార్య. ధృతి కపిలమహర్షి భార్య. క్షమ యముడి భార్య. క్షమ లేకపోతే సమస్తలోకాలు కోపంతో పిచ్చెక్కినట్లు ఉంటాయి. రతిక్రీడకు అధిష్టానదేవత రతీదేవి. రతికేళి కౌతుకానికి కారణమైన ఈమె మన్మథుడి భార్య. సత్యానికి భార్య ముక్తి. అలాగే మోహానికి దయ పత్ని. ప్రతిష్ఠాదేవి పుణ్యానికి పత్ని. పేరు ప్రతిష్టలకు కారణభూతురాలైన కీర్తిదేవి సుకర్మ భార్య. క్రియాదేవి ఉద్యోగ పత్ని.



### కలియుగంలోనే ఆమెకు రూపం

మిథ్యాదేవి అధర్ముడి భార్య. ఈమె విశేషమేమంటే కృతయుగంలో ఈమె కనిపించదు. త్రేతాయుగంలో సూక్ష్మరూపంలోనూ, ద్వాపరయుగంలో ముడుచుకొనిపోయి అర్ధాయవాలతోనూ, కలియుగంలో మాత్రం స్పష్టంగా, సర్వాంగాలతోనూ కనిపిస్తూ ఉంటుంది. ఈమెకు కపటుడు అనే సోదరుడు కూడా ఉన్నాడు. అతడితో కలిసి ఇంటింటికీ ఈమె ఎప్పుడూ తిరుగుతూనే ఉంటుంది. శాంతి, లజ్జ అనేవారు సుశీలుడి భార్యలు. బుద్ధి, మేధ, స్మృతి అనే ముగ్గురూ జ్ఞానదేవుడికి భార్యలు. ఎంతో అందంగా శాంతరూపంతో కనిపించే మూర్తీదేవి ధర్ముడి పత్ని. ఈమె లేకపోతే సమస్తలోకాలు, పరమాత్మ కూడా నిరాధారుడైపోతారు. ఎంతో కాంతిగా ఉండే ఆమె లక్ష్మీదేవి స్వరూపిణి. ఈమె శ్రీ అనే రూపంలో కూడా ఉంటూ అందరి గౌరవాలను అందుకొంటూ ఉంటుంది. నిద్రాదేవి కాలాగ్ని రుద్రుడి భార్య. ఈ తల్లి మాయలో సమస్తలోకాలు రాత్రివేళల్లో మునిగిపోతూ ఉంటాయి. సంధ్య, రాత్రి, దినం అనే ముగ్గురూ కాలం భార్యలు. క్షుత్, పిపాసలు (ఆకలిదప్పులు) లోభదేవత భార్యలు. ప్రభ, దాహికా అనే ఇద్దరూ తేజస్సుకు భార్యలు. కాలుని కుమార్తెలైన మృత్యు, జర అనే ఇద్దరూ ప్రజ్వలుడి భార్యలు. నిద్రాదేవి కూతురైన తంద్ర సుఖదేవుడి భార్య. సుఖదేవుడికే ప్రీతి అనే మరో భార్య కూడా ఉంది. శ్రద్ధ, భక్తి అనే ఇద్దరూ వైరాగ్యుడి భార్యలు. అలాగే దేవతలందరికీ తల్లి అయిన అదితి, గోవులకు మాత అయిన సురభి, దైత్యులకు తల్లి అయిన దితి, నాగులమాత కద్రువ, గరుత్మంతుడి తల్లి వినత, వీరి సపత్ని దనువు అనే వారంతా సృష్టిక్రమంలో ఎంతో ప్రధాన బాధ్యతను నిర్వర్తించారు. వీరంతా ప్రకృతికి సంబంధించిన సూక్ష్మాంశ స్వరూపాలు. వీరు పక్కన లేకపోతే వీరి భర్తలకు పెద్ద గుర్తింపు ఉండేదికాదు.

### స్త్రీలంతా లక్ష్మీదేవి సూక్ష్మాంశలే...

అలాగే రోహిణీదేవి చంద్రుడి భార్య. సంజ్ఞాదేవి సూర్యుడి భార్య. శతరూప మనువు పత్ని. ఇంద్రుడి భార్యపేరు శచీదేవి. తార బృహస్పతి భార్య. అరుంధతి వసిష్ఠుడి భార్య, అహల్యాదేవి గౌతమ మహర్షి ఆలి. ఇలా ఈ దంపతుల వరుసలో ఉన్న భార్యలు ఎంతో ప్రధాన పాత్ర వహిస్తుంటారు. పార్వతీదేవిని కన్న మేనక, లోపాముద్ర, హోలీ, వరుణాని, యమపత్ని, వింధ్యావళి, కుంతి, దమయంతి, యశోద, దేవకీదేవి, గాంధారి, ద్రౌపది, సత్యవంతుడి భార్య సావిత్రి, రాధకు తల్లి అయిన కళావతి, మండోదరి, కౌసల్య, సుభద్ర, కైకేయి, రేవతి, సత్యభామ, కాళింది, లక్ష్మణ, మిత్రవింద, నాగ్నచ్ఛీజిజితి వీరంతా వారివారి భర్తల సరసన ఉండి సకల కార్యాలను ఫలవంతం చేస్తుంటారు. సాక్షాత్తూ లక్ష్మీదేవి స్వరూపిణులైన సీత, రుక్మిణి, అలాగే వ్యాసుడి తల్లి అయిన యోజనగంధి, బాణాసురుడి కూతురు ఉషాదేవి, ఆమె స్నేహితురాలు చిత్రలేఖ, ప్రభావతి, భానుమతి, మాయావతి, పరశురాముడి తల్లి రేణుకాదేవి, బలరాముడి తల్లి రోహిణిదేవి, శ్రీకృష్ణుడికి సోదరి అయిన దుర్గ ఇలాంటి వారంతా ప్రకృతికి సంబంధించిన అంశాస్వరూపలు. వీరితోపాటుగా ఎందరెందరో గ్రామదేవతలు ఇలాంటి వారంతా ప్రకృతి సుక్ష్మాంశతో ఆవిర్భవించినవారే. అందుకనే యజ్ఞయాగాది శుభకార్యాలు జరిపేటప్పుడు వీరంతా వారి భర్తల పక్కన ఉన్నప్పుడే శుభకార్యలన్నీ విజయవంతం అవుతుంటాయి. అంటే ఆయా దేవతల భార్యలను గౌరవించకుండా చేసిన పనులేవీ ఫలవంతం కావు. భూలోకంలో స్త్రీలు కూడా లక్ష్మీదేవి సూక్ష్మాంశతో జన్మించిన వారేనంటారు. అందుకే దంపతి తాంబూలాలు, దంపతి పూజలువంటి వాటిలో ఈనాటికీ తప్పనిసరిగా ముందుగా స్త్రీలకు గౌరవం లభిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

ధర్మపథం



## వైభవంగా 1008 కలువల పూజ

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** చైత్ర శుద్ధ త్రయోదశి, లక్ష్మీదేవి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పాలకొల్లులోని అష్టభుజలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 1008 కలువలతో విశేష పూజలు, లక్ష మల్లెల పూజ వైభవంగా నిర్వహించారు. కరివెంకట శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు పూలపల్లి కృష్ణమాచార్యులు, ఆళ్వార్లు వైష్ణవ సంప్రదాయం ప్రకారం అమ్మవారికి నిత్యార్చన, ధూపసేవ, బాలభోగం, సహస్రనామార్చన, తీర్థప్రసాదగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అష్టభుజలక్ష్మీనారాయణ స్వామివారికి స్నపన, తిరుమంజనసేవ, తిరుక్కల్యాణం వైభవంగా నిర్వహించారు.

## చేతడి ఆరేంతలో

జాతీయాలు నుడికారాలు

చేతికి తడి అయితే అది ఆరటానికి చాలా తక్కువ సమయమే పడుతుంది. ఈ భావనే ఈ జాతీయ ఆవిర్భావానికి వేదిక. అతితక్కువ సమయంలో జరిగిన పని, జరగాల్సిన పని అని చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని అందుకే వాడుతుంటారు. 'చేతడి ఆరేంతలోనే ఈ పని వాడు పూర్తి చేసుకొస్తాడు. మరేం భయం లేదు' అనే లాంటి ప్రయోగాలున్నాయి.

## గుట్టలో భక్తుల కోలాహలం

**నల్గొండ, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనులతో కోలాహలం నెలకొంది. సెలవురోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు క్షేత్ర సందర్శనకు రావడంతో తిరువీధులు సందడిగా మారాయి. యాత్రీకుల వాహనాలతో పట్టణ వీధులు రద్దీగా మారాయి. భక్తుల సందడితో వేకువ జాము 3గంటలకే సుప్రభాతం చేపట్టి ఆలయ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తుల ఆర్జిత పూజల నిర్వహణతో వ్రతమండపం సందడిగా ఏర్పడింది. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను పలువురు భక్తులు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక దర్శనాల కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. దేవుని దర్శనం కన్నా ప్రసాదాల కొనుగోలుకు పలువురు భక్తులు పోటీ పడ్డారు. కొండపైనే ఉన్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరుడి ఆలయాని పలువురు భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ వీధుల్లో ఏర్పాటు చేసిన చలువ పందిర్ల కింద భక్తులు సేదతీరారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవార్ల తిరువీధి సేవోత్సవంలో పలువురు భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులను పొందారు.

## చంద్రప్రభ వాహనంపై వేణుగోపాలుడు

**నెల్లూరు , న్యూస్‌టుడే :** నెల్లూరు మూలాపేటలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన చంద్రప్రభ అలంకారోత్సవం నేత్రానందంగా సాగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యాళి ఉత్సవం వైభవంగా జరిగింది. తొలుత మూలవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అలంకరణలో స్వామి

ఆంధ్రావని

## పుష్కరిణిలో సీతారామలక్ష్మణుల విహారం

**తిరుపతి , న్యూస్‌టుడే :** తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామి తెప్పలపై విహరించడం భక్తులను ఆలరించింది. శ్రీ రామచంద్ర ఉద్యానవన పురష్కరిణిలో సీతారామలక్ష్మణులు.. పుష్పాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించిన తెప్పలపై ఆశీనులై ఐదు పర్యాయాలు తిరిగి భక్తులకు ఆశీస్సులు అందించారు. ఈ తెప్పోత్సవం అనంతరం స్వామివారు ఊరేగింపుగా శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చేరుకున్నారు.

## కనులపండువగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం శ్రీదేవి-భూదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. దేవతా మూర్తులను అందంగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు. కల్యానాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామి వారి పెళ్లికి వచ్చిన భక్తులు కట్నకానుకలు సమర్పించారు. అంతకు ముందు ఉదయం నిత్యహవనం, పూర్ణాహుతి, పెళ్లి కుమారున్ని తయారు చేసే కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు హన్మంతరావు, ఉపాధ్యక్షుడు ముత్యంరెడ్డి, గ్రామాభివృద్ధి సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తున్న సీతారామలక్ష్మణులు

# ద్వాదశి ఉపవాసాలూ మహావిష్ణుకు ప్రీతికరమే!



విష్ణుభక్తులు ఏకాదశినాడు ఉపవాసం ఉండటానికి ఇష్టపడుతూ ఉంటారు. ఎందుకంటే ఏకాదశి తిథి శ్రీమహావిష్ణువుకు బాగా ఇష్టమని పెద్దలు చెప్పటం వల్ల. అయితే మహాభారతం అనుశాసన పర్వంలో మరో అంశం కూడా ఉంది. శ్రీమహావిష్ణువుకు ఏకాదశి మాత్రమే కాదూ ద్వాదశి అన్నా ఇష్టమే. సంవత్సరం పొడవునా వచ్చే ద్వాదశులలో ఉపవాసం ఉన్నందువల్ల కలిగే పుణ్యఫలితాన్ని గురించి అనుశాసన పర్వంలో స్వయంగా విష్ణువు చెప్పిన విషయాన్ని భీష్ముడు ధర్మరాజుకు ఇలా వివరించాడు. చైత్రమాసంలో ద్వాదశి నాడు రోజంతా ఉపవాసం ఉండి విష్ణునామాన్ని స్మరించే వారికి పౌండరీక యాగఫలం దక్కుతుంది. ఆ యాగఫలంతో మరణానంతరం దేవలోక ప్రాప్తి కూడా కలుగుతుంది. వైశాఖ మాసంలో ద్వాదశి నాడు రోజంతా ఉపవాసం ఉండి మధుసూదనుడిని పూజించిన వారికి అగ్నిష్టోమ యాగఫలం దక్కి సోమలోకప్రాప్తి కలుగుతుంది.

### అతిరాత్ర యజ్ఞం చేసినంత పుణ్యం

జ్యేష్ఠమాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసం ఉండి త్రివిక్రముడిని అర్చించిన వారికి గోమేధ యాగఫలం లభిస్తుంది. ఆషాడ ద్వాదశి నాడు ఉపవాసం ఉండి వామనుడిని అర్చించిన వారు నరమేధ యాగఫలాన్ని దక్కించుకొంటారు. శ్రావణ ద్వాదశినాడు రోజంతా ఉపవాసం ఉండి శ్రీధరుడిని పూజిస్తే పంచమహాయజ్ఞాలు చేసినంత పుణ్యఫలం వస్తుంది. భాద్రపద మాసంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి హృషీకేశుడిని అర్చించాలి. అలా చేస్తే సౌత్రామణియాగఫలాన్ని పొందవచ్చు. ఆశ్వయుజ మాసంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి పద్మనాభనామస్మరణ చేయాలి. అలా చేస్తే వేయి గోవులను దానం ఇచ్చిన పుణ్యఫలం దక్కుతుంది. కార్తిక మాసంలో ద్వాదశినాడు రోజంతా ఉపవాసం ఉండి దామోదరుడిని అర్చించిన వారికి గోయజ్ఞఫలం లభిస్తుంది. మార్గశిర మాసంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి కేశవుడిని అర్చిస్తే అశ్వమేధ యాగఫలం పొందవచ్చు. పుష్యమాసంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి నారాయణుడిని పూజించాలి. అలా చేస్తే వాజపేయ యాగఫలం దక్కుతుంది. మాఘమాసంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి మాధవుడిని పూజించాలి. అలా పూజచేసిన వారికి రాజసూయ యాగఫలం లభిస్తుంది. ఫాల్గుణ మాసంలో ద్వాదశి నాడు ఉపవాసం ఉండి గోవిందా అంటూ నామస్మరణ చేస్తూ గోవిందుడిని అర్చించాలి. అలా అర్చించిన వారికి అతిరాత్రయాగం చేసినంతటి పుణ్యఫలం ప్రాప్తిస్తుంది. ఇలా సంవత్సరం పొడవునా వచ్చే ద్వాదశులలో పుండరీకాక్షుడిని అర్చించే వారికి గత జన్మస్మృతి కలుగుతుంది. దాంతో పాటు పుష్కలంగా బంగారం ప్రాప్తిస్తుంది.

### రోజూ అర్చించినా ఆయన కృప...

ఇదేకాక ప్రతిరోజూ విష్ణువును అర్చించే వారికి శ్రీమహావిష్ణు కృప కలుగుతుంది. సంవత్సరం పొడవునా ద్వాదశి ఉపవాసాలుండి వ్రతం చేసినవారు వ్రత సమాప్తి వేళలో వేదపండితులకు భోజనం పెట్టాలి. లేదా నెయ్యిని దానం ఇవ్వాలి. ఇది మహోన్నతమైన పుణ్యఫలాన్ని సులభంగా ప్రసాదించే ద్వాదశీ వ్రతవిధానం. ఈ వ్రతమంటే తనకు అమితమైన ఇష్టమని శ్రీమహావిష్ణువు స్వయంగా చెప్పినట్టు కురువృద్ధుడైన భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు. విష్ణుసహస్రనామాలను ఆ నామాల పారాయణ మహిమను ధర్మరాజుకు వివరించిన భీష్ముడే ఈ విషయాన్ని ప్రకటించాడంటే ద్వాదశీవత్రం ఎంత పుణ్యప్రదమైందో అన్న విషయం ఎవరికైనా సులభంగానే స్పష్టమవుతుంది. కొంతమంది విష్ణుభక్తులు ఏకాదశినాడు ఉపవాసం ఉండి విష్ణుపూజ చెయ్యలేని పరిస్థితులు ఒక్కోసారి కారణాంతరాలవల్ల వస్తుంటాయి. ఆ పరిస్థితులు అనివార్యాలైనపుడు అయ్యో ఈసారి ఏకాదశి ఉపవాసం ఉండలేకపోయామేనని బాధపడనవసరం లేదు. మహాభారతం అనుశాసన పర్వంలోని ఈ విషయాన్ని గమనిస్తే ద్వాదశినాడైనా సరే ఉపవాసం ఉండి ఆయా మాసాలకు అనుగుణంగా చెప్పిన విష్ణునామాన్ని స్మరిస్తూ పూజచేసి మంచి పుణ్యఫలితాలనే పొందవచ్చు. భారతీయ సనాతన సంప్రదాయంలో ఉపవాస సహిత భగవంతుడి పూజకు ఉన్న ప్రాధాన్యాన్ని, విలువను ఇలా ఈ కథా సందర్భం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## ఘనంగా పుష్పయాగం

**శ్రీకాకుళం, న్యూస్‌టుడే:** అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామికి పుష్పయాగం వేడుకను ఘనంగా నిర్వహించారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చైత్రశుద్ధ పౌర్ణమి రోజున సుమంగళి అర్చన, నీలమణిధారణ, నాకబలి ప్రయుక్త చక్రతీర్థం నిర్వహించారు. తిరువీధి అనంతరం ఉత్సవమూర్తులకు ఆలయ ప్రవేశాన్ని గావించారు. ధ్వజావరోహణం, పుష్పయాగ మహోత్సవం, విశేష అర్చన ఘనంగా జరిగింది. ఆలయ ఉత్సవ మూర్తులను అర్చకులు ఇంద్రపుష్కరిణిలో చక్రతీర్థ స్నానాలను నిర్వహించారు. ముందుగా ఆలయ సహస్ర దీపాలంకరణ మండపంలో ఉషాపద్మినీఛ్చాయ సమేత శ్రీసూర్యనారాయణస్వామి ఉత్సవమూర్తులకు ఊయలలో ఉంచి నాకబలి ప్రత్యేక పూజలు చేశారు.

# హోరెత్తిన హనుమనామం



ర్యాలీలో అభయమిస్తున్న భారీ హనుమాన్ విగ్రహం

**ఈనాడు, హైదరాబాద్:** 'జై బోలో హనుమాన్ కీ జై..' నినాదాలతో నగర ప్రధాన రహదారులు హోరెత్తాయి. యువకుల నృత్యాలు, కాషాయ జెండాల రెపరెపల మధ్య హనుమాన్ జయంతి ఊరేగింపు కనులపండువగా జరిగింది. ఎన్నికల నేపథ్యంలో జంట నగరాల పోలీసుల ఒత్తిడితో ఈ కార్యక్రమం క్రితంసారి కంటే రెండు గంటల సమయం ముందే పూర్తయింది. ఉదయం 10 సమయంలో గౌలిగూడ రామమందిరంలో యజ్ఞంతో ఊరేగింపు ప్రారంభమైంది. వేలాది మంది యువకులు వందల వాహనాల్లో కాషాయజెండాలు చేబూని ఊరేగింపులో పాల్గొన్నారు. కోఠి, నారాయణగూడ, చిక్కడపల్లి మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్డు, అశోక్‌నగర్ మీదుగా ర్యాలీ సాగింది. నగర పోలీసులు సుమారు 13వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తు చేపట్టారు. కోఠి, అశోక్‌నగర్ వైపు బస్సులను నియంత్రించి ఊరేగింపునకు ఆటంకం లేకుండా చూశారు. ఎక్కడా ప్రసంగాలకు అనుమతి లేకపోవడంతో ఊరేగింపు త్వరగానే ముందుకు సాగుతూ భన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట ఠాణా, ప్యారడైజ్ మీదుగా సాయంత్రం 5 గంటలకే సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌కు చేరుకుంది. అక్కడ జరిగిన బహిరంగ సభలో వీహెచ్‌పీ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, రాఘవరెడ్డి యువతనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం తాడ్‌బన్ హనుమాన్ ఆలయానికి చేరుకోవడంతో ఊరేగింపు ముగిసింది.

## అయిదు పది చేయటం

ఆరు నూరు కావటం అనేలాంటిది కాదిది. అది ఎంతటి అసాధ్యమైనా సరే సాధ్యం చేయటం అనే అర్థంలో వాడుతుంటారు. కానీ ఈ జాతీయానికి, ఆరు నూరు కావటానికి సంబంధం ఏదీలేదు. సంఖ్యాపరంగా ఒకే పోలికలాగా కనిపిస్తాయంతే. మనిషి చేతికి అయిదు వేళ్లుంటాయి. రెండు చేతులకు కలిపి పదివేళ్లుంటాయి. రెండు చేతులను జోడించటమంటే నమస్కరించటం అవుతుంది. ఈ భావంలో అయిదు పది చేయటం లేదా అయిదు పది కావటమంటే ఒకరు మరొకరికి వినయంగా భక్తిపూర్వకంగా రెండు చేతులను జోడించి నమస్కరించారనే అర్థం ప్రకటితమవుతుంది.

# వేడుకగా రంగనికి వసంతోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత
శ్రీరంగనాథస్వామి

**నెల్లూరు , న్యూస్‌టుడే:** నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం శ్రీస్వామివారి వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయం ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, నిషింద సుదర్శనాచార్యులు తదితర అర్చకులు స్వామివారికి తిరుమంజనం అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి సన్నిదిలో అర్చకులు నిర్వహించిన వేదపారాయణం భక్తిరసమయంగా జరిగింది. అనంతరం స్వామి వారికి ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అంజన్న క్షేత్రం భక్తజన సంద్రం

**కరీంనగర్, న్యూస్‌టుడే:** కొండగట్టు అంజన్న జయంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన దీక్షాపరులు, భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మంగళవారం చిన్న హన్మాన్ జయంతి సందర్భంగా దీక్షాపరులు విశేషంగా హాజరయ్యారు. అసౌకర్యాల మధ్య దీక్షాపరులు స్వామి వారిని దర్శించుకొని వెళ్లగా, కొందరు భక్తులు క్యూలైన్లో నిలబడలేక మెట్ల వద్దే టెంకాయలు కొట్టి వెళ్లిపోయారు.



ఆలయ ఆవరణలో యాగం చేస్తున్న దీక్షాపరులు

## ఘనంగా చక్రతీర్థం



**రాజమండ్రి. తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా చక్రతీర్థస్నానం కార్యక్రమం నిర్వహించారు. గౌతమి గోదావరిలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు.

# అమ్మవారికి కుంభకూడు ఉత్సవం

**అనంతపురం, న్యూస్‌టుడే:** అమడగూరులోని శ్రీచౌడేశ్వరి అమ్మవారి మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మహోత్సవాలను ఎనిమిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. మొదటిరోజు మంగళవారం రాత్రి నిర్వహించిన కుంభకూడు ఉత్సవాన్ని తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఆలయంలోని అమ్మవారి మూల విరాట్ ఎదుట నవ ధాన్యాలను కలిపి వండిన వంటకాన్ని రాశిగా పోసి పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అన్నంరాశికి బలిదానం సమర్పిస్తారు. ప్రత్యేక పూజలు చేసిన కుంభకూడును భక్తులు తమ పొలాలు, వ్యాపార, ఇంటి ప్రాంగణాల్లో చల్లుకుంటారు. ఎలాంటి అరిష్టాలు జరగకుండా అమ్మవారు రక్షిస్తుందని భక్తులు, ప్రజల నమ్మకం. అందుకే అమ్మవారికి సమర్పించిన కుంభ కూడును తీసుకోవడానికి ప్రజలు పోటీలు పడ్డారు. ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై రమేష్ రెడ్డి అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వెంకటేష్, నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



చౌడమ్మ తల్లికి
ప్రత్యేక అలంకారం



అమ్మవారి ఎదుట ఏర్పాటు చేసిన కుంభకూడు

# ఆ తల్లిని మించిన దైవం లేదు!

గాయత్రీ మాత సకల విశ్వానికీ అధిదేవత. గాయత్రీ జపంవల్ల భక్తుడు మేలు పొందగలుగుతాడు. అందుకే ఒక్క మాటలో చెప్పాలంటే గాయత్రీమాతను మించిన శక్తికానీ, దైవంకానీ మరిలేదు అని వివరించే కథాసందర్భం ఇది. దేవీభాగవతం పన్నెండో స్కంధం ఎనిమిదో అధ్యాయంలో ఈ విషయాలన్నీ ఉన్నాయి. పూర్వం దైత్యులకు, దేవతలకు చాలా కాలంపాటు యుద్ధం జరిగింది. దేవతలు దైత్యుల కన్నా తెలివిగలవాళ్లు కావటంతో గాయత్రీ మాతను అనుష్ఠించి ఆ తల్లి కరుణతో విజయాన్ని పొందారు. అయితే యుద్ధంలో గెలిచిన తర్వాత ఇంద్రాది దేవతలంతా తమకు సహాయం చేసిన మాతను మర్చిపోయారు. యుద్ధంలో తాము గెలవటం తమ శక్తిననుసరించే జరిగిందని, దైత్యులు బుద్ధిహీనులు, బలహీనులు కావటంతో వారిని తాము ఓడించామని గర్వాహంకారాలను మనసులో పెంచుకొని ఆ అహంకారబుద్ధితోనే ప్రవర్తించసాగారు. ఆ విషయాన్ని గాయత్రీమాత గమనించింది. ఎవరిలోనైనాసరే గర్వాహంకారాలు చోటు చేసుకోకూడదు. ఎదుటివారిలో అలాంటి భావాలు పెరిగినప్పుడు అది మంచి పద్ధతి కాదని చూస్తున్న వారైనా సరే తెలియచెప్పాలి. ఈ సూత్రాననుసరించే ఆ తల్లి దేవతలకు కనువిప్పు కలిగించాలనుకొంది.

## అగ్ని వాయువులకు గర్వభంగం

అలా కాలం గడుస్తుండగా ఓ రోజు ఇంద్రాది దేవతలకు కనిపించేలా ఓ చోట కోటిసూర్యకాంతితో, కోటిచంద్రుల చల్లదనంతో మెరిసిపోతూఉన్న ఓ కాంతిపుంజం కనిపించింది. దేవతలంతా ఆహా ఇదేమి కాంతిపుంజం, ఇంత విచిత్రంగా ఉంది బహుశా ఇదేమైనా దైత్యుల మాయేమోనని అనుకున్నారు. ఆ కాంతిపుంజం ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి ఇంద్రుడిలో మరీమరీ కలిగింది. దాంతో అగ్నిదేవుడిని పిలిచి ఆ విషయమేంటో తెలుసుకొని రమ్మన్నాడు. అగ్ని ఇంద్రుడి మాట ప్రకారం కాంతిపుంజం దగ్గరకు వెళ్లి నీవెవరు? ఎందుకిలా ఇక్కడ ఉన్నావు? నేను దేవతలకు రాజైన ఇంద్రుడు పంపితే ఇలా వచ్చాను. నేను అగ్నిని. సృష్టిలోని ఏ వస్తువునైనా దహించివేసే శక్తి నాకుంది కనుక నీవెవరో త్వరగా చెప్పు' అని అన్నాడు. అప్పుడు ఆ కాంతిపుంజం ఒక గడ్డిపోచను అగ్నిముందు పెట్టి నీలో విశ్వమంతటినీ కాల్చే శక్తిఉంటే దీన్ని కాల్చు చూద్దాం అని అంది. అప్పుడు అగ్ని తన శక్తినంతటినీ కూడా గట్టుకొని ఎంతగా ప్రయత్నించినా ఆ గడ్డిపోచను ఏమీ చేయలేకపోయాడు. దాంతో అగ్ని గర్వం సమసిపోయింది. తలవంచుకొని ఇంద్రుడి దగ్గరకు తిరిగొచ్చాడు. అప్పుడు ఇంద్రుడు వాయుదేవుడిని పిలిచి ఆ కాంతిపుంజం సంగతి ఏమిటో తెలుసుకొని రమ్మన్నాడు. వాయుదేవుడు వెళ్లి అగ్నిలాగే గర్వంగా కాంతిపుంజం ముందు మాట్లాడాడు. వాయుదేవుడికి కూడా చిన్నగడ్డిపరకనే చూపించి నీకు సృష్టిలోని వస్తువులన్నింటినీ కదిలించే గొప్పశక్తి ఉందంటున్నావు అయితే ఈ చిన్న గడ్డిపరకను కదిలించు చూద్దాం అని అంది. అగ్నిదేవుడిలాగే వాయుదేవుడు కూడా ఆ గడ్డిపరకను ఏమీ చేయలేకపోయాడు.



## వేదాలు కూడా స్తుతించే తల్లి

అప్పుడు ఇంద్రుడే స్వయంగా బయలుదేరి అసలా తేజోపుంజం విషయమేంటో తెలుసుకుందామనుకున్నాడు. కానీ ఆశ్చర్యంగా ఇంద్రుడి కళ్లముందే ఆ కాంతిపుంజం మటుమాయమై పోయింది. తనకు ఆ దివ్యశక్తిని చూసే అదృష్టం లేకపోయిందని ఇంద్రుడు బాధపడుతున్నప్పుడు అశరీరవాణి వినిపించింది. ఆ శక్తిని చూడాలంటే జగన్మాతను ధ్యానిస్తూ ఉండమని అశరీరవాణి పలికిన పలుకులను విని ఇంద్రుడు ధ్యానంలో మునిగిపోయాడు. అలా చాలా కాలం గడిచాక ఓసారి చైత్రశుద్ధ నవమినాడు పట్టపగలు అకస్మాత్తుగా అంతకుముందు కనిపించిన దివ్య తేజోపుంజం ఇంద్రుడికి కనిపించింది. ఆ తేజోరాశి నుంచి జపాకుసుమకాంతులతో బాలసూర్యకోటిప్రభలతో ప్రకాశిస్తూ భగవతి గాయత్రి అవతరించింది. ఆ తల్లి కిరీటంలో నెలవంక వెలుగుతూ ఉంది. నాలుగు చేతుల్లోనూ పాశంకుశవర అభయ ముద్రలతో పరమ లావణ్యమూర్తిగా అనేకానేక దివ్యాభరణాలతో ఆ తల్లి కనిపించింది. ఆ తల్లిని నాలుగువేదాలు స్తుతించసాగాయి. గాయత్రీమాత అయిన ఆ భువనేశ్వరీదేవికి ఇంద్రుడు దండప్రణామాలు అర్పించాడు. అప్పుడాతల్లి ఇంద్రుడిని, ఇతర దేవతలను అందరినీ ఆశీర్వదించి ఎవరికీ గర్వాహంకారాలు పనికిరావని దేవతలలో అవి చోటుచేసుకున్నాయి. కనుకనే వాటిని తొలగించేందుకు తాను అవతరించినట్లు చెప్పింది. ఇలా ఈ కథాసందర్భంలో గాయత్రీమాతకన్నా ఇతర దేవతలకెవరికీ అధికంగా బలశక్తులు లేవన్న విషయం స్పష్టమవుతోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

**కడప, న్యూస్‌టుడే :** ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా సీతారామలక్ష్మణులు చక్రస్నానం చేశారు. మేళతాళాలతో అర్చకుల వేదమంత్రాల మధ్య స్వామి సీతాలక్ష్మణ సమేతులై రామతీర్థం దగ్గరికి వెళ్లారు. అక్కడ పూజల అనంతరం స్వామికి చక్రతీర్థం నిర్వహించారు. కోదండ రామాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. బహుమతులను ఏకాంతసేవరోజున వీరికి అందించనున్నారు.



సీతారామలక్ష్మణులు

# వైభవంగా స్వామి పట్టాభిషేకం



పుష్పపల్లకీలో విహరిస్తున్న శ్రీకోదండరామస్వామి ఉత్సవర్లు

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి పట్టాభిషేకం మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఉదయాత్పూర్వం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణభట్టర్ సహచర అర్చక బృందంతో స్వామివారి మూలవరులు, ఉత్సవర్లు, ఆళ్వారులకు విశేష అభిషేకం, అలంకరణ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖమండపంలో స్వామివారి పట్టాభిషేకం పూజలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం పట్టుపీతాంబరాలతో అలంకృతులైన స్వామివారి ఉత్సవర్లను పుష్పపు ఊయలలో కొలువుదీర్చి ఊంజల సేవలు నిర్వహించారు. రాత్రి పుష్పపల్లకీలో శ్రీవారి ఉత్సవర్లను అధిరోహింపజేసి గ్రామోత్సవ సేవలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ ఉభయదారులుగా తితిదే కల్యాణకట్ట మిరాశిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మునిరాజ వ్యవహరించారు.

# కమనీయం.. సీతారాముల కల్యాణం

**నెల్లూరు , న్యూస్‌టుడే:** నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలోని రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. మేళతాళలు, భక్తుల రామనామ స్మరణల మధ్య నిర్వహించిన ఈ వేడుక రమణీయంగా జరిగింది. తొలుత సీతారాములకు మంగళస్నానాలు చేయించి పట్టుపీతాంబరాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపైకి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ మహోత్సవంలో ఆలయ ప్రధానార్చకులు ఆర్. భావనాచార్యులు కల్యాణ మహోత్సవ విశిష్టత గురించి వివరించారు. సీతారాముల కల్యాణం తిలకిస్తే ఎంతో శుభం కలుగుతుందని చెప్పారు.



సీతారాములకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# సలేశ్వర క్షేత్రంలో ఘనంగా ఉత్సవాలు

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే :** నల్లమల ప్రాంతంలో వెలసిన సలేశ్వర క్షేత్రంలో లింగమయ్య స్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. చైత్ర పౌర్ణమి మంగళవారం రాత్రి వేల సంఖ్యలో జలపాతం గుండంలో పుణ్యస్నానాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం సలేశ్వరం గుహలోని గర్భగుడి లింగమయ్యకు చెంచు పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. జిల్లా నుంచే గాక మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, కర్నూల్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చారు.



లింగమయ్యకు పూజలు చేస్తున్న భక్తులు



దేవస్థాన కమిటీ అధ్యక్షుడు నిమ్మల గురువయ్య ఆధ్వర్యంలో వసతులు కల్పించారు. రాంపూర్ వద్ద హైదరాబాద్‌కు చెందిన వెంకవెంకటేశ్వర బిజినెస్ అసోసియేషన్, నాగర్‌కర్నూల్‌కు చెందిన గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వనవాసి కల్యాణ పరిషత్, మన్ననూరు, వటవర్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాదయాత్రలో అస్వస్థతకు గురైన భక్తులకు వైద్యశిబిరాల ద్వారా సేవలందించి మందులు పంపిణీ చేశారు.

# పాతాళప్రశ్న

**అం**తు తేలని చిక్కుప్రశ్న అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. పాతాళం భూమికి అడుగున ఉండే చిట్టచివరి లోకం. దాని దగ్గరకు చేరటం అంత సామాన్యమైన విషయం కాదు. కొన్నికొన్ని ప్రశ్నలకు సమాధానాలు అదే తీరులో ఎన్నెన్నో చిక్కుముడులను విప్పుకొంటూ పోయినా సూచనమాత్రంగా కూడా తెలియవు. అలాంటి ప్రశ్నలను గురించి తెలియచెప్పాల్సివచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

# ఘనంగా శ్రీపుష్పోత్సవం

**ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి శ్రీపుష్పోత్సవం, పవళింపు సేవతో సంపూర్ణమయ్యాయి. ఉత్సవాల్లో చివరి రోజున స్వామివారి దర్శనానికి అత్యధికంగా భక్తులు తరలివచ్చారు. స్వామి అమ్మవార్లను అందంగా ముస్తాబుచేసి సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంగీతం, మౌనం, వేదం వంటి 12 ద్వాదశ ప్రదక్షిణలు, 12 పిండి వంటలు, పండ్లు నివేదన తదితర కార్యక్రమాలను కమనీయంగా నిర్వహించారు.

# భక్తసంద్రం..తిరుమలగిరి క్షేత్రం

**జగ్గయ్యపేట , కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** చైత్రశుద్ధ పున్నమినాటి పండువెన్నెలలో తిరుమలేశుని కల్యాణం కన్నులపండువగా జరిగింది. రమణీయంగా తీర్చిదిద్దిన పచ్చిపూల మండపం గుబాళింపుల నడుమ శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరుడు కల్యాణమూర్తిగా వెలుగొందాడు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో మండలంలోని ప్రసిద్ధ తిరుమలగిరి క్షేత్రం మంగళవారం అర్ధరాత్రి జనసంద్రంగా మారింది. కృష్ణా జిల్లాతో పాటు ఖమ్మం, నల్లగొండ, గుంటూరు జిల్లాల నుంచి కుడా వేలసంఖ్యలో తరలివచ్చిన భక్తులు అర్చకుల వేదమంత్రాలతోపాటు పండితుల వ్యాఖ్యానాలను ఆస్వాదిస్తూ కళ్యాణాన్ని తిలకించారు. వేదమూర్తులు నిర్ణయించిన శుభముహూర్తంలో స్వామివారు, దేవేరులు కొండ పైనుంచి కిందకు దిగివచ్చి కల్యాణమూర్తులుగా శోభిల్లారు.

# ఏం పాపం చేశానో ఏమో..!

ధర్మపథం

**కొం**తమంది బాధపడుతూ ఎప్పుడు ఏం పాపం చేసామో ఏమో ఇప్పుడు ఈ బాధలను అనుభవిస్తున్నాం అని అనుకొంటూ ఉండటం కనిపిస్తుంది. అది వాస్తవమేనని గతజన్మలలో చేసిన పాపకార్యాలు, అధర్మాలే జబ్బుల రూపంలో పట్టిపీడిస్తుంటాయని తెలియచెప్పే కథాసందర్భం ఇది. మహాభారతం అనుశాసన పర్వంలో శివపార్వతుల సంభాషణ ఉంది. ఈ సంభాషణ క్రమంలో పార్వతీదేవి అడిగిన ప్రశ్నలకు శివుడిలా సమాధానాలు చెప్పాడు.

మనుషుల్లో కొందరు దురదృష్టవంతులు కనిపిస్తుంటారు. అనేక కష్టాలను అనుభవించేవారుంటారు. వ్యాధులతో కుంగిపోయేవారుంటారు. ఇలా అలాంటివారు బాధలుపడటానికి కారణమేమిటి, ఇతరుల్లాగా హాయిగా సుఖంగా ఉండవచ్చుకదా అని జగన్మాత పార్వతికి అనిపించి ఆ విషయాన్ని గురించి తెలియచెప్పమని శివుడిని అడిగింది. ఆకలి, భయం, ఇంట్లో శాంతి లేకపోవటం, వ్యాధులు పీడిస్తుండటం ఇదంతా పూర్వజన్మలో చేసుకున్న పాపంవల్లనే జరుగుతుంటుంది.

## అన్నదానం చేయకపోవడమూ పాపమే

గత జన్మలలో రాక్షస భావంతో ప్రవర్తించటం, క్రోధం, దురాశతో ఉండటం, అన్నదానాలు చెయ్యకపోవడం, శుభకార్యాలను నిర్వర్తించకపోవడం, దుర్మార్గులు మూర్ఖులతో స్నేహం చెయ్యటమనేవి పై జన్మలకు బాధలను తెచ్చిపెడతాయి. పరులను బాధించటం, ప్రాణుల విషయంలో నిర్దయగా వ్యవహరించటం అనేవి పై జన్మకు దుఃఖపీడను కలిగిస్తాయి. పూర్వజన్మలో కామం కోసం పరుల ఇళ్లలో పడిగాపులు కాయటం, పరస్త్రీలను చెడుభావంతో చూడటం, క్రోధంతో, దురాశతో ఎదుటివారి చూపును పోగొట్టడం, తమకు నచ్చనివారిని గురించి, వారి ఆకారాన్ని గురించి వ్యంగ్యంగా మాట్లాడటం అనే పాపాలన్నీ పైజన్మకు అంధత్వాన్ని, నేత్రరోగాలను తెచ్చిపెడతాయి. చెడ్డమాటలను, కఠినమైన మాటలను పలకటం, అబద్ధాలు చెప్పటం, తీవ్రమైన భయంకరమైన మాటలతో గురువులను, పెద్దలను నిందించటం ఇలాంటి పాపాలు చేసినవారు ముఖ సంబంధమైన దంతాలు, చెక్కిళ్లు, కంఠం లాంటి అవయవాలకు సంబంధించిన వ్యాధులను పై జన్మలకు పొందాల్సి ఉంటుంది. ఎప్పుడూ చెడును వినాలనే ఆసక్తిని కలిగిన్న వారు పై జన్మలో చెవి సంబంధమైన రోగాలకు గురవుతారు. దంతరోగాలు, శిరోరోగాలు లాంటివి ఈ పాపాల వల్లనే కలుగుతుంటాయి.



కామక్రోధాలకు వశులై తమకోసం మాత్రమే ఎవరూ వండుకొని తినకూడదు. ఎవరికీ పెట్టకుండా తానొక్కడే తినకూడదు. తినటానికి పనికిరాని ఆహార పదార్థాలను దానం చేయకూడదు. నమ్మినవారికి విషప్రయోగం చేయటం, పనికిరాని తినుబండరాలను దానం చేయటం లాంటివి చేస్తే పై జన్మకు కడుపు నొప్పిలాంటి విపరీతమైన బాధలను అనుభవించాల్సి ఉంటుంది. పరుల భార్యలను హింసించటం, కామంతో యథేచ్ఛగా సంచరించటం, బలత్కారాలు చేయటం, అందంగా ఉన్నానన్న గర్వంతో దుర్మార్గంగా ప్రవర్తించేవారు పై జన్మకు మర్మావయ సంబంధ రోగాలతో బాధననుభవిస్తారు.

## ఇతరులను చూసి అసూయ తగదు

ఎప్పుడూ భోగాలను అనువించాలనుకోవటం, తనకోసం మాత్రమే మధుర ఫలాలను సేకరించుకోవటం, పరులను బాధించటం, పరుల భోగాలను నాశనం చేయటం, పరులు అనుభవించే భోగాలను చూసి అసూయ చెందటం మంచికాదు. ఎందుకంటే ఇలా చేసినవారు పై జన్మకు ఎంతతిన్నా బక్కచిక్కి నీరసంగా ఉండటం, తిన్నతిండి వంటపట్టకపోవటం లాంటి బాధలను అనుభవిస్తారు. పరుల రూపాన్ని నశింపచేయటం, కొట్టడం, చంపటం, బంధించటం, అనవసరంగా శిక్షించటం, చికిత్స చేసే విషయంలో దుర్మార్గంగా వ్యవహరించటం, ద్వేషం, దురాశలతో ప్రాణులను నిర్దయగా హింసించటం చేసినవారు మరుజన్మకు భరించరాని కష్టాలను, చర్మసంబంధమైన వ్యాధులను అనుభవించాల్సి ఉంటుంది అని శివుడు పార్వతికి వివరించి చెప్పాడు. ఈ కథాసందర్భంలో మనిషి ఏ పనులు చేస్తే పై జన్మకు పలురకాల కష్టాలను అనుభవించాల్సి వస్తుందనే విషయాన్ని గురించి శివుడే స్వయంగా వివరించాడు. శివుడు చెప్పిన పాపాలకు కారణమైన పనులన్నీ సమాజం ఛీదరించుకొనే పనులే. వీటిలో ఒకరి రూపాన్ని నాశనం చేయటంమంటే ప్రస్తుతం జరుగుతున్న యాసిడ్ దాడులలాంటి వాటికి ఉదాహరణలు. మిగతాపనులు కూడా చాలా క్రూరమైనవే. సమాజంలోని మనుషులంతా అలాంటి పనులను చేయకుండా ఉంటే ఈ జన్మలోనూ, పైజన్మలోనూ సుఖాన్ని అనుభవించవచ్చు అనే ఓ సూచన ఇక్కడ కనిపిస్తుంది.

**-డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# బాసరలో భక్తుల రద్దీ

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** బాసర సరస్వతి ఆలయం శుక్రవారం భక్తులతో కళకళలాడింది. ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలు ముగియటంతో ఆలయాన్ని సందర్శించే భక్తుల సంఖ్య పెరుగుతోంది. శుక్రవారం 330 మంది చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి ₹ 3,46,000 ఆదాయం సమకూరింది.



అక్షరాభ్యాస మంటపంలో భక్తజనం

## గురుడు ఏకాదశంలో ఉండటం

**గొ**ప్ప ఉచ్ఛదశ, అభ్యుదయకరమైన కాలం అనే అర్థాల్లో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. జ్యోతిషశాస్త్రపరంగా ఉన్న కొన్ని సాంకేతిక అంశాలు కూడా జాతీయాలుగా అవతరించాయనటానికి ఇదొక ఉదాహరణ. పూర్వం నుంచి మానవ జీవనశైలిలో కూడా చాలా

జాతీయాలు నుడికారాలు

మంది జ్యోతిష శాస్త్రాన్ని విశ్వసిస్తున్న నేపథ్యంలో ఇలాంటి జాతీయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కారణంగా ఎవరైనా ఎంతో గొప్పస్థితిలో ఉన్నారని చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

# సర్వభూపాల వాహనంపై సర్వాంతర్యామి

**నాగలాపురం, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** నాగలాపురంలో వెలసిన వేదనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు సర్వాలంకార శోభితుడై సర్వభూపాల వాహనంపై కాళీయ మర్ధనుడి అలంకారంలో తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వృషభాలు, గజరాజులు వాహన సేవ ముందు కదులుతుండగా వాహన సేవ ఆద్యంతం వైభవంగా జరిగింది. అంతకుముందు స్వామివారు ఊంజలసేవలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు ఆలయంలో నిత్యకైంకర్యాల అనంతరం కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా భక్తులు తమ కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. ఏర్పాట్లను అర్చకులు నాగరాజుభట్టాచార్య, దేవరాజుభట్టాచార్య, కంకణాభట్టాచార్య పర్యవేక్షించారు.



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



క్రీస్తు సందేశం... దివ్య ధాత్రికి ఉద్దీపం

**'శుభ శుక్రవారాన్ని' క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. క్రీస్తుకు శిలువ రోజును స్మరించుకొంటూ ఉపవాసాలతో గడిపారు. విషాద గీతాలు ఆలపించారు. పాఠశాల చిన్నారులు ప్రదర్శనలు ఇచ్చారు.**

–హైదరాబాద్, న్యూస్‌టుడే

# రాహుకేతు విగ్రహాల ప్రతిష్ఠ



రాహుకేతు పంచలోహ విగ్రహాలు

**కర్నూలు, న్యూస్‌టుడే:** పంపనూరు సుబ్రమణ్యేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నూతన యాగమండపం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపంలో రాహుకేతు పంచలోహ విగ్రహాలకు చర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ద్వారపాలక పూజ, గోపూజ నిర్వహించారు. పూర్ణకుంభంతో నూతన యాగమండపంలోకి ప్రవేశించారు. అనంతరం రాహుకేతు పంచలోహ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో చండీ, సుదర్శన హోమాలను నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

# విచిత్ర వేషధారణలో అమ్మవారు

**పెదవేగి, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** రాట్నాలమ్మ తిరునాళ్ల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అమ్మవారు గ్రామోత్సవంలో భాగంగా మేళతాళాలతో, చిత్ర విచిత్ర వేషాధారణతో అమ్మవారిని సమీప గ్రామాల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భారీసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీధువీధుల్లోను అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు గంటలకొలదీ వేచి ఉన్నారు. ఉదయం 5 గంటలకు ఆలయ అర్చకులు సత్యన్నారాయణ శర్మ, రుద్రనాగశేషారావు, శేషకుమార్ తదితరులు అమ్మవారిని కనకదుర్గగా అలంకరించి విశేషపూజలు చేశారు. అనంతరం ఉదయం 9 గంటలకు అంగరంగ వైభవంగా విశేష వేదమంత్రాలతో, మేళతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమైంది. సమీపంలోని నాలుగు గ్రామాల్లో దాదాపు 15 కి.మీ. కొనసాగిన అనంతరం గ్రామోత్సవం ముగిసింది.

# నారాయణ స్వరూపాలు

నారాయణుడంటే ఎలా ఉంటాడు, ఎక్కడెక్కడ ఉంటాడు అనే విషయాన్ని గురించి తెలియచెప్పే కథాసందర్భం ఇది. వరాహ పురాణం మూడు, నాలుగు అధ్యాయాలలో ఉన్న ఈ విషయాన్ని భూదేవికి వరాహమూర్తి ఇలా వివరించాడు.



***అంతా ఆయనే..***

నారాయణుడు వేలాది శిరస్సులు, వేలాది పాదాలు, వేలాది హస్తాలతోనూ ఉంటాడు. సూర్య చంద్రులు ఆయనకు నేత్రాలు. అక్షరుడైన ఆ స్వామి పాలకడలిలో శయనించి అమృతరూపుడిగా వెలుగొందుతుంటాడు. రుగ్యజుస్సామాలనే మూడు వేదాలవల్ల మాత్రమే ఆ స్వామిని తెలుసుకోవటం సాధ్యమవుతుంది. విశ్వంలో ఉన్న ఇరవై ఏడు తత్త్వాలు మొత్తం కలిసి ఒకే రూపాన్ని ధరించినట్టుంటాడు. దక్షిణాగ్ని ఆవహనీయాగ్ని, గార్హపత్యాగ్ని అనే మూడు అగ్నులు ఒకచోట చేరి ఆయన రూపమై ప్రకాశిస్తుంటాయి. సత్యం, జ్ఞానం, అనంతం అనే మూడు తత్త్వాలకు ఆయనే లక్ష్యం. యుగాల విషయానికొస్తే కృత, త్రేత, ద్వాపరయుగాల స్వరూపమే ఆయన. సూర్యుడు, చంద్రుడు, అగ్ని అనే మూడు నేత్రాలతో కూడా ఆయన భాసిస్తూ కనిపిస్తాడు. కృత యుగంలో తెల్లగా, త్రేతాయుగంలో ఎర్రగా, ద్వాపరంలో పసిమివన్నెలోనూ, కలియుగంలో నల్లగానూ ఉండే దేహకాంతితో విరాజిల్లుతుంటాడు. అన్ని వర్ణాలవారు ఆయన నుంచే ఉద్భవించారు. అన్ని యుద్ధాలకు నాయకుడు ఆ స్వామే. గద, ఖడ్గం, డాలు ధరించిన చేతులతో నిత్యం అధర్మాన్ని అణచటానికి సిద్ధంగా ఉంటాడు.

***దేవతలకూ పూజ్యుడే***

మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, దశరథరామ, కృష్ణ, బుద్ధ, కల్కి అనే పది అవతారాలను అధర్మాన్ని అణచి ధర్మస్థాపన చేయటం కోసం ధరించాడు. సృష్టిలో ఆయన మొట్టమొదటి రూపం భూమి. రెండోరూపం నీరు, మూడో రూపం అగ్ని, నాలుగో రూపం వాయువు. ఆకాశం అనేది ఆ స్వామి అయిదో రూపం. ఈ రూపాలలోనే కాక సూర్య, చంద్ర, యజ్ఞ యజమానులలో కూడా ఆయనను దర్శించవచ్చు. ఇంతేకాదూ ఆ సృష్టి అంతటికీ ముందుగా స్వయంభువు అయినవాడు ఆ స్వామే. భక్తితో ఆరాధిస్తే ఆ భక్తుడికి అతి సమీపంలోనే ఉన్నట్టు దర్శనమిస్తాడు. సహజంగా ఆయన మానవమాత్రులు ఎవరూ చూసి తట్టుకోలేనంత తేజస్సుతో ఉంటాడు. లోతైన ప్రజ్ఞకు ఆయన నిలయం. ఇక ఆయనకంటే ఉత్తముడు లేడు అనిపించేంతటి ఉత్తమ గుణగణాలు కలిగినవాడు. సర్వానికీ మూలపురుషుడు. కేవలం మానవమాత్రులే కాక దేవతలు కూడా నిత్యం పూజిస్తుంటారు. సకల జగత్తులను తనలో అణుస్వరూపంగా ఇముడ్చుకొన్న విశాల స్వరూపుడు. పురాణపురుషుడైన ఆ నారాయణుడిని విశుద్ధమైన భక్తి భావంతో స్తుతిస్తే చాలా భక్తులను అనుగ్రహిస్తాడు. సృష్టి జరగక ముందు వాస్తవానికి ఉన్నది ఆయనొక్కడే. అయితే తన లీలావిలాసం కోసమే స్వామి సృష్టినంతటినీ చేసాడు. అందుకే ఆయనకు పురాణపురుషుడు అనే పేరొచ్చింది. అనంతరూపుడైన ఆ స్వామి నీతిమంతులలో ప్రధానుడు. భూమికంతటికీ పట్టుకొమ్మ. శాంతిని నెలకొల్పేది ఆయనే. అందుకే ఆ స్వామిని నిరంతరం ధ్యానిస్తూ ఉండటం మేలు అని వరాహ పురాణం పేర్కొంటోంది.

***ఇందుగలడందు లేడని..***

ఈ కథాసందర్భంలో దేవుడెక్కడ ఉంటాడు? అనే ప్రశ్నకు ఉదాహరణపూర్వక సమాధానం కనిపిస్తుంది. సృష్టికి ముందే ఆ స్వామి ఉన్నాడు. సృష్టినంతా చేసింది ఆయనే అని వరాహమూర్తి ఇచ్చిన వివరణలో శ్రీమహావిష్ణువు ఆదిపురుషతత్త్వం ధ్వనిస్తుంది. ఇవన్నీ కాకపోయినా అందరికీ అనుభవంలోకి వచ్చే పంచభూతాలైన భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనే అయిదు, సూర్యచంద్రులు, యజ్ఞయజమాని అనే మూడు రూపాలలో ఉన్నది ఆ స్వామే అని చెప్పటం వల్ల మహాభక్తుడైన ప్రహ్లాదుడు ఇందుగలడు అందులేడని సందేహమువలదు అన్న మాటలకు రుజువు కనిపిస్తూ అంతటా అణువణువునా నిండి ఉన్నది ఆ స్వామే అన్న విషయం అవగతమవుతుంది.

**-డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# మిన్నుదన్ను

అధికమైన అభివృద్ధి, ఎంతో ఎత్తుగా ఉండటం అనే అర్థాల్లో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. మిన్ను అంటే ఆకాశం అని అర్థం. దన్ను అనంటే హద్దు, ఆధారం అనేలాంటి అర్థాలు ఉన్నాయి. స్థూలంగా చూస్తే ఆకాశమే హద్దు అనే భావనలో ఊహించలేనంత ఎత్తు, ఎంతెంతో అభివృద్ధి చెందటం అని అర్థాలు స్ఫురిస్తాయి. బాగా అభివృద్ధిని సాధించారు అని ఎవరి గురించైనా చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

# ఘనంగా కల్యాణోత్సవాలు

**హుజూర్‌నగర్(నల్గొండ జిల్లా), న్యూస్‌టుడే:** మండలంలోని బూరుగడ్డలో వేంచేసి ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు శనివారం శృంగార డోలోత్సవంతో ముగిశాయి. ఉదయం ప్రభాత సేవ, బాలభోగం, తీర్థగోష్టి, శ్రీరుక్మిణి, సత్యభామ గోదాసమేత, వరహ శ్రీ వేణుగోపాలస్వామి వారికి శ్రీ రాజ్యలక్ష్మి నృసింహస్వామి వారికి, ఆళ్వారాదులకు స్నపనము, ఘటాభిషేకం, ఆరగింపు సాయంత్రం శృంగార డోలోత్సవము (పవళింపు సేవ) మొదలైన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి రాధిక దేశ్‌ముఖ్, ఆలయ ఛైర్మన్ లలిత, ఈవో లక్ష్మణరావు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



బూరుగడ్డ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

# సాహితీ సేవలు అభినందనీయం

**మచిలీపట్నం(కృష్ణాజిల్లా), న్యూస్‌టుడే:** సాహితీ వికాసానికి ఆంధ్ర సారస్వత సమితి చేస్తున్న కృషి అభినందనీయమని కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి వి.వెంకయ్య అన్నారు. స్థానిక బుట్టాయిపేట టౌనుహాలులో ఆంధ్రసారస్వత సమితి ఆధ్వర్యాన 13వ ఉగాది సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభలు శనివారం ప్రారంభమయ్యాయి. మాజీ ఐఏఎస్ అధికారి బోయిన వెంకటేశ్వరరావు సభావేదిక, విఖ్యాత రచయిత కవిపాదుష పువ్వాడ శేషగిరిరావు సభావేదికలపై రెండు విభాగాలుగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా సభలలో సమితి సాహిత్య జీవన సాఫల్య ప్రతిభ పురస్కారాలను ప్రముఖ వైద్యుడు, హిందూ కళాశాలల పాలకవర్గ అధ్యక్షుడు బి.ధన్వంతరిఆచార్య, నందమూరు శ్రీవాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు గుడివాడ రామచంద్రరావులు అందుకున్నారు. సమితి అధ్యక్షుడు, ప్రముఖ రచయిత కొట్టి రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ సంస్కృత పండితుడు కె.వై.ఎల్.నరసింహం, చలమలశెట్టి వెంకటసుబ్బయ్య, ఎల్.ఎస్.శాస్త్రి, వి.రామకృష్ణారావు తదితరులు ప్రసంగించారు. ప్రముఖ కవి సాహితీ విమర్శకుడు జి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రెండోసభలో కొల్లూరి రామ్మోహనరావు, కాళీపట్నం ఉమ, జి.రామబ్రహ్మం చిరువోలు రామ్మోహనరావు తదితరులు ప్రసంగించారు. సాహిత్యంతో పాటు కళారంగం, సామాజిక రంగాల పురోభివృద్ధికి చేస్తున్న సమితి కృషిని పలువురు కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా పలు రంగాలలో ఖ్యాతిగాంచిన ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. సాహిత్యాభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆంధ్రసారస్వత సమితి చేస్తున్న సాహితీసేవ సమాజానికి ఆదర్శప్రాయం కావాలని పలువురు తమ ప్రసంగాల్లో ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు రెండోరోజు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.



జీవన సాఫల్య పురస్కారంతో రామచంద్రరావుకు సత్కారం

# వైభవంగా రాట్నాలమ్మ తిరునాళ్లు

**పెదవేగి(పశ్చిమగోదావరి జిల్లా), న్యూస్‌టుడే:** గత ఐదురోజులుగా వీక్షకులకు భక్తిభావాన్ని పంచిన రాట్నాలమ్మ తిరునాళ్లు ముగిశాయి. అసంఖ్యాక భక్తుల నడుమ, వేదమంత్రాలు, విశేషపూజలు మధ్య వైభవంగా కార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా అమ్మవారికి జరిపిన విశేషపూజలు ఆకట్టుకున్నాయి. చివరిరోజు అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు అమ్మవారిని అలంకరించిన ప్రధాన అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు.

**భారీగా అన్నసమారాధన...** తిరునాళ్ల ముగింపు సందర్భంగా అమ్మవారి ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. సమీప గ్రామాలైన విజయరాయి, నడిపల్లి, రాయన్నపాలెం, కొండలరావుపాలెం, గార్లమడుగు నుంచే కాక దూరప్రాంతాల నుంచి సైతం భక్తులు హాజరై అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. శుక్రవారం రాత్రి జరిగిన తెప్పోత్సవం అర్ధరాత్రి వరకు ఘనంగా సాగింది.

**మెరిసిన కాంతులు...** మహాశక్తి స్వరూపిణి రాట్నాలమ్మ తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. అమ్మవారిని హంస వాహనంపై నీటిలో ఊరేగించారు. రాత్రి 10 గంటలు నుంచి 12గంటలు వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. అర్ధరాత్రి సమయంలో తెప్పోత్సవం ముగిసిన అనంతరం శనివారం తెల్లవారు జాము వరకు రంగురంగుల బాణాసంచాలు కాలుస్తూ, భక్తులు సంబరాలు చేసుకున్నారు. అర్చక బృందం, ఈవో కె.శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు.





రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు, అన్నసమారాధనకు హాజరైన భక్తులు

# అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** అదివోఅల్లదివో శ్రీహరివాసము..., తిరుమల గిరిరాయ..., జయ జయ నృసింహా... తదితర అన్నమాచార్య సంకీర్తనలు భక్తులకు అలరించాయి. అన్నమాచార్య వంశీకురాలు తాళ్లపాక నాగరేవతి ఎంతో హృద్యంగా సంకీర్తలను ఆలపించారు. శనివారం ఉదయం ఎంవీపీకాలనీ సెక్టారు-6 వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో తి.తి.దే. డి.పి.పి. సంయుక్తంగా అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంకీర్తనలభక్తి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆమె పలు సంకీర్తనలను ఆలపించారు. సచరాచరమిదే.. కట్టెమరా వైకుంఠం...,చూడరమ్మ సతులారా..., రామచంద్రుడితడు... తదితర కీర్తనలను ఆలపించారు. ముందుగా ఆమె ఆలయంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామికి పూజలు జరిపిన తర్వాత కచేరి ప్రారంభించారు. ఆమెకు వయోలిన్‌పై శ్రీనివాస్, మృదంగంపై నరేష్, శృతిపై మురళీ సహాయ సహకారాలు అందించారు.



సంకీర్తనలు ఆలపిస్తున్న తాళ్లపాక నాగరేవతి




# ఆట, పాటతో ఓటుపై ప్రచారం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' రవిశంకర్ సంస్థకు చెందిన 'ఓట్ ఫర్ బెటర్ ఇండియా' ఆధ్వర్యంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ యువత ప్రచారం నిర్వహించారు. శనివారం కాచిగూడ చౌరస్తాలోని బిగ్‌బజార్ ఆవరణలో ఓటు హక్కుపై ఆట, పాటలతో నిర్వహించిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. దేశంలో మహిళల భద్రత, అవినీతి, పేదరిక నిర్మూలన, సుస్థిర పాలనకు సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఓట్ ఫర్ బెటర్ ఇండియా సంస్థ సభ్యులు అనూష, ప్రత్యూష, మణి, రోహిణి, మోహన్, గీతం, సునీత, సంతోష్, భామిని తదితరులు పాల్గొన్నారు.

# నారాయణుడు ఎక్కడ ఎలా ఉంటాడు?

సకల జగత్తుకూ మూలపురుషుడైన ఆ నారాయణుడిని ఎలా ఆరాధించాలి అనే విషయాన్ని వివరించే కథాసందర్భం ఇది. వరాహ పురాణం నాలుగో అధ్యాయంలో ఈ విషయముంది. పూర్వం అశ్వశిరుడు అనే ఓ గొప్ప రాజుండేవాడు. ఆయన ధర్మబద్ధంగా రాజ్యపాలన చేస్తూ అనేకానేక అశ్వమేధ యాగాలను చేశాడు. ఓసారి అశ్వమేధ యాగం ముగిశాక అవబృథస్నానం చేసి పండితులతో కలిసి కొలువుతీరి ఉన్నాడు. ఆ సమయానికి కపిలుడు, జైగీషవ్యుడు అనే ఇద్దరు గొప్ప రుషులు ఆయన దగ్గరకొచ్చారు. ఆ రుషులిద్దరికీ అతిథి పూజాసత్కారాలను చేసి గౌరవించాడు రాజు. ఆ తర్వాత నారాయణుడిని ఎలా ఆరాధించాలో కాస్తంత చెప్పమని రుషులిద్దరినీ అడిగాడు అశ్వశిరుడు. అప్పుడు కపిలుడు, జైగీషవ్యుడు అశ్వశిరుడికి నారాయణ తత్త్వాన్ని వివరించి చెప్పాలనుకున్నారు.

### విష్ణు రూపాన్ని ధరించిన రుషులు

వెంటనే నారాయణుడంటే ఎవరో కాదూ మేమి ద్దరమే కదా అని కపిలుడు, జైగీషవ్యుడు రాజుతో అన్నారు. అప్పుడు ఆ రాజు మీరు నారాయణుడు ఎలా అవుతారు. మీరు కేవలం యోగీశ్వరులు, తపస్సంపన్నులు మాత్రమే. నారాయణుడంటే ఆయన పచ్చని పట్టువస్త్రాన్ని ధరించి ఉంటాడు. గరుడవాహనమెక్కి తిరుగుతుంటాడు. అలా ఉండే వాడే నారాయణుడు. మీరు నారాయణులు కారు అని అన్నాడు. ఆ మాటలు విన్న కపిలుడు వెంటనే విష్ణురూపాన్ని ధరించాడు. జైగీషవ్యుడు విష్ణు వాహనమైన గరుత్మంతుడిగా మారిపోయాడు. విష్ణువుగా మారిన కపిలుడు గరుడ రూపాన్ని ధరించిన జైగీషవ్యుడి మీద ఎక్కి కూర్చొని ఇప్పుడు చెప్పు మేము నారాయణరూపులమే కదా అని రాజుతో అన్నారు. రాజు వినయంగా నమస్కరిస్తూ నారాయణుడంటే బొడ్డుతామరను కలిగిఉండి ఆ తామరపువ్వు మధ్యలో చతుర్ముఖుడైన బ్రహ్మ కూర్చొని ఉండి ఉన్నట్టుంటాడు అని అన్నాడు. ఆ మాటనువిన్న రుషులిద్దరిలో కపిలుడు పద్మనాభుడి రూపాన్ని ధరించాడు.

ధర్మపథం



ఆ స్వామి బొడ్డుతామరలో చతుర్ముఖుడిగా జైగీషవ్యుడు కూర్చొని కనిపించాడు.

### సకల జీవరాశుల్లో ఉన్నది ఆయనే..

అప్పుడారుషులు ఇప్పుడు చెప్పు మేము నారాయణులము కామా అని అన్నారు. రాజు కానేకాదని తాననుకొంటున్న నారాయణుడు సకల జీవకోటి లోనూ, తన భార్య లక్ష్మీదేవితో కలిసి ఉంటాడు అనగానే వెంటనే ఆ ప్రాంతమంతా నల్లులు, దోమలు, పులులు, సింహాలలాంటి సకలప్రాణికోటితో నిండిపోయింది. ఇలా రాజు ఏంచెబితే అదంతా రూపుకట్టినట్టు కపిలజైగీషవ్యులు దర్శింపచేస్తూ ఉండటంతో రాజు ఆ ఇద్దరికీ నమస్కరించి, కోపగించుకోక తనను అనుగ్రహించమన్నాడు. అప్పుడా రుషులిద్దరూ రాజుతో ఇలా అన్నారు. హరిభక్తుడు ఆ హరిని ప్రతి వస్తువులోనూ దర్శించాలి. ఇంతేకానీ ఆయన అలా ఉంటాడు. అలాంటి రూపంలో కనిపిస్తే తప్ప ఆయనను ఆరాధించను అని అనుకోకూడదు. అణువణువూ పరమాత్మ రూపమైన శ్రీహరి రూపంగా భావించుకొంటూ సకల ప్రాణిదయతో ప్రవర్తించేవాడే అసలైన భక్తుడు. అయితే ఆ నారాయణ రూపాన్ని ఆరాధించే సమయంలో పువ్వులను సమర్పించటం, ధూపదీపనైవేద్యాలను ఇవ్వటం, వేదపండితులకు దానాలివ్వటం, నిర్మలభక్తితో ధ్యానం చేయటం అనే పద్ధతులను ఆచరించినప్పుడు ఆ స్వామి కరుణ తొందరగా లభిస్తుందని రుషులిద్దరూ రాజుకు వివరించారు. ఇలా ఈ కథాసందర్భంలో భగవంతుడిని భక్తిభావంతో ఆరాధించటంతోపాటు సకల చరాచర జీవరాశులలోనూ ఆ నారాయణుడిని భావించుకోగలగాలన్న సందేశం ఇమిడి ఉంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## నెరవాది

సౌమ్యంగా, ఆకర్షణీయంగా మాట్లాడే వ్యక్తి అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. అయితే నెర అని రాసేటప్పుడు బండిరను వాడాలని వ్యాకరణవేత్తలు సూచిస్తున్నారు. కానీ వ్యవహారంలో అలా కనిపించటం లేదు. నెర అనంటే మంచి, సౌమ్యం, ప్రీతికరం లాంటి అర్థాలున్నాయి. వాది అనంటే మాట్లాడేవాడు అని అర్థం. ఇలా నెరవాది అనే జాతీయం ఎంతో సున్నితంగా, ప్రేమపూర్వకంగా మాట్లాడే వ్యక్తి అని చెప్పాల్సి వచ్చినప్పుడు వాడుకలో కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

ఆంధ్రావని



## పవనసుతునిపై దేవదేవుడు

**నాగలాపురం, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** నాగలాపురం వేదనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి నిత్యకైంకర్యాలు, అనంతరం అభిషేకం నిర్వహించారు. నిస్వార్థ సేవాతత్పరతకు ప్రతీక అయిన హనుమంతునిపై స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి హారతులు ఇచ్చారు. అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం సాయంత్రం వసంతోత్సవం నిర్వహించారు. శ్వేత వస్త్రధారుడై.. విశేష అలంకరణలో స్వామివారు తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా పరిచారకులు వసంతాన్ని భక్తులకు అందించారు. రాత్రి స్వామివారు సర్వాలంకార శోభితుడై గజవాహనంపై ఊరేగారు.

## పంచేంద్రియాలకు నృత్యంతో ఆనందం

**ఈనాడు, హైదరాబాద్:** దుఃఖాన్ని పారదోలి పంచేంద్రియాలకు ఆనందాన్నిచ్చేది నృత్యమని ప్రముఖ కార్డియాక్ సర్జన్ మన్నెం గోపీచంద్ అన్నారు. కుర్రా శ్రీనాథ్, శృతి దంపతుల కుమార్తె... అలేఖ్య కుర్రా కూచిపూడి నాట్య రంగప్రవేశం సందర్భంగా గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఉన్న గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యం పది గంటలు ఏకాగ్రతతో సాధన చేస్తేనే కూచిపూడిలో ప్రావీణ్యం సాధిస్తారని, అలాంటిది అలేఖ్య నృత్యంతోపాటు అద్భుత ముఖాభినయంతో ఆకట్టుకోవడం ఆమె పూర్వజన్మ సుకృతమని ప్రశంసించారు. రెండో శతాబ్దంలో అవతరించి దాదాపుగా కనుమరుగైన కూచిపూడి నృత్యానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం తెప్పించిన ఘనత ప్రఖ్యాత కళాకారుడు రాజారెడ్డికి దక్కుతుందన్నారు. అంతటి ప్రఖ్యాత కళాకారుడి సమక్షంలో అరంగేట్రం జరగడం గొప్ప విషయమని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత రాజారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లాంటి కొన్ని రాష్ట్రాలు మాత్రమే కళలకు ఇంకా జీవం పోస్తున్నాయన్నారు. రాజమండ్రిలో సాహిత్యం, విజయనగరంలో సంగీతం విరాజిల్లిన ఇదే గడ్డపై కూచిపూడి నాట్య కళాకారులు ఊపిరి పోసుకుంటుండం విశేషమన్నారు. నృత్యానికి రిథమ్ ముఖ్యమని, అదే లేకుంటే నిస్సార జీవితం లాగే ఉంటుందని చెప్పారు. శిల్పాన్ని కూడా నృత్యం చేయించే శక్తి సంగీతానికి ఉంటుందన్నారు. ముఖాభినయంతో అద్భుత రసాలొలికించిన అలేఖ్య భవిష్యత్తులో గొప్ప పేరు తెచ్చుకుంటుందని ప్రముఖ నృత్య దర్శకుడు ప్రభుదేవా అన్నారు. కష్టమైన భంగిమలను సునాయాసంగా ప్రదర్శించిందని ఆయన మెచ్చుకున్నారు. రాజారెడ్డి దంపతులను అలేఖ్య తల్లిదండ్రులు సత్కరించారు. నాట్య అరంగేట్రంలో అలేఖ్య ప్రశంసలందుకుంది. సరస్వతి వందన, తారణ, కాళీయ నర్తన, ఏకమేవాద్వితీయం బ్రాహ్మణ, తారంగం నృత్యరీతులతో ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న గోపీచంద్



అలేఖ్య నృత్య భంగిమ



**కూచిపూడి నృత్య ప్రదర్శనలో రికార్డు**

**భెల్ కమ్యూనిటీ సెంటర్‌లో సాయిశ్రీ గంటా 13 నిమిషాల ఇరవై సెకన్లలో 13 పాటలకు ఏకధాటిగా కూచిపూడి నృత్యం చేశారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు ఆమెకు జ్ఞాపిక అందించారు.**

– హైదరాబాద్, న్యూస్‌టుడే

## ఘనంగా ఈస్టర్ వేడుక

**మహబూబ్‌నగర్ న్యూస్‌టుడే:** ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. జిల్లావ్యాప్తంగా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాకేంద్రంలోని బోయపల్లి దారిలోగల కల్వరీకొండపై సూర్యోదయ ఆరాధన చేశారు. పాస్టర్ ఎస్.వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డా.ఎస్.మోజస్ ముఖ్యసందేశమిచ్చారు. ఏసు పునరుత్థానంపై వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





**కల్వరీ కొండపై ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు, సందేశమిస్తున్న పాస్టర్ వరప్రసాద్**

## మురళీకృష్ణుడిగా చెన్నయ్య



**ఒంగోలు, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు మురళీకృష్ణుని అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి కేశవాచార్యులు స్వామివారి మూలవిరాట్టును మురళీకృష్ణునిగా అలంకరించారు. విశేషపూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని తరించారు.

# పాపాలు నశింపచేసే గోదానం

**ధే**ను దానం అంటే గోదానం. దీనికి ఎంతో గొప్ప పుణ్యఫలం ఉందని అందరికీ తెలిసిందే. అయితే ప్రత్యక్షంగా కనిపించే గోవు కాక కొన్ని కొన్ని అమూల్య వస్తువులు, పదార్థాలతో గోవులను రూపొందించటం లేదా ఆ పదార్థాలను గోవుగా భావించి దానం చేయటమనే పద్ధతి ఉంది. దీనివల్ల పొరపాటున చేసిన భయంకరమైన పాపాలు నశించి పుణ్యం లభిస్తుంది. ఇలాంటి వాటి వరుసలో తిల, జల ధేను దానాలు ముందు వరుసలో ఉన్నాయి. ఈ

ధర్మపథం

దానాల మహత్తును గురించి వరాహపురాణం తొంభైనాలుగు, తొంభై అయిదు అధ్యాయాలలో ప్రత్యేక వివరణ ఉంది. పూర్వం శ్వేతుడు అనే ఓ రాజు గొప్పగొప్ప యజ్ఞయాగాలు చేసి అంతే స్థాయిలో బంగారం, రత్నాలు లాంటి విలువైన వస్తువులను అధిక సంఖ్యలో దానం చేశాడు. అయితే ఆయన గురువైన వసిష్ఠుడు చెయ్యాల్సిన దానం అది కాదని, అన్నదానం చేయాలని చెప్పాడు. రాజు మాత్రం రత్నాలు, బంగారం కన్నా అన్నం విలువైనది కాదు అని భావించాడు. అన్నాన్ని కాక విలువైన వస్తువులనే దానం చేశాడు. దాని ఫలితంగా ఆయన స్వర్గలోకానికి వెళ్లినప్పుడు సకల భోగాలు అందుబాటులోకి వచ్చినా, పిడికెడు అన్నం దొరక్క తన ఎముకలను తానే కొరుక్కుతినే దుస్థితికి చేరాడు.

### రాజు దుస్థితి తప్పించిన గురువు

సర్వలోక సంచారి అయిన వసిష్ఠుడు ఆ పరిస్థితిని చూసి అప్పటికైనా అన్నదానం విలువ తెలుసుకోమన్నాడు. ఆ రాజు జరిగిన తప్పు ఎలా దిద్దుకోవాలని గురువును అడిగాడు. గతంలో శ్వేతుడిలాగానే వినీతాశ్వుడు అనే ఓ రాజు కూడా ఇలాంటి కష్టాలుపడ్డాడని గుర్తుచేశాడు వసిష్ఠుడు. అయితే పెద్దల సూచనల మేరకు ఆ రాజు తనవారి చేత తిల, జల, ఘృత, దధి, రసధేనువుల దానం చేయించాడని, ఆ పద్ధతినే అనుసరించమని శ్వేతుడికి చెప్పాడా రుషి. అంతేకాక ఆ తర్వాత శ్వేతుడి పేరు మీద ఆయా దానాలు జరిగేలా చేసి రాజు పాపం నశించేలా తగిన విధంగా చేయించాడు. ఈ సందర్భంలో వసిష్ఠుడు ముందుగా తిల ధేనుదానం ఎలా చేయాలో చెప్పాడు. తిల ధేనుదానం వల్ల పాపరాశి నశించటంతోపాటు చేపట్టిన కార్యాల్లో విజయం చేకూరుతుందన్నాడు. పదహారు శేర్ల నల్ల నువ్వులతో ధేనువు రూపాన్ని రూపొందించాలి. నాలుగు శేర్ల నువ్వులతో దూడ రూపాన్ని నిర్మించాలి. వాటికి చెరకుగడలతో పాదాలు, పుష్పాలతో దంతాలు, గంధంతో ముక్కు, బెల్లంతో నాలుక చేయాలి. పూలమాలను తోకగా అమర్చాలి. ఆ తర్వాత గంటల ఆభరణాలతో అలంకరించి ఆ ఆవుదూడలకు తగ్గట్టుగా బంగారు కొమ్ములను ఏర్పాటుచేయాలి. పాలు పితికేందుకన్నట్టు ఒక కంచుపాత్రను, వెండిగిట్టలను ఏర్పాటుచేసి వేదపండితుడికి దానం ఇవ్వాలి. నల్లని లేడి చర్మం ఆ ఆవుకు వస్త్రంగా సమర్పించాలి. సర్వరత్నాలతో కూడిన హారాలను, అన్ని విధాలైన ఔషధులను ధేనువుకు అలంకరించి దానం ఇవ్వాలి. దానం ఇచ్చేటప్పుడు ఆ తిల ధేనుదానం వల్ల అన్నం, పానం తదితర అన్ని రసాలు తమకు లభించాలని మనసులో అనుకొని దానం ఇవ్వాలి. దానం తీసుకొనే వ్యక్తి కూడా ఆ ధేనువుకు భక్తితో నమస్కరిస్తూ తన కుటుంబం కోసం ఆ దానాన్ని గ్రహిస్తున్నట్టు తన కోర్కెలను తీర్చుతూ తన కుటుంబాన్ని ఆదరించమని గోవును వేడుకొంటూ దానం తీసుకోవాలి.

### జల ధేను దానం ఇలా...

ఆ తర్వాత వసిష్ఠుడు జల ధేను దానం గురించి చెప్పాడు. ఏదైనా ఓ పుణ్యదినాన పవిత్ర ప్రదేశంలో ఆవుపేడతో అలికి దాని



మీద గోవు చర్మాన్ని ఉంచాలి. దానిమీద ముందుగా ఒక పూర్ణకుంభాన్ని ఏర్పాటుచేయాలి. గంధం, కర్పూరం, అగరు, చందనాది సుగంధద్రవ్యాలతో కలిపిన నీటిని పూర్ణకుంభంలో ఉంచాలి. ఆ నీటిలో ధేనువును భావించాలి. ఆ తర్వాత మరో కుంభాన్ని తీసుకొని దాన్ని ఆవునెయ్యితో నింపి మామిడాకుల్లాంటి ఆకులతోనూ, మంచిపువ్వులతోనూ అలంకరించాలి. కుంభం కింద గరిక మొలకలను ఉంచాలి. చివరగా మళ్లీ పూలమాలలతో కుంభాన్ని అలంకరించాలి. అయిదు రత్నాలను, మాంసి అనే మూలికను, వట్టివేళ్లను, చెంగల్వకొమ్మను, కొండ ఇసుక, ఉసిరికాయలు, తెల్ల నువ్వులు, నవధాన్యాలు వేయాలి. ఆ కుంభానికి నాలుగు దిక్కులలోనూ నాలుగు పాత్రలను ఏర్పాటుచేయాలి. నాలుగుపాత్రలలో ఒక్కొక్క దానిలో నెయ్యి, పెరుగు, తేనె, చక్కెర ఉంచాలి. బంగారంతో ఆవు ముఖాన్ని రూపొందించి నల్లని అగరుతో చేసిన కొమ్ములు, మంచి ఆకులతో చెవులు, ముత్యాలతో కళ్లు తయారుచేయాలి. దర్భలను వెంట్రుకలుగా, తాడును తోకగా, నల్లని ఆభరణాలను, గంటలు కలిగిన ఆవును రూపొందించాలి. బంగారుతలకు, తోకకు మధ్య కంచుపాత్ర శరీరభాగంగా ఉంటుంది. ఎర్రని పదార్థంతో పిరుదులను రూపొందించాలి. గంగడోలు స్థానంలో పూలమాలలు, బెల్లంతో నోరు, ముత్యపు చిప్పలతో దంతాలు, చక్కెరతో నాలుక, వెన్నతో పొదుగు, చెరకుగడలతో కాళ్లు ఉన్న ఆవును రూపొందించి సర్వాభరణాలతో అలంకరించి నల్లని లేడి చర్మాన్ని వస్త్రంగా కప్పి గంధపుష్పాలతో పూజ చేసి వేదపండితుడికి దానమివ్వాలి. ఇలా దాన విషయాలను, తిల జల గో నిర్మాణాల విషయాలను పూర్తిగా తెలిసున్న పండితుడి పర్యవేక్షణలోనే ఇదంతా జరగటం మేలు. దీనివల్ల అశ్వమేధ యాగం చేసినంతటి పుణ్యఫలితం దక్కుతుందని వసిష్ఠుడు వివరించాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# రమణీయం ...వసంతోత్సవం



వసంతోత్సవంలో గ్రామస్థులు

**కర్నూలు, న్యూస్‌టుడే:** మండలంలోని శంకరబండ, బిణిగేరి గ్రామాల్లో కొలువైన లింగమేశ్వరస్వామి, ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు వసంతోస్తవంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీలో పురవీధుల్లో నంది కోలు సేవతో ఊరేగించారు. గ్రామస్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సైలు లక్ష్మీనారాయణ, కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆంధ్రావని

# ‘శ్రీనివాస చిద్విలాసం’ ఓ దృశ్యకావ్యం

**విశాఖపట్నం , న్యూస్‌టుడే:** దేవుని విశ్వరూపాన్ని ‘శ్రీశ్రీనివాస చిద్విలాసం’ గ్రంథం ద్వారా రాంభట్ల నృసింహశర్మ ఆవిష్కరించారని నేపథ్య గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్‌లో ఈ గ్రంథావిష్కరణ జరిగింది. బాలు మాట్లాడుతూ ఈ గ్రంథం ఓ దృశ్యకావ్యమని కొనియాడుతూ అందులోని ఓ గీతాన్ని ఆలపించారు. తాను ఇంజినీర్‌ను కావాలని ఆకాంక్షించానని, అయితే పెద్దల పాటలు విని, విని గాయకునిగా మారానని తెలిపారు. ప్రస్తుతం చిన్నారులకు పాటలు పాడడం విషయంలో మెళకువలు తెలియజేస్తున్నానన్నారు. సాహితీవేత్త కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ నృసింహశర్మ తిరుపతి క్షేత్రానికి సంబంధించిన ఓ విజ్ఞాన సర్వస్వంలా ఈ గ్రంథాన్ని రూపొందించారని తెలిపారు. కేరళ రాష్ట్రంలో మెట్టు మెట్టుకూ దైవాన్ని ప్రార్థిస్తూ ఆలపించే ‘సోపాన సంగీతం’ రీతి ప్రాచుర్యం పొందిందని, దీనికి సంబంధించిన వేలరట్టు రామపాడు అనే కళాకారునికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందని తెలిపారు. డాక్టర్ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి మాట్లాడుతూ నృసింహశర్మ ఈ గ్రంథాన్ని గేయ భాష్యాల, క్షేత్ర దృశ్యాల సమాహారంగా రచించారన్నారు. ఏయూ ఉపకులపతి జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ రచయిత ఈ పుస్తకం ద్వారా దైవాన్ని చూపించారన్నారు. ఇది నవీన భక్తిమార్గ రచన అని సాహితీ విశ్లేషకులు దామెర వెంకట సూర్యారావు అన్నారు. రచయిత నృసింహశర్మ మాట్లాడుతూ తిరుపతి మెట్లెక్కుతున్నపుడు ఓ వృద్ధ భక్తునితో కలిగిన అనుభవాల స్ఫూర్తితో ‘శ్రీశ్రీనివాస చిద్విలాసం’ రాశానని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శ్రీవేంకటేశ్వర సంకీర్తనా కదంబం పేరిట ఏయూ ఆచార్యులు కె.సరస్వతీవిద్యార్థి కచేరీ చేశారు. వయోలిన్‌పై మావుడూరి సత్యనారాయణ శర్మ, తబలాపై బి.ధనుంజయ్ సహకరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాలసుబ్రహ్మణ్యం, జి.ఎస్.ఎన్.రాజు తదితరులు

# జగమేలు నాయకా.. రథోత్సవ వేడుక

**నాగలాపురం, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** నాగలాపురం వేదనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన మంగళవారం స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణస్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు



రథోత్సవంలో భక్తులు

# పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

**కరీంనగర్ , న్యూస్‌టుడే:** పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, మానవుడు పర్యావరణంపై చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని మానేరు పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణరావు అన్నారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు, మానేరు పర్యావరణ పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆల్ఫోర్ ఈ-టెక్నో కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 1890 వరకు పర్యావరణం సమతుల్యంగా ఉందని అప్పటి నుంచి పారిశ్రామిక యుగం ప్రారంభం కావడంతో పర్యావరణ వినాశనం మొదలైందన్నారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి, సముద్రాల జనార్ధన్‌రావు, స్వతంత్ర్య సమరయోధుడు బోయినపల్లి వెంకటరామారావులు ప్రసంగించారు. జ్యోతినగర్‌లోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులతో ర్యాలీని నిర్వహించారు.



మాట్లాడుతున్న తోట లక్ష్మణరావు

# అట్టుపుట్టానవాలు

జాతీయాలు నుడికారాలు

**ఓ** విషయానికి సంబంధించిన సంపూర్ణమైన విషయాలు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఆ విషయం ఎలా పుట్టింది. అది విస్తరించిన తీరు, దాని ఆనవాళ్లు వీటన్నింటినీ వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా తెలుసుకోవటమనేది ఈ జాతీయానికున్న అర్థం. ఎట్టు పుట్టింది అంటే ఎలా పుట్టింది అని ఎవరైనా ప్రశ్న వేస్తే అది అట్టు పుట్టింది. దాని ఆనవాళ్లు ఇవి అని తెలియచెప్పటమే దీనిలోని అంతరార్థం.

# తరింపచేసే రసధేను దానం

ధర్మపథం

**అ**టు పది తరాలు, ఇటు పది తరాలవారు తరించి పరమగతిని పొందేందుకు తగిన దానాలు ఏవైనా ఉన్నాయా అనంటే ఉన్నాయి అని వివరించి చెబుతోంది వరాహపురాణం నూరో అధ్యాయం. పాపాలు నశించి విష్ణు లోకం ప్రాప్తించేందుకు తగిన దానాలలో ప్రధానమైన దానాలు రస, గుడ (బెల్లం) దానాలు. ఈ రెండు దానాల్లో మొదటి దానం చెరకురస సంబంధమైనది. చెరకురసంలో రసధేనువును భావించి వీలున్నంతవరకూ ఆ ఆవుకు సంబంధించిన అంగాలను ఏర్పాటుచేసి దానమిస్తుంటారు. ముందుగా దానం ఇవ్వాలనుకొన్న రోజున ఆవుపేడతో నేలను అలకాలి. శుభ్రమైన, పవిత్రమైన ఆ అలికిన ప్రదేశంలో నల్ల లేడి చర్మాన్ని, దాని మీద దర్భాసనాన్ని ఏర్పాటు చేయాలి. ఆ ఆసనం మీద చెరకు రసాన్ని నింపిన పాత్రనుంచాలి. ఆ రసంలో ఆవుదూడను భావించాలి. ఆ తర్వాత ఆ చెరకురసం పాత్రలకు చెరకుగడలతో ఆవుకాళ్లను, బంగారునగల కొమ్ములను, వస్త్రంతో తోకను ఆవునెయ్యితో పొదుగును, పువ్వులతో గంగడోలును, చక్కెరతో ముఖాన్ని, నాలుకను రూపొందించాలి. ఫలాలతో దంతాలను, రాగి పాత్రతో వెనుక భాగాన్ని, పువ్వులతో వెంట్రుకలను, ముత్యాలతో కన్నులను ఏర్పాటు చేయాలి. నవధాన్యాలలోని ఏవో ఒక ఏడు ధాన్యాలను ఆ ధేనువు దగ్గర ఏర్పాటు చేయాలి. మంచి పరిమళద్రవ్యాలను అద్ది ఆవు చుట్టూ నువ్వులను నింపిన నాలుగు పాత్రలను ఉంచాలి. అలాంటి ఆ రసధేనువును మంచి వేదపండితుడికి శాస్త్రవిధిగా దానం ఇవ్వాలి. దాత దానం ఇచ్చిన రోజున చెరుకు రసాన్ని మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. అలా నియమాన్ని పాటిస్తే సోమపానం చేసిన ఫలంతో పాటు అన్ని గొప్పయాగాలు చేసినంతటి పుణ్య ఫలం కూడా దక్కుతుంది. రసధేను దానం చెయ్యటమే కాకుండా చూసినా పుణ్యమే. దానానికి ముందు ధేనువును గంధం, ధూపం, పూల మాలలతో అలంకరించాలి.



### గుడధేను దానం చేయాలిలా..

శ్రీమహావిష్ణువు కరుణ పొందేందుకు పనికివచ్చే మరో దానం గుడధేను దానం. గుడము అనంటే బెల్లము అని అర్థం. ఈ దానం దాత కోర్కెలను తీర్చుతుంది. ఆవుపేడతో అలికిన నేల మీద లేడి చర్మాన్ని పరిచి దాని మీద దర్భాసనాన్ని ఉంచాలి. దర్భాసనం మీద వస్త్రాన్ని పరిచి నాలుగు మణుగుల బెల్లాన్ని తెచ్చి దూడతో ఉన్న ఆవు రూపాన్ని తయారు చేయాలి. ఓ కంచుపాత్రను కూడా అక్కడ ఏర్పాటు చేయాలి. ఆవుకు బంగారంతో ముఖాన్ని, కొమ్ములను, మణులు, ముత్యాలతో దంతాలను, రత్నాలతో మెడను, గంధంతో ముక్కును, రాగిపాత్రతో వెనుక భాగాన్ని రూపొందించాలి. నారవస్త్రంతో తోకను, చెరకు గడలతో కాళ్లను, వెండితో ఆ కాళ్లకు గిట్టలను, మెడకు పట్టుదారాన్ని ఏర్పాటు చేయాలి. అలాంటి ఆవు మీద ఒక జతవస్త్రాలను కప్పాలి. గంటలతో, చామరాలతో అలంకారం చేయాలి. అన్ని రకాలైన ఆభరణాలతో పాలు పితికే కంచుపాత్రను అలంకరించాలి. ఆవుకు మంచి ఆకులతో చెవులను, వెన్నతో పొదుగును రూపుదిద్దాలి. ఆ ఆవుచుట్టూ అనేకానేక పండ్లను ఏర్పాటు చేయాలి. ఆవుబొమ్మ నిర్మాణం కోసం ఉపయోగించిన బెల్లంలో నాలుగోవంతు బెల్లాన్ని దూడబొమ్మ నిర్మాణానికి ఉపయోగించాలి. అంతంత బెల్లం, ఆభరణాలు, బంగారం లాంటివి సమకూర్చుకోలేని వారు శక్తిననుసరించి ఉన్నంతలో గుడ, ధేను దానాన్ని చేసుకోవచ్చు. శాస్త్రవిధిగా ఈ గోదానాన్ని మంచి వేదపండితుడికి దానం ఇవ్వాలి. గుడధేను దానం వల్ల కూడా దాతకు అటు పది తరాలవారు, ఇటు పదితరాల వారు పుణ్యాన్ని పొందుతారు. ఈ దానం భుక్తిని, ముక్తిని, శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని ప్రాప్తింపచేస్తుంది అని వరాహపురాణం పేర్కొంటోంది

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## కూడుగూటిప్రాయం

**చి**న్నవయసు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. కూడు అంటే తిండి, గూడు అంటే ఇల్లు. పసివయసు ఈ రెండిటికీ మాత్రమే పరిమితమై ఉంటుంది. అమ్మ పెడితే తినటం, నిద్రవస్తే పడుకోవటం తప్ప మరొకటి ఏదీ ఆ వయసులో ఉండదు. అంత చిన్న వయసు అని చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

ఆంధ్రావని



పట్టాభిషేకమహోత్సవాన్ని నిర్వహిస్తున్న దంపతులు



ప్రత్యేక పూజలు అందుకున్న దేవతామూర్తులు

# వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

**మచిలీపట్నం , కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** సీతారామకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక జగన్నాథపురం శ్రీరామమందిరంలో బుధవారం కొత్తగుండు ప్రసాదు దంపతులు స్వామివారి పట్టాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈసందర్భంగా దేవతామూర్తులకు శాస్త్రబద్ధంగా పూజలు చేశారు. భక్తుల పెద్దఎత్తున ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# గరుడ గమన.. చెన్నకేశవ!

**మార్కాపురం, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** మహావిష్ణువు అలంకారంలో స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి బుధవారం ఉదయం పురప్రజలకు దర్శన భాగ్యం కల్పించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి శ్రీమహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. ముందు స్వామి మూలవిరాట్టును ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి కేశవాచార్యులు, అర్చకులు నంద్యాల తిరుమలాచార్యులు చందనాలంకారంలో తీర్చిదిద్దారు. స్వామికి విశేష పూజలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీమహావిష్ణువు అలంకారంలో స్వామి ఉత్సవమూర్తిని పలురకాల ప్రత్యేక పూలమాలలు, స్వర్ణ, రజిత ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అప్పటికే సిద్ధం చేసిన గరుడ వాహనంపై స్వామి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠి ంచారు. ఉభయదాతలు సుగ్రీవు వెంకట సత్యనారాయణ, డాక్టర్ పచ్చల్ల కేశవభట్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి నగరోత్సవం ప్రారంభమైంది. పురవీధుల్లో స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు బారులు తీరారు. నగరోత్సవం సింహభాగాన పలురకాల దేవతా వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. కాళికా మాత, విఘ్నేశ్వరుడు, కథక్ నృత్యంతో కళాకారులు రూపకాలు అలరించాయి. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు స్వామి పీఠాన్ని మోసేందుకు పోటీ పడ్డారు.



మహావిష్ణువుఅలంకారంలో స్వామి



**సీనియర్ జర్నలిస్టు ఎన్.నందగోపాల్ రచించిన 'సినిమా గా సినిమా' పుస్తకం జాతీయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, ఫిలిం జర్నలిస్టులు ఆయనను సత్కరించారు. ఫిలించాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దాసరి నారాయణరావు, సినీనటుడు కృష్ణ, విజయనిర్మల పాల్గొన్నారు.**

– న్యూస్‌టుడే, హైదరాబాద్

# చందనోత్సవానికి వెండి, బంగారు కలశాలు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** సింహగిరిపై మే 2న జరగనున్న చందనోత్సవం నాడు జరిగే అష్టోత్తర శత కలశారాధన కోసం వైదికవర్గాలు వెండి, బంగారు కలశాలను సిద్ధం చేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ భండాగారం నుంచి అర్చకులు కలశాలు బయటకు తీసి శుభ్రం చేశారు. ఆలయ ప్రధాన పురోహితులు మోర్తా సీతారామాచార్యులు కలశాలకు సంప్రదాయం ప్రకారం వివిధ రంగుల దారాలు చుట్టి సిద్ధం చేశారు. వీటిని చందనోత్సవం నాడు స్వామి నిజరూప దర్శనం అనంతరం జరిగే సహస్ర ఘటాభిషేకంలో భాగంగా 300 మంది అర్చకులు 108 కలశాలతో పవిత్ర గంగధార జలాలను తీసుకొచ్చి అష్టోత్తర శత కలశారాధన నిర్వహిస్తారు.



కలశాలకు దారాలు చుడుతున్న ప్రధాన పురోహితులు మోర్తా

### సింహగిరిపై గంధం అరగదీత

వైదిక సంప్రదాయం ప్రకారం అప్పన్న ఆలయంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తొలి చందనం అరగదీత కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైదిక వర్గాలు తెలిపాయి. ఆలయ ఆచారం ప్రకారం శ్రీచందనం చెక్కలకు పూజలు చేసి ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు సీతారామాచార్యులు తొలి చెక్కను అరగదీస్తారు. అనంతరం బేడామండపంలో ఏర్పాటు చేసిన రాళ్లపై సిబ్బంది చందనం అరగదీత కార్యక్రమం చేపడతారు.

# మనసున్న మారాజు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అంగవికలురైన అభాగ్యులు సైతం తమ పిల్లలతో సమానమంటూ అనేకమంది ఉపన్యాసాలిస్తుంటారు.. కానీ.. దాన్ని నిజంచేసి చూపారు సత్యనారాయణ గుప్త. సరూర్‌నగర్‌లో ఉండే ఆయన గత కొన్నేళ్లుగా సామాజికసేవలో తరిస్తున్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న తన కుమారుడికి బుధవారం రాత్రి నాగోలులోని ఒక ఫంక్షన్‌ప్యాలెస్‌లో వివాహం నిశ్చయించారు. ఎప్పుడూ పేదలకు ఏదో ఒకటి చేయాలనుకునే సత్యనారాయణ గుప్త, పద్మ దంపతులు ఆ వివాహవేడుకను వినూత్నంగా మలిచారు. తన రెండో కుమారుడైన ఉదయ్‌గుప్త, నందిని వివాహంతో పాటు మరో 8మంది వికలాంగులైన వధూవరులకు అదే పందిరిలో అంతే ఆర్భాటంగా పెళ్లి జరిపించారు. వధూవరులందరికీ మంగళసూత్రాలు, పట్టువస్త్రాలు, నెలరోజులకు సరిపడా నిత్యవసర సరకులు, ఇంటికి సంబంధించిన పాత్రలు ఇచ్చి, వారి బంధువుల సమక్షంలో అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు.



సత్యనారాయణగుప్త, పద్మ

# ఇలాంటి గోదానాలు ఎంతో మంచివి

ప్రత్యక్ష గోదానాలు అందరికీ తెలిసినవే. అయితే మహాపుణ్యాన్ని ప్రసాదించే మరి కొన్ని గోదానాలలో తిల, జల, రస, గుడ గోదానాలతో పాటు చక్కెర, తేనె, క్షీర, దధి (పెరుగు), నవనీత(వెన్న), లవణ(ఉప్పు), కార్పాస(పత్తి)తో చేసిన ధేనువుల దానాల పుణ్యఫలం అసామాన్యమని చెబుతోంది వరాహపురాణం. ఈ పురాణంలో నూరు నుంచి నూటపది అధ్యాయాల నిడివిలో ఈ పదార్ధాలతో ఆవుదూడల నిర్మాణం, వాటిని పూజించే

ధర్మపథం

విధానం, ఆ తర్వాత దానం ఇచ్చే విధానం అన్నీ వివరంగా ఉన్నాయి. ఈ వరుసలో తేనెతో చేసిన గోవును పూజించి దానమిచ్చిన వారు స్వర్గసుఖాలను అనుభవించిన తర్వాత బ్రహ్మలోకానికి వెళ్లే అర్హతను పొందుతారు. బ్రహ్మలోకంలో పుణ్యాన్ని అనుసరించి ఉండాల్సినన్ని రోజులు ఉండి మళ్లీ భూలోకంలో ఐశ్వర్యవంతుల ఇంట జన్మించి భోగాలను అనుభవిస్తారు. ఆ జన్మ తర్వాత విష్ణులోక ప్రాప్తి కలుగుతుంది. ఈ గోవును దానం చేసిన దాత వెనుక ఉన్న పది తరాలు, ముందు ఉన్న పది తరాలు, అతడి తరం మొత్తం ఇరవైఒక్క తరాలవారు విష్ణుసాయిజ్యాన్ని పొందే అర్హత సంపాదించుకుంటారు.

## పాలు, పెరుగు, ఉప్పుతోనైనా..

ఆ తర్వాతది క్షీరధేను దానం. ఈ గోవును దానం చేసిన దాత ఇంద్రలోకానికి వెళ్లి అక్కడ ప్రసిద్ధికెక్కుతాడు. తాతలు, తండ్రితో పాటుగా బ్రహ్మలోకాన్ని చేరుకొనే పుణ్యం దక్కుతుంది. ఆ తర్వాత చివరగా విష్ణులోక నివాస యోగ్యత దక్కుతుంది. దధిధేనువు అంటే పెరుగుతో చేసిన ఆవు అని అర్థం. ఈ ఆవుకు పూజచేసి దానమిచ్చినవారి ఇరవైఒక్క తరాలు ముక్తిని పొంది విష్ణులోకంలో నివసించగలుగుతారు. వెన్నతో చేసిన ఆవును దానం చేస్తే వెనుక, ముందు తరాల పితృదేవతలంతా తరిస్తారు. లవణం అంటే ఉప్పు అని అర్థం. ఉప్పుతో చేసిన గోదానం కూడా గొప్పపుణ్యాన్నే ఇస్తుంది. ఆవుపేడతో అలికిన పవిత్ర ప్రదేశంలో జింకచర్మాన్ని పరిచి దర్భాసనాన్ని ఉంచాలి. ఆ దర్భాసనం మీద పదహారు తూముల ఉప్పుతో ఆవు రూపాన్ని సిద్ధపరచాలి. నాలుగు తూములు ఉప్పుతో ఆవుదూడను చేసి చెరకుగడలతో కాళ్లను, బంగారంతో ముఖాన్ని, కొమ్ములను, వెండితో గిట్టలను, బెల్లంతో నోరును, పండ్లతో దంతాలను, చక్కెరతో నాలుక, గంధంతో ముక్కు, రత్నాలతో కళ్లు, మంచిఆకులతో చెవులు, మంచి గంధపుచెక్కతో పొట్ట, వెన్నతో పొదుగు, తాడుతో తోక, రాగితో పిరుదుల భాగం, దర్భలతో రోమాలు కల్పించాలి. పాలు పితికే పాత్రగా లవణధేనువు దగ్గర రాగిపాత్రను ఉంచటమే మేలు. గంటలు, రకరకాల ఆభరణాలతో ఆ గోవును చక్కగా అలంకరించాలి. ఈ లవణధేను పూజ, దానాలు చేసినవారికి రుద్రలోకప్రాప్తి కలుగుతుంది.

## గ్రహపీడలు పోవాలంటే...

చివరగా పత్తితో కూడా ఆవును చేసి దాన్ని దానమిచ్చి గొప్ప పుణ్యాన్ని పొందవచ్చని వరాహపురాణం వివరిస్తోంది. అయన



కాలాలు, సంక్రాంతి పుణ్యకాలం, సంవత్సరాది, గ్రహణ సమయం, గ్రహపీడలు ఉన్నప్పుడు, పీడకలలు వచ్చినప్పుడు, దయ్యాలు కనిపించినప్పుడు, పుణ్యక్షేత్రాలకు వెళ్లినప్పుడు కార్పాస (ప్రత్తి)తో చేసిన ఆవును దానమివ్వడం శ్రేయస్కరం. ఆవుపేడతో అలికిన పవిత్ర ప్రదేశంలో ముందుగా దర్భలను పరవాలి. ఆ దర్భల మీద నువ్వుల పాత్రలను ఉంచి ఆ పాత్రలనడుమ పత్తితో చేసిన ఆవునుంచాలి. దానికి వస్త్రాలు, పూలదండలు, గంధం లాంటివి అలంకరించాలి. ధూప దీప నైవేద్యాలను సమర్పించాలి. ఆవురూపాన్ని చెయ్యడం కోసం నాలుగు బారువుల పత్తి అవసరమవుతుంది. ఒక బారువుతో ఆవుదూడను నిర్మించాలి. బంగారు కొమ్ములు, పండ్లతో దంతాలు, రాత్నలతో పొట్ట ఉండేలా నిర్మించాలి. పత్తితో చేసిన ఆవును దూడతో సహా దానమిచ్చినవారు సంసారసాగరం నుంచి సులభంగా బయట పడి మోక్షాన్ని చేజిక్కించుకుంటారు అని వరాహపురాణం ప్రత్యేకంగా వివరిస్తోంది. ఇలాంటి గోదానాలను చేయాలనుకున్నవారు ఆయా గోవుల, దూడల రూపాలను ఆయా వస్తువులు, పదార్థాలతో సుందరంగా నిర్మించేవారి సహాయాన్ని తీసుకోవాలి. దానం చేసేటప్పుడు, ఆ తర్వాత పాటించాల్సిన నియమాల వంటి వాటిఅన్నింటినీ గోదాన విషయాలు తెలిసిన పండితుల ద్వారా తెలుసుకొని వారి పర్యవేక్షణలోనే ఈ గోదానాలు చేయటం మేలు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# బ్రహ్మకాయ

జాతీయాలు నుడికారాలు

ఇదేమి విచిత్రమైన కాయ అని కొంతమందికి అనిపించవచ్చు. కానీ బ్రహ్మకాయ జాతీయాల వరుసలో చేరి కనిపిస్తుంది. సొరకాయ, బీరకాయలాంటి కాయ మాత్రం కాదు. కొంతమంది ఎంతో పురాతనమైన విషయాలను కూడా తమకు బాగా పరిచయమున్నట్టు చెప్పేస్తుంటారు. మరికొంతమంది భారతంలో భీష్మాచార్యుడి లాగా చాలా పాతతరం వారుంటారు. అలాంటి వారిని గురించి పేర్కొనటానికి ఆయనకు బ్రహ్మకాయ అని అనటం కనిపిస్తుంది. అలాగే బ్రహ్మ శబ్దం అధికం అనే అర్థంలో కూడా ప్రయోగంలో ఉంది. కొంతమంది చాలా ఎక్కువగా కదిలిస్తేచాలు గడగడ మాట్లాడేస్తుంటారు. ఇలాంటి వాచాలుడిని కూడా ఈ జాతీయంలో సూచించటం కనిపిస్తుంది.

ఆంధ్రావని

# జై చెన్నకేశవా.. జైజై చెన్నకేశవా !

**ఒంగోలు, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** జై చెన్నకేశవా.. జైజై చెన్నకేశవా నామస్మరణలతో మార్కాపురం పట్టణం హోరెత్తింది ఇసుకేస్తే రాలనంత భక్తజనంతో పట్టణం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు కిటకిటలాడింది. వీధులన్నీ భక్తులతో పోటెత్తాయి. ఈసారి మునుపెన్నడూ లేనంతగా భక్తులు లక్ష్మీచెన్నకేశవుని దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు వేలాదిగా బారులుతీరారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది ముందుగా సాయంత్రం 4 గంటలకు ఆలయ అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను స్వర్ణ, రజిత మణిమయభూషిత ఆభరణాలు, ప్రత్యేక పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. రథం వద్ద విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించిన అనంతరం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామిని రథంపైకి చేర్చారు. ఒంగోలు ఎంపీ మాగుంట, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల, అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డి పూజలు చేశారు. స్థానిక రాజాజీ వీధి, గడియార స్తంభం, దోర్నాల బస్టాండ్, నాయుడువీధి గుండా సాగి చివరికి ఆలయం వద్దకు రథోత్సవం చేరుకుంది. దేవాదాయశాఖ సీజేఎఫ్ చంద్రశేఖర్, కార్యనిర్వాహణాధికారి ఏపీ నారాయణరెడ్డి రథోత్సవ కార్యక్రమాలు పర్యవేక్షించారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గజ వాహనంపై సార్వభౌమాలంకారంలో స్వామివారు గురువారం వేకువజామున భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి కేశవాచార్యులు, నంద్యాల తిరుమలాచార్యులు స్వామివారి ఉత్సవమూర్తిని సార్వభౌమాలంకారంలో శోభాయమానంగా అలంకృతులను చేశారు. అనంతరం గజ వాహనంపై ప్రతిష్ఠించి ఉభయదాతలు పెరుమాళ్ల వెంకట సుబ్రహ్మణ్యం, తంగిరాల వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేయించారు. అలంకారప్రియుడు, అందరి దేవుడైన స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని మాడవీధుల్లో భక్తజనులు దర్శించుకుని తరించారు. పలువురు పట్టణ ప్రముఖులు స్వామివారి పీఠాన్ని మోసేందుకు పోటీపడ్డారు. నగరోత్సవంలో పాల్గొన్న పట్టణ బ్రాహ్మణ సంఘం సభ్యులు వేదపారాయణం చేసుకుంటూ ముందుకు సాగారు. నగరోత్సవంలో సింహభాగాన కాళికా ప్రసాద్ బృందం దేవతా వేషధారణలతో ఆకట్టుకున్నారు.



అలంకరణలో స్వామి అమ్మవార్లు

## మెట్లెక్కి... దేవుడికి మొక్కి..



**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** తెదేపా అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అవ్వాలని కోరుతూ తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుదేవరెడ్డి మోకాళ్లపై కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కొండపైకి ఎక్కారు. కింద నుంచి పైవరకు సుమారు 600మెట్లను ఎండను సైతం లెక్కచేయకుండా చంద్రబాబు చిత్రపటంతో మోకాళ్లతో పైకెక్కారు.



ఏరూరు రామలింగేశ్వర రథోత్సవం

# భక్తిశ్రద్ధలతో రథోత్సవం

**కర్నూలు, న్యూస్‌టుడే:** ఏరూరులో రామలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి వేల మంది తరలివచ్చారు. భక్తులు, కళాకారులు నృత్యాలు చేసి అలరించారు. అంతకుముందు పార్వతీ పరమేశ్వర్లకు కల్యాణం నిర్వహించారు. భక్తుల కోసం నిర్వాహకులు అన్నదానం చేశారు.

# ప్రయాణంలోనే విద్యుదుత్పత్తి

## వినూత్నకారు తయారుచేసిన ఇంజినీరింగ్ విద్యార్థులు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** పెట్రోలు, డీజిల్‌తో నడిచే కార్లకు ప్రత్యామ్నాయంగా గ్యాస్‌తో, కరెంటుతో నడిచే కార్లు వచ్చాయి. ఆయా కార్లలోనూ కొన్ని ఇబ్బందులు ఉన్న దృష్ట్యా ఇటీవలే ఇంజినీరింగ్ చదువులు పూర్తిచేసిన ఈ విద్యార్థులు ఓ వినూత్నమైన కారు రూపొందించారు. రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవలే బీటెక్ మెకానికల్ పూర్తిచేసిన 13మంది విద్యార్థులు పరిశోధనా ప్రాజెక్టులో భాగంగా కారులోనే విద్యుత్తు ఉత్పత్తి అయ్యేలా ఓ కొత్తకారు రూపొందించారు. కారు ఇంజిన్ ముందుభాగంలో ఓ గాలిమరను ఏర్పాటుచేశారు. కారు 40కిలోమీటర్ల వేగం అందుకోగానే ఈ మరద్వారా వచ్చే గాలి ద్వారా బ్యాటరీల్లో కరెంటును ఉత్పత్తిచేస్తుంది. అలా జనరేట్ అయిన విద్యుత్తును ప్రయాణంలో ఉండగానే వాడుకోవచ్చు. కరెంటు కార్లకు పెట్రోలుతో నడిచే అవకాశంలేదు. కానీ.. వీరు రూపొందించిన కారును పెట్రోలుతోనూ నడపొచ్చు. పెట్రోలు వాడకాన్ని తగ్గించడంతో గణనీయంగా డబ్బుకూడా ఆదా అవుతుందని బృందంలోని శ్రీకాంత్, ప్రశాంత్, నవీన్ తెలిపారు. వీరితో పాటు నిశాంత్, కృష్ణసాయి, నర్సింహ, పి.రాజేష్, సీహెచ్ రాజేష్, విష్ణువర్ధన్, ప్రణయ్‌సింగ్, సాయిచరణ్‌లతో పాటు రీతూరాజ్ అనే విద్యార్థిని సైతం పాలుపంచుకుంది.



బీ టూ వే పవర్ ఆటోమొబైల్ కారుతో గురునానక్ ఇంజినీరింగ్ విద్యార్థులు

# అలాచేసే వారికి నిద్రపట్టదు..!

ధృతరాష్ట్ర మహారాజుకు నిద్రపట్టలేదు. పుట్టుగుడ్డి అయిన ఆ రాజుకు నిద్రపడితే ఏం? నిద్రపట్టకపోతే ఏం? అని కొట్టిపారేసేకన్నా ఆ నిద్రపట్టకపోవటానికి వెనుకవున్న అసలు విషయాన్ని గ్రహిస్తే మనిషి ఎవరైనా చెయ్యగూడని పనులేమిటో మనకు అర్థమవుతుంది. ఈ విషయాన్ని వివరించే కథ మహాభారతం ఉద్యోగపర్వంలో కనిపిస్తుంది. కౌరవులకు, పాండవులకు యుద్ధం జరగకుండా చూడటానికి జరిగిన రాయబారాలలో సంజయుడి రాయబారం కూడా ఒకటి. కౌరవుల పక్షాన పాండవుల దగ్గరకు సంజయుడు రాయబారిగా వెళ్లాడు, వచ్చాడు. అయితే తిరిగి వచ్చేసరికి చాలా పొద్దుపోవడంతో ధృతరాష్ట్ర మహారాజును కేవలం దర్శించి రాయబారం విఫలమైంది అని మాత్రమే చెప్పి ఇతర విశేషాలన్నీ మరుసటి రోజు ఉదయాన్నే నిండు సభలో అందరి సమక్షంలో చెబుతానని తన ఇంటికి తాను వెళ్లిపోయాడు.

### హితవచనాలు పలికిన విదురుడు

సంజయుడు అలా పూర్తి విషయాలు చెప్పకుండా వెళ్లడంతో ఆ మహారాజు తీవ్రంగా మథనపడసాగాడు. కౌరవులకు, పాండవులకు నడుమ ఏర్పడిన తీవ్ర పరిస్థితులు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయోననే ఆందోళనతో ధృతరాష్ట్రుడి మనస్సు అల్లకల్లోలమైంది. కాస్తంత సేపు ఎవరైనా వచ్చి మంచిమాటలు చెప్పి మనశ్శాంతి కలిగిస్తే బాగుండును అని అనుకున్నాడు. ఆ ఆలోచన రాగానే వెంటనే విదురుడికి కబురు వెళ్లింది. మహారాజు అంతరాత్రివేళ విదురుడికి కబురు చెయ్యటం అదే మొదటిసారి. విదురుడు కూడా రాజాజ్ఞను పాటించి



వెంటనే బయలుదేరివచ్చి నమస్కరించి కూర్చున్నాడు. తనకు నిద్రపట్టడంలేదని, కాస్త మంచిమాటలేవైనా చెప్పమని అడిగాడు రాజు. విదురుడు సూటిగానే మాటలందుకున్నాడు. నిద్రపట్టకపోవటానికి కారణం దుర్బలులకైతే బలవంతులతో విరోధం తెచ్చుకోవటంగా గుర్తించవచ్చున్నాడు. అలాగే ఇతరుల సంపదలను హరించినవారికి, మితిమీరిన కామవాంఛలున్నవారికి, దొంగలకు మాత్రమే రాత్రిపూట నిద్రపట్టదని అన్నాడు. ఈ లక్షణాలేవీ ధృతరాష్ట్రుడికి లేనప్పుడు నిద్రపట్టకపోవటానికి కారణమేదో తనకు తెలియటం లేదన్నాడు విదురుడు. కలతచెందిన ధృతరాష్ట్రుడు ప్రస్తుతం తనకేవైనా ధర్మ వచనాలు చెప్పమన్నాడు. విదురుడు ఆ సందర్భంలో ధృతరాష్ట్రుడు చేసిన అన్యాయపు పనులను వివరించి అలాంటివి చేసినందు వల్లనే మనశ్శాంతి కరవైందన్నాడు. ఉత్తమ గుణాలు, ఉన్నత ఆశయాలు కలిగివున్న ధర్మరాజు నిత్యం ధర్మమార్గంలోనే ప్రవర్తిస్తూ ధృతరాష్ట్రుడిని గౌరవిస్తూ ఎంతో వినయంగా ప్రవర్తిస్తున్నా, ధర్మరాజుకు అన్యాయం కలిగేలా ధృతరాష్ట్రుడు ప్రవర్తించాడని అందుకే అంతటి అశాంతి ఏర్పడిందన్నాడు. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడులాంటి దుష్టులను నమ్మి ప్రోత్సహిస్తూ రాజ్యభారాన్ని వారికప్పగించటం అపఖ్యాతికి కారణమైందన్నాడు. ఇలాంటి ఘోరమైన తప్పిదాలు చేసి శాంతి కావాలంటే ఎలా వస్తుంది అని అన్నాడు.

### తొందరపాటుతనమూ తప్పే...

మంచి స్వభావం కలిగినవాడు, నిరంతరం మంచిమార్గంలో ప్రయత్నం చేసేవాడు, కష్టాలను ఎదుర్కొనే గుణంకలిగినవాడు, ధర్మ మార్గంలో నడిచేవాడు అయిన మనిషి ఎప్పుడూ వంచనకు గురికాడని, అలాంటి



వారు దుష్టులను గమనించి దూరంగా వారిని ఉంచుతారని అన్నాడు. భోగలాలసత మీద ఆలోచన లేకుండా కాలం గడుపుతూ ఎవరినీ నొప్పించని విధంగా మాట్లాడుతూ తమకు అందుబాటులోకి రాని వాటిని గురించి విపరీతంగా ఆలోచించకుండా ఉంటూ ఏవైనా వస్తువులు పోతే వాటికోసం బాధపడకుండా, కష్టాలు మీదపడ్డప్పుడు అధైర్యపడకుండా ఉండటం సత్పురుషుల లక్షణం అన్నాడు. ఏ పనిని ప్రారంభించినా దానిని నిర్విఘ్నంగా పూర్తిచేయటం, ఎలాంటి పరిస్థితులలోనూ సోమరితనాన్ని దరిచేరనీయకుండా ఉండటం, మనసును స్వాధీనంలో ఉంచుకోవటంలాంటి పనులు చేస్తే అశాంతితో అలమటించాల్సిన అవసరం ఉండదన్నాడు. పొరపాటున ఎవరైనా తమను నిరాదరించినప్పుడు తొందరపడి వారిమీద కోపాన్ని తెచ్చుకోవటం, అలాగే ఎదుటివారు ఆదరించారు కదా అని వారు ఎలాంటివారు అని ఆలోచించకుండా విపరీతంగా వారిని పొగుడుతూ ఆనందించటం మంచిదికాదన్నాడు. స్వధర్మాన్ని విడిచిపెట్టి ఇతరుల బాటలో నడిచేవాడు, స్నేహితులతో సరిగా మెలగనివాడు, ఎదుటివాడు అడగకుండానే వారితో సంభాషణలకు దిగేవాడు, అనర్హులకు ఉపదేశాలిచ్చేవాడు ఇలాంటి వారంతా మూర్ఖులతో సమానం. విద్య, దానగుణం ఎంతగా ఉన్నా అహంకారం మాత్రం ఉండకూడదు. తనమీద ఆధారపడ్డవారిని విస్మరించి తానొక్కడే పొట్ట నింపుకోకూడదు. ప్రజాసముహంతో ఎప్పుడూ విరోధం తెచ్చుకోకూడదు. ఆ విరోధం రాజును పదభ్రష్టుడుని చేసి తీరుతుంది. ఇటువంటి విషయాలన్నీ మనసులో ఉంచుకొని నడుచుకుంటే అశాంతి వాటిల్లదు అని విదురుడు ధృతరాష్ట్రుడికి ధర్మప్రబోధం చేశాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

---



నిత్య సంతోషిణికి ఘంటసాల పురస్కారం అందజేస్తున్న చంద్రమోహన్, మాధవపెద్ది తదితరులు

# గాయకుల్లో మేటి ఘంటసాల

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ఘంటసాలను అధిగమించే గాయకుడు ఇంతవరకు పుట్టలేదని వక్తలు అన్నారు. శరణ్ ఇన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'గానామృతం' ఘంటసాల పురస్కార-2014' ప్రదానోత్సవం రవీంద్రభారతిలో నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా తొలి తెలుగు నేపథ్యగాయని రావు బాలసరస్వతిదేవి, ప్రముఖ నేపథ్యగాయని నిత్య సంతోషిణిలకు ఘంటసాల పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి 'ఈనాడు-ఈటీవీ' మీడియా భాగస్వామిగా వ్యవహరించింది. మండుటెండలో మంచుకొండల్లో విహరిస్తున్నామా అన్నంత హాయిగా గాయనీ, గాయకులు అలనాటి మేటి సంగీత దర్శకులు ప్రాణప్రతిష్ట చేసిన ఆపాతమధురాలు ఆలపించి మదిదోచేశారు. 'మావ మావా.. మావ..' అనే గీతాన్ని గాయకులు సాందీప్, శ్రీరమ్య హుషారుగా ఆలపించి ఉర్రూతలూగించారు. పరమేశ్వర్(అంధుడు) 'ఈ నల్లని రాళ్లలో'.. గీతాన్ని ఆలపించి ఆకట్టుకున్నారు. ఇవేకాకుండా గాయనీ గాయకులు నిత్యసంతోషిణి, నిహాల్, సురేఖా మూర్తి, లక్ష్మీమేఘన, హరిప్రియలు కమ్మని కంఠంతో ప్రేక్షకులను హృదయానందాన్ని పంచారు. నర్తనశాల అకాడమి ఆఫ్ కూచిపూడి డాన్స్ కళాకారులు 'శివశంకరి శివానందలహరి' అంశం నయనమనోహరంగా సాగింది. సభలో ప్రముఖ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్ మాట్లాడుతూ.. నేడు ఎంత మంది సంగీతదర్శకులు, గాయకులున్నా ఘంటసాల లేని లోటు కనిపిస్తుందన్నారు. బాలసరస్వతిదేవిది అమ్మ మనసు అని ఆమె వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. నటుడు చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఘంటసాలను అధిమించే గాయకుడు ఇక ముందు కూడా పుట్టకపోవచ్చునని అన్నారు.

# కైత్కాలతనం

**ఈ** జాతీయం తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా వినిపిస్తుంది. కైత్కాలతనమంటే కైతగల తనమని అర్థం. కైత అనే పదం కవిత్వానికి సమానార్థకం. దాన్ని రకరకాలుగా చిత్రించటం, అలంకారిక ధోరణిలో అందంగా చెప్పటం అనేది భావన. దీంట్లో అక్కడక్కడా రవ్వంత వ్యంగ్యం, హాస్యం కూడా మిళితమై ఉంటే ఆ పద్ధతిని కైత్కాలతనం అని గ్రామప్రాంతవాసులు అంటుంటారు. ‌ఌఅక్కడ జరిగిందేందో సరిగా తెలియకపోయినా వాడు చెప్పిన దాంట్లో కైత్కాలతనం బాగుంది' అనేలాంటి సందర్భాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది.

# అశ్వవాహనంపై స్వామి

**మార్కాపురం , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు శ్రీరంగనాయక స్వామి అలంకారంలో అశ్వ వాహనంపై పురప్రజలకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో ముందుగా ప్రధానార్చకులు శ్రీపతి కేశవాచార్యులు, నంద్యాల తిరుమలాచార్యులు స్వామివారి ఉత్సవమూర్తిని రంగనాయక అలంకారంలో ముగ్ధ మనోహరంగా తీర్చిదిద్దారు. ఉభయదాత జటప్రోలు దక్షిణామూర్తి శర్మ కుటుంబసభ్యులు ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు ఆలయం వద్ద అశ్వ వాహనోత్సవం ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



# అప్పన్న ఆలయంలో సుగంధ పరిమళం

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** ఉషోదయం వేళ చల్లనిగాలులు వీస్తుండగా అప్పన్న ఆలయంలో గంధం పరిమళాలు గుభాళించాయి. వైదిక సంప్రదాయం ప్రకారం శుక్రవారం చందనం అరగదీత కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. తొలుత ఆలయ భండాగారంలోని గంధం చెక్కలను బయటకు తీసి బేడామండపంలో విష్వక్షేన ఆరాధన జరిపారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు శిరస్సుపై గంధం చెక్కలు పెట్టుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అనంతరం చెక్కలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన పురోహితులు మోర్తా సీతారామాచార్యులు నేతృత్వంలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు ముఖానికి నూతన వస్త్రం చుట్టుకుని తొలి గంధం చెక్కను అరగదీశారు. అనంతరం ఈవో రామచంద్రమోహన్, స్థానాచార్యులు టి.పి.రాజగోపాలాచార్యులు, అర్చకులు సీతారామాచార్యులు గంధం అరగదీశారు. అరగదీసిన పచ్చి చందనాన్ని మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు స్వామికి సమర్పించారు. అనంతరం ఈవో కె.రామచంద్రమోహన్ సిబ్బందికి సంప్రదాయ దుస్తులు పంపిణీ చేశారు. తొలిరోజు 22.5 కిలోల పచ్చి చందనాన్ని అరగదీశారు. కాగా చందనోత్సవం రోజున స్వామికి సమర్పించేందుకు రూ.50 వేల విలువైన పట్టువస్త్రాలను శ్రీరామ పంకజ అనే దాత సమర్పించినట్లు ఈవో తెలిపారు.



తొలి గంధం చెక్కను అరగదీస్తున్న ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు



# రమణీయం రథోత్సవం

**కర్నూలు, న్యూస్‌టుడే:** చిగళిలో కొలువైన తిప్పన్నతాత రథోత్సవం కన్నుల పండుగలా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. తెల్లవారుజామనే ప్రభోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం రథోత్సవానికి సాత్విక, బలి, హోమాలు నిర్వహించారు. వేల మంది భక్తజన సందోహం నడుమ రథాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులు పూజలు చేశారు.

# ప్రళయకాలంలో ఉండేది గోలోక శ్రీకృష్ణుడే

ధర్మపథం

**సృ**ష్టికి ముందు ప్రళయకాలంలో కూడా నిలిచి ఉండే లోకమేది, ఆ లోకంలో ఉండే దేవుడు ఏ రూపంలో ఉంటాడు అనే విశేషాలను వివరించే ఈ కథాసందర్భం బ్రహ్మావైవర్త పురాణం బ్రహ్మఖండం రెండో అధ్యాయంలో ఉంది. యుగాంతమయ్యేటప్పుడు ప్రళయం సంభవిస్తుంది. అప్పటిదాకా ఉన్న సృష్టి మొత్తం ఆ ప్రళయంలో నశించి పోతుంది. అయితే ప్రళయకాలంలో కూడా తర్వాత జరిగే సృష్టికంతటికీ కారణమైన ఒకే ఒక్కటి నిలిచి ఉంటుంది. అదే దివ్యజ్యోతి. దివ్యమైన ఆ జ్యోతి మరేదో కాదు స్వేచ్ఛామయుడైన పరమపురుషుడిది. ఆ జ్యోతిపుంజం మధ్య స్వర్గ, మర్త్య, పాతాళాలనే మూడు లోకాలుంటాయి. ఆ ముల్లోకాలకుపైన ఆ దివ్యజ్యోతి లాగానే ఎప్పటికీ నశించని గోలోకం ఉంటుంది. ఆ గోలోకం మూడు కోట్ల యోజన పర్యంతంగా విస్తరించి గుండ్రంగా ఉండే లోకం. అక్కడ అంతా విలువైన రత్నాలు పరచి ఉంటాయి. జ్యోతి స్వరూపుడైన పరమపురుషుడిలాగానే తేజోరూపంగా ఉంటుంది. గొప్పగొప్ప యోగులు కూడా దాన్ని చూడలేరు. కానీ విష్ణుభక్తులకు మాత్రం అది స్పష్టంగా కనిపిస్తుంటుంది. వారికే ఎందుకలా కనిపిస్తుంది అంటే అనితరసాధ్యమైన భక్తితో వారున్నందువల్లనే. అంతరిక్షంలో ఉన్న ఆలోకం పరమపురుషుడైన శ్రీకృష్ణుడి యోగశక్తి చేత నిలిచి ఉంటుంది. అక్కడ విశేషమేమంటే మనోవ్యథలు, వ్యాధులు, ముసలితనం, చావు, శోకం, భయమనేవి కనిపించవు. అక్కడుండే భవనాలన్నీ దివ్యమైన రత్నాలతో నిర్మితమై ఉంటాయి. ప్రళయకాలంలో అక్కడ గోలోక శ్రీకృష్ణుడు మాత్రమే నిలిచి ఉంటాడు. సృష్టి కాలంలో మాత్రం గోప, గోపికాజనం శోభిల్లుతుంటారు.

### ఎప్పుడూ గోపవేషంలోనే..

ఆ గోలోకానికి కింది భాగంలో కుడివైపున వైకుంఠం, ఎడమవైపున శివలోకం ఉంటాయి. సృష్టికాలంలో నాలుగు భుజాలతో ఉన్న సహచరులుగల లక్ష్మీనారాయణులతో ఆ లోకం కనిపిస్తుంటుంది. అంటే లక్ష్మీనారాయణుల సారూప్యాన్ని పొందిన భక్తులు మాత్రమే అక్కడ ఉండగలుగుతారు. ఇక రెండోలోకమైన శివ లోకం కోటియోజన పర్యంతమై ఉంటుంది. ఈ లోకం కూడా కేవలం సృష్టికాలంలో మాత్రమే ఉండి లయకాలంలో కనిపించకుండా పోతుంది. ఈ లోకాల సృష్టి అన్నింటికీ మూలకారణమైన ఆ దివ్యజ్యోతి ఎంతో మనోహరమైనది. ఆ జ్యోతిని చూడగలిగే పరమభక్తులకు ఆహ్లాదాన్ని, శాశ్వతమైన పరమానందాన్ని అది కలిగిస్తుంది. ఆ జ్యోతి మధ్యభాగంలో ఓ మనోహరమైన రూపం కనిపిస్తుంది. నల్లని మేఘాన్ని పోలిన ఛాయతో, ఎర్రని కలువలను పోలిన కన్నులతో, శరత్కాల పౌర్ణమినాటి చంద్రుడిలా నిర్మలంగా ఉన్న ముఖంతో కోటి మన్మథుల లావణ్యంతో అందంగా ఉంటుంది ఆ రూపం. రెండు చేతుల్లోనూ ఒక చేత మురళి పట్టుకొని చిరునవ్వు ముఖంతో పచ్చని వస్త్రాలను, మంచి రత్నభూషణాలను అలంకరించుకొని, చందనాన్ని అద్దుకొని కస్తూరి తిలకాన్ని ధరించి రొమ్ము మీద శ్రీవత్స లాంఛనంతోనూ, కౌస్తుభమణితోనూ దివ్యంగా అలరారుతుంది ఆ రూపం. అంతేకాదు శిరసు మీద రత్నాలు తాపడం చేసిన బంగారు కిరీటం, మెడలో వనమాల, ధరించి ఒక దివ్యమైన రత్న సింహాసనం మీద ఠీవీగా కూర్చొని ఉండే ఆ దివ్యరూపమే గోలోక శ్రీకృష్ణుడు. పరబ్రహ్మం అన్నా, భగవంతుడన్నా ఆయనే.



సృష్టి సమస్తానికీ ఆధారభూతుడైన ఆ స్వామి ఎప్పుడూ అలా గోపవేషంలో ఉంటాడు. నవయవ్వన వయసులో ఎప్పుడూ అలా చిరునవ్వులు చిందిస్తూ ఉండే ఆ పరబ్రహ్మ కోటి పూర్ణచంద్రుల శోభతో వెలుగొందుతూ భక్తులను అనుగ్రహించేందుకు సిద్ధంగా ఉంటాడు.

### అన్నీ ఆ ఆదిపురుషుడే

ఆయనకంటూ స్వార్థమైన కోరికలు ఏవీ ఉండవు. ఆ స్వామి నిర్వికారుడు.. సర్వపరిపూర్ణుడు. రాసమండల మధ్య భాగమంటే ఎంతో ఇష్టపడే రాసేశ్వరుడు ఆయన. శాంతుడన్నా, మంగళస్వరూపుడన్నా, మంగళప్రదుడన్నా ఆయనే. పరమానందకారుడు, సత్యస్వరూపుడు. అక్షరుడు, అన్వయుడు, సర్వస్థిలకు అధీశుడు, సర్వసిద్ధి స్వరూపుడు అని ఎవరైనా కీర్తిస్తే అవన్నీ సరిపోయేది ఆ ఆదిపురుషుడికే. భక్తులకు సమస్త సిద్ధులను ఇచ్చేవాడు కనుకనే ఆయనను పరబ్రహ్మం అని అన్నారు. ఆ పరబ్రహ్మం విశేషాలు అన్నీఇన్నీ కావు. ఆయన ప్రకృతికి అతీతుడు, ఈశ్వరుడు, నిర్గుణుడు, ఆదిపురుషుడు, అవ్యక్తుడు, స్వతంత్రుడు, అద్వితీయుడు, పరమాత్ముడు. అలాంటి ఆ స్వామిని శాంతాత్ములై ఎవరు ధ్యానించినా వారికి ఆయన అనుగ్రహం లభిస్తుంది. ప్రస్తుత కాలంలో అంతర్జాతీయంగా శ్రీకృష్ణుడిని పూజించే భక్తులు నిరంతరం ధ్యానిస్తూ, జపిస్తూ ఉండే ఆదిపురుషుడు బ్రహ్మవైవర్త పురాణం పేర్కొంటున్న ఈ గోలోక శ్రీకృష్ణుడే. ఆ స్వామిని ఆరాధించి ఆయన అనుగ్రహంతో మనశ్శాంతి లాంటి అమూల్యశాంతులను ఎందరెందరో భక్తులు పొందగలుగుతున్నారు. ఆ దివ్యతేజోరూపాన్ని బ్రహ్మవైవర్త మహాపురాణం స్పష్టంగా చూపిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# గంగపుత్రుల యాత్ర.. గంధం అమావాస్య



**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలు దాటుకొని నడి సముద్రంలో జీవనం సాగించే గంగపుత్రులు ఏడాదికోసారి సింహగిరికి విచ్చేసి అప్పన్నను దర్శించుకోవడం గంధం అమావాస్యగా ఈ ప్రాంతంలో పేర్కొంటారు. చందనయాత్రకు మూడు రోజుల ముందు సింహగిరికి విచ్చేసి స్వామివారిని సంకీర్తనలతో ఆరాధిస్తారు. మే 2న చందనయాత్ర జరగనుండగా ఈనెల 29న గంధం అమవాస్య రానుండటంతో ఉత్సవం ప్రత్యేకతలివీ. గంధం అమావస్య ఉత్సవం వెనుక చారిత్రక నేపథ్యం, ఎన్నో ఆచార సంప్రదాయాలున్నాయి. కళింగ తీర ప్రాంతం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాల జాలర్లకు, అప్పన్నస్వామికి మధ్య ఎంతో ఆధ్యాత్మిక బంధం ఉంది. సంవత్సరమంతా సముద్రంలో వేటాడే మత్స్యసంపదతో గంగపుత్రులు జీవనం సాగిస్తారు. సాగరంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండాలని ప్రతిరోజు అప్పన్న స్వామిని కొలుస్తారు. గంధం అమావస్య రోజున మత్స్యకారులంతా పిల్లాపాపలతో సింహగిరి చేరుకొని సంకీర్తనలతో ఆరాధిస్తారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది మంది జాలర్లు కొండ దిగువన వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామికి పండ్లు, ఫలాలు నైవేద్యంగా సమర్పిస్తారు. గంగపుత్రులు సమర్పించే నైవేద్యంగా చేపలు, పప్పు దినుసులతో నైవేద్యం తయారు చేసి పెట్టడం వింతగా కనిపిస్తుంది. జాలర్లంతా సామూహికంగా ఉదయం నుంచి రాత్రి వరకు స్వామిని జానపద బాణీల్లో సంకీర్తనలతో గానం చేసి ఆరాధిస్తారు. సంవత్సరమంతా పోగుచేసిన సంపాదనలో కొంతభాగం గంధం అమవాస్య రోజు ఖర్చు చేయడం తమ ఆచారమని గంగపుత్రులు చెబుతారు. గంధం అమావాస్య సందర్భంగా కొండ దిగువన వరాహ పుష్కరిణి సమీపంలోని తోటలన్నీ భక్తులతో కిటకిటలాడిపోతాయి. సింహగిరిపై గరిడీ బృందాలు రాత్రంతా అప్పన్నస్వామి కీర్తనలతో అలరిస్తారు. ఈ ప్రత్యేకమైన గంధం అమావాస్య దేవస్థానానికి ఆదాయం సమకూరుస్తుంది. అలాగే సింహగిరిపై వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది.

**చురుగ్గా చందనం అరగదీత :** మే 2న జరగనున్న చందనయాత్ర కోసం ఆలయంలో చందనం అరగదీత కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఈమేరకు శనివారం 24మంది సిబ్బంది 34 కిలోల పచ్చి చందనాన్ని అరగదీశారు. అరగదీసిన చందనాన్ని ఆలయ ప్రధాన పురోహితులు మోర్తా సీతారామాచార్యులు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో తూకం వేసి ఆలయ భండాగారంలో భద్రపరిచారు. చందనయాత్ర సందర్భంగా ఆలయంలో నూతనంగా హుండీలు ఏర్పాటు చేస్తున్నారు. నగరానికి చెందిన జనార్దనరెడ్డి అనే భక్తుడు సింహాద్రి అప్పన్నకు సమర్పించే చందనం కోసం రూ. లక్ష విరాళాన్ని పి. లక్ష్మీదేవి పేరిట అందజేశారు. ఈ విరాళాన్ని నగదు రూపంలో ఏఈవో ఆర్వీవీఎస్ ప్రసాద్‌కు అందించారు. అధికారులు దాతకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందచేశారు.

ఆంధ్రావని

## జుంజుము

జాతీయాలు నుడికారాలు

**జుం**జము అనే రూపంలో కూడా ఇది ప్రయోగంలో ఉంది. దీనికర్థం దివ్వెనకోల అని బ్రౌణ్యం చూపిస్తోంది. అంటే దివిటీ అని అర్థం చెప్పుకోవచ్చు. పూర్వకాలం దీపావళినాడు వెలిగించే దివిటీని కూడా జుంజుము అని అంటుండేవారు. జుంజుము అన్నా, జుంజము అన్నా అర్థభేదమేమీ లేదు. వాడి ముఖం దివిటీలాగా వెలిగిపోతుంది అని చెప్పుకొనే అర్థంలోనే దివిటీకి బదులుగా జుంజుము వాడి ఒక వ్యక్తి పొందుతున్న ఆనందాన్ని తెలియచెప్పేందుకు దీన్ని జాతీయంగా వాడటం కనిపిస్తోంది.



సప్తనదీ జలాలతో ఆలయ పాలక మండలి సభ్యులు

# అభయాంజనేయస్వామికి సప్తనదీ జలాలతో అభిషేకాలు

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం సప్తనదీ జలాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామికి అర్చనలు, విశేష నామార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ వెనుకభాగంలో స్వామి మూలవిరాట్టుకు ప్రత్యేకంగా తీసుకువచ్చిన సప్తనదీ జలాలతో అభిషేకాలు నిర్వహించామని ఆలయ ప్రధానార్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు తెలిపారు. పూజాకార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయపాలక మండలి ఛైర్మన్ కేతినీడి జైనేంద్రకుమార్, పాలకమండలి సభ్యులు చలమలశెట్టి వెంకటేశ్వరరావు, మందలపు రాధాకృష్ణ, పాగోలు వెంకటేశ్వరరావు, వల్లే పుల్లమ్మ, మురాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# హంస వాహనంపై చెన్నకేశవుడు

**మార్కాపురం , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రజాపతి అలంకారంలో హంస వాహనంపై పురప్రజలకు దర్శన భాగ్యం కల్పించారు. ముందుగా ఆలయంలో ప్రజాపతి అలంకారంలో స్వామివారి ఉత్సవమూర్తిని ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి కేశవాచార్యులు, నంద్యాల తిరుమలాచార్యులు స్వర్ణ, రజిత, మణిమయభూషిత ఆభరణాలు, ప్రత్యేక పూలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అప్పటికే సిద్ధం చేసిన హంస వాహనంపై ఉంచి ఉభయదాతలు పైడా దివాకరరావు, మార్కాపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



శ్రీ లక్ష్మీనారాయణ స్వామికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఈవో ఎంజీ గోపాల్, జేఈవో భాస్కర్ తదితరులు

# వైభవంగా అద్భుత శాంతియాగం

**తిరుపతి, న్యూస్‌టుడే:** స్థానిక అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్ద అద్భుత శాంతియాగం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా తితిదే కార్యనిర్వహణాధికారి ఎంజీ గోపాల్, తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి పోలా భాస్కర్ శ్రీ లక్ష్మీనారాయణస్వామివారికి శాస్త్రోక్తంగా వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఈవో ఎంజీ గోపాల్ మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ లోక కల్యాణార్థం మూడు రోజుల పాటు అద్భుత శాంతియాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాగాల వల్ల వర్షాలు కురిసి పాడిపంటలు వృద్ధి చెందుతాయని, తద్వారా ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని వివరించారు. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు యాగం జరుగునున్నట్టు తెలిపారు. అనంతరం అలిపిరి పాదాల మండపంలోని ముఖమండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఆగమ పండితులు వైఖాసన ఆగమోక్తంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మూడు హోమగుండాలను ఏర్పాటుచేసి ఆచార్యవరణం, ప్రార్థన, పుణ్యాహవచనం, వాస్తు హోమం, మహాశాంతిహోమం, కుంభారాధనం, అగ్నిప్రతిష్ఠ, కలశస్థాపన, నిత్యహోమం, లఘుపూర్ణాహుతి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల సంయుక్త కార్యనిర్వహణాధికారి కె.ఎస్. శ్రీనివాసరాజు, పూర్వ ఈవో ఎల్వీసుబ్రమణ్యం పాల్గొన్నారు.

# భూమండలం పాదాలు.. స్వర్గం ఆయన శిరస్సు

**శ్రీ**మహావిష్ణువు ధరించే ఆయుధాలు, అలంకారాల విశేషాలను గురించి ఓ ప్రత్యేక వివరణ వ్యాసభాగవతం పన్నెండో స్కంధం పదకొండో అధ్యాయంలో ఉంది. భగవంతుడి విరాడ్రూప వర్ణన చాలా సందర్భాలలో చాలామందికి పరిచయమయ్యే ఉంటుంది. కానీ ఆయన అంగ ఉపాంగ ఆయుధాది చిహ్నాల అంతరార్థం కొంతమందికి తెలిసి ఉండకపోవచ్చు. భగవంతుడి విరాడ్రూపంలో భూమండలం ఆయన పాదాలుగా కనిపిస్తుంది. స్వర్గం శిరస్సు. నాభి అంతరిక్షం. సూర్యుడు నేత్రాలు. వాయువు నాసికాలు. దిశలు చెవులు. ప్రజాపతే లింగం. మృత్యువు గుదం. లోకపాలకులే బాహువులు. చంద్రుడే మనస్సు, యముడే కనుబొమలు. లజ్జ పైపెదవి. లోభం కిందిపెదవి. వెన్నెల కాంతులు దంతాలు. చిరునవ్వు భ్రమ. వృక్షాలు రోమాలు. మేఘాలు కేశాలు.

## ఓంకారమే యజ్ఞోపవీతం

ఆ స్వామి ధరించే కౌస్తుభమణి మరేదో కాదూ జీవచైతన్య రూపమైన ఆత్మజ్యోతి. ఆ మణి దివ్యకాంతే ఆ స్వామి వక్షస్థల మీద ఉండే శ్రీవత్సం అనే గుర్తు. సత్వరజస్తమో గుణ రూపమైన మాయ ఆ ప్రభువు ధరించిన వనమాల. గాయత్రీ తదితర ఛందస్సులు ఆ స్వామి పట్టుపీతాంబరాలు. అకార ఉకార మకారాత్మకమైన ఓంకారమే ఆ పరమపురుషుడి యజ్ఞోపవీతం. సాంఖ్యం, యోగం అనేవే ఆ దేవదేవుడి మకరకుండలాలు. సకల లోకాలకు అభయదాయకమైన బ్రహ్మలోకమే ఆ పురుషోత్తముడి కిరీటం. మూల ప్రకృతే సర్వేశ్వరుడు అధిష్ఠించిన శేషతల్పం. ధర్మజ్ఞానాదులతో కూడిన సత్వగుణమే ఆ శ్రీమన్నారాయణుడి నాభికమలం. ఇంద్రియ శక్తి, మనశ్శక్తి, దేహబలం అనే వాటితో కూడిన ముఖ్యతత్త్వమైన ప్రాణమే ఆ

ధర్మపథం

ప్రభువు ధరించే కౌమోదకి అనే గద. జల తత్త్వ రూపమే పాంచజన్యం అనే శంఖం. తేజస్తత్త్వమే సుదర్శన చక్రం. ఆ వైకుంఠుడు ధరించే నందకం అనే ఖడ్గం మరేదో కాదూ నిర్మలమైన ఆకాశతత్త్వమే. ఆయన ధరించే డాలు తమస్సు అనే తత్త్వం. ఆ స్వామి చేతిలో ఉండే ధనుస్సు కాలరూపం. తూణీరం కర్మతత్త్వం. ఇంద్రియాలు బాణాలు. క్రియాశక్తియుక్తమైన మనస్సు రథం. పంచతన్మాత్రలు ఆ రథానికి బయటవైపున ఉండే భాగాలు. వరదానం, అభ



యదానం తదితరాలను సూచించే ముద్రలు ఆ పరమాత్ముడి క్రియాశీలత్వాన్ని ప్రకటిస్తుంటాయి.

## పాపాలను పారదోలడమే పరిచర్య

సూర్యమండలం లేక అగ్నిమండలం ఆ పరమాత్ముడి పూజాస్థలం. యజ్ఞయజమాని అంతఃకరణశుద్ధే మంత్రదీక్ష. సమస్త పాపాలను పారదోలటమే భగవంతుడి పరిచర్య. సమగ్రమైన ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, లక్ష్మి, జ్ఞానం, వైరాగ్యం అనే ఆరు గుణాలు ఆ పరమాత్ముడు చేతితో పట్టుకొని ఉండే లీలాకమలం. చామరం, వ్యజనాలు ధర్మం. యశస్సు, వైకుంఠతత్వం ఆ స్వామికి ఛత్ర రూపం. మూడు వేదాలకు ప్రతీక ఆయన వాహనమైన గరుత్మంతుడు. ఆత్మస్వరూపుడైన ఆ భగవంతుడిని ఎప్పుడూ విడిచి ఉండని శక్తిస్వరూపిణే లక్ష్మీదేవి. పాంచరాత్రాది ఆగమరూపుడు విష్వక్సేనుడు. ఆ శ్రీహరి స్వాభావిక గుణాలైన అణిమ, మహిమ తదితర అష్టసిద్ధులే నందసునందాది ద్వారపాలకులు. వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనేవి ఆ భగవంతుడి అర్చామూర్తులు. వాటినే చతుర్వ్యూహరూపాలు అని కూడా అంటారు. ఆ చతుర్వ్యూహరూపుడైన పరమాత్మే జాగ్రదవస్థకు చెందిన అభిమాని అయిన విశ్వుడు అనే పేరుతో శబ్దస్పర్శాది బాహ్యవిషయాలను గ్రహిస్తుంటాడు. ఆయనే స్వప్నావస్థ అభిమాని అయిన తైజసుడు. మనసు ద్వారానే ఆ స్వామి తైజస రూపంలో అనేక విషయాలను చూస్తూ తెలుసుకొంటుంటాడు. సుషుప్తి అవస్థకు అభిమాని అయిన ప్రాజ్ఞుడు అనేపేరున కూడా ఉన్నది ఆయనే. ఇలా విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయ అవస్థలలో ప్రకాశించేది ఆ స్వామే. ఇలా అంగ, ఉపాంగ, ఆయుధాది చిహ్నాల విశేషాలతో ఆ శ్రీమహావిష్ణువు నిత్యం వెలుగొందుతుంటాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## గంపతిరుగుడు

**చా**లా చిక్కులు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. గంప అనే పదం అధికం, చాలా, గుంపు, సమూహం అనే లాంటి అర్థాల్లో ప్రయోగంలో ఉంది. గంపగుత్త అన్నప్పుడు మొత్తం గుత్త తీసుకోవటం అనే

జాతీయాలు నుడికారాలు

అర్థం కనిపిస్తుంది. అలాగే గంప తిరుగుడు అన్నప్పుడు అనేక చిక్కులు ఒక్కసారిగా వచ్చిపడటం అనే అర్థం వస్తుంది. తిరుగుడు పడటమంటే అనుకున్నది కాకపోవటం, చిక్కుల్లోపడటం అనేలాంటి అర్థాలు వ్యాప్తిలో ఉన్నాయి.

ఆంధ్రావని

# జగన్మాతకు రూ.18 లక్షల ఆభరణాల బహూకరణ

**విజయవాడ, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు ఓ భక్తుడు రూ.18 లక్షల విలువైన 607 గ్రాముల బంగారు ఆభరణాలను బహూకరించారు. వీటిలో బంగారు నానుతాడు, మంగళ సూత్రాలు, గొలుసులు ఉన్నాయి. దాత కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి దేవస్థానం అధికారులు ప్రసాదాలు అందజేశారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి ఊటికి చెందిన భక్తుడు కె.జగదీష్ రూ.1.20 లక్షల విరాళాన్ని అందజేశారు. ఏఈవో రాంబాబును కలిసి డీడీను అందజేశారు.



**ఏఈవో రాంబాబుకు విరాళం అందజేస్తున్న జగదీష్**



**అజ్ఞాత భక్తుడు అందజేసిన ఆభరణాలు**

# కనువిందుగా సోమేశ్వరునికి అలంకరణ

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** మాస శివరాత్రిని పురస్కరించుకుని గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో సోమేశ్వర స్వామివారికి ఆదివారం విశేష పుష్పాలంకరణ చేశారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం మల్లెపువ్వులు, కనకాంబరం పుష్పాలతో అలంకరణ ప్రధానార్చకులు సోంబాబు, రామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. రాత్రి స్వామివార్లకు శాంతి కల్యాణం కందురి సుబ్రహ్మణ్య శ్రీనివాసరావు దంపతులతో ఆలయ అభిషేక పండితుడు కొత్తపల్లి శ్రీనివాస్ జరిపించారు. ఆలయ ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.








**రాజేంద్రనగర్ కాటేదాన్‌లో నిర్మించిన అయ్యప్ప ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కనులపండవగా సాగింది. శబరిమలైలోని ఆలయం నమూనాలో ఉన్న ఈ ఆలయం విశేషంగా ఆకట్టుకుంటోంది. శబరిమలై ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకంఠారు రాజీవరుతాంత్రి ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరిగింది.** – న్యూస్‌టుడే, హైదరాబాద్

# విలువలతో కూడిన విద్య అవసరం



**సమావేశంలో మాట్లాడుతున్న హరీష్**

**నల్గొండ, న్యూస్‌టుడే:** దేశభక్తి, నైతిక విలువలతో కూడిన విద్య ప్రస్తుతం మన దేశానికి అవసరమని, వీటిని ప్రోత్సహించాలనే సమున్నత లక్ష్యంతో రౌండ్ టేబుల్ సంస్థ ద్వారా భారత దేశంలో రూ. 130 కోట్లతో విద్యాలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు హరీష్‌క్షణం (మైసూర్)తెలిపారు. చింతపల్లిలో భారతీయ విద్యా సంస్థలు (బీవీకే)ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన విజ్ఞాన భారతి పాఠశాల ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లో కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఆయా దేశాల్లో మొత్తం 3,500 మంది సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. విశాఖ జిల్లాలో ఇప్పటివరకూ తమ సంస్థ ద్వారా 15పాఠశాలలు నిర్మించినట్టు తెలిపారు. భారతీయ సంప్రదాయాలు, విలువలతో కూడిన విద్యను నేర్పుతున్న బీవీకేతో కలసి తాము మారుమూల గ్రామాల్లో నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ రూ.130 కోట్లతో దేశంలో 5 వేల తరగతి గదులు నిర్మించినట్లు పేర్కొన్నారు. 5 లక్షల మంది విద్యార్థులుచదుకునేందుకు వీలుగా తాము పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలు, ఆట స్థలాలు వంటివి సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.

# ఆ తల్లీబిడ్డలను ఎలా కాపాడాలో..?

ఓసారి భూలోక సంచారం చేస్తున్న నారదుడికి ఓ తల్లి, ఆమె ఇద్దరు బిడ్డలు కనిపించారు. అయితే ఆ తల్లి మాత్రం కొంత ఓపికగా వయస్సులో ఉన్నట్టు బాగానే ఉంది కానీ ఆమె ఇద్దరు కుమారులు మాత్రం ముసలివాళ్లలాగా ఓపిక లేకుండా నీరసంగా ఉన్నారు. అలాగే ఆ వెనుక ఎంతో మంది దేవతాస్త్రీలు ఆమెకు వింజామరలు వీస్తూ సేవచేస్తూ కనిపించారు. ఆ దేవతాస్త్రీలు ఎన్ని పరిచర్యలు చేస్తూఉన్నా ఆ తల్లి మాత్రం దుఃఖంతో ఉన్నట్లే కనిపిస్తోంది. ఈ విచిత్ర విషయమేమిటి అని వివరించే ఈ కథాసందర్భం పద్మపురాణాంతర్గతంగా ఉన్న మహాభాగవత మాహాత్మ్యం ఒకటో అధ్యాయంలో ఉన్న విషయం. నారదుడు త్రిలోక సంచారం చేస్తూ ఓసారి భూలోకానికి వచ్చాడు. పుష్కర క్షేత్రం, ప్రయాగ, కాశీ, హరిద్వార్, కురుక్షేత్ర, శ్రీరంగం, రామేశ్వరం ఇలాంటి ఎన్నెన్నో తీర్థక్షేత్రాలను సందర్శించాడు. కానీ ఎక్కడ చూసినా ఆయనకు అశాంతి, అధర్మంలాంటివే కనిపించాయి. దానికి కారణమేమిటా అని ఆలోచించిన ఆ దేవరుషికి అప్పటికే కలియుగం వచ్చేసిందని, ఆ కలిప్రభావం వల్లనే మానవులందరిలో అన్నిచోట్లా అధర్మం, అశాంతి విస్తరిల్లి ఉన్నాయని తెలుసుకున్నాడు.

### భక్తికి పుట్టిన బిడ్డలే జ్ఞానవైరాగ్యాలు

ఆ తర్వాత ఆయన ఓ రోజున యమునా నదీతీరానికి వెళ్లాడు. అక్కడ ఆశ్చర్యం కలిగించే వింత దృశ్యం కనిపించింది. ఒక యుక్తవయస్సులో ఉన్న తల్లికి, ఇద్దరు ముసలి కుమారులున్నారు. ఆ కుమారులిద్దరూ నిస్త్రాణంగా, నిస్తేజంగా ఒక చోట కూర్చొని ఉన్నారు. ఆ తల్లి వారి దీనస్థితిని చూసి శోకిస్తోంది. ఆమె దుఃఖాన్ని పోగొట్టడానికి కొంతమంది దేవతాస్త్రీలు ఆమెకెంతగా పరిచర్యలు చేస్తున్నా ఆమె దుఃఖం మాత్రం పోవటంలేదు. నారదుడు మెల్లగా ఆ తల్లి దగ్గరకు వెళ్లాడు. ఆమె లేచి నమస్కరించింది. నారదుడు కుశలప్రశ్నలు వేస్తూ నీవు ఎవరమ్మా అని అడిగాడు. దుఃఖ భారంతో ఆమె చెప్పలేకపోతున్నప్పుడు దివ్యదృష్టితో విషయం



గ్రహించాడు. ఆ మహాఇల్లాలు ఎవరో కాదూ. వైకుంఠవాసుడి ప్రేమను చూరగొన్న అదృష్టవంతురాలు. ఆయన అనుగ్రహంతో ఆమెకు ఇద్దరు మగపిల్లలు కూడా కలిగారు. ఆమె పేరు భక్తి. జ్ఞానం అనేది ఆమె మొదటి బిడ్డ పేరు. వైరాగ్యమనేది ఆమె రెండో బిడ్డ పేరు. ఆమెకు పరిచర్యలు చేస్తున్న దేవతాస్త్రీలంతా భూలోకంలో ప్రవహించే నదులు. ఇలా నారదుడు ఆమె విషయం తెలుసుకున్నాడు. అలాంటి గొప్ప ఇల్లాలివి కదా మరెందుకు ఇక్కడ దుఃఃస్తున్నావు అని అడిగాడు నారదుడు. అప్పుడామె తన దుఃఖానికి కారణమేమిటనే విషయాన్ని వివరించింది. వైకుంఠవాసుడు సర్వలోక సంక్షేమం కోసం తనకు నియమించాడంది. తనకు భక్తి, వైరాగ్యాలనే ఇద్దరు బిడ్డలను ప్రసాదించి వైకుంఠంలో ప్రత్యక్షంగానూ, భూలోకంలో అదృశ్యరూపంలోనూ సంచరిస్తూ ఉండమని ప్రత్యేకంగా ముక్తి అనే సేవకురాలిని తోడుగా ఇచ్చి పంపించాడంది. అలాగే భూలోకంలో ఉండే సర్వ నదులు ఆమెను సేవించేలా వరమిచ్చి జగన్నాయకుడు భూలోకానికి పంపాడని, అయితే భూలోక పరిస్థితి తనకు దుఃఖం కలిగించేదిగా ఉంది అని అంది.

### తరుణోపాయం ఆలోచించిన నారదుడు

భూలోకంలో కలిప్రభావంతో మనుషులలో ఏర్పడిన నాస్తిక భావంతో భక్తి వెంట వచ్చిన ముక్తి ముందుగా అస్వస్థతకు గురై స్వస్థత కోసం వైకుంఠానికి చేరుకొన్నట్లు చెప్పింది. ఆ తర్వాత రోజురోజుకూ భక్తి, జ్ఞాన, వైరాగ్యాల ఆరోగ్యం కూడా సన్నగిల్లింది. అయితే అనేక తీర్థక్షేత్రాలలో కాలం గడుపుతూ యమునా తీరానికి చేరేసరికి తన పరిస్థితి కొంతవరకూ మెరుగైనా జ్ఞాన, వైరాగ్యాల అనారోగ్యం మాత్రం అలానే ఉంది. దేవతా మూర్తులైన నదీమతల్లులు మాత్రం భక్తితో తమ విధులను తాము నిర్వర్తిస్తూనే ఉన్నారు అని భక్తి చెప్పిన ఈ విషయాలన్నింటినీ విన్న నారదుడు మనసు తల్లడిల్లిపోయింది. ఆమె మాత్రం ఓపికగా ఉంది. బిడ్డలు వృద్ధులు కావటానికి కారణం కలియుగ ప్రభావమే. కలియుగంలో అలా అన్నీ జరగాల్సిన తీరులో కాక భిన్నంగా జరుగుతూ ఉంటాయి. అధర్మం ప్రబలటమే దానికి కారణం. ధర్మం ప్రకారమైతే తల్లి వయస్సు ఎక్కువగా కనిపిస్తూ వార్ధక్యంతో ఉండాలి. కానీ కలియుగ ధర్మాన్ని అనుసరించి తల్లీబిడ్డల పరిస్థితి విపరీతంగా ఉంది. ఇలాంటి కలియుగ ప్రభావం నుంచి ఆ తల్లిని, బిడ్డలను కాపాడి తీరాలి. అయితే ఎలా? అని సుదీర్ఘంగా ఆలోచించిన నారదుడికి మళ్లీ ఓ ఆలోచన తట్టింది. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత ఇలాంటివన్నీ ధర్మప్రబోధకాలు. కనుక వాటిని ప్రజలందరూ ఆదరించేలా ప్రోత్సహిస్తే సరిపోతుంది. అప్పుడంతా చక్కబడుతుంది అని అనుకున్నాడు నారదుడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

ధర్మపథం

# మహారుద్ర యాగం ప్రారంభం



గణపతిపూజ చేస్తున్న అర్చకులు

**గుంటూరు , న్యూస్‌టుడే:** సంపత్‌నగర్‌లోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్టా వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహారుద్ర యాగాన్ని ప్రారంభించారు. గోపూజ, ప్రాకార ప్రదక్షిణ, గణపతిపూజ, రుత్విక్‌దీక్ష, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, క్రమార్చన తదితరాలను విష్ణుబొట్ల ఆంజనేయపూండరీకయాజులు 45 మంది వేద పండితులతో నిర్వహించారు. మే 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు యాగ పూర్ణాహుతి ఉంటుందని నిర్వాహకులు, ఆలయ ధర్మాధికారి పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు ముదిగొండ శంకరశర్మ, మాధవీయ శంకర విజయంపై ప్రవచనాలు ఉంటాయని చెప్పారు.

ఆంధ్రావని

# అక్కర గండడు

సమయానికి ఆదుకొన్నవాడు, అవసరం తీర్చేవాడు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. గండడు అంటే సమర్థుడు అనే అర్థానుసరించి చెయ్యాల్సిన పనిని ఎంతో సమర్థంగా చక్కగా నిర్వహించేవాడు అని ఎవరినన్నా గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయం వాడుకలో కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

# గజవాహనంపై చెన్నకేశవస్వామి..

**కడప, న్యూస్‌టుడే :** పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరిలో జరుగుతున్న హరిహరుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి లక్ష్మిచెన్నకేశస్వామి గజవాహనంపై ఊరేగారు. ఉదయం పుష్పగిరిలోని వైద్యనాధేశ్వరస్వామికి గణపతిపూజ, రుద్రాభిషేకం.. అమ్మవారికి కుంకుమార్చన, నిత్యహోమాలు నిర్వహించారు. కొండపై వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ అభిషేకం తోమాలసేవ నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని విశేషపూలతో అలంకరించి గజవాహనంపై అధీష్టించి పుష్పగిరి పురవీధుల్లో ఊరేగించారు.



అంకురార్పణకు కలశ పూజలు..

# ఉత్తమ నాటికగా 'ఆరోజు కోసం'

## ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే :** గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో శ్రీమార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ సభ్యులు ప్రదర్శించిన 'ఆరోజు కోసం' నాటికకు ఉత్తమ బహుమతి లభించింది. ఈనెల 26వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగిన ఈ పోటీల ముగింపు సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ సభ్యులు ప్రదర్శించిన ' అమ్మకో ముద్దు' నాటికకు బహుమతి వచ్చింది. ఉత్తమ నటుడిగా ఈ నాటికలో ప్రధానపాత్ర పోషించిన ఎన్. రవీంద్రరెడ్డి, ఉత్తమ నటిగా శాంతమ్మ పాత్రధారి గుంటూరు లక్ష్మికి బహుమతులు అందజేశారు. 'ఆఖరి ఉత్తరం' నాటిక రచయిత, దర్శకత్వం వహించిన చెరుకూరి సాంబశివరావుకు ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం అవార్డులు దక్కాయి. ఉత్తమ సహాయ నటుడిగా 'ఆరోజు కోసం' నాటికలో బైరాగి పాత్రధారి ఎం.ఎస్.కె. ప్రభుకు బహుమతి లభించింది. ఇదే నాటికలో మంగమ్మ పాత్రధారి జ్యోతి, 'బ్రహ్మసూత్రం' నాటికలో బదరీ నారాయణ పాత్రధారి ఐ. రాజ్‌కుమార్‌లకు ప్రత్యేక బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతగా స్నిగ్ధ వ్యవహరించారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ మత్స పార్థసారథి, పూసల ప్రకాశం, ఎన్.ఆర్.ఐ. నూలు గోపాలకృష్ణ, సినీనటి సరోజ, సర్పంచి చల్లా సత్యనారాయణమూర్తి, శ్రీమార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి తదితరులు పాల్గొన్నారు. ఇష్టానుసారంగా బోర్లు తవ్వుతూ ధన సంపాదనకు నీటివ్యాపారం చేస్తూభూగర్భజలాలు అడుగంటేలా నీటి వృథాకు పాల్పడుతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే చుక్కనీరు లభించక భవిష్యత్తు తరాలకు కన్నీటి వ్యధ మిగులుతుందని వివరిస్తూ హైదరాబాద్ మిత్ర ఆర్ట్స్ సభ్యులు ప్రదర్శించిన'(క)న్నీటి కథ' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. చెరువులు ఎండిపోయి, భూగర్భజలాలు ఇంకిపోవడంతో పల్లెల్లో పంటలు పండక, పనులు లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడే, కుటుంబాలు వలసలు పోవాల్సిన దుస్థితి నెలకొని పల్లెలు కళావిహీనంగా తయారవుతాయని ఈ నాటికలో కళ్లకు కట్టారు. విదేశాల్లో విద్య, ఉద్యోగాల మోజుతో వెళ్లే యువతీయువకులు వారి తల్లిదండ్రులను పట్టించుకోక తల్లడిల్లే హృదయాలను ప్రతిబింబించే కుటుంబ నేపథ్యాలను హైదరాబాద్ ఉషోదయ కళానికేతన్ సభ్యులు ప్రదర్శించిన 'ఆఖరి ఉత్తరం' నాటికలో చూపారు.



'ఆఖరి ఉత్తరం' నాటికలో ఆకట్టుకున్న సన్నివేశం

# నమో నారసింహా

**కర్నూలు, న్యూస్‌టుడే :** నమో ఈరన్నస్వామి, నమో నారసింహా అంటూ భక్తుల నినాదాలతో ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ పరిసరాలు హోరెత్తాయి. స్వామివారి విశేష దినోత్సవం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు తెల్లవారుజామున 4 గంటల నుంచే దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వేసవిని సైతం లెక్క చేయకుండా సాయంత్రం వరకు స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌ను పూలు, వెండి తొడుగుతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు.

# కనులపండువగా మల్లన్న ఉత్సవాలు

**వరంగల్, న్యూస్‌టుడే:** నాలుగు రోజుల నుంచి కనులపండువగా నిర్వహించిన శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు ముగిశాయి. మంగళవారం ఉదయం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంతో అగ్నిగుండాలు తొక్కారు. అనంతరం స్థానిక పద్మశాలీలు వసంతోత్సవంలో పాల్గొని ఆనందోత్సాహలతో రంగులు చల్లుకున్నారు.



మల్లికార్జునాలయంలో అగ్నిగుండాలు తొక్కుతున్న భక్తులు

# శాశ్వత ముక్తిని అందించేది జ్ఞానయజ్ఞమే!

ధర్మపథం

మనిషిలో భక్తి కొంతవరకు చైతన్యాన్ని కలిగిస్తుంది. భక్తి చేతనే భగవంతుడు వశుడవుతాడు. గోపికలకు అలాంటి భక్తితోనే కృష్ణ భగవానుడు వశుడయ్యాడు. అయితే శాశ్వత ముక్తి లభించాలంటే జ్ఞాన, వైరాగ్యాలు అవసరం అవుతాయి. మరి జ్ఞాన, వైరాగ్యాలను పొందే సాధనమేమిటి? అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చే ఈ కథాసందర్భం పద్మ పురాణాంతర్గత భాగవత మాహాత్మ్యం రెండో అధ్యాయంలో ఉంది. భక్తి అనే తల్లికి కొంత వరకూ కలియుగ ధర్మాలను చెప్పి ధైర్యం కలిగించాడు నారదుడు. అయితే ఆ తల్లి మనసు కుదుటపడింది కానీ ఆమె బిడ్డలైన జ్ఞాన, వైరాగ్యాల ఆరోగ్యస్థితి మాత్రం కుదుటపడలేదు. చిన్నపిల్లలే అయినా ముసలి రూపాలతో నిస్తేజంగా పడిఉన్నారు. ఆ పిల్లలిద్దరి దగ్గరకు నారదుడు వెళ్లి వారి చెవులలో వేదాలను, ఉపనిషత్తులను, భగవద్గీతలాంటి వాటిని వినిపింపచేశాడు. కానీ ఫలితం మాత్రం కలగలేదు. అప్పుడానారదుడికి ఏం చెయ్యాలో తోచక బాధపడుతున్న సమయంలో అశరీరవాణి వినిపించింది. ఎవరైనా మహానుభావుడు తరుణోపాయం చెప్పవచ్చు కనుక పవిత్ర ప్రదేశాలలో సంచరించి రమ్మనమని అశరీరవాణి పలికింది.



## స్వర్గంకన్నా పరమాత్మను చేరడమే కష్టం

నారదుడు అశరీరవాణి మాటలను విని అంతటా తిరిగాడు కానీ ఫలితం కనిపించలేదు. చివరకు బదరీ క్షేత్రానికి వచ్చి తపస్సు కూడా చేశాడు. అయినా ఫలితం కనిపించలేదు. దాంతో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు ఎలా వర్ధిల్లుతాయా అని ఆలోచిస్తున్న తరుణంలో సనకసనందనాదులు నారదుడి దగ్గరకొచ్చి విషయమేమిటని అడిగారు. అప్పుడానారదుడు జరిగిందంతా చెప్పి ఎలాగైనా సరే భూలోకంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను వర్ధిల్ల చేయాలని దానికేదైనా ఉపాయం చెప్పమన్నాడు. అప్పుడు సనకసనందనాదులు ఓ ఉపాయం చెప్పారు. పరమాత్మను పొందటానికి ఎన్నెన్నో మార్గాలున్నాయి. కానీ అవన్నీ కష్టసాధ్యాలు. అంత కష్టపడ్డా ఆ మార్గాల్లో వెళితే చివరకు స్వర్గం మాత్రమే దక్కుతుంది. పరమాత్మ దాకా వెళ్లాలంటే పనికొచ్చే ఒకేఒక్క మార్గం ఉంది. అదేమంటే జ్ఞానయజ్ఞం. ఆ జ్ఞానయజ్ఞాన్ని చేస్తేనే భక్తి, జ్ఞాన, వైరాగ్యాలకు బలం చేకూరి అవి వర్ధిల్లటం, వాటి సహాయంతో పరమాత్మను చేరటం సాధ్యమవుతుంది. ద్రవ్యయజ్ఞం, తపోయజ్ఞం, యోగయజ్ఞం, జ్ఞానయజ్ఞం ఇవన్నీ కర్మమార్గాన్నే సూచిస్తుంటాయి. అయితే వీటన్నిటిలో జ్ఞానయజ్ఞం ఉత్తమోత్తమమైనదని విద్వాంసులు అనుభవ పూర్వకంగా వివరించారు. జ్ఞానయజ్ఞాన్ని శ్రీమద్భాగవత ప్రవచన పారాయణ పూర్వకంగా నిర్వహించాలి. భాగవత కథను వినటంతోనే భక్తి, జ్ఞాన, వైరాగ్యాలకు గొప్ప బలం చేకూరుతుంది అని సనకసనందనాదులు నారదుడికి చెప్పారు.

## నారదుడి సందేహం

భాగవత జ్ఞానయజ్ఞానికి అంత గొప్ప ప్రభావం ఎందుకంటే భాగవతంలో భగవంతుడి కథల మాటున వేదావేదాంతాలు, భగవద్గీత తదితరాలలోని అనేకానేక విషయాలు ఇమిడి ఉన్నాయని సనకసనందనాదులు మరింత వివరంగా చెప్పారు. ఆ వివరణ విన్న తర్వాత నారదమహర్షికి మరో సందేహం కలిగింది. అంతేకాక సనకసనందనాదులు చెప్పే విషయాలలో ఏదైనా లోపం ఉందేమోనని కూడా అనిపించింది. అప్పుడు ఆయన తన మనసులోని మాటను ఇలా వారి ముందుంచాడు. అంతకుముందు తాను జ్ఞాన, వైరాగ్యాల చైతన్యం కోసం వేదాలను, వేదాంగాలను అలాంటి శక్తివంతమైన శాస్త్రాలను ఎన్నిటినో చెప్పటం జరిగింది. భాగవతం కూడా అలాంటివాటి సమ్మేళనమే అయినప్పుడు ఇక ప్రత్యేకంగా భాగవత జ్ఞానయజ్ఞం వల్ల కలిగే లాభమేమిటి? అనేదే నారదుడి సందేహం. ఆ సందేహాన్ని విన్న సనకసనందనాదులు ఆయనకొక ఉదాహరణను చెప్పారు. మామిడిచెట్టు భూమిలో ఉన్న వేరు నుంచి పైన చిటారుకొమ్మన ఉన్న చిగురాకుదాకా అంతా రసమే నిండి ఉంటుంది. అవును కదా అని వేరును ఆకును తింటే రసానందం కలగదు. ఆ మామిడిచెట్టుకు పూసిన పూత పిందెగా అయి, కాయగా మారి చక్కగా పండు పండినప్పుడు ఆ పండును తింటేనే మామిడిరసం రుచి తెలిసి ఆనందం కలుగుతుంది. అలాగే వేదాలు, వేదాంగాలు విడివిడిగా వాటి ధర్మాన్ని అవి తెలియచెబుతూ ఉంటాయి. మహాభాగవతం వేదమనే మామిడిచెట్టుకు పండిన పండులాంటిది. అందుకనే మహాభాగవత జ్ఞానయజ్ఞం వల్ల భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు విలసిల్లి పరమాత్మ సన్నిధానం దొరికే శాశ్వత ముక్తి లభిస్తుందని సనకసనందనాదులు తెలియచెప్పారు. ఇలా ఈ కథాసందర్భం పరమాత్మను చేరటానికి, ముక్తి పొందటానికి సరైన సాధనం మహాభాగవత జ్ఞానయజ్ఞమని వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**



తవళం ఆంజనేయస్వామి ఆలయం



రూ. లక్షా పదివేలు పలికిన ఎద్దులు

ఆంధ్రావని

# ఘనంగా ఎడ్ల పూజ

**అనంతపురం, న్యూస్‌టుడే:** మండలంలోని తవళం ఆంజనేయస్వామి ఎద్దుల పరుష ప్రారంభమైంది. పది రోజుల పాటు పరుష నిర్వహించనున్నారు. బుధవారం ఎడ్ల పూజ ఘనంగా నిర్వహించారు. మండలం నుంచే కాకుండా కదిరి, నల్లచెరువు, అమడగూరు, నంబులపూలకుంట, చిత్తూరు జిల్లా మొలకలచెరువు, కొత్తకోట, కర్ణాటక రాష్ట్రం చాకివేలు, చేలూరు, కడప జిల్లా నుంచి పులివెందుల తదితర ప్రాంతాల రైతులు ఎద్దులను పెద్దఎత్తున పరుషకు తీసుకు వస్తున్నారు. ఏటా మే నెలలో తవళం ఎద్దులపరుష నిర్వహించడం ఆనవాయితీ. సీజీ ప్రాజెక్టు కింద పాపాగ్ని నదీ పరివాహక ప్రాంతంలో తవళం ఆంజనేయస్వామి వెలిశారు. స్వామికి చిన్నగుడి నిర్మించారు. ఆలయం అభివృద్ధి చెందడంతో ట్రస్టు బోర్డు ఏర్పాటు చేశారు. కల్యాణ మండపం, వసతిగదులు తదితర సౌకర్యాలను కల్పించారు. నదిలో నీరుంటే 15 రోజుల పాటు పరుష నిర్వహిస్తారు. ప్రస్తుతం నదిలో నీరు లేనందున 10 రోజులు పరుష నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, తవళం సర్పంచి ఈశ్వర్‌రెడ్డి, తొట్లిపల్లి సర్పంచి బాబురెడ్డి, ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ మాధవరెడ్డి, రమణ, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తవళం ఆంజనేయస్వామి పరుషకు వివిధ ప్రాంతాల రైతులు ఎద్దులను తీసుకొచ్చారు. అమడగూరు మండలం గవ్వలపల్లి చెందిన రైతు మధుసూదన్‌రెడ్డి కాడెద్దులను రూ.లక్షా పది వేలు చెల్లించి కొనుగోలు చేశారు. వాటిని చూడటానికి జనం ఎగబడ్డారు. వ్యవసాయంపై మమకారంతో ఎక్కువ ఖర్చుచేసి ఎద్దులు కొనుగోలు చేశానని, ఎద్దులపెంపకంలో సంతృప్తి ఉంటుందని ఆ రైతు తెలిపారు.

# ఉక్కుతునకలు

జాతీయాలు నుడికారాలు

గొప్పబలవంతులు, శూరులు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఉక్కులోహానికి ఉన్న బలాన్ని, గట్టితనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ జాతీయం అవతరించింది. తునక అంటే ముక్క అని అర్థం. ఉక్కుముక్కను వంచాలన్నా, విరవాలన్నా అంతంత మాత్రానికి సాధ్యమయ్యే పనికాదు. అలాగే శూరులు కూడా సాధారణంగా ఎవరికీ లొంగరని, వారి బలం ముందు మిగతా వారెవరూ చాలరని చెప్పే సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది.

# 'చల్లని' మనసు చక్కటి సేవ




మండుటెండల్లో సాటి మనుషుల దాహం తీరుస్తున్న ఈ వృద్ధుడి పేరు నయీముల్లా ఖాన్. పాతబస్తీలో రోజూ సొంత వాహనంలో వెయ్యి చల్లని మంచినీటి ప్యాకెట్లు తీసుకెళ్లి బస్టాండ్‌లో వేచిచూసేవారికి ఇలా అందిస్తుంటారు. – హైదరాబాద్, న్యూస్‌టుడే

# వేడుకగా చెల్లాతమ్మ తిరునాళ్లు

**నెల్లూరు, న్యూస్‌టుడే :** మండలంలోని వాటంబేడు పంచాయతీ వాటంబేడుకుప్పంలో చెల్లాతమ్మ తిరునాళ్లు బుధవారం వేడుకగా ఆరంభమయ్యాయి. ఆలయ మార్గంలో దేవతా రూపాలతో ఏర్పాటైన విద్యుద్దీపాల ఫ్లెక్సీలు ఆకట్టుకున్నాయి. ఉదయం అమ్మణ్ణికి సర్వాభిషేకాలు జరిగాయి. సాయంత్రం కోలాటాలు, పొంగళ్లు కార్యక్రమాలు సాగాయి. రాత్రి అమ్మణ్ణిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి బాణసంచా వేడుకల మధ్య గ్రామవీధుల్లో ఊరేగించారు. ఇంటింటి వద్ద గ్రామస్థులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని బొమ్మన ఏకాంబ్రం, శ్రీధర్, పళని తదితరులు పర్యవేక్షించారు. తిరునాళ్లను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వాటంబేడుకుప్పం చేరుకున్నారు.



భక్తుల పూజలందుకుంటున్న చెల్లాతమ్మ

# సమ్మోహన 'జుగల్‌బందీ'!

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** భారతీయ సంస్కృతికి ప్రతిబింబాల వంటి సంప్రదాయ నృత్య రీతులు జట్టుకట్టుకొని వేదికపై పదమై, పాదమై రసావిష్కరణ చేశాయి. నటరాజ్ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ నాట్య దినోత్సవాన్ని కళాభారతిలో నిర్వహించారు. కూచిపూడి, కథక్, భరతనాట్యం, మణిపురీ అంశాలను విభిన్నంగా మేళవించి ప్రదర్శించారు. ముందుగా సంచితా లహోటీ, రక్షా(బెంగళూరు)లు కథక్, భరతనాట్యం జుగల్‌బందీ ప్రదర్శించారు. 'శివం శంకరం' అంటూ కర్ణాటక సంగీతంతో, 'లలిత లవంగ' అని హిందుస్థానీ సంగీత లయకు వీరు తమ ప్రావీణ్యాన్ని చూపారు. అనంతరం సీతాప్రసాద్(హైదరాబాద్) బృందం కూచిపూడి-సమకాలీన నృత్య రీతిని, అటు తరువాత అనురేఖా ఘోష్, సుదీప్ ఘోష్, రాహుల్ సిన్హా(కోల్‌కతా)లు కథక్, మణిపురీ, భరతనాట్యం ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. డాక్టర్ లాలిత్‌కుమార్ గుప్త, సుశీల కూచిపూడి అంశాలను ప్రదర్శించారు. నటరాజ్ అకాడమీ బృందం ప్రదర్శించిన 'యశోదా కృష్ణ' నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణ.



అనురేఖా ఘోష్, సుదీప్ ఘోష్, రాహుల్ సిన్హా ప్రదర్శిస్తున్న కథక్, మణిపురి, భరతనాట్య అంశం

# రామాయణ పారాయణ ఫలం

వాల్మీకి రామాయణం పారాయణ చేసినా, శ్రవణం చేసినా సర్వపాపాలు నశిస్తాయి. దానికి కారణం వాల్మీకి రచించిన ఆ మహాకావ్యంలోని ప్రతి అక్షరమూ ఓ మంత్రశక్తి నిధిగా ఉండటమే. రామాయణ పఠన, శ్రవణాల వల్ల పాపాలను పోగొట్టుకున్నవారు ఎవరైనా ఉన్నారా? ఆ మహాకావ్యాన్ని ఎలా పారాయణ చేయాలి? అనే ప్రశ్నలకు సమాధానాలు కూడా ఉన్నాయి. స్కంద పురాణంతర్గతంగా ఉన్న ఉత్తర ఖండంలోని నారద సనత్కుమార సంవాదంలో రామాయణ మాహాత్మ్యం వ్యక్తమవుతోంది. ఈ సంవాదంలోని కల్పాను కీర్తనం, రాక్షస విమోచనం అనే ఒకటి, రెండు అధ్యాయాలు రామాయణ శ్రవణ మహత్వాన్ని వివరిస్తున్నాయి. ఆదికావ్యమైన రామాయణం చదివినా, విన్నా ఈ ధర్మబుద్ధి కలగటంతోపాటు పుణ్యం కూడా లభిస్తుంది. దాంతో స్వర్గ, మోక్షాలను పొందొచ్చు. పొరపాటునో, తెలిసోతెలియకో చేసిన పాపాలను పోగొట్టుకొని మళ్లీ పాపాలను చెయ్యకూడదన్న సద్బుద్ధిని కూడా పొందొచ్చు.



### శిష్యుడి అహంకారాన్ని క్షమించని శివుడు

రామాయణాన్ని చైత్ర, కార్తిక, మాఘ మాసాలలోని శుక్లపక్ష పాడ్యమి నుంచి వరుసగా తొమ్మిది రోజులపాటు పద్ధతి ప్రకారం పారాయణం చెయ్యటం కానీ, వినటంకానీ జరిగినప్పుడు అన్ని శుభఫలితాలు ప్రాప్తిస్తాయి. పూర్వం సోమదత్తుడు అనే ఓ విప్రుడుండేవాడు. అనంతర కాలంలో ఆయనకే సౌదాసుడు అనే పేరు కూడా వచ్చింది. సోమదత్తుడు తపస్సుతో పరమేశ్వరానుగ్రహం పొందిన గౌతమ మహర్షికి శిష్యుడు. ఓ రోజున గౌతముడు తన శిష్యుడైన సోమదత్తుడిని చూడాలని అతడి ఆశ్రమానికి బయలుదేరాడు. గౌతమ మహర్షి వచ్చేసరికి సోమదత్తుడు శివపూజచేస్తూ కూర్చున్నాడు. గౌతముడొచ్చిన విషయాన్ని చూడనట్టే కూర్చుకున్నాడు. ధర్మం ప్రకారం శిష్యుడికి దైవంకన్నా గురువే ప్రధానం. అదీ కాక దేవుడిచ్చిన శాపం నుంచి తప్పించుకొనే అవకాశం ఉన్నా గురువు కోపం వచ్చి శపిస్తే మాత్రం ఇక దానికి తిరుగుండదు. సోమదత్తుడికి ఎందుకో కానీ ఆ సమయానికి ఆ విషయమే గుర్తురాలేదు. గురువు వచ్చాడని వినయంగా లేచి నిల్చోలేదు. గౌతముడికి సోమదత్తుడి వినయరాహిత్యం కోపం తెప్పించలేదు. కానీ సోమదత్తుడు పూజిస్తున్న జగద్గురువు, మహాదేవుడు అయిన శివుడికి మాత్రం గొప్ప కోపాన్ని తెప్పించింది. వెంటనే గురువు విషయంలో వినయరాహిత్యంతో ప్రవర్తించినందుకు రాక్షసుడిగా మారిపొమ్మని శివుడు సోమదత్తుడిని శపించాడు.

### మార్గంచూపిన గౌతముడు

అప్పటికి తాను చేసిన తప్పు తెలిసొచ్చింది. వెంటనే గురువైన గౌతముడి కాళ్లమీద పడి తన తప్పులను క్షమించమని వేడుకొన్నాడు. అప్పుడు గౌతముడు గురువును అవమానిస్తే శిష్యుడిని గురువు క్షమించినా, శివుడు మాత్రం క్షమించడని, అయితే సోమదత్తుడు పశ్చాత్తాపం పడుతున్నాడు కనుక తానొక ముక్తిమార్గం చెబుతానని అన్నాడు. మహాపాపాలను సైతం పోగొట్టగల శక్తి రామాయణ శ్రవణానికి ఉందని చైత్ర, కార్తిక, మాఘ మాసాలలో ఏదో ఒక మాసంలోనైనా శుక్లపక్ష ప్రారంభం నుంచి తొమ్మిది రోజులపాటు రామాయణాన్ని వినాలని అన్నాడు. సోమదత్తుడికి ఈశ్వరుడిచ్చిన శాపం బలవత్తరమైనది కనుక పన్నెండు సంవత్సరాలపాటు రామాయణాన్ని విన్న తర్వాతనే శాపవిముక్తి కలుగుతుందన్నాడు ముని. అప్పటిదాకా శివ శాపాన్ని రాక్షస రూపంలో అనుభవించాల్సిందేనని సోమదత్తుడికి స్పష్టంచేశాడు గౌతముడు. అలాగే గౌతముడు రామనామ విశిష్ఠతను, ఆ నామస్మరణ ప్రభావాన్ని కూడా వివరించాడు. రామాయణం అనే పేరును కానీ, రామ అనే నామాన్ని కానీ ఒక్కసారి విన్నా, పలికినా గంగాస్నాన పుణ్యఫలం దక్కుతుందన్నాడు. గురువైన గౌతముడి మాటలను విన్న ఆ శిష్యుడు ఆయన చెప్పినట్టే చేసి అనంతర కాలంలో శాపవిముక్తుడయ్యాడు. ఇలా స్కందపురాణం రామాయణ మహత్వాన్ని గురించి వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# పాపం పసిపాప.. ప్రాణం మీదకొచ్చిన వ్యాధి

## దాతల కోసం ఎదురుచూపులు

**కడప, న్యూస్‌టుడే :** పాపం ఆ చిన్నారికి తీరని కష్టం వచ్చింది. తల్లివడిలో సంతోషంగా ఉండాల్సిన ఆ బిడ్డ అనారోగ్యంతో బాధపడుతుంది. చిరుప్రాయంలోనే వెన్నుముకలో కురుపు ఉండటంతో వెంటనే శస్త్రచికిత్స చేయాలని, లేదంటే ప్రాణాలకు హామీ ఇవ్వలేమని వైద్యులు చెప్పడంతో ఆపేద తల్లితండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. వారే కాదు ఆ చుట్టుప్రక్కల మహిళలు ఆ చిన్నారి బాధను చూసి చలించిపోతున్నారు. దయార్ద్ర హృదయులు తమ ఆపన్నహస్తం అందించి చిన్నారికి పునర్జన్మ ఇవ్వాలని వేడుకుంటున్నారు. రాజంపేట పట్టణం ఎగువగడ్డ వీధికి చెందిన ఎన్. చంద్రకళకు ఎనిమిది నెలల కుమార్తె వైష్ణవి ఉంది. ఈ చిన్నారికి వెన్నుముకలో కురుపు వచ్చింది. వైద్యులకు చూపిస్తే శస్త్రచికిత్స చేయాలని, అందుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకొందామంటే బియ్యం కార్డులో తండ్రి ఫొటో లేదని వైద్యులు ఒప్పుకోలేదు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు విన్నవించగా ఆరోగ్యశ్రీ వ వైద్యం అందించాలని సూచించారు. అయినా వైద్యులు ససేమిరా అంటున్నారని బాధితురాలు ఎన్. చంద్రకళ ఆవేదన వ్యక్తం చేశారు. వెన్ను నొప్పితో పగలూ, రాత్రి నిద్రలేక ఆలమటిస్తోందని, కాలు కూడా సచ్చుపడిందని తెలిపారు. నాలుగైదు రోజుల్లో వైద్యం చేయించకపోతే పాప ప్రాణానికే ముప్పు అని వైద్యులు తెలిపారని కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయంలో దాతలు సాయం అందించాలని తల్లితండ్రులు వేడుకొంటున్నారు.



వెన్నెముక వ్యాధితో బాధపడుతున్న బిడ్డతో తల్లి.. పాప వెన్నెముకలో కురుపు..

# కల్లలాడైనా కాపురం నిలుపు

జాతీయాలు నుడికారాలు

ధర్మసూక్ష్మాన్ని ప్రకటించే జాతీయం ఇది. ఎప్పుడూ సత్యాన్నే పలకమన్నది ధర్మం. అయితే కొన్నికొన్ని సందర్భాలలో సత్యం పలికినందువల్ల ప్రమాదాలు ఏర్పడుతుంటాయి. అటువంటి ప్రమాదాలు ఏర్పడకుండా సమాజం అంతా సుఖంగా ఉండగలగాలంటే పెద్దలు, అనుభవజ్ఞులు కొన్నికొన్ని ధర్మసూక్ష్మాలను చెప్పారు. వీటిని పురాణాలు, భారతంలాంటి గ్రంథాలు కథల రూపంలో కూడా అందిస్తున్నాయి. వివాహ సందర్భాలలోనూ, ప్రాణాపాయ పరిస్థితులలాంటి పరిస్థితులలోనూ అసత్యం చెప్పినా అది సత్యఫలితాన్నే ఇస్తుందన్నది ధర్మసూక్ష్మం. కల్లలు అనంటే అబద్ధాలు. అబద్ధాలాడైనాసరే ఓ భార్యభర్తను కలిపి వారి సంసారం సుఖమయంగా ఉండేలా చూడాలన్నది ఈ జాతీయంలోని సారాంశం.

# ధర్మపురిలో నరసింహ నవరాత్రి ఉత్సవాలు



**కరీంనగర్, న్యూస్‌టుడే:** ధర్మపురి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి నరసింహస్వామి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. దీనికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఈవో ఆంజనేయులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఉదయాత్ పూర్వమే గోదావరి నది నుంచి పవిత్ర జలాలను తీసుకుని రావడం, 8 గంటలకు పుణ్యాహవాచనం, రుత్విక్‌వర్ణనం, కళశ స్థాపనలు, నవగ్రహ, యోగినీ, వాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు జరుగుతాయని తెలిపారు. 9వ తేదీన సహస్ర కళశాలతో స్వామిని అభిషేకిస్తామన్నారు. 10వ తేదీన చందనోత్సవం, 11న సాయంత్రం గోధూళి సుముహూర్తమున వసంతోత్సవం, పల్లవోత్సవాలు, 13న నృసింహజయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు.

# గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** మైలార్‌దేవ్‌పల్లిలోని రాఘవేంద్రహిల్స్‌లో గాయత్రీ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ మహాయజ్ఞాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ ముఖ్యపరిపాలనా అధికారి భీంసేన్‌మూర్తి తెలిపారు. కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి పాల్గొని మహాయజ్ఞం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత అలవర్చుకోవడం ద్వారా ప్రపంచంలో శాంతి వెల్లివిరుస్తుందన్నారు. మహయజ్ఞాన్ని అన్ని వర్గాల ప్రజలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులోభాగంగా గాయత్రీ మంత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 2400 కోట్లసార్లు జపించినట్లు నిర్వాహకులు తెలిపారు. 4వ తేదీ వరకు ఈ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు వివరించారు. సర్వేంద్ర విద్యారణ్య స్వామి, సినీనటి జమున, విద్యావేత్త చుక్కారామయ్య, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.



జయేంద్రసరస్వతి ఆశీస్సులు పొందుతున్న సినీనటి జమున తదితరులు

ఆంధ్రావని

## అప్పన్న సన్నిధిలో భక్తులు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** అప్పన్న స్వామి సన్నిధిలో గంధం అమావాస్య ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. గరిడీ బృందాలు సంకీర్తనలతో స్వామిని కొలిచారు. వేకువజామున పుణ్యస్నానాలు చేసి కర్రతో చేసిన కోలలను స్వామి ప్రతిరూపంగా భావించి పండ్లు, ఫలహారాలు నైవేద్యంగా సమర్పించారు. గరిడీ బృందాల నాయకులైన దాసుడిని తమ ఒంటిపై నడిపించుకుని సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించారు. తొలి పావంచా, భైరవస్వామిని దర్శించుకుని మెట్లమార్గం గుండా సింహగిరికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు.

# కౌతవరంలో 28 ఏళ్ల తర్వాత ఉత్సవాలు

**గుడ్లవల్లేరు, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరంలో పురాతన శ్రీమరిడి మహాలక్ష్మి సంబరాలు ప్రారంభించారు. తొమ్మిది రోజులపాటు అత్యంత వైభవంగా, వేడుకగా అమ్మవారి భారీ ఉత్సవాలను చేపట్టనున్నారు. లక్షల వ్యయంతో గ్రామంలోని అన్ని సామాజికవర్గాలు దీన్ని చేపట్టనుండటం విశేషం. 1850లో గ్రామ కాపు సంఘీయులైన 'తూము' కుటుంబీకులు మరిడి మహాలక్ష్మి అమ్మవారి మందిరాన్ని మట్టితో నిర్మించినట్లు పెద్దల ఉవాచ. ప్రతి 12 ఏళ్లకు అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు 1898, 1910లో వీటిని చేపట్టినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. అనంతరం 1923లో గ్రామస్తుల సహకారంతో బొబ్బా అనంతపద్మనాభయ్య, వడ్లమూడి వీరభద్రయ్య, రామూర్తి, చాపరాల జగపతిరావులు గానుగ సున్నంతో కొత్త ఆలయం నిర్మించారు. 1952, 1974, చివరిగా 1986ల్లో ఉత్సవాలు జరిగాయి. నేడు శ్లాబ్ దెబ్బతినడంతో గ్రామ' తూము' వంశస్తులు రూ.లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేశారు. నేడు ఉత్సవాలకు ఆలయం చుట్టూ చలువ పందిళ్ల నిర్మాణం, విద్యుద్దీపాల వెలుగులు ఏర్పాటు చేశారు. మార్చి 19 నుంచి అమ్మవారికి ముడుపులు కట్టడం ప్రారంభించారు. ఏప్రిల్ 30న అమ్మవారి మట్టివిగ్రహ తయారీని చేపట్టారు. మే 1న అమ్మవార్ని గ్రామానికి తీసుకురానున్నారు. మొదట తూము కృష్ణమూర్తి(పెదకాపు) ఇంటి నుంచి తర్వాత వడ్లమూడి వీరభద్రయ్య, బొబ్బా రంగారావుల ఇంటి నుంచి ఘటం కుండ తీసుకురానున్నారు. 2 నుంచి 11 వరకూ ఉత్సవాలు జరుపనున్నారు. ప్రతిరోజూ ఊరేగింపు, 11న అమ్మవార్ని సాగనంపడం, 11, 12 తేదీల్లో గంగానమ్మ జాతర చేయనున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి చాపరాల ప్రసాద్ వెల్లడించారు.



రంగులతో ముస్తాబైన అమ్మవారి ఆలయం

# దైవసేవలో రాగకుటుంబం

దైవసేవలో సంగీత రాగాలు, ఆ రాగాల కుటుంబసభ్యులు నిరంతరం తరిస్తుంటాయి అని తెలుసుకుంటే ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంటుంది. అయితే ఇది వాస్తవం. అచ్చంగా ఇతర భక్తులలాగానే రాగాలు, రాగిణులు, రాగాల పుత్రులు భగవంతుడిని ఆరాధిస్తూనే ఉంటాయని వివరిస్తోంది గర్గసంహిత నలభై నాలుగో అధ్యాయం. ఓసారి పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీహరిని ఈ రాగాలన్నీ దర్శించుకొని తరించిన విషయాన్ని నారదముని బహు

ధర్మపథం

ళాశ్వుడనే ఓ రాజుకు వివరించాడు. ఆ వివరణలో సంగీత శాస్త్రంలోని అనేక విషయాలు కనిపిస్తాయి. భారతీయ సనాతన సంప్రదాయంలో శాస్త్రీయ సంగీతాన్ని పవిత్రంగా కొలుచుకొనేందుకు కారణం ఏమిటన్న విషయం ఇక్కడ కనిపిస్తుంది. సంగీతమంటే ఏదో కాలక్షేపానికి వచ్చీరాని రాగాలతో శబ్దం చేయటమనేది కానే కాదు. సంగీతం సర్వ శక్తిమయి అయిన సరస్వతికి ప్రతిరూపం. ఆ సరస్వతీమాత అనుగ్రహంతో ఏర్పడినవే స్వరాలు, రాగాలు లాంటివన్నీ.



### రాగ, రాగిణుల సంతానం..

తాలభేద, దేశభేద, స్వరమిశ్రిత, క్రియా భేదాలతో గీతాలలో యాభైఆరుకోట్ల భేదాలు ఉన్నాయి. వీటన్నిటికీ మళ్లీ అంత ర్భేదాలు అనంతాలు. ఇలాంటి రాగాలలో ప్రధానమైనవి కొన్ని ఉన్నాయి. వాటికి రాగిణులు, పుత్రసంతానం ఉన్నాయి. భైరవి రాగానికి పింగళ, శం:, లీలావతి, ఆగరి అనేవి అయిదూ రాగిణులు. ఆ రాగ, రాగిణులకు మహర్షి, సమృద్ధుడు, పింగళుడు, మాగధుడు, బిలావళుడు, వైశాఖుడు, లలితుడు, పంచముడు అనే ఎనిమిదిమంది పుత్రులున్నారు. చిత్ర, జయ, జయవంతి, విచిత్ర, వ్రజమల్లారి, అంధకారి అనేవి మేఘమల్లార రాగానికి సంబంధించిన రాగిణులు. మేఘమల్లారకు, ఈ రాగిణులకు శ్యామకారం, పోరతం, నటం, ఉడ్డాయనం, కేదరం, వ్రజరహస్యం, జలధారం, విహాగం అనే ఎనిమిది మంది పుత్రులున్నారు. దీపక రాగానికి కంచుకి, మంజరి, తోడి, గుర్జరి, శాబరి అనే అయిదుగురు రాగిణులున్నారు. వీరికి కళ్యాణం, శుభకామం, గౌడకళ్యాణం, కామరూపం, కాన్హరం, రామసంజీవనం, శుఖనామం, మందహాసం అనే ఎనిమిది మంది పుత్రులున్నారు. మాలకోశ రాగానికి గాంధారి, వేదగాంధారి, ధనాశ్రి, స్వర్మణి, గుణాగరి అనే అయిదుగురు రాగిణులు. వీరికి మేఘం, మచలం, మారుమాచారం, కౌశికం, చంద్రహారం, ఘుంఘుటం, విహారం, నంద అనేవారు పుత్రులు. శ్రీరాగానికి వైరాటి, కర్ణాటి, గౌరి, గౌరావటి, చతుశ్చంద్రకాల అనే పంచరాగిణులున్నారు. వీరికి సారంగం, సాగరం, గౌరం, మరుతం, పంచశరం, గోవిందం, హమీరం, గీర్భీరం అనే ఎనిమిదిమంది పుత్రులు. హిందోళరాగానికి వసంతి, వరజి, హేరి, తైలంగి, సుందరి అనే రాగిణులున్నారు. మంగళం, వసంతం, వినోదం, కుముదం, విహితం, విభాసం, స్వరం, మండలం అనే ఎనిమిది మంది పుత్రులున్నారు.

### సంగీత కీర్తనలు...

శబ్ద బ్రహ్మ అయిన గోలోక శ్రీకృష్ణుడు కనిపించగానే రాగాలు ముందుగా ఆ స్వామిని కీర్తించాయి. తొలిగా భైరవరాగం శ్రీహరి చరణాలను సేవించింది. ఆ తర్వాత మేఘమల్లారం శ్రీకృష్ణుడి భుజదండాన్ని ధ్యానించింది. దీపకరాగం సమస్త సుఖాలను ఇచ్చే శ్రీహరి పాదపద్మాలను భజించింది. మాలకోశం స్వామి నడుముకు నమస్కరించింది. శ్రీరాగం రాధికావల్లభుడి నాభిని ధ్యానించింది. హిందోళం భగవంతుడి ఉదరాన్ని ధ్యానించింది. ఆ తర్వాత ఆ రాగాలకు చెందిన రాగిణులు, పుత్రులు అందరూ కలిసి వేదస్వరూపుడైన ఆ స్వామిని ఆర్తితో కీర్తించారు. ఇలా తాను కీర్తించిన రాగాలను, వారి రాగిణులను, సంతానాన్ని కృష్ణుడు అనుగ్రహించి అక్కడ నుంచి ఆనందంగా బయలుదేరాడు. ఈ కథాసందర్భంలో కనిపించే భైరవరాగం, హిందోళం లాంటి రాగాలన్నీ ఇప్పటికే శాస్త్రీయ సంగీత విద్వాంసులు గానం చేస్తూ తరిస్తూనే ఉన్నారు. అయితే కొన్ని రాగాల విషయంలో నాటి పేర్లకు, ఈనాడు ప్రచారంలో ఉన్న పేర్లకు కొద్దిగా భేదం కనిపిస్తుంది. కాలగమనంలో ఎన్నో విషయాలలో భేదాలు కనిపిస్తున్నటే వీటి విషయంలో కూడా అలా ఉండటం సహజమేనంటున్నారు సంగీత విద్వాంసులు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# పుష్పగిరిలో కళ్యాణ వైభోగమే



**పూలంగిసేవలో చెన్నకేశవస్వామి**

**కడప, న్యూస్‌టుడే :** పవిత్ర పుణ్య క్షేత్రం పుష్పగిరి హరిహరుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీకామాక్షి వైద్యనాదేశ్వరస్వామి, శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వాముల కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. వైద్యనాదేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కొండపై శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వాముల ఉత్సవిగ్రహాలను విశేష అలంకారంతో వేదికపై నిలిపి, అంగరంగవైభవంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. విష్ణుమూర్తి అలంకారంతో చెన్నకేశవస్వామి ఉభయదేవేరులను వివాహమాడారు. కల్యాణానికి గణపతిపూజ, కలశస్థాపన యజ్ఞోపవీత ధారణ, భాషికం, మాంగల్యధారణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలపోత ఆనంద ఉత్సాహాల మధ్య వేదపండితులు నిర్వహించారు. కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

**వైభవంగా గరుడసేవ :** విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడసేవను శనివారం తెల్లవారుజాము వరకూ అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొండపైనుంచి తీసుకొచ్చి దిగువన గరుడవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

పర్యటక ఆధ్యాత్మిక క్షేత్రంగా

# గణపతి దేవాలయం




**హైదరాబాద్, న్యూస్‌టుడే:** రాష్ట్ర పర్యాటక మ్యాపుల్లో స్థానం పొందడంతో నగరంలో ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా ఇకపై సికింద్రాబాద్‌లోని గణపతి దేవాలయానికి విశిష్ట స్థానం దక్కనుంది. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రతిపాదనకు రాష్ట్ర పర్యాటక కమిషనర్ నుంచి ఆమోదం లభించింది. గణపతి దేవాలయంలో ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి సమావేశం, విలేకరుల సమావేశాల్లో ఆలయం ఛైర్‌పర్సన్ పి.సుశ్మిత, దేవాదాయ ఉపకమిషనర్ విజయరాజు, ధర్మకర్తలు వి.తిలోత్తమరెడ్డి, మార్కాండేయ కొండలు, జగ్గం మహేష్, సంకి రవీంద్రబాబు, స్థానాచార్యులు సోమశేఖరశర్మసిద్ధాంతి తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విభజన ప్రక్రియ చురుకుగా సాగుతున్న నేపథ్యంలో తెలంగాణాలోని టూరిజం కేంద్రాల్లో గణపతి దేవాలయానికి స్థానం కల్పించారని తెలిపారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఈ ప్రతిపత్తికి నోచుకోనున్న నగరానికి చెందిన ఏకైక దేవాలయంగా గణపతి దేవాలయానికి గుర్తింపు దక్కనుందన్నారు. కాణిపాకం తరహాలోనే స్వయంభూగా వెలసిన గణనాధుడి విగ్రహం విభిన్న ఆకృతిలో నిలవడంతో పాటు పలు 1824వ సంవత్సరం నుంచి నిత్య పూజలు జరుగుతున్నాయని సుశ్మిత వెల్లడించారు. టూరిజం మ్యాప్‌లో స్థానం లభించి పర్యాటక కేంద్రంగా అధికారిక గుర్తింపును కల్పిస్తూ త్వరలోనే లాంఛనంగా ఆదేశాలు లభించడంతో పాటు కొత్తగా ముద్రించే మ్యాప్‌లు, బ్రోచర్లలో కూడా ఆలయం విశిష్టతను ప్రభుత్వం ముద్రించనుందన్నారు. దేవాదాయ శాఖ ద్వారా గతంలోనే గణపతి దేవాలయానికి జూబ్లీహిల్స్‌లో 3.20 ఎకరాలు, మాసాబ్‌ట్యాంక్‌లో 2233 చదరపు గజాల స్థలాలు సమకూరాయని వాటిలో మహాగణపతి దేవాలయాలను నిర్మించేందుకు వెంటనే ఏర్పాట్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆస్తుల పరిరక్షణ, ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# చెవికి చేదు

జాతీయాలు నుడికారాలు

**వీ**నులవిందులాంటి జాతీయాలకు ఇది వ్యతిరేకార్థాన్ని ఇచ్చే జాతీయం. కనులవిందు, వీనులవిందు అంటే కళ్లకు, చెవులకు ఎంతో హాయిగా ఆహ్లాదంగా ఉండటమని అర్థం. విందు రుచిగా ఉంటుందన్న భావనతో ఆ అర్థం వ్యాప్తిలోకి వచ్చింది. అదే చేదు అంటే ఎవరికీ రుచించదు. ఇబ్బందిగా ఉంటుంది. అంటే వినటానికి బాధను, ఇబ్బందిని కలిగించే అంశాలు ఉన్నప్పుడు దాన్ని చెవికి చేదు అని అనటం కనిపిస్తుంది.

ఆంధ్రావని

# వైభవంగా చెన్నయ్య కల్యాణోత్సవం

**ఒంగోలు, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** మండలంలోని కృష్ణంపల్లెలో కొలువై ఉన్న లక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం దేవస్థానం వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



**అలంకరణలో లక్ష్మీ సమేత చెన్నకేశవులు**

# వెంకన్నకు ప్రత్యేక పూజలు

**ఖమ్మం, న్యూస్‌టుడే:** జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామున శీనివాసుడికి పంచామృతాలతో ఆలయ అర్చకులు సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీవారికి అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లతో భక్త కల్యాణం జరిపారు. స్థానిక అయ్యప్ప ఆలయం, అలివేలు మంగ, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవేంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

# స్వామికి గరుడ వాహన సేవ



**వాసవి కాలనీలోని శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో లక్ష్మీనారాయణ కల్యాణం శనివారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. కల్యాణం సందర్భంగా గరుడ వాహన సేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.**

– సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా, న్యూస్‌టుడే

# మన ముందున్న దేవుడిని తెలుసుకునేదెలా?

**భ**గవంతుడు భక్తులకు ఎప్పటికప్పుడు ఏది కావాలో అది అందిస్తూనే ఉంటాడు. అయితే ఆ అందిస్తున్నది సాక్షాత్తూ భగవంతుడేనని, భగవంతుడి సాయాన్ని అందుకొంటున్న భక్తుడు గ్రహించలేడు. ఇదే ఆయన మాయ. ఆ మాయతోనే ఏ ఒక్క భక్తుడి దగ్గరనో ఉండిపోకుండా, ఆ భక్తుడి భక్తికి మోహంతో మురిసిపోకుండా తాను మాత్రం మాయచేసి మరోచోటికి వెళుతుంటాడు. ఇదే భగవంతుడి లీల. ఈ విషయాన్నే వివరించి చెబుతోంది మహాభాగవతం దశమ స్కంధం పూర్వార్థంలోని పదకొండో అధ్యాయం. ఈ అధ్యాయంలో చిన్ని కృష్ణుడుగా తమ మధ్యన అవతరించింది వైకుంఠవాసుడేనని వ్రజవాసులు తెలుసుకోలేకపోవటంలోనే మాయ కనిపిస్తుంది. చంటిబిడ్డగా ఉన్న చిన్ని కృష్ణుడి గోలను భరించలేక ఆయనను రోటికి కట్టేసింది యశోదమ్మ. ఆ రోలును అలా అలా మెల్లగా లాక్కుంటూ రెండు మద్దిచెట్ల మధ్యకు వెళ్లాడు బాలకృష్ణుడు. ఆ సమయంలో వ్రేపల్లెలోని చిన్న పిల్లలు తప్ప అక్కడ పెద్దవాళ్లెవరూ లేరు. కృష్ణుడు రెండు చెట్ల మధ్య నుంచి అడ్డం తిరిగిన రోలును లాక్కువెళ్లేసరికి ఆ చెట్లు పిడుగుపాటు ధ్వని చేసుకుంటూ విరిగి నేల మీద పడ్డాయి. ఆ శబ్దం విని పరుగెత్తుకొచ్చిన పెద్దలు చెట్లను ఎవరు పడగొట్టారు అని పిల్లలనడిగితే, అదిగో.. ఆ చిన్ని కృష్ణుడే' అని చూపించారు. చెట్లు విరిగినప్పుడు ఎవరో ఇద్దరు దివ్యపురుషులు కూడా వాటి నుంచి వచ్చి కృష్ణుడికి ప్రదక్షిణం చేసి ఎటో వెళ్లిపోయారని వివరించారా పిల్లలు. అంత చెప్పినా కృష్ణుడి దైవత్వం ఆ పెద్దలకు అర్థం కాలేదు. శాపగ్రస్తులైన కుబేరుడి కుమారులు నలకూబర, మణిగ్రీవులకు శాప విమోచనం కల్పించిన దేవుడు కృష్ణుడు అని అర్థం చేసుకోలేదు.

### కన్నయ్యను రక్షించుకునేదెలా..?

అంతకు ముందు పూతన, శకటాసురుడు లాంటివారివల్ల బాలకృష్ణుడికి ప్రమాదం కలగబోయింది కనుక అసలా ప్రదేశమే మంచిది కాదని ఆ పెద్దలంతా అనుకున్నారు. దైవకృపవల్ల ఆ ఉత్పాతాల నుంచి కృష్ణుడు బతికి బయటపడ్డారని ఎలాగైనా సరే ఇకమీదట కృష్ణుణ్ణి రక్షించుకోవాలని ఆ పెద్దలంతా ఓ రోజున సమావేశమయ్యారు. వ్రజంలో నానాటికీ ఉత్పాతాలు పెరుగుతున్నాయి. కనుక కృష్ణుడి రక్షణ కోసం ఏం చేస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నవారిలో ఉపనందుడు అనే పేరున్న జ్ఞానవయోవృద్ధుడు ఓ చక్కటి సలహా చెప్పాడు. ఆ ఉపనందుడికి బలరామకృష్ణులంటే మరీమరీ ఇష్టం. కనుక ఉపనందుడి మాట జాగ్రత్తగా ఆలకించారు గోపకులంతా. వ్రజానికి సమీపంలో బృందావనం అనే ఓ అద్భుతమైన ప్రదేశం ఉంది. అక్కడ ఓ చక్కని పర్వతం దాని చుట్టూ ఎంతో అందంగా పచ్చపచ్చగా కనిపిస్తూ ఉండే ఎన్నెన్నోరకాల చెట్లు ఉంటాయి. ఆ ప్రదేశంలో ఉన్న పచ్చిక, పక్కనే పారుతున్న స్వచ్ఛమైన యమునా నదీజలాలతో పశుసంపద బాగావృద్ధి చెందుతుంది కూడా అని బృందావన విశేషాలను చక్కగా వివరించాడు ఉపనందుడు. ఆ మాటలు అక్కడున్న నందుడు లాంటి గోపాలకులందరికీ బాగా నచ్చాయి. ఎలాంటి ఉపద్రవాలు లేకుండా అక్కడైతే చిన్ని కృష్ణుడు హాయిగా, పెరిగి పెద్దవాడవుతాడని అందరూ అనుకున్నారు. ఉపనందుడి మాటననుసరించి వ్రేపల్లెవాసులంతా తమతమ గృహాలలోని వస్తువులను, స్త్రీలను బండ్లమీద ఎక్కించి బృందావనానికి బయలుదేరారు. పిల్లలు, స్త్రీలు, గృహోపకరణాలు బండ్లమీద ఉన్నాయి. గోపాలకులు ధనుర్బాణాలను పట్టుకొని బండ్లకు కాపలాగా నడుస్తూ ప్రయాణమయ్యారు. గోవులను, దూడలను ముందు భాగాన నడిపిస్తూ వాటివెనుక కొందరు కొమ్మువాద్యాలను, మంగళతూర్యాలను మధురంగా మోగిస్తూ పురోహితులతో కలిసి యమునా తీరంలోని బృందావనానికి చేరి అక్కడ చక్కగా చదునుగా ఉన్న పవిత్రమూ, శుభప్రదమూ అయిన స్థలంలో అర్ధ చంద్రాకారంలో బండ్లను నిలిపారు.



### బృందావనానికి చేరిన దేవదేవుడు

పశువుల కోసం, తమ నివాసాల కోసం ఎవరెవరికి ఎంతెంత ప్రదేశం కావాలో అంత ప్రదేశాన్ని ఎంచుకొని దాని మధ్యలో బండ్లను నిలిపారు. బండ్లు నిలిపిన ప్రదేశాలలోనే బృందావనవాసుల గృహాలు నిర్మితమయ్యాయి. అలా వ్రేపల్లె నుంచి బృందావనానికి జగద్రక్షకుడైన కృష్ణుడు చిన్నతనంలో తరలివచ్చాడు. తమ మధ్య ఉన్న పసిబాలుడు భగవంతుడేనన్న విషయాన్ని ఆ స్వామి మాయతోనే నాటి పెద్దలు తెలుసుకోలేకపోయారు. తమను రక్షించటానికి వచ్చిన ఆయనను తామే రక్షించాలనుకోవటం మాయా చిత్రమే. పూతన, శకటాసురుడులాంటి రాక్షసుల చేతిలో మృత్యువాత పడకుండా దేవుడే కృష్ణుడిని రక్షించాడని అనుకోవటమూ మాయవల్లనే జరిగింది. అయితే తమ ఎదురుగా ఉన్నది కృష్ణుడి రూపంలో ఉన్న వైకుంఠవాసుడని ఆనాడు కొంతమంది తెలుసుకోగలిగారు. వారు తెలుసుకోవటానికి, మాయలో పడకపోటానికి కారణం నిరంతరం భగవధ్యానం, ఆర్తభక్తి. ఈ రెంటినీ కలిగిఉన్నవారు ఆనాడైనా, ఈనాడైనా తమ ముందు కూర్చున్న భగవంతుడిని తెలుసుకోగలుగుతారు, మోక్షాన్ని పొందగలుగుతారు అని వివరిస్తోంది మహాభాగవతంలోని ఈ కథాసందర్భం.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# మరో అయోధ్యలా సాక్షాత్కారం

**ఖమ్మం, న్యూస్‌టుడే:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పరిసరాలు సోమవారం తెల్లవారుజాము నుంచే రామనామంతో మార్మోగిపోయాయి. కీర్తనలు, భజనలతో ఈ ప్రాంతం అత్యంత శోభాయమానంగా కనిపించింది. శ్రీరామ దీక్షల విరమణ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లలో అధికారులు హడావుడి భక్తుల కోలాహలంతో రామయ్య సన్నిధి మరో అయోధ్యలా సాక్షాత్కారమైంది. తెల్లవారుజాము 3గంటలకు రామాలయం తలుపులు తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రబాతం, ఆరాధన నిర్వహించారు. శ్రీరామ పాదుకలు, సీతారామచంద్రులవారు ఊరేగింపుగా బయలుదేరి చిత్రకూట మండపం వద్ద ఉన్న వేదికకు చేరుకున్నారు. జయజయ నీరాజనాల నడుమ విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు. సంక్షేప రామాయణాన్ని హవనం చేసి వేదమంత్రాల నడుమ హోమం జరిపారు. పూర్ణాహుతి పలికి మహదాశీర్వచనం ఇచ్చారు. స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సీతారామాజాచార్యులు, వేదపండితుల పర్యవేక్షణలో ఈ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. వేదిక వద్ద ఉన్న అర్చకులు, పండితులు వేదోక్తంగా మంత్రాలు పఠిస్తుండగా శ్రీరామ భక్తులు పూజలు చేసి తిరువడులు కట్టుకున్నారు.

# ఉన్నత చదువుకు సాయం చేయండి

**నూజివీడు, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** ప్రమాదవశాత్తు కుడి చేయి చచ్చుబడిన ప్రతిభా వంతురాలైన ఓ నిరుపేద ట్రిపుల్ ఐటీ విద్యార్థిని తన చేయి యథాస్థితికి రావడానికి శస్త్ర చికిత్సకు అవసరమయ్యే ఆర్థిక సహకారం కోసం అర్థిస్తోంది. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం జన్నివంస గ్రామానికి చెందిన పత్తిగుళ్ల హేమావతి తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. ప్రథమ శ్రేణి విద్యార్థిని. 8వ తరగతి చదువుతున్నప్పుడు తల్లి దండ్రులతో కలసి పనికి వెళ్లగా స్టోన్ క్రషర్‌లో కుడి చేయి పడి దెబ్బతింది. చలనం కోల్పోయి చచ్చు పడింది. అయినా హేమావతి స్థైర్యం కోల్పోకుండా చేతిరాతను ఎడమ చేతితో సాధన చేసి పదో తరగతిలో 9 పాయింట్లతో ట్రిపుల్ ఐటీ సీటు సాధించి పీయూసీ చదువుతోంది. ఈమె పరిస్థితిని చూసి 'ట్రిపుల్ ఐటీ హెల్పింగ్ హ్యాండ్' ఆమెను కోయంబత్తూరుకు వైద్యానికై పంపగా, అక్కడి వైద్యులు ఆమె చేయి యథాస్థితికి రావడానికి మూడు విడతలుగా శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని దానికి రూ. 2 లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పారు. దాతలెవరైనా తనకు ఆర్థిక సహాయం అందిస్తే తాను అభ్యసించే ఇంజినీరింగ్ విద్యలో మరింత రాణించగలనని హేమావతి అభ్యర్థిస్తోంది.



హేమావతి

## అవతారం

**స**మయానికి తగ్గ ఏదో ఒక వేషం వేయటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. హిందూ పురాణాలననుసరించి ఉన్న దశావతారాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పడింది ఈ జాతీయం. వాస్తవానికి దిగిరావటం దీనికున్న అర్థం. కానీ జాతీయమయ్యేసరికి ఒక వ్యక్తి ధరించిన వేషం అనే అర్థం వాడుకలోకి వచ్చింది. ఖఅబ్బబ్బ ఏమి అవతారంరా బాబు ఇది" అని విసుక్కోవడం, హాస్యాలాడటంలాంటి సందర్భాలలో ప్రయోగంలో కనిపిస్తుంది.

# సరస్వతీ అలంకరణలో భద్రకాళి



భద్రకాళి ఉత్సవమూర్తి

**వరంగల్, న్యూస్‌టుడే:** భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీభద్రకాళి ఉత్సవమూర్తిని సరస్వతి మాతగా అలంకరించారు. ఉదయం వేళల్లో భద్రకాళిని సావిత్రి అలంకరణలో సూర్య ప్రభ వాహన సేవ నిర్వహించారు. రాత్రి వేళల్లో సరస్వతీ మాతగా అలంకరించి హంస వాహనసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో భద్రకాళి అమ్మవారి వాహన సేవల్లో పాలు పంచుకున్నారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో దేవాలయంలో అమ్మవారి స్నపనం, చండీ హోవనం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బేతి రఘువీర్, నీరజ దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళ్యాణ బ్రహ్మోత్సవాల ఖర్చును భరించేందుకు దాతగా ప్రముఖ పారిశ్రామికవేత్త అప్పలక్ష్మినారాయణ రూ.4 లక్షలు ముందుకొచ్చారు. కార్యక్రమంలో ధర్మకర్త టి.వీరన్న, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీమన్నారాయణుడికి ఘనంగా చక్రస్నానం



స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు



పాల్గొన్న భక్తులు

**సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా, న్యూస్‌టుడే:** వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయం బ్రహోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన చక్రస్నానం కన్నుల పండువగా జరిగింది. ఉదయం మహా పూర్ణాహుతితో ఉత్సవాలు మొదలయ్యాయి. ఆలయానికి ఎదురుగా ఉన్న గుండంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శ్రీమన్నారాయణుడికి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం పుష్పయాగం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సుధాకర్‌గుప్త, చంద్రశేఖర్‌గుప్త, ఎ.అంజయ్య, మురుగేశం, శ్రవణ్, యాద అశోక్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భగవంతుడినే మోసగించాలనుకుంటే..?

జగన్నాటక సూత్రధారి అసమాన సహజనటుడు ఆ దేవదేవుడు. ఈ విషయం విన్నా చాలామంది ఆ దేవదేవుడి ముందు ఏదేదే నటిస్తుంటారు. అసలాయనే మాయలోడైతే ఉత్తుత్తి మాయగాళ్ల మాయలను ఆయనెందుకు కనుక్కోలేడూ? కనుక్కొని తీరుతాడు. సత్యం ఆ స్వామి స్వరూపం కనుక సత్యానికి భిన్నంగా ప్రవర్తిస్తూ తనను మాయచేయాలని ఎవరైనా చూస్తే వాళ్లను మాత్రం విడిచిపెట్టడు. ఇలాంటి విషయమే ఒకటి బాలకృష్ణుడి లీలావిలాసాల ద్వారా ప్రకటితమవుతుంది. మహాభాగవతం దశమస్కంధం పూర్వార్ధంలోని పదకొండో అధ్యాయంలో ఈ విషయముంది. వ్రజవాసులంతా కృష్ణుడి సంరక్షణ కోసమంటూ బృందావనానికి చేరారు. అక్కడ బలరామకృష్ణులు హాయిగా తోటి గోపబాలలతో ఆటపాటల్లో కాలం గడుపుతుండేవారు.

### ప్రాణంమీదకు తెచ్చుకున్న రాక్షసుడు

బృందావనంలో ఉన్న చూడముచ్చటైన ప్రదేశాలలోనూ, యమునా తీరంలోని ఇసుకతిన్నెల మీద ఆవులను మేపుతూనే గోప బాలకులు ఆడుకుంటూ ఉండేవారు. ఆ ఆటల్లో నవ్వులాటకు కొట్లాడుకోవటం, నెమళ్లలాంటి పక్షులు, జంతువుల ధ్వనులను అనుకరిస్తూ అరుస్తూ ఉండటం జరుగుతూ ఉండేది. ఇలాంటి రోజుల్లో ఓ రోజున గోపబాలకులు మేపుతున్న ఆలమందలోకి ఓ చక్కటి దూడ వచ్చిచేరింది. ఆ దూడ ఓ రాక్షసుడు. ఆవులను మేపే కృష్ణుడికి అందమైన దూడరూపంలో కనిపించి ఆయనను మోసగించి మాయ చేయాలనుకున్నాడు ఆ రాక్షసుడు. చిన్ని కృష్ణుడు ఆ విషయాన్ని కనిపెట్టాడు. ఏమీతెలియనివాడు లాగా అమాయకుడిలా, ఆ దూడంటే ఎంతో ముచ్చటపడుతున్నట్టు నటిస్తూ తన అన్న బలరాముడికి కనుసైగ చేశాడు. ఆ కనుసైగతో అసలు విషయం గ్రహించాడు బలరాముడు. మెల్లమెల్లగా కృష్ణుడు ఆ దూడ దగ్గరకు వెళ్లి దాని తోకను, వెనుకవైపు ఉన్న కాళ్లను అందిపుచ్చుకొని గిరగిరా తిప్పి ఆ సమీపంలో ఉన్న ఓ వెలగ చెట్టు మీదకు విసిరికొట్టాడు. ఆ దెబ్బకు వెలగ పండ్లతో పాటు ఆ వత్సాసురుడి కళేబరం కూడా కిందపడింది. ఆ దృశ్యం చూసి గోపబాలకులంతా భలేభలే అంటూ ఆనందపడ్డారు. ఆవు దూడ రూపంలో వచ్చిన రాక్షసుడు దైవాన్నే మాయచేయాలని చూసి తన ప్రాణం మీదకే తెచ్చుకున్నాడు.



ఆ తర్వాత మరో రోజున కృష్ణుడు, గోపబాలకులు ఆవులను మేపుతున్నప్పుడు పర్వత శిఖరంలా ఓ వింత ఆకృతి వారికి కనిపించింది. దాన్ని చూసి మిగిలిన గోపబాలకులంతా భయపడి దూరంగా పారిపోయారు. కానీ కృష్ణుడు మాత్రం అమాయకంగా ఉన్నట్టు కనిపిస్తూ ఆ వింత ఆకృతివైపు అడుగులేశాడు. అది పెద్దకొండంత ఉన్న ఓ కొంగ.

### బకాసురుడికి బుద్ధి చెప్పిన కన్నయ్య

బకాసురుడు అనే రాక్షసుడు కృష్ణుడిని మట్టుపెట్టాలని కొంగ రూపంలో అక్కడ మాటువేశాడు. పొడవాటి తన ముక్కును చాచి కృష్ణుడిని మింగబోయాడు. అయితే కృష్ణుడిని పట్టుకోగానే అతడి గొంతు మండిపోయింది. ఆ మంటకు తట్టుకోలేక కృష్ణుడిని విడిచిపెట్టాడు. బయటికొచ్చిన కృష్ణుడిని ముక్కుతో పొడిచి సంహరించాలని ఈసారి మరీమరీ గట్టి ప్రయత్నం చేశాడు బకాసురుడు. తప్పు చేసినవాడిని వెంటనే శిక్షించడు ఆ దయామయుడు. తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడి మంచివాడుగా మారుతాడేమోనని కొంతవరకు వేచి చూడటం ఆ భగవంతుడి లక్షణం. కానీ బకాసురుడు తన దుర్బుద్ధిని మార్చుకోలేదు. రెండోసారి మళ్లీ అదే తప్పు చేయబోయాడు. అయితే మనసు మారని ఆ అసురుడిని ఇక క్షమించకూడదనుకొన్న కృష్ణుడు ఆ కొంగముక్కును ఒడిసిపట్టి కొంగను రెండుగా చీల్చి బకాసురుడిని సంహరించాడు. ఈ కథాసందర్భంలో ఓ ఇద్దరు రాక్షసులు భగవంతుడిని మాయ చేయాలని, మోసం చేయాలని చూసి చివరకు తామే అంతమయ్యారు. ఇది ఆనాడెప్పుడో ఆ రాక్షసులకు జరిగిన శిక్ష అని కథ చదువుకొని వదిలేస్తే ప్రయోజనం ఉండదు. ఈ కథలోని అంతఃసూత్రాన్ని గ్రహించగలగాలి. అదేమంటే ఎవరైనా ఎప్పుడైనాసరే ఏవిధంగానూ భగవంతుడిని మోసం చేయాలని ప్రయత్నం చేయకూడదు. అలా ఎవరు ప్రయత్నం చేసినా చివరకు భారీగా నష్టపోవాల్సి వస్తుందన్న హెచ్చరిక ఇక్కడ గమనార్హం.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**



## భక్త జనంతో పోటెత్తిన కొండగట్టు

**కరీంనగర్, న్యూస్‌టుడే:** కొండగట్టు ఆలయ పరిసరాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి గంటల తరబడి బారులు తీరారు. ఉదయం అధికారులు అందుబాటులో లేక భక్తుల ఇబ్బందులను పట్టించుకొనే వారే కరవయ్యారు. ఆలయ పరిసరాలు బురదగా మారడంతో నడవడానికి ఇబ్బంది పడ్డారు. సరైన నీటి వసతి లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 'వై' జంక్షను వద్ద వాహనాలను నియంత్రించే వారు లేక ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది.

## భక్తిశ్రద్ధలతో శ్రీచక్రస్నాన ఘట్టం

**కడప, న్యూస్‌టుడే :** పుష్పగిరి కామాక్షి వైద్యనాదేశ్వర, లక్ష్మీచెన్నకేశవస్వాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా పంచమనదీ సంగమం పినాకినీనదిలో తీర్థవాసి చక్రస్నానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైద్యనాదేశ్వరస్వామి ఆలయం నుంచి శివపార్వతులు త్రిశూలాన్ని మంగళవాయిద్యాలతో నదీ తీరానికి చేర్చారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి ఉభయదేవేరులతో కొండ దిగి నదీతీరానికి చేరడంతో హరిహరులు కలిసిన శుభవేళగా ఆలయ పరిపాలన అధ్యక్షుడు దంపతుల సమేతంగా పాల్గొని తీర్థవాసి పూజలను ప్రారంభించారు. పూజలు అనంతరం భక్తుల గోవిందనామాల నడుమ మంగళవాయిద్యాలతో పరమ శివుడికి ప్రతిరూపమైన త్రిశూలాన్ని శ్రీమహావిష్ణువుకు ప్రతిరూపమైన శ్రీచక్రాన్ని వేదపండితులు నదిమధ్యలోకి తీసుకెళ్లారు. హరిహరుల ప్రతిరూపాలకు గంగపూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలను నిర్వహించారు. వేదపండితులు శిరస్సులపై హరిహరులను ఎత్తుకొని గోవిందనామాలు మారుమోగుతుండగా పవిత్ర పినాకినీనది సాక్షిగా తీర్థవాసి చక్రస్నాన ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హరిహరులతోపాటు భక్తులు నదిలో మూడు మునకలు వేశారు. త్రిశూల చక్రస్నానం అనంతరం తిరిగి ముగింపు పూజలు నిర్వహించి భక్తులు తెచ్చిన టెంకాయలను స్వామికి సమర్పించారు. అనంతరం శివపార్వతుల విగ్రహాలను వైద్యనాదేశ్వరస్వామి ఆలయాలకు తరలించారు.

## వైభవంగా అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు



**సరూర్‌నగర్ , రంగారెడ్డి జిల్లా, న్యూస్‌టుడే:** ఏడు రోజులుగా వైభవంగా కొనసాగుతున్న వాసవీ కాలనీ అష్టలక్ష్మీ దేవాలయం 18వ బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం మాధవానంద సరస్వతి స్వామీజీ బ్రహ్మోత్సవాల విశిష్టతపై ప్రవచనం చేశారు. భక్తిభావం ఉన్నప్పుడే మానవ మనుగడ ఉంటుందని పేర్కొన్నారు.




**సంజీవరెడ్డినగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గోవిందనామ స్మరణతో ప్రాంగణం మార్మోగింది.** – న్యూస్‌టుడే, హైదరాబాద్

### ఉద్ధరించటం...

రక్షించటం, పైకిలాగటం అనేవి దీనికున్న అసలర్థాలు. అయితే సహాయం చేయటం, సాధించటం అనే అర్థాల్లో జాతీయంగా మారేక ఇది ప్రయోగంలో కనిపిస్తుంది. ఎ ఎఇప్పుడు చదువుకొని నువ్వు ఉద్ధరించేదేముంది", ఖనువ్వేదో ఉద్ధరిస్తావని నేనేనాడు అనుకోలేదు" అనేలాంటి ప్రయోగాలు వాడుకలో ఉన్నాయి. వంశోద్ధారకుడు, దేశోద్ధారకుడు, లోకాద్ధారకుడు అనేలాంటి చోట్ల రక్షకుడు అనే అర్థంలో ఇది ప్రయోగంలో ఉంది.

## అమ్మవారికి వైభవంగా అభిషేకం

**తిరుపతి, న్యూస్‌టుడే:** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ప్రారంభమైంది. ఉదయం జరిగిన విశ్వరూపాభిషేకం, మూలవర్లుకు అభిషేకం, అర్ధరాత్రి చాటింపుతో జాతర సంబరాలు ప్రారంభమయ్యాయి. ఎనిమిది రోజులపాటు ఆ సంబరాలు కొనసాగనున్నాయి. ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన చాటింపు కార్యక్రమం అర్ధరాత్రి వేడుకగా సాగింది. గంగమ్మ పుట్టిల్లయిన అవిలాల గ్రామం నుంచి సంప్రదాయబద్ధంగా సర్పంచి కుమారి, మాజీ ఎంపీటీసీ సుధాకర్, లోకనాథరెడ్డిలు తీసువచ్చిన సారెను గ్రామ పొలిమేరల్లో తిరుపతి కైకాల కులస్థులు ఢిల్లీబాబు, వెంకటేష్, సాంబ, గణేష్ అందుకున్నారు. తప్పెట్లు తాళాలు... భక్తుల ఆనందనృత్యాల మధ్య బాణసంచా కాలుస్తూ సారె ఊరేగింపు జరిగింది.



అమ్మవారి విశ్వరూప స్తంభానికి వడిబాల కడుతున్న అర్చకులు

# ఉత్తమ విద్యార్థి లక్షణాలివే...

**కొం**తమంది విద్యార్థులు ఎంతగా చదువుతున్నా గుర్తుండటం లేదని బాధపడుతుంటారు. అయితే పెద్దలేమో సర్వసాధారణంగా తెలివితేటలు విదార్థులందరికీ ఒకలాగానే ఉంటుంటాయి. వాటిని సద్వినియోగం చేసుకోవటంలోనే విజయరహస్యం ఇమిడిఉంది అని అంటుంటారు. అయితే తెలివితేటలన్నిటినీ ఎలా సద్వినియోగపరుచుకోవాలి, ఉత్తమ విద్యార్థిగా గురువు దగ్గర, సమాజంలోని ఇతర పెద్దల దగ్గర ఎలా మంచి గుర్తింపు పొందాలి అనంటే దానిక్కావల్సిన అన్ని సూచనలను మహాభారతం మనకందిస్తోంది. మహాభారతం ఆదిపర్వం నూటము ఫ్పైరెండో అధ్యాయంలో ఇలాంటి విషయాలే ఉన్నాయి. కౌరవులు, పాండవులు అందరూ ద్రోణాచార్యుడి శిష్యులే. ఈ శిష్యులనే నేటి విద్యార్థులకు ప్రతీకలుగా తీసుకోవచ్చు.

### గురువుకు అందరూ సమానులే..

చెట్టుమీది పక్షిని గురిచూసి కొట్టే సందర్భంలో అర్జునుడు తన ఏకాగ్రతను ప్రదర్శించి విజయాన్ని సాధించాడు. గురువుకు శిష్యులందరిలోనూ అర్జునుడంటేనే ఎక్కువ ప్రేమ అని, అందుకే ఆయన అర్జునుడికే ఎక్కువగా అన్నీ నేర్పించాడేమోనని ఆనాటి శిష్యుల్లో ఒకరిద్దరు అనుకుంటే అనుకొని ఉండవచ్చు. తమకుకాక తోటి వారికి విజయం దక్కినప్పుడు ఈనాటి విద్యార్థులు కూడా అలానే అనుకోవటం కనిపిస్తుంది. విజయం పొందిన వారికి ఎవరో ఏదో సహాయం చేసి ఉంటారని, అలాకాకపోతే వారికి విజయం దక్కిఉండేది కాదని తమలాగే ఓ మోస్తరు ఫలితాలతో ఆ విద్యార్థులు కూడా బయటపడి ఉండేవారని అనుకోవటం మామూలే. అయితే ఇదంతా అసూయవల్ల కలిగే భావనే. వాస్తవానికి విద్య నేర్పే గురువుకు తన విద్యార్థులందరి మీద ఒకే రకమైన ప్రేమ ఉంటుంది. అంతేకానీ ఒకరి మీద ప్రేమ, మరొకరి మీద అనవసర ద్వేషం అనేవి ఉండవు. అర్జునుడు ద్రోణుడి విషయంలో కూడా ఇదే జరిగింది. అర్జునుడికి నేర్పినట్టుగానే అన్ని విద్యలు కౌరవ, పాండవులందరికీ సమానంగానే నేర్పాడు ద్రోణుడు. కానీ మిగతా వారిలో లేనివి, అర్జునుడి దగ్గర ప్రత్యేకంగా ఉన్నవి అయిన కొన్ని లక్షణాలు ఉన్నాయి. అవేమంటే ఏకాగ్రత, సమయస్ఫూర్తి, సద్యస్ఫూర్తి అనేవి. ఏకాగ్రత అంటే



చేస్తున్న పనిమీద లేదా నేర్చుకుంటున్న అంశంమీద మనసు స్థిరంగా ఉండాలి. ఇతరత్రా ఏ విషయాలూ ఆ సమయంలో గుర్తురాకూడదు. సమయస్ఫూర్తి అనంటే సమయ సందర్భాలను దృష్టిలో ఉంచుకొని ఎదురైన సమస్యను సూటిగా పరిష్కరించుకొనే శక్తి కలిగి ఉండటం. మూడోది సద్యస్ఫూర్తి. అప్పటికప్పుడు సమస్య నుంచి బయటపడటానికి మెరుపులాగా ప్రవర్తించగలగాలి. మెరుపు వేగంతో బుర్రకు ఉపాయం తట్టాలి. ఈ లక్షణాలన్నిటితో పాటు ఇంద్రియనిగ్రహం ఉండాలి. ఇవి ఉన్నవాడే ఉత్తమ విద్యార్థి అని అనిపించుకొంటాడు. అర్జునుడిలో ఈ లక్షణాలన్నీ ఉన్నాయి. అవి ఉన్నందువల్లనే అతడంటే తనకు ఇష్టడైయ్యాడని ద్రోణుడు మిగిలిన వారికి చెప్పాలనుకున్నాడు.

### ఇంద్రియ నిగ్రహం కీలకమే..

అర్జునుడిలో అంతర్లీనంగా ఉన్న ఆ లక్షణాలన్నీ తమ దగ్గర లేవని వాటిని తాము నేర్చుకోవాలన్న ఆలోచన మిగిలిన శిష్యులకు రావాలనే ద్రోణుడు మళ్లీ ఓ పరీక్ష పెట్టాడు తన విద్యార్థులకు. ఓ రోజున తన శిష్యగణం అందరితో కలిసి గంగాతీరానికి వెళ్లాడు ద్రోణాచార్యుడు. అక్కడాయన స్నానానికని నదిలోకి దిగి కొంత లోపలికి వెళ్లాడు. ఆయన స్నానం చేస్తుండగా ఒక మొసలి ఆయన కాలును పట్టుకుంది. ఆ మాత్రం మొసలిని ఆయనైనా ఎలాగో ఒకలాగా చంపి దాన్ని నుంచి బయటపడగలడు. కానీ అదే అవకాశంగా తీసుకొని తన శిష్యులలోని అర్జునుడికి, మిగిలిన వారికి తేడాను చూపించాలనుకున్నాడు. వెంటనే ఁనన్ను మొసలి పట్టుకుంది. రక్షించండి" అంటూ కేకలు పెట్టాడు. ఒడ్డున ఉన్న శిష్యులంతా నివ్వెరపోయి ఏం చేయాలో తోచక ఊరకుండిపోయారు. ఒక్క అర్జునుడు మాత్రం గురువును మొసలి ఎటువైపు పట్టిఉంటుందో ఊహించి ఆ దిశగా అయిదు బాణాలు వేశాడు. వెంటనే ఆ మొసలి అయిదు ముక్కలై ద్రోణుడిని విడిచిపెట్టింది. నవ్వుతూ గురువు ఒడ్డుకు చేరి అందరితో ఇలా అన్నాడు. ఉత్తమ విద్యార్థికి ఉండాల్సిన ఉత్తమ లక్షణం సద్యస్ఫూర్తి. సమస్య ఎదురైనప్పుడు దాన్ని ఎదుర్కోవటానికి తగిన నిర్ణయాన్ని మెరుపు వేగంతో తీసుకోగలగాలి. ఆ లక్షణం ఉన్నందువల్లనే అర్జునుడు ఉత్తమ శిష్యుడయ్యాడని అన్నాడు. అంతేకాక శిష్యుడిని అభినందిస్తూ ఎంతో విలువైనదైన బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగ ఉపసంహారాలతో సహా ఉపదేశించాడు. అలాంటి గొప్పగొప్ప అస్త్రాలను పొందటానికి ఏకాగ్రత, సమయస్ఫూర్తి, సద్యస్ఫూర్తి, ఇంద్రియ నిగ్రహంలాంటివి ఉండాలి. అవి ఉన్నాయి కనుకనే అర్జునుడికి అంత గొప్ప అస్త్రం దక్కింది. నేటి విద్యార్థులు ఈ కథలోని అర్జునుడిని ఆదర్శంగా తీసుకోవాలి. చదువుతున్న చదువు మీద ఏకాగ్రదృష్టి పెట్టి చదవాలి. పరీక్షలు రాసేటప్పుడు, అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పేటప్పుడు సమయస్ఫూర్తి, సద్యస్ఫూర్తితో ప్రవర్తించాలి. అలాగే విద్యార్థి జీవితం బ్రహ్మచర్య దీక్షతో సాగటం మేలు కనుక ఇంద్రియ నిగ్రహాన్ని అలవాటు చేసుకొని చదవగలిగితే విజయాలన్నీ చేతికి చిక్కి తీరుతాయి అని ఈ కథా సందర్భం సందేశమిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## పద్మావతి పరిణయోత్సవాలు చూతము రారండి

**తిరుమల, న్యూస్‌టుడే :** తిరుమలలో పద్మావతి పరిణయోత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. శ్రీ వేంకటేశ్వర స్వామి పద్మావతిని వివాహమాడిన ముహూర్తానికి గుర్తుగా ఉత్సవాలను తితిదే ఏటా నిర్వహిస్తోంది. వైకుంఠం నుంచి శ్రీమహావిష్ణువు శ్రీవేంకటేశ్వరునిగా భూలోకానికి వేంచేశారు. ఈ సమయంలో నారాయణవనాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు తన కుమార్తె పద్మావతి అమ్మవారిని శ్రీనివాసునికిచ్చి వివాహం చేశారు. ఆకాశరాజు వైశాఖ శుద్ధ దశమి శుక్రవారం పూర్వ పల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో కన్యాదానం చేసినట్లు వేంకటాచలం మహత్మ్యం తెలుపుతోంది. నిత్య కల్యాణం పచ్చతోరణంగా ప్రసిద్ధికెక్కిన తిరుమలలో నిత్యం ఎన్నో సేవలు, ఉత్సవాలు జరుగుతున్నాయి. స్వామివారు పద్మావతిని వివాహమాడిన ఆనాటి ముహూర్తానికి గుర్తుగా ఎలాంటి ఉత్సవం జరగడంలేదు. పద్మావతి పరిణయోత్సవాల పేరిట 1992 విశాఖ మాసం నుంచి తితిదే శ్రీకారం చుట్టింది. అలనాటి నారాయణవనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో పరిణయోత్సవాలు జరుగుతున్నాయి. ప్రత్యేక ఆకర్షణతో పరిణయోత్సవ మండపాన్ని తితిదే ఉద్యానశాఖ నిర్మించింది.

## తూగు

**జా**తీయాలు పదబంధాలుగానే కాక అనంతర కాలంలో ఒక్కొక్క పదంగా కూడా ప్రయోగంలోకి వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాంటి ఏకపద జాతీయాలకు ఇదొక ఉదాహరణ. తూగు అనే పదానికి ఊగటం, నిద్రపోవటం అనేవి సర్వసామాన్య అర్థాలు. అలాకాక ఆ పదం జాతీయంగా పరిణామం చెందేక వేరొక అర్థంలో ప్రయోగంలో కనిపిస్తుంది. ఁమీతో మేము తూగగలమా" అని అన్నప్పుడు ఈ ప్రయోగంలో కనిపించే తూగుకు సమానం, సామర్థ్యం అనే అర్థాలు ప్రయోగంలో ఉన్నాయి.

## వాసవీ అమ్మవారికి పుష్పార్చన



**పెనుగొండ, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:**వాసవీ అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం పెనుగొండలోని నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఉదయం సుప్రభాతం, నగరేశ్వర స్వామికి ఏకదశ రుద్రాభిషేకం, మహిషాసురమర్దని, వాసవీ అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. కాలక్షేప మండపంలో వాసవీ అమ్మవార్కి 102 కన్యలచే పూజ రామడుగుల లక్ష్మీనరసింహమూర్తి ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్యర్యంలో లక్షమల్లికా పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్‌గుబ్బల రామపెద్దింట్లరావు, ధర్మకర్తలమండలి ఛైర్మన్ నూలి నాగవీరవెంకటగణేష్‌రాజు, పోచల పోతురాజు, వేంద్ర మురళి, కంబాల వెంకట రామనగరస్వామి, కుసుమే కమల, కోట వెంకట సుబ్రహ్మణ్యం, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెనుగొండ వాసవీశాంతిధాంలో అమ్మవారి జన్మదినోత్సవాల్లో భాగంగా గురువారం గోమాతపూజ, కుంకుమ పూజలు, పంచామృతాభిషేకం, హోమాలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో కోట్ల వెంకటేశ్వరరావు, సూర్యారావు, నార్కిడిమిల్లి జనార్దనరావు భక్తులు పాల్గొన్నారు.

## నరనంది వాహనంపై బ్రహ్మంగారు



**కడప, న్యూస్‌టుడే :** ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మంగారు గురువారం నరనంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి నరనంది ఉత్సవం జరిపించారు. సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వర్షం రావడంతో వ్యాపారులు దుకాణాలు తెరవలేదు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, అధికారులు మఠం చేరుకోలేదు. వర్షంరాకతో భక్తులు కూర్చునేందుకు స్థలం లేక ఇబ్బందులు పడ్డారు. అంతా బురదగా మారడంతో రాత్రి ఉండేందుకు వీలులేకుండా పోయింది. దూరప్రాంతాల వారు తిరుగుముఖం పట్టారు.

## బ్రహ్మోత్సవాలకు వేళాయే..!



ముస్తాబైన నృసింహుని ఆలయం

**నల్గొండ, న్యూస్‌టుడే:** మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజులు నిర్వహించే కల్యాణోత్సవాలకు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ, దేవాదాయ శాఖలు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నాయి. దేవాలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేశారు. ప్రహ్లాద ఘాట్ వద్ద గతంలో మహిళల కోసం గదులు నిర్మించారు. అదనంగా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. నిప్రత్యేకంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 13 అన్నదాన సత్రాలు భక్తులకు వసతులు కల్పించనున్నాయి. గుంటూరు జిల్లా నుంచి బల్లకట్టు ద్వారా వచ్చే భక్తుల కోసం పంచాయతీ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. కోదాడ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పనులను ఛైర్మన్ చెన్నూరి నరసింహారావు, ఈవోఎంపీ లక్ష్మణ్‌రావు పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12 వరకు అధ్యయనం, పరమపద, శాత్తుమరై కార్యక్రమాలు నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల్లో లక్ష్మీనృసింహుడు వివిధ అలంకరణాల్లో భక్తులకు దర్శనమిస్తారు. 12న ధ్వజారోహణం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, అంకురారోపణం, అగ్ని ప్రతిష్ఠాపనం తదితర కార్యక్రమాలు ఉంటాయి. 13న నృసింహ జయంతిని పురస్కరించుకుని ధృవస్వామికి పంచామృత అభిషేకాలు, లక్షమల్లికా పుష్పపూజ, అర్ధరాత్రి 12 గంటలు దాటాక ఎదుర్కోళ్ల ఉత్సవం, రాజ్యలక్ష్మి, చెంచు లక్ష్మి సమేత నృసింహుని కల్యాణం తెల్లవారుజామున తలంబ్రాలు ఉంటాయి. 14న గరుడ వాహన సేవ, భక్తగానల హరి, రథోత్సవం. రాత్రికి పౌరాణిక నాటక ప్రదర్శన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు. 15న శ్రీసూక్త సహిత మహాలక్ష్మి యాగం, కృష్ణానదిలో హంస వాహనోత్సవం. 16న వసంతసేవ, చక్రతీర్థం, పూర్ణాహుతి, దోపు ఉత్సవాలు. 17న ద్వాదశ సేవలు, పవళింపుసేవ, సంగీతవిభావరితో బ్రహ్మో త్సవాలు ముగుస్తాయి. మట్టపల్లిలక్ష్మీనృసింహునికి హుండీల ద్వారా రూ. 3.55లక్షలు ఆదాయం సమకూరింది. ఆలయంలోని హుండీలలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదును బుధవారం లెక్కించారు. 42 రోజుల అనంతరం హుండీలను తెరిచినట్లుఛైర్మన్ నరసింహారావు, ఈవో లక్ష్మణ్‌రావు తెలిపారు.

# తెలివైన అమ్మ తీరు ఇదేనమ్మ!

సృష్టిలో అమృతానికి ప్రతిరూపం, దైవానికి ప్రతిబింబం అమ్మేనంటారు అందరూ. అయితే బిడ్డల పెంపకం విషయంలో ఉండాల్సిన తెలివితేటలు కూడా అక్షరాలా ప్రతిరూపం అమ్మే. తనకున్న సంతానంలో ఏ బిడ్డ శక్తి ఎంత? ఎవరికి ఎంత పెట్టాలి? ఎవరిచేత ఎంత పని చేయించాలి? అనే అంచనాలు అమ్మకు మాత్రమే బాగా తెలుస్తాయి. అని ఎలా చెప్పగలం? అని అంటే మహాభారతంలో కుంతి తన బిడ్డలైన పాండవుల విషయంలో కనపరచిన ప్రేమానురాగాలే అందుకు తగిన సాక్ష్యం. మహాభారత కథలో ఏకచక్రపురంలో మారువేషాలలో పాండవులు, కుంతి ఉంటున్న సమయంలోనూ, శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన రాయబారిగా వచ్చి తనను పలుకరించిన సందర్భంలోనూ ఇలా ఇంకా పలు సందర్భాలలో కుంతి ప్రవర్తన సృష్టిలోని అమ్మమనసుకు అద్దం పడుతున్నట్లుంటుంది. ప్రధానంగా ఆదిపర్వం నూటఅరవైఒకటి, నూటతొంభైఒకటో అధ్యాయాలలో ఈ విషయాలు స్పష్టమవుతాయి.

### తన బిడ్డను పంపుతానన్న కుంతి

పాండవులు తమతల్లి కుంతితో సహా దుర్యోధనుడి కుట్రను అధిగమించి, లక్క ఇంట అగ్ని ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆ తర్వాత వారంతా ఏకచక్రపురంలోని ఒక బ్రాహ్మణుడి ఇంటికి చేరారు. కొంతకాలం బాగానే గడిచింది. అయితే ఓ రోజున ఆ ఇంటి వారంతా పెనువిషాదంలో ఉండటం చూసి కుంతి విషయం తెలుసుకుంది. బకాసురుడు అనే రాక్షసుడికి ఆ ఊరివారు రోజుకొక ఇంటి నుంచి బండెడు అన్నాన్ని, ఒక మనిషిని ఆహారంగా పంపాల్సి ఉంది. ఆ రోజున ఆ ఇంటివారికి వంతు వచ్చింది. ఆ ఇంటి యజమానికి ఒక్కడే కుమారుడు కావటంతో వారి బాధ మరీమరీ ఎక్కువనిపించింది. కుంతి ఆ యజమాని దగ్గరకు వెళ్లి భయపడవద్దని తనకున్న అయిదుగురు కుమారులలో ఒకరిని ఆ ఇంటి బాలుడికి బదులుగా పంపుతానంది. వారికి తన బిడ్డ బలపరాక్రమాల గురించి కూడా చెప్పింది. వాస్తవానికి ఒక తల్లికి వందమంది కుమారులున్నా ఏ కుమారుడి మీదా అయిష్టత ఉండదని, అలాగే తనకు కూడా తన కుమారులందరి మీదా ఇష్టం ఉండటంతో పాటు వారి బలాబలాలు బాగా తెలుసు కనుక తాను అలా చేస్తున్నట్లు చెప్పింది. ఆ మాటలకు ఆ ఇంటివారంతా ఆనందించారు. వెంటనే విషయాన్ని భీముడికి చెప్పింది కుంతి. అతడు మరింత ఉత్సాహంతో బకాసురుడి దగ్గరకు వెళ్లటానికి సిద్ధమయ్యాడు. భీముడి ఉత్సాహం చూసి ధర్మరాజుకు ఏదో సందేశం కలిగింది. అలా శరీరం పెంచి హుషారుగా తిరుగుతున్నాడంటే ఎవరినో చంపటానికే భీముడు సిద్ధమౌతున్నాడని ధర్మరాజు గ్రహించాడు. వెంటనే తల్లి దగ్గరకు వెళ్లి తన తమ్ముడి సమరోత్సాహానికి కారణమేమిటని అడిగాడు. కుంతి విషయాన్ని వివరించింది. ఆ ఇంటివారు తమకు ఆశ్రయాన్నిచ్చి ఉపకారం చేస్తున్నారు కనుక, ఉపకారానికి ప్రత్యుపకారం చేయటం ధర్మం కనుక తానలా భీముడిని వినియోగించినట్లు కుంతి ధర్మరాజుకు వివరించింది. తల్లి మాటలను విన్న ధర్మరాజు భయపడ్డంత పని చేశాడు. భీముడివల్లే లక్క ఇంటి ప్రమాదం నుంచి తామలా బయటపడ్డామని, అలాంటి భీముణ్ణి ప్రమాదమైన పనికి పంపటం భావ్యంగా లేదన్నాడు ధర్మజుడు. అసలు సొంత కొడుకును బలిపెట్టాలన్న క్రూరమైన ఆలోచన ఎలా వచ్చిందని అడిగాడు. కుంతి స్థిరంగా ధర్మరాజుకు తన నిర్ణయాన్ని వివరించింది. ఆపదలలో ఉన్నవారిని రక్షించటం రాజధర్మమన్న విషయాన్ని గుర్తు చేసింది. భీముడు పదివేల ఏనుగుల బలం కలవాడని, అందుకే ఒక్కొక్కరు ఒక్కొక్క ఏనుగంత బలంతో ఉన్నా నలుగురు సోదరులను, తనను సునాయాసంగా మొయ్యగలుగుతున్నాడని చెప్పింది. అంతేకాక భీముడు పుట్టినప్పుడు ఓసారి తన ఒడి నుంచి జారి కొండబండ మీద పడ్డాడని అప్పుడు నల్లరాయి నుగ్గునుగ్గు అయింది తప్ప భీముడికి చిన్న గాయం కూడా కాలేదని, అంతటి బలవంతుడు కనుకనే బకాసురుడిని చంపటానికి పంపుతున్నట్లు వివరించింది. కుంతి అంచనామేరకే భీముడు ఆ ఊరివారందరికీ రాక్షసపీడను వదిలించి శాంతిని కలిగించాడు.






### తొలి భాగం దేవతలకు నివేదన

అలాగే పాండవులకు ద్రౌపదితో వివాహమైయ్యాక కూడా కొంతకాలం వారు అజ్ఞాతంగా ఉంటూ భిక్షాటనతో జీవిస్తూ ఉండేవారు. సాయంకాలానికి భీమార్జునులు, నకులసహదేవులు భిక్షను తెచ్చి ధర్మరాజుకు నివేదించేవారు. అప్పుడా భిక్షను కుంతి చెప్పిన ప్రకారం ద్రౌపది భాగాలుగా చేసి ఎవరి భాగం వారికిస్తూ ఉండేది. ఈ భాగాల పంపకంలో కూడా కుంతి తల్లి హృదయం స్పష్టమవుతుంది. కుంతి చెప్పిన ప్రకారం ముందుగా భిక్షలో ఒక భాగాన్ని దేవతలకు బలిగా నివేదించేది ద్రౌపది. ఆ తర్వాత ఒక భాగం విప్రులకు భిక్షగా, వారిచుట్టూ ఆశ్రయించి ఉన్నవారికి కొంత భాగాన్ని ఇక మిగిలిన దానిలో సగభాగాన్ని భీముడికి పంచేది. మిగిలిన సగభాగాన్ని ఆరుభాగాలు చేసి అందులో నాలుగు భాగాలు ధర్మజ, అర్జున, నకులసహదేవులకు ఒక భాగాన్ని కుంతికి, చివరి భాగాన్ని తనకు విడిగా తీసిపెట్టేది ద్రౌపది. ఇలా అందరికీ సర్దిన తర్వాత భీముడు పెద్దశరీరంతో ఉండి ఎక్కువ తినగలిగినవాడు కావటంతోనే అలా పెద్ద భాగాన్ని భీముడి కోసం ఉంచమన్నట్లు చెప్పింది కుంతి. ఈ విభాగాల వరుసను గమనిస్తే ఒక తల్లి తన బిడ్డలకు కేవలం సంపాదించుకోవటమే ముఖ్యం కాదూ ధర్మాన్ని అనుసరించి దాన్ని సద్వినియోగ పరుచుకోవాలి అని తెలియచెప్పినట్టు కూడా కనిపిస్తుంది. భారతీయ సంప్రదాయం ప్రకారం సంపాదనలో తొలిభాగాన్ని దేవతలకు నివేదించాలి. ఎందుకంటే దేవతల దయవల్లే హాయిగా బతకగలుగుతున్నాం కనుక. ఆ తర్వాత విప్రులకు, అలాగే మనమీద ఆధారపడి మన చుట్టూ ఉన్నవారికి పంచిపెట్టేకే మిగిలిన దాన్ని మనం అనుభవించాలని కుంతి ఈ సందర్భంలో తన బిడ్డలకు ధర్మాన్ని ప్రభోదించిన తీరు ఆదర్శవంతమైన అమ్మతత్త్వానికి ప్రతీక. ఇక ఆ తర్వాత తన బిడ్డలందరిలో భీముడు కాస్తంత ఎక్కువ తింటాడు కనుక అతడికి ఎక్కువభాగం ఏర్పాటు చేయటంలో కూడా ‘‘అమ్మ ఆకలి చూస్తుంది’’ అనే నానుడికి తగ్గట్టుగా ఇక్కడ పరిస్థితి కనిపిస్తుంది. కృష్ణుడు పాండవుల పక్షాన కౌరవుల దగ్గరకు రాయబారిగా వచ్చి మర్యాదపూర్వకంగా కుంతిని కలిసినప్పుడు కూడా కుంతిలో అమ్మతత్త్వం ప్రతిబింబిస్తుంది. తన బిడ్డలు అయిదుగురిలో మిగతా అందరికన్నా చివరివాడు ‘కడసారపు కందిగింజ’ లాంటివాడు సహదేవుడు. ఆ బిడ్డ యోగక్షేమాలను మరీమరీ అడగటం తల్లుల సహజ ప్రవర్తనను తలపిస్తుంది. ఇలా మహాభారత కథలో కుంతి పాత్రలో అమ్మతత్త్వం అద్భుతంగా ప్రతిబింబిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

---

## గొడ్డు

ఏక పదాలలో ఉన్న జాతీయాలలో ఇది కూడా ఒకటి. సాధారణంగా గొడ్డు అనే పదానికి పశువు అని అర్థం. మనిషికి, పశువుకు, పోలికలు చాలా ఉన్నా ప్రధానమైన భేదం మాత్రం ఒకటుంది. ఆహార భయ నిద్ర మైథునాల వంటివి మనిషికైనా, గొడ్డుకైనా సమానమే. అయితే భేదం మాత్రం జ్ఞానం. ఇదే ప్రధానం. జ్ఞానం ఉండబట్టి మనిషికి, గొడ్డుకు తేడా కనిపిస్తోంది. జ్ఞానం లేని కారణంగానే గొడ్డు మనిషికన్నా హీనంగా కనిపిస్తుంది. ఈ భావార్థంలోనే గొడ్డు అనేది జాతీయమైంది. జ్ఞానంలేని మనిషి అని చెప్పాల్సి వచ్చినప్పుడు “వాడికి మాట్లాడటం చేతకాదు వాడొక గొడ్డు” అని అనటం కనిపిస్తుంది.




---



ప్రత్యేక అలంకరణలో తిరుపతి గంగమ్మ, తోటి వేషంలో బాలురు

## అంబరాన్ని అంటిన సంబరం

**తిరుపతి(చిత్తూరు జిల్లా), న్యూస్‌టుడే:** శ్రీ తాతయ్యగుంట గంగ జాతరలో భాగంగా ఐదో రోజు భక్తులు తోటి వేషాలు వేశారు. ఈ సంబరం అంబరాన్ని అంటింది. ఆలయంలో శుక్రవారం అమ్మవారికి అభిషేకం నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. ప్రత్యేక పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి గంగమ్మ తల్లిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం కిటకిటలాడింది. భక్తులు బొగ్గుపొడి శరీరమంతా పూసుకుని, నాము కొమ్ముతో మీసాలు పెట్టుకొని, వేపాకు చేపట్టి, బొరుగులు, వేపకాయలు దండలు ఆభరణాలుగా ధరించారు. చేతిలో వేపమండలు, చీపురు పుల్లలు, కర్రలు పట్టుకున్నారు. అమ్మవారి ఆలయ పాదాల వద్ద ప్రణమిల్లి పసుపు, కుంకుమ, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా భక్తులు బూతులు మాట్లాడుతూ నగరంలోని తాళ్లపాక పెద్ద గంగమ్మ, అంకాళమ్మ, చిన్నముత్యాలమ్మ, నేరేలమ్మ, రేణుకమ్మ, వేషాలమ్మ ఆలయాలను దర్శించుకున్నారు. ముత్తైదువులు చీర, జాకెట్, పసుపు, కుంకుమలు అమ్మవారికి కానుకలుగా సమర్పించారు. పొంగళ్లుపెట్టి నైవేద్యంగా సమర్పించారు. దీంతోపాటు నగరంలో అమ్మవారి ఫ్లెక్సీ బోర్డులు ఉంచి పూజలు నిర్వహించారు. వ్యాపారస్తులు మజ్జిగ, అంబలి, పెరుగు, సాంబారు అన్నం భక్తులకు పంపిణీ చేశారు.

---

## ఘనంగా చౌడేశ్వరిమాత జ్యోతులు

**కర్నూలు, న్యూస్‌టుడే:** కొత్తపల్లి మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిమాత జ్యోతుల ఉత్సవాలు శుక్రవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జ్యోతుల గ్రామోత్సవం నిర్వహించారు. పలు విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం అమ్మవారికి గంగస్నానం చేయించి నూతన వస్త్రాలంకరణ గావించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావారణం సంతరించుకొంది.



జ్యోతుల ఊరేగింపు

---



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

## ఘనంగా సహస్ర కలశాభిషేకం

### వైభవంగా నరసింహుని నవరాత్రి ఉత్సవాలు

**కరీంనగర్, న్యూస్‌టుడే:** ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సహస్ర కళశాభిషేకం ఘనంగా జరిగింది. గత అయిదు రోజులుగా ఆలయంలోని మండపాల్లో స్థాపించిన సహస్ర కళాశాలలోని పవిత్ర గోదావరి నది జలాలతో స్వామి వారిని అర్చకులు అభిషేకించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆంజనేయులు, ధర్మకర్తలు నరేందర్, రవీందర్, అరుణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సర్పంచి సత్తెమ్మ, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

## జగన్మోహనంగా శ్రీనివాసుని దివ్యదర్శనం

**ఏలూరు (పశ్చిమగోదావరి జిల్లా), న్యూస్‌టుడే:** సర్వజగద్రక్షకుడు, త్రిభువన పాలకుడు శ్రీనివాసుడు సర్వాలంకార శోభితులై ఉభయ దేవేరులతో భక్తులకు జగన్మోహనంగా దర్శనం అనుగ్రహించారు. ఆర్‌ఆర్‌పేటలోని వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. పాంచరాత్ర ఆగమ భూషణ చివుకుల సుధీర్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో హోమం, ఉత్సవ మహాపూర్ణాహుతి నిర్వహించారు. అర్చకులు ఇల్లిందుల శ్రీనివాసాచార్యులు, కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు పూజలు చేశారు. భాగవతోత్తములు తిరుప్పావై, విష్ణు సహస్రనామపారాయణ చేశారు. తొలుత ఉదయం భక్తిశ్రద్ధలతో మహిళలు కోటికుంకుమార్చన చేశారు. అనంతరం మహాన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ మేనేజర్ టి.విశ్వేశ్వరరావు, మాజీఛైర్మన్ కొత్తమాసు వెంకట శేషగిరిరావు, మాజీధర్మకర్తలు, భక్త బృందం కార్యక్రమాలు పర్యవేక్షించారు.



కుంకుమపూజలు నిర్వహిస్తున్న భక్తులు

# తానున్నానని చెప్పేందుకే...

**త**న భక్తుల మాటలను నిలబెట్టేందుకు, తానున్నానని ప్రకటించేందుకు ఆ దైవం భిన్న అవతారాలను ధరిస్తూ సమయం, సందర్భం చూసుకొని ప్రత్యక్షమవుతుంటాడు. ఈ విషయాన్ని అక్షరబద్ధం చేస్తూ నిరూపిస్తోంది భాగవతం ఏడోస్కంధం ఎనిమిదో అధ్యాయంలోని నరసింహావతార ఘట్టం. ప్రహ్లాదుడు నిరంతర హరిభక్తితో హిరణ్యకశిపుడు పెట్టే కష్టాలన్నింటినీ ఎదుర్కొన్నాడు. ఎన్ని కష్టాలుపెట్టినా భగవంతుడు ఉన్నాడు అనే ఆస్తిక భావాన్ని ప్రహ్లాదుడు ఏనాడూ విడిచిపెట్టలేదు. తల్లిగర్భంలో ఉన్నప్పుడు నారద మహర్షి చేసిన ఉపదేశాలను బాగా గ్రహించాడు గర్భస్థ శిశువుగా ఉన్న ప్రహ్లాదుడు. మహర్షి మాటలవల్ల విన్నదే తప్ప ఆ స్వామిని చూడలేదు. అయినా సరే పెద్దవాడు, అనుభవజ్ఞుడు అయిన మహర్షి చెప్పాడు కనుక పుట్టి పెరుగుతున్నా ప్రహ్లాదుడిలో వేరే సందేహాలేవీ కలగలేదు.



### హరిభక్తివైపు మరల్చిన ప్రహ్లాదుడు

చిన్నతనంలోనే ప్రాణాంతకమైన బాధలను స్వయంగా కన్నతండ్రే పెడుతున్నా దేవుడు లేడేమోనన్న ఆలోచనకసలు రానేలేదు. దేవుడు ఉన్నాడు. తనను నిత్యం కీర్తించే భక్తులను ఆయన ఆదుకుంటూనే ఉంటాడు. అయితే సమయం వచ్చేదాకా ఓపిక పట్టాలి అంతే అని భక్తిపూర్వకమైన స్థిరబుద్ధితో ఉన్నాడు ఆ బాలభక్తుడు. ఓ రోజున ప్రహ్లాదుడి భక్తి నిరూపితమయ్యే సందర్భం రానే వచ్చింది. దేవుడు కూడా తనను నమ్మి తానున్నానని గట్టిగా నమ్మకంతో ప్రచారం చేస్తున్న ప్రహ్లాదుడి మాటను నిలబెట్టాలని అనుకొన్న సమయం కూడా వచ్చింది. బాల ప్రహ్లాదుడు తనతోటి విద్యార్థులైన రాక్షస బాలలను కూడా హరిభక్తివైపు మరల్చటం మొదలుపెట్టాడు. ప్రహ్లాదుడి ప్రవచనాలను విన్న తర్వాత ఆ రాక్షసుల పిల్లలంతా నిర్మలమైన మనసుతో ఉండసాగాడు. రాక్షస గురువులు చెబుతున్న విద్య మీద శ్రద్ధ పెట్టడంలేదు. ఈ పరిస్థితి హిరణ్యకశిపుడికి మరింత కోపాన్ని తెప్పించింది. ఎలాగైనా సరే ఆ రోజున ప్రహ్లాదుడిని సంహరించాలని అనుకొన్నాడు హిరణ్యకశిపుడు. తన వంశానికి కళంకం తెస్తున్నాడని, తన ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నాడని, తన మాటంటే ముల్లోకాలు గడగడవణుకుతాయని, అలాంటిది బాలుడైన ప్రహ్లాదుడు తన మాటను వినకపోవటమేమిటన్న పట్టుదల మరీ మరీ పెరిగింది హిరణ్యకశిపుడికి. ఎవరి బలం చూసుకొని తన మాట వినటం లేదో చెప్పమని గట్టిగా అరిచాడు హిరణ్యకశిపుడు. అప్పుడు ప్రహ్లాదుడు లోకాలన్నిటా అసలైన బలవంతుడు శ్రీహరి మాత్రమే. భయపడితే ఎవరైనా ఆ స్వామికే భయపడాలి తప్ప ఇంకెవరికీ భయపడనక్కరలేదని అన్నాడు ప్రహ్లాదుడు. అప్పుడు అహంకారంతో విర్రవీగుతున్న హిరణ్యకశిపుడు తన దృష్టిలో శ్రీహరి అసలు లేనేలేడని ఉంటే ఎక్కడున్నాడో చూపించమని ప్రహ్లాదుడిని పరుషపు మాటలతో బాధించాడు. ప్రహ్లాదుడు ఆ శ్రీహరి ఇక్కడ, అక్కడ అనేమిటి విశ్వమంతటా వ్యాపించి ఉన్నాడని అనటంతో వెంటనే హిరణ్యకశిపుడు సింహాసనం మీద నుంచి లేచి ఒక చేత ఖడ్గాన్ని పట్టుకొని, మరొక చేయి పిడికిలితో ఎదురుగా ఉన్న స్తంభాన్ని గుద్దాడు. ఆ క్షణంలోనే

ధర్మపథం

బ్రహ్మాండం బద్దలవుతున్నట్టు ఫటఫట ఫెళఫెళ ఛటఛట అనే భయంకరమైన శబ్దాలు వినిపించాయి. ఆ శబ్దాలకు రాక్షస సేనాపతులు భయపడి పారిపోసాగారు. హిరణ్యకశిపుడు కూడా కాస్తంత తత్తరపడి ఆ శబ్దం ఎక్కడ నుంచి వస్తోంది అని చూశాడు.

### విచిత్ర రూపంలో శ్రీహరి

తాను పిడికిలితో గుద్దిన స్తంభం నుంచి శబ్దం వస్తోందని హిరణ్యకశిపుడు తెలుసుకోనేంతలోనే భగవంతుడైన శ్రీహరి ఒక విచిత్ర రూపంలో బయటికొచ్చాడు. ఆ రూపం అద్భుతంగా ఉంది. అటు మనిషీ కాదూ, సింహమూ కాదూ. అది నరసింహరూపం. మహాభయంకరంగా ఆ రూపం కనిపించింది. ఆ నరసింహస్వామి కళ్లు పుటం పెట్టిన బంగారంలా పచ్చగా భయానకంగా ఉన్నాయి. వెడల్పైన ముఖంతో జూలు విదుల్చుతూ మెడను అటూఇటూ తిప్పుతూ నరసింహస్వామి కనిపించాడు. ఆ స్వామి కోరలను చూస్తుంటేనే అందరికీ భయం కలిగింది. పెద్దఖడ్గంలాగా ఉన్న నాలుకను చాచి అటూఇటూ తిప్పుతున్నాడు ఆ స్వామి. కనుబొమలు ముడివడి ఉన్నాయి. చెవులు నిశ్చలంగా నిక్కపొడుచుకొని ఉన్నాయి. వెడల్పుగా ఉన్న ముక్కుపుటాలు, తెరిచి ఉన్న నోరు, పెద్దపెద్ద గుహలలాగా కనిపిస్తున్నాయి. చాచిన దౌడలతో ఆ స్వామి ముఖం భీషణంగా ఉంది. శరీరం ఎంతో పొడవుగా ఆకాశాన్ని తాకేలా కనిపిస్తోంది. మెడ బలిష్ఠంగా లావుగానూ ఉంది. వెడల్పైన వక్షస్థలంతో సన్నని నడుముతో విరాజిల్లుతున్నాడు నరసింహస్వామి. చంద్రకిరణాలలాంటి తెల్లని రోమాలు ఆయన శరీరం మీద మెరుస్తున్నాయి. వందలకొద్దీ భుజాలు అన్ని వైపులా వ్యాపించి ఉన్నాయి. గోళ్లు ఆయుధాలలాగా పొడవుగా పదునుతేలి కనిపిస్తున్నాయి. అంతటి భీకరాకృతితో నరసింహస్వామి అవతరణం జరిగింది. అలా ఎందుకవతరించాడు అంటే హిరణ్యకశిపుడి రూపంలో అధర్మం అంత ఘోరంగా ఆ రోజున ప్రబలి ఉంది. అంతటి అధర్మాన్ని అంతం చేసేందుకు, భగవంతుడున్నాడని ధర్మాన్ని కాపాడి తీరుతాడని స్పష్టం చేసి చెబుతున్న తన భక్తుల మాటను నిలబెట్టేందుకు నరసింహస్వామి రూపంలో ఆ శ్రీహరి అలా అవతరించాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## పచ్చి

**ఈ** పదానికి ఎండనిది, కాయస్థితిలో ఉన్నది అనే అర్థాలు సహజంగా ఉన్నాయి. అయితే ఇదే పదం జాతీయంగా మారేసరికి అర్థం మారిపోయింది. అచ్చం, స్వచ్ఛం, కచ్చితమైన లాంటి అర్థాలలో ఇదే ప్రయోగంలో కనిపిస్తుంది. పచ్చినిజం చెబుతున్నాను విను అనేటప్పుడు స్వచ్ఛమైన సత్యం అనే అర్థంలో పచ్చి నిజం వాడుకలో కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

## ఐరావతంపై ఈశ్వరుడి నగరోత్సవం

***గుంటూరు, న్యూస్‌టుడే:*** ఆర్. అగ్రహారంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఐరావత వాహనంపై ఆలయ ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిగాయి. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి చెన్నుపల్లి శివయ్య, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పివి బుచ్చిరామశాస్త్రి పర్యవేక్షించారు.



## కన్నుల పండువగా నరసింహుని పల్లవోత్సవం

**కరీంగనర్, న్యూస్‌టుడే:** ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి పల్లవోత్సవ, వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. దేవస్థానం గోపుర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. స్వామివారల ఉత్సవ మూరులను ఆసీనులను చేసి అభిషేకించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల ద్రవ్యాలు, పంచామృతాలు, వివిధ రకాల ఫలాలతో అభిషేకించి వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మూడు గంటపాటు జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రవీందర్, నరేందర్‌లు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.



వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా రథోత్సవం



ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

**ఆదోని (కర్నూలు జిల్లా), న్యూస్‌టుడే:** ఆదోని పట్టణం హనుమాన్‌నగర్ శ్రీ పంచముఖి వీరాంజనేయస్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండుగగా సాగింది. ఆలయ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీస్వామి మూర్తికి రంగులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, నవగ్రహ పూజ, కలశస్థాపన, వాయుస్తుతి హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. చిన్నారులు కలశాలతో రథానికి స్వాగతం పలకగా.. భక్తులు భజనలు చేస్తూ రథాన్ని ఆహ్వానించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



కలశాలతో స్వాగతం పలుకుతున్న చిన్నారులు



రథం ముందు భజనలు చేస్తూ...

## కల్యాణ వెంకన్న కమనీయ వేడుక

**నారాయణవనం(చిత్తూరు జిల్లా), న్యూస్‌టుడే:** నారాయణవనంలో వెలసిన శ్రీపద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటిగంట, శాత్తుమొర, నిత్య కైంకర్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సేనాధిపతి అయిన విష్వక్సేనునికి అర్చకులు అభిషేకాలు నిర్వహించి అనంతరం పూజలు చేశారు. ఆ తరువాత తిరుచ్చి వాహనంపై గ్రామ పురవీధులలో విహరిస్తూ బ్రహ్మోత్సవ సందేశాన్ని అష్టదిక్పాలకులకు, సకల దేవగణాలకు అందించి పుట్ట మన్నును తెచ్చారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పుట్టమన్నుతో మేథిమి ప్రతిమను రూపొందించి పూజలు జరిపి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఏర్పాట్లను తితిదే ఆలయసూపరింటెండెంట్ పీతాంబర్‌రాజు, ఆలయాధికారి బాలనరసింహరావు, జూనియర్ సహాయకులు వీరయ్య, ఆలయ అర్చకులు శ్రీనివాసభట్టాచార్యులు, నరసింహరాఘవ భట్టాచార్యులు, వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



తిరుచ్చిపై ఆశీనులైన విష్వక్సేనుడు

## నయనానందకరంగా కల్యాణోత్సవాలు

**ద్వారకాతిరుమల(పశ్చిమ గోదావరి జిల్లా), న్యూస్‌టుడే:** వైశాఖమాస తిరుకల్యాణమహోత్సవాల్లో భాగంగా ద్వారకాతిరుమల దేవస్థానం కన్నుల పండువగా మారింది. ఆలయ వీధులు ఆదివారం ఉదయం నుంచి భక్తులతో నిండిపోయాయి. ఉదయంపూట సూర్యప్రభ వాహనంపై పంచాయతన శ్రీమన్నారాయణ అలంకరణలో స్వామివారిని అందంగా అలంకరించి ఆలయఅర్చకులు స్వామివారికి హారతులు ఇచ్చారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగుతున్న ద్వారకాధీశుని తిలకించేందుకు గ్రామంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో తరలి వచ్చారు. స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించే సందర్భంలో గోవింద నామస్మరణలతో భక్తులు తన్మయత్వం చెందారు. ఆలయ వీధులు వివిధరకాల సెట్టింగులతో నిండిపోయాయి. తిరుకల్యాణోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. స్వామివారి ఆలయం ముందు వేదికపై ఆదివారం రాత్రి కూచిపూడి నృత్యాలు, భక్తిగీతాలాపన, భజనసంకీర్తనలు భక్తులను అలరించాయి. నూతన వధూవరులు స్వామివారినిసూర్యప్రభవాహనంపై ఊరేగుతున్న స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

### చంద్రప్రభ వాహనంపై...

ద్వారకాతిరుమల వీధుల్లో స్వామివారిని నవనీతకృష్ణుని అలంకరణలో అందంగా అలంకరించి చంద్రప్రభవాహనంపై ఉంచి పూజలు చేశారు. ఆలయఅర్చకులు వేద మంత్రాలతో స్వామివారికి హారతులు ఇచ్చారు. విద్యుద్దీపాల వెలుగులో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

# చెరువులు, చెట్లు.. పుణ్యానికి మెట్లు!

అసమానమైన పుణ్యఫలాన్ని సామాజికసేవ నేపథ్యంలో సులభంగా పొందవచ్చని మహాభారతం అనుశాసన పర్వం తెలియజేస్తోంది. భీష్మాచార్యుడు ధర్మరాజడిగిన ప్రశ్నలకు చెప్పిన సమాధానాలలో చెరువులు, తోటలు నిర్మించటం వల్ల కలిగే పుణ్యఫలితాలు ఇలా ఉన్నాయి. అందంగా, సారవంతంగా, చిత్రంగా, ధాతుసహితమై సర్వప్రాణులతో కూడిన భూమిని శ్రేష్ఠ భూమి అని అంటారు. అలాంటి భూమిలో తటాకాలను తవ్వించిన వ్యక్తి మూడులోకాలలోనూ పూజానీయ స్థానాన్ని అందుకుంటాడు. తటాక నిర్మాణం మిత్రుడులాంటిది. చెరువులను నిర్మించటం వల్ల స్నేహం వృద్ధి చెందుతుంది. కీర్తి విస్తరిస్తుంది. ధర్మార్థకామాల ఫలితాన్నిస్తుంది. తటాకం ఉన్న ప్రాంతం ప్రాణులకు ఆశ్రయంగా ఉంటుంది. ఇంకా చెప్పాలంటే ప్రాణులన్నింటికీ జలంతో కూడిన తటాకమే ఆధారం. చెరువులు ఇహపర లోకాలకు సంబంధించిన సంపదలను అందిస్తాయి. దేవతలు, మనుషులు, గంధర్వులు, పితరులు, నాగులు, రాక్షసులు ఇలా సమస్త స్థావర ప్రాణాలన్నీ జలాశయాన్ని ఆశ్రయిస్తూ ఉంటాయి.



### తటాకాలే కాపాడతాయి

ఇలా నిర్మించిన తటాకాలలో ఎవరి తటాకంలో వర్షాకాలంలో నీళ్లు నిలిచి ఉంటాయో వారికి అగ్నిహోత్ర ఫలితం దక్కుతుంది. తవ్వించిన చెరువులో శరత్కాలంలో నీళ్లు నిలిచి ఉన్నట్లైతే ఆ చెరువును తవ్వించిన వ్యక్తికి మరణానంతరం వెయ్యి ఆవులను దానం చేసిన ఫలితం దక్కుతుంది. ఎవరి తటాకంలో హేమంత రుతువులో నీళ్లుంటాయో వారు బంగారాన్ని దక్షిణగా ఇచ్చి యాగం చేసిన ఫలితాన్ని పొందుతారు. ఎవరి తటాకంలో శిశిర రుతువులో నీరు నిలిచి ఉంటుందో వారికి అగ్నిష్టోమ యాగం చేసిన ఫలితం అందుతుంది. తవ్వించిన చెరువులో వసంత రుతువులో నీరు నిండుగా ఉండి దప్పికగొన్నవారికి దాహం తీరుతున్నట్లైతే ఆ చెరువును తవ్వించిన వారికి అతిరాత్ర యజ్ఞ ఫలం సొంతమవుతుంది. ఎవరి తటాకంలో వేసవికాలంలో కూడా నీరు నిలిచి ఉంటుందో అలాంటివారు అశ్వమేధయాగ ఫలితాన్ని పొందగలుగుతారు. జలాశయంలో ఎప్పుడూ గోవులు, సత్పురుషులు నీరు తాగుతూ ఉంటే ఆ జలశయాన్ని నిర్మించిన వారి వంశాలన్నీ వృద్ధి చెందుతాయి. ఎవరి తటాకంలో దప్పికగొన్న ఆవులు, మృగాలు, పక్షులు, మనుషులు నీరు తాగుతూ ఉంటారో ఆ తటాకం వారికి అశ్వమేధయాగ ఫలం దక్కుతుంది. తవ్వించిన చెరువులో ప్రజలు స్నానం చేసి ఒడ్డుకొచ్చి హాయిగా విశ్రమిస్తే ఆ చెరువు తవ్వించిన వ్యక్తికి మరణానంతరం అనంత సుఖాలు లభిస్తాయి. ఇదంతా ఎందుకు జరుగుతోందంటే నీరు దుర్లభమైనది. పవిత్రమైనది. దైవసమానమైనది కూడా. అందుకే అలాంటి నీరు నిల్వ ఉండే చెరువుల

ధర్మపథం

ఏర్పాటు వల్ల పుణ్యం లభిస్తుంటుంది. జలదానం వల్ల శాశ్వత ఆనందం దక్కుతుంది. తిలదానం, జలదానం, దీపదానం అనేవి దాయాదులతో విరోధం రాకుండా శాంతిగా ఉండేందుకు తగిన పుణ్యం లభిస్తుంటుంది.

### సమాజానికి మేలు

చెరువుల నిర్మాణం తర్వాత చెట్లు నాటడం అనేది మరింత పుణ్యఫలితాన్నిచ్చే కార్యం. చెట్లు, పొదలు, లతలు, నేలపై పాకేతీగలు, వెదురువంటి త్వక్‌సారాలు, తృణజాతులు అనే వృక్షజాతులు ఆరు రకాలు. వాటిని నాటితే ఎన్నెన్నో లాభాలున్నాయి. మానవలోకంలో కీర్తి, మరణానంతరం శుభప్రాప్తి కలుగుతాయి. పరలోకంలో ఉన్న పితరుల ఆశీస్సులందుతాయి. చెట్లు నాటిన వారి కీర్తి దేవలోకంలో కూడా వినిపిస్తుంటుంది. చెట్లు నాటిన వారు మరణించిన పూర్వీకులను, పుట్టబోయే వారిని, పితృవంశం మొత్తాన్ని ఉద్ధరిస్తారు. ఇంకా చెప్పాలంటే చెట్లు పుత్రులలాంటివి. పుత్రసంతానం వల్ల పొందే పుణ్యాలన్నీ చెట్లు నాటినా పొందవచ్చు. చెట్లు పూలతో దేవతలను, పండ్లతో పితరులను, నీడతో అతిథులను పూజిస్తాయి. కిన్నెరులు, నాగులు, రాక్షసులు, దేవతలు, గంధర్వులు, మానవులు, రుషిగణాలు చెట్లనాశ్రయించి ఉంటారు. చెట్లు పుష్పించి, ఫలించి మానవులను తృప్తిపరుస్తాయి. తవ్వించిన తటాకాల ఒడ్డున చెట్లను నాటించటం మరింత పుణ్యఫలితాన్నిస్తుంది. నాటిన మొక్కలను పిల్లలను కాపాడినట్లు కాపాడుతుండాలి. ఇలా చెరువులను తవ్వించటం, చెట్లను నాటించడం, తోటలను ఏర్పాటు చేయడం ఇదంతా పుణ్యప్రదమే. దాంతోపాటు పర్యావరణపరంగా సమాజానికెంతో మేలు కూడా కలుగుతుంది. ఈ విషయాన్ని ఇతర పురాణాలు మరికొంత వివరంగా చెబుతున్నా మహాభారతం తనదైన శైలిలో ఇలా పేర్కొంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## పెట్టు

జాతీయాలు నుడికారాలు

ఉంచటం, ఇవ్వటం అనే అర్థాలు దీనికున్నాయి. అయితే ఇదే పదం జాతీయంగా ప్రయోగంలోకి వచ్చేసరికి సమానం అనే అర్థం కనిపిస్తుంది. పెట్టిపోతలు అన్నప్పుడు ఎదుటివారికి ఏవైనా వస్తువులనుకానీ, పదార్థాలను కానీ ఇవ్వటం అనే అర్థం వస్తుంది. అక్కడపెట్టు, ఇక్కడపెట్టు అన్నప్పుడు ఒక వస్తువును అక్కడకానీ, ఇక్కడ కానీ పెట్టడం అనే అర్థం ధ్వనిస్తుంది. కానీ జాతీయంగా వాడేటప్పుడు మాత్రం సమానం అనే అర్థం కనిపిస్తుంది. వీడొక్కడే వందమంది పెట్టు అని అన్నప్పుడు ఒక వ్యక్తి వందమందికి సమానం అని అర్థం.



## ఘనంగా ఉరుసు

**కర్నూలు, న్యూస్‌టుడే:** మరాఠివాడిలో కొలువైన ఓం శ్రీ సయ్యద్ సర్కార్ వలి అల్లా హుసేని సాహెబ్ ఉరుఫ్ మస్తాన్ వలి స్వామి 86వ ఉరుసు అంగ..రంగ వైభవంగా జరిగింది. ఆంధ్రతోపాటు కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

# వైభవంగా చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ

**అనంతపురం, న్యూస్‌టుడే:** చేనేత వర్గాలైన దేవాంగుల కులదైవం ఉరగాద్రి చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఉరవకొండలో వైభవంగా జరిగింది. చంగల వీధిలో పాత ఆలయం చిన్నది కావడంతో రెండేళ్ల క్రితం ఆలయ కమిటీ నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.1.40 కోట్లతో నూతన ఆలయాన్ని విశాల వాతావరణంలో నిర్మించి, చౌడేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కులదైవాన్ని దర్శించుకుని, ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కళ్లారా వీక్షించడానికి దేవాంగులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అమ్మవారి విగ్రహంతో పాటు మహాగణపతి, ఈశ్వర, సుబ్రమణ్య, నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణం వేదమంత్రాలతో మారుమోగింది. పట్టణ నడిబొడ్డున ఉరగాద్రి పర్వతానికి తూర్పు దిశన వెలిసిన ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఆలయాన్ని హంపి హేమకూట గాయత్రి పీఠాధిపతి దయానందపురి మహాస్వామి ప్రారంభించారు. ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం కల్యాణస్వామి, గంగధరేంద్రస్వామి అతిథులుగా హాజరై భక్తులను ఆశీర్వదించారు. చేనేత సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త శ్రీనివాసులు సతీసమేతంగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొత్త ఎర్రిస్వామి, దేవాంగ కమిటీ పెద్దలు ఎంసీ నాగభూషణ, కొమ్మసాని బాలచంద్ర, ల్యాబ్ సత్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన ఉరగాద్రి చౌడేశ్వరిదేవి

### దర్శించుకున్న పయ్యావుల కేశవ్

కార్యక్రమానికి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవాంగ కల్యాణ మండపాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వచ్చి పూజలు చేయించారు. సర్పంచి నర్రా సుజాత, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి శంకరప్ప, తెదేపా మండల కన్వీనరు విజయ భాస్కర్, పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు ఉట్టి రాము, దండా ప్రసాదు, రమణయాదవ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



## చంద్రప్రభ వాహనంపై చెన్నకేశవుడు

**ఒంగోలు , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా కేశవస్వామిపేట చెన్నకేశవ ఆలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చంద్ర ప్రభవాహన సేవ ఘనంగా జరిగింది. భక్తవరదుడైన దేవదేవుడు దివ్యాలంకారభూషితుడై ఆశ్రితులకు ఆనంద వీక్షణం చేశాడు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనంతో స్తుతించారు. ఆలయ కమిటి అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, కార్య నిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కార్యవర్గసభ్యులు గుర్రం బదరీనారాయణ, అగస్త్యరాజు శివయ్య,అలికేపల్లి వెంకటరెడ్డి ఎ.శ్రీనివాసరెడ్డి, నల్లమల్లి ధనలక్ష్మి, మర్రిపూడి రవి, కరేటి శ్రీనివాసులు, గంటినపల్లి అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ములుకుట్ల సుబ్రహ్మణ్య శర్మ, మాజేటి వెంకట సుబ్బయ్యశాస్త్రి ధార్మిక ప్రసంగాలు అందించగా, గాయనీగాయకులు ఈలపాట అర్లయ్య, ఎస్.కె.బాబు, లక్ష్మీతులసి తమ గళమాధుర్యంతో ఆకట్టుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు పరాంకుశం రామకృష్ణాచార్యులు, రమానాధాచార్యులు, మురికి పూడి త్రినాధ చక్రవర్తి , సిబ్బంది పెద్దినేని అప్పారావు, ఎం.సుబ్బారావు, బి.శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్ నిర్వహణా బాధ్యత వహించారు.

ఆంధ్రావని

## సింహ వాహనంపై శ్రీహరి రాజసం

**శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** వరదుని వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వరదరాజస్వామి సింహ వాహనాన్ని అధిరోహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేసి పట్టణ వీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అలాగే ఉదయం చప్పరంపై ఉభయ దేవేరీ సమేతుడైన వరదరాజస్వామి భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పలువురు హాజరయ్యారు.

## అట్టహాసంగా నవకలశ స్నపనం

**నిజామాబాద్, న్యూస్‌టుడే:** మాచారెడ్డి మండలం చుక్కాపూర్ అటవీ ప్రాంతంలోని లక్ష్మీనరసింహుడి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. ఉత్సవమూర్తులకు నవకలశ స్నపనం కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సేవాకాలం, ప్రాభోధకీ, శాంతిపాఠం, ద్వారతోరణ పూజలు, చతుస్థానార్చన, అగ్నిముఖం, మూలమంత్ర హవనాలు, పూర్ణాహుతి, బలిహరణ వంటి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు విష్ణుసహస్రనామ పారాయణం, ద్వారాతోరణ పూజలు, చతుస్థానార్చన, అగ్నిముఖం, మూలమంత్ర హవనములు, పూర్ణాహుతి, బలిహరణ, పల్లకీసేవ నిర్వహించారు.

## వైభవంగా సర్వదైవత్య హోమం

**ఆగిరిపల్లి, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** స్థానిక శ్రీ శోభనాద్రి లక్ష్మీనృసింహస్వామివార్ల వేద శాస్త్ర పాఠశాల ఆవరణలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ హయగ్రీవ సదర్శన నారసింహ యజ్ఞంలో భాగంగా రెండో రోజు సాయంత్రం సర్వదైవత్య హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచవింశత్ కుంభారాధన, శాంతి కుంభస్థాపన జరిపారు. ఉదయం గోపూజ, వాస్తుశుద్ధి, పంచగవ్యప్రాసన, అగ్నిమధనం, పంచాగ్నికుండేషు అగ్రిప్రతిష్ఠ, అకల్మషహోమం నిర్వహించారు. యజ్ఞనిర్వాహకులు రత్నాకరం రామకృష్ణ దీక్షితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో వేదపాఠశాల పునరుద్ధరణ సమితి కార్యదర్శి సూరి లక్ష్మీనృసింహ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామకృష్ణ దీక్షితులు

# అసాధ్య సాధకుడు హనుమ

ఆంజనేయస్వామిని అసాధ్య సాధకుడు అని కీర్తిస్తుంటారు అందరూ. ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేదు. అందుకే అసాధ్య సాధకస్వామీ.. నీకు సాధ్యం కానిది ఏముంది చెప్పు. అందుకే ఓ స్వామీ.. ఎంత కష్టమైనదైనా సరే నా పనిని సాధించిపెట్టు అని ఆంజనేయస్వామిని నిరంతరం స్తుతిస్తూ ఉంటే ఎంతటి అసాధ్యమైన పనైనా సరే సుసాధ్యమవుతుందని, ఆ పని నెరవేరుతుందని ఎందరెందరో ఆస్తికుల నమ్మకం. ఆ నమ్మకాన్ని బలపరుస్తూ వాల్మీకి రామాయణంలో కనిపించే సముద్ర లంఘనం, సతాన్వేషణ, శ్రీరాముడికి సీతమ్మ చెప్పిన సందేశాన్ని వినిపించటంలాంటి ఎన్నెన్నో సంఘటనలను హనుమ భక్తులంతా గుర్తుకు తెచ్చుకుంటూనే ఉంటారు.



## మృత్యు భయం దూరం

కేవలం వాల్మీకి రామాయణంలో కనిపించే అలాంటి కొన్ని సంఘటనలేకాక పరాశరసంహిత, సమీరకుమార విజయంలాంటి గ్రంథాల్లో అసాధ్యం అనుకున్న పనులను సాధించిపెట్టిన ఆంజనేయస్వామి లీలలు కనిపిస్తాయి. పుష్పగిరి తిమ్మనార్యుడు సమీరకుమార విజయం అనే పేరున పద్మపురాణం, బ్రహ్మాండ, స్కందపురాణాలు, పరాశర సంహిత ఇంకా హనుమంతుడికి సంబంధించిన విషయాలున్న అనేక గ్రంథాలను పరిశీలించి సమీరకుమార విజయం అనే పేరున ఆంజనేయస్వామి చరిత్ర నంతటినీ ఒక చోటకు చేర్చి పారాయణకు ఉపయోగపడే పద్యకావ్యంగా మలిచాడు. ఆ సమీరకుమార విజయంలోని హనుమంతుడి అసాధ్య సాధకత్వాన్ని నిరూపించే ఓ కథ ఇది. హనుమాన్ చాలీసాలో కూడా హనుమంతుడి నామాన్ని జపిస్తే చాలు భయాలు, రోగాలు అన్నీ నశిస్తాయని చెప్పటం కనిపిస్తుంది. అంతేకాదు హనుమను నమ్ముకుంటే మృత్యుభయం కూడా ఉండదని తెలియ చెబుతుంది ఈ కథ.

## మరో బృహత్కార్యం

హనుమంతుడి గుణగణాలను, ప్రతాపవిశేషాలను వసిష్ఠమహర్షి శతానందుడికి తెలియచెప్పిన విశేషకథ ఇది. రామరావణయుద్ధం ముగిశాక పుష్పక విమానంలో రాముడు సీతమ్మతోనూ, ఇతర వానరులందరితోనూ కలిసి అయోధ్యకు బయలుదేరాడు. విమానంలో అందరూ ఎక్కారా? లేదా? అని శ్రీరామచంద్రుడు ఓసారి విమానం అంతా కలయచూశాడు. గంధమాదనుడు అనే ఓ వానరుడు యుద్ధంలో ఎంతో గొప్పగా శత్రుసంహారం చేయటాన్ని శ్రీరామచంద్రుడు గమనించి గుర్తుపెట్టుకున్నాడు. ఆ గంధమాదనుడు విమానంలో లేకపోవటాన్ని గమనించాడు రాముడు. అదే విషయాన్ని పక్కనున్న విభీషణుడిని పిలిచి అడిగాడు. కుంభకర్ణుడితో జరిగిన యుద్ధంలో గంధమాదనుడు మరణించాడని విభీషణుడు చెప్పిన మాట విని రామచంద్రుడు తల్లడిల్లాడు. ఆ పక్కనే ఉన్న జాంబవంతుడు విషయాన్ని గమనించి ముందుకొచ్చి రామచంద్రుడికి నమస్కరించి గంధమాదనుడిని ఏ లోకంలో ఉన్నా తీసుకురావటం అసాధ్యమేదీ కాదన్నాడు. అయితే అలా చెయ్యగలిగిన అసాధ్యసాధక శక్తి మారుతి దగ్గర మాత్రమే ఉందని చెప్పడంతో ఆ పనికోసం వాయునందనుడిని వినియోగించమన్నాడు.

## ఎట్టకేలకు సాధించిన వాయునందనుడు

జాంబవంతుడి అంచనాలు ఎప్పుడూ తప్ప లేదు. శతయోజన పర్యంతమైన సముద్రాన్ని దాటాల్సి వచ్చినప్పుడు దానికి తగిన సమర్థుడు ఆంజనేయుడేనని గుర్తించింది జాంబవంతుడే.

ధర్మపథం

కనుక ఈ విషయంలో కూడా ఆ భల్లూకరాజు మాటను వాస్తవమేనని నిర్ధరించుకున్నాడు రాముడు. అప్పటికే ఆంజనేయుడు రామప్రభువు తనకు ఎప్పుడెప్పుడు ఆజ్ఞ ఇస్తాడా, ప్రభువు ఆజ్ఞను ఎలా వెంటనే పాటించాలా అని అనుకొంటూ ఉత్సాహంతో స్వామికి నమస్కరిస్తూ కనిపించాడు. శ్రీరామచంద్రుడు గంధమాదనుడిని వెతికి తెమ్మని ఆజ్ఞ ఇవ్వగానే కార్యసాధన కోసం ఆకాశానికి ఎగిరాడు. ఎగురుతూ హనుమ చేసిన అట్టహాసానికి దిక్కులన్నీ దద్దరిల్లాయి. మరణించిన వారెవరైనా తొలిగా చేరేది యమధర్మరాజు పట్టణమైన సమ్యమిని కనుక ఆ పట్టణం చేరి యముడి ద్వారం ముందు నిలిచి గట్టిగా అరిచాడు. తత్తరపడిన యముడు బయటికొచ్చి హనుమకు అర్ఘ్యపాద్యాలనిచ్చి సత్కరించాడు. ఆ తర్వాత ఆంజనేయుడు తన దగ్గరకొచ్చింది గంధమాదనుడి కోసం అని తెలుసుకొని యుద్ధంలో మరణించిన వ్యక్తి, ప్రభుభక్తి పరాయణుడు అయినవాడు, బ్రహ్మలోక అర్హత పొందుతాడు కనుక గంధమాదనుడు అక్కడ ఉన్నాడని చెప్పాడు యముడు. ఆ మాటలను విన్న హనుమంతుడు యముడికి నమస్కరించి బ్రహ్మలోకానికి బయలుదేరాడు. తన లోకానికొచ్చిన ఆంజనేయస్వామిని బ్రహ్మదేవుడు సాదరంగా ఆహ్వానించాడు. హనుమ కూడా బ్రహ్మకు ఎంతో వినయంగా నమస్కరించి తానొచ్చిన పని చెప్పాడు. అప్పుడు బ్రహ్మ హనుమతో.. గంధమాదనుడు తన లోకంలోనే ఉన్నాడని వివరించాడు. లోకకళ్యాణం కోసం రామరావణ యుద్ధంలో శరీరత్యాగం చేసిన కారణంగా అతడికి బ్రహ్మలోక ప్రాప్తి కలిగిందని, అయితే అతడిని తిరిగి నరలోకానికి పంపటం మామూలుగా అయితే సాధ్యపడదని అన్నాడు. కానీ రామాజ్ఞననుసరించి అసాధ్య సాధకుడైన హనుమంతుడే స్వయంగా వచ్చిన కారణంగా గంధమాదనుడిని తాను పంపుతున్నట్లు బ్రహ్మ చెప్పాడు. బ్రహ్మకు నమస్కారం చేసి గంధమాదనుడిని తీసుకొని వెళ్లి రామచంద్రుడికి చూపించాడు హనుమ. ఇలాంటి అసాధ్యమైన పనులను సుసాధ్యం చేసే దైవం కనుకనే ఈనాటికీ అసాధ్య సాధకస్వామి అయిన ఆంజనేయస్వామిని భక్తులంతా కీర్తిస్తుండటం కనిపిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## చేతడి ఆరటం

జాతీయాలు నుడికారాలు

చేతికి ఉన్న తడి ఆరటం అనేది దీనికున్న సామాన్య అర్థం. చేతికి పట్టిన చెమట, అంటిన నీరు ఆరేందుకు పట్టేంత సమయం అని అర్థం అంటే చాలా తక్కువ వ్యవధి అనే అర్థంలో ఇది జాతీయంగా ప్రయోగంలో ఉంది. చేతడి ఆరకముందే ఈ పని చేయాలి అని అనటం కనిపిస్తుంది.

## కన్నులపండువగా వెండి రథోత్సవం

**అన్నవరం, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** సుగంధ పరిమళాలు వెదజల్లే వనాల మధ్య నూతన వధూవరులైన సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్లు వనవిహారం కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. సత్యదేవుని కల్యాణోత్సవాల్లో భాగంగా వనవిహారం నిర్వహించారు. రాత్రి వెండిరథోత్సవం కన్నులపండువగా జరిగింది. వెండిరథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని అధికసంఖ్యలో భక్తులు ఈ వేడుకలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## శ్రీవారికి చందన అలంకారం

**గుంటూరు, న్యూస్‌టుడే:** మంగళగిరి పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీవారికి చందన అలంకారం నిర్వహించారు. ఏడాదికి ఒక రోజు లక్ష్మీనృసింహస్వామి జయంతిని పురస్కరించుకుని మూలవరులు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీవారి వార్షిక కల్యాణ వేదిక ఆవరణలో శాంతి హోమం, మహాయజ్ఞం నిర్వహించారు. కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులకు ఉదయం అభిషేక కార్యక్రమం జరిగింది. అర్చక స్వాములు శ్రీవారి ఉత్సవమూర్తులకు పాలు, పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో లక్ష్మీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు.

## నయనమనోహరంగా కల్యాణోత్సవం



బాలాత్రిపుసుందరికి పుష్పాలంకరణ

**మచిలీపట్నం , కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత నాగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నయన మనోహరంగా నిర్వహించారు. స్థానిక ఖొజ్జిల్లిపేట శ్రీ నాగేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆచార్య జొన్నవిత్తుల విద్యాసాగర్ గృహప్రాంగణంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని చేపట్టారు. జిల్లా అర్చక సమాఖ్య బాధ్యులు ఘంటసాల పద్మనాభశర్మ, ఆలయ ధర్మకర్త నూనె రాధాకృష్ణమూర్తి, లలిత దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర స్వామిని పలు పుష్పాలతో తేజోమయంగా తీర్చిదిద్దారు. మల్లెపూలు తదితర పుష్పాలతో అమ్మవారిని కడుసుందరంగా తీర్చిదిద్దగా దేవతామూర్తులు భక్తులకు కడుప్రసన్నతతో దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా రూపొందించిన కల్యాణ వేదికపై దేవతామూర్తులను మంత్రసహితంగా తోడ్కొని వచ్చారు. అర్ధరాత్రి వరకు సాగిన కల్యాణ మహోత్సవ వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



కల్యాణ వేదికకు తరలివచ్చిన కల్యాణమూర్తులు

## నరసింహునికి మోహినీ ఉత్సవం

**నెల్లూరు , న్యూస్‌టుడే :** నెల్లూరు గ్రామీణ మండలం దేవరపాళెం పంచాయతీ నరసింహకొండపై వెలసియున్న శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం స్వామివారికి మోహినీ ఉత్సవం జరిగింది. సాయంత్రం అఖండజ్యోతి, మూలవర్లకు పూలంగిసేవ ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు కాకాణి దశరథరామిరెడ్డి, పాటూరు హరిహరశర్మ, నూనె మల్లికార్జునయాదవ్ ఉభయకర్తలుగా వ్యవహరించగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు పూజా కార్యక్రమాను పర్యవేక్షించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



ఆంధ్రావని

## లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



**కర్నూలు , న్యూస్‌టుడే:** పాత నగరంలోని మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి, కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు పూజా కార్యక్రమాలను అర్చకులు గిరి ఆచార్, గురు ఆచార్‌లు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## మదినిండా భక్తిభావం

**చిత్తూరు, న్యూస్‌టుడే:** భక్తుల పాలిట కల్పవృక్షంగా చెప్పుకునే గంగమ్మ జాతరను భక్తులు వేడుకగా జరుపుకున్నారు. ఉదయాన్నే సాన్నమాచరించి నూతన దుస్తులు ధరించి కుటుంబ సమేతంగా భక్తిభావంతో అమ్మవారిని దర్శించుకున్నారు. నడివీధి గంగమ్మ సింహవాహనంపై విద్యుత్తుదీపాల వెలుగులో దేదీప్యమానంగా వెలిగారు. నూతన ఆభరణాల నడుమ అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మను దర్శించి, సారె సమర్పించాలని అధికసంఖ్యలో భక్తులు ఎగబడ్డారు. నగరంలోని నడివీధి గంగమ్మతో పాటు పలు ప్రాంతాల్లో జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతర వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు దంపతులు వేకువజామున 4.30 గంటలకు తొలిపూజ చేసి నడివీధి గంగమ్మ విగ్రహం తెర తొలగించి భక్తులకు దర్శనం అవకాశం కల్పించారు. అమ్మవారికి హారతి ఇచ్చి ప్రార్థనలు చేశారు.



## ఇరుదేవేరులతో విహరించిన స్వామి



**కడప , న్యూస్‌టుడే :** దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి తెప్పోత్సవాలలో భాగంగా స్వామి ఇరుదేవేరులతో పుష్కరిణిలో విహారం చేశారు. సుందరరూపుడైన శ్రీవారు విహారం చేస్తుండగా దర్శించిన భక్తులు తరించారు. ఆమందానంద రూపుడైన శ్రీవారిని కనులారా గాంచి భక్తజనం అంజలి ఘటిస్తూ గోవింద నామస్మరణలతో పులకాంకితులైనారు.

# అమ్మ మాట గురువు బాట

**ఆం**జనేయస్వామి సుగ్రీవుడికి మంత్రిగా ఎలా అయ్యాడు, వేదవేదాంగాది శాస్త్రాలు ఎప్పుడు నేర్చుకున్నాడు అనే విషయాలను వివరించే కథాసందర్భం ఇది. సమీర కుమార విజయం ఆధారంగా ఈ వివరాలు కనిపిస్తున్నాయి. హనుమ పసితనంలో బాలసూర్యుడిని చూసి పండనుకొని భ్రమించి మింగబోయాడు. అప్పుడు ఇంద్రుడు తన వజ్రాయుధంతో ఆంజనేయుడిని కొట్టడంతో ఆయన హనువు (దవడ)కు దెబ్బతగిలింది. దాంతో ఆంజనేయస్వామి తండ్రి అయిన వాయుదేవుడికి కోపం వచ్చి ముల్లోకాలకు గాలి అందకుండా చేశాడు. దాంతో బ్రహ్మాది దేవతలంతా దిగొచ్చి వాయువును ప్రార్థించి హనుమకు అనేకానేక వరాలను ఇచ్చి వెళ్లారు. ఆ తర్వాత ఆంజనేయస్వామి బాల్యం వనంలో సంచరించే మిగతా వనసమూహాలతో కులాసాగా గడిచింది. ఆటపాటలతో అలా పైకెదిగాడు. అంజనాదేవి తన బిడ్డ పెరిగి పెద్దవాడవుతున్నాడని, ఓ పద్ధతి ప్రకారం జీవితం గడ



వాల్సి ఉందని గమనించింది. ఓ రోజున ఆంజనేయుడిని పిలిచి వాలి, సుగ్రీవులిద్దరూ తన సోదరులవుతారని, ప్రస్తుతం ఆ ఇద్దరూ కిష్కింధను ఏలుతున్నారు కనుక మేనమామల దగ్గరకు వెళ్లి మంత్రిగా ఉండాలని చెప్పింది. ఆ ఇద్దరిలో వాలి కన్నా సుగ్రీవుడు సౌమ్యుడు కనుక సుగ్రీవుడితోనే స్నేహంగా ఉండమని చెప్పింది. అలాగే ఇద్దరు సోదరుల నడుమ మనస్పర్థలు కలిగినప్పుడు జోక్యం చేసుకోవద్దని, ఒకవేళ ధర్మవిరుద్ధంగా వాలి ప్రవర్తించినా తొందరపడి దండించవద్దని చెప్పి పంపింది అంజనాదేవి.

### సుగ్రీవుడి మంత్రిగా..

తల్లి మాట విని వాలి, సుగ్రీవుల దగ్గరకు వెళ్లాడు ఆంజనేయుడు. మేనమామలిద్దరూ బాగా ఆదరించారు. అప్పుడే ఆంజనేస్వామికి తాను చదువుకోవాలని వేదవేదాంగాలు, శాస్త్రాలు నేర్చుకోవాలనే సంకల్పం కలిగింది. గతంలో ఇంద్రుడి వజ్రాయుధంతో తనను కొట్టినప్పుడు, తన తండ్రి వాయువు స్తంభించినప్పుడు దేవతలందరూ వాయువును మంచి చేసుకొనేందుకు, వాయుదేవుడికి సంతోషం కలిగించేందుకు హనుమకు కొన్ని వరాలిచ్చారు. అప్పుడే సూర్యుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు వేదవేదాంగాది శాస్త్రాలను ఆంజనేయస్వామికి తాను నేర్పుతానని అన్నాడు. ఆ మాటలు గుర్తుకొచ్చాయి హనుమకు. మేనమామలకు చదువుకోవాలన్న తన సంకల్పాన్ని చెప్పి సూర్యుడి దగ్గరకు వెళ్లాడు ఆంజనేయుడు. ఆంజనేయస్వామిని గుర్తించిన సూర్యుడు నవ్వుతూ ఆహ్వానించి ఏంకావాలో చెప్పమన్నాడు. అప్పుడు ఆంజనేయుడు తనను సకల విద్యలలోనూ పరిపూర్ణుడిగా చేయమని కోరాడు. అప్పుడు సూర్యుడు తాను ప్రపంచమంతా వేగంగా తిరుగుతుంటానని, తన దగ్గర విద్య నేర్చుకోవటం కొద్దిగా కష్టమని చెప్పాడు. అప్పుడు ఆంజనేయస్వామి గురువుకు మరోమారు నమస్కరించి తన శరీరాన్ని పెంచి ఉదయాద్రి మీద ఒక కాలు, అస్తాద్రి మీద మరో కాలు ఉంచి సూర్యుడి గమనంతో పాటుగా తాను సాగుతూ విద్యను నేర్చుకోమన్నా నేర్చుకుంటానని, లేదంటే సూర్యరథానికి ముందువెళుతూ సూర్యుడు చెప్పే పాఠాలన్నీ బుద్ధిగా నేర్చుకుంటానని అన్నాడు. అప్పుడు సూర్యుడు ఆంజనేయస్వామి వినయానికి సంతోషించి నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, ఆరు దర్శనాలు, సకల స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్య, నాటక, అలంకారాలు, అరవై నాలుగు కళలు నేర్పించాడు. ఆంజనేయుడు కూడా వినయ భక్తి శ్రద్ధలతో విద్యాభ్యాసం చేసి గురువుకు మరీమరీ నమస్కరించి ఆయన ఆజ్ఞ తీసుకొని తిరిగి మేనమామల దగ్గరకు చేరాడు. ఆ తర్వాత తల్లి మాట ప్రకారం సుగ్రీవుడి దగ్గరే స్నేహంగా ఉంటూ ఆయనకు మంత్రి అయ్యాడు. ఇలా ఆంజనేయస్వామి బాల్యానికి, విద్యాభ్యాసానికి సంబంధించిన విశేషాలు ఇక్కడ కనిపిస్తున్నాయి.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

ధర్మపథం

## సందు

**ఈ** పదానికి సాధారణ వ్యవహారంలో ఇరుకుగా ఉండే వీధి అనే అర్థముంది. విశాలంగా ఉండే వీధులు, రాజమార్గాలు వేరేగా ఉంటాయి. కొన్నికొన్ని చోట్ల ఇళ్ల మధ్య అటూ ఇటూ తిరగటం కోసం సన్నగా ఉండే జాగాలను వదులుతారు. వాటినే సందులు అని అంటారు. అయితే సందు అనే పదం జాతీయంగా మారేసరికి దాని అర్థం మారిపోయింది. 'కొద్దిగా సందు దొరికితే చాలు మాటల్లోకి దిగుతారు' అనే లాంటి సందర్భాలలో వ్యవధి, అవకాశం అనే అర్థాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

ఆంధ్రావని

# రమణీయం.. రథోత్సవం



భూనీలా, రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి

**ఒంగోలు, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఒంగోలు కేశవస్వామిపేటలోని చెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా జరిగింది. భూనీలా, రాజ్యలక్ష్మి అమ్మవార్ల సమేతంగా స్వామివారు రథాధిరోహణం చేసి భక్తులకు కనువిందు చేశాడు. లోక్‌సభ తెదేపా అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి స్వామివారిని దర్శించి ఆశీస్సులందుకున్నారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉత్సవ వేదికపై లలితాకళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నమాచార్య 606వ జయంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సామూహికంగా అన్నమయ్య గీతాలాపనలు చేశారు. వివిధ సాహిత్య, కళాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మావుళ్లమ్మ సన్నిధిలో చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

## మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** మావుళ్లమ్మ ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక చండీ హోమం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో దంపతులు సాంబమూర్తి, ఫణి, మల్లికార్జునశర్మ, శ్రీనివాసశర్మ, సోమయాజులు హోమం పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు ఛైర్మన్ రామారావు, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవం.. ఆదిదేవుని కల్యాణం

**నిజామాబాద్, న్యూస్‌టుడే:** మాచారెడ్డి మండలం చుక్కాపూర్ అటవీ ప్రాంతంలోని లక్ష్మీనరసింహుడి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం కడు క(ర)మనీయంగా జరిగింది. భక్తుల గోవిందా.. గోవిందా.. నామస్మరణల నడుమ వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆది దేవుని కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయమే ఆలయంలో సేవాకాలం, ప్రాభోధకీ, శాంతిపాఠం, ద్వారాతోరణ పూజలు, చతుస్థానార్చన, అగ్నిముఖం, మూలమంత్ర హవనములు, పూర్ణాహుతి, బలిహరణ నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. కళ్యాణ శోభతో విరాజిల్లుతున్న ఉత్సవ మూర్తులకు వేదపండితులు ముత్యాల తలంబ్రాలను పోసారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథముపై నిలిపి భక్తిభజనల నడుమ రథోత్సవం నిర్వహించారు. తదనంతరం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవానికి హాజరైన అశేష భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.



ముత్యాల తలంబ్రాలను చూపిస్తున్న వేదపండితులు

## ఘనంగా స్వాతి జయంత్యుత్సవాలు

**కర్నూలు,న్యూస్‌టుడే:** అహోబిల క్షేత్రంలో నృసింహ జయంతి ఉత్సవాలు పదిరోజుల పాటు కొనసాగి బుధవారం వేకువజామున ముగిశాయి. స్వామివారి జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి నరసింహ మూల మంత్రహోమం, 188 కలశాలకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నరసింహ స్వామి అవతారాన్ని ప్రతిబింభిస్తూ అవతారోత్సవం నిర్వహించారు. వేకువ జాము వరకు స్వామివారు విశేషపుష్ప పల్లకీలో ఊరేగారు. లక్ష్మీనరసింహ స్వామి 200 స్వాతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో నిత్యపూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.



విశేష అలంకారంలో ఉత్సవమూర్తులు

## ఎదుర్కోళ్ల ఉత్సవం

**నల్గొండ, న్యూస్‌టుడే:** మట్టపల్లిలక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక ప్రారంభమైన చెంచులక్ష్మీ, రాజ్యలక్ష్మీ సమేత నృసింహుని ఎదుర్కోళ్ల ఉత్సవాన్ని తనివి తీరా దర్శించుకుని పులకించారు. వేద మంత్రోచ్ఛారణలు, పారవశ్యంతో భక్తులు పలికే గోవింద నామస్మరణలతో కల్యాణోత్సవ ప్రాగంణం మార్మోగింది. నృసింహదీక్ష ధారుల భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. 12 గంటలకు సింహవాహనంపై నృసింహుడు, గజవాహనంపై రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లు మంటపానికి బయలు దేరేవేళ..మహిళలు నృసింహ నామ సంకీర్తనలను ఆలపిస్తూ తరించారు. యాజ్ఞీకస్వామి బి.వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ప్రముఖులు ఆగమ పండితులు కల్యాణోత్సవ ప్రక్రియను 2 గంటలకు ప్రారంభించారు.

# వైభవంగా వైశాఖ పౌర్ణమి

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** ఊపిరాడని ఉక్కపోత, భగభగమండే ఎండను సైతం లెక్కచేయకుండా వేలాదిమంది భక్తులు సంకీర్తనలతో అప్పన్నస్వామిని ఆరాధించి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తకోటితో సింహగిరి పులకించిపోయింది. వైదిక సంప్రదాయం ప్రకారం బుధవారం వైశాఖ పౌర్ణమి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు, గరిడీ బృందాలు సింహగిరికి చేరుకుని రాజగోపురం ఎదుట హరినామ సంకీర్తనలతో అప్పన్నను ఆరాధిస్తూ పండ్లు, ఫలాలు నైవేధ్యంగా సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.



చందనం పూతతో స్వామి ఉత్సవమూర్తులు

# సంగీత మర్మజ్ఞుడు మారుతి

**రా**మదూత మారుతి అమిత బలపరాక్రమ సంపన్నుడు. వేదవేదాంగ పారంగతుడు మాత్రమే కాదు గొప్ప సంగీత మర్మజ్ఞుడు కూడా. గాత్ర సంగీతంతోపాటు వీణ తదితర వాద్యసంగీతంలో కూడా ఆ స్వామిని మించినవారు మరొకరు లేరు. ఈ విషయాన్ని రుజువుచేస్తూ పుష్పగిరి తిమ్మన రచించిన సమీరకుమార విజయంలో ఉన్న ఓ కథ కనిపిస్తుంది.

### హనుమకు బాధ్యత

శ్రీరామచంద్రుడు అయోధ్యలో నిండు కొలువుతీరి ఉన్న రోజుల్లో సమయ సందర్భాలను అనుసరించి హనుమంతుడు గానం చేస్తూ ఉండేవాడు. ఆ గానాన్ని విని సభాసదులతోపాటు సీతారాములు కూడా మైమరచి పోతుండేవారు. ఇలా కాలం గడుస్తున్న రోజుల్లో గాన కళలో సుప్రసిద్ధులైన నారదుడు, తుంబురుడు ఇద్దరూ శ్రీరామచంద్రుడి కొలువుకు వచ్చారు. గానకళలో తామిద్దరిలో ఎవరు గొప్పవారో పరీక్షించి తేల్చమని శ్రీరామచంద్రుడిని వేడుకున్నారు. రాముడు హనుమకు ఆ బాధ్యతను అప్పగించాడు. హనుమ ఎంతో వినయంగా నారద తుంబురులంటే గానకళలో ఎంతో గొప్పవారిని, వారిలో ఎవరు గొప్పో తేల్చటం తన వల్ల అవుతుందా అని అంటూనే ఆ ఇద్దరికీ ఓ పరీక్ష పెడుతున్నట్లు చెప్పాడు. నారద తుంబురులిద్దరూ వారికి బాగా వచ్చిన ఏదో ఒక రాగాన్ని ఎంచుకొని గానం చేయాలని అన్నాడు. హనుమ మాటలు వినగానే నారదుడు, తుంబురుడు తాము ఆలపించబోతున్న రాగానికి అనుగుణంగా వీణలను శ్రుతి చేసుకున్నారు. ఇద్దరూ సంగీత శాస్త్రంలో తమకున్న పాండిత్యాన్నంతా ప్రదర్శిస్తూ ఎంతో చక్కగా గానం చేశారు. ఆ గానాన్ని విని ఆంజనేయస్వామి ఇద్దరినీ మెచ్చుకున్నాడు. ఆ మెచ్చుకోవటం కూడా సంగీత శాస్త్రాన్ని అనుసరించి ఎవరు ఎంత గొప్పగా గానాలాపన చేశారన్న విషయాన్ని విమర్శనాత్మకంగా, ప్రశంసాత్మకంగా తెలియచెప్పాడు. దాంతో నారదుడు, తుంబురుడు ఇద్దరూ



ఆనందించారు. కానీ మనసులో మాత్రం తామిద్దరిలో ఎవరు గొప్ప అనే విషయాన్ని తేల్చి చెప్పలేదేమిటి అని అనుకున్నంతలోనే మారుతాత్మజుడు చిరుమందహాసం చేస్తూ చిద్విలాసంగా ఇప్పుడు నా గానాన్ని వినండి అని అన్నాడు. హనుమ మాటలు వినగానే నారద తుంబురులిద్దరిలో అహంకారం పెచ్చుమీరింది. అప్పటిదాకా తాను గొప్పంటే తాను గొప్పని గర్వంతోపాటు అహంకారం కూడా కలగడంతో ఈ వానరుడు పాడితే మేం వినాలా అనే ఓ చులకన భావం కూడా వారిలో కలిగింది. అయితే ఆ భావం బయటికి కనిపించకుండా వినయంగా తమ వీణలను ఆంజనేయస్వామికి అందించారు. నారదుడి వీణను తీసుకున్న హనుమంతుడు ఆ వీణను చక్కగా శ్రుతి చేశాడు. ఆంజనేయస్వామి గతంలో సూర్యుడి దగ్గర వేద వేదాంగాలు, శాస్త్రాలన్నిటితోపాటు సంగీత, నాట్యాలను కూడా నేర్చుకున్నాడు. రాముడి కొలువులో గాంధర్వవిద్యను మనోధర్మానుసరంగా ఆయన ఆలపించటం మామూలే. ఆ రోజున కూడా హనుమ మేఘరంజని రాగాన్ని ఎంచుకొని వీణావాదనం చేశాడు. శాస్త్రబద్ధంగా, మహాద్భుతంగా వీణకచేరీ జరుగుతోంది. అక్కడ ఉన్న వారంతా మైమరిచి పోయారు. అది మేఘరంజని రాగం కావడంతో ఆకాశం మేఘావృతమైంది. కొంగలు బారులు తీరాయి. వర్షం వచ్చే సూచనలు కనిపించటంతో చాతకపక్షులు నోరు తెరచి వానచినుకుల కోసం ఆకాశం వైపు చూడసాగాయి. నెమళ్లు పురివిప్పి నాట్యం చేయటం, పులజల్లులా వానజల్లులు పడటం జరిగింది. దాంతోపాటు మరో అద్భుతాన్ని కూడా అక్కడి వారంతా చూశారు. రాముడు కొలువుతీరి ఉన్న ప్రదేశంలో అప్పటిదాకా ఉన్న ఓ బండరాయి కరిగిపోయింది. అప్పుడు హనుమంతుడు గుండక్రియ అనే మరో రాగాన్ని ఎంచుకొని వీణపై పలికించారు. దాంతో మేఘరంజని రాగానికి కరిగిన రాయి మళ్లీ యథాస్థితికొచ్చింది. అప్పుడు ఆంజనేయస్వామి నారదతుంబురులిద్దరినీ చూస్తూ వారిద్దరికీ ఏ రాగం వస్తే ఆ రాగంతో ఆ రాయిని మళ్లీ కరిగించమని అలా సంగీతంలో రాయిని కరిగించిన వారే గొప్ప వారుగా నిలుస్తారని అన్నాడు. నారదతుంబురులిద్దరూ తమ సంగీత పాండిత్యంతో ఎన్నెన్నో రకాలుగా ప్రయత్నం చేశారు కానీ ఆ రాయిని కరిగించటం ఇద్దరిలో ఏ ఒక్కరి వల్లా కాలేదు. దాంతో ఆ ఇద్దరూ తమ గర్వాహంకారాలను విడిచిపెట్టారు. అలా హనుమంతుడు తన గానకళా ప్రతిభను చూపి నారదతుంబురుల మాత్సర్యాన్ని పోగొట్టాడు. ఈ కథాసందర్భంలో హనుమ సంగీత శాస్త్రంలో కూడా గొప్పవాడు అనే విషయం రుజువవుతుంది. అందుకే చాలామంది సంగీత రంగంలోని వారు ఆంజనేయస్వామిని కూడా ఆరాధిస్తూ ఆ స్వామి కరుణను పొందుతుంటారనే విషయం అవగతమౌతుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# కమనీయం.. కల్యాణం

## కిటకిటలాడిన నరసింహస్వామి ఆలయం





**కల్యాణ పీటలపై కొలువుదీరిన ఉత్సవమూర్తులు, నరసింహస్వామి, ఆదిలక్ష్మీ మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణ**

**గుంటూరు, న్యూస్‌టుడే :** నకరికల్లు కొండపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిలతో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణవేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆలయం తరపున మేనేజరు జి. పాండురంగారావు స్వామివార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి కొండపై భక్తుల రాకతో కిటకిటలాడింది. దీంతో కొండ వద్ద కోలాహలం నెలకొంది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. మరెపల్లి వెంకటరమణాచార్యులు, కొడవటిగంటి మధుసూదనాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలను నిర్వహించారు. దాతలు కొండ వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. నకరికల్లు ఎస్సై కట్టా ఆనంద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఆలయంలో పూర్ణాహుతి, హోమపూజలు జరిగాయి.

## వైభవంగా వసంతోత్సవం

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురం సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం రెండోరోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. చూర్ణోత్సవం, చక్ర తీర్థం తదితర కార్యక్రమాలను పాంచరాత్ర ఆగమ పండితులు గోవర్ధన గోపాలాచార్యులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నరసన్నపాలెం గ్రామానికి చెందిన హరినామ సంకీర్తన సమాజం వారు ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



**మాంగల్యాన్ని చూపుతున్న ఆలయ ప్రధాన అర్చకులు**

## వేడుకగా.. వరదుని కల్యాణం

**శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వరదరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని రమణీయంగా చేపట్టారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరణలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవ తంతును నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు మాంగల్యధారణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హేమమాలిని, తనిఖీ అధికారులు నాగభూషణం, వెంకటస్వామి, నాగభూషణం నాయక్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవమూర్తులు గజవాహనంపై భక్తులకు దివ్యదర్శనాన్ని కల్పించారు.

## హంసవాహనంపై నృసింహుడు

**నల్గొండ, న్యూస్‌టుడే:** మట్టపల్లి లక్ష్మీ నృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కల్యాణమూర్తులను హంస వాహనంపై కృష్ణానదిలో విహరింప జేశారు. శోభాయమానంగా అలంకరించిన నావపై రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నృసింహుని అధిష్ఠంజేసి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం యాజ్ఞీకస్వామి వాసుదేవాచార్యులు నేతృత్వంలో ఆగమ పండితులు చతుర్వేద పారాయణం చేశారు. తదుపరి సప్తర్షి పూజలు, సదస్య, ఫలప్రద అర్చనలు జరిపారు. ఉదయం రాజ్యలక్ష్మి అమ్మ



వారికి సహస్ర కుంకుమార్చనలు, మధ్యాహ్నం శ్రీసూక్త సహిత మహాలక్ష్మి యాగం నిర్వహించారు. రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మిలు స్తంభోద్భవుని చెంత చేరిన వేళ..భక్తులు తన్మయత్వంతో ఆనంద పరవశులయ్యారు.

## బందరు లడ్డు

**కొ**న్ని కొన్ని ప్రాంతాలు, అక్కడి విశేషాల ఆధారంగా కూడా జాతీయాలు ఏర్పడుతుంటాయి. అలాంటి వాటిలో ఇదొకటి. బందరు లడ్డు, కాకినాడ కాజా, చిలకలపూడి బంగారం, బంగినపల్లి మామిడిపండు, గుంటూరు గోంగూర, బాపట్ల వంకాయ ఇలాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఆ పదార్థాలు, వస్తువులు ఆయా ప్రాంతాలలో దొరుకుతూ ఆ ప్రాంతాలకు పేరు తేవటంతోపాటు జాతీయాలుగా మారే విశేషార్థంలో ప్రయోగంలో కనిపిస్తుంటాయి. బాగా తియ్యగా, రుచిగా, చూడముచ్చటగా ఉండే లడ్డూ బందరులో తయారౌతుందన్న అర్థం వాస్తవానికి ఉంది. కానీ చూడముచ్చటగా, ముద్దుగా, బొద్దుగా ఉన్న వారిని గురించి చెప్పేటప్పుడు బందరు లడ్డులాగుంది అని అనటం కనిపిస్తుంది.

## నారసింహుని తెప్పోత్సవం

**జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** వేదాద్రి భూనీల సమేత యోగానంద నారసింహుని కల్యాణోత్సవాల్లో భాగంగా చేపట్టిన గరుడోత్సవం, తెప్పోత్సవం, గజవాహన సేవ, చూర్ణోత్సవం వంటి కార్యక్రమాలు భక్తులకు కన్నుల పండగ చేశాయి. ప్రత్యేకంగా అలంకరించిన పడవలో స్వామివారి ఉత్సవవిగ్రహాలను ఉంచి పండువెన్నెలలో కృష్ణానదిలో విహరింపచేశారు. ప్రత్యేక పురోహితులుగా విచ్చేసిన పరాంకుశం వాసుదేవాచార్యులు, ఆలయఅర్చకులు వేదాంతం లక్ష్మినరసింహాచార్యులు, శ్రీధరాచార్యులు, యోగానందాచార్యులు వేదమంత్రాలతో స్వామివారికి ఈ విశేష వేడుకను నిర్వహించారు.



**వేదాద్రి కృష్ణా నదిలో సాగిన తెప్పోత్సవం**

# ఇహపరాలను సిద్ధింపజేసే అవతారం



పంచముఖ ఆంజనేయస్వామి అవతారం ఏ లక్ష్యంతో జరిగింది? ఆ స్వామి ఎవరి అంశాస్వరూపుడు? అనే విషయాలను గురించి వివరించి చెప్పే కథాసందర్భం ఇది. పుష్పగిరి తిమ్మన రచించిన సమీరకుమారవిజయంలో ఈ విషయం కనిపిస్తుంది. ఓ రోజున పార్వతీదేవి పరమేశ్వరుడిని ఆయన ధరించిన అవతారాల విశేషాలను తెలపమని కోరింది. అప్పుడా స్వామి ఇదంతా వివరించాడు. దూర్వాసుడు శివుడు అవతారమే. అయితే మితిమీరిన కోపస్వభావం ఉండటం చేత ఆ అవతారం శివావతారం అంత ఎక్కువ మహత్వాన్ని పొందలేదు. ఆ లోపాన్ని సరిద్దిటం కోసం రుద్రుడు స్వయంగా తన అంశతో పంచముఖ ఆంజనేయుడిగా అవతరించాడు. జ్ఞాన, వైరాగ్య, భక్తి, నయ, సాత్విక, సాహస, శాంతి, దాంతి, విద్య, నైపుణ్యం, సత్య, జవ, ధర్మ, దయ, గుణ, ధైర్య, నిశ్చలత, ధ్యాన, తపఃప్రభావాలన్నీ పంచముఖ ఆంజనేయ స్వామిగా రూపుకట్టి ఉంటాయి.

### సాక్షాత్తూ రుద్రుడే...

నిశ్చల బ్రహ్మచర్యం ఈ అవతారంలోని విశిష్టత. ఈ స్వామిని ఆరాధించిన వారికి ఇహపరాలు రెండూ సిద్ధిస్తాయి. సాక్షాత్తూ రుద్రుడే పంచముఖ ఆంజనేయుడు. పంచముఖ ఆంజనేయస్వామి రూపం వానర, నారసింహ, గరుడ, వరాహ, హయ ముఖాలతో ఉంటుంది. అనేకానేక సుందర దివ్యాభరణాలను ధరించి ఉంటుంది. రుద్రాంశ కనుక అయిదు ముఖాలకు ఒక్కొక్క ముఖానికి మూడేసి నేత్రాలు చొప్పున మొత్తం పదిహేను నేత్రాలుంటాయి. రూపం గొప్పకాంతితో ప్రకాశిస్తుంటుంది. పది చేతులుంటాయి. ఆ చేతుల్లో కత్తి, డాలు, పుస్తకం, అమృతకలశం, అంకుశం, పర్వతం, నాగలి, మంచపుకోడు, పాము, చెట్టు ఆయుధాలుగా అమరిఉంటాయి. అయిదు ముఖాలలోనూ వానర ముఖం భక్తుల కోర్కెలను తీర్చుతుంది. ఇది తూర్పు దిక్కును చూస్తుంటుంది. భయంకరమైన కోరలు కలిగి శుభకరమై ఉండి కనుబొమలముడితోటి చూపులు కలిగి మహాద్భుతంగా ఉంటుంది నారసింహ ముఖం. ఈ ముఖం దక్షిణ దిక్కును చూస్తుంటుంది. గొప్ప తేజస్సు కలిగిఉండి భయంకరంగా కనిపిస్తూ భక్తుల భయాన్ని నివారించే బలమైన వజ్రాయుధంలాంటి ముక్కు కలిగి ఉంటుంది గరుడ ముఖం. ఇది పశ్చిమ దిక్కు వైపు ఉంటుంది. ఇది విషభయాన్ని పోగొడుతుంది. ఉత్తర దిక్కుకు తిరిగి ఉంటుంది వరాహముఖం. సమస్తమైన రోగాలను, పోగొడుతూ, భయంకరమైన భూతాలను నివారిస్తూ నల్లని కాంతులతో అలరారుతుండటం వరాహముఖం ప్రత్యేకత. హయముఖం పైకి చూస్తూ ఉంటుంది. ఊర్ధ్వదిక్కుకు ఉండే ఈ గుర్రపుముఖం జ్వరాలను, రోగాలను పోగొడుతుంది. ఇలా పంచముఖ ఆంజనేయ స్వామి అయిదు ముఖాలు అయిదు దిక్కులకు చూస్తున్నట్లుంటూ భక్తుల కోర్కెలను తీరుస్తూ వారి కష్టాలను పోగొడుతూ సుఖ సంతోష సౌభాగ్య సంపదలను ప్రసాదిస్తుంటాయి.

### అభయాన్ని ప్రసాదించే స్వామి

పంచముఖ ఆంజనేయ స్వామి ధరించే ఆయుధాలు కూడా భక్తులకు అభయాన్ని ప్రసాదిస్తుంటాయి. ఈ ఆయుధాలను స్మరిస్తే చాలూ భక్తులకు శ్రేయస్సులు కలుగుతాయి. పంచముఖ ఆంజనేయస్వామి దివ్యాభరణాలను ధరించి ఉంటాడు. ఎర్రచందనాన్ని శరీరానికి అద్దుకొని ఎర్రని పట్టువస్త్రాలను ధరించి ఉంటాడు. ఎర్రని పుష్పాలను అలంకరించుకొని ఉంటాడు. అసలు ఆ స్వామి ఛాయ ఎర్రగా ఉంటుంది. ఇలాంటి స్వామి రూపాన్ని ఏ వేళలో ఎప్పుడు మనసులో స్మరించినా భక్తులకు కోరిన కోర్కెలు తీరుతాయి. పంచముఖ ఆంజనేయస్వామికి సంబంధించిన మంత్రాలు ఉన్నాయి. అలాంటి మంత్రాలలో ఒక్కొక్క కోరిక తీరటం కోసం ఒక్కొక్క మంత్రాన్ని స్మరిస్తుంటారు భక్తులు. తారకాసుర సంహార వేళ కుమారస్వామికి బ్రహ్మదేవుడు పంచముఖ ఆంజనేయస్వామి మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని జపించి బాణాన్ని సంధించిన తర్వాత కుమారస్వామికి విజయం చేకూరింది. పంచముఖ ఆంజనేయస్వామి మంత్ర ప్రభావం అంతటిది. వేదరాశిలాగానే హనుమంతుడు కూడా అనంతుడు. అక్షరాలన్నీ ఆయన స్వరూపాలే. అందుకే మంత్రాన్ని జపిస్తూ హనుమంతుడిని ఆరాధించిన వారికి కోరిక కోర్కెలు తీరుతుంటాయి అని తాను ధరించిన పంచముఖ ఆంజనేయ రూప విశేషాన్ని రుద్రుడు స్వయంగా పార్వతీదేవికి ఇలా వివరించి చెప్పాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## చంపటం..

మామూలుగా అయితే ఈ పదానికి ప్రాణాలు తియ్యటం అని అర్థం. చచ్చు అనే ధాతువు నుంచి చంపు అనే పదం ఏర్పడింది. ఈ చంపు లేదా చంపటం అనేది జాతీయంగా మారేసరికి విసిగించటం అనే అర్థం వ్యాప్తిలోకి వచ్చింది. ఖఆ పని చెయ్యమని నన్ను చంపొద్దు.. ఎందుకు చంపుకుతింటావ్'' ఇలాంటి ప్రయోగాలలో విసిగించటం అనే అర్థం ఈ పదానికి కనిపిస్తుంది.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

## బాసరలో భక్తుల రద్దీ

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** బాసర సరస్వతి ఆలయం శుక్రవారం భక్తజనంతో కళకళలాడింది. పదో తరగతి పరీక్ష ఫలితాలు గురువారం విడుదలైన నేపథ్యంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఆలయంలో 365 మంది చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి రూ.2,10,000 ఆదాయం సమకూరింది.

## ఘనంగా ఉరుసు మహోత్సవాలు





ఛాందినీ అలంకరణలో పాల్గొన్న విశ్వయోగి విశ్వంజీ, మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ

**గుంటూరు, న్యూస్‌టుడే:** స్థానిక జీటీ రోడ్డులోని శ్రీహజరత్ కాలేమస్తాన్‌షా అవులియా దర్గా 122వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ఛాందినీ అలంకరణ సమాధిపై గంధం అలంకరించే ఉత్సవం, నూతన చద్దర్ల అలంకరణ తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గుంటూరు విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఉడా ఛైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఆధ్యాత్మిక, రాజకీయరంగ, అధికార, అనధికార ప్రముఖులు పలువురు దర్గాలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. **భారీ ఊరేగింపు:** ఏటా ఆనవాయితీగా ఉరుసు మహోత్సవాలలో తొలిరోజు అర్ధరాత్రి సమయంలో జరిగే ఉరుసు గుర్రం మహోత్సవం, చందనోత్సవం ఈ సంవత్సరం కూడా భారీగా జరిగాయి. ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. మస్తానయ్యబాబా జీవించి ఉన్న రోజుల్లో ఉపయోగించిన కుర్చీ కన్నావారితోటలోని ఆయన భక్తుల ఇంట్లో ఉంది. ఆ కుర్చీని అటక మీద నుంచి కిందకు దింపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలు దాటాక దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు కుర్చీ దగ్గర పూజలు చేసి, చందనపు భాండం శిరస్సున ధరించి గుర్రం ఊరేగింపు అగ్రభాగాన నడుస్తూ ఊరేగింపు కొనసాగించారు. కన్నావారితోట నుంచి మస్తానయ్యదర్గా వెనుక వీధులో నుంచి పట్నంబజారు, చౌత్రా సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా సంగడిగుంటలో మస్తానయ్య వినియోగించిన మంచం, భోజన పానీయపాత్రలు ఉంచిన ఇంటిదాక ఊరేగింపుసాగి శనివారం సాయంత్రానికి దర్గాకు చేరుకుంటుంది. ఆ తర్వాత దీపారాధన, గంధం పంచడం తదితర కార్యక్రమాలుంటాయి.

## నరేంద్రమోడీ సత్యసాయి భక్తుడు

### పుట్టపర్తితో 30 ఏళ్ల అనుబంధం



సత్యసాయికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నరేంద్రమోడీ (పాతచిత్రం)

**అనంతపురం, న్యూస్‌టుడే:** భాజపా ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్రమోడీకి పుట్టపర్తితో 30 ఏళ్ల అనుబంధం ఉంది. సత్యసాయి భక్తుడిగా ఇక్కడికి వచ్చేవారు. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, సేవాతత్పరతను మోడీ గతంలో ప్రశాంతి నిలయం దర్శన సమయంలో ప్రశంసించారు. సత్యసాయి శివైక్యం అయినప్పుడు మోడీ పుట్టపర్తికి వచ్చారు. ఆర్ఎస్ఎస్, భాజపా నాయకుడిగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా పలుమార్లు సత్యసాయి ఆశీస్సులు అందుకున్నారు. నరేంద్రమోడీ ప్రధానమంత్రి కానుండటంతో సత్యసాయి భక్తులు హర్షం ప్రకటిస్తున్నారు. పుట్టపర్తిలోని గుజరాత్ భక్తులు సంబరాలు చేసుకున్నారు.

## వైభవంగా శతచండీ మహాయాగం

**కరీంనగర్, న్యూస్‌టుడే:** సుందరమైన అలంకరణలు.. మేళ తాళాలు.. మంగళ హారతులు.. వేద పండితుల మంత్రోచ్ఛారణలు.. రామేశ్వర, పర్వతవర్ధిని నామస్మరణల మధ్య వైభవంగా శతచండీ మహాయాగం ప్రారంభమైంది. స్థానిక కమాన్ చౌరస్తాలోని శ్రీరామేశ్వరాలయం 9వ వార్షికోత్సవ సదర్భంగా పురాణం మహేశ్వరశర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, గణపతి ఆరాధన, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, మంటప ఆరాదణ, ముఖ్య దేవత స్థాపన, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనతరం సప్తశతి పరాయణాలను ప్రారంభించారు. రాత్రి రాజోపచారాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు దివాకరుణి వేంకటేశ్వరశర్మ, పోకల లక్ష్మీనారాయణ, ఆలయ ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా హనుమంతోత్సవం

**అనంతపురం, న్యూస్‌టుడే :** శ్రీదేవి,భూదేవిలతో కలసి శ్రీవారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంత వాహనోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి వేకువజామునే సుప్రభాత సేవ, మహాభిషేకం, అలంకరణ, ఉత్సవ నిత్యహోమం లాంటి విశేష పూజలు జరిపారు. అనంతరం స్వామి వారికి పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు విశేష పూజలు జరిపారు. సాయాంకాలం శాంతిహోమం నిర్వహించి ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన హనుమంత వాహనంపై కొలువు దీర్చి ఆలయ వీధులలో ఊరేగించారు. ఉత్సవానికి ఉభయదాతలుగా గుర్రం రవీంద్రనాథ్, వ్యవహరించారు. ప్రధాన అర్చకులు ద్వారకనాథస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై స్వామి ఊరేగింపు

## 'రాజన్న' సెంటిమెంట్ మళ్లీ నిజమైంది

### వేములవాడ దేవస్థాన కమిటీ తాజా, మాజీ అధ్యక్షుల ఓటమి

**మేడిపల్లి, న్యూస్‌టుడే:** వేములవాడ దేవస్థాన కమిటి అధ్యక్షులుగా పనిచేసిన వారికి విజయం అంతగా వచ్చిరాదనే సెంటిమెంట్ ఈ ఎన్నికల్లోనూ నిజమైంది. వేములవాడ ఆలయ కమిటీ అధ్యక్షునిగా పనిచేసిన ఆది శ్రీనివాస్ భాజపా అభ్యర్థిగానూ, ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న బొమ్మ వెంకన్న కాంగ్రెస్ అభ్యర్థిగానూ బరిలో నిలిచారు. వీరిపై నిలిచిన తెరాస అభ్యర్థి గెలుపొందడంతో ఇద్దరూ ఓటమి చెందారు. గతంలో బుగ్గారం మాజీ శాసనసభ్యుడు శికారి విశ్వనాథం కూడా ఆలయ కమిటీ అధ్యక్షునిగా పని చేసి ఆ తర్వాతి ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తర్వాత కూడా రాజకీయంగా ఆయన ఎదుగుల లేకపోగా ఇటీవలే కాంగ్రెస్‌కు మారారు.

# అదొక అద్భుత సుందర మంత్రం

**మం**త్రమంటే మననం చేసిన వారిని రక్షించేది అని అర్థం. అయితే ఆ మంత్రం సుందరంగా ఉండటం ఏమిటి అని అనిపించవచ్చు. కానీ మనకున్న అన్ని మంత్రాల్లోకీ ఎంతో సుందరమైనది, మహిమాన్వితమైనది, చాలా గొప్పది, పెద్దది అయిన మంత్రం ఒకటుంది. అదే సుందరకాండ. సుందరకాండ వాల్మీకి రచించిన రామాయణంలోని కాండలలో ఒకటి. ఇది కేవలం ఓ కథాంశానికి సంబంధించిన భాగంగా మాత్రమేగా పరిగణనలోకి తీసుకో

## ధర్మపథం

లేదు మన పెద్దలు. ఎందుకంటే సుందరకాండ అక్షరాక్షరాన సౌందర్యాన్ని సంతరించుకొని ఉంది. సుందరకాండలో రాముడు సుందరుడు. సుందరకాండలో ఉన్న కథ ఎంతో సౌందర్యంతో కనిపిస్తుంది. అంతేకాదు సుందరకాండలో సీతమ్మ గొప్ప సౌందర్యంతో అలరారుతుంటుంది. సుందరకాండలో వాల్మీకి వర్ణించిన అశోకవనం సౌందర్యం మహాద్భుతం. అసలు వాల్మీకి కావ్యరచనే సుందరకాండ మొత్తం మీద ఎంతో సౌందర్యంతో కనిపిస్తుంది. అంతేకాదు సుందరకాండలో సుందరుడుగా హనుమంతుడు కనిపిస్తాడు. ఆ వరుసలోనే సుందర కాండ మొత్తం అక్షరాక్షరం సుందరమైన మంత్రంగా కనిపిస్తుంది. ఈ కాండలో సుందరం కానిది ఏదీ లేదు. అందుకే ఈ కాండకు సుందరకాండ అనే పేరు స్థిరపడింది.

### నీడనిచ్చే కల్పవృక్షంలాంటిది

సుందరకాండ మహామంత్రం కనుక దీని పారాయణం వల్ల ఎందరెందరో భక్తులు ఈ నాటికీ తమ కోర్కెలను సిద్ధింపచేసుకోవటం కనిపిస్తుంది. ఈ కాండలోని ఏ కొన్ని శ్లోకాలు చదివినా పుణ్యమేనంటారు పెద్దలు. అంతేకాదు ఇంకా ఎన్నెన్నో నమ్మకాలు దీని విషయంలో ప్రచారంలో ఉన్నాయి. మనసులో ఏదైనా తలచుకొని రామాయణం సుందరకాండను తెరచి చూసినప్పుడు కంటికి ఏది కనిపిస్తే ఆ కార్యం జరుగుతుందని లేదా ఆ తీరులో కార్యజయం సిద్ధస్తుందనే నమ్మకం ఆసేతుహిమాచలం ప్రచారంలో ఉంది. సుందరకాండను పారాయణం చేయదలచినవారు రామాయణంలో మొదట కనిపించే శ్రీరామ జననం, సీతారాముల వివాహ ఘట్టాలను చదివిన తరువాత శ్రీరామపట్టాభిషేక ఘట్టాన్ని పారాయణ చేయటం సంప్రదాయం. దీనివల్ల రామాయ



ణాన్ని పూర్తిగా పారాయణ చేసిన ఫలితం లభిస్తుంది. కొంతమంది రామభక్తులు, హనుమభక్తులు, నిత్యం ఇలా పారాయణం చేస్తూ ఉండటం ఈనాటికీ కనిపిస్తూనే ఉంటుంది. అసలు సుందరకాండ ఓ చల్లని నీడనిచ్చే కల్పవృక్షంలాంటిది. ఎందుకంటే దీని ప్రారంభమే మనశ్శాంతికర సంఘటనతో ఉంటుంది. సీతాదేవి లంకలో ఉందని సంపాతి వల్ల తెలుసుకొన్న తర్వాత రామభక్త హనుమ సాహసించి సముద్రాన్ని దాటే ప్రయత్నంలో సుందర దృశ్యాలతో సుందరకాండ ప్రారంభమవుతుంది. హనుమ ఎన్నో ఆటంకాలను అతిక్రమించి లంకలో ప్రవేశించి సీతాదేవిని దర్శిస్తాడు. అంతేకాదు అమెకు శ్రీరాముడిచ్చిన ముద్రికనిచ్చి ఎంతో ధైర్యం చెబుతాడు. ఆమె ఆనవాలుగా శ్రీరాముడికి ఆనందాన్ని కలిగించటం కోసం చూడామణిని తీసుకొంటాడు. ఇవన్నీ ఆనందకర విషయాలే. అంతేకాదు సీతారాముల పునఃసమాగమానికి సుందరమైన అంకురార్పణ ఈ కాండలోనే జరుగుతుంది.

### హనుమతోనే సుందరకాండ

లంకలోకి ప్రవేశించిన హనుమ లంక సౌందర్యానికి ఆనందపడతాడు. తెల్లని పెద్ద పెద్ద మేడలు, రహదారులు, తోరణాలు, అద్భుతమైన చిత్రాలతో స్వర్గంలా ఉన్న లంకను హనుమంతుడు చూశాడని వాల్మీకి వర్ణించి చెప్పాడు. అయితే హనుమ తన శక్తిని రావణుడికి తెలియచెప్పటానికే ఆ అశోకవనాన్ని ధ్వంసం చేశాడు. హనుమంతుడి సందేశం విన్నందువల్లనే సీతాదేవి ప్రాణాలను నిలుపుకోగలిగింది. అంతేకాదు హనుమంతుడి మూలంగానే రాముడికి ధైర్యం కలిగి రావణుడిపైకి దండెత్తాడు. అందుకే హనుమ లేకపోతే సుందరకాండే లేదంటారు. సుందరకాండకు ఆంజనేయస్వామి వల్లనే సౌందర్యం చేకూరింది. సుందరకాండ తాత్విక ధోరణికి నిదర్శనంగా కనిపిస్తుంది. ప్రత్యేకించి ఈ కాండను యోగశాస్త్రంతో పోల్చి చెబుతుంటారు. పది తలల రావణాసురుడు పరిపాలించే లంక చుట్టూ సముద్రం ఉంది. మారుతి ఆ సముద్రాన్ని తాకకుండా ఆకాశమార్గాన వెళ్లి సీతమ్మకు రాముడి విషయాన్ని తెలిపి ముద్రికనిచ్చి దుఃఖాన్ని పోగొట్టాడు. ఇదంతా గమనిస్తుంటే దీని వెనుక మామూలు రామాయణ కథే కాకుండా తత్వచింతన కూడా ఉన్నట్టు కనిపిస్తుంది. మానవశరీరం పది ఇంద్రియాలతో కూడిన మనస్సుతో ఉన్నట్టు కనిపిస్తుంది. ఈ శరీరంలో జీవుడు బంధితుడై ఉన్నాడు. జీవుడికి సంసార సముద్రాన్ని దాటించే భగవంతుడిని గురించి తెలియచేసి దుఃఖాన్ని పోగొట్టుకొనే మార్గాన్ని సద్గురువు కలిగిస్తాడు. ఇలాంటి తత్వ సూచనలు సుందరకాండలో చాలా ఉన్నాయని పెద్దలు విశ్లేషించి చెబుతున్నారు. ఈ కాండలో ముక్తిమార్గ ప్రతిపాదితాలైన ముక్తిస్వరూపజ్ఞానం, స్వస్వరూపజ్ఞానం, సాధనలు, ఫలం, అజ్ఞానం అనేవి కనిపిస్తాయి. ఇలా చూసుకుంటూపోతే సుందరకాండ కోరిన కోర్కెలను తీర్చే మహామంత్రంగా యోగ, తత్వశాస్త్రాలను అంతర్లీనంగా కలిగి ఉన్న ఉత్తమ గ్రంథంగా కనిపిస్తుందని రామాయణ విశ్లేషకులు వివరిస్తున్నారు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# స్వామివారి బ్రహ్మోత్సవం ప్రారంభం

**గుంటూరు, న్యూస్‌టుడే:** శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జయనామ సంవత్సర బ్రహ్మోత్సవం వైభవంగా ప్రారంభం అయింది. ఉదయం శ్రీ స్వామి వారిని పెండ్లికుమారుని చేశారు. రాత్రి అంకురారోపణ జరిగింది. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



పెండ్లికుమారుని అలంకరణలో స్వామివారు

# వడ్డన

**భో**జనం వడ్డించటమనేది దీనికున్న అర్థం. వండిన పదార్థాలను తినేందుకు వీలుగా పెట్టడం అనేది వడ్డన. అయితే ఈ పదం జాతీయంగా మారేసరికి తిట్టడం, కొట్టడం, భారం మోపటంలాంటి అర్థాలు వచ్చాయి. ఎచెప్పిన పని చెయ్యకపోతే ఆయన నాలుగు వడ్డి

జాతీయాలు నుడికారాలు

స్తాడు.' ఎమళ్లీ ఛార్జీలను వడ్డించారు' , ఎవీపు మీద నాలుగు వడ్డిస్తే తప్ప వీడు మాట వినేటట్టులేడు" అనే లాంటి ప్రయోగాలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రావని

# నేత్రపర్వంగా కల్యాణోత్సవం

**అనంతపురం, న్యూస్‌టుడే :** శ్రీవారికి ఇష్టుడైన గురుత్మంతుడిపై భక్తులకు అభయమిస్తూ దేవేరులతో కలసి దర్శనమిచ్చాడు. పెన్నహోబిలం లక్ష్మినరసింహస్వామి బ్రహోత్సావాల్లో భాగంగా గరుడవాహోనోత్సవం జరిగింది. అనంతరం భక్తుల భగవన్నామస్మరణలతో, వేదపండితుల మంత్రోచ్చారణలతో శ్రీవారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా మూలవిరాట్టుకు విశేష పూజలు జరిగాయి.





హనుమంత వాహనంపై కల్యాణ వెంకన్న వైభవం, గజవాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

# కరిరాజుపై కల్యాణ వెంకన్న

## వేడుకగా వసంతోత్సవం

**నారాయణవనం, న్యూస్‌టుడే:** నారాయణవనం శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం వసంతోత్సవం వేడుకగా జరిగింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కల్యాణ వేంకటేశ్వరుడు శ్రీదేవి, భూదేవిలతో కలసి శ్వేత వస్త్రధారిగా ముస్తాబుకాగా అర్చకులు ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాంగణంలో ఆస్థానం నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచారీ సమేత కల్యాణవెంకన్న తిరుచ్చిపై ఆసీనుడై సన్నిధి వీధుల్లో విహరించారు. పసుపు, గంధం, చందనం, పన్నీరు కలిపిన మిశ్రమాన్ని ఉత్సవమూర్తులపై చల్లిన అర్చకులు వసంతాన్ని భక్తులను అందిస్తూ వారిపై చల్లారు. బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకత సంతరించుకున్న వసంతోత్సవం ఆద్యంతం వేడుకగా జరిగింది.

### రామబంటుపై విహారం

శనివారం ఉదయం కల్యాణ వెంకన్న హనుమంత వాహనంపై తిరువీధులలో విహరించారు. తిరుపతి నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన బంగారు తాపడం ఉన్న ఆంజనేయుని వాహనంపై స్వామి ఆసీనులై భక్తుల కర్పూర నీరాజనాల నడుమ ఊరేగారు. అనంతరం ఆలయ మండపానికి చేరుకున్న శ్రీదేవి, భూదేవిలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.

### ఐరావతంపై విష్ణుమూర్తి విహారం

వసంతోత్సవం అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామి ఐరావతంపై ఆసీనులయ్యారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తబృందాల కోలాటాల నడుమ కల్యాణ వెంకన్న తిరుమాడ వీధులలో విహరించారు. అనంతరం నిజాలయానికి చేరి ఏకాంతసేవలో పవళించారు. ఏర్పాట్లను తితిదే ఉప కార్య నిర్వహణ అధికారి హరింద్రనాథ్, అధీక్షకులు పీతాంబరరాజు, ఆలయాధికారి బాలనరసింహరావు, జూనియర్ సహాయకులు వీరయ్య, ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాసా భట్టాచార్యులు, నరసింహరాఘవ భట్టాచార్యులు, జమేదారు వేంకటేశ్వర్లు, తితిదే సిబ్బంది పర్యవేక్షించారు.

# వైభవంగా శ్రీకృష్ణ తులాభారం

**పాలకొల్లు , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** పాలకొల్లులోని అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంచి ముత్యాలు, పగడాలు, పటికబెల్లంతో శ్రీకృష్ణ తులాభారాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని శ్రీకృష్ణ అలంకరణలో పురవీధుల్లో ఊరేగించారు. తెల్లవారుజామున నరసాపురం ఎంబేరుమన్నార్ స్వామివారి దేవస్థానం స్థానాచార్యులు హిడాంబి వెంకటాచార్య, సింహాచలందేవస్థానం పురోహితులు మోర్త సీతారామాచార్యస్వామి శిష్యబృందం బ్రహ్మోత్సవంలో పలుసేవలు నిర్వహించారు. సుప్రభాతసేవ, విశేష హోమాలు, అలంకార తిరుమంజనం, దివ్యప్రబంధసేవాకాలం, సుందరకాండ, సుదర్శన శతక పారాయణం జరిగింది.

# కన్నుల పండువగా వెంకన్న రథోత్సవం

**కరీంనగర్, న్యూస్‌టుడే:** మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో వేంకటేశ్వర స్వామి(కొండస్వామి) బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. జగ్గాసాగర్‌తో పాటు పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తుల గోవింద నామ స్మరణ మధ్య శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి రథంపై ఊరేగారు. విద్యుద్దీపాలతో అలంకరించిన రథంపైకి ఉత్సవ మూర్తులను చేర్చి దీక్షాస్వాములు, భక్తులు ఆలయ ప్రాంగణంలో రథాన్ని లాగారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

# హనుమ.. ఆయనొక భవిష్యద్బ్రహ్మ!

ఆంజనేయస్వామిని సంకీర్తించేటప్పుడు భవిష్యద్బ్రహ్మణేనమః అని అంటూ ఉండటం కనిపిస్తుంది. చిరంజీవి అయిన హనుమంతుడు భవిష్యద్బ్రహ్మ అని ఎప్పుడు ఎవరి చేత అనిపించుకున్నాడు? ఎప్పటి నుంచి ఆయన భవిష్యద్బ్రహ్మ అయ్యాడు? అనే విషయాలను గురించి వివరించి చెప్పే కథాసందర్భం ఇది. ఆంజనేయ స్వామి చరిత్రను ప్రత్యేకంగా వివరిస్తున్న శ్రీపరాశరసంహిత యాభైమూడో పటలంలో ఈ విషయాలు కనిపిస్తున్నాయి. శ్రీరామచంద్రుడు పట్టాభిషిక్తుడై హాయిగా రాజ్యమేలుతున్నాడు. రామాజ్ఞ

ధర్మపథం

మేరకు హనుమంతుడు ప్రకృతి సౌందర్యం అలరారే గంధమాదన పర్వతం మీద అరటితోటల్లో ఉంటున్నాడు. అలా కొంతకాలం గడిచింది. రామభక్తి పరాయణుడైన హనుమకు శ్రీరామచంద్రుడిని చూడనిదే మనసు తృప్తిగా ఉండేది కాదు. అందుకని ఓ రోజున సీతారాముల దర్శనం కోసం తన ఒంటె వాహనాన్ని ఎక్కి సాకేతపురానికి బయలుదేరాడు. సాకేతపురం వెలుపలే వాహనాన్ని దిగి రామదర్శనానికి వెళ్లాడు హనుమ. అక్కడ సీతారాముల దర్శనమైంది. రాముడికి ప్రదక్షిణం చేసి అనేక విధాల స్తోత్రం చేశాడు ఆంజనేయుడు. సీతారాములు హనుమంతుడిని ఆదరించి ఆశీర్వదించారు. ఆ తర్వాత రాముడు అంజనాసుతుడికి ఒక పని చెప్పాడు. తన వేలికి ఉండే అమూల్యమైన ఉంగరాన్ని బ్రహ్మ తనను ప్రార్థించి తన లోకానికి తీసుకువెళ్లాడని చెప్పాడు రాముడు. ఆ ఉంగరమంటే సీతమ్మకు ఎంతో ఇష్టమని కనుక బ్రహ్మలోకానికి వెళ్లి ఆ ఉంగరాన్ని తెచ్చిపెట్టమని కోరాడాయన.



### బ్రహ్మలోకానికి పయనం

రామాజ్ఞను శిరసావహించి వెంటనే రామనామాన్ని జపిస్తూ బ్రహ్మలోకానికి చేరుకున్నాడు ఆ రామదూత. హనుమంతుడు వచ్చిన విషయాన్ని సనకసనందనాదులు బ్రహ్మదేవుడికి చెప్పారు. బ్రహ్మ వెంటనే పూజాద్రవ్యాలను తీసుకొని హనుమంతుడికి అతిథి పూజ చేసేందుకు వచ్చాడు. పూజానంతరం బ్రహ్మ, హనుమ కుశల ప్రశ్నలయ్యాక హనుమంతుడు తానొచ్చిన విషయాన్ని గురించి చెప్పాడు. రామాజ్ఞమేరకు తాను రావటం జరిగింది కనుక వెంటనే రామచంద్రుడి ఉంగరాన్ని ఇవ్వమని హనుమ మరోమారు బ్రహ్మనడిగాడు. అయితే బ్రహ్మ ఆంజనేయుడు చెప్పిన మాటలను విని విచారాన్ని వ్యక్తం చేశాడు. ఆ ఉంగరాన్ని తాను రామచంద్రుడికి ప్రతినిధిగా భావించి రోజూ పూజలు చేస్తుంటానని అలాంటి ఉంగరాన్ని తాను ఇవ్వలేనని అన్నాడు. అంతేకాక శ్రీరాముడే స్వయంగా ఉంగరాన్ని తనకు ఇచ్చాడు కనుక అది తనదే అవుతుందని దాని తిరిగి ఇవ్వమనటం భావ్యంకాదని అన్నాడు. బ్రహ్మ చెప్పిన మాటలకు హనుమంతుడికి కోపం వచ్చింది. వెంటనే ఓ ప్రశాంత ప్రదేశానికి వెళ్లి రామనామాన్ని జపిస్తూ బ్రహ్మ ఉంగరాన్ని ఇవ్వకపోతే ఇంద్రుడితో సహా దేవలోకాలన్నింటినీ భగ్నపరుస్తానంటూ ధ్యానాన్ని తీవ్రతరం చేశాడు. దాంతో బ్రహ్మలోకం దద్దరిల్లసాగింది. ఆ సమయంలో హనుమ ఇరవై చేతులతో ఇరవై ఆయుధాలను ధరించి ఎర్రని కళ్లతో భయంకరమైన ముఖంతో వాడి అయిన కోరలతో అట్టహాసం చేశాడు. ఆ సింహనాదానికి బ్రహ్మలోకవాసులంతా కలత చెందారు. విషయాన్ని తెలుసుకున్న బ్రహ్మ ఆ పరిస్థితులలో ఏం చేయాలో తోచక సనత్కుమారుడిని సలహా అడిగాడు. సనత్కుమారుడు హనుమంతుడు అడిగిన రామముద్రికను తిరిగి ఇవ్వటమే తగిన పరిష్కారమన్నాడు. అదే మాటను బ్రహ్మసభలోని వారంతా కూడా బ్రహ్మకు చెప్పటంతో ఆయన హనుమంతుడిని అనేక విధాల స్తుతించి శాంతించమన్నాడు. హనుమంతుడడిగిన రామముద్రిక పక్కనే ఉన్న అమృత సరస్సులో ఉందని వెళ్లి తీసుకోవచ్చన్నాడు. హనుమంతుడు ఆనందంతో అమృతసరస్సులోకి దిగాడు. అయితే ఆ అమృతసరస్సులో ఒక ఉంగరం కాకుండా అనేకానేక రామముద్రిలు కనిపించాయి. వాటిని చూడగానే హనుమంతుడికి భక్తితో కూడిన బ్రహ్మానందం కలిగింది. ఆ ఉంగరాలన్నింటికీ ప్రదక్షిణలు చేసి నమస్కరించాడు. అయితే వాటిలో ఏ ఉంగరాన్ని తీసుకోవాలో తెలియక బయటికొచ్చి బ్రహ్మకు నమస్కరించి రామచంద్రుడి దగ్గరకు తిరిగొచ్చాడు.

### వరమిచ్చిన రాముడు

ఉంగరం తేనందుకు రాముడు కోపగిస్తాడేమోనని భయపడసాగాడు. అయితే రాముడు హనుమకు ధైర్యం చెప్పి భయపడాల్సిన భయంలేదని బ్రహ్మలోకంలో ఏం జరిగిందో చెప్పమని కోరాడు. అప్పుడు హనుమ బ్రహ్మలోకంలో జరిగిన విషయాలన్నీ వివరంగా చెప్పి ఆ లోకంలో తాను పొందిన బ్రహ్మానందాన్ని కూడా చెప్పాడు. అక్కడ ఉన్న అమృతసరస్సులో ఒక ముద్రిక కాకుండా లెక్కలేనన్ని ముద్రికలున్నాయని, అవన్నీ ఒకేలాగా ఉండటంతో ఏ ముద్రిక తేవాలో తెలియక తేలేదని చెప్పాడు. అప్పుడు శ్రీరాముడు చిరునవ్వు నవ్వుతూ విశ్వంలో సృష్టి జరిగినప్పుడల్లా ప్రతి బ్రహ్మ తన ఉంగరాన్ని తీసుకువెళ్లి పూజిస్తుంటాడని, అందుకనే అక్కడ అన్ని ఉంగరాలు ఉన్నాయని చెప్పాడు రాముడు. మరోసారి బ్రహ్మలోకానికి వెళ్లి ఏదో ఒక ఉంగరాన్ని తీసుకురమ్మని దాంతో సీతమ్మకు ఆనందం కలుగుతుందని రాముడు చెప్పడంతో హనుమంతుడు వెంటనే బ్రహ్మలోకానికి వెళ్లాడు. ఈసారి బ్రహ్మ అడ్డు చెప్పలేదు. హనుమంతుడు బ్రహ్మానంద పరవశుడై ఉంగరాన్ని తీసుకొని రామచంద్రుడికిచ్చాడు. అప్పుడు శ్రీరాముడు హనుమను ఆశీర్వదిస్తూ బ్రహ్మలోకానికి వెళ్లి బ్రహ్మానందాన్ని పొంది వచ్చిన కారణంగా ఇక మీదట భవిష్యత్తులో బ్రహ్మగా ఉంటూ ఉండమని ఆశీర్వదించాడు. అప్పటి నుంచి ప్రతికల్పంలోనూ హనుమంతుడి ఒక అంశ బ్రహ్మరూపాన్ని పొందుతూ వస్తోంది. అందుకే హనుమంతుడికి అప్పటినుంచి శ్రీరాముడిచ్చిన వరం మేరకు భవిష్యద్బ్రహ్మత్వం స్థిరపడి భవిష్యద్బ్రహ్మగా అయ్యాడు. ఇలా ఈ కథాసందర్భం భవిష్యద్బ్రహ్మ హనుమ గురించిన వివరాలను తెలియచేస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# నరసింహస్వామికి ఏకాంతసేవ

**నెల్లూరు, న్యూస్‌టుడే :** నెల్లూరు గ్రామీణ మండలంలోని దేవరపాళెంలో నరసింహకొండపై వెలసిఉన్న శ్రీవేదగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్లకు వైభవంగా ఏకాంతసేవ నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలు చేయించి పలు రకాల పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి. నాగేశ్వరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించగా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



స్వామి, అమ్మవార్లు

# కనులపండువగా రథోత్సవం

**కడప, న్యూస్‌టుడే :** జమ్మలమడుగు పట్టణంలోని నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవం కన్నులపండువగా సాగింది. తితిదే నుంచి వచ్చిన ప్రధాన వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు రథాన్ని నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కదిలించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తదితర ప్రముఖులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కొయ్య...

**సా**ధారణంగా ఈ పదానికి కట్టె అని అర్థముంది. ఏదైనా చెట్టుకు సంబంధించిన కట్టెను కొయ్య అని అంటుంటారు. జాతీయంగా మారేసరికి ఇది మనిషి అనే పదానికి ప్రత్యామ్నాయంగా వాడుకలోకి వచ్చింది. కొరకరాని కొయ్య అని అన్నప్పుడు మొండి

జాతీయాలు నుడికారాలు

వాడు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తుంది. అలాగే కట్టె అనే పదం కూడా శరీరాన్ని తెలిపే పదంగా వాడుకలో ఉంది. ప్రాణం పోయాక ఈ కట్టె కట్టెల్లో కలిసేదేగా అని అనటం కనిపిస్తుంది.

ఆంధ్రావని

# నరసింహుడి ఐరావత వాహనోత్సవం

**అనంతపురం, న్యూస్‌టుడే:** పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సూర్యప్రభ వాహనోత్సవం, ఐరావత వాహనోత్సవం జరిగింది. భక్తులు స్వామికి పూజలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై శ్రీవారిని ప్రతిష్ఠించి ఊరేగించారు. సాయంకాలం ఉత్సవ దీక్షా హోమం జరిపి వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఐరావత వాహనంపై ఊరేగించారు.

# భక్తిశ్రద్ధలతో శతచండీ యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

**కరీంనగర్ , న్యూస్‌టుడే:** మేళతాళాలు.. పర్వత వర్ధినీ, రామేశ్వరుల నామస్మరణలు.. మహిళల భజనలు.. వేద పండితుల మంత్రోచ్ఛాణల మధ్య ఆదివారం శతచండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కమాన్‌చౌరస్తాలోని రామేశ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో, మహేశ్వరశర్మ మంత్రోచ్చారణల మధ్య రెండు రోజులుగా జరుగుతున్న శతచండీ మహాయాగం వైభవోపేతంగా ముగిసింది. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన యాగం 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి పర్వత వర్ధినీ రామేశ్వరుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

# భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం

**సింగరాయకొండ, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** స్థానిక కందుకూరు రోడ్డు కూడలి సమీపంలోని శ్రీవేణుగోపాలస్వామి,జాలమ్మతల్లి దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉత్సవ మూర్తుల విగ్రహాలకు పూజా కార్యక్రమాలు ఆదివారంతో రెండో రోజుకు చేరాయి. ఉదయం అర్చకులు శాస్త్రోక్తంగా అగ్నిప్రతిష్టాపనం చేశారు. అనంతరం శ్రీ వేణుగోపాలస్వామికి, జాలమ్మ తల్లికి పంచామృతాభిషేకం, జలాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషాలంకరణలతో శ్రీవేణుగోపాల స్వామి, జాలమ్మతల్లి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ధాన్యాధివాసం, శయనాధివాసం నిర్వహించారు. అనతరం నిర్వహకులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సోమవారం ప్రతి కార్యక్రమం ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



అలంకరణలో వేణుగోపాలస్వామి



అభయప్రదాతగా జాలమ్మతల్లి

# 'మంత్రాలయం' పుస్తకావిష్కరణ

**కర్నూలు, న్యూస్‌టుడే:** శ్రీమఠం పూర్వపీఠాధిపతి సుయతీంద్రతీర్థుల చరిత్రను రచించిన 'మంత్రాలయం' ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆదివారం ఆప్తకార్యదర్శి సుయమీంద్రాచార్, మేనేజర్ ఎస్. కె శ్రీనివాసురావు విడుదల చేశారు. అంతకుముందు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ముద్రధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పుస్తకాన్ని విడుదల చేస్తున్న అధికారులు →



భక్తులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ↓



### శ్రీమఠానికి రూ.9 లక్షలు విరాళం

పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఆదివారం కర్ణాటకకు చెందిన ముగ్గురు భక్తులు రూ.9లక్షల విరాళాన్ని అందజేశారు. బెంగళూరుకు చెందిన కృష్ణసుధీంద్ర రూ.2లక్షలు, మధు టీఎస్ రూ.2లక్షలు గదుల నిర్మాణానికి, మరో భక్తుడు రూ.5లక్షలను శ్రీమఠం అభివృద్ధికి విరాళంగా ఇచ్చినట్లు శ్రీమఠం అధికారులు పేర్కొన్నారు.

# హనుమజ్జయంతి నాడు చేయాల్సిన పూజ

పరమాద్భుత దైవంగా కొలిచిన వారికి కొంగు బంగారంగా, పిలిస్తే పలికే దైవంగా భక్తుల మనసులలో కొలువుతీరి ఉన్న దైవం ఆంజనేయస్వామి. చిన్న పిల్లల మొదలు పెద్ద వారిదాకా ప్రతి భక్తుడూ ఆ స్వామిని తన మిత్రుడిగా ఎంచుకొని భయం కలిగిన సమయంలో ఆ స్వామి అభయాన్ని పొందుతూ ధైర్యంతో, స్థైర్యంతో ఉండటం కనిపిస్తుంది. సంవత్సరంలో ఇతరత్రా పర్వదినాలలోనూ విశేష సందర్భాలలోనూ ఆంజనేయ స్వామిని పూజిస్తూనే ఉన్నా ప్రత్యేకించి హనుమజ్జయంతి

ధర్మపథం

నాడు చేసే పూజకు ఎంతో విశిష్టత ఉంది. హనుమజ్జయంతి పర్వదినంనాడు ఆ స్వామిని ఎలా అర్చించాలి అనే విషయాన్ని గురించి పరాశరసంహిత డెబ్బైఏడో పటలం వివరిస్తోంది. పరాశరుడు మైత్రేయుడికి ఈ విషయాలను వివరించి చెప్పాడు. వైశాఖమాసం కృష్ణ పక్షం దశమి తిథి శనివారం పూర్వాభాద్ర నక్షత్రం కర్కాటక లగ్నంలో మధ్యాహ్నం వేళ వైధృతీ యోగంలో హనుమంతుడి పూజచేయటం ఎంతో విశేషం. ఇలా ఆ స్వామి జననానికి సంబంధించిన తిథి, వార, నక్షత్ర యోగాలన్నీ ఒకేసారి కలిసి రానప్పుడు పూర్వాభాద్ర నక్షత్రయుక్తమైన దశమి తిథిని ముఖ్యంగా తీసుకోవాలి.

### అర్చనకు ఎవరైనా అర్హులే...

ఆ రోజున గంధం, పుష్పాలు, అక్షతలు లాంటి వాటితో వైభవోపేతంగా దివ్యనైవేద్యాలతో నృత్య, వాద్యాది సర్వఉపచారాలతో హనుమంతుడిని అర్చించాలి. ఆంజనేయ స్వామిని అర్చించేందుకు ఎలాంటి లింగవివక్ష, వర్గవివక్ష, కుల, ధనిక, బీద భేదాలేవీ లేవు. మనిషిగా పుట్టి ఆంజనేయ స్వామి మీద భక్తి ఉన్నవారు ఎవరైనాసరే అర్చించవచ్చు. అర్చన క్రమం, విధానం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు కనుక ఆ రోజున హనుమంతుడి పూజలో విశేష అనుభవం ఉన్న గురువును కానీ, పండితుడిని కానీ గౌరవంగా ఆహ్వానించి సత్కరించి వారి సూచనల మేరకు అర్చన చేసుకోవచ్చు. అర్చన కోసం సిద్ధమైన వారు సూర్యోదయానికి ముందే నిద్రలేచి పవిత్రులై హనుమంతుడిని అర్చించేందుకు శుభ్రమైన పవిత్ర ప్రదేశాన్ని ముందుగా సిద్ధం చేసుకోవాలి. ఆ ప్రదేశంలో అయిదు శేర్ల బియ్యం కానీ లేదా తన శక్తిననుసరించి కానీ బియ్యం పోయాలి. హనుమం



తుడి పూజ విషయంలో ధనలోభాన్ని ప్రదర్శించటం మంచిదికాదు. ఆ బియ్యం మీద మంచి కలశాన్ని ఉంచాలి. ఆ కలశంలో స్వచ్ఛమైన జలాన్ని నింపాలి. దానిలో పండ్లను, మంచి పుష్పాలను, ఓపికననుసరించి బంగారాన్ని ఉంచాలి. కొత్త వస్త్రాన్ని బాగా శుద్ధిచేసి కలశంపై కప్పాలి. హనుమంతుడి పూజ విషయంలో హనుమంతుడి విగ్రహం, కలశ వస్త్రం, హోమం, విప్ర సమారాధన, గురుపూజ అనేవి ఎంతో ముఖ్యమైనవి. శక్తిననుసరించి బంగారం, రాగి, వెండి ఇలా ఏదో ఒక మంచిలోహంతో హనుమంతుడి విగ్రహాన్ని చేయించాలి. ఆ విగ్రహానికి పంచామృతాభిషేకం, స్నానం అయ్యాక పట్టు పీతాంబరాలను కానీ, పసుపు వస్త్రాలను కానీ ధరింపచేయాలి. ఆ తర్వాత మంచి సింహాసనాన్ని నూతన వస్త్రంతో కప్పి దాని మీద వాయునందనుడిని ఉంచాలి. అనంతరం మూలమంత్ర విధానంలో ప్రాణప్రతిష్ఠ చేయాలి. అటు తర్వాత యథావిధిగా షోడశోపచారాలతో ఆంజనేయ స్వామిని అర్చించాలి.

### శీలవంతుడైన పండితుడికి దానమివ్వాలి

దీనిలో భాగంగానే శక్తిననుసరించి సువర్ణకలశంతో అయిదుసార్లు అర్ఘ్యమిచ్చి వక్కలు, పుష్పాలు, దక్షిణతో కూడిన తాంబూలాన్ని, వస్త్రాలతో ఉన్న హనుమంతుడి విగ్రహాన్ని దానం ఇవ్వాలి. దానానికి ముందు గురువును వస్త్ర, అలంకరణాదులతో పూజించాలి. శీలవంతుడైన పండితుడికి దానం ఇవ్వటమే మేలు. హనుమజ్జయంతినాడు యతులు ఉపవాసం ఉండాలి. గృహస్థులు మాత్రం భోజనం చేయొచ్చు. వైశాఖమాసంలో హనుమంతుడు జన్మించినందువల్లనే ఆ మాసం మొత్తానికి గొప్ప పవిత్రత చేకూరింది. ఈ మాసంలో ఆంజనేయ స్వామిని స్మరించుకుంటూ జలదానం, అన్నదానం చేయటం వల్ల స్వామి కరుణ లభిస్తుంది. హనుమజ్జయంతినాడు యథాశక్తిగా పూజ, నివేదన, పన్నెండుసార్లు ఆవునెయ్యితో హోమం, వేద పండితులకు భోజనం పెట్టడమనేవి తప్పనిసరి చేయాలి. ఇలా చేసేటప్పుడు హనుమంతుడి దివ్యమంగళ విగ్రహాన్ని మనసులో భావించుకుంటుండాలి. హనుమంతుడికి ఎడమభాగంలో చిరునవ్వు చిందిస్తూ సూర్యపుత్రిక, హనుమంతుడి భార్య అయిన సువర్చలమ్మ ఉంటుంది. ఆ దంపతులకు ఛత్రచామరాలు అలంకరించి ఉంటాయి. నీలుడు తదితర వానర ప్రముఖులు సువర్చలా సహిత ఆంజనేయ స్వామిని సేవిస్తూ ఉంటారు. ఆ స్వామి మెడలో ముత్యాలహారాలు అందంగా కనిపిస్తుంటాయి. ముత్యాల హారాలతోపాటు అనేకానేక కంఠాభరణాలను, బంగారు వస్త్రాలను ధరించి ఉంటారు. శిరస్సున మణులు పొదిగిన కిరీటం కాంతులీనుతూ ఉంటుంది. నడుముకు ముచ్చటగా మొలతాడు చుట్టి ఉంటుంది. మణులు పొదిగిన అందెలుంటాయి. రత్న కంకణాలతో ప్రకాశిస్తూ ఉండే ఎర్ర తామరలను పోలిన చేతులతోనూ, పుట్టం పెట్టినట్టుండే బంగారు ఛాయ గల అవయవాలతోనూ, ఒంటె వాహనుడై నాలుగుభుజాలతో శాంతస్వభావుడిగా ఉండే ఆంజనేయస్వామిని హనుమజ్జయంతి పూజనాడు అర్చించటం కానీ, స్మరించటం కానీ, ధ్యానించటం కానీ సర్వశ్రేయోదాయకమని పరాశర సంహిత వివరిస్తోంది.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు

# పవనసుతుని సేవతోనే పరమానందం



ద్వారాకానగర్‌లో నవనీత అలంకారంలో వీరాంజనేయస్వామి

**ఒంగోలు , న్యూస్‌టుడే:** హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గద్దలగుంట ప్రసన్న ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో లక్ష్మీ, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిగింది. డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులు, నారాయణం శేషాచార్యులు యాజ్ఞీక కర్తృత్వం వహించారు. ఈదుపల్లి దశరథ రామారావు, రేణుక దంపతులు ప్రధానకర్తలుగా పాల్గొన్నారు. ద్వారకా నగర్ వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు నవనీత అలంకారంలో దర్శనమిచ్చాడు. మంగమూరు రోడ్డు పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో అంజనీసుతుడు రజిత కవచాలంకారంలో భక్తులకు కనువిందు చేశాడు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి పుష్పార్చన జరుగుతుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు.



స్వామివారి కల్యాణోత్సవం

ఆంధ్రావని

# దిగు...

**ది**గు అనే పదానికి కిందికి రావటం, దిగుమతి కావటం, ప్రయాణం చేసి రావటం అనేలాంటి అర్థాలు మామూలుగా కనిపిస్తాయి. అయితే ఇదే పదం జాతీయంగా మారి ప్రయోగంలోకి వచ్చినప్పుడు సంబంధం కలుపుకోవటం అనే అర్థంలో ప్రయోగంలో కనిపిస్తుంది. ఋకిందకి దిగి వచ్చాడు", ఽ ఽదిగుమతి అయింది", ఋపది

జాతీయాలు నుడికారాలు

గంటల బండికి దిగాడు" అనేలాంటి అర్థాలు మామూలుగా దిగు అనే పదానికి ఉన్నాయి. కానీ ఽ ఽవాడితో వ్యాపారంలోకి నేను దిగను" అని అన్నప్పుడు వ్యాపారపరంగా సంబంధాన్ని కలుపుకోవటం అనే అర్థం ఈ జాతీయానికి స్ఫురిస్తుంది. అలాగే కొన్నిచోట్ల పౌరుషాన్ని తగ్గించుకోవటం, పట్టిన పట్టును కొద్దిగా సడలించటం, మరొకరికి అనుకూలంగా మారటం అనే అర్థాలు కూడా కనిపిస్తాయి. ఋఓ మెట్టు కిందకి దిగాడు" అని అన్నప్పుడు పట్టిన పట్టును కొద్దిగా సడలించాడు అనే భావం స్ఫురిస్తుంది. ఇలా ఈ ఏకపద జాతీయం సందర్భానుసారంగా భిన్న అర్థాలలో వ్యాప్తిలో ఉంది.

# శ్రీరాజరాజేశ్వరికి లక్ష పుష్పార్చన

**వరంగల్, న్యూస్‌టుడే:** వరంగల్ ప్రాంతంలోని శ్రీరాజరాజేశ్వరీ దేవి వార్షికోత్సవం సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకుడు లక్ష్మణ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం 108 కలశాలతో 42 రకాలైన ద్రవ్యాలతో అభిషేకం చేశారు. లక్ష పూలర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులందరికి అన్నదానం చేశారు. సాయంత్రం వేళల్లో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి పూల ఉంజిలి కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు 300 త్రిశతి నామాలతో దీపాలంకరణ జరిగింది.



# స్వర్ణరథంపై దేవేరులతో శ్రీహరి

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు రథంపై అధిరోహించారు. తిరువీధుల్లో సంచరిస్తూ ఆద్యంతం భక్తజనుల నుంచి హారతులు అందుకుంటూ దివ్యాశీస్సులను అందించారు. స్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా వేకువజామున సుప్రభాత సేవలతో స్వామివారిని మేల్కొలిపి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్ర నామార్చన, నిత్యార్చన పూజలను వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి ఉత్సవర్లును వేంచేపుగా దేవాలయ ప్రాంగణంలోని వసంతమండపానికి తీసుకువచ్చి ఆస్థాన పూజలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.



స్వర్ణరథంపై శ్రీవారి ఉత్సవర్లు

# శేషవాహనంపై వైకుంఠవాసుడు

**గుంటూరు, న్యూస్‌టుడే:** వైకుంఠవాసుడు శేషవాహనంపై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని పురవీధుల్లో శేషవాహనంపై ఊరేగించారు. స్వామివారి దివ్య సుందర రూపాన్ని వీక్షించిన భక్తులు కానుకలు సమర్పించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# త్రిపురాంతకస్వామికి దివ్య పుష్పాంజలి

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామివారి దేవాలయంలో స్వామికి దివ్య పుష్పాంజలి సేవ నిర్వహించారు. ఉదయం స్వామి వారికి నాగవల్లి కార్యక్రమం, ప్రత్యేక అభిషేకాలు, పంచామృత అభిషేకాలు జరిపారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెలవలపల్లి సూర్య శంకరం ఆధ్వర్యంలో రాత్రి స్వామి వారిని అమ్మవార్లను పుష్పాలతో అలంకరించారు. పల్లకిలో ఉత్సవమూర్తులను ఉంచి దేవాలయం చుట్టూ తొమ్మిది సార్లు ప్రదర్శనలు చేశారు. అనంతరం స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, మిఠాయిలు, పిండి వంటలు నివేదించారు.

# తొమ్మిది రూపాల్లో అనుగ్రహించే స్వామి

ధర్మపథం

శివ, విష్ణులలాగా ఆంజనేయ స్వామికి భిన్నరూపాలు, అవతార విశేషాలు ఉన్నాయని తెలియచెప్పే కథాసందర్భం ఇది. పరాశరసంహిత అరవయ్యో పటలంలో పరాశర మహర్షి మైత్రేయుడికి ఈ విశేషాల గురించి ఇలా తెలియచెప్పాడు. ఆంజనేయ స్వామికి రూప అవతార విశేషాలు అనంతంగానే ఉన్నాయి. అయితే వాటిలో తొమ్మిది మాత్రం ప్రధానమైనవి. తొమ్మిది రూపాలను విభిన్నమైన కోర్కెలను తీర్చుకోటానికి ఒక్కొక్కటిగా పూజించటం అలవాటుగా ఉంది. ఒక్కో కోర్కె తీరటానికి ఒక్కో రూపంలో ఉన్న ఆంజనేయ స్వామి రూపాన్ని పూజించటమే మేలు. ఆ రూపానికి సంబంధించిన ప్రత్యేక మంత్రాలు ఉన్నాయి. వాటి గురించి హనుమంతుడి సాధకులను అడిగి తెలుసుకోవటం మేలు. ఆంజనేయ స్వామి రూపాలలో మొదటిది ప్రసన్నాంజనేయ స్వామి. రెండోది వీరాంజనేయ రూపం. మూడోది ఇరవై భుజాలతో ఉండే రూపం. నాలుగోది పంచముఖ ఆంజనేయం. అయిదోది పద్దెనిమిది భుజాలతో ఉండే రూపం. ఆరోది సువర్చలాసమేతంగా ఉండే రూపం. ఏడో రూపానికి నాలుగు చేతులుంటాయి. ఎనిమిదో రూపానికి ముప్పైరెండు చేతులుంటాయి. వానరాకారంలో ఉండేదే తొమ్మిదో రూపం. ఈ తొమ్మిది ఆంజనేయస్వామి రూపాలు ఆ స్వామికి సంబంధించిన అన్ని అవతార రూపాలలోకి విశేషమైనవి.

## దూర్వాసుడికీ శక్తినిచ్చిన స్వామి

పూర్వం ఇరవై చేతులున్న ఆంజనేయస్వామి రూపాన్ని పూజించి బ్రహ్మదేవుడు ప్రజాపతి అయ్యాడు. కపిలుడు అనే వేదపండితుడు నాలుగు భుజాలుగల హనుమంతుడిని ఉపాసించి ఇహ, పరాలను సాధించుకున్నాడు. విజయుడు అనే ఓ లోకపాలకుడు ప్రసన్నాంజనేయ స్వామిని ధ్యానించి సంసార సాగరం నుంచి బయటపడ్డాడు. రావణాసురుడి సోదరుడైన విభీషణుడి కుమారుడి పేరు నీలుడు. ఆ



నీలుడు పంచముఖ ఆంజనేయ రూపాన్ని ఉపాసించి సర్వ సమృద్ధిని పొందాడు. పూర్వం గాలుడు అనే ఒక వనచరుడు ఉండేవాడు. ఆయన వానర రూపంలో ఉన్న హనుమంతుడిని ఉపాసించి ఆరోగ్యాన్ని ఉత్తమసిద్ధిని పొందాడు. ధ్వజదత్తుడు అనే ఓ పండితుడు సువర్చలాసమేత ఆంజనేయ స్వామిని ఉపాసించి ధనికుడయ్యాడు. పూర్వం వేదవేత్తలలో శ్రేష్ఠుడుగా పేరు పొందిన మైందుడు అనే పండితుడు ఉండేవాడు. ఆయన ప్రయాణిస్తున్న నావకు నదిలో అనుకోకుండా అనేక రంధ్రాలు ఏర్పడ్డాయి. దాంతో ఆ నావ బాగా దెబ్బతింది. అంతటి ప్రాణాపాయ పరిస్థితిలో వీరహనుమంతుడి రూపాన్ని ధ్యానించి ఒడ్డుకు చేరి ప్రాణాలు దక్కించుకొన్నాడా పండితుడు. సోమదత్తుడనే రాజు శత్రువుల పాలయ్యాడు. ఆ రాజు ముప్పైరెండు భుజాలు గల హనుమంతుడి రూపాన్ని ధ్యానించి మళ్లీ తన రాజ్యాన్ని తాను పొందాడు. దూర్వాసుడు పద్దెనిమిది భుజాలుగల ఆంజనేయస్వామిని ఉపాసించి సముద్ర జలాలను తాగేసేంతటి శక్తిని పొందాడు. ఇలానే ఒక్కో కష్టాన్నుంచి బయటపడేందుకు భక్తులు ఆయా ఆంజనేయస్వామి రూపాలను అర్చించాల్సి ఉంటుంది. హనుమంతుడి మీద భక్తుడు ఎంత భక్తిని కనబరిస్తే అంత రక్షణను ఆయన కల్పిస్తాడు.

## దుష్టులను శిక్షించేది ఆయనే...

శిష్టులను రక్షించటం మాత్రమే కాక దుష్టులను శిక్షించటం కూడా ఆంజనేయస్వామి చేస్తుంటాడు. హనుమంతుడిలోని ఈ ఉత్తమ లక్షణాన్ని గ్రహించిన మహర్షులు, రాజర్షులు, ఎందరెందరో వేద పండితులు తమకు ఎలాంటి కోర్కెలు తీరాలంటే, ఎలాంటి కష్టాలు గట్టెక్కాలంటే అలాంటి హనుమంతుడి రూపాన్ని అర్చించి ధ్యానించి విజయాలు పొందిన సందర్భాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఆయా రూపాల అర్చనకు ఒక్కొక్క రూపానికి ఒక్కో మంత్రం విడివిడిగా ఉంటుంది. ఏ మంత్రానికైనా పదహారు అంగాలుంటాయి. వాటిని తెలుసుకొని మంత్ర జపం చేయటం మేలు. కీలకం, శక్తి, బీజం, ధ్యానం, ముద్రలు, రుషి, ఛందస్సు, దైవం, సంధ్యలు, తర్పణం, హోమం, ఆస్తరణం, ఆసనం, న్యాసం, పురశ్చరణ, పల్లవాలు అనే ఈ పదహారు మంత్రానికుండే అంగాలు. ఇలా పద్ధతి ప్రకారం మంత్ర జపం చేయటానికి విషయాలు తెలిసిన సద్గురువు అవసరం ఉంటుంది. కనుక అలాంటి గురువును ఎంచుకొని ముందుగా పూజించి ఆయన సూచన మేరకు పూజ, ధ్యానం చేయటం మంచిది అని పరాశర సంహిత తెలియచెబుతోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# శాస్త్రోక్తంగా కల్యాణ వెంకన్న చక్రస్నానం



**శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణవెంకన్నకు సహస్రధార కలశాభిషేకం చేస్తున్న అర్చకులు**

**నారాయణవనం, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో ముగిశాయి. ఈనెల 12న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ధ్వజావరోహణ ముహూర్తంలో గరుడ పటం, గరుడమాలలకు ఆలయంలో మంగళవారం రాత్రి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభంపై ఉన్న గరుడ ధ్వజమాలను శాస్త్రోక్తంగా కిందికి దించి పూజలు నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో ఆఖరిరోజైన మంగళవారం ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, మొదటి గంటల అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బ్రహ్మోత్సవాల్లో ఆఖరిరోజున ఆలయ పుష్కరిణిలో ఉత్సవమూర్తుల స్నపన తిరుమంజనంతో పాటు చక్రస్నానం వైభవోపేతంగా జరిగింది. బ్రహ్మోత్సవాలు మొదలైన నాటి నుంచి నిత్యం స్వామి వారి సేవలను తిరుమాడ వీధులలో తిరిగి చాటింపు వేసి అలసిన సుదర్శన చక్రాన్ని శ్రీదేవి, భూదేవి సమేతుడైన కల్యాణవెంకన్నతో సన్నిధి వీధిలో ఊరేగించారు. ఆలయం నుంచి పుష్కరిణి వరకు ఉత్సవ మూర్తులతో కలసి వచ్చిన సుదర్శనచక్రాన్ని పుష్కరిణి వద్ద పీఠంపై ఆసీనులను చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిలతో పాటు ప్రత్యేకంగా సుదర్శన చక్రానికి పాలు, పెరుగు, తేనె, చందనంలతో అభిషేకించి సహస్రధార కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం అశేష భక్తజనావళి తిలకిస్తుండగా సుదర్శనుడిని శ్రీధర్‌భట్టాచార్యులు, నరసింహరాఘవభట్టాచార్యులు పుష్కరిణిలో ముంచి చక్రస్నానాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు పోటీ పడ్డారు. చక్రాన్ని నీటిలో దించగానే వందల సంఖ్యలో భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. ఉభయనాంచారీ సమేతుడైన శ్రీనివాసుడు సాయంత్రం తిరుచ్చిలో ఆసీనులై తిరుమాడ వీధులలో ఊరేగారు. భక్తుల కర్పూర నీరాజనాలు అందుకుంటూ ముందుకుసాగిన స్వామి నిజాలయానికి చేరుకున్నారు. రాత్రికి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

ఆంధ్రావని

## నాథుడు

**సా**మాన్యంగా ఈ పదానికి గృహపరంగా చూస్తే భర్త అని, రాజ్యపరంగా చూస్తే రాజు అని అర్థాలు న్నాయి. అయితే ఈ పదం జాతీయంగా మారి వ్యవహారంలోకి వచ్చేసరికి అర్థం మారిపోయింది. దిక్కు, ఆధారం అనేలాంటి అర్థాలు జాతీ

జాతీయాలు నుడికారాలు

యంగా మారిన నాథుడు అనే పదానికున్నాయి. నా బాధ తీర్చే నాథుడెవరో, నాకు ఉద్యోగం ఇచ్చే నాథుడెవరో అనేలాంటి రూపాల్లో ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తోంది.

# ఆకట్టుకున్న అష్టావధానం



**విజయవాడ, న్యూస్‌టుడే:** కనకదుర్గను పదపీఠిగరహించి.. కృష్ణవేణికి నెలవుగా కీర్తిగాంచు.. భాషా సంస్కృతి శూరత పరిఢవిల్లు.. అట్టి బెజవాడ నెలవుగా అమరుగాక.. నూతన రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రాష్ట్ర రాజధానిగా విజయవాడ నగరాన్ని ఎంపిక చేయాలని కోరుతూ పృచ్ఛకులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా అవధాని చెప్పిన పద్యమిది. ఘంటసాల సంగీత కళాశాల, ఎక్స్‌రే సంస్థల ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో మంగళవారం రాత్రి శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌చే నిర్వహించిన అష్టావధానం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎక్కువగా కనిపించిన ధన, మద్యం ప్రభావం వంటి సమస్యలపై పృచ్ఛకుల ప్రశ్నలకు శ్యామలానందప్రసాద్ తనదైన శైలిలో సమాధానాలిచ్చి సంతృప్తి పరిచారు. కాళిదాసు, దేవదాసు, బాటసారి, అక్కినేని పదాలను ఉపయోగించి కూర్చిన సందర్భోచిత పద్యం శ్రోతలను ఆనందపరచింది. కార్యక్రమంలో సమస్య పాత్రలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు, నిషిద్ధాక్షరిగా పి.వి.కృష్ణారావు, దత్తపదిగా కావూరి సత్యవతి, వర్ణన వెన్నా వల్లభరావు, పురాణం వి.వి.శివరామకృష్ణమూర్తి, ఆశువు జి.వి.పూర్ణచంద్, అప్రస్తుత ప్రసంగం మోహనరామ్‌ప్రసాద్, చిత్రాక్షరిగా డాక్టర్ సత్రీలు తమ పాత్రలకు న్యాయం చేకూర్చారు. కార్యక్రమానికి ముందు లయన్స్‌క్లబ్ రీజియన్ అధ్యక్షుడు ఆర్.తులసీధరన్‌ను నిర్వాహకులు సత్కరించారు.

# ఆంజనేయునికి సింధూరపూజ

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** పట్టణంలోని రైతుబజార్ పక్కనగల రాంలీలా మైదానంలోని దక్షిణముఖ ఆంజనేయ ఆలయంలో ఆంజనేయునికి సింధూర పూజ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య హనుమాన్ దీక్షాధారుల రామజపంతో ఆంజనేయస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి ఆంజనేయునికి ప్రీతిపాత్రమైన సింధూరంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రాముని, హనుమంతుని భక్తిగీతాలతో భజన కార్యక్రమం నిర్వహించారు.



**ఆంజనేయ విగ్రహానికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న వేదపండితులు**

# సౌమ్యనాథుడికి ఊంజల్ సేవ

**కడప, న్యూస్‌టుడే :** శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని సౌమ్యనాథస్వామికి ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి అన్నమయ్య కీర్తనల మధ్య ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమం ఉత్సవ దాత కళాధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగింది.

# ఘనంగా వెంకన్నకు శాంతి కల్యాణం

**భీమవరం , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రావణ నక్షత్రం సందర్భంగా జువ్వలపాలెంరోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య దంపతుల చేతుల మీదుగా కల్యాణం చేయించారు.



**కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు**

# కనులపండువగా రుద్రాభిషేకం

**నల్గొండ, న్యూస్‌టుడే:** హుజూర్‌నగర్ శ్రీపార్వతీ భీమలింగేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, రక్షాబంధనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి, శివ, సుబ్రహ్మణ్యస్వామి సహస్రనామార్చనలు, లలితసహస్రనామ కుంకుమార్చనలు, సర్వతో భద్ర మంటప ఆరాధనలు తదితర కార్యక్రమాలు నిర్వహిచారు. ఆలయ ఛైర్మన్ గుండా రామనాగేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాల నిర్వహణలో పాల్గొన్నారు. నెక్కంటి సోమరాజు దంపతులు సుబ్రమణ్యస్వామికి వెండి కిరీటం బహూకరించారు. కనకమేడల సురేష్ విజయలక్ష్మి దంపతులు, పుష్పావతి, పిచ్చమ్మ, పద్మ, వంకాయల రామలింగయ్య పాల్గొన్నారు.



**స్వామివారికి ప్రత్యేక అలంకరణ**

# అయిదు విధాలుగా ఆంజనేయుడి అర్చన

ఆంజనేయ స్వామికి సంబంధించిన పూజ అయిదు విధాలుగా ఉంటుంది. వాటిలో మానసిక పూజకు మరింత విశేష స్థానముందని తెలియచేస్తుంది ఈ కథాసందర్భం. ఇది పరాశరసంహిత యాభైరెండో పటలంలో ఉన్న విషయం. అయిదు రకాల పూజలో మొదటిది జలంతో చేసే పూజ. రెండోది ప్రతిమా పూజ. మూడోది శిలాపూజ, నాలుగు సూర్య మండలంలో దృష్టినిల్పి చేసే పూజ. అయిదోది నిశ్చలమైన మనసుతో చేసే మానసిక పూజ. మొదటి పూజలో అన్ని ఉపచారాలను జలంతోనే చేస్తారు. రెండో రకం పూజలో శాస్త్రవిధిగా పూజాద్రవ్యాలతో పూజచేస్తారు. మూడో రకమైన శిలాపూజ కూడా రెండో రకంలాగానే ఉంటుంది. నాలుగోదైన పూజా విధానంలో సాధకుడు సూర్యమండలం మధ్యలో నిశ్చలంగా దృష్టిని నిల్పి స్వామిని ధ్యానిస్తాడు. ఈ పూజలో పూజా ద్రవ్యాలన్నింటినీ కళ్ల ద్వారానే స్వామికి సమర్పిస్తున్నట్లు భావన చేయటం జరుగుతుంది. అయిదో రకం పూజ మానసిక పూజ. ఇది మిగిలిన నాలుగు పూజలకన్నా ఉత్తమోత్తమమైంది.

### హృదయ కమలాన్ని అర్పించాలి

మానసిక పూజలో పూజా ద్రవ్యాలన్నింటినీ నిశ్చలమైన మనస్సుతో వానర శ్రేష్ఠుడైన మారుతికి నివేదన చేయాలి. ఈ పూజలో తొలిగా హృదయ పద్మాన్ని భావన చేయాలి. పన్నెండు దళాలతో మధ్యన దుద్దు, చుట్టూ కేసరాలు కలిగి బాగా వికసించి మంచి బంగారువన్నెలో ఉన్నట్టు భక్తుడు హృదయ పద్మాన్ని భావన చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత కాంతులీనే స్వర్ణ సింహాసనాన్ని అర్పించాలి. ఆ సింహాసనం మీద హనుమంతుడిని ఆవాహన చేయాలి. ఆ తర్వాత చతురావరణం కలిగిఉన్న హనుమంతుడిని ధ్యానించాలి. ఆ ఆంజనేయ స్వామికి ఎడమవైపున సూర్యుని కుమార్తె అయిన సువర్చలాదేవి చిరునవ్వులు చిందిస్తూ ప్రేమమయమైన చూపులతో ఉన్నట్టు భావించాలి. ఛత్ర, చామరాలతో కూడి ఉన్న వినతుడు తదితరులు సువర్చలాఆంజనేయస్వామిని సేవిస్తూ ఉంటారు. ఆ సమయంలో ఆంజనేయ స్వామి మెడలో మంచి హారాలు, చెవులకు కుండలాలు ప్రకాశిస్తూ ఉంటాయి. బంగారు కేయూరాలు, మణిమయమైన కిరీటంతో స్వామి ప్రకాశిస్తుంటారు. చక్కని మొలతాడు చుట్టుకొని, మణులు పొదిగిన అందెలతో అందంగా కనిపిస్తుంటాడు. ఆయన ధరించిన రత్నాల కంఠాభరణాలు మెరిసిపోతూ ఉంటాయి. ఆ స్వామి చేతులు ఎర్రతామరల్లాగా ముచ్చటగా ఉంటాయి. పుటం పెట్టిన బంగారం వంటి రంగుతో ఒంటె గుర్తుగల జెండాతో పద్మాసనం వేసుకొని కూర్చొని ఉంటాడు స్వామి. పచ్చని వస్త్రాన్ని ధరించి నాలుగు భుజాలతో శాంతుడై కనిపిస్తుంటాడు. సర్వసమర్థుడైన



ఆ స్వామి చుట్టూ అనేక మంది దేవతలు పరివారంగా ఉంటారు. ఇలాంటి రూపం ఉన్న ఆంజనేయ స్వామిని మానసిక పూజలో ధ్యానించి ఆవాహన చేయాలి. ఆవాహన చేసేటప్పుడు ఆ స్వామిని కీర్తించాల్సి ఉంటుంది. అంజనాసుతుడు, మాయాతీతుడు, జగత్తుకంతటికీ గురుస్థానీయుడు. సూర్యపుత్రిక సువర్చలకిష్టమైనవాడు, సర్వేశ్వరుడు, సర్వసమర్థుడు అయిన దేవదేవుడు హనుమంతుడిని ఆవాహన చేస్తున్నాను అని అనుకోవాలి. ఆ తర్వాత దేవదేవుడు, జగన్నాథుడు, కేసరిప్రియసుతుడు అయిన ఓ హనుమాన్ మహాప్రభువు నీకు రత్నఖచిత సింహాసనాన్ని అర్పిస్తున్నాను. ఓ దేవా హనుమంతా నువ్వు సువర్చలతో కలిసివచ్చి నా పూజ పూర్తి అయ్యేవరకూ సంతోషంతో సన్నిహితంగా ఇక్కడే ఉండు. భీముడి సోదరుడా, గొప్ప ప్రజ్ఞ కలవాడా నీవు నాకు అభిముఖుడిగా ఉండు. ఓ సువర్చలాపతి, శ్రీమంతుడా, జగన్నాథుడా నన్ను అనుగ్రహించు అని ధ్యానించాలి. అనంతరం యోగులు ధ్యానించే పాదపద్మాలు కలిగినవాడు, జగత్తునకు ఆధారమైన హనుమంతుడికి నమస్కారం. ఓ దేవా! పురుషశ్రేష్ఠుడా నేను సమర్పించే పాద్యాన్ని స్వీకరించు. లక్ష్మణుడి ప్రాణాలను సంరక్షించినవాడా, సీతాదేవి దుఃఖాన్ని పోగొట్టినవాడా, శంకరపుత్రుడా నేనిస్తున్న అర్ఘ్యాన్ని స్వీకరించు. తోక కొనతో సేతువును బంధించి శతాననుడిని నాశనం చేసిన ఆంజనేయ స్వామీ నీకు ఆచమనాన్ని ఇస్తున్నాను. ఓ వాయునందనుడా ఆ ఆచమనాన్ని స్వీకరించు. అర్జునుని ధ్వజం మీద ఉండేవాడా, రావణుడి మదాన్ని అణిచినవాడా ఓ హనుమంతుడా నీకు మధుపర్కాన్ని సమర్పిస్తున్నాను స్వీకరించు. పుటంపెట్టిన బంగారంతో సమానమైన పీతాంబరాన్ని నీకు సమర్పిస్తున్నాను స్వీకరించు.

### భక్తులను రక్షించే స్వామికి బ్రహ్మసూత్రం

ఓ కపీశ్వరా నీకు నమస్కారం. ముత్యాలతో ప్రకాశించే యోగ్యమైన బ్రహ్మసూత్రం సమర్పిస్తున్నాను. భక్తులను రక్షించటంలో నిమగ్నమై ఉన్న ఓ ఆంజనేయస్వామీ దీన్ని స్వీకరించు. సంసారబంధం నుంచి భక్తులను రక్షించేవాడా నీకు ఉత్తరీయాన్ని సమర్పిస్తున్నాను. నీ పాదాలకు వినమ్రుడినై నమస్కరిస్తున్నాను. నేనిచ్చే వాటన్నిటినీ ఎంతో ప్రీతితో స్వీకరించు. కిరీటాలు, తదితర విలువైన ఆభరణాలను నేను ఇస్తున్నాను. వానర నాయకా వాటిని స్వీకరించు. కస్తూరి, కుంకుమపువ్వు, కర్పూరం, అగురులను కలిపిన ఆ చందనాన్ని సమర్పిస్తున్నాను. దాన్ని స్వీకరించు. మంచివనాలలో పూసిన సుగంధం కలిగి అందంగా ఉన్న అనేక రకాల సంపెంగపువ్వులను, కమలాలను, కలువలను, తులసి తదితర దళాలను నీకు సమర్పిస్తున్నాను. నీ పాదపద్మాలకు నమస్కరిస్తున్నాను. ఓ దేవా హనుమంతుడా వాటిని స్వీకరించు. రమ్యంగా ఉండి పద్మరాగమణులలాగా కాంతితో ప్రకాశిస్తు విరిగి ముక్కలుకాని అక్షతలను సమర్పిస్తున్నాను. అంధకారం అణచగలిగినవాడా, దయానిధి వాటిని స్వీకరించు. కపిలగోవు నెయ్యి, నల్లని అగురుతో చేసిన ధూపాన్ని, ఆవునేతితో తడిపిన పది పోగులు గల దీపాన్ని సమర్పిస్తున్నాను స్వీకరించు. పప్పు, కూరలు, పండ్లు, నెయ్యి, పెరుగు, పాలు, చక్కెర, తేనెలతో కూడిన అమృతమయమైన దివ్యాన్నం ఇదిగో స్వీకరించు. భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలనే నాలుగు విధాల పదార్థాలను భక్తితో బంగారుపాత్రలో నివేదిస్తున్నాను దయతో స్వీకరించు. సత్య, జ్ఞాన ఆనంద రూపమై సృష్టి, స్థితి, లయాలకు కారకుడవై ఉన్న ఓ హనుమంతుడా నీకు భోజనానికి మధ్యమధ్య అమృతంతో సమానమైన జలాన్ని ఇస్తున్నాను స్వీకరించు. మంచి వక్కలు, కర్పూరంలాంటి సుగంధద్రవ్యాలు ఉన్న బంగారపు రంగులోని లేతతమలపాకుల తాంబూలాన్ని సమర్పిస్తున్నాను ఓ హనుమంతా స్వీకరించు. ఓ వానరాధిపా మంగళం కలగటం కోసం నీకు దివ్యనీరాజనాన్ని ఇస్తున్నాను. స్వీకరించి అనుగ్రహించు. గంధర్వ శ్రేష్ఠులు చేస్తున్న నృత్య, గీత, వాద్యాదులను నీకు మనస్ఫూర్తిగా సమర్పిస్తున్నాను గ్రహించు. సర్వాత్మకుడా, సర్వలింగమయాత్మకుడా, పురాణపఠనాదులతో నేను చేస్తున్న రాజోపచారాలతో నీవు సంతృప్తిని పొందు. మందారం, పారిజాతాలతో కూడిన సువర్ణ దివ్య మంత్రపుష్పాంజలిని సమర్పించుకొంటున్నాను. జెండామీద ఒంటె గుర్తు ఉన్న ఓ ప్రభుహనుమంతుడా స్వీకరించు. అయిదైదుసార్లు ప్రదక్షిణ సాష్టాంగ నమస్కారాలను చేస్తున్నాను. కోరిన వరాలనిచ్చేవాడా వానార శ్రేష్ఠుడా స్వీకరించు. ఓ దేవదేవా, జగన్నాయకా, పురాణపురుషోత్తమా ఎప్పుడూ నేను చేస్తున్న ఈ పూజావిధితో సంతృప్తిచెందుతూ ఉండు. సువర్చలాదేవితో కలిసి చతురావరణలతో కూడి హంసతులికా తల్పం లాంటి నా హృదయపద్మంలో నివసించు అని హనుమంతుడికి మానసిక పూజను ఎవరైనా చేయవచ్చు. ధనం, ఇతరమైన సౌకర్యాలు లేవు కనుక వరాలనిచ్చే హనుమంతుడిని పూజించలేకపోతున్నామని ఎవరూ బాధపడనక్కర లేదు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఎప్పుడైనా ఈ పూజను చేయవచ్చు. దీనికి కావలసిందల్లా మనసు శుద్ధిగా ఉండటమేనని పార్వతికి శంకరుడు చెప్పినట్లు పరాశరుడు మైత్రేయుడికి తెలియచెప్పాడు. ఈ పూజకు కుల, వర్ణ, లింగ భేదాలు లేవు. శుభ, భోగ, మోక్షఫలాలను పొందటం కోసం ఎవరైనా చేయవచ్చు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## భక్తిప్రపత్తులతో వసంతోత్సవం

**కర్నూలు, న్యూస్‌టుడే:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నహోబిలం లక్ష్మీ నరసింహుడికి భక్తిప్రపత్తులతో వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, మహాభిషేకం చేసి స్వామివారిని అలంకరించారు. ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి వసంతోత్సవం చేశారు.

## ఆకట్టుకున్న 'పేదోడు' నాటకం

**గుంటూరు, న్యూస్‌టుడే:** డబ్బుకంటే బంధాలు, అనుబంధాలు గొప్పవని తెలిసినా మనిషి దానికే ప్రాధాన్యం ఇస్తాడు. ప్రపంచంలో డబ్బుకున్న శక్తి దేనికీ లేదు. ఇది మనుషుల్ని, మనసుల్నీ విడదీస్తుంది. కలుపుతుంది. నవ్విస్తుంది, ఏడిపిస్తుంది. డబ్బు, కార్లు, బంగ్లాలు లేనివాడు పేదోడు కాదు. మనుషుల్ని ప్రేమించలేని వాడు నిజమైన పేదోడు. నలుగురు మనసున్న మనుషుల్ని ఆత్మీయులుగా సంపాదించుకోలేనివాడు పేదోడు. చనిపోయినప్పుడు తన శవాన్ని మోయడానికి నలుగురు మనుషులు కూడా దొరకని వాడు నిజమైన పేదోడు అనే సందేశంతో సాగిన 'పేదోడు'నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సాగడంతో పాటు ఆలోచింప చేసేలా మనసులపై ముద్రవేసింది. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ ఎంప్లాయీస్ కళాపరిషత్, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వర పేట పురపాలక బహిరంగ కళావేదికపై 'పేదోడు' నాటకాన్ని ప్రదర్శించారు. s ఈ నాటకానికి రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు చేశారు. తొలుత రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జానీభాషా, సత్యనారాయణ శెట్టి, సంస్థ ప్రధాన కార్యదర్శి బి.వి.రావు, జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాలను ప్రారంభించారు.



'పేదోడు' నాటకంలో ఓ సన్నివేశం

## వేషం...

**వ**స్త్రాలను, ఆభరణాలను అలంకరించుకోవటం అనేది ఈ పదానికున్న సామాన్య అర్థం. ఇదే జాతీయంగా మారేసరికి భిన్నార్థం కనిపిస్తుంది. చేష్టలు అంటే ఒక వ్యక్తి చేసే పనులు అనే అర్థంలో జాతీయమై ప్రయోగంలో ఉంది ఈ పదం. ు ువాడివన్నీ పిచ్చి వేషాలు", ుపిచ్చి పిచ్చి వేషాలువెయ్యకు" అనేలాంటి సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది.

## పవనసుత..పరమహిత

**ఒంగోలు , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** హనుమజ్జయంతి ఉత్సవాలు రోజు రోజుకీ ఉత్సాహాన్ని పుంజుకుంటున్నాయి. భక్తులు వాయుపుత్రుని పరిపరివిధాల సేవిస్తూ తమ అనురక్తిని చాటిచెబుతున్నారు. ఇందులో భాగంగా నగరంలోని మంగమూరు రోడ్డు పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు సింధూర అలంకారంలో దర్శనమిచ్చాడు. ఆలయ కమిటీ సభ్యులు నిర్వాహకులుగా వ్యవహరించారు. గాంధీరోడ్డు భీమరాజువారి వీధిలో అర్చక స్వాములు ఉప్పులూరి సత్యనారాయణ శర్మ, హనుమత్ శర్మలు ప్రసన్నాంజనేయ స్వామివారికి వడమాల సేవను నిర్వహించారు.

## కమనీయం.. వేణుగోపాలుని కల్యాణం..!

**నల్గొండ, న్యూస్‌టుడే:** శ్రీవారిజాల వేణుగోపాలస్వామి కల్యాణం బుధవారం కన్నులపండువగా జరిగింది. స్వామివారి కల్యాణ దర్శణమే మహాభాగ్యంగా తరలివచ్చిన భక్త జనసందోహంతో దేవస్థానం పోటెత్తింది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకను భక్తులతో కలిసి తిలకించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిధ్యాలతో దేవాలయం ప్రతిధ్వనిస్తుండగా వేణుగోపాలుని కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదసాంప్రదాయం ప్రకారం కల్యాణాన్ని జరిపారు. స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయ ఛైర్మన్ పసునూరి పాండు రంగయ్య స్వామి వారికి సమర్పించారు. అనంతరం నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీ గాయత్రి, శ్రీ వేణుగోపాల కోలాట మండలి ఆధ్వర్యంలో మహిళలు వేసిన కోలాటాల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.



భక్తులకు మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు

## శేషవాహనంపై కామాక్షితాయి



ఆకట్టుకుంటున్న విద్యుత్తు దీపాలంకరణ

**నెల్లూరు, న్యూస్‌టుడే :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు ఉదయం తిరుచా ఉత్సవం జరిగింది. తిరుచా పీఠంపై దేవేరులను ఉంచి అనంతరం గ్రామంలో ఊరేగింపు జరిపారు. ఈ ఉత్సవానికి జొన్నవాడకు చెందిన శ్రీశైలం శ్రీనివాసులు ఉభయకర్తగా వ్యవహరించారు. రాత్రి శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంపై దేవేరులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. కార్యక్రమానికి నెల్లూరు నగరానికి చెందిన దివంగత మేనకూరు ఆదిశేషారెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ పాలక మండలి వారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# హరిహరాదులనూ నిద్రపుచ్చే అమ్మ



సృష్టినంతటినీ తన అధీనంలో ఉంచుకొని అదుపుచేసే మాయాశక్తినే యోగనిద్రాదేవి అని అంటారు. యోగనిద్రాదేవిని, ఆమె మహిమను బ్రహ్మదేవుడు స్తుతించి మేలు పొందాడు. ఆ స్తుతులలో దేవి విశేషాలు కనిపిస్తాయి. ఆ విశేషాలన్నీ దేవీభాగవతం ప్రథమ స్కంధం ఏడో అధ్యాయంలో ఉన్నాయి. పూర్వం సృష్టి ప్రారంభంలో లోకేశ్వరేశ్వరుడైన శ్రీమహావిష్ణువు జలార్ణవంలో యోగనిద్రలో ఉన్నాడు. అలా ఆయన అచేతనంగా ఉన్న సమయంలోనే ఆయన నాభికమలం నుంచి బ్రహ్మదేవుడు ఉద్భవించాడు. అంతకుముందే శ్రీమహావిష్ణువు చెవుల నుంచి మధుకైటభులు అనే రాక్షసులు పుట్టుకొచ్చి బ్రహ్మదేవుడిని అంతం చేయాలని రాక్షస సహజ ధోరణిలో మెలగసాగారు. మధుకైటభులను చూసిన బ్రహ్మకు మితిమీరిన భయం కలిగింది. చాలాసేపటి వరకూ ఆ భయంతోనే ఆయనకు ఏం చేయాలో, రాక్షసుల బాధ నుంచి ఎలా తప్పించుకోవాలో అర్థంకాలేదు.

### ఆదిపరాశక్తే సమర్థురాలు

దానికితోడు శ్రీమహావిష్ణువు యోగనిద్రావస్థలో ఉండటం కూడా బ్రహ్మలో మరింత భయాన్ని పెంచింది. కానీ ఆ తర్వాత బ్రహ్మదేవుడు స్థిరబుద్ధితో కాసేపు ఆలోచించాడు. తన బాధలను పోగొట్టడానికి యోగనిద్రాదేవి రూపంలో శ్రీమహావిష్ణువును ఆవహించి ఉన్న ఆదిపరాశక్తి మాత్రమే సమర్థురాలని బ్రహ్మ భావించుకున్నాడు. వెంటనే యోగనిద్రాదేవి రూపంలో ఉన్న ఆ అమ్మ మహిమను ఇలా కీర్తించాడు. బ్రహ్మాండ గోళాలన్నీ సర్వశక్తులకు ఆదిశక్తి అయిన భగవతి చేతి కీలుబొమ్మలే. హరిహరాదులంతా ఆ తల్లికి దాసానుదాసులే. స్థితి కారకుడైన హరి నిద్రావస్థలో అచేతనంగా ఉన్నాడంటే దానికి కారణం ఆ అమ్మే. అంతటి శక్తిసంపన్నుడిని సైతం తన మాయకు లోనుచేసి నిద్రపుచ్చుతోంది ఆ తల్లి. జగాలన్నిటికీ కన్నతల్లి ఆ జగన్మాతేనని వేదాలు స్పష్టం చేస్తున్నాయి. ఎంతో వివేకంతో లోకాలన్నిటినీ పాలించే పురుషోత్తముడే నిద్రావశుడయ్యాడంటే అందుకు కారణమైన యోగనిద్రాదేవి మోహన విలాసలీలలను ఎవరూ అంచనావేయలేరు. సకల ప్రాణుల హృదయాలలోనూ నిండి ఉండే చైతన్యజ్యోతి ఆమె.

### సంధ్యాదేవత కూడా ఆమే...

నిర్గుణాత్మిక అయిన జగన్మాత ప్రతిభాప్రభావాలను ఎంతటి గొప్పవారైనా తెలుసుకోలేరు. సాంఖ్యశాస్త్రం తెలిసిన పండితులు ఆ జగన్మాతను ప్రకృతీ పురుషులలో ఉండే చైతన్యాత్మిక అని ఆ అమ్మను కీర్తిస్తుంటారు. సగుణరూపాలతో అనేక విధాలైన మాయజగన్నాటక సూత్రధారిణిగా ఉండేది జగజ్జనని మాత్రమే. ఆ తల్లి రూపొందించిన కార్యప్రణాళికను ఇంద్రాదిదేవతలు సైతం తెలుసుకోలేరు. యోగనిద్రాదేవిని మునులు సంధ్యాదేవత అని పిలుస్తుంటారు. ఆ మునులు రాత్రింబవళ్లు ఆ సంధ్యాదేవత దివ్యగుణాలను ధ్యానిస్తూ జపిస్తూ ఉంటారు. ఆ సంధ్యాదేవత విజ్ఞాన వినోదలీలలు అనంతాలు. ఆ జగన్మాతే జగాలన్నింటికీ తెలివి, వెలుగును చూపే జ్ఞానరూపం. దేవతలకు నిత్యసుఖాలను ప్రసాదించేది ఆ శ్రీమాతే. సకల ప్రాణులలోని శ్రద్ధ, బుద్ధి, మతి, ధృతి, కీర్తి, శాంతి, రతి ఇవన్నీ జగన్మాతే. ఒక్కమాటలో చెప్పాలంటే లోకాలన్నిటికీ మూలకారణశక్తి ఆ అమ్మే. యజ్ఞాలలో స్వాహా అని అన్నప్పుడు కనిపించే అర్థం జగజ్జనని అనే. యోగమాయ అన్నా, యోగనిద్రాదేవి అన్నా అన్నీ ఆ మాతకు సంబంధించిన పేర్లే. ఆ జగత్కారిణి దయ ఉంటే ఎవరైనా చైతన్యవంతులవుతారు. ఆమె అనుగ్రహం లేకపోతే చైతన్యరాహిత్యం వస్తుంది అని ఇలా అనేక విధాలుగా బ్రహ్మదేవుడు జగజ్జననిని కీర్తించి తనను రక్షించమని వేడుకొన్నాడు. ఆ స్తుతులను ఆలకించిన జగన్మాత బ్రహ్మదేవుడిని కాచికాపాడింది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** పోడూరు మండలం గుమ్మలూరులో నిర్మించిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. విశేష హోమ పూజలను ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయిదు రోజుల పాటు నిర్వహిస్తున్న పాంచాహ్నిక పూజా కార్యక్రమాలను కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామీజీ శిష్యులు చంద్రాభట్ల చింతామణి గణపతిశాస్త్రి, మానేపల్లి రామలింగేశ్వరశర్మ, యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య, శ్రీహరి వెంకట సుబ్రహ్మణ్యం పర్యవేక్షిస్తున్నారు.

## తమలపాకులతో వీరాంజనేయ స్వామికి అర్చన





వీరాంజనేయస్వామికి పాలతో అభిషేకం

**గుంటూరు, న్యూస్‌టుడే:** శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మాతృశ్రీ లక్ష్మీకాంతమ్మ పాలతో శ్రీ వీరాంజనేయస్వామికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకం, అలంకరణ కార్యక్రమం ముగిసిన తర్వాత ఆలయ అర్చకులు లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఒంటె వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

## కాగల కార్యం గంధర్వులు తీర్చారు

చెయ్యాలనుకున్న పని ఎంతో కష్టమైనదైనప్పటికీ దాన్ని ఇంకొకరెవరో చేసి వెళ్లిపోతే వాస్తవంగా ఆ పని చేయవలసిన వారికి ఎంతో ఆనందంగా ఉంటుంది. అలాంటి పరిస్థితులు ఎప్పుడు, ఎక్కడ కనిపించినా ఈ జాతీయం వినిపిస్తుంటుంది. ఇది మహాభారతంలోని ఓ సన్నివేశం ఆధారంగా వాడుకలో కొచ్చింది. రాజభోగాలను అనుభవించాల్సిన పాండవులను కుయుక్తులు పన్ని వనవాసానికి పంపాడు దుర్యోధనుడు. అయినా దుర్యోధనుడి మనసులో పాండవుల మీద అసూయ తగ్గలేదు. దాంతో అడవులలో కష్టాలనుభవిస్తున్న వారి ముందు తన రాజభోగాలన్నిటినీ ప్రదర్శించాలనుకున్నాడు. తన తండ్రి ధృతరాష్ట్రుడికి చెప్పాల్సిన మాయమాటలు చెప్పి తన పరివారాన్నంతటినీ తీసుకొని ద్వైత వనంలో పాండవులు నివాసం ఉంటున్న ప్రదేశానికి సమీపంలో ఉన్న ఒక సరోవరం ఒడ్డుకు చేరాడు. అవతలి ఒడ్డున పాండవులు సాధారణ జీవితం గడుపుతుంటే ఇవతలి ఒడ్డున పాండవులందరికీ కనిపించేలా తన భోగభాగ్యాలను, విలాసాలను అన్నిటినీ ప్రదర్శించసాగాడు దుర్యోధనుడు. అయితే దుర్యోధనుడు విడిది చేసిన ప్రాంతం చిత్రసేనుడు అనే గంధర్వుడికి చెందింది. తన ప్రదేశంలో తన అనుమతి లేకుండా దుర్యోధనుడు సేనాసపరివారంగా దిగటం గంధర్వుడికి కోపం తెప్పించింది. గంధర్వుడికి, కౌరవసేనకు నడుమ భీకరయుద్ధమే జరిగింది. ఆ యుద్ధంలో గంధర్వుల చేతిలో కౌరవులు ఓడిపోయి గంధర్వులకు బందీలయ్యారు. ఆ విషయాన్ని అవతలి ఒడ్డున ఉన్న భీముడు విని దుర్మార్గులైన కౌరవులను తాము జయించాల్సి ఉండగా కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారు అని అన్నాడు. అయితే ధర్మరాజు మాత్రం కౌరవులు ఎన్ని దుర్మార్గాలు చేసినా తమ సోదరులే కనుక వారిని రక్షించుకోవాలనుకున్నాడు. చిత్రసేనుడు అర్జునుడికి స్నేహితుడు. కనుక అర్జునుడిని ఆ గంధర్వుడి దగ్గరకు పంపి దుర్యోధనాదులను విడిపింపచేశాడు. తన భోగాలను ప్రదర్శించి పాండవులను హేళన చేయాలనుకున్న దుర్యోధనుడు అలా చివరకు పాండవుల దయవల్ల బతికి బయటపడి తామే అవమానాలపాలయ్యాడు. భారతంలోని ఈ ఘట్టం ఇలా జాతీయంగా మారింది.

## చిన్న శేష వాహనంపై శ్రీహరి చిద్విలాసం

**తిరుపతి, న్యూస్‌టుడే:** కార్వేటినగరం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం స్వామివారు చిన్నశేష వాహనంపై వైకుంఠనాథుని అవతారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చిన్నశేష వాహనంపై ఆశీనుడైన లోకనాయకుడు తిరువీధుల్లో విహరిస్తూ భక్తుల కర్పూర నీరాజనాలను స్వీకరించారు. బాజా భజంత్రీలు, కోలాటాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి చిన్న శేష వాహన సేవ కన్నుల పండువగా సాగింది. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, మొదటిగంట కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచారుల సమేతుడైన స్వామివారికి పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారీకేళజలం, సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారు... అర్చకులు వింజామరలు వీస్తుండగా ఊంజల్ సేవలో సేద తీరారు.



ఊంజల్ సేవలో సేద తీరుతున్న స్వామివారు

## సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

**వరంగల్, న్యూస్‌టుడే:** హన్మకొండ సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధేశ్వరుడిని పంచబిల్వంతో పాటు నాగలింగ పుష్పాలతో అలంకరించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పంచబిల్వంతో ప్రత్యేకంగా అలంకరించారు.

## రామయ్య సన్నిధిలో అంజన్న భక్తులు



స్నానాలు ఆచరిస్తున్న ఆంజనేయ స్వామి భక్తులు

**ఖమ్మం, న్యూస్‌టుడే:** భద్రాచలం రామాలయానికి వచ్చిన భక్తులతో పట్టణంలోని పలు వీధులు కళకళలాడాయి. అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద నుంచి కరకట్ట మీదుగా స్నానఘట్టాలకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. భజనలు చేసి హనుమాన్ చాలీసా పఠించారు. పవిత్ర గోదావరి తీరంలో ప్రత్యేకంగా తెప్పించిన గుర్రంపై స్వారీ చేసేందుకు ముచ్చటపడ్డారు. నది అవతల ఒడ్డుకు పడవలో వెళ్లి గురుస్వాముల సమక్షంలో పూజలు చేశారు. వీరి కోసం అధికారులు రూ. 10 విలువైన 3లక్షల లడ్డూలను తయారు చేయించారు. ఆరు వేల మహాప్రసాదాన్ని సిద్ధం చేశారు. క్యూలైన్ల ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అన్నదానం రోజుకు 350 మందికి చేస్తుండగా ఈ ఉత్సవాల సందర్భంగా 1000 మందికి అన్న ప్రసాదం అందించేందుకు ఈవో రఘునాథ్ సూచించారు. ఇరుముడులతో వేలాది మంది అంజన్న భక్తులు తరలివస్తుండడంతో భద్రాద్రి క్షేత్రం మరింత పావనమైంది.

# ఆపదనుంచి తప్పించుకోవాలంటే?



ధర్మపథం

మనకంటే బలవంతులు చాలామందే ఉంటారు. అలాంటి బలవంతులలో ఎవరి వల్లనైనా ఆపదవస్తే దాన్ని ఎదుర్కోవడానికి కావలసిన ఆలోచనను కలగ చేసే కథ ఇది. పంచతంత్రం మిత్రభేదంలో ఈ కథ కనిపిస్తుంది. మన శత్రువును ఎదిరించటానికి ఆ శత్రువు కంటే బలమైనవాడు, మనగోడు వినేవాడు ఎవరున్నారా? అని వెతకటంలోనే తెలివితేటలన్నీ ఇమిడిఉంటాయి. ఆ బలవంతుడు మనకు ఆశ్రయం ఇచ్చి అభయమిచ్చి మన శత్రువును మట్టుపెట్టి మనకు కార్యజయం కలిగించేలా ప్రవర్తించాలని ఉదాహరణపూర్వకంగా చెబుతున్న కథ ఇది. పూర్వం ఒక సముద్రం ఒడ్డున ఓ చెట్టు ఉండేది. ఆ చెట్టు మీద తీతువు పిట్ట జంట నివసిస్తుండేది. వాటిలో ఆడతీతువు గుడ్లు పెట్టే సమయం వచ్చింది. దీంతో అది మగతీతువుతో ఇక తాము ఆ చెట్టు మీద నుంచి నివాసాన్ని వేరొక చోటికి మార్చాలని సూచించింది. లేని పక్షంలో రాబోయేది పున్నమికాలం కనుక పౌర్ణమినాడు సముద్రుడు ఉవ్వెత్తున ఎగసి తన అలలతో చెట్టుమీద ఉన్న గూటిలో తాను పెట్టిన గుడ్లను తనలోకి లాక్కుపోయే ప్రమాదముందని విడమరచి చెప్పింది. ఆడతీతువు ఎన్ని రకాలుగా చెప్పినా మగపక్షి ఆ మాటన్నీ పెడచెవిన పెట్టడమే కాక సముద్రుడికి అంతశక్తి లేదని ఒకవేళ అలా చేస్తే తన బలమేంటో, తన శక్తేంటో నిరూపించి సముద్రుడిని జయిస్తానని బీరాలు పలికింది. ఆడపక్షి తానెన్ని చెప్పినా తన భర్త వినిపించుకోని కారణంగా మారు మాటాడకుండా అలానే ఉండిపోయింది.

### పంతానికిపోయిన సముద్రుడు

ఆ ఆడతీతువు ఊహించినట్లుగానే పౌర్ణమి రానే వచ్చింది. మగతీతువు పలికిన బీరాలను విన్న సముద్రుడు కూడా అంతటి చిన్న పక్షి అంత గర్వంగా అంత లెక్కలేనితనంగా తనను గురించి మాట్లాడటం విని అయినా తానలా చేసినప్పుడు మగపక్షి ఏం చేస్తుందో చూద్దామని పంతానికి పోయి తన అలలను చెట్టుమీద దాకా పారించి చెట్టుమీద ఉన్న గుడ్లను తనలోకి లాక్కుపోయాడు. సముద్రుడు అలా గుడ్లను లాక్కువెళ్లిన తర్వాత ఆడపక్షి తానెన్ని చెప్పినా వినిపించుకోని తన భర్తకు తన దుఃఖాన్ని మరోసారి కనబరచింది. అప్పుడా మగతీతువు ఒక్కక్షణం ఆలోచించి తనకొచ్చిన కష్టం నుంచి ఎలా గట్టెక్కాలో ఓ నిర్ణయానికొచ్చింది. వెంటనే తన జాతి పక్షులనందరినీ కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించి తనకేదైనా న్యాయం చేయమని కోరింది. అప్పుడా పక్షులన్నీ కలిసి తమ జాతికంతటికీ ప్రభువైన గరుత్మంతుడిని ఆర్తితో స్తుతించాయి. గరుత్మంతుడు ప్రత్యక్షమై విషయాన్నంతా తెలుసుకొని తనను శరణుచొచ్చిన పక్షులకు అభయమిచ్చి సముద్రుడి దగ్గరకు వెళ్లాడు.

### ఓర్పు, నేర్పు అవసరం

గరుత్మంతుడు సముద్రుడిని పిలిచి ఆడతీతువు పెట్టిన గుడ్లను తెచ్చి ఇవ్వమని, లేనిపక్షంలో సముద్రుడిని పుక్కిటపట్టి తన శక్తేంటో చూపిస్తామని అన్నాడు. సాక్షాత్తు విష్ణుమూర్తికి వాహనుడైన గరుత్మతుడే వచ్చి తీతువు పక్షికి అండగా నిలుస్తాడని ఊహించలేని సముద్రుడు తనలో దాచిన పక్షిగుడ్లను తెచ్చి ఇచ్చాడు. ఈ కథలో సముద్రుడు బలవంతుడు. తీతువులు బలహీనులు. బలహీనులు బలవంతులైన వారి బారిన పడినప్పుడు ఆ కష్టం నుంచి తప్పించుకోవాలంటే, సుఖంగా బతకాలంటే వాస్తవంగా తమకు జరిగిన అన్యాయమేంటో కచ్చితంగా తమ శత్రువు కంటే బలమైన వారికి చెప్పి వారి అనుగ్రహంతో కష్టాన్ని పోగొట్టుకోవచ్చని మగతీతువు వివరించింది. ఓ పద్ధతి ప్రకారం, రుజుమార్గంలో జరిగిన అన్యాయాన్ని పెద్దలందరికీ విడమరిచి చెప్పగలిగిన ఓర్పును, నేర్పును అందరూ కలిగి వుండాలి. శత్రువును ఎదుర్కోవటానికి ఇటువంటి ఆలోచన చేసి తీరాలని అప్పుడే విజయం చేకూరగలదని ఈ కథ సూచిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# ఇక్ష్వాకుని కాలం

జాతీయాలు నుడికారాలు

ఎంతో ప్రాచీన కాలం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఇక్ష్వాకు అనే రాజు జీవించిఉన్న కాలాన్ని ప్రామాణికంగా తీసుకొని ఏర్పడింది ఈ జాతీయం. సూర్యుడికి సంజ్ఞాదేవి వల్ల వైవశ్వతుడు, యముడు అనే కుమారులు, యమున అనే కుమార్తె జన్మించారు. వైవశ్వతుడు మనువుల వరుసలో ఏడో మనువుగా అయ్యాడు. వైవశ్వత మన్వంతరం ఆయన పేరు మీదే వచ్చింది. ఈయననే శ్రద్ధదేవుడు అని కూడా అంటారు. ఈయన భార్య పేరు శ్రద్ధాదేవి. ఈ దంపతులకు తొమ్మిదిమంది బిడ్డలు కలిగారు. వారిలో పెద్దవాడి పేరు ఇక్ష్వాకు. శ్రీరామచంద్రుడి వంశానికి ఈయనే మూలపురుషుడు. ఈ ఇక్ష్వాకు అంత పురాతన కాలానికి చెందినవాడు. ఆ భావనతోనే ఎంతో పాతకాలం నాటిది అని చెప్పాల్సి వచ్చినప్పుడు అది ఇక్ష్వాకుకాలంనాటిది అని అనటం కనిపిస్తుంది.

# గరుడ వాహనంపై కల్యాణ శ్రీనివాసుడు



**మంగళగిరి(గుంటూరు జిల్లా), న్యూస్‌టుడే:** బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి శుక్రవారం ఉదయం గరుడవానంపై ఊరేగారు. పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఉపాలయంగా ఉన్న శ్రీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామిని ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గరుడోత్సవంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. దేవస్థానం ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఉత్సవం సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారికి హారతులు పట్టారు. ఉభయదేవేరులతో శ్రీవెంకటేశ్వరస్వామి పురవీధుల్లో ఊరేగారు. ఉత్సవ మూర్తులను గాలిగోపురం ముందు నుంచి ప్రధానవీధిలో శ్రీఆంజనేయస్వామి మిద్దె కూడలి వరకు ఊరేగించారు. పురవీధుల్లో భక్తులు శ్రీవారికి హారతులు పట్టారు. ఉత్సవ కైంకర్య పరులుగా తోట రమణయ్య దంపతులు వ్యవహరించారు.

### రాజాధిరాజ వాహనంపై ఏడుకొండల వాడు

బ్రహ్మోత్సవాల ముగింపు వేళ శ్రీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి శుక్రవారం రాత్రి రాజాధిరాజ వాహనంపై ఊరేగారు. పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయదేవేరులతో స్వామివారు పట్టణ ప్రజలకు దర్శనమిచ్చారు.



నగరంలో హనుమాన్ శోభా యాత్ర

# జై హనుమాన్..!

కొండగట్టులో అంజన్న జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పలు జిల్లాల నుంచి తరలివచ్చిన దీక్షాపరులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారిని కనులారా దర్శించుకొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కరీంనగర్‌లో హనుమాన్ శక్తి శోభాయాత్రలో వందలాదిమంది యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యూస్‌టుడే, కరీంనగర్



కాలినడకన కొండగట్టుకు..

ఆంధ్రావని

# వైభవంగా దుర్గా నవశక్తి చండీయాగం



హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు దంపతులు

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** ఆదిలాబాద్ మండలం మావల గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గానగర్ దుర్గా నవశక్తి ఆలయంలో శుక్రవారం నవశక్తి చండీయాగం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారి విగ్రహానికి అభిషేకం, గణపతి, లక్ష్మిపూజ, కలశపూజ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు కిషన్ మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన చండీయాగంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్‌బాపూరావు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ వచ్చి దుర్గమ్మతల్లికి పూజలు చేశారు. తెలంగాణ ప్రజలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈపూజల్లో పాల్గొన్నట్లు వారు వివరించారు. అనంతరం మహిళలచే కుంకుమార్చన నిర్వహించగా, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు తెరాస నాయకులు, కార్యకర్తలతో పాటు పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

# కామాక్షితాయికి సింహవాహన ఉత్సవం

**బుచ్చిరెడ్డిపాలెం(నెల్లూరు జిల్లా), న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. శ్రీ మల్లికార్జునస్వామి కామాక్షితాయి వార్ల దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు శుక్రవారం రాత్రి సింహ వాహనంపై గ్రామంలో ఊరేగారు. సర్వాలంకారభూషిత సింహ వాహనంపై దేవేరులు ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకార మహోత్సవానికి ఉభయకర్తలుగా జొన్నవాడకు చెందిన కందికట్టు శివకుమార్, కందికట్టు సుబ్బారావు, కందికట్టు వెంకటరమణయ్య, కందికట్టు కామేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కళాకారుల ప్రదర్శనలు, దేవతా వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉదయం ఆలయం వద్ద స్వామి అమ్మవార్లు తిరుచా ఉత్సవం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీశైలం రామమూర్తి ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేసిన ఏర్పాట్లను ఆలయ పాలకమండలి ఛైర్మన్ ఆల్తూరు చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.



సింహ వాహనంపై కామాక్షితాయి

# వైభవంగా హనుమజ్జయంతి

**హనుమాన్‌జంక్షన్(కృష్ణా జిల్లా), న్యూస్‌టుడే:** హనుమజ్జయంతిని భక్తులు ఎండ వేడిమిని లెక్క చేయకుండా ఉత్సాహంతో జరిపారు. ఉదయం ఆరుగంటల నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద బారులుతీరారు. భక్తుల రద్దీ మిట్టమధ్యాహ్నం వరకూ కొనసాగింది. తెల్లవారుజామునే స్వామికి క్షీరాభిషేకం చేసి వేదపారాయణంతో ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఉత్సవ మండపంలో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారి లడ్డూల వేలం పాట జరిగింది. ఇరవై కిలోల లడ్డూను ఏలూరుకు చెందిన శివకుమార్‌రెడ్డి అనే భక్తుడు రూ.20,000కు తన ప్రతినిధుల ద్వారా పాడి దక్కించుకోగా, 15 కిలోల లడ్డూను పెరికీడుకు చెందిన బొత్స సురేష్ రూ.5316కు దక్కించుకున్నారు. సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభమైన స్వామి వారి ఊరేగింపు, గ్రామోత్సవం రాత్రి పొద్దుపోయేవరకూ కొనసాగాయి. దెందులూరు శాసన సభ్యుడు చింతమనేని ప్రభాకరరావు, పశ్చిమ గోదావరి జిల్లా జడ్జి వి.శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా జడ్జి వెంకట భూషణరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి తదితరులు కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. అలాగే బాపులపాడు భక్తాంజనేయస్వామి దేవాలయంలో మహిళా భక్తులు 40 సార్లు హనుమాన్‌చాలీసాను పారాయణం చేశారు. నూజివీడు రైల్వేగేటు వద్దనున్న భక్తాంజనేయస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ఆకు పూజ, సింధూరార్చన నిర్వహించారు.



# సృష్టి కాల విభజన జరిగిందిలా..



**సృ**ష్టి అనేది అంతా ఒకటేనా? దీనిలో మరేమైనా భేదాలున్నాయా? కాల విభాగం ఎలాంటిది? అనే విషయాలను గురించి ఈ కథాసందర్భం వివరిస్తుంది. సృష్టి తొమ్మిది రకాలు. వాటిలో ప్రాకృతాలు, వైకృతాలు అని మరో రెండు రకాలున్నాయి. అవి కాల, ద్రవ్య, గుణ భేదాలతో ప్రతి సంక్రమాలు అవుతుంటాయి. మహత్వం అనేది మొదటి సృష్టి. అది నారాయణ శక్తి వల్ల గుణవైషమ్యాన్ని పొందుతుంది. ద్రవ్య, జ్ఞాన క్రియాత్మకమైన అహంకారతత్త్వం రెండో సృష్టి. శబ్ద, స్పర్శ, ద్రవ్యశక్తితో కూడిన పృథివి తదితర పంచభూతాల సృష్టి మూడోది. త్వక్కు, చక్షుస్సు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం అనే అయిదు జ్ఞానేంద్రియాలు, వాక్కు, పాణి, పాద, పాయ, ఉపస్థ అనే అయిదు కర్మేంద్రియాలు నాలుగో సృష్టి. సాత్విక అహంకారంవల్ల పుట్టిన దేవతాగణం అయిదో సృష్టి. ఇది మనోమయమై ఉంటుంది. జీవలోకానికి అబుద్ధి వల్ల, ఆవరణలను కలిగించే తామసం ఆరో సృష్టి.

### తొమ్మిదో సృష్టిలో మానవులు

ఓషధులు, లతలు, వెదుళ్లు, దుంపలు, మామిడి లాంటి వృక్షాలు ఏడో సృష్టి. ఎనిమిదో సృష్టి ఇరవైఎనిమిది భేదాలతో ఉంటుంది. జ్ఞానశూన్యాలై చీలిన గిట్టలుగల ఎద్దులు, ఆవులు, దున్నలు, మేకలు, పందులు, ఒంటెలు లాంటివి చీలని గిట్టలుగల గుర్రాలు, గాడిదలు, శరభాలు, చమరీ మృగాలు, అయిదేసి గోళ్లు గల కుక్క, నక్క, తోడేలు, పిల్లి, పులి, కుందేలు, సింహం, కోతి, ఏనుగు లాంటివి, మొసలి తదితర జలచరాలు, గద్ద, డేగ, నెమలి, హంస, చక్రవాకం, కాకి, గుడ్లగూబ తదితర పక్షులు ఎనిమిదో సృష్టిలోకి వస్తాయి. ఇక తొమ్మిదో సృష్టి మానవ సృష్టి. అది రజోగుణ ప్రేరితమై ఉంటుంది. దేవవర్గం ఎనిమిది విధాలుగా చెబుతారు. వాటిలో విబుధులు, పితృదేవతలు, దేవతలు అని మరో మూడు భేదాలు.

ధర్మపథం

గంధర్వులు, అప్సరసలు ఒక తెగ. యక్షులు, రాక్షసులు ఒక తెగ. భూత, ప్రేత పిశాచాలు ఇంకో తెగ. సిద్ధ, చారణ విద్యాధరులు మరొక తెగ. కిన్నర, కింపురుషులు ఇంకోతెగ. ఇటువంటివి మొత్తం ఎనిమిది రకాలుంటాయి. కల్పాంతంలో ఇలాగే అమోఘ సంకల్పుడైన శ్రీహరి రజోగుణంతో కూడి తానే సృష్టికర్త అవుతూ స్వస్వరూపంతో విశ్వాన్ని సృష్టించాడు. ఆయన మాయచేతనే సృష్టిలోనిది ఏదీ అర్థం కాకుండా ఉంటుంది. దేవసృష్టిలోనిదే కౌమార సృష్టి. అది ప్రాకృత, వైకృత ఉభయాత్మకంగా ఉంటుంది. సృష్టి అనేది దైవం ఒక్కసారిగా అన్నిటినీ అలా ఏర్పరిచింది కాదని, అంతర్గతంగా కొన్ని కొన్ని భేదాలు సృష్టిలో ఉన్నాయని, తొమ్మిది రకాలుగా ఈ సృష్టి విభాగాలు కనిపిస్తున్నాయని మహాభాగవతం మూడో స్కంధం మనకు వివరిస్తోంది.

### సూక్ష్మమైన కాలం ప్రసరేణువు

సృష్టి ఇలా జరిగాక కాలం ఏవిధంగా విభజన పొంది ఉందో కూడా ఈ సందర్భంలోనే కనిపిస్తుంది. ప్రసరేణువు ఆరోభాగమే పరమాణువు. అదే సూక్ష్మకాలం. సూర్యమండలం లోకంలో పన్నెండు రాశులలో చరిస్తూ ఉండే సమయాన్ని ఒక సంవత్సర కాలంగా చెబుతారు. రెండు పరమాణువులు చేరికే ఒక అణువు అవుతుంది. మూడు అణువులు ఒక ప్రసరేణువు. మూడు ప్రసరేణువులు ఒక్క త్రుటి. నూరుత్రుటులు ఒక వేధ. మూడు వేధలు ఒక లవం. మూడు లవాలు ఒక నిమేషం. మూడు నిమేషాలు ఒక క్షణం. అయిదు క్షణాలు ఒక కాష్ఠ. పది కాష్ఠలు ఒక్క లఘువు. పదిహేను లఘువులు ఒక నాడి. రెండునాడులు ఒక ముహూర్తం. ఆ నాడులు ఆరైనా, ఏడైనా మనుషులకు ఒక ప్రహరమవుతుంది. దాన్నే యామం అని కూడా అంటారు. నాలుగు యామాలు ఒక్క పగలు. అలాగే మరో నాలుగు యామాలు ఒక రాత్రి. ఈ రాత్రింబవళ్లు కలిసి ఒక రోజవుతుంది. అలాంటి పదిహేను రోజులు ఒక పక్షం. శుక్లపక్షం, కృష్ణపక్షం అని పక్షాలు రెండు. ఆ రెండు పక్షాలు గడిస్తే ఒక మాసం అవుతుంది. ఆ మాసం పితృదేవతలకు ఒక రోజు. రెండు మాసాలు ఒక రుతువు. ఆరు మాసాల కాలం ఒక్క అయనం. ఉత్తరాయనం, దక్షిణాయనం అని అయనాలు రెండు. ఈ రెండు అయనాలు కలిసి పన్నెండు మాసాలు. ఇదే ఒక సంవత్సరమవుతుంది. ఈ సంవత్సరం పితృదేవతలకు ఒక రోజు అవుతుంది. నూరు సంవత్సరాలు మనుషులకు ఆయుఃప్రమాణం. ఈ మాసాలు సౌరం, బార్హస్పత్యం, సావనం, చాంద్రం, నాక్షత్రం అనేవిగా ఉంటాయి. కాలమానం సంవత్సరం, సరీవత్సరం, ఇడావత్సరం, అనుత్సరం, వత్సరం అనే భేదాలతో ఉంటుంది. ఇలా నవవిధ సృష్టులు, అనంతరం జీవులు గడపాల్సిన కాల పరిధులను గురించి భాగవతం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## తలబొప్పి కట్టడం..

**త**లచింది జరక్కపోగా కష్టాల పాలుకావటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఎక్కడికైనా వెళుతున్నప్పుడు లేదా మరేదైనా పనిచేస్తున్నప్పుడు తలకు ఏ వస్తువైనా తగిలి బొప్పి కడితే బాధపడుతూ ఆ మనిషి అక్కడే కాసింతసేపైనా ఆగిపోవటం జరుగుతుంటుంది. ఈ భావన ఆధారంగానే ఈ జాతీయం ఆవిర్భవించింది. 'ప్రతిపక్షం వారు వేసిన ప్రశ్నలతో ప్రభుత్వానికి బొప్పి కట్టింది' అనేలాంటి ప్రయోగాలు ఉన్నాయి.

జాతీయాలు నుడికారాలు



మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు

## ఓదెల మల్లన్న జాతరలో భక్తుల సందడి

**కరీంనగర్, న్యూస్‌టుడే:** ఓదెల మల్లన్న ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వేసవి ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువగా ఉండటంతో భక్తులు ఆలయ ఆవరణలో, చుట్టు పక్కల వ్యవసాయ క్షేత్రాల్లో చెట్లకింద సేద తీరారు. వ్యవసాయ బావుల వద్దకు పుణ్యస్నానాల కోసం భక్తులు పరుగులు తీయాల్సిన పరిస్థితి తలెత్తింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఒగ్గు పూజారుల పట్నాలు, బోనాలు కోడె మొక్కులతో మల్లన్నను దర్శించుకుని తరించారు. క్యూలైనులో భక్తులు కిక్కిరిసి ఉక్కపోతతో ఇబ్బందికి గురయ్యారు. తాగునీటికి, తగినన్ని వసతీగృహాలు లేక భక్తులకు కష్టాలు తప్పలేదు. భక్తుల రద్దీ నేపథ్యంలో అధికారులు ఆలయంలో ఇబ్బందులు తలెత్తకుండా మరిన్ని సౌకర్యాలు కల్పించాలని యాత్రికులు కోరుతున్నారు.

## నేత్రపర్వం.. వేణుగోపాలుడి గరుడోత్సవం



**కార్వేటినగరం(చిత్తూరు జిల్లా), న్యూస్‌టుడే:** అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన వేణుగోపాలస్వామి గరుడ వాహనసేవ నేత్రపర్వంగా జరిగింది. కార్వేటినగరంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజైన ఆదివారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై విహరించారు. దేవదేవుడైన స్వామివారు శ్రీహరి అవతారంలో సహస్ర లక్ష్మీకంఠీరవ హారాన్ని ధరించి వైనతేయునిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారి గరుడ వాహనసేవ ఆద్యంతం రమణీయంగా సాగింది. గరుడసేవను తిలకించడానికి భక్తులు వేలాది సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం ఆలయంలో స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన, మొదటిగంట, బలిహరణం, సాత్తుమొర, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు.

**సమ్మోహనం.. మోహినీ అవతారం:** వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో భక్తులను సమ్మోహితులను చేశారు. మోహినీ రూపంలో సర్వాలంకార భూషితుడైన మువ్వల గోపాలుడు ముఖారవిందాన్ని దర్పణంలో తిలకిస్తూ బోయలు పల్లకిని మోస్తుండగా తిరువీధుల్లో విహరించారు. భక్తుల కర్పూరనీరాజనాలను అందుకుంటూ, వారిని ఆశీర్వదిస్తూ తిరుగు పయనమై ఆలయానికి చేరుకున్నారు. తిరువీధుల ఉత్సవం అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, హరిద్రం, చందనం, నారికేళజలం, సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం అర్చకులు వింజామరలు వీస్తుండగా స్వామివారు ఊంజల్ సేవలో సేదతీరారు. రాత్రి తిరువీధుల ఉత్సవం అనంతరం ఆలయానికి చేరుకున్న వేణుగోపాలుడు ఏకాంతసేవలో పవళించారు.

# అలరించిన అర్జునుడి తపస్సు

ఆంధ్రావని

**బంగారుపాళ్యం(చిత్తూరు జిల్లా), న్యూస్‌టుడే :** మండలంలోని మిట్టపల్లె వద్ద ఉన్న ధర్మరాజుల ఆలయం వద్ద మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం అర్జునుడు తపస్సు కనువిందుగా జరిగింది. అర్జునుడు భారత యుద్ధంలో కర్ణుణ్ని వధించేందుకు పాశుపతాస్త్రం కోసం తపస్సు చేస్తాడు. ఇందులో భాగంగా నాటకంలో అర్జునుడి తపస్సు ఘట్టం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అర్జునుడు తపస్సు మాను అధిరోహిస్తాడు. సంతానం లేని మహిళలు తపస్సు మాను వద్ద తడిదుస్తులతో వరపడితే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. కొందరు మహిళలు సంతానం కోసం తపస్సుమాను వద్ద వరపడ్డారు. అర్జునుడు తపస్సుమాను అధిరోహించి, అక్కడి నుంచి భక్తులకు పువ్వులు, పండ్లు, బొరుగులను చల్లడం ఆనవాయితీ. వీటిని దక్కించుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. మండలంలోని పలుగ్రామాలకు చెందిన భక్తులు అర్జునుడి తపస్సును తిలకించేందుకు తరలివచ్చారు. ధర్మరాజుల ఆలయ కమిటీ సభ్యులు రామయ్య, కన్నయ్య, సుబ్బయ్య, కోడిచంద్రయ్య, మహేంద్ర తదితరులు భక్తులకు తగిన వసతులను కల్పించారు.





తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి, తపస్సుమాను ఉత్సవానికి హాజరైన భక్తులు

## గుట్టలో కోలాహలం

**యాదగిరిగుట్ట(నల్గొండ జిల్లా), న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్త జనులతో ఆలయ వీధులు సందడి మారి, షెడ్లు నిండిపోయాయి. భక్తులు చేపట్టిన పూజలతో మండపాలలో కోలాహలం నెలకొంది. పుష్కరిణిలో భక్తుల పుణ్యస్నానాలకు ఆటంకం కలిగింది. దైవదర్శనం కోసం భక్తులు గంటల కొద్దీ షెడ్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ప్రత్యేక దర్శన భక్తులతో ధర్మదర్శనం కోసం వేచి ఉన్న భక్తులు ఆయాసానికి లోనయ్యారు. దర్శన క్యూషెడ్లలో భక్తులతో గజిబిజీ వాతావరణం ఏర్పడింది. జంట నగరాలకు చెందిన యాత్రీకుల రాకతో పట్టణ వీధులు సందడిగా మారాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. శనివారం నుంచే భక్తులతో రద్దీ ఏర్పడి బస ఇక్కట్లు నెలకొన్నాయి.

## ఘనంగా బండ్ల ఊరేగింపు

**రామాయంపేట(మెదక్ జిల్లా), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ దేవి ఆలయ ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజైన శనివారం ముదిరాజ్ సంఘం సభ్యులు చిన్నాపెద్దా కలిసి బండ్ల ఊరేగింపులో పాల్గొన్నారు. కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, రంగురంగుల వస్త్రాలతో బండ్లను అలంకరించారు. ఎడ్ల కాళ్లకు గజ్జెలు, మెడలో గంటలు కట్టి డప్పు చప్పుళ్ల మధ్య నయనానందకరంగా ఈ ఊరేగింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో యువకులు నృత్యాలు చేస్తూ బండ్ల వెంట పరుగులు తీశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



# కృష్ణుడు విహరించిన పన్నెండు వనాలు



శ్రీకృష్ణుడి విహారమనగానే అందరికీ గుర్తొచ్చేది ఒక్క బృందావనమే. కానీ కృష్ణుడు మొత్తం పన్నెండు వనాలలో గోపికలతో విహరించాడు. ఆ వనాలన్నీ ఎక్కడున్నాయి? ఆ వనప్రాంతాలలో ఉన్న తీర్థాల మహిమ ఎలాంటిది? అనే విషయాలను వివరించే కథాసందర్భం ఇది. ఇది నారద పురాణం ఉత్తరభాగం డెబ్భైతొమ్మిదో అధ్యాయంలో ఉన్న విషయం. మధుర పరిసర ప్రాంతాలలో పన్నెండు అద్భుత వనాలున్నాయి. భగవానుడైన శ్రీహరి ధర్మసంస్థాపన కోసం మధురలో జన్మించాడు. అక్కడి నుంచి నందగోకులానికి చేరాడు. అక్కడ కొంతకాలంపాటు నివసించి గోపబాలకులతో హాయిగా ఆడుకున్నాడు. కంసుడు పంపిన పూతన తదితర భయంకరమైన రాక్షసులను పసితనంలోనే సంహరించాడు. మరికొంత వయసు పెరిగాక అక్కడికి సమీపంలో ఉన్న ద్వాదశ వనాలలో గోపికలతో విహరించాడు.

### మహా మహిమాన్వితమైనది బృందావనం

ద్వాదశవనాలలో మొదటి వనం పేరు మధువనం. మధువనం మొదలుకొని బృందావనం దాకా ఉన్న పన్నెండు వనాలన్నీ యమునా తీరంలో విరాజిల్లుతుంటాయి. ఆ తీరప్రాంతంలోని ఒక్కొక్క వనంలో ఒక్కో ప్రత్యేకమైన తీర్థం కూడా ఉంది. మధువనంలో ఉన్న తీర్థంలో స్నానం చేసి పితరులకు, దేవతలకు తర్పణం ఇవ్వాలి. అలా ఇచ్చినవారు విష్ణులోక నివాస అర్హతను పొందుతారు. రెండో వనం పేరు తాలవనం. ఇక్కడ స్నానం చేసినవారు కోరిన కోర్కెలను పొందడంలో కృతకృత్యులవుతారు. మూడోదైన కుముద వనంలో స్నానం చేసినవారు కోరిన కోర్కెలను పొందటమే కాక ఇహపర ఆనందాన్ని అనుభవిస్తారు. నాలుగోది కామ్య వనం. ఇక్కడికి వెళ్లినవారు విష్ణులోక అర్హతను పొందుతారు. ఈ వనంలో చాలా తీర్థాలున్నాయి. ఆ తీర్థాలన్నిటిలోకి విమల కుండం అనేది ఉత్తమోత్తమం. ఇక్కడ స్నానం చేసినవారు విష్ణుపదాన్ని పొందుతారు. అయిదో వనం పేరు బహులావనం. ఇక్కడ స్నానం చేస్తే సర్వాభీష్టాలు సిద్ధిస్తాయి. ఆరోది భద్రవనం. ఇక్కడి స్నానంవల్ల శ్రీకృష్ణుడి అనుగ్రహంతోపాటు సర్వశుభాలు ప్రాప్తిస్తాయి. ఏడో వనం పేరు ఖాదిర వనం. ఇక్కడ స్నానం చేస్తే చాలు సులభంగా పరమపద ప్రాప్తి కలుగుతుంది. ఎనిమిదోది మహావనం. ఈ వనమంటే శ్రీహరికి బాగా ఇష్టం. భక్తితో ఈ వనాన్ని చూస్తే చాలూ ఇంద్రలోక ప్రాప్తికి అర్హత లభిస్తుంది. తొమ్మిదో వనం పేరు లోహజంఘవనం. ఇక్కడ చేసే స్నానం వల్ల భుక్తిముక్తులు కలుగుతాయి. పదోది బిల్వవనం. ఇక్కడ స్నానం చేసినవారికి శైవులైతే శివలోకం, వైష్ణవులైతే విష్ణులోకం ఇలా ఏ దేవత భక్తులైతే ఆ దేవతలుండే లోకం ప్రాప్తిస్తుంది. పదకొండో వనం పేరు ఖాండీరవనం. ఇక్కడ స్నానం సర్వపాపాలను పోగొడుతుంది. పన్నెండో వనమే బృందావనం. అన్ని వనాలలోకి మహామహిమాన్వితమైన వనమిది.

### పుష్కరాల్లో మరింత పుణ్యఫలం

బృందావనంలో స్నానం చేసి దేవ, రుషి, పితృతర్పణం చేసినవారు రుణత్రయ విముక్తులవుతారు. విష్ణులోక నివాస అర్హత వారికి లభిస్తుంది. ఈ పన్నెండు వనాలు మధురా మండలంలో ఉన్నాయి. మధుర ఇరవైఒక్క యోజనాల విస్తీర్ణంలో ఉంది. మధుర పరిధిలోని ప్రతి తీర్థమూ ప్రవిత్రమైనదే. ఆ తీర్థాలలో ఏ ఒక్క దానిలో స్నానం చేసినా విష్ణుభక్తి సిద్ధిస్తుంది. మధురా మండలం మధ్య భాగంలో మధురా నగరం విరాజిల్లుతుంటుంది. ఈ నగర దర్శనం వల్ల మాధవభక్తి కలుగుతుంది. ఇక్కడే విశ్రాంతి అనే తీర్థం ఉంది. ఆ తీర్థంలో భక్తితో స్నానం చేసినవారు విష్ణుపదాన్ని పొందుతారు. విశ్రాంతికి సమీపంలోనే దక్షిణ భాగంలో విముక్తం అనే ఉత్తమ తీర్థం ఉంది. ఇక్కడ చేసే స్నానం వల్ల ముక్తి లభిస్తుంది. విముక్తానికి దక్షిణ భాగంలో ఉన్న రామతీర్థంలో చేసేస్నానం వల్ల అజ్ఞానబంధాలు విడిపోతాయి. రామతీర్థానికి దక్షిణంలో ఉన్న సంసారమోక్షణ తీర్థంలో చేసే స్నానం వల్ల సంసార విముక్తి కలిగి విష్ణులోకం ప్రాప్తిస్తుంది. ఇక్కడికి దక్షిణ దిక్కున ఉన్న ప్రయాగ తీర్థం మహా మహిమాన్వితం. అలాగే కనకల తీర్థం, సటు స్వామి తీర్థం, ధ్రువతీర్థం, సప్తర్షిసేవిత తీర్థం లాంటివి ఒకదానికి ఒకటి దక్షిణ దిక్కుగా ఉన్నాయి. ఎంతో మహిమాన్వితమైన తీర్థాలు ఇవన్నీ. సప్తర్షిసేవిత తీర్థానికి దక్షిణంలో మోక్షతీర్థం ఉంది. దానికి దక్షిణ భాగంలో బోధినీ తీర్థం, దానికి దక్షిణ భాగంలో కోటి తీర్థం ఉన్నాయి. ఇలా మధుర ప్రాంతమంతా పవిత్రమైన పన్నెండు వనాలు, ఆ వనప్రాంతాలలోని పవిత్ర తీర్థాలతో విరాజిల్లుతుంటుంది. ధర్మసంరక్షణ కోసం బ్రహ్మ ప్రార్థనను మన్నించి వైకుంఠవాసుడు కృష్ణుడిగా అవతరించి ఈ ప్రాంతాలలో సంచరించినందువల్లనే వాటికంతటి పవిత్రత లభించిందని నారద పురాణం పేర్కొంటోంది. మధురప్రాంతంలో ఉన్నట్టు నారద పురాణం చెబుతున్న తీర్థాల పేర్లు కాలక్రమంలో కొన్ని మారి ఉండవచ్చు. వాటి ఉనికిని గురించి పరిశోధకులు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ఇవన్నీ ఎలా ఉన్నా ఈ తీర్థాలన్నీ యమునాతీర ప్రాంతంలో ఉన్నాయి కనుక యమునా నదికి పుష్కరాలొచ్చినప్పుడు ఈ తీర్థాలతోపాటు మొత్తం మూడున్నరకోట్ల పుణ్యతీర్థాలన్నీ వచ్చి పన్నెండు రోజులపాటు యమునలో ఉంటాయి. ఆ సమయంలో చేసే స్నానదానాదులకు పుణ్యఫలం మరింత ఎక్కువగా ఉంటుందని పెద్దలు పేర్కొంటున్నారు.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు

## 'రాకురో ఘోరొ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న ఎండ్లూరి సుధాకర్, మహీధర రామశాస్త్రి

**రాజమండ్రి , తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** బహుభాషావేత్త మహీధర రామశాస్త్రి ఒరియా నుంచీ తెలుగులోకి అనువదించిన కిశోర్ చరణ్‌దాస్ రచించిన 'రాకురో ఘోరొ' కథా సంకలనాన్ని బొమ్మూరు తెలుగు విశ్వవిద్యాలయం పీఠాధిపతి ఎండ్లూరి సుధాకర్ ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి మాట్లాడుతూ మౌలిక రచన కంటే అనువాదం కష్టతరమైందని, మూల భాషకు సంబంధించిన సంప్రదాయాలు, జీవనరీతులు ఎలాంటి మార్పులేకుండా రచించటం గొప్పవిషయమన్నారు.

## శ్రీశైలంలో భక్తుల రద్దీ

**కర్నూలు, న్యూస్‌టుడే:** శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఈ మేరకు దేవస్థానం అధికారులు తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి సుప్రభాతసేవ, మహామంగళహారతి జరిపి 5.30 నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు శ్రీమల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

## మహిళామణులకు త్రిపురసుందరి పురస్కారాలు



త్రిపురసుందరి పురస్కార గ్రహీతలతో చక్రపాణి, అతిథులు తదితరులు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** కళాలలిత త్రిపురసుందరి జయంతి సభను సోమవారం త్యాగరాయగాన సభ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయా రంగాల నుంచి ఎంపిక చేసిన ఎనిమిది మంది మహిళామణులకు కళాలలిత త్రిపుర సుందరి స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. సినీ నేపథ్యగాయని రావు బాలసరస్వతీదేవి, రచయిత్రి కేవీ కృష్ణకుమారి, ఆధ్యాత్మిక వక్త ఎం.ఉమాదేవి, రంగస్థల నటి జమునారాయలు, నాట్యాచారిణి మద్దాళి ఉషాగాయత్రి, పాత్రికేయురాలు కేబీ లక్ష్మి, సాంస్కృతిక సంస్థ నిర్వాహకురాలు వీఎస్ రాజ్యలక్ష్మి, సంఘసేవిక అద్దంకి రేణుకలు పురస్కారాలు స్వీకరించారు. ముఖ్యఅతిథి రాష్ట్ర శాసనమండలి అధ్యక్షులు ఎ.చక్రపాణి పురస్కార గ్రహీతలను సత్కరించి అభినందించారు. పోతుకూచి సాంబశివరావు అధ్యక్షోపన్యాసం చేశారు. ముదిగొండ శివప్రసాద్, కళాదీక్షితులు, కళాశారద, నర్సింహాచార్య తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల పాత్ర చిరస్మరణీయం

### నటి రత్నకుమారికి సావిత్రి పురస్కారం

**గుంటూరు, న్యూస్‌టుడే :** ప్రజలను చైతన్యవంతులను చేయడంలో నాటకం, దానిని పండించే కళాకారుల పాత్ర చిరస్మరణీయమైనవని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు పులి సాంబశివరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ ఎంప్లాయీస్ కళాపరిషత్, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాల ముగింపు సభ సోమవారం రాత్రి స్థానిక రామలింగేశ్వర పేటలోని పురపాలక బహిరంగ కళావేదికపై జరిగింది. ఈ సభలో మహానటి సావిత్రి జీవన సాఫల్య పురస్కారాన్ని ఒంగోలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటి యం.రత్నకుమారికి ప్రదానం చేశారు. కామ్రేడ్ గరికపాటి రాజారావు పేరుతో ఏర్పాటు చేసిన కళాప్రాంగణంలో నిర్వహించిన ఈ సభకు పులి సాంబశివరావు అధ్యక్షత వహించి ఉపన్యసించారు. కళాకారులు జనజీవనాన్ని ప్రతిబింబించే నిరంతర చైతన్యమూర్తులన్నారు. ప్రజల కోసం ప్రదర్శించే కళారూపాలు సజీవంగా మిగులుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తన ప్రస్థానంలో నిర్వహించిన కళారూపాలే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చన్నారు. మహానటి సావిత్రి పురస్కారాన్ని అందుకొన్న రత్నకుమారిని అభినందించారు. సినీ నిర్మాత దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాటకాన్ని సజీవంగా నిలిపేందుకు తెనాలిలో కళాపరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పురస్కార గ్రహీత రత్నకుమారి స్పందనను తెలియజేస్తూ అవార్డు అందుకోవడం మరచిపోలేని జ్ఞాపకంగా మిగులుతుందన్నారు. మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ తోటకూర వెంకట రమణారావు, పరిషత్ ప్రధాన కార్యదర్శి బి.వి.రావు, దాది సూరయ్య తదితరులు మాట్లాడారు. కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు బి.కిరణ్ కుమార్, వి.శ్రీరామమూర్తి పర్యవేక్షించారు. అనంతరం పెదకాకాని గంగోత్రి కళాకారులు 'డొక్కా సీతమ్మ' నాటకం ప్రదర్శించారు. యస్.పినాకపాణి రచించిన ఈ నాటకానికి నాయుడుగోపి దర్శకత్వం వహించారు.



రత్నకుమారికి మహానటి సావిత్రి పురస్కారాన్ని అందజేస్తున్న సినీ నిర్మాత దాసరి కిరణ్ కుమార్, పులి సాంబశివరావు

## వానాకాలపు చదువు

సరిగా సాగని చదువు అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. పూర్వకాలం గురుకుల వ్యవస్థలో చెట్ల కింద చదువులు సాగుతుండేవి. అలాంటిప్పుడు ఏ కొద్ది వాన జల్లు పడ్డా ఆ పూట చదువుకోవటానికి ఇబ్బందయ్యేది. దీనికి తోడు మబ్బు పట్టి సూర్యుడు కనిపించని రోజును అనధ్యయన దినం అని అంటూ ఆ రోజున చదువుసాగేది కాదు. వర్షాకాలంలో చదువుకోవటానికి ఇంతకు ముందు రోజుల్లో ఇన్ని అడ్డంకులుండేవి. ఆ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈనాడు కూడా సరిగా చదువు సాగకపోయినా, సరిగా చదువుకోకపోయినా అలాంటి చదువును వానాకాలపు చదువు అని అనటం కనిపిస్తుంది.

## రాజన్న సన్నిధిలో భక్తుల సందడి

**కరీంనగర్, న్యూస్‌టుడే:** దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని సోమవారం దాదాపు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి కోడె మొక్కులు చెల్లించారు. స్వామివారికి అభిషేకాలు, అన్నపూజ జరిపించి భక్తి ప్రపత్తిని చాటారు. ఒక్కరోజే ఆలయానికి రూ.19 లక్షల ఆదాయం సమకూరింది. రాజన్నకు వరంగల్ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం ఆలయ మంటపంలో అర్చకులు ఆశీర్వచనం పలికి ప్రసాదం అందజేశారు.



భక్తులతో రద్దీగా ఉన్న ఆలయ ఆవరణ

# పుణ్యతీర్థకుండనిధి మధుర



మధురా నగరానికి దక్షిణ దిక్కున ఎన్నెన్నో తీర్థక్షేత్రాలున్నట్టే ఉత్తర దిక్కున కూడా పవిత్ర స్నానకుండాలు, తీర్థక్షేత్రాలు అనేకానేకం ఉన్నాయని తెలియచెబుతున్న కథాసందర్భం ఇది. నారద పురాణం ఉత్తరభాగం డెబ్భైతొమ్మిదో అధ్యాయంలో ఈ వివరాలున్నాయి. మధురలో విశ్రాంతి అనే పేరున గొప్ప తీర్థ క్షేత్రముంది. ఈ క్షేత్రానికి ఉత్తరభాగంలో గొప్పగొప్ప పుణ్యకుండాలున్నాయి. అవన్నీ ఒక దానికొకటిగా ఉత్తర దిక్కువైపే విస్తరించి ఉన్నాయి. విశ్రాంతి తీర్థానికి ఉత్తరభాగాన ఉన్న అసికుండ తీర్థం అనేదాన్ని వీటిలో మొదటిదిగా చెబుతారు. ఇక్కడ చేసే స్నానం విష్ణుపదాన్ని చేరుకొనేందుకు అర్హతను కల్పిస్తుంది. ఈ అసికుండానికి ఉత్తర భాగంలో నవతీర్థం అనే తీర్థముంది. ఇక్కడ స్నానం చేస్తే ఆ పుణ్యం వల్ల మరణానంతరం స్వర్గం ప్రాప్తిస్తుంది. దీనికి ఉత్తరదిక్కున సమ్యమన తీర్థం ఉంది. ఈ తీర్థంలో స్నానం చేసి ఇక్కడ దానాలను ఇచ్చిన వారికి యమలోక బాధలు తప్పుతాయి.

### పితృ దేవతలను కలిసే అవకాశం

సమ్యమన తీర్థానికి ఉత్తరభాగంలో ధారాయతన అనే తీర్థముంది. ఇక్కడ స్నానం చేసినవారు మరణానంతరం పుణ్యలోకాలలో ఉన్న వారి పితృదేవతలతో కలసి ఆనందించే అవకాశం దక్కుతుంది. ఇక్కడికి ఉత్తరదిక్కులో ఓ విశేషమైన తీర్థం ఉంది. దాని పేరు నాగతీర్థం. ఇక్కడ స్నానం చేసిన వారికి సర్పదోషాలు తొలగి సర్పాల నుంచి భయం పోతుంది. నాగ తీర్థానికి ఉత్తరం వైపున ఘంటాభరణం అనే బ్రహ్మతీర్థముంది. ఈ తీర్థమంటే బ్రహ్మదేవుడికి మరీ మరీ ఇష్టం. అందుకే ఇక్కడ పవిత్ర స్నానాలను ఆచరించిన వారికి బ్రహ్మలోకం ప్రాప్తిస్తుంది. ఇక్కడికి ఉత్తర తీరంలోఉన్న సోమ తీర్థంలో స్నానం చేస్తే సోమలోకం ప్రాప్తిస్తుంది. సోమతీరానికి ఉత్తరదిక్కున ఉన్న ప్రాచీసరస్వతీ కుండంలో స్నానం చేస్తే సరస్వతీదేవి అనుగ్రహంతో మంచి చదువు లభిస్తుంది. ఇక్కడికి ఉత్తరదిక్కున చక్ర తీర్థం అనే పేరున ఒక తీర్థం ఉంది. దానిలో స్నానం చేస్తే శత్రువర్గం నశిస్తుంది. దాంతోపాటుగా ఏడు యుగాల పాటు స్వర్గంలో ఉండే పుణ్యం దక్కుతుంది. ఇక్కడికి ఉత్తర దిశలో దశాశ్వమేధిక తీర్థం మానవుల పాపాలను పోగొట్టేందుకే ఏర్పడింది. ఈ తీర్థంలో స్నానం చేసినందువల్ల పాపాలు పోయి అశ్వమేధ యాగం చేసినంతటి పుణ్యం దక్కుతుంది. ఇక్కడే ఉన్న గోకర్ణ శివుడిని యథావిధిగా పూజించినవారు ఇహపర సౌఖ్యాలను పొంది శివలోకంలో నివసించే అర్హత సంపాదించుకుంటారు. దశాశ్వమేధిక తీర్థానికి ఉత్తరభాగాన విఘ్నరాజ తీర్థం విరాజిల్లుతుంటుంది. ఈ తీర్థక్షేత్రంలో చేసే స్నానం వల్ల అనుకొన్న పనులన్నీ నిర్విఘ్నంగా సాగుతాయి. దీనికి ఉత్తరదిక్కున ఉన్న అనంత తీర్థంలో స్నానం చేస్తే విశేషఫలం లభిస్తుంది. ఆ పుణ్యఫలితం ఏమిటంటే మహాగొప్పవిగా చెప్పుకుంటున్న ఇరవైనాలుగు తీర్థాలలో స్నానం చేసినంతటి పుణ్యఫలం ఈ ఒక్క తీర్థంలో స్నానం చేస్తే వచ్చేస్తుంది.

ధర్మపథం

### నాలుగు రూపాల్లో స్వామి

మధురా నగరంలో సాక్షాత్తూ శ్రీహరి ఎప్పుడూ ఉంటుంటాడు. చతుర్వ్యూహ రూపాలలో ఆ స్వామి ఇక్కడ ఉండి మధురవాసులకు ముక్తిని ప్రసాదిస్తుంటాడు. వరాహమూర్తి, నారాయణమూర్తి, వామన మూర్తి, హలధారమూర్తి అని నాలుగు మూర్తులుగా ఆ స్వామి వ్యూహరూపాలను పెద్దలు పేర్కొంటున్నారు. ఈ చతుర్వ్యూహధరుడిని మధురలో దర్శించి యథావిధిగా పూజించిన వారికి ముక్తి లభిస్తుంది. ఇక్కడున్న రంగేశుడిని, భూతేశుడిని, మహావిద్యను, భైరవుడిని దర్శించి విధివిధానంగా పూజచేసిన వారికి తీర్థయాత్రాఫలం సంపూర్ణంగా దక్కుతుంది. అలాగే ఈ ప్రాంతంలోనే కొన్ని విశేష కూపాలున్నాయి. వాటిలో స్నానం పాపాలను పోగొడుతుంది. పాపాలు నశించాలనుకున్నవారు చతుస్సాముద్రిక కూపం, కుబ్జాకూపం, గణేశ కూపం, కృష్ణగంగ అనే వాటిలో స్నానం చేయాలి. సమగ్ర మధురా మండలాధిపత్యాన్ని క్లేశనాశకుడైన కేశవుడు వహిస్తుంటాడు. అందుకనే మధురా మండలంలో తప్పకుండా కేశవుడిని దర్శించి నమస్కరించుకొన్నవారికి జన్మ సార్థకమవుతుంది. అలాంటి వారికి మళ్లీమళ్లీ సంసారచక్రంలోపడి తిరుగాడే బాధ తప్పుతుంది. ఇది మధురలో ఉన్న కుండాలు, తీర్థాలు మాత్రమే. ఇలాంటివి ఇంకా ఎన్నెన్నో ఉన్నాయి. మధుర అణువణువూ ఆ మధురాధిపతి మహిమ నిండి ఉంటుంది. కాలప్రభావం వల్ల అన్ని తీర్థాలలోనూ స్నానం చేసే అవకాశం ఉండకపోవచ్చు. అలా అని ఎవరూ బాధపడనవసరం లేదు. రాధామనోహరుడిని, మధురాధిపతిని మనసారా తలచుకొని భక్తితో ఏ ఒక్క తీర్థంలో స్నానం చేసినా పుణ్యమే లభిస్తుంది. ఇంకా మిగిలిన తీర్థాలు, కుండాలు, కూపాలలో స్నానం చేసినంతటి ఫలితం దక్కాలంటే వాటి పేర్లను స్మరించుకొంటూ స్నానం చేస్తే అంతటి పుణ్యమూ పొందవచ్చు. శ్రీహరి కరుణా మహిమ అదే అని ఇలా మధురలో ఉన్న పవిత్ర తీర్థక్షేత్రాల గొప్పతనాన్ని వివరించి చెబుతోంది ఈ కథాసందర్భం.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## ముఖం

జాతీయాలు నుడికారాలు

**ఈ** పదానికి సాధారణ అర్థం మొగము. అయితే ఇది జాతీయంగా మారేసరికి భిన్నార్థాలు ధ్వనిస్తూ కనిపిస్తుంది. ఆ అర్థాలన్నీ దాదాపు నిరసనను వ్యక్తం చేసేందుకు ఉపయోగపడేవే. ౹నీ ముఖం. . నీకేం తెలుసు? ' అని అన్నప్పుడు అవతలి వ్యక్తికి ఏమీ తెలియదు. జ్ఞానహీనుడు అనే అర్థాలు ధ్వనిస్తాయి. అలాగే ౹ఏ ముఖం పెట్టుకుని అడుగుతున్నావు' అని అన్నప్పుడు అవతలి వ్యక్తి అంతకుముందు చేసిన ద్రోహం, అన్యాయంలాంటి వాటిని నిరసించే ధోరణి కనిపిస్తుంది. ఇలా ఈ జాతీయం ప్రయోగంలో ఉంది.

## గర్జిలింగేశ్వరుడికి ఘన స్వాగతం

**కర్నూలు, న్యూస్‌టుడే:** ఆదోని మండలం పెద్దహరివాణంలో ఉత్సవాలకు వెళ్లి తిరిగి సొంత గ్రామం నారాయణపురం చేరుకున్న శ్రీ గర్జిలింగేశ్వర స్వామికి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. హోళగుంద మండలం లింగంపల్లి, హోసురు, నాగనాథనహళ్లి మీదుగా గ్రామానికి స్వామివారు చేరుకున్నారు. చిన్నారులు కలశాలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రధాన రహదారి నుంచి గ్రామ వీధుల్లో స్వామివారిని ఉరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆంధ్రావని

## భక్తులతో కొండగట్టు కిటకిట

**కరీంనగర్, న్యూస్‌టుడే:** కొండగట్టు అంజన్న క్షేత్రం భక్తజనంతో కిటకిటలాడింది. హన్మాన్ జయంతి తర్వాత రావడంతో వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. వేములవాడ రాజన్నను దర్శించుకొన్న భక్తులు కూడా కొండగట్టుకు చేరుకోవడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి.



**కోనేరు వద్ద భక్తుల రద్దీ**

## 'రూపాయి' చిత్రం 'రికార్డ్'

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** చిత్రకారుడు మధు కురువ రూపొందించిన 'రూపాయి' చిత్రానికి 'మిరాకిల్ వరల్డ్ రికార్డ్'లో చోటు దక్కింది. 'వేదం' సినిమాలోని రూపాయి విలువను తెలిపే పాట సారాంశాన్ని మధు కురువ చిత్రంగా గీశాడు. ఈ కళాకృతికి 'మిరాకిల్ వరల్డ్ రికార్డ్' దక్షిణ భారత ప్రతినిధి రవీందర్ ధ్రువీకరణ పత్రాన్ని, పతకాన్ని ప్రదానం చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో మధు తెలిపారు. గతంలో ఈ చిత్రానికే 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్', 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లోనూ చోటు దక్కడం విశేషం.



**'మిరాకిల్‌వరల్డ్ రికార్డ్' తో చిత్రకారుడు మధు కురువ**

## తెలుగు యువతి పోరాటం

### సాయం కోసం ఎదురుచూపులు



**షబ్నం బాను**

**అనంతపురం, న్యూస్‌టుడే :** అసలే పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ఆ కుటుంబంపై ప్రాణాంతక వ్యాధి బ్లడ్‌క్యాన్సర్ పిడుగులా పడింది. ప్రాణాలన్నీ కూతురిపై పెట్టుకున్నా ఆ తల్లిదండ్రులు చికిత్స చేయించే స్థోమత లేక దాతల కోసం ఎదురుచూస్తున్నారు. అనంతపురానికి చెందిన యువతి షబ్నంబాను ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసుకుంది. చదువులో మేటిగా నిలుస్తూ వచ్చిన షబ్నంబాను ఉన్నత చదువులు చదవాలని ఆశపడుతుండగా మాయదారి రోగం కబళించింది. ప్రతిరోజు నీరసంతో అడుగులు వేయలేని పరిస్థితి వచ్చింది. తిండి ఏదితిన్నా వాంతులయ్యేది. చివరికి పడకకే అంకితమైపోయింది. ఉత్సాహంతో ఉరకలువేసే బిడ్డ వడలిన తోటకూరలా వాలిపోవడంతో దిక్కుతోచని తల్లిదండ్రులు ఆసుపత్రిలో చూపిస్తే బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. రోజు కూలికి వెళ్తేగాని పూటగడవని తమకు బిడ్డనెలా రక్షించుకోవాలో తెలియక అల్లాడిపోయారు. వైద్యుల సూచనమేరకు పుదుచ్చేరిలోని జిప్మర్‌లో చూపించారు. అక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి ప్రతిరోజు బి-పాజిటివ్ రక్తం ఎక్కించాలని, వైద్యానికి రూ. 10 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. చికిత్స విజయవంతంగా సాగాలంటే నెలరోజుల పాటు ఆసుపత్రిలోనే ఉండాల్సి వస్తుందన్నారు. తెలియని ప్రాంతంలో అడుగిడిన ఆ పేద కుటుంబం తమను ఆదుకునే ఆపన్నహస్తాల కోసం ఎదురుచూస్తోంది.

## అంజనీపుత్రునికి ఆకుపూజ

**నల్గొండ, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి మంగళవారం ఆకు పూజ నిర్వహించారు. గర్భాలయంలోని మూలవర్యులకు అభిషేక, అర్చనలు జరిగాయి. శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణోత్సవ పర్వాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన దేవాలయంలోని ఆంజనేయస్వామికి వేద మంత్రపఠనాల మధ్య తమలపాకులతో అర్చన జరిగింది. వేసవి సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు. సాయంత్రం జరిగిన అలంకార సేవోత్సవాలలో భక్తులు పాల్గొని మొక్కులు సమర్పించారు.



## కాళోజీ.. నికార్సయిన విమర్శకుడు

### డాక్యుమెంటరీ ఆవిష్కరణ సభలో వక్తలు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** నా గొడవ..అంటూ ప్రముఖ కవి కాళోజీ సమాజంలోని లోటుపాట్లపై అరమరికలు లేకుండా తన అభిప్రాయాలకు వెల్లడించారని వక్తలు పేర్కొన్నారు. కాళోజీ శతజయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాళోజీ డాక్యుమెంటరీ ఆవిష్కరణ నగరంలోని సాలార్‌జంగ్ సంగ్రహాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కాళోజీ కవిత, సాహిత్య సంపద అంతులేనిదన్నారు. రచయిత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలోని చెడును తొలగించడానికి కొత్త చీపురోస్తుంది.. చెత్తకు ఏడుపోస్తుందని కాళోజీ తన కవితల్లో తెలిపారన్నారు. కాళోజీ ప్రశ్నించే తత్వంతో పాటు తిరుగుబాటుతనం, ఆయన భార్య కాళోజీ రుక్మిణీబాయి తెలంగాణ సంప్రదాయతను కళ్లకు కట్టినట్లు డాక్యుమెంటరీలో పొందుపరిచామన్నారు.




**డాక్యుమెంటరీని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తదితరులు**

# నల్లధనం బయటపెట్టించిన ముని

ధనసంపాదన అనేది ధర్మబద్ధంగా, సక్రమమైన పద్ధతుల్లో ఉండాలి. అధర్మంగా ఎవరి దగ్గర నుంచి ఏ కొద్దిగా కూడా దానంగానైనా సరే ఎప్పుడూ తీసుకోకూడదు. ఇది భారతీయ సనాతన సంప్రదాయంలో ఉన్న ధర్మబద్ధమైన ధనార్జన పద్ధతి. ఈ పద్ధతిలోనే మనకున్న మునులలో అత్యంత ప్రతిభావంతుడు, ప్రభావశాలి అయిన అగస్త్యుడు అన్యాయంగా ధనాన్ని కూడపెట్టిన ఓ రాజు నుంచి నల్లధనాన్ని వెలికి తీయించి కావలసిన వారికి పంచిపెట్టేలా చేశాడు. ఈ విషయం మహాభారతం వనపర్వంలో అగస్త్యుడి కథలో కనిపిస్తుంది. అగస్త్యుడు తపస్సుకే ప్రాధాన్యం ఇస్తూ బ్రహ్మచారిగా ఉంటూ వివాహం చేసుకోవటం ఆలస్యం చేశాడు. దాంతో ఆయనకు ధర్మబద్ధంగా సంతానయోగ్యత లేకుండా పోయింది. ఆ కారణంగా ఆయన వంశంలోని పితృదేవతలు బాగా బాధపడసాగారు. ఎలాగైనా సరే అగస్త్యుడు పెళ్లిచేసుకొని గృహస్థాశ్రమాన్ని స్వీకరించాలి. సంతానాన్ని కనాలి. అలా జరిగితే తప్ప తమకు పుణ్యలోకాలు ప్రాప్తించవని అనుకొంటున్నారు పితృదేవతలు. వారు ఓ రోజున అగస్త్యుడు వెళుతున్న దోవలో తలకిందులుగా వేళ్లాడుతూ కనిపించారు. వారిని చూసిన అగస్త్యుడు మీరెవరు? ఎందుకిలా తలకిందులుగా వేళ్లాడుతూ ఉన్నారని అడిగాడు. అప్పుడు వారంతా తాము అగస్త్యుడి పితృదేవతలమని అతడు పెళ్లి చేసుకోనందువల్ల వంశాభివృద్ధి ఆగిపోతుందని అన్నారు. అలా జరిగితే తమకు పుణ్యలోకాలు ప్రాప్తించవని కనుక వెంటనే పెళ్లి చేసుకోమని



చెప్పారు. అగస్త్యుడు సరేనని వారికి మాట ఇచ్చి అక్కడ నుంచి బయలుదేరాడు.

### అగస్త్యుడి అన్వేషణ

తనకు తగిన వధువు కోసం చాలా చోట్ల ప్రయత్నం చేశాడు కానీ ఎక్కడా దొరకనే లేదు. ఓ రోజున విదర్భరాజు దగ్గరకు వెళ్లి ఆయన కుమార్తె లోపాముద్రను ఇచ్చి పెళ్లిచేయమన్నాడు. ఆ రాజు అలాగే చేశాడు. అగస్త్యుడు లోపాముద్రను తన ఆశ్రమానికి తెచ్చాడు. అక్కడ ఆమె అంతకుముందు తాను పుట్టింట్లో యువరాణిలాగా సకల సౌభాగ్యాలతో, సంపదలతో ఉన్నట్టుగా కాక నారచీరలు కట్టి సామాన్యంగా జీవించసాగింది. కొంతకాలానికి అగస్త్యుడికి ఆమెవల్ల సంతానం పొందాలన్న కోరిక కలిగింది. అదే విషయాన్ని ఆమెతో చెప్పినప్పుడు తాను పుట్టింట్లో భోగభాగ్యాలతో ఉన్నట్టుగా ఆశ్రమంలో కూడా ఉన్నప్పుడు అలాగే తనవల్ల అగస్త్యుడు సంతానాన్ని పొందవచ్చుంది. అగస్త్యుడు ఆలోచనలోపడ్డాడు. తన తపశ్శక్తితో ధనాన్ని సంపాదించవచ్చు కానీ తపశ్శక్తి తరిగిపోవటం మంచిది కాదని అనుకొన్నాడు. అయితే ఎలాగైనా సరే ధర్మబద్ధంగా ధనాన్ని ఎవరినైనా అడిగి తీసుకురావాలి అని అనుకొన్నాడు. సమీపంలో ఉన్న కొందరు రాజులు ఆయన మనసులో మెదిలారు. ఆ రాజ్యాలలో మిగులు ధనం ఎవరి దగ్గరుంటే వారిని అడగాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే ముందుగా శ్రుతర్వుడు అనే రాజు దగ్గరకు వెళ్లి తన మనసులోని మాట చెప్పాడు. ఆ రాజు తన ఆదాయ వ్యయాల లెక్కలన్నింటినీ చూపించాడు. మిగులు ధనం కనిపించలేదు.

ధర్మపథం

దాంతో ఆ రాజును వెంటపెట్టుకొని బ్రధ్నశ్వుడు అనే రాజు దగ్గరకు వెళ్లాడు. అక్కడ కూడా మిగులు ధనం కనిపించలేదు. అతడిని కూడా వెంటపెట్టుకొని త్రసదస్యుడు అనే రాజు దగ్గరకు ముగ్గురూ కలిసి వెళ్లారు. అక్కడ పరిస్థితి ముందు రాజుల పరిస్థితి లాగానే ఉంది. దాంతో ముగ్గురు రాజులూ కలిసి తీవ్రంగా ఆలోచించి ఇల్వలుడు అనే ఓ దానవ రాజున్నాడని అతడి దగ్గర ఆదాయవ్యయాలకు మించిన మిగులు ధనం ఎంతో ఎక్కువగా ఉందని, అక్కడకు వెళితే కావలసిన ధనం తెచ్చుకోవచ్చని చెప్పారు. ఆ మాటలను వినగానే అగస్త్యుడు ఆ రాజులందరినీ తన వెంట పెట్టుకొని ఇల్వలుడి దగ్గరకు వెళ్లాడు. ఇల్వలుడు మితిమీరిన ధనమదంతోనూ, తనను ఓ విప్రుడు ఇంద్రుడంతటి కుమారుడు కలిగేలా ఆశీర్వదించలేదన్న కోపంతోనూ ఎన్నెన్నో దుర్మార్గాలకు పాల్పడుతుండేవాడు.

### ఇల్వలుడి మాయ ఛేదించాడిలా..

ఇల్వలుడికి వాతాపి అనే సోదరుడుండేవాడు. రాక్షస మాయతో ఆ సోదరుడిని మేకగా మార్చి ఆ మేకను వధించి ఆ మాంసాన్ని వచ్చిన అతిథులకు పెడుతుండేవాడు. అతిథులు భోజనం చేశాక వాతాపి బయటకురా అని అనేవాడు. అప్పుడు అతిథుల పొట్టను చీల్చుకొని వాతాపి బయటకొస్తుండేవాడు. అలా ఎందరెందరో అన్యాయంగా మరణించారు. అగస్త్యుడు శ్రుతర్వుడు తదితర రాజులను వెంటపెట్టుకొని ఇల్వలుడి దగ్గరకు వెళ్లగానే వాతాపిని మేకగా చేసి మాంసం వండిపెట్టాడు ఇల్వలుడు. ఆ మాంసం మొత్తాన్ని అగస్త్యుడే తిన్నాడు. అంతేకాక తన తపశ్శక్తితో వాతాపి జీర్ణంకావాలి అని సంకల్పించుకున్నాడు. ఇల్వలుడు ఎంత పిలిచినా జీర్ణమైపోయిన వాతాపి తిరిగి రాలేదు. ఆ తర్వాత ఆ దానవరాజు బాధపడుతూ, భయపడుతూ అగస్త్యుడికి నమస్కరించి ఏం కావాలో చెప్పమని వినయంగా అడిగాడు. అగస్త్యుడు తనకు ధనం కావాలన్నాడు. ఇల్వలుడు మళ్లీ తన అధర్మపూరితమైన దానవ బుద్ధిని ప్రదర్శించాడు. తాను ఎంత ధనాన్ని, ఏ వస్తువులను వచ్చిన వారందరికీ ఇవ్వాలని మనసులో అనుకుంటున్నాడో ఆ విషయాన్ని చెప్పగలిగితే ధనం ఇస్తానన్నాడు. అగస్త్యుడు దివ్యదృష్టితో చూశాడు. తన వెంట వచ్చిన ముగ్గురు రాజులకు ఒక్కొక్కరికీ పది వేల గోవులు, పదివేల బంగారు నాణేలు, తనకు అంతకు రెండింతల గోవులు, బంగారు నాణేలతోపాటు బంగారు రథాన్ని, మనోవేగంతో వెళ్లగలిగే గుర్రాలను ఇవ్వాలని ఇల్వలుడు మనసులో అనుకొంటున్న విషయాన్ని అగస్త్యుడు బయటకు చెప్పాడు. అప్పుడు ఆ దానవరాజు మళ్లీ ఏదో తికమక పెట్టాలని అన్నీ సరిగానే ఉన్నాయి కానీ బంగారు రథం మాట తాను అనుకోలేదని అన్నాడు. కానీ అగస్త్యుడు తాను చెప్పిన దాంట్లో అసత్యం ఉండదని అనడంతో ఇల్వలుడు చివరకు తప్పలేదని అనుకొంటూ బంగారు రథంతో సహా ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలో అంతా ఇచ్చి పంపాడు. ఆ ధనమంతా ఆ దానవ రాజు అధర్మంగా కూడపెట్టిందే. అలాంటి ధనాన్నే ప్రస్తుత కాలంలో నల్లధనమని అనటం జరుగుతోంది. మన మునులు, రుషులు లోకహితం కోసం అలా దాచిన నల్లధనాన్ని సత్య, ధర్మ మార్గాలను అనుసరించి వెలికి తీయిస్తూ ఉండేవారని ఈ కథ తెలియచెబుతోంది. ఈనాడు కూడా చట్టపరంగా సత్య, ధర్మాలను పాటిస్తూ నల్లధనాన్ని బయటకు తీయించి ప్రజల క్షేమం కోసం ఉపయోగించవచ్చన్న ఓ ఆలోచన మహాభారతంలోని ఈ కథ చదివిన వారికి కలుగుతుంది.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు

# బతుకమ్మ నవ్వులు!



కళాకారుల ప్రదర్శన



బతుకమ్మ తెస్తున్న బాలిక

నల్గొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర అధికారులు అధికారికంగా చేపట్టిన తెలంగాణ సంబురాలు పల్లెపల్లెనా పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. క్రీడా పోటీలు, బతుకమ్మ పాటలు, ఒగ్గు కథల రూపాలు మండల కేంద్రాల్లో వినిపించాయి. ఒకవైపు వర్షాలు వస్తున్నా.. 'కొత్త' శక్తి నింపుకొని ప్రజలు ఉల్లాసంగా గడిపారు.

# కమనీయం.. కామాక్షితాయి కల్యాణం

నెల్లూరు, న్యూస్‌టుడే : మేళ తాళాలు.. మంగళ వాయిద్యాలు.. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కరుణామయి కామాక్షితాయి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. లోక కల్యాణార్థం నిర్వహించిన మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బుధవారం అమ్మవారు పుట్టినిల్లు పెనుబల్లిలో పెండ్లి కుమార్తెగా ముస్తాబయ్యారు. గ్రామ పెద్దలే బంధువులై వెంట రాగా జొన్నవాడ క్షేత్రానికి చేరుకున్నారు. అప్పటికే అమ్మవారి కోసం వేంచేసి ఉన్న గంగా



అలంకరణలో అమ్మవారు

ఆంధ్రావని

దేవీ సమేత శ్రీమల్లికార్జునుని ఉత్సవ మూర్తులకు ఎదురు కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారు, స్వామివారిని కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. తొలుత సంప్రోక్షణ, గణపతిపూజల అనంతరం వివాహ క్రతువు ప్రారంభించారు.

# కుక్కవంటి మనసు కూర్చుండనివ్వదు

జాతీయాలు నుడికారాలు

మనసును నిగ్రహించటం అంత తేలికైన పనికాదని తత్వచింతనతో పెద్దలు చెప్పే సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. మనసు కుక్కలాంటిదంటారు. కుక్క పని ఉన్నా లేకపోయినా ఏదో తొందరపని ఉన్నట్టు పరుగెడుతూనే ఉంటుంది. ఒక చోట స్థిమితంగా ఉండదు. మనసు కూడా అలాంటిదేనన్న విషయాన్ని వివరించే సందర్భంలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది.



సోమేశ్వరస్వామి



పార్వతిదేవి

# గోధుమవర్ణంలో సోమేశ్వరుడు

భీమవరం , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే: గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో సర్వఅమావాస్యను పురస్కరించుకుని స్వామివారు గోధుమ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధానార్చకులు సోంబాబు, రామకృష్ణ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పార్వతీ, అన్నపూర్ణ అమ్మవార్లకు సహస్రకుంకుమ పూజలు జరిగాయి. సాయంత్రం స్వామివారికి, అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ట్రస్టు బోర్డు ఛైర్మన్ కంచర్ల సాయిబాబా, సభ్యులు పర్యవేక్షించగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి ఆశీస్సులు పొందారు.

# భారతీయ కళలకు ప్రపంచ ఖ్యాతి

తిరుపతి, న్యూస్‌టుడే: భారతీయ కళలు, సంస్కృతీసంప్రదాయాలు, మానవీయ.. నైతిక విలువలు.. తదితర పవిత్ర ప్రక్రియలన్నీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరిదే మహతి కళాక్షేత్రంలో సుబ్బరాజు నాట్యకళాపరిషత్ 40వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాతపస్వి, ప్రముఖ సినీ దర్శకులు, నటులు పద్మశ్రీ కె.విశ్వనాథ్ మాట్లాడుతూ నాటక రంగాన్ని ప్రజానీకం ఆదరించాల్సిన అవసరముందన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడంలో రంగస్థలం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తనకు దర్శకరంగంతోనే ఎక్కువ అనుబంధమన్నారు. కొందరు ప్రముఖుల విజ్ఞప్తి మేరకు నటన రంగంలో అడుగు పెట్టానని ఆయన గుర్తుచేసుకున్నారు. సుబ్బరాజు నాట్యకళాపరిషత్తు కార్యదర్శి కోనేటి సుబ్బరాజు మాట్లాడుతూ వందలాది నాటకాలను ప్రదర్శిస్తూ.. ప్రస్తుతం సుబ్బరాజు నాట్యకళాపరిషత్తు 40వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులకు ప్రతిష్టాత్మక అవార్డులను ప్రదానం చేశారు. కళాతపస్వి కె. విశ్వనాథ్‌కు నటరత్న బిరుదును ప్రదానం చేశారు.



కళాతపస్వి సినీ దర్శకుడు కె.విశ్వనాథ్

# శివానుగ్రహానికి నాలుగు మార్గాలివే...

**శి**వానుగ్రహం పొంది ఆ తర్వాత సులభంగా ముక్తి పొందాలంటే ఉన్న మార్గాలేంటి? అనే విషయాన్ని గురించి వివరించి చెప్పే కథాసందర్భం ఇది. శివమహాపురాణం విద్యేశ్వరసంహిత నాలుగు, అయిదు అధ్యాయాలలో ఈ విషయాలున్నాయి. నమ్మిన భక్తుడికి సులభంగా, తొందరగా ముక్తిని ప్రసాదించే శక్తి శివుడికి మాత్రమే ఉంది. ఈ విషయాన్ని వేదాలు కూడా సమర్థిస్తున్నాయి. అంతేకాదూ శివుడి విషయంలో ఉన్న మరో ప్రత్యేకతను కూడా వేదాలు వివరిస్తున్నాయి. అవేమంటే ఇతర దేవతలకు ఎవరికీ లేని విధంగా శివుడికి లింగరూపం ఉంది. మహేశ్వరుడు పరబ్రహ్మ స్వరూపుడు. ఆ పరబ్రహ్మ తన ఇచ్ఛానుసారం కొన్నిసార్లు నిరాకారుడిగానూ, మరి కొన్నిసార్లు సాకారుడిగానూ ఉంటాడు. నిరాకారుడిగా ఉన్న ఆ స్వామికి చిహ్నమే శివలింగం.



### శ్రవణ, మనన, కీర్తనలే మార్గం

శివలింగం అనేది భక్తుల సౌకర్యం కోసమే ఆవిర్భవించింది. మామూలుగా ఇతర దేవతల్లాగా సాకారంగా స్వామి కనిపించినప్పుడు నమస్కరించటం, అర్చన చేయటం ఇవన్నీ సాధ్యమే. అయితే అదుపులేని మనసుతో తిప్పలుపడే భక్తులకు ఆ స్వామి రూపం ఏదోఒకటి కనిపించకపోతే భక్తుడి మనసు నిలిచేందుకు స్థానం దొరకదు. భగవంతుడి మీద భక్తుడి మనసు స్థిరంగా నిలిచినప్పుడు స్వామి మీద భక్తి బాగా కుదిరి ముక్తికి మార్గం దొరుకుతుంది. ప్రత్యేకంగా మహేశ్వరానుగ్రహం పొందేందుకు ఓ మూడు ప్రత్యేక పద్ధతులు ఉన్నాయి. ఆ ప్రత్యేక పద్ధతులను అవలంభించలేమనుకున్న భక్తుల కోసం నాలుగోదైన మరో పద్ధతి కూడా ఉంది. మూడు పద్ధతులలో మొదటిది శ్రవణం. రెండోది మననం. మూడోది కీర్తనం. శ్రవణ, మనన, కీర్తనాలనే వాటిని అలవాటు చేసుకొని ఎవరైనా సరే శివుడికి ఇష్టుడిగా కావచ్చు. ఇవేమీ అంత కష్టమైన పనులేవీ కావు. శ్రవణం అంటే శివుడికి సంబంధించిన పవిత్రమైన కథలను, మంత్రాలను, విషయాలను వింటూ ఉండటం. మననం అంటే అలా విన్నవాటిని చక్కగా నిరంతరం స్మరించుకొంటూ ఉండటం. కీర్తనం అంటే శివుడికి సంబంధించిన మహిమలను లేదా ఉన్నతమైన విషయాలను ప్రచారం చేస్తూ ఉండటం. శివపూజ, శివమంత్ర జపం, శివుడి గుణగణాలను, రూపాన్ని, లీలలను, నామాలను సర్వకాల సర్వావస్థలలోనూ స్మరించుకుంటూ ఉండటమే ముక్తికి ప్రధాన సాధనం అవుతుంది. శివుడి లీలలను, నామాలను గాన రూపంగాకానీ, వేదాధ్యయన రూపంగాకానీ, లౌకిక భాషా రూపంగాకానీ స్పష్టమైన వాక్కుతో రసవత్తరంగా కీర్తించిన వారికి శివుడు ముక్తినివ్వకుండా విడిచిపెట్టడు. అలాగే ఎంతో ప్రియంగా, ప్రాణప్రదంగా శివనామం ఎప్పుడు వినిపించినా శివుడి విషయం ఏది చెవినపడ్డా ఆనందంతో పులకించిపోతూ శివుడి మీద స్థిరభక్తి కలిగిఉన్నవారిని వెనువెంటనే ఆ పరమేశ్వరుడు అనుగ్రహిస్తాడు. శ్రవణ, మనన, కీర్తనాదులను మించిన ముక్తి సాధనం మరొకటి ఏదీ లేదని సాక్షాత్తూ బ్రహ్మ కుమారుడైన సనత్కుమారుడు ఓసారి స్వానుభవపూర్వకంగా తెలుసుకున్నాడు.

ధర్మపథం

### సనత్కుమారుడికి అనుగ్రహం

సనత్కుమారుడు శివుడి అనుగ్రహం పొందాలని సంకల్పించుకొని ఓ శుభముహూర్తంలో నందన పర్వతానికి వెళ్లాడు. ఆ పర్వతం మీద ప్రశాంతమైన ఓ ప్రదేశంలో చాలాకాలం పాటు శివుడి గురించి తపస్సు చేశాడు. ఫలితం లేకపోయింది. ఓ రోజున కైలాసం నుంచి ప్రమథ గణాధిపతి అయిన నందికేశ్వరుడు మందరగిరి మీద కఠోర తపస్సు చేస్తున్న సనత్కుమారుడి దగ్గరకు వచ్చి పరిస్థితిని గమనించాడు. అప్పుడాయన సనత్కుమారుడితో ఇలా ఎంతకాలం తపస్సు చేసినా ఫలితం ఉండదని శివానుగ్రహం పొందాలంటే శ్రవణ, మనన, కీర్తనలనే మూడు పద్ధతులు ఎంతో మేలైనవని చెప్పాడు. నందికేశ్వరుడి సూచనలను అనుసరించి ఆ తర్వాత సనత్కుమారుడు శ్రవణ, కీర్తన, మననాల ద్వారా శివానుగ్రహం పొందాడు. కొంతమంది భక్తులకు శ్రవణ, మనన, కీర్తనలకు అవకాశం లేకపోవటం లేదా శక్తి లేకపోవటం జరుగుతుంటుంది. అలాంటి వారి కోసమే శివలింగ లేదా మూర్తికి అర్చనలు చేసే విధానం ఆచరణలో ఉంది. శివలింగానికి కానీ, మూర్తికి కానీ మండపాన్ని, గోపురాన్ని నిర్మించి అలా నిర్మించిన శివాలయానికి సమీపంలో ఒక జలాశయాన్ని, దానికి సమీపంలో ఒక మార్గాన్ని ఏర్పాటు చేయాలి. మండప గోపురాలున్న శివాలయం, జలాశయం, మఠాలతో కూడుకొని ఉన్న శివక్షేత్రంలో సకల రాజోపచారాలను, భక్తి ఉపచారాలను శ్రద్ధతో చేసిన వారికి శివుడు ముక్తిని ప్రసాదిస్తాడు అని శివపురాణం వివరిస్తోంది. ఈ వివరణను అనుసరించే శైవక్షేత్రాలలో పూజలు, ఉత్సవాలు జరుగుతుండటం కనిపిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

---



వాహనంపై ఊరేగుతున్న
రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి

## తిరుచ్చి వాహనంపై శ్రీకృష్ణస్వామి దర్శనం

**తిరుపతి, న్యూస్‌టుడే:** తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో కొలువుదీరిన శ్రీకృష్ణస్వామి గురువారం సాయంత్రం తిరుమాడ వీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అయిదు గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ముఖమండపంలో స్వామివారి ఉత్సవమూర్తికి కన్నుల పండువగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం అలంకారశోభితుడైన స్వామివారు ఉభయదేవేరులతో కలిసి ఊంజల్ సేవలో దర్శనం ఇచ్చారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి తిరుచ్చి వాహనంలో తిరువీధుల్లో దర్శనం ఇచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో భాస్కర్‌రెడ్డి, పేష్కార్ నాగరత్న, సూపరింటెండెంట్లు ధర్మయ్య, వెంకటరత్నం, అర్జితం, ప్రసాదాల ఇన్‌స్పెక్టర్లు గురవయ్య, ఆంజనేయులు, ఏవీఎస్‌వో రామకృష్ణ, వీఐ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శనలు



జానపదం నృత్యంలో ప్రథమ బహుమతి అందుకున్న బృందం

**గుంటూరు, న్యూస్‌టుడే:** చిలకలూరిపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కళానిలయం జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ, జానపద సంగీత, నాట్య కళారూపాల ప్రదర్శనలు ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పలువురు ప్రదర్శనలిచ్చారు. వీరిలో ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానం చేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రాధామోహన్(ముంబై), మంజులరాజ్(హైదరాబాద్) వ్యవహరించారు. విజేతల వివరాలను కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రగడ రాజమోహనరావు వెల్లడించారు. సూర్య కేటగిరి శాస్త్రీయ బృంద నాట్యాలు ప్రథమ బహుమతి అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రానికి చెందిన మాట, వినికిడి లేని 9 మంది కళాకారులు ప్రదర్శించిన దేవి శబ్దంకు, ద్వితీయ స్థానం కేరళ కళాకారులు ప్రదర్శించిన కీర్తన నృత్యానికి, తృతీయ స్థానం కేరళ పేరావూర్ దశావతరం ప్రదర్శనకు లభించాయి. చంద్ర కేటగిరిలో శ్రీకాకుళానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వారు ప్రదర్శించిన కీర్తన ప్రదర్శనకు ప్రథమ బహుమతి, శివశ్రీ నృత్య కళానికేతన్ వారు ప్రదర్శించిన కృష్ణపాద చలనంకు ద్వితీయ, హన్మకొండకు చెందిన నృత్య తరంగిణి నృత్య శిక్షణాలయం ప్రదర్శించిన అన్నమాచార్య కీర్తనకు తృతీయ బహుమతి లభించింది. సూర్య కేటగిరిలో శాస్త్రీయం కాని బృంద నాట్యాలలో ఆర్‌డీటీ మడకశిర వారు సమర్పించిన 'గజ్జెలబండి' ప్రదర్శనకు ప్రథమ, పులివెందులకు చెందిన విద్యాధరి కాన్సెప్ట్ పాఠశాల ప్రదర్శించిన 'డోలుడోలు' నృత్యానికి ద్వితీయ, కేరళకు చెందిన పీవీఆర్ సర్పంచి కో ఇతూ ప్రదర్శనకు మూడో బహుమతి లభించింది. చంద్ర కేటగిరి శాస్త్రీయం కాని బృంద నాట్యాలలో ప్రథమ స్థానం కేరళకు చెందిన కళామందిర్-పేరావూర్ ప్రదర్శించిన ఆదివాసి నృత్యానికి, ద్వితీయ బహుమతి లభించింది.

## సాయి సప్తమ ఉత్సవాలు

**నల్గొండ, న్యూస్‌టుడే:** చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో 29 నుంచి 31 వరకు మూడు రోజులపాటు జరిగే సప్తమ వార్షికోత్సవాలలో భాగంగా అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయి దేవాలయానికి గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తుల తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. ఏడో వార్షికోత్సవాల సందర్భంగా దేవాలయంలో ఉదయం 5.30 గంటలకు కాకడా హారతి, మేలుకొలుపు, అభిషేకం, గణపతి హోమం, మంగళ స్నానం, అర్చన, సంస్థాన్ హారతి, భక్తి సంగీతము, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, నారాయణ సేవ, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమం, సంధ్యాహారతి, పల్లకి సేవ, శేజాహారతితోపాటు మహిళలచేత కోలాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో పలువురిని ఆకట్టుకుంది. దేవాలయ కమిటీ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ, ఆలయ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి కృష్ణయ్యలతోపాటు ఆలయ ట్రస్టు సభ్యులు ు పాల్గొన్నారు.



దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆంధ్రావని

## గాలిలో మేడలు

**కే**వలం ఊహకు మాత్రమే అందేవని వాస్తవానికి సాధ్యం కానివని చెప్పే సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. గాలిలో ఎలాంటి ఆధారమూ లేకుండా మేడలు కట్టడమనేది సాధ్యమయ్యే పనికాదు. అలాంటి అసాధ్యమైన పనులు కూడా మేం చేసేస్తాం, మావల్లే అవన్నీ అవుతాయి అని మభ్యపెట్టడం, మోసం చేయడం, లేనిపోని కల్లబొల్లి కబుర్లు చెప్పటం చేస్తుంటారు కొందరు. అవన్నీ వినటానికి బాగానే ఉన్నా వాస్తవానికి ఎవరైనా చెబుతున్నప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు



## లక్ష మల్లెలతో విద్యా గణపతికి అలంకరణ

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** గునుపూడి విద్యా గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారికి లక్ష మల్లెలు, కనకాంబరాలతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి 11 రకాల పండ్లతో అభిషేకాలు, విఘ్నేశ్వర పూజ 17వ వార్డు కౌన్సిలర్ వేలూరి సుబ్రహ్మణ్యం దంపతులు, ఉమాసోమేశ్వర గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య సహకారంతో జరిగింది. సాయంత్రం లక్ష్మీ గణపతి హోమం, మేళ తాళాల మధ్య మూషిక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారికి ఆలయం ఎదుట దర్బారు సేవ నిర్వహించారు.

## పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలి

**నిజామాబాద్, న్యూస్‌టుడే:** సమజంలోని మానవులు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి భారతీయ సంస్కృతిని మరచిపోతున్నారని.. పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి పిలుపునిచ్చారు. పోతంగల్ గ్రామంలోని బాలాజీ మందిర వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడుతూ.. పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి భారతీయ సంస్కృతిని పూర్తిగా మరిచిపోతున్నారన్నారు. భారతీయ కట్టుబాట్లను పూర్తిగా విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. మన దేశంలోని భాష, వైద్యం, ఆటలు, పూజలు గొప్పవన్నారు. దేశభాషలను కట్టుబాట్లను పరిరక్షించాల్సిన బాధ్యత మనదేనన్నారు. ప్రస్తుత కాలంలో మానవులు సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని కాలంతో పోటీ పడుతూ దైవ భక్తిని మరచిపోతున్నారన్నారు. మానవులు ఆధ్మాత్మిక రంగంలో కొనసాగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆలయంలో కుంకుమార్చన, పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

# పాలకుడంటే ఇలా ఉండాలి..!

పాలకుడనేవాడు ధర్మం కోసమే బతకాలి, ధర్మం కోసమే మరణించాలి అనే సిద్ధాంతంతో జీవితాన్ని గడిపిన మహోదాత్త పాలకుడు కార్తవీర్యార్జునుడు. ధర్మం కోసం ఆ రాజు ఏం చేశాడు అనే విషయాన్ని వివరించే కథాసందర్భం ఇది. బ్రహ్మాండ పురాణం అరవైతొమ్మిదో అధ్యాయంలో ఈ విషయాలు కనిపిస్తాయి. పూర్వం కనకుడు అనే రాజుండేవాడు. ఆయనకు కృతవీర్యుడు, కృతాగ్ని, కృతవర్మ, కృతౌజుడు అనే నలుగురు కుమారులుండేవారు. వారిలో కృతవీర్యుడి కుమారుడి పేరు అర్జునుడు. ఈయననే కార్తవీర్యార్జునుడు అని కూడా అంటుండేవారు. కార్తవీర్యార్జునుడు వెయ్యి చేతులతో మహాబలశాలిగా ఉండేవాడు. తన శౌర్యంతో సప్తద్వీపాలను పరిపాలించాడు. అంత శౌర్యవంతుడైనా తాను చేస్తున్న పనికి మార్గనిర్దేశం చెయ్యగల వారెవరైనా ఉంటే బాగుండునని అనుకున్నాడు. అలా తనకు మార్గనిర్దేశం చేసేందుకు అనువైనవాడు దత్తాత్రేయుడేనని భావించి ఆ స్వామిని గురించి చాలాకాలంపాటు తపస్సు చేశాడు.



### అధర్మాన్ని అడ్డుకోగల వరం

దత్తాత్రేయ స్వామినే తన గురువుగా ఎంచుకున్నాడు కార్తవీర్యార్జునుడు. ఆయన తపస్సును అనేక విధాల పరిశీలించిన దత్తుడు అతడిని అనుగ్రహించి వరాలను కోరుకోమన్నాడు. అప్పుడు కార్తవీర్యార్జునుడు తనకు నాలుగు వరాలు కావాలని వాటిలో మొదటిది తనకు వెయ్యి చేతులు రావాలన్నాడు. రెండోది ఎవరు అధర్మం చేస్తున్నా అలాంటి వారిని తాను వెంటనే నివారించి ధర్మస్థాపన చెయ్యగలగాలన్నాడు. అలాగే మూడోవరం తాను భూమిని ధర్మంగా జయించి దాన్ని ధర్మంగా పాలించాలని కోరాడు. నాలుగో వరంగా తాను అనేకానేక యుద్ధాలు చేయాలని, వేలాది శత్రువులను సంహరించాలని అలా తాను యుద్ధం చేస్తూనే మరణించాలని వరం కోరుకున్నాడు. దత్తాత్రేయుడు ఆ నాలుగు వరాలను అనుగ్రహించాడు. ఆ వరాల ప్రభావంతో కార్తవీర్యార్జునుడికి వెయ్యి చేతులొచ్చి అమిరాయి. సప్తద్వీపపర్యంతంగా ఉన్న భూమి అంతటినీ జయించసాగాడు. అతడికున్న వెయ్యి చేతులు ఎప్పుడు అవసరమైతే అప్పుడు వచ్చి చేరుతుంటాయి. ఈ మాయతో శత్రువులనందరినీ సులభంగా జయిస్తుండేవాడు కార్తవీర్యార్జునుడు. అంతేకాక రాజధర్మాన్ని అనుసరించి సప్తద్వీపాలను వందలాది గొప్పగొప్ప యజ్ఞాలను చేయించాడు. ఆ యజ్ఞాలన్నీ మహా వైభవోపేతాలు. యజ్ఞం చేయటం కోసం బంగారంతో యజ్ఞవేదికలను, యజ్ఞయూప స్తంభాలను నిర్మింపచేస్తూ ఉండేవాడు. ఆ గొప్పగొప్ప యజ్ఞాలను చూడటం కోసం దేవతలు విమానంలో వచ్చి ఆకాశంలో నిలిచి ఆనందంతో చూస్తుండేవారు. అలాగే కార్తవీర్యార్జునుడు యజ్ఞం చేస్తున్నాడని తెలియగానే ఎందరెందరో దేవతలు స్వయంగా యజ్ఞవేదికల దగ్గరకొస్తుండేవారు. గంధర్వులు, అప్సరసలు లాంటివారితో కార్తవీర్యార్జునుడి యజ్ఞశాలలు కళకళలాడుతుండేవి. నారదుడు అనే గంధర్వుడు ప్రత్యేకంగా ఆయన కీర్తిని గాథగా మలచి గానం చేస్తుండేవాడు. అలా యజ్ఞ, దాన, తపస్సు, విక్రమ, పాండిత్యాలలో ఆ రాజును పోలిన వారు ఆనాడు ఎవరూ ఉండేవాడు కాదు. అంతటి వైభవానికి కారణం కార్తవీర్యార్జునుడు నడుచుకొంటున్న ధర్మమార్గమే. ధర్మాత్ముడైన ఆ రాజు ప్రభావంతో ప్రజలంతా ధర్మయుతంగా రక్షణ పొందుతూ ఉండేవారు. ప్రజలకు కష్టనష్టాలు, భయాలు, బాధలు ఏవీ లేకుండా హాయిగా, ఆనందంగా కాలం గడుస్తుండేది. అలా చాలాకాలం పాటు రాజ్యపరిపాలన చేస్తూ ఎంతో గొప్ప చక్రవర్తిగా పేరు తెచ్చుకున్నాడు కార్తవీర్యార్జునుడు.

## ధర్మపథం

### రావణుడిని జయించిన వైనం

చక్రవర్తి ధర్మమార్గ పరిపాలన వల్ల రాజ్యం క్షేమంగా ఉండేది. అవసరానికి తగినంత వర్షం ఎప్పుడూ కురుస్తుండేది. అలా కార్తవీర్యార్జునుడు పరిపాలన చేస్తూ మహిష్మతీపురం మీదకు దండెత్తి కర్కోటకుడిని జయించి ధర్మస్థాపన చేశాడు. ఇలాంటి విజయాలలో లెక్కకు మించిన విజయాలు ఉన్నాయి. వాటిలో లంకా నగరాధిపతి అయిన రావణాసురుడిని జయించటం కూడా ఒకటి. రావణుడు అధర్మ మార్గంలో నడుచుకుంటున్నాడని తెలుసుకొన్నాడు కార్తవీర్యార్జునుడు. వెంటనే రావణుడి మీదకు దండెత్తి అతడిని జయించాడు. కార్తవీర్యుడి శౌర్యాన్ని చూసి రావణాసురుడు మూర్ఛపోయాడు. అలాంటి స్థితిలో ఉన్న రావణుడిని మహిష్మతీపురానికి తీసుకువచ్చి బంధించాడు కార్తవీర్యార్జునుడు. రావణుడి పరాజయం విషయాన్ని రావణుడి తాత అయిన పులస్త్యబ్రహ్మ తెలుసుకున్నాడు. వెంటనే తన మనవడిని రక్షించుకోవాలన్న సంకల్పంతో పులస్త్యుడు కార్తవీర్యార్జునుడి దగ్గరకొచ్చి తన మనవడిని ఎలాగైనా సరే వదిలిపెట్టమని వేడుకొన్నాడు. రావణుడు అధర్మాన్ని విడిచిపెట్టి ధర్మాన్ని పాటిస్తానంటే వదిలిపెడతానని చెప్పి పులస్త్యబ్రహ్మ మీద ఉన్న గౌరవంతో లంకేశుడిని విడిచిపెట్టాడు. ఇలా ఓ ప్రజాపాలకుడు తన రాజ్యంలోని ప్రజల సుఖసంతోషాల కోసం, ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలన్న ఓ స్ఫూర్తి కార్తవీర్యార్జునుడి కథను చదివినప్పుడు కలుగుతుంది. ఇలాంటి రాజులు, చక్రవర్తులు మన పాలకులకు ఆదర్శం కావాలన్నది మన పురాణాల కథలలోని ఆంతర్యం.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## అద్దంలో ముడుపు

ఉన్నట్టు కనిపిస్తున్నా ఉపయోగం లేనిది, పనికిరానిది, పేరుకు మాత్రమే ఉన్నది అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తుంది. ముడుపు కట్టిన మూట వాస్తవంగా చేతికందితే దానిలో ఉన్న ధనం ఉపయోగపడటానికి అవకాశం ఉంటుంది. కానీ అదే ముడుపు మూటను అద్దంలో చూపించి దాన్ని తీసుకోమంటే అద్దంలోని ముడుపు

### జాతీయాలు నుడికారాలు

మూటను తీసుకోవటం కానీ, దాని వల్ల ఏదైనా ప్రయోజనం పొందటం కానీ అసలు వీలుపడదు. అద్దంలోని ముడుపు మూట లాగానే కొంతమంది వ్యక్తుల ప్రవర్తన తీరు ఉంటుంది. వారు ఉన్నారన్న మాటేకానీ వారివల్ల ఎలాంటి ప్రయోజనం సమకూరదు. అలాంటి వారిని గురించి కానీ, అలాంటి పరిస్థితులను గురించి కానీ తెలియచెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.

# వరసిద్ధునికి బంగారు యజ్ఞోపవీతం



ఆలయ సూపరింటెండెంట్ రవీంద్రబాబుకు బంగారు యజ్ఞోపవీతాన్ని అందిస్తున్న దాత శంకర శర్మ, కుటుంబ సభ్యులు

**కాణిపాకం, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే :** స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారికి ఒక భక్తుడు బంగారు యజ్ఞోపవీతాన్ని శుక్రవారం కానుకగా ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన వామనబట్ల శంకరశర్మ 51 గ్రాముల బరువు కలిగిన రూ.1.6 లక్షల విలువ చేసే బంగారు యజ్ఞోపవీతాన్ని ఆలయ సూపరింటెండెంట్ రవీంద్రబాబుకు అందించారు. ఆలయ మర్యాదల ప్రకారం దాతకు, కుటుంబసభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను సూపరింటెండెంట్ అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కోదండపాణి పాల్గొన్నారు.

# శివకేశవుల నిలయం.. శిల్పకళా వైభవం



రాజులకాలం నాటి శిలాశాసనం..

**మైలవరం, కృష్ణాజిల్లా, న్యూస్‌టుడే :** మైలవరం మండలంలోని పెద్దకొమ్మెర్ల గ్రామంలో ఉన్న చెన్నకేశవ, ఈశ్వరస్వామి ఆలయ ఆవరణం శిల్పకళా నిలయంగా భాషిల్లుతోంది. గత చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే అపురూప కట్టడాలు ఇక్కడ వెలిశాయి. శతాబ్దాల క్రితం నాటి శిలా శాసనాలు, నిర్మాణ నైపుణ్యం, శిల్ప కళా సంపద ప్రజలను ఆకర్షిస్తున్నాయి. గ్రామంలో శివ, కేశవుల ఆలయాలైన చెన్నకేశవస్వామి, ఈశ్వరస్వామి కోవెలలు ఒకే ఆవరణలో నిర్మితమవడం ఇక్కడి విశిష్టత. చెన్నకేశవ స్వామి ఆలయాన్ని శ్రీకృష్ణ దేవరాయల కాలంలో నిర్మించినట్లుగా చెబుతారు. అప్పట్లో ఏర్పాటు చేసిన శిలాశాసనం ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఆలయాల ఆవరణలోని గోడలపై శిల్పాల రూపంలో ఒదిగిన రామాయణ ఇతివృత్తాలు ఆకట్టుకుంటాయి. కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఇక్కడ నివసించినట్లు చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. ఆయన గోవిందమాంబను ఇక్కడే వివాహమాడి రాజయోగం ఆచరించినట్లు చెబుతారు.





ఆలయ గోడలపై రామాయణ గాథలను తెలిపే కళావైభవం.. చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలోని ఈశ్వరస్వామి ఆలయం

# నాన్నగారిది స్పందించే గుణం

## దాశరథి కృష్ణమాచార్యుల కుమార్తె ఇందిర

**చిన్నగూడూర్ కడప జిల్లా, న్యూస్‌టుడే:** నాన్నగారి చిరకాల వాంఛ అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పూర్తికావడం జీవితంలో మరచిపోలేని మధురానుభూతిని ఇస్తోంది. మరో రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కానున్న నేపథ్యంలో శుక్రవారం 'న్యూస్‌టుడే' హైదరాబాద్‌లో ఉంటున్న దాశరథి కుమార్తె ఇందిరతో ఫోన్‌లో మాట్లాడింది. దాశరథి నిజాం పాలన అంతానికి, తెలంగాణ కోసం చేసినే ఉద్యమాల రోజులను ఆమె గుర్తుచేసుకుని ఈ విధంగా స్పందించారు. 'ఎన్నో ఏళ్లుగా తెలంగాణ సాధన కోసం ఆయన జరిపిన పోరాటాలు మలిదశ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయి. ఉద్యమాలు చేస్తున్న క్రమంలో నైజాం ప్రభువు నాన్నను నెల్లికుదురు చెరసాలలో బంధించినప్పుడు కుటుంబ సభ్యులు, బంధువులు అమ్మకు ధైర్యం చెప్పేవారు. తమ కుటుంబానికి ఇబ్బందులు ఎదురవుతాయని అమ్మ భయంతో గడిపేది. నాన్న అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాట పటిమను చూపుతుంటే అమ్మకు నేనే ధైర్యం చెప్పేదాన్ని. ఒకనొక దశలో నేను సైతం ఉద్యమంలో పాల్గొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేశా. ఎక్కడ అన్యాయం జరిగినా నాన్నగారు స్పందించేవారు. ఇప్పటికి నాన్న పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది 'నా తెలంగాణ కోటి రతనాల వీణ', 'ఓ నిజాము పిచాచమా... నిన్నుబోలిన రాజు కానరాడు.. జన్మజన్మాల బూజు' ఈ పద్యాలే. మా కుమారుడు అరుణ్‌కిరణ్ మొదటి పుట్టిన రోజు ఆయన సమక్షంలో హైదరాబాద్‌లో ఘనంగా జరుపుకున్నాం. నా కుమారుడితో నాన్నగారే స్వయంగా కేక్ కోయించారు. ఇప్పటికి నాన్న గారి రచనలను చదువుతూ ఉద్యమాలకు ప్రేరణ కల్పించిన స్మృతులను గుర్తుచేసుకొంటాం. నాన్నగారి రచనలు ఇతర సాహిత్య పత్రాలను చిన్నగూడూరులో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి ఇచ్చేశాం.



మనుమడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న దాశరథి పక్కన ఆయన కుమార్తె ఇందిర (పాతచిత్రం)

# ఇంద్రకీలాద్రిపై భక్తుల కిటకిట

**విజయవాడ, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై భక్తులు పెద్దసంఖ్యలో శుక్రవారం తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. అమ్మ వారికి ప్రీతిపాత్రమైన రోజు శుక్రవారం కావడంతో భక్తులు మండుటెండను కూడా లెక్కచేయకుండా దుర్గగుడి బాటపట్టారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం నాలుగు చక్రాల వాహనాలను గంటసేపు ఘాట్ రోడ్డుకు అనుమతించకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది తమ వాహనాలను కనకదుర్గానగర్‌లో నిలిపి దేవస్థానం బస్సుల్లో ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. భానుడి ప్రతాపం భక్తుల మనోనిబ్బరం ముందు ఓడిపోయిందన్నట్లుగా చంటి పిల్లలతో సైతం మహిళలు అమ్మ అనుగ్రహం కోసం ఘాట్‌రోడ్డులో నడిచి వచ్చారు. పొంగళ్ల మొక్కు చెల్లించేందుకు వచ్చిన మహిళలు మాత్రం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పొంగళ్ల షెడ్డులో పొగ బయటకు వెళ్లే మార్గం లేక కళ్ల నీళ్ల పర్యంతం అయ్యారు.



ఘాట్‌రోడ్డులో భక్తుల సందడి

# భూమిని ఏలిన తొలిరాజు ఇతడే!



ఈ ప్రపంచానికి సన్మార్గాన్ని సూచించటానికి కావలసిన తొలి నీతిశాస్త్రం ఏది? దాని పేరేమిటి? అసలది ఎప్పుడు, ఎందుకు, ఎలా ఆవిర్భవించాల్సి వచ్చింది? అనే విషయాలను వివరించే కథాసందర్భం ఇది. మహాభారతం శాంతిపర్వంలో కురువృద్ధుడు భీష్ముడు ధర్మనందనుడికి ఈ విషయాలన్నీ వివరించాడు. ధర్మరాజుకు రాజశబ్దం ఎలా వచ్చింది, రాజైనవాడు లోకాలను ఎలా తన వశం చేసుకోవచ్చు. ప్రజల మెప్పు పొందటానికి ఏం చేస్తే బాగుంటుంది అనే సందేహాలకు సమాధానాలిస్తూ నీతిశాస్త్ర గ్రంథావిర్భావ విషయాన్ని ముందుగా చెప్పాడు భీష్ముడు. యుగ విభజనలో తొలి యుగంగా పేర్కొంటున్న కృతయుగం నాటి నుంచి పరిశీలిస్తే కృతయుగంలో రాజులు, రాజ్యాలు ఇవేవి ఉన్నట్లు ఆధారాలు లేవన్నాడు భీష్ముడు. అవన్నీ లేనప్పుడు దండనీతికి ఆ రోజుల్లో అవకాశమే లేకపోయింది. ప్రజలంతా ఎవరికి వారు వ్యక్తిగతంగా ధర్మాచరణ చేస్తూ తమను తాము ఆ ధర్మశక్తితోనే రక్షించుకుంటుండేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆనాడు ధర్మమే ప్రజలను పాలించింది.

### విశాలాక్షాన్ని రూపొందించిన శివుడు

అయితే కాలం గడిచేకొద్దీ ప్రజల్లో జ్ఞానం పోయింది. అధర్మం ప్రవేశించింది. దాంతోపాటే ఆపదలు వచ్చాయి. ప్రజలంతా ప్రలోభాలకు లొంగుతూ, కామాసక్తులై తమ కర్తవ్యాలన్నింటినీ మర్చిపోసాగారు. అలా అధర్మం ప్రబలుతూ ఉండేసరికి దేవతలంతా బ్రహ్మ దగ్గరకు వెళ్లి విషయాన్ని వివరించి చెప్పారు. బ్రహ్మ అందుకు స్పందించి ఆనాటి నుంచి ధర్మార్థకామమోక్షాలు అనే నాలుగు గుణాలను ఏర్పాటుచేసి అవి ఎలా ఉంటాయి, వాటివల్ల మంచీచెడులేమిటి అనే విషయాలన్నింటిని సంపూర్ణంగా చర్చిస్తూ నూరువేల అధ్యాయాలు గల నీతిశాస్త్రాన్ని ఒకదాన్ని రాసి దేవతలకిచ్చాడు. ఆ శాస్త్రంలో సామ, దాన, భేద, దండోపాయాలు, కర్మజ్ఞానకాండలు, కృషి, వాణిజ్యం, దండనీతి, రాజులకు సంబంధించిన విషయాలు, శరీరధర్మాలు, పాటించాల్సిన, పాటించకూడని అంశాలు ఇలాంటి వాటిని స్పష్టంగా చెప్పాడు బ్రహ్మ. అయితే అంత పెద్ద గ్రంథాన్ని, దానిలోని విషయాలను అర్థం చేసుకోవటం అందరికీ ఇబ్బందిగా ఉంటుంది అని అనుకొని తొలిగా మహేశ్వరుడు ఆ గ్రంథాన్ని పూర్తిగా కొంతవరకు సంగ్రహించి చెప్పాడు. అయితే అది కూడా ఇంకా పెద్దదేనని కొద్దిపాటి ఆయువు మాత్రమే ఉండే మనుషులకు ఆ గ్రంథాన్ని పూర్తిగా చదవాలంటే సాధ్యమయ్యేది కాదని అనంతర కాలంలో విశాలాక్షుడు అని పిలుపులందుకుంటూ ఉన్న ఆ మహేశ్వరుడే ఇంకా సంక్షిప్తం చేసి విశాలక్షం అనే పేరుతో ఓ గ్రంథాన్ని రూపొందించాడు.

ధర్మపథం

కేవలం పదివేల అధ్యాయాలుండే ఆ గ్రంథాన్ని దేవేంద్రుడు తీసుకుని అయిదువేల అధ్యాయాలు ఉండేలా సంక్షిప్తీకరించాడు. ఆ తరువాత మళ్లీ దేవగురువైన బృహస్పతి దానిలో కేవలం మూడువేల అధ్యాయాలు మాత్రమే ఉండేలా చేశాడు. ఆ తరువాత రాక్షసులకు గురువైన శుక్రాచార్యుడు దానిలో కేవలం వెయ్యి అధ్యాయాలు ఉండేలా సంక్షిప్తం చేశాడు. తరువాత కాలంలో మునులు ఆ వెయ్యి అధ్యాయాల గ్రంథాన్ని కూడా వేరువేరు చిన్న గ్రంథాలుగా రూపొందించారు.

### విష్ణువు తేజోరూపమే విరజుడు

ఇక ఇలా నీతిశాస్త్ర గ్రంథమైన విశాలాక్షం దేవతల చేతికి వచ్చేసరికి వారంతా ఎంతో ఆనందించి శ్రీమహావిష్ణువు దగ్గరకు వెళ్లారు. ఆయనకు పరిపరివిధాల ప్రణతులు అర్పించి, పాలనకు వీలైన నీతిశాస్త్రమంతా సులభంగా రూపొందింది కనుక సమర్థుడైన పాలకుడు ఒకడిని ప్రసాదించమని వేడుకున్నారు. అప్పుడు శ్రీమహావిష్ణువు సంతోషించి తన తేజోరూపం అయిన విరజుడు అనే కుమారుడిని సృష్టించారు. కానీ విరజుడు పాలనాధికారం చేపట్టటానికి ఇష్టపడలేదు. విరజుడికి కలిగిన కుమారుడు కీర్తిమంతుడు కూడా తండ్రిబాటనే అనుసరించాడు. కీర్తిమంతుడి పుత్రుడు కర్దముడు పాలనకు ఇష్టపడక తపస్సు చేసుకోవటానికి వెళ్లిపోయాడు. అయితే కర్దముడి కుమారుడు అనంకుడు మాత్రం అధికారం చేపట్టటానికి సుముఖుడయ్యాడు. అనంకుడి తరువాత ఆయన కుమారుడు అతిబలుడు రాజయ్యాడు. అతిబలుడు మృత్యువు కుమార్తె అయిన సునీథను వివాహమాడాడు. ఆ ఇద్దరికీ వేనుడు జన్మించాడు. వేనుడు ఎంతో అధర్మమార్గాన రాజ్యపాలన చేస్తూ మంచివారందరినీ పీడించసాగాడు. అప్పుడు కొందరు మునులు మంత్రపూరితాలైన దర్భలులాంటి వాటితో ప్రశాంతచిత్తుడిని చేసి తమ శక్తితో అతడి శరీర అవయవాలను మథించారు. వేనుడి కుడిచేతిని మథింపగా ఒక పురుషుడు ఉద్భవించాడు. తేజోవంతుడైన ఆ పురుషుడు తన కర్తవ్యమేమిటో చెప్పమని రుషులను కోరాడు. భూమండలాన్ని పాలించమని వారంతా కోరారు. అందుకు అతడు సమ్మతించాడు. ఎంతో ధర్మబద్ధంగా అతడి పాలన సాగింది. అలా చేసినవాడే పృథుచక్రవర్తి. ఆయన కాలంలోనే రాజశబ్దం సార్థకమైంది. ఆనాడు భగవానుడైన విష్ణువే రాజ్యస్థాపన చేసి తానే ఆ రాజును ఆదేశిస్తుండేవాడు. అలా విష్ణువు అంశ రాజుగా ఉండటం వల్లనే విష్ణుఃపృథివీపతిః అనే నానుడి కూడా ఏర్పడింది. రాజు అందరికీ వందనీయుడు అయ్యాడు. విష్ణువు నుదురు భాగం నుంచి సువర్ణకమలం పుట్టిందట, అందులో నుంచే సిరివచ్చి ధర్మానికి భార్యగా అయి అర్థం అనే కుమారుడిని కూడా కన్నదట. దీనిననుసరించే ధర్మ అర్థాలు రాజుకు సహాయకులుగా ఉంటున్నాయి. అలా అలా కాలక్రమంలో రాజులు, రాజ్యాలు ఏర్పడ్డాయని రాజనీతికి సంబంధించిన విశాలాక్షం అనే నీతిశాస్త్రం ఆవిర్భవించిన తీరును భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# కూర్చోలేరు.. నడవలేరు

## సాయం కోసం ఎదురుచూపులు

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే:** కొడంగల్ మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన శివమ్మ, బస్వరాజ్‌ల మొదటి సంతానం మగ పిల్లాడు. పిల్లాడు పుట్టాడనే ఆనందం.. ఆ కుటుంబంలో కొన్ని రోజుల్లోనే ఆవిరి అయిపోయింది. పుట్టిన పిల్లాడు కొద్ది రోజుల తరవాత కూర్చోకపోవడం, నడవలేకపోవడం, మాట్లాడకపోవడంతో వారి ఆనందం కనుమరుగైంది. ఆ కుటుంబ సభ్యుల మనోవేదన అంతా ఇంతా కాదు. పాతకొడంగల్‌కు చెందిన మొగులయ్య, లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. ఇద్దరు మగ పిల్లలు వీరిలో ఒకరు అంగవికలురు కావడంతో వారి బాధ వర్ణనాతీతం. మంచాలకే పరిమితమై లేచినడవలేని స్థితిలో ఇంట్లోనే ఉండడం వారికి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అసలే అంతంత కుటుంబ స్థోమతతో ఆ ఇద్దరు పిల్లల తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారు. తిరగని గుడి లేదు.. చూపని డాక్టరు లేడని భీమన్న తల్లిదండ్రులు, శివకుమార్ బాగోగులు చూసుకుంటున్న పెద్దమ్మ మల్లమ్మ దీనంగా వివరించారు. రెండు మూడేళ్ల పాటు తల్లిదండ్రులు పిల్లాడి బాగు కోసం కష్టపడ్డారు. భారంగా బతుకులు ఈడుస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి తమలాంటి వారిని ఆదుకుంటే మంచి వైద్యం అందించిన వారవుతారని వీరివురి కుటుంబ సభ్యులు దీనంగా వేడుకుంటున్నారు.



శివకుమార్



భీమన్న

# విద్యాధరిలో 'అక్షర' సందడి

**మెదక్, న్యూస్‌టుడే:** వర్గల్ విద్యాధరి ఆలయంలో అక్షరాభ్యాసాల సందడి నెలకొంది. భక్తులు ఉదయం నుంచి భారీ సంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. సారస్వత సభామండపంలో విడతల వారీగా నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమాల్లో తమ చిన్నారులతో పాల్గొని వారితో అక్షరాలు దిద్దించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు, అమ్మవారి మహాప్రసాదం (అన్నదానం) స్వీకరించారు.

ఆంధ్రావని

# అద్భుతమైన కళ 'సింహానందిని'

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ఆలయ నాట్య సంప్రదాయం 'సింహనందిని' అద్భుతమైన, అరుదైన కళ అని.. ఈ కళాప్రక్రియను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో సింహనందిని నాట్య పునఃసృష్టికర్త సి.ఆర్.ఆచార్యుల 'నృత్య సంహిత' జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ నేత్రపర్వంగా జరిగింది. ఆవిష్కర్త జస్టిస్ బి.చంద్రకుమార్ ప్రసంగిస్తూ.. ఆలయ నాట్యాలను తెలుగుజాతికి పరిచయం చేసిన ఘనత ఆచార్యులకే దక్కిందన్నారు. ఆయన నాట్యకళకు చేసిన సేవలు స్మరణీయమన్నారు. ఆచార్యుల పుస్తకాన్ని ఆయన కుమార్తె, నాట్యగురువు వోలేటి రంగమణి పరిచయం చేశారు. సభలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.రాళ్లబండి కవితాప్రసాద్ పాల్గొన్నారు.

# వెనకేసుకురావటం

జాతీయాలు నుడికారాలు

రక్షించటం, సమర్థించటం అనే అర్థాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. కొన్నికొన్ని సందర్భాలలో తమ వారిని ఎవరైనా ఎదుటివారు ఏ విషయంలోనైనా తప్పుపడుతూ ఉంటే తమవారిదే ధర్మమని సమర్థించి తప్పు పట్టటానికి వచ్చినవారిని దబాయించి పంపేస్తుంటారు కొంతమంది. అలాంటి సందర్భాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఆయన మీకే మౌతాడని? తప్పు చేశాడని తెలిసినా అలా వెనకేసుకొస్తున్నారు? అనే లాంటి సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది.

# బాలబాలాజీస్వామి బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు



స్వామివారు



ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న కొత్త ఆలయం

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** అప్పనపల్లి గ్రామంలో కొలువైన శ్రీబాలబాలాజీస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 8 నుంచి 12వ తేదీ వరకు అయిదు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కల్యాణోత్సవాన్ని నిర్వహించే వేదిక స్థలిని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. ఉత్సవ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనరు వీవీవీఎస్ఎన్.మూర్తి వివరించారు. జూన్ 8న ఉదయం విష్వక్సేనారాధన, సుప్రభాత సేవతో కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడతారు. అంకురార్పణ, మత్స్యంగ్రహణం, పంచగవ్యం, హోమం నిర్వహించిన అనంతరం మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీలలితా విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతుంది. 9న సుప్రభాత సేవ, సహస్రనామార్చన, 10 గంటలకు ధ్వజారోహణ, తిరువీధి ఉత్సవం, ఎదురు సన్నాహం అనంతరం రాత్రి 10.05 గంటలకు స్వామివారి దివ్యకల్యాణం జరుగుతుంది. 10న సుప్రభాత సేవ, వేదపారాయణం, నిత్యహోమం, సాయంత్రం పండిత సదస్యం, రాత్రి నిత్యహోమం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి. 11న సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, సాయంత్రం 7 గంటలకు ధ్వజ అవరోహణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటవుతాయి. 12న ఉదయం సుప్రభాతసేవ, నిత్య హోమం, రాత్రి 8 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, 9 గంటలకు శ్రీపుష్పయాగం జరుగుతుంది.

# పంచలహరిలు పాఠ్యాంశాలుగా బోధించాలి

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ప్రఖ్యాత పండితుడు జగన్నాథపండితరాయలు రచించిన గ్రంథరసాల్లో ప్రధానమైన పంచలహరిలు పాఠ్యాంశాలుగా విద్యార్థులకు బోధన జరగాలని, ఆయన జన్మదినంపై పరిశోధన చేసి ఏటా ఆ వేడుకను నిర్వహించాలని ముంగండలో జాతీయ సాహిత్య సదస్సు తీర్మానించింది. జగన్నాథపడింతరాయలు పేరిట ముంగండలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సాహిత్య సదస్సు ముగిసింది. ముగింపు సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్య పి.వరప్రసాద మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సుకు రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం (తిరుపతి) సాహిత్య విభాగం అధ్యక్షుడు ఆచార్య గుళ్లపల్లి శ్రీరామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. జగన్నాథపండితరాయలు రచించిన అమృతలహరి, పీయూషలహరి, సుధాలహరి, కరుణాలహరి, లక్ష్మీలహరి ఇలా ఐదు లహరిలు నేటితరం విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఇవి మానవీయ విలువలు, నదులు, భగవంతుడు గురించి ఉద్బోధిస్తూ రాసిన గ్రంథాలని సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ప్రధానంగా జగన్నాథపండితరాయలు జన్మదిన వివరాలపై పరిశోధన చేయాలని సూచించారు. జగన్నాథపండితరాయల జన్మదినం కూడా ఏటా నిర్వహించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సదస్సు కోరింది. ఈ సదస్సులో పలువురు ఆచార్యులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. తిరుపతికి చెందిన రాష్ట్రీయ సంస్కృతవిద్యాపీఠం, ముంగండకు చెందిన శ్రీజగన్నాథ పండితరాజపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు రెండు రోజులపాటు సాగింది.



ఆచార్య గుళ్లపల్లి శ్రీరామకృష్ణమూర్తికి సత్కారం

# అందరిలోనూ దైవాన్ని చూడగలిగితే!



ధర్మపథం

**స్వ**ర్గలోకాన్ని చేరాలంటే ఎన్నెన్నో పుణ్యకార్యాలు చేయాలి. మరెన్నో దానాలు, యజ్ఞాలు చేయాలి. అంత సమయం కానీ, ఓపిక కానీ ఎక్కడున్నాయని కొంతమంది బాధపడుతుంటారు. అలాంటివారు బాధపడనవసరంలేదని, ఓ సులభ మార్గముందని తెలియచెప్పే కథాసందర్భం ఇది. మహాభారతం అశ్వమేధపర్వంలో శ్రీకృష్ణపరమాత్ముడు స్వయంగా ధర్మరాజుకు ఈ విషయాలన్నీ వివరించాడు. ధర్మాన్ని విన్నా, చూసినా, చెప్పినా, ఆచరించినా, ఆమోదించినా అది మనిషిని ఇంద్రపదానికి చేరుస్తుంది. ఇంద్రపదంలో ఉన్న ఆ మనిషి అసమాన ఇంద్రభోగాలను అనుభవించే అవకాశాన్ని కూడా ధర్మాచరణమనే ఒకే ఒక్క మంచి లక్షణం కలిగిస్తుంది. ధర్మాచరణ విషయంలో ఎన్నెన్నో ధర్మ సూక్ష్మాలుంటాయి. అవి సాధారణంగా అందరికీ అర్థం కావు. వాటిని గురించి బాగా తెలిసిన గురువులను, పెద్దలను పండితులను అడిగి వాటిని జాగ్రత్తగా అర్థం చేసుకొని ఆచరించాలి.

### ధర్మం కోసం యత్నించాలి

ధర్మం కోసం యత్నించే వారికి లోకంలో దుర్లభమైనది ఏదీ ఉండదు. ధర్మమే మనిషికి తల్లీ, తండ్రి, నాథుడు, మిత్రుడు, సోదరుడు, సఖుడు, ప్రభువు కూడా. ధర్మం వల్లనే ధనాదులు, కామాలు, భోగాలు, సుఖాలు కలుగుతుంటాయి. ధర్మం వల్లనే ఉత్తమమైన ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. ధర్మాచరణం చేతనే ఉత్తమ స్వర్గం లభిస్తుంది. విశుద్ధధర్మాన్ని సేవిస్తే ఆ ధర్మమే మహాభయం నుంచి రక్షిస్తుంది. ధర్మం వల్లనే దైవత్వం కూడా ప్రాప్తిస్తుంది. నరుడిని పవిత్రుడిని చేసే శక్తి ధర్మానికి మాత్రమే ఉంది. మనిషికి కాలక్రమంలో పాపం క్షీణిస్తే తప్ప ధర్మాన్ని ఆచరించాలన్న బుద్ధి పుట్టదు. అందుకనే తెలిసి తెలిసే ఎప్పుడూ పాపంవైపు చూడనే కూడదు. దుర్లభమైన మానవ జన్మ వేలకొద్దీ జన్మల తర్వాత జీవుడికి లభిస్తుంటుంది. అలాంటి మానవ జన్మ కలిగినా కూడా మనిషి ధర్మాన్ని ఆచరించకపోతే ఆత్మవంచన చేసుకున్నట్టే అవుతుంది. కుత్సితులు, దరిద్రులు, కురూపులు, రోగిష్టులు, మూర్ఖులుగా కొందరు మనుషులు ఎందుకు కనిపిస్తున్నారంటే గత జన్మలలో వారు ధర్మాన్ని ఆచరించనందువల్లనే. దీర్ఘాయువు కలవారు, శూరులు, పండితులు, భోగాలనుభవించేవారు. ఆరోగ్యవంతులు, సౌందర్యవంతులుగా ప్రస్తుత జన్మలో కనిపిస్తున్న వారంతా గత జన్మలలో ఉత్తమ ధర్మాన్ని ఆచరించినవారి కిందే లెక్క. పవిత్ర ధర్మాన్ని ఆచరిస్తే అది ఉత్తమగతులను కలిగించి తీరుతుంది. అధర్మాన్ని ఆచరిస్తే పశుపక్ష్యాది నీచజన్మలు లభిస్తాయి. ధర్మాచరణలో ప్రధానమైన అంశం ఒకటుంది. అదే భగవంతుడిని శరణువేడటం. ఆ స్వామిని శరణువేడితే అన్నింటికన్నా ఉత్తమమైన ఆత్మతత్త్వాన్ని కూడా తెలుసుకొనే శక్తినిస్తాడు. మానవ జన్మను ధర్మాన్ని చక్కగా నిలపటానికి, దుర్మార్గాలను నశింపజేయటానికి వినియోగించాలి. భగవంతుడిని తెలుసుకొని భక్తితో ఆరాధిస్తే ఎంత మంచి జరుగుతుందో భగవంతుడిని ద్వేషిస్తూ ధర్మాన్ని వ్యతిరేకించే వారికి అంత చెడు జరుగుతుంది.

### అలాంటి వారికే మానవజన్మ..

భగవద్భక్తుడు తోటి మనుషులందరిలోనూ దైవాన్ని చూడగలగాలి. అలాంటి భక్తులంటేనే భగవంతుడికి బాగా ఇష్టం. అలాంటి వారికే ఆయన సాయుజ్యాన్ని కలిగిస్తాడు. భగవద్భక్తుల మానవ జన్మ సఫలమవుతుంది. భక్తివల్ల మనిషికి కలిగే ప్రయోజనమేమంటే పాపాలకు ఆకర్షితులు కారు. తామరాకు మీద నీటిబొట్టులాగా పాపాలను అంటించుకొక స్వచ్ఛంగా ఉంటుంటారు. వేలకొద్దీ జన్మల కాలం తపస్సు చేసి అంతఃకరణ శుద్ధిని పొంది మానవ జన్మను ఎత్తినవారికే భక్తి అలవాటవుతూ ఉంటుంది. ఆ భక్తి శక్తిగా మారి ఆ మనిషిని సమున్నతుడిగా ఉండేలా చేస్తుంది అని శ్రీకృష్ణుడు ధర్మాచరణ విశిష్టతను గురించి, భక్తితో జీవితాన్ని గడపవలసిన అవసరాన్ని గురించి ధర్మరాజుకు ఇలా వివరించి చెప్పాడు. సమాజమంతా శాంతిమయం, సుఖమయం కావాలంటే ప్రతి మనిషీ తనకు నిర్దేశించిన ధర్మాన్ని ఆచరిస్తుండాలి. భక్తి మనిషిలో ఒక క్రమశిక్షణను అలవాటుచేస్తుంది. క్రమశిక్షణాయుత జీవితానికి ధర్మాచరణ సులభతరమవుతుంది. అందుకనే ప్రతి మనిషీ ధర్మబద్ధుడిగా భక్తితో ప్రవర్తిస్తుండాలని అంటుంటారు పెద్దలు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## పైత్యరోగికి పంచదార చేదు

జాతీయాలు నుడికారాలు

**ఈ** జాతీయంలో కనిపించే పైత్యరోగి అనే పదానికి అధర్మాన్ని అనుసరించేవాడు అని అర్థం. పైత్యం ఉన్నప్పుడు పద్ధతి ప్రకారం కాక తన ఇష్టం వచ్చినట్టు ఏదేదో పిచ్చిగా ప్రవర్తించటం సహజం. అలా పైత్యరోగిలాగా ఏదేదో మాట్లాడుతూ ధర్మవిరుద్ధంగా నడుచుకొనేవాడికి పంచదారను పోలిన మంచి మాటలను ఎవరు ఎంతగా చెప్పినా నచ్చవు. పైగా ఆ మాటలను చేదును అసహ్యించుకున్నట్టు అసహ్యించుకుంటాడు. ఈ భావం ఆధారంగా ఈ జాతీయం ప్రయోగంలోకి వచ్చింది.

## గుట్టలో విశేష పూజలు



**నల్గొండ, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం నిత్య పూజలు విశేషంగా జరిగాయి. రాష్ట్రావతరణ సందర్భంగా క్షేత్ర సందర్శన కోసం భక్తజనులు అధికంగా రావడంతో రద్దీ నెలకొంది. వైష్ణవ ఆలయంగా కొనసాగుతున్న ఈ క్షేత్రంలో శైవపూజలు నిత్యం కొనసాగడం విశేషం. ప్రధాన దేవాలయంలోని మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించారు. వేదమంత్ర పఠనాల మధ్య పాలతో అభిషేకించి దర్శనమూర్తులను ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. కొండపైనే ఉన్న శివాలయంలో పరమేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా ఈ క్షేత్రంలోని ప్రధాన దేవాలయంతో పాటు శివాలయాన్ని తోరణాలతో అలంకరించారు. శ్రీస్వామివారి నివేదన కోసం ప్రత్యేక వంటకాలు చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహుల నిత్యకల్యాణోత్సవాల పర్వాలను చేపట్టారు. కల్యాణ మూర్తులను తిరువీధులలో ఊరేగించారు. సాయంత్రం అలంకార తిరువీధి సేవోత్సవాలలో భక్తులు అధికంగా పాల్గొన్నారు.

## మోహన్‌దాసులను కొలిస్తే జన్మధన్యం



మోహన్‌దాసు తంబూరోత్సవం

**చిప్పగిరి(కర్నూలు జిల్లా), న్యూస్‌టుడే:** భగవంతుని రహస్యాన్ని తెలిసిన మోహన్‌దాసులను కొలిస్తే జన్మ ధన్యమవుతుందని పండితులు గురురాజ్‌దాసులు, పీఠాధిపతులు వెంకోబదాసులు ఉద్ఘాటించారు. సోమవారం చిప్పగిరి విజయదాసులు ఆలయంలో మోహన్‌దాసు మధ్యారాధన సందర్భంగా కీర్తన కచేరి నిర్వహించారు. పాట ద్వారా ప్రపంచానికి భగవంతుడి సారాంశం, భక్తిని తెలియజేసిన మహానుభావుడు దాసులు అని వివరించారు. అంతకు ముందు పీఠాధిపతులు వెంకోబదాసులు ఆధ్వర్యంలో బృందావనసేవ, అలంకరణ, తాంజూరోత్సవం, మడుగు రథం ఊరేగింపు, తాంబూరోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా మధ్యారాధనకు భక్తులు హాజరయ్యారు.

## కన్నుల పండువగా మల్లన్న కల్యాణం

ఆంధ్రావని



ప్రత్యేక పూజలు చేస్తున్న డా॥కృపారాణి దంపతులు

**టెక్కలి(శ్రీకాకుళం జిల్లా), న్యూస్‌టుడే:** కలియుగ కార్తీక కైలాసంగా పేరున్న రావివలస ఎండల మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఉమాసహిత మల్లికార్జున స్వామివారి కల్యాణం భక్తులకు కనువిందు కలిగించింది. మల్లన్న కల్యాణాన్ని కనులారా చూసి తరించేందుకు సోమవారం వేకువజాము నుంచే జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు జరిగిన తిరువీధిలో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. 11.08 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరిపించారు. ఆలయ ఛైర్మన్ సర్లాన సుధాకర్, కార్యనిర్వహణాధికారి జి.గురునాథరావు చేతుల మీదుగా వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఈ పూజల్లో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి- రామ్మోహనరావు దంపతులతో పాటు పలువురు దంపతులు పాల్గొన్నారు.



మల్లన్న కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

## సింగరాయకొండలో కోలాహలం



స్వామివారికి శాంతి కల్యాణం

**పాతసింగరాయకొండ(ప్రకాశం జిల్లా):** పాతసింగరాయకొండ గ్రామంలో పునః నిర్మాణం చేసిన శ్రీ పట్టాభి రామస్వామి ఆలయంలో సోమవారం సీతా, లక్ష్మణ ఆంజనేయస్వాముల సమేత కోదండరామస్వామి నూతన శిలావిగ్రహ ప్రతిష్ఠా, కలశ స్థాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆచార్యులు దివి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు సోమవారం ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, యంత్రస్థాపన అనంతరం చిమటా నాగేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 7.45 గంటలకు శిఖర కలశస్థాపన నిర్వహించారు. అనంతరం సరిగ్గా 8 గంటలకు శిలా విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారి పీఠంలో వెండి, బంగారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. కన్నెబోయిన వెంకటేశ్వర్లు, గాలి నరసింహారావు, మట్టే హజరత్‌బాబు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి శాంతి కల్యాణం జరిపించారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి శేషలక్ష్మీనరసింహాచార్యులు, ఇతర అర్చకస్వాములు పర్యవేక్షించారు.

## విశిష్ట దినాన అశేష భక్తజనం

**బాసర(ఆదిలాబాద్ జిల్లా), న్యూస్‌టుడే:** అరవై ఏళ్ల ఆకాంక్ష పరిపూర్ణమైన రోజున బాసర సరస్వతి ఆలయం భక్తజనులతో కిటకిటలాడింది. రాష్ట్ర ఆవిర్భావ దినానికి తోడు ఆదివారం ఉదయం వేళలో శుభముహూర్తం ఉండటంతో చాల మంది భక్తులు చిరకాలంగా నిలిచిపోవాలని ఆశిస్తూ తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలను నిర్వహించారు. ఆదివారం 1100 మంది చిన్నారులతో అక్షరశ్రీకార పూజలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి రూ.5,50,000 ఆదాయం సమకూరింది. మరోవైపు ఆలయాధికారులు ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయానికి తరలివచ్చే భక్తులకు స్వాగత సూచకంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. వివిధ రకలైన నాలుగు క్వింటాళ్ల పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.



ఆలయానికి పుష్పాలంకరణ

## ముదినేపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ

**ముదినేపల్లి(కృష్ణా జిల్లా), న్యూస్‌టుడే:** నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర, వల్లీదేవసేన సమేత శివ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం 8.11గంటలకు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సుదాబత్తుల వెంకటేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు; సుదాబత్తుల రామకృష్ణ, బేబి సరోజిని దంపతులు పీటలమీద కూర్చుని ప్రతిష్ఠ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ కొండూరి గోపాలరావు, కేఎస్‌వీనాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజాదికాలు జరిపారు. వాడవల్లి, ఉరిమి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున మహోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు ఐదువేల మంది పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు సుదాబత్తుల సుధాకర్, సర్పంచి కఠారి సత్యనారాయణ, గ్రామస్థులు, ఆలయ కమిటీ, భక్తబృందం పాల్గొన్నారు.



ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

# సంకల్ప శుద్ధితో ఏదైనా సాధ్యమే!

**స**ంకల్పశుద్ధి ఉండాలే కానీ ఎన్ని అవరోధాలు వచ్చినా ఎంతమంది అడ్డుకున్నా సంకల్పించిన పని జరిగి తీరుతుంది అని పెద్దలు చిన్నలకు చెబుతూ ప్రోత్సహిస్తుంటారు. అది వాస్తవమేనా అనంటే కచ్చితంగా వాస్తవమేనని అందుకు అగస్త్య మహర్షి జీవితంలో జరిగిన ఓ సంఘటనను ఉదాహరణగా చెబుతుంది మహాభారతం అశ్వమేధిక పర్వం తొంబై రెండో అధ్యాయం. పూర్వం అగస్త్య మహర్షి నిస్వార్థంగా లోకసంక్షేమం కోసం ఓ మహాయజ్ఞాన్ని సంకల్పించాడు. పన్నెండు సంవత్సరాల కాలంపాటు ఆ యజ్ఞాన్ని నిర్వహించాలనుకున్నాడు. అగస్త్యుడంతటి వాడు యజ్ఞం చేస్తున్నాడని తెలిసి ఎందరెందరో తేజోవంతులైన మహాత్ములు యజ్ఞానికి హోతలుగా వచ్చారు. వారిలో కొందరు కేవలం దుంపలను మాత్రమే ఆహారంగా తీసుకొనేవారున్నారు. మరికొందరు చెట్లకు పండిన పండ్లను మాత్రమే తినేవారున్నారు. ఇంకొందరు అశ్మకుట్టులు ఉన్నారు (తినదగిన ధాన్యాలను రాతిమీద నలగగొట్టి తినేవారిని అశ్మకుట్టులు అని అంటారు). ఇంకొందరు సూర్యకిరణాలను తాగేవారున్నారు. మరికొందరు అడిగి ఆహారం పెడితే కానీ తిననివారు, యతులు, భిక్షువులు ఆ యజ్ఞహోతల్లో ఉన్నారు.



## పరీక్షించిన ఇంద్రుడు

హోతలుగా వచ్చిన వారంతా స్వధర్మపాలకులు. క్రోధాన్ని, ఇంద్రియాలను జయించి మనోనిగ్రహం కలిగినవారు. హింస, దంభం అనే వాటిని దూరంగా పెట్టినవారే వాదంతా. అలాంటి మహానుభావులైన మహర్షులు అగస్త్యుడి చేత యజ్ఞం చేయించటానికి హోతలుగా వచ్చారు. అగస్త్యుడు కూడా వారందరికీ యోగ్యమైన పవిత్ర ఆహార పదార్థాలను సమకూర్చిపెట్టాడు. అయితే దేవేంద్రుడికి ఆ యజ్ఞం చేస్తున్న అగస్త్య మహర్షిని పరీక్షించాలనిపించింది. వెంటనే యజ్ఞం జరుగుతున్న ప్రాంతంలో ఒక్కచుక్క కూడా వర్షం పడకుండా చేశాడు. వర్షాలు లేకపోవటంతో దుంపలు, పండ్లు, ధాన్యాలు ఏమీ ఎక్కడా దొరకటం లేదు. మేఘాలకు అధిపతి ఇంద్రుడే కనుక ఆ ఇంద్రుడే వర్షం

**ధర్మపథం**

పడకుండా, తన యజ్ఞానికి కావలసిన పదార్థాలేవీ దొరకకుండా చేస్తున్నాడని అగస్త్యుడికి అర్థమైంది. అయితే అగస్త్యుడు, అక్కడున్న ఇతర హోతలు అంతా ఇంద్రియ నిగ్రహాన్ని కలిగినవారే. కోపాన్ని జయించినవారే. కనుక అగస్త్యుడు ఓ రోజున యజ్ఞ విరామ సమయంలో హోతలందరి ముందుకు వచ్చి విషయాన్ని వివరించాడు. తాను శ్రద్ధాపూర్వకంగా అందరికీ అన్నాన్ని సమకూరుస్తున్నట్టు చెప్పాడు. కానీ వర్షాలు పడకపోవటం వల్ల పంటలు పండటం లేదని, పన్నెండు సంవత్సరాలపాటు యజ్ఞాన్ని కొనసాగించాల్సి ఉంది కనుక తాను చెయ్యాల్సింది చెయ్యదలచుకున్నట్లు చెప్పాడు. ఇంద్రుడు వర్షం కురిపించినా, కురిపించకపోయినా ఒక మంచి లక్ష్యంతో తాను ప్రారంభించిన యజ్ఞాన్ని మధ్యలో ఆపటం జరగదని చెప్పాడు. అప్పుడు అక్కడున్న హోతలంతా అదెలా సాధ్యం అని అన్నారు. అప్పుడు అగస్త్యమహర్షి ధ్యానంతో తాను మానసికంగా చెయ్యాల్సిన పన్నెండు సంవత్సరాల మహాయజ్ఞాన్ని చేస్తానన్నాడు.

## ప్రశాంతంగా ముగిసిన మానసిక యజ్ఞం

ధ్యానంతో చేసే మానసిక యజ్ఞవిధానం సనాతనమైనది. వేద సమ్మతమైనది అని అగస్త్యుడు చెప్పాడు. అలా తాను పట్టుదలతో మానసికంగా చేస్తున్న యజ్ఞానికి ఎవరూ విఘ్నం కల్పించలేరని, ఇంద్రుడు వర్షించినా, వర్షించకపోయినా తాను చేస్తున్న యజ్ఞ ప్రభావంతో ప్రకృతంతా పచ్చపచ్చగా విలసిల్లుతుందని చెప్పాడు అగస్త్యుడు. ప్రసుత్తం కనిపిస్తున్న అనావృష్టిని ఇంద్రుడు తన యజ్ఞానికి విఘ్నం కలగాలని సృష్టించినట్లైతే, ఇకమీదట ఆ ఇంద్రుడిని కూడా జయించి తానే ఇంద్రుడై ప్రజలను బతికిస్తానని అన్నాడా మహర్షి. అదంతా తన మానసిక యజ్ఞంతో సాధ్యమని చెప్పాడు అగస్త్యుడు. అంతేకాక వెంటనే మానసిక యజ్ఞానికి సంకల్పం చేశాడు. అగస్త్యుడు పన్నెండు సంవత్సరాల పాటు చేయ్యాలనుకొన్న యజ్ఞం ఆయన స్వార్థానికి కాదు. ముల్లోకాలలోని ప్రజల సంక్షేమం కోసం. ఆ సంకల్పం ఎంతో పవిత్రమైనది. అందుకే ఆయన సంకల్పించగానే యజ్ఞానికి కావాలసిన బంగారం, ధనం ఇలాంటివన్నీ వచ్చి సమకూరాయి. ఆ తర్వాత అప్సరసల సమూహాలు, కిన్నరులు, గంధర్వులు, విశ్వావసువు లాంటివారు. స్వర్గం, స్వర్గనివాసులు, ధర్మదేవతలాంటి వారంతా వచ్చారు. అగస్త్యుడి యజ్ఞం ఎంతో గొప్పగా జరిగింది. ఆవాహన చేసిన దేవతలంతా వచ్చి అగస్త్యుడిని అభినందించి ఆనందించారు. చివరకు దేవరాజైన ఇంద్రుడు కూడా అగస్త్యుడు తన పరీక్షలో నెగ్గినందుకు సంతోషిస్తూ దేవగురువు బృహస్పతితో సహా అక్కడికొచ్చి అగస్త్యమహర్షిని ప్రసన్నం చేసుకొన్నాడు. ఇలా అగస్త్యుడు లోకహితాన్ని కాంక్షిస్తూ చేసిన యజ్ఞం సఫలమైంది. అలా జరగటానికి ప్రధాన కారణం ఆ మహర్షి సత్సంకల్పమే. తలపెట్టిన పని మంచిదైతే ఆ పని ముగించాలన్న సంకల్పం శుద్ధంగా ఉంటే ఎన్ని అవరోధాలు వచ్చినా పని జరిగి తీరుతుంది అనే విషయాన్ని ప్రకటిస్తుంది ఈ కథాసందర్భం

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# నోరంతా పళ్లు.. ఊరంతా అప్పులు

**జాతీయాలు నుడికారాలు**

**కొ**న్ని వాస్తవాలను మరికొన్ని వాస్తవాలతో పోల్చి చెబుతూ కొన్నికొన్ని జాతీయాలు ఆవిర్భవించాయి. అలాంటి వాటి వరుసలో ఇది కూడా ఒకటి. సర్వసాధారణంగా నోట్లో పైనా, కిందా పళ్లు ఉండటం మామూలే. నోరంతా పళ్లు అనంటే నోటిలో ఉండాల్సినన్ని పళ్లు అన్నీ ఉండటం అని అర్థం. అది ఎంత సహజమో అంతే సహజంగా ఓ వ్యక్తికి ఊరంతా అప్పులున్నాయట. అలా ఊరంతా అప్పులున్న వ్యక్తిని గురించి చెప్పాల్సివచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.



అసుర సంహారంలో శక్తివేషం

# చోరగుడిలో అంకమ్మతల్లి ఊరేగింపు

**చోరగుడి (పమిడిముక్కల), న్యూస్‌టుడే:** మూడు రోజులుగా చోరగుడిలో సాగుతున్న తులాబందులవారి అంకమ్మతల్లి సంబరాల్లో భాగంగా మంగళవారం తెల్లగుర్రాలు పూన్చిన రథంపై అంకమ్మతల్లి గ్రామోత్సవం విద్యుద్దీప కాంతుల్లో, విచిత్ర వేషధారణలతో వైభవంగా జరిగింది. 5 ఏళ్లకు ఒక పర్యాయం 5 రోజులపాటు జరిగే ఈ సంబరాలకు వివిధ జిల్లాల్లో స్థిరపడిన తులాబందులవారి కుటుంబీకులు హాజరవుతామని, స్థానిక బంధువర్గం సహకారంతో ఈ సంబరాలను వైభవంగా సమష్టిగా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామోత్సవం సందర్భంగా అమలాపురం మండలం గూడాల నుంచి వచ్చిన విజయదుర్గా గరగనృత్య బృందం ప్రదర్శించిన నృత్యం, విన్యాసాలు, వేషధారణలు అమితంగా ఆకర్షించాయి.

# భక్తిశ్రద్ధలతో మోహన్‌దాసు ఆరాధన

**కర్నూలు, న్యూస్‌టుడే:** విజయదాసు బృందావనంలో మోహన్‌దాసు ఆరాధన ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ వెంకోబదాసులు ఆధ్వర్యంలో మోహన్‌దాసు చిత్రపటం ఊరేగింపు, మడుగురథం ఉత్సవం, తబూరోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. బెంగళూరు, మైసూరు, తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన పండితులు కచేరీలు, ప్రవచనాలు, వేణుగానం, విజయదాసు, మోహన్‌దాసు జీవిత చరిత్ర, తదితర కార్యక్రమాలను కనుల పండుగలా నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. మరో రెండు రోజులపాటు కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు శ్రీపాదదాసు, మారుతిదాసు తెలిపారు.



మోహన్‌దాసు చిత్రపటాన్ని ఊరేగిస్తున్న పండితులు

# కొండగట్టులో భక్తజనం

**ఆంధ్రావని**

**కరీంనగర్, న్యూస్‌టుడే:** మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం భక్తుల రద్దీతో పోటెత్తింది. పాఠశాలలకు సెలవులు కావడంతో పిల్లలతో తల్లిదండ్రులు, పంటలు చేతికందడంతో రైతులు స్వామివారిని దర్శించుకొని వెళ్లారు. వాహన పూజల కోసం వరికోత యంత్రాలు, భారీ వాహనాలు రావడంతో బస్టాండు ప్రాంతం రద్దీగా మారింది. తెలంగాణ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేయడంతో ఆయన పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకొంటూ మండల తెరాస అధ్యక్షుడు జనగం శ్రీనివాస్, సింగిల్విండో అధ్యక్షుడు అడువాల సురేష్ అంజన్న ఆలయంలో పూజలు నిర్వహించారు.



కొండగట్టులో భక్తుల రద్దీ

# ఆకట్టుకున్న ప్రదర్శనలు

**పాల్వంచ (ఖమ్మం జిల్లా), న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి నిర్వహించిన జిల్లాస్థాయి ఏకపాత్రాభినయ పోటీలు మంగళవారంతో ముగిశాయి. పోటీలు పాల్వంచ కేటీపీఎస్ ఇంజినీర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగాయి. వివిధ నాటకాలు, కళారూపాల ప్రదర్శనలు, తెలంగాణ పాటలు, నృత్యాలతో రెండురోజుల సంబరాలు ముగిశాయి. కళాకారుల ప్రదర్శనలు వీక్షకులను కుర్చీలకు కట్టిపడేశాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. న్యాయనిర్ణేతగా రంగరాజు వ్యవహరించారు. హరిశ్చంద్ర నాటక ప్రదర్శనకు వైరా కళాకారుడు తాళ్ళూరి కృష్ణకుప్రథమ బహుమతి అందజేశారు. తల్లాడ మండల కుర్నవెల్లి గ్రామవాసి వెంకటనారాయణరెడ్డి ఆత్మఘోష అనే ప్రదర్శనకు ద్వితీయ స్థానం, తల్లాడ మండలం వెంకటాపురం నివాసి సీతారామరాజు ప్రదర్శనకు తృతీయ స్థానం దక్కాయి. అనంతరం పోటీల నిర్వాహకుడు పాకాలపాటి రోశయ్య మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కవులు, కళాకారులు వారి సాహిత్యం, కళానైపుణ్యాలతో తెలంగాణ మలిఉద్యమాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. బహుమతి ప్రదానం కార్యక్రమానికి హాజరైన ప్రజానాట్యమండలి రాష్ట్రకార్యదర్శి వేముల కొండలరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిజిల్లాకు కళాకారుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో కోటిరూపాయాలు కేటయించాలన్నారు. కళాకారులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని, బ్యాంకుల ద్వారా రూణాలు ఇచ్చి కళారంగాన్ని ముందుకు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ కళాకారుడు నామా బుచ్చయ్య, సత్తుపల్లి కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు రంగపురి వెంకటేశ్వరావు, రామకృష్ణ, లక్ష్మణ్, ఆరుద్ర సత్యనారాయణ, డోలి సారయ్య పాల్గొన్నారు.



అడవితల్లి నాటక ప్రదర్శన చేస్తున్న దృశ్యం

# మరుపొంగళ్ల జాతర

**తిరుపతి, న్యూస్‌టుడే:** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర తరువాత వచ్చిన మూడో మంగళవారం కావడంతో భక్తులు అమ్మవారికి మరుపొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణశర్మ, ఈవో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి పొంగళ్లు, వీధుల్లో ఇంటిముంగిట అంబళ్లు గంగమ్మకు నైవేద్యంగా సమర్పించారు. ఆలయం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో కిక్కిరిసింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర ఉన్నత పాఠశాల 1978-79 పూర్వవిద్యార్థుల సంఘం గంగమ్మ జాతర మూడో మంగళవారం పురస్కరించుకొని భక్తులకు అన్నదానం చేశారు. మజ్జిగ కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు మురళి, నందగోపాల్, రామచంద్ర, సుబ్రమణ్యం, రమేష్, వెంకటరమణ, దేవేంద్ర, తిరుమలరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో గంగమ్మతల్లి



అమ్మవారికి ప్రసాదాన్ని తీసుకొస్తున్న మహిళలు,

# ఆకాశం వెనుక ఏముంది?

ఆకాశం, దిక్కులు, భూమి, గాలి, నీరు వీటి పరిమాణం ఎంత అనే విషయాన్ని గురించి ఈనాటికీ శాస్త్రజ్ఞులు పరిశోధనలు జరుపుతూనే ఉన్నారు. అయితే మన రుషులు పూర్వం ఎప్పుడో వీటి పరిమాణాన్ని నిర్ధరించి చెప్పారు. ఆనాటి శాస్త్ర సాంకేతిక పరిభాష ప్రకారం వాటి పరిమాణం కనిపిస్తుంది. అంటే మన సంప్రదాయంలో మానవజన్మ పొందిన తర్వాత కేవలం సాధారణంగా ఉండే జీవితాన్ని గడపటమేకాక మనిషి పుట్టుక గురించి, తన చుట్టూ ఉన్న ప్రకృతి గురించి నిత్యం పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయనే విషయం దీన్ని బట్టి అవగతమవుతుంది. ఈ విషయాలన్నిటినీ భృగుమహర్షి భరద్వాజ మహర్షికి తెలియచెప్పినట్టు మహాభారతం శాంతిపర్వం నూటఎనభైరెండో అధ్యాయం వివరిస్తోంది. ఆకాశం గురించి తెలుసుకొంటుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. ఎందుకంటే ఆ ఆకాశాన్ని సిద్ధులు, దేవతలు సేవిస్తూ ఉంటారు.



### దాన్ని తెలుసుకోవడం దేవతలకూ కష్టమే

ఆకాశం అనంతమైనది. వివిధలోకాలకు ఆశ్రయంగా ఉంటుంది. చూస్తున్న కొద్దీ ఎంతో రమణీయంగా ఉంటుంది. ఈ ఆకాశంలో అటుపైన కింద సూర్యచంద్రులు కనిపించని చోట సూర్యాగ్ని సమాన తేజస్సు గల దేవతలు స్వయంప్రకాశంతో వెలుగుతూ ఉంటారు. ఆ నక్షత్రరూప దేవతలు కూడా ఆకాశం అంతాన్ని చూడలేరు. అది అంతటి అనంతమైనది. ఎక్కడో పైన స్వయంప్రకాశులై వెలుగుతున్న దేవతలలో అప్రమేయమైన ఈ ఆకాశం నిండి ఉన్నది. భూమికి చివర సముద్రాలు, సముద్రాల చివర చీకటి, చీకటికి అవతల జలం, జలానికి అవతల అగ్ని ఉంటాయి. అలాగే కిందికి వెళితే రసాతలం చివర నీరుంటుంది. ఆ నీటికింద ఆదిశేషుడు, ఆయన కింద మళ్లీ ఆకాశం, ఆ ఆకాశానికి అవతల మళ్లీ జలం. ఇలా ఆకాశం, అగ్ని, గాలి, నీరు అనంతంగా ఉంటాయి. వీటి ప్రమాణాన్ని తెలుసుకోవటం దేవతలకు కూడా కష్టమే. అగ్ని, వాయువు, జలం, భూమి వీటి రంగులు ఆకాశం నుంచే సంక్రమిస్తాయి. తత్త్వజ్ఞానం లేనివారికి అవి ఆకాశంకంటే భిన్నంగా ఉన్నట్టు కనిపిస్తుంటాయి. మహర్షులు వివిధ శాస్త్రాలలో ముల్లోకాలు, సముద్రం వీటి ప్రమాణాన్ని కొంతవరకూ నిర్ణయించి చెప్పారు. కానీ అంతకుమించి ఇంకా అనంతంగా ఆకాశం ఉంది. ఆకాశం, అనంతుడు రెండూ ఒకటే. అదృశ్యుడై ఇంద్రియాతీతుడై ఉన్న అనంతుడైన ఆ పరమాత్మ పరిమాణాన్ని గురించి కచ్చితంగా చెప్పలేనట్టే ఆకాశాన్ని గురించి కూడా ఎవరూ కచ్చితంగా చెప్పరు. సిద్ధులు, దేవతల జ్ఞానం కూడా ఈ విషయంలో పరిమితమైనదే. అనంతుడుగా ప్రసిద్ధుడైన ఆ పరమాత్మ తన గుణాన్ని బట్టి దివ్యరూపాన్ని ధరిస్తూ, విడుస్తూ ఉన్నట్టే ఆకాశం కూడా ఒక్కోసారి ఒక్కొక్క రకంగా ఉంటూ ఉంటుంది.

### అనంతుడు ఆ పరబ్రహ్మమే

నమస్కరించదగిన వాటిలో ఆకాశం కూడా ఉంది. దానికి కారణం ఆ పరమాత్మ, పరబ్రహ్మమే ఆకాశంగా సర్వత్రా నిండి ఉండటం, విశ్వరూపుడైన పరమాత్మ పంచభూతాలుగా ప్రకటితమయ్యాడు. పంచభూతాలలో ఆకాశం ప్రధానమైనది. పరమాత్మ విరాట్ రూపాన్ని గమనించినప్పుడు కొండలు ఆయనకు ఎముకలుగా, భూమి ఆయనకు మేదస్సు, మాంసాలుగా, సముద్రాలు రక్తంగా, ఆకాశం ఉదరంగా, గాలి ఊపిరిగా, అగ్ని తేజస్సుగా, నదులు రక్తనాళాలుగా, సూర్యచంద్రులు నేత్రాలుగా, ఆకాశ ఉపరి భాగం ఆయన తలగా, నేల పాదాలుగా, దిక్కులు భుజాలుగా ఉన్నట్టు మహర్షులు నిర్ధరించారు. ఈ పరబ్రహ్మమే శ్రీమహావిష్ణువు. ఆయనే అనంతుడు. సర్వప్రాణులలో, ఆత్మరూపంలో ఉండేది ఆ విష్ణువే. ఆత్మశుద్ధి లేనివారికి ఆయన గురించి తెలుసుకోవటం సాధ్యంకాదు. అనంతుడనే ఆ విష్ణురూపమే ఆకాశ రూపంగా కూడానని మహాభారతంలోని ఈ కథాసందర్భం వివరిస్తోంది. అంతటి అనంతమైనది కనుకనే ఆకాశాన్ని గురించిన విషయాలు ఈనాటి శాస్త్రవేత్తలకు సహితం ఇంకా అంతుపట్టకుండా ఉన్నాయి. ఇలా ఆకాశానికి సంబంధించిన అన్ని విషయాలు అంతుపట్టకుండా ఉండటంలో విచిత్రమేమీ లేదని గొప్ప గొప్ప మహర్షులు, సిద్ధపురుషులు కూడా తమ తపస్సునంతటినీ ధారపోసినా ఆకాశం విషయాలను సంపూర్ణంగా తెలుసుకోలేక పోయారని పెద్దలు విశ్లేషించి చెప్పటం కనిపిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## నీటిబుడగ...

నీళ్లల్లో పుట్టిన బుడగ చాలా స్వల్ప వ్యవధిలోనే పగిలి కనుమరుగవుతూ ఉంటుంది. ఈ భావార్థాన్ని ఆధారంగా చేసుకొని అత్యంత తక్కువ కాలవ్యవధిని గురించి చెప్పేందుకు ఈ జాతీయాన్ని ఉదాహరణగా తీసుకుంటారు. లోక వ్యవహారంలో ఆయుప్రమాణం గురించి మాట్లాడేటప్పుడు మనిషి ఆయువునదే చాలా తక్కువని చెబుతూ జీవితం నీటిబుడగలాంటిదని అంటుంటారు.



పెద్ద శేషవాహనంపై అభయమిస్తున్న గోవిందరాజస్వామి

## వైభవమే.. వైభవమే

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీ గోవింద రాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కర్కాటక లగ్నంలో అంగరంగ వైభవంగా ఈ వేడకలు ప్రారంభమయ్యాయి. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య గరుడుని చిత్రంతోకూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అంతకుముందు స్వామివారికి బంగారు తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల మధ్య స్నపన తిరుమంజనం కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ జరిగింది.

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు మొదటి రోజు రాత్రి పెద్ద శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన.. శ్రీ గోవిందరాజస్వామి కన్నులపండువగా ఊరేగారు. ఊరేగింపు నగరంలోని ప్రధాన కూడళ్లమీదుగా సాగింది. ఈ శేషుడు ఏడు కొండలకు, ఏడు లోకాలకు సంకేతంగా ఏడుపడగలు గల ఆదిశేషుడు. శ్రీవారికి విశ్రాంతి, సుఖనిద్రకు కారణమవుతున్నాడు. తనను, శేషుణ్ణి దర్శించే భక్తుల్ని కాపాడుతానని, మీరందరూ శేషునివలే నాకు నిత్యం సేవకులుగా వుండి సత్ఫలాలు పొందాలని ఈవాహనసేవ ద్వారా ప్రబోధిస్తున్నారనేది భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ ఊరేగింపు కార్యక్రమంలో డిప్యూటీ ఈవో చంద్రశేఖర్‌పిళ్ళై, ఏఈవో ప్రసాదమూర్తిరాజు, ఆలయ సూపరింటెండెంట్‌లు దయాకర్, వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్లు రాజేష్‌ఖన్నా, బాలాజీ, అర్చకులు, సిబ్బంది, భద్రతా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అప్పన్న స్వామికి విశేష అర్చనలు

**సింహాచలం, విశాఖపట్నం జిల్లా, న్యూస్‌టుడే:** శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామికి వైదిక సంప్రదాయం ప్రకారం బుధవారం విశేష అర్చనలు జరిగాయి. స్వామి మూలవిరాటు వద్ద భక్తులు పండ్లు, ఫలాలు నివేదించి విశేష ఆరాధనలు చేశారు. అనంతరం ఆస్థానమండపంలో స్వామి నిత్యకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామికి వింజామర సేవలు చేశారు. కాగా భక్తకోటి పరంధాముడు అప్పన్నస్వామికి సేవ చేయడంలో పరమానందం ఉందని ఒడిశా ప్రాంతానికి చెందిన లక్ష్మీకాంతనాయకో దాసుడు అన్నారు. అంతరాలయంలో తన శిష్య బృందంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తులసి దళాలు పంపిణీ చేసి భక్తి మాధుర్యాన్ని తెలియజేశారు. అనంతరం ఆలయం వెలుపల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





శుభప్రదం శిక్షణ పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులతో పెద్దలు

## ధర్మరక్షణ.. సర్వ 'శుభప్రదం'

**శ్రీకాకుళం, న్యూస్‌టుడే:** 'ధర్మో రక్షతి రక్షితః' అన్న సూక్తి మేరకు ధర్మాన్ని రక్షిస్తే.. అది మనల్ని కాపాడుతుందని, సనాతనమైన హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తే.. అదే లోకానికి సర్వ 'శుభప్రదం'గా రక్షణ ఇస్తుందని తితిదే- ధర్మ ప్రచార మండలి పెద్దలు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే 'శుభప్రదం' కార్యక్రమాన్ని జిల్లాలో ఇకపై నిరంతరాయంగా.. నిర్వహించాలని ఈ సందర్భంగా అంతా తీర్మానించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తితిదే ధర్మ ప్రచార మండలి అధ్యక్షుడు పెంట హాటకేశం అధ్యక్షతన 'శుభప్రదం' కార్యక్రమ నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. తి.తి.దే ఆధ్వర్యంలో సింహాద్రినాథ సేవా సమితి పర్యవేక్షణలో శుభప్రదం శిక్షణ కార్యక్రమాన్ని 500మంది విద్యార్థులకే పరిమితం చేయకుండా ఇకపై అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లాలో ఉత్తమంగా సేవలందిస్తున్న 83మంది ఉపాధ్యాయులను గుర్తించిన సింహాద్రినాథ సేవా సమితి వారు పనిచేసే పాఠశాలల్లో ఇకపై వారానికో రోజు శుభప్రదం కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. విద్యార్థులకు హిందూ ధర్మాలపై అవగాహన కల్పించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రప్రథమంగా నిర్వహించిన శుభప్రదం ద్వారా విద్యార్థుల్లో మంచి చైతన్యం వచ్చిన నేపథ్యంలో ఇకపై వారానికో పర్యాయం చొప్పున ఆయా పాఠశాలల్లో శుభప్రదం కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## జ్ఞానమ్మ సేవలకు పోప్ గుర్తింపు

### ప్రకటించిన గుంటూరు మేత్రాసనం పీఠాధిపతి గాలిబాలి

**గుంటూరు, న్యూస్‌టుడే:** ఆత్మవశురాలైన తాటిపత్రి జ్ఞానమ్మ దేవునిస్వరాన్ని ఆలకించి సెయింటాన్స్ సంస్థను స్థాపించారని గుంటూరు మేత్రాసనం పీఠాధిపతి డాక్టర్ గాలిబాలి అన్నారు. ఫిరంగిపురానికి చెందిన తాటిపత్రి జ్ఞానమ్మను వాటికన్‌లోని పోప్ ఫ్రాన్సీస్ దైవ సేవకురాలిగా ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి గుంటూరు జిల్లా ఫిరంగిపురంలోని బాలయేసు కథెడ్రల్ దేవాలయ ఆవరణలో ఫాదర్ డిక్మన్, ఫాదర్ ఫర్మన్ ఆత్మీయ వేదికపై తాటిపత్రి జ్ఞానమ్మను దైవ సేవకురాలిగా డాక్టర్ గాలిబాలి, నెల్లూరు మేత్రాసనం పీఠాధిపతి ఎం.డి.ప్రకాశంలు అధికారికంగా ప్రకటించారు. వాటికన్ నగరం నుంచి పోప్ ఫ్రాన్సీస్ పంపించిన పట్టాభిషేకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం పాఠశాలల డిప్యూటీ జనరల్ మేనేజర్ ఫాదర్ పూదోట ఇన్నయ్య, సహాయక విచారణ గురువులు బత్తిని విద్యాసాగర్, రాష్ట్రంలోని వివిధ విచారణలకు చెందిన 140 మంది గురువులు, తమిళనాడు, రాష్ట్రంలోని సెయింటాన్స్ సంస్థకు చెందిన 500 మంది సిస్టర్లు, కథోలిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.





జ్ఞానమ్మ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి డాక్టర్ గాలిబాలి, పట్టాభిషేక మహోత్సవానికి హాజరైన కన్యాస్త్రీలు

# పాలమూరు వెంకన్న చిత్రం..
# తెలంగాణ సంస్కృతికి అద్దం

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే:** ఆయన కుంచె పట్టారంటే రంగుల పంచాల్సిందే.. ఆకట్టుకునే తెలంగాణ పల్లె అందాలు.. ఆలోచింప చేసే ఆచార వ్యవహారాలు.. జీవనవిధానంలోని వైవిధ్యాలు ఇలా ఏ అంశపై గీసిన చిత్రమైనా.. ఆయన ప్రతిభకు తార్కాణంగా నిలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పాలమూరు పేరు మార్మోగుతోంది. ఆయనే ప్రముఖ చిత్రకారుడు వెంకటస్వామి. తన వైవిధ్య చిత్రాలతో అలరిస్తున్నారు.

జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీకి చెందిన వెంకటస్వామి వృత్తి రీత్యా ప్రభుత్వ ఉద్యోగి. ఎక్కడ చిత్ర ప్రదర్శన జరిగినా.. ఆయన గీసిన చిత్రాలు ఆలోచింప చేస్తుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రదర్శనల్లో ఎంపికవడంతో పాలమూరుకు పేరు తెచ్చాయి. ప్రధానంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ చిత్రకారులతో వివిధ పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం వెంకటస్వామి గీసినతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల చిత్రాలను పరిశీలించి అనేక సందర్భాల్లో ప్రశంసించారు.



తెలంగాణ సంస్కృతిలో మహిళ పాత్ర, తెలంగాణ తల్లి



***జిల్లా కళాకారులను సమీకరించి కార్యశాల నిర్వహిస్తా.. :*** పాలమూరు జిల్లాలోని పల్లె అందాలు, జీవన సంస్కృతిపై చిత్రాలు గీసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా. మన జిల్లా చిత్రకారులు రాష్ట్రవాప్తంగా ఉన్నారు. వారందరినీ ఒక తాటిపైకి తీసుకవచ్చి చిత్రకళాభిరుచిని మరింతగా పెంపొందిస్తాను. అందరి సహకారంతో పెద్దఎత్తున కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించాలనుంది.

***- వెంకటస్వామి, ప్రముఖ చిత్రకారుడు.***

# సంస్కారాన్ని అలవర్చుకోవాలి



ఆలయంలో మాట్లాడుతున్న స్వామిజీ

**నిజామాబాద్, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరూ సంస్కారాన్ని అలవర్చుకోవాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతిస్వామి పేర్కొన్నారు. గురువారం పిట్లంలో సాయిబాబా ఆలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో సంస్కారం లోపించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు నిద్ర నుంచి లేవగానే భూమాతకు నమస్కరించాలని ఆయన సూచించారు. భూమాత ఎంతో సేవ చేస్తుందని ఆ మాతకు నమస్కరించడం సంస్కారానికి నిదర్శనమన్నారు. తల్లితండ్రులు, గురువు, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. పిల్లలను సంస్కారవంతమైన విద్యను అందించడానికి తల్లిదండ్రులు పాటుపడాలన్నారు. ఆంగ్ల మోజులో పిల్లలను సంస్కార హీనులుగా తయారు చేస్తున్నామని ఆయన వాపోయారు. దేశ సంస్కృతిని కాపాడాలని కోరారు.



# లక్ష్మీనారాయణ హోమాలు

**కొవ్వూరు (పశ్చిమ గోదావరి జిల్లా), న్యూస్‌టుడే:** గోష్పదేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహించిన సామూహిక రుషిపంచమి లక్షవర్తి వ్రతోద్యాపనలు గురువారం వైభవంగా ముగిశాయి. కొవ్వూరు ఆర్యవైశ్య మహిళా సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పూజాకార్యక్రమంలో పీటలపై కూర్చున్న భక్తులంతా బుధవారం రాత్రి కథాశ్రవణానంతరం జాగరణ చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం పునఃపూజ, శ్రీలక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. అనంతరం దశదానాలు, దంపతీపూజ, వేదాశీర్వచనలు నిర్వహించారు. లక్షవర్తి వ్రతంలో భాగంగా వెలిగించిన జ్యోతులతో సంస్కృతోన్నత పాఠశాల ప్రాంగణం దేదీప్యమానంగా కనిపించింది. వ్రత క్రతువు మహిళా ప్రతినిధులు బంగారు కాశీఅన్నపూర్ణ, కొత్త కనకరత్నం, కోట్ల ఇందిరాదేవి, బొండాడ రామలక్ష్మి, సభ్యులు పర్యవేక్షించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మట్టే నారాయణమూర్తి, మద్దుల కాశీవిశ్వనాధం, ఎం.బి.ఎస్.దత్తుడు, మద్దుల సత్యనారాయణ, గ్రంధి వీరభద్రస్వామి, సభ్యులు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# లోకాన్ని స్థిరంగా నిలిపేది సత్యమే..!

ధర్మపథం

సత్యాన్ని ఎందుకు అనుసరించాలి, అసత్యాన్ని అనుసరించినందువల్ల కలిగే నష్టమేమిటి, సుఖదుఃఖాలకు కారణమేమిటి అనే విషయాలను వివరించే కథాసందర్భం ఇది. మహాభారతం శాంతిపర్వం నూటతొంభయ్యో అధ్యాయంలో ఈ విషయాలున్నాయి. నిత్యం సత్యాన్నీ అనుసరించాలి. ఎందుకంటే సత్యమే బ్రహ్మ. సత్యమే తపస్సు. సత్యమే ప్రజలను సృష్టిస్తుంది. ఆ సృష్టిని నిలిపేది కూడా సత్యమే. ఈ లోకమంతా స్థిరంగా నిలిచి ఉండటానికి మూల స్తంభం సత్యం మాత్రమే. స్వర్గ నరకాలలో స్వర్గాన్ని చేరే పుణ్యాత్ములు కేవలం సత్యం వల్లనే స్వర్గానికి చేరగలుగుతున్నారు. సత్యానికి భిన్నమైనది అసత్యం. అది అంధకార రూపంగా ఉంటుంది. ఆ అంధకారం మనిషిని కిందికి లాగుతుంది తప్ప ఏనాడూ పైకి నిలబెట్టదు.



### స్వర్గం కాంతిమయం

చీకటి రూపంలో ఉన్న అసత్యానికి లొంగినవాడు ఏనాడూ వెలుగురూపమైన సత్యాన్ని చూడలేడు. ఆ వెలుగు ప్రస్తావనను కూడా భరించలేడు. అందుకే అసత్యవాది చీకటి గుయ్యారంలో మగ్గిపోతూ వెలుగును తిడుతూ ఉంటాడు. స్వర్గం కాంతిమయం. నరకం తమోమయం. సత్యాసత్య స్వరూపమైన మానవ జన్మ జ్ఞానఅజ్ఞానాలు రెండింటితోనూ కలిసి ఉంటుంది. మానవ జన్మలో కూడా సత్యాసత్య స్వరూపంగా ధర్మ అధర్మ మిశ్రితంగా వెలుగుచీకటుల కలయికగా సుఖదుఃఖాలు ఉంటాయి. సత్యమే ధర్మం. ధర్మమే ప్రకాశం. ప్రకాశమే సుఖం. అసత్యానికి మారురూపమే అధర్మం. అధర్మమంటే సంపూర్ణంగా అంధకారమే. ఆ అధర్మమనే అంధకారం మనిషికి దుఃఖాన్ని కలిగిస్తుంది తప్ప ఏనాటికీ సుఖాన్ని కలిగించదు. అయితే ధర్మరూపమైన సత్యాన్ని అనుసరిస్తూ ఉన్నా సుఖాలకు బదులు దుఃఖాలు కలుగుతున్నట్లు అనిపిస్తుంటుంది. దీనికి కారణం సత్యాశ్రితుడు అయినప్పటికీ మోహాన్ని విడిచిపెట్టకుండా ప్రవర్తించటమే. ఎంతటివారైనాసరే పొరపాటునైనా మోహంలో పడకూడదు. కచ్చితంగా మోహం అనేది దుఃఖాన్నే తెచ్చిపెడుతుంది. ఈ లోకంలో పైపైకి సుఖంగా కనిపించేవి ఏవీ శాశ్వత సుఖాన్ని ఇచ్చేవి కావు. ఆ సుఖాలన్నీ మోహం, తమస్సులాంటి వాటితో కలిసి తాత్కాలిక సుఖాన్ని, ఆనందాన్ని కలిగిస్తే కలిగించవచ్చేమో కానీ శాశ్వత సుఖ, ఆనందాలను ఇవ్వనే ఇవ్వవు. ఈ లోకంలో కఠోరంగా తపస్సు చేస్తున్న మహర్షులు తమ తపస్సుకు ఫలితంగా సుఖాన్ని కోరుకోవటం లేదు. ఎందుకంటే సుఖం అనేది తాత్కాలికం. ఆ తర్వాత పరిస్థితి మళ్లీ మామూలుగానే ఉంటుంది.

లేదంటే ఆ సుఖం రుచి తెలిసింది కనుక దాని కోసం అసత్య మార్గాన్ని అనుసరించి అధర్మంతో ఆ సుఖసంపాదనకు పాటుపడటం జరుగుతుంది. అలా చేస్తే అసత్య ప్రభావం వల్ల, నరకరూపమైన దుఃఖం తప్ప సమకూరేది ఏదీ ఉండదు. అసత్యం నుంచి అజ్ఞానం పుట్టింది కనుక అసత్యాన్ని అనుసరించినవారు కచ్చితంగా తమ జ్ఞానకాంతులను పోగొట్టుకొని అజ్ఞానమనే అంధకారంలో పడితీరుతారు. క్రోధ, లోభ, హింస, అసత్యాలకు లోనై ఇహపరాలలో సుఖానికి దూరం కావలసి వస్తుంది. అధర్మ ప్రభావంతోనే వివిధ రోగాలు, వ్యాధులు, తాపాలు కలుగుతుంటాయి. ఆకలిదప్పుల బాధలు పట్టిపీడిస్తుంటాయి. వాన, గాలి, ఎండ, చలి వీటి కారణంగా భయంకరమైన శారీరక కష్టాలు అనుభవించాల్సిన స్థితి పాపరూపమైన అధర్మాచరణం వల్లనే కలుగుతుంది. శోకం, దుఃఖం, వార్ధక్యం, మృత్యువు ఇలాంటివన్నీ నరకప్రాయాలే. శాశ్వతమైన బ్రహ్మానందాన్ని నిత్యం సత్యాన్ని అనుసరిస్తూ పొందినవారు స్వర్గసుఖాలను అనుభవిస్తారు. స్వర్గంలో వీచే గాలి హాయిగా ఉంటుంది. గంధం పరిమళభరితంగా ఉంటుంది. ఆకలిదప్పులు, శ్రమ ఉండవు. వార్ధక్యం, పాపానుభవం లాంటివి స్వర్గంలో ఉండవు. శాశ్వత బ్రహ్మానందరూపమైన అలాంటి ఆనందాలు, సుఖాలు ఈ లోకంలో కూడా నిరంతరం విలసిల్లాలంటే కచ్చితంగా అందరూ సత్యాన్ని అనుసరిస్తూ ఉండాలి.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

ఆంధ్రావని

# ప్రజల మనోసంకల్పమే సత్రయాగం



భక్తులతో మాట్లాడుతున్న సద్గురు శివానందమూర్తి

**జగ్గయ్యపేట(కృష్ణా జిల్లా), న్యూస్‌టుడే:** దేశవ్యాప్తంగా నేడు కనిపిస్తున్న మంచిమార్పులకు ఈశ్వరానుగ్రహంతోపాటు ప్రజల దృఢసంకల్పం తోడైందని సద్గురు శివానందమూర్తి అన్నారు. కోటిమంది కలిసి చేసే దృఢ మనోసంకల్పం 12ఏళ్ల సత్రయాగంతో సమానమని గుర్తుంచుకోవాలన్నారు. గురువారం రాత్రిబలుసుపాడు గురుధామ్‌కి విచ్చేసిన ఆయనకు గురు కుటుంబం గెంటేలవెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో ఆత్మీయంగా శాస్త్రోక్తంగా స్వాగతంపలికారు. జాతీయ రహదారి నుంచి కార్ల కాన్వాయ్‌గా సద్గురుమూర్తిని తోడ్కొని వచ్చిన అనంతరం గురుధామ్‌లో మహిళలు దీపోత్సవంతో వారికిపూర్ణ కుంభ స్వాగతం పలికి, పాదపూజ నిర్వహించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులనుద్దేశించి సద్గురు ఆత్మీయ ప్రసంగం చేస్తూ ప్రపంచానికి భారతదేశం గురువుగా ఉండాలంటే ఇక్కడి స్త్రీలు, బాలలు, వృద్ధులు క్షేమంగా, స్వేచ్ఛగా ఉండే పరిస్థితి కల్పించాలన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకూ తిరోగమనంలో ఉన్న భద్రత ఇప్పుడైనా తిరిగి పునరుద్ధరించబడాలన్నారు. అలాంటి మంచి కాలంకోసంప్రజలందరూ ఏకీకృతమైన మనసుతో సంకల్పం చేస్తే తప్పక నెరవేరుతుందని, అదే ఇప్పుడు దేశం ముందున్న ప్రథమ కర్తవ్యమని అన్నారు. మంచి పౌరులు తయారుకావడమే నిజమైన దేశసంపద అని అందుకు విద్యాసంస్థలు కృషిచేయాలని విచ్చేసిన పేర్కొన్నారు.

జాతీయాలు నుడికారాలు

## పాలపొంగు

**క్ష**ణికం, స్వల్పకాల వ్యవధి అనేలాంటి అర్థాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. పాలను కాచినప్పుడు కొంత సేపటికవి పొంగుతాయి. అయితే ఆ పొంగు ఎంతో సేపు ఉండదు. చాలా తక్కువ సమయంలోనే దిగిపోతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని యవ్వనం లాంటివి జీవితంలో చాలా తక్కువ సమయమే ఉంటాయని చెప్పటానికి ఈ జాతీయాన్ని వాడుతుంటారు. అలాగే కొంతమంది పొందే సంతోషాలు, సుఖాలను కూడా పాలపొంగుతో పోల్చి చెప్పటం కనిపిస్తుంది.

## భాష వైశిష్ట్యాన్ని చాటిన
# యుగళ శతావధానం



సమగ్ర పూరణ చేస్తున్న అపర్ణ, పుల్లాభట్ల నాగశాంతి



**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** అవధాన మణుల యుగళ మహిళా శతావధానం హృద్యంగా సాగింది. వివిధ అంశాలతో తెలుగు భాష వైశిష్ట్యాన్ని చాటింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖ సాహితి సంయుక్తాధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాల డాక్టర్ వై.ఎస్.మూర్తి ఆడిటోరియంలో మూడు రోజులపాటు కొనసాగిన యుగళ మహిళా జాతీయ శతావధానం గురువారం ముగిసింది. అవధానమణులు బులుసు అపర్ణ, పుల్లాభట్ల నాగశాంతి స్వరూప శతావధాన సమగ్ర పూరణ చేసి కార్యక్రమాన్ని ప్రతిభావంతంగా ముగించారు. అవధానంలో 25 దత్తపదులు, 25 సమస్యలు, 25 వర్ణనలు, 10 ఆశువులు, 11 ఘంటావధానాలు, 5 అప్రస్తుత ప్రసంగాలతో మొత్తం 101 అంశాలతో కార్యక్రమం తెలుగు భాషా వైశిష్ట్యాన్ని చాటింది. అవధానం మూడో రోజు కార్యక్రమానికి శ్రీమన్నారాయణ సంచాలకుడిగా వ్యవహరించారు. అవధానమణుల గురువు ధూళిపాళ మహదేవ మణి నేతృత్వంలో యుగళ శతావధానం కొనసాగింది. అవధాన కళ బహుళవాప్తి చెందాలని మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహరావు అన్నారు. యుగళ శతావధానం ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ శతావధానం ఇద్దరు కలిసి చేయడం సంక్లిష్టమని, ఎంతో సమన్వయంతో ఇది సాగాల్సి ఉంటుందన్నారు. విశాఖ సాహితి అధ్యక్షురాలు కోలవెన్ను మలయవాసిని ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ¬ సినీ నటుడు గొల్లపూడి మారుతీరావు, తదితరులు పాల్గొన్నారు.

# వేదాల సారాన్ని వివరించే పురాణాలు



మన పురాణాలు వేద విజ్ఞాన నిధులు. వేదాలను అందరూ చదివి అర్థం చేసుకొనే శక్తి ఉండదు. కనుక వేదాలలో ఉన్న అమూల్యమైన విషయాలన్నిటినీ పురాణాలలో ప్రస్తావించటం జరిగింది. వేదాలను విభజించిన వ్యాసభగవానుడే అష్టాదశ పురాణాలను కూడా రాయటం వల్ల వేద సారమంతా పురాణాలలోని అక్షరాక్షరంలోనూ నిండి ఉన్నట్టు కనిపిస్తుంది. బ్రహ్మర్షులు వేద శాస్త్రాలను అనుసరించి ఈ పురాణాలకు కొన్ని కచ్చితమైన లక్షణాలను నిర్దేశించారు. వాటి గురించిన వివరాలను తెలిపే కథా సందర్భం ఇది. మహాభాగవతం పన్నెండో స్కంధం ఏడో అధ్యాయంలో ఈ విషయాలన్నీ ఉన్నాయి. సర్గం, విసర్గం, వృత్తి, రక్ష, మన్వంతరం, వంశం, వంశానుచరితం, సంస్థ (ప్రళయం), హేతువు (ఊతి), అపాశ్రయం అనే పదింటినీ తొలుత పురాణ లక్షణాలుగా పురాణవేత్తలు పేర్కొన్నారు. అయితే కొందరు ఆచార్యులు ఆ పది లక్షణాలను అయిదుగా కుదించి పురాణ లక్షణాలు అయిదు అని చెప్పారు. ఈ రెండు వాదాలు ప్రామాణికాలే. మహా పురాణాలలో పది లక్షణాలు, ఉపపురాణాలలో అయిదు లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అనే ఆ అయిదు పురాణాల పంచ లక్షణాలు. బ్రహ్మర్షులు చెప్పిన పది పురాణ లక్షణాలు వివరంగా ఇలా కనిపిస్తున్నాయి.

### పూర్వకర్మలను అనుసరించే...

మూల ప్రకృతిలో లీనమైన గుణాలు క్షోభకు గురైనప్పుడు మహతత్త్వం ఉద్భవిస్తుంది. ఆ

## ధర్మపథం

మహతత్త్వం నుంచి తాత్విక, రాజస, తామస, అహంకారాలు ప్రకటితమవుతాయి. ఈ మూడింటి నుంచి పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, విషయాలు ఉత్పన్నమవుతాయి. ఈ ఉత్పత్తి క్రమాన్నే సర్గం అని అంటారు. పరమ పురుషుడి అనుగ్రహం వల్ల మహతత్త్వాదులు జీవుల పూర్వ కర్మలను అనుసరించి సత్, అసత్, వాసనల ప్రాముఖ్యాన్ని బట్టి ఒక బీజం నుంచి మరొక బీజం ఏర్పడినట్లు చరాచర ప్రాణుల సృష్టి జరుగుతుంటుంది. ఇలా సృష్టి జరగటాన్నే విసర్గం అని అంటారు. వృత్తి అనంటే జీవితం. చరప్రాణుల జీవన నిర్వహణ సామగ్రి అంటే ఆహార పదార్థాలు అచరప్రాణుల నుంచి లభిస్తాయి. వృక్షాలకు కాసే కాయలు, పండ్లులాంటివన్నీ దీనికి ఉదాహరణ. మనుషుల స్వభావాన్ని బట్టి చరప్రాణుల నుంచి కూడా పాలు, పెరుగులాంటి ఆహారపదార్థాలు లభిస్తాయి. అయితే ఈ ఆహారంలో మాంసాదులను చేర్చకూడదు. ఎందుకంటే మాంసభక్షణం హింసతో కూడుకొని ఉంటుంది. భగవంతుడు ప్రతి యుగంలోనూ పశుపక్ష్యాదులు, మనుషులు, రుషులు, దేవతలు లాంటి రూపాలలో అవతరించి లీలలను ప్రదర్శిస్తుంటాడు. ఈ అవతారాలలో స్వామి వేదధర్మ విరోధులను సంహరిస్తుంటాడు. ఈ అవతార లీలలన్నింటినీ ఆ స్వామి విశ్వరక్షణకే చేస్తుంటాడు. అందుకనే ఈ లీలావిలాసాలన్నిటినీ పురాణ దశ లక్షణాలలోని రక్ష అనేదిగా బ్రహ్మర్షులు పేర్కొన్నారు. మనువు, దేవతలు, మనుపుత్రులు, ఇంద్రుడు, సప్తరుషులు, భగవంతుడి అంశావతారాలు అనే విషయాలతో కూడిన సమయాన్నే మన్వంతరం అని అంటారు. బ్రహ్మదేవుడు సృష్టించిన రాజుల జీవితాలలోని భూత, భవిష్యత్, వర్తమాన అంశాలను, వారి సంతాన పరంపరను గురించి వివరించటాన్నే వంశం అని అంటారు. రాజుల వంశాలు, ఆ వంశాల చరిత్రలను వంశానుచరితం అని అంటారు.

### అందుకే అవి మహాజ్ఞాన నిధులు

ఈ బ్రహ్మాండం అంతా సహజంగానే ఎప్పుడో ఒకప్పుడు అంటే పరమాత్మ స్వరూపుడైన ఆ కాల పురుషుడి సంకల్పాన్ని అనుసరించి ప్రళయానికి గురౌతుంటుంది. ఈ ప్రళయం అనేది నిత్యం, నైమిత్తికం, ప్రాకృతికం, ఆత్యంతికం అని నాలుగు రకాలు. ఈ నాలుగు రకాల ప్రళయాన్నే సంస్థ అని అంటారు. సర్గాది నుంచి సృష్టి ప్రారంభం నుంచి అజ్ఞానానికి మూలమైన కర్మలను ఆచరించే జీవుడిని హేతువు అని అంటారు. అనుభవించగా మిగిలిన కర్మావశేషం గల జీవుడిని అనుశయం అని అంటారు. కర్మవాసనల నుంచి విముక్తమైన జీవుడిని అవ్యాకృతం అని అంటారు. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడూ జీవుడి మనోవృత్తులు. ఈ మూడు అవస్థలలోనూ జీవుడు విశ్వ, తైజస, ప్రాజ్ఞ అనే మూడు మాయామయ రూపాలలో కనిపిస్తుంటాడు. ఈ మూడు అవస్థలకు అతీతమైనది తురీయ (నాల్గవది) తత్త్వమైన బ్రహ్మాన్నే అపాశ్రయం అని అంటారు. వివిధ వస్తువుల నామరూపాలు వేరువేరైనా మౌలికమైన వస్తువు ఉనికిలో ఏ మార్పూ ఉండదు. పంచదార పాకంతో ఎన్నో రూపాలతో, మరెన్నో పేర్లతో ఉండే తీపి పదార్థాలను వండినా అందులో ఉండే మౌలికమైన వస్తువు పంచదార మాత్రమే. అలాగే ఆ బ్రహ్మం కూడా సృష్టిలో అనేకానేక విశేష రూపాలలోనూ, సామాన్య రూపాలలోనూ కనిపిస్తుంటాడు. కానీ అంతటా నిండి ఉండేది మాత్రం బ్రహ్మమే. బ్రహ్మాండం ఉత్పత్తి మొదలుకొని మహాప్రళయం వరకూ ఉన్న స్థితులలో మౌలికమైన సత్య స్వరూపంగా బ్రహ్మపదార్థం మాత్రమే ఉంటుంది. ఆ బ్రహ్మమే వస్తువుల అధిష్ఠాత. పురాణాలలో ఈ బ్రహ్మాన్ని అపాశ్రయం అని అంటారని మరి కొంత వివరణ కూడా ఉంది. ఇలా సర్గం నుంచి అపాశ్రయం దాకా ఉన్న అన్ని విషయాలను పురాణాలు వివరిస్తూ ఉంటాయి. అందుకే మన పురాణాలు మహాజ్ఞాన నిధులు అని పేరు పొందాయి.

– డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు

## జాతీయాలు నుడికారాలు

### ఉడుకుబోతు

ఉడుక్కోవడం అనంటే బాగా అసూయతోనో, కోపంతోనో ఉండటం అని అర్థం. ఉడుకు, పోతు ఉడుకుపోతు అనవుతుంది. తాగుబోతులాంటి రూపమే ఇది. ఉడుకుమోతుగా కూడా అక్కడక్కడ కనిపిస్తుంది. ఏదేమైనా ప్రతి చిన్నదానికి కోపగించుకునేవాడు, అసూయ చెందేవాడు అనే అర్థాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది.

# కొనసాగుతున్న భక్తుల తాకిడి

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** బాసర సరస్వతీ ఆలయం శుక్రవారం భక్తజనంతో కళకళలాడింది. వేసవి సెలవులు త్వరలో ముగుస్తుండటంతో ఆలయాన్ని భారీసంఖ్యలో భక్తులు సందర్శిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. శుక్రవారం ఆలయంలో 757 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి రూ. 3,50,000 ఆదాయం సమకూరింది.

## ఆంధ్రావని

## ఖిల్లా రామాలయంలో

# ఆళ్వారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దేవరాజు రామానుజ జీయర్ స్వామి

**డిచ్‌పల్లి(నిజామాబాద్), న్యూస్‌టుడే:** ప్రసిద్ధి చెందిన డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లిలోని రామాలయం ఆవరణలో ఆళ్వారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని చిన జీయర్‌స్వామి శిష్యుడు దేవరాజ రామానుజ జీయర్ స్వామి (హైదరాబాద్) సూచించారు. ఇందుకు దేవాలయ కమిటీ కృషి చేయాలని చెప్పారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లి రామాలయాన్ని ఆయన సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుడికి, భక్తుడికి మధ్య గురువు ఉండాలని అన్నారు. గురువు ద్వారా భక్తులు దేవుడిని దర్శించుకుంటే భగవంతుడు అనందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నర్సయ్య, డీసీసీబీ డైరెక్టర్ జైపాల్, మాజీ సర్పంచి సుదర్శన్, గ్రామ పెద్దలు, ప్రధానార్చకులు కృష్ణమాచారి, సుధాకర్, కమిటీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# పుణ్యకార్యాలే సుఖజీవన సోపానాలు

**జగ్గయ్యపేట(కృష్ణా జిల్లా), న్యూస్‌టుడే:** ఈశ్వరుడు సమస్త జీవకోటి అవసరాలను తీర్చే సకల వనరులను సమృద్ధిగా ఏర్పరచి ఈ సృష్టి చేశాడని, సత్కర్మాచరణతో వాటిని సద్వినియోగం చేసుకోవడమే మానవుని కర్తవ్యమని సద్గురు శివానందమూర్తి ఉద్బోధించారు. పుణ్యకార్యాలే మనిషి సుఖజీవనానికి సోపానాలని, మోక్షహేతువైన జ్ఞానం కోసమే దైవాన్ని ఆశ్రయించాలని, ఈజీవనసత్యాన్ని బోధించి ఆచరింపచేయడం గురువు బాధ్యత అన్నారు. బలుసుపాడు గురుధామ్‌లో చేపట్టిన జగద్గురుపూజ, పట్టాభిషేక కార్యక్రమాలను శుక్రవారం ఉదయం గెంటేల వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం గురుధామ్‌లోని మూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన భక్తులు మధ్యాహ్నం లఘు పూజతో శ్రీకారం చుట్టారు. భక్తులనుద్దేశించి సద్గురుమూర్తి ప్రసంగిస్తూ పుణ్యకార్యాలకు ధనంతో నిమిత్తంలేదని అందరి మేలుకోరే మంచి మనసు చాలని అన్నారు. భారతదేశంలో ఇంకా అర్థాకలితో అలమటించే 30 కోట్ల మంది భారతీయులకు అహారం లభించాలని ప్రార్థించే సత్కర్మ భావన పుణ్యమేనన్నారు.

**మోడీ కోసం కాదు సమర్థుడి కోసం ప్రార్థన..** ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ప్రజలకు దూరమైన క్షేమం, స్వేచ్ఛలను తిరిగి అందించే సమర్థుడైన దేశభక్తుడు పాలకుడిగా రావాలని చేసిన ప్రార్థనలు మోడీ రూపంలో ఫలవంతమయ్యాయని శివానందమూర్తి అన్నారు. దేశ సంస్కృతిపై తిరస్కారభావంతో భారతీయ హృదయంలేని పాలకుల వల్ల ప్రజలు ఎంతోనష్టపోయారని, ప్రజల తీర్పుతో ఏర్పడిన నవశకం మళ్లీ మనజాతికి ఉత్తమస్థితిని కల్పిస్తుందని అభిలషించారు. కార్యక్రమాల్లో శాసనసభ్యుడుశ్రీరాం తాతయ్య, తిరుపతమ్మ ఆలయ ఛైర్మన్ వాసిరెడ్డి బెనర్జీ, జిస్ట్ కళాశాల ఛైర్మన్ జి.సుబ్బారావు పాల్గొన్నారు. తోరణాలు, పూలమాలలు,పందిళ్లతో గరుధామ్ ఆవరణను, జగద్గురు పట్టాభిషేకం జరిగే కైలాసగిరిని అలంకరించారు. తిరుపతమ్మ ఆలయ ఆస్థాన పండితులుచంద్రశేఖర అవధాని ఆధ్వర్యంలో జగద్గురు కలశారాధన, ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.



కార్యక్రమానికి తరలివస్తున్న సద్గురు శివానందమూర్తి

## కనులపండువగా చూద్దాం రారండీ...

# అప్పలాయిగుంట ప్రసన్నుడి వైభవం

**అప్పలాయిగుంట (చిత్తూరు జిల్లా), న్యూస్‌టుడే:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభం అయ్యాయి. ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించడానికి తితిదే అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఈక్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేశారు. ఆలయ ఆవరణలో రంగవల్లులు తీర్చిదిద్దారు. గోపురంతో పాటు ఆలయ ప్రహరీకి విద్యుద్దీపాలు అలంకరించారు. భక్తుల రద్దీ నియంత్రించడానికి క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నేటి ఉదయం ఆలయం లోపల అలంకరణకు అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు ఆలయాధికారి శ్రీనివాసులు తెలిపారు.

### బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**బ్రహ్మోత్సవాల వివరాలు...**

8వ తేదీ ఉదయం ధ్వజారోహణం,
సాయంత్రం పెద్దశేష వాహనంపై ఊరేగింపు
9వ తేదీ ఉదయం చిన్న శేషవాహనం,
సాయంత్రం హంస వాహనాల సేవ
10వ తేదీ ఉదయం సింహ, సాయంత్రం ముత్యపుపందిరి వాహనం
11వ తేదీ ఉదయం కల్పవృక్షం,
సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం
12వ తేదీ ఉదయం పల్లకీ, సాయంత్రం గరుడ సేవలు
13వ తేదీ ఉదయం హనుమంత, సాయంత్రం గజ వాహనాల సేవ
14వ తేదీ ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనం
15వ తేదీ ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనం
16వ తేదీ ఉదయం చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగింపు

# శివ నామస్మరణతో పాప విముక్తి

**పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా), న్యూస్‌టుడే:** శివలింగ ఆరాధన సమస్త దేవతారాధనతో సమానమని కృష్ణాజిల్లా తాళ్లవాయిపాలెం శైవ పీఠాధిపతి శివస్వామీజీ పేర్కొన్నారు. ఎస్.చిక్కాలలోని శివదేవస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ రుద్రసహిత, మహాకుంభాభిషేక, పూర్వక లక్షవర్తి వ్రత మహోత్సవ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ శివనామ స్మరణతో సర్వ పాపాల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కొత్త నేతల పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెన్మెత్స సత్యనారాయణరాజు (పి.ఎస్), సత్యవతి దంపతులను ఆశీర్వదించారు. తరువాత శిఖర మహా కుంభాభిషేకాన్ని ఆయన ప్రారంభించారు. భక్తులు ఆయన ఆశీర్వచనాలు అందుకున్నారు.



ఆలయ ప్రాంగణంలో ఉపన్యసిస్తున్న శివస్వామీజీ

# ఓంకారానికి మూలం అనాహత నాదం



**ప**రమేష్ఠి అయిన బ్రహ్మదేవుడు పూర్వసృష్టి జ్ఞాన సముపార్జన కోసం ప్రయత్నం చేసిన సందర్భంలో ఓ విశేషం జరిగింది. దానికి అనుబంధంగానే ఇంకా ఎన్నెన్నో విశేషాలు ఆవిష్కృతమయ్యాయి. ఈ విశేషాల పరంపరను వివరించే కథాసందర్భమే ఇది. వ్యాసమహాభాగవతం పన్నెండో స్కంధం ఆరో అధ్యాయంలో దీనికి సంబంధించిన వివరణలున్నాయి.

ధర్మపథం

సృష్టి ప్రారంభంలో సృష్టినంతా ఎలా చేయాలా అని బ్రహ్మదేవుడు తీవ్రంగా ఆలోచించాడు. ఆ తర్వాత ఏకాగ్రచిత్తంతో ధ్యానం చేశాడు. అలా ధ్యానం చేసే సమయంలో ఆయన హృదయం నుంచి వాయుపరిమాణాత్మకమైన ఒక అనాహత నాదం ఏర్పడింది. జీవుడు తన మనోవృత్తులను నిరోధించినప్పుడు కూడా ఈనాటికీ అలాంటి అనాహత నాదం వినిపిస్తూనే ఉంటుంది. యోగులు ఈ అద్భుతమైన అనాహతనాదాన్ని ఉపాసించినప్పుడు దాని ప్రభావంతోనే వారికి అంతఃకరణశుద్ధి కలుగుతుంది. అంతఃకరణశుద్ధి పొందిన తర్వాతే యోగులు పరమగతి అయిన మోక్షాన్ని పొందుతుంటారు. ఒకసారి మోక్షాన్ని పొందినవారు ఆ తర్వాత మరెప్పుడూ జనన మరణ రూప సంసారచక్రంలో పడి ఇబ్బందుల పాలుకావటం ఉండదు. ఇంతటి గొప్ప స్థితికి చేర్చేదే అనాహత నాదం. ఈ అనాహత నాదం నుంచే అకార, ఉకార, మకారాలనే మూడు మాత్రలు గల ఓంకారం వెలువడింది.

### ఓంకారం పరమాత్ముడి నిలయం

ఈ ఓంకారశక్తి నుంచే అవ్యక్త ప్రకృతి వ్యక్తరూపంలో పరిణమిస్తూ ఉంటుంది. ఓంకారం అనేది స్వయంగా అవ్యక్తం. అనాది. పరమాత్మ వల్ల మాత్రమే అది స్వయంగా ప్రకాశిస్తుంది. ఈ ఓంకారం ద్వారానే పరమాత్మ అయిన ఆ పరబ్రహ్మస్వరూపం విదితమవుతూ ఉంటుంది. ఓంకారం, పరమాత్మ అలా పరస్పరం ప్రకాశిస్తూ ఉంటాయి. అనాహత నాదం నుంచి వెలువడిన ఈ ఓంకారాన్ని ఇప్పటికీ పరమాత్ముడికి నిలయంగా చెప్పుకొనే మానవ శరీరంలో ఎవరికి వారు గమనించవచ్చు. శ్రవణేంద్రియశక్తిని ఆపినప్పుడు అంటే రెండు చెవుల్లోనూ వేళ్లను ఉంచి బాహ్యప్రపంచానికి సంబంధించిన ఇతర శబ్దాలను వినకుండా ఉన్నప్పుడు అవ్యక్తమైన ఓంకారనాదాన్ని వినవచ్చు. ఈ విషయాన్ని యోగులు, అనుభవజ్ఞులు ఈనాటికీ పలు సందర్భాలలో వివరిస్తుండటం కనిపిస్తుంది.

### పరమాత్మకు వాచకం

అలాగే సుషుప్తి, సమాధి అవస్థలలో ఇంద్రియవ్యాపారాలు నిలిచిపోయినప్పుడు పరమాత్మ విశుద్ధస్వరూపమైన ఈ ఓంకారం హృదయాకాశంలో ప్రకటితమై వేదవాణిరూపంలో వ్యక్తమవుతుంది. ఓంకారం పరబ్రహ్మ, పరమాత్మకు వాచకం. ఈ ఓంకారమే సమస్త మంత్రాలకు, ఉపనిషత్తులకు, వేదాలకు సనాతన బీజంలాంటిది. ఓంకారంలో అకార ఉకార మకారాలు ఉంటాయి. ఈ మూడు వర్ణాలే సత్వ, రజో, తమో అనే మూడు గుణాలు, రుగ్‌యజుస్సామాలు అనే మూడు వేదాలు, భూః, భువః, సువః అనే మూడు లోకాలు. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు వృత్తులకు ప్రతీకలు. సర్వశక్తిమంతుడైన బ్రహ్మదేవుడు ఈ ఓంకారంలో స్థిరమై ఉండి అంతస్థాలు (యరలవ), ఊష్మాలు (శషసహ), స్వరాలు (అ నుంచి ఔ వరకు), స్పర్శలు (క నుంచి మ వరకు) అనే అక్షర సమన్వయాన్ని సృష్టించాడు. స్వరాలకు హ్రస్వ, దీర్ఘరూపాలు ఏర్పరిచాడు. ఇలా ఒక్క అనాహత నాదం నుంచి మనం ఈనాడు జ్ఞానదాయిని సరస్వతీప్రతిరూపాలుగా ఎంచుకొంటున్న అక్షరాలన్నీ ఆవిర్భవించాయి. వీటన్నింటికీ ప్రణవనాదమైన ఓంకారం కేంద్రం. ఇలా విశ్లేషించుకుంటూ చూస్తే మనిషి జీవితంలోని జ్ఞానస్వరూపమంతా అనాహత నాదం నుంచి ఓంకారం దాకా విస్తరించి ఆ ఓంకారం అనే కేంద్రం నుంచి విస్తరిల్లినట్లు అదంతా విధాత సంకల్పమేనని ఈ కథా సందర్భం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## కాళ్లు చల్లబడటం

**ని**రాశ, నిస్పృహలు ఆవరించడం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. సాధారణంగా ఒంట్లో శక్తి అంతా తగ్గి నిరాశపడ్డప్పుడు కాళ్లు చల్లబడుతుంటాయి. అది ప్రాణాపాయస్థితికి సూచన కూడా.

జాతీయాలు నుడికారాలు

కొన్ని సందర్భాలలో నచ్చని విషయాలు, అనుకున్న పని కాకపోవడం అనేలాంటివి ఎదురైనప్పుడు మనిషికి పూర్తిగా నీరసం ఆవరిస్తుంది. ఆ స్థితి ప్రాణాపాయస్థితితో సమానం అన్న భావనను వ్యక్తపరిచేందుకు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.

ఆంధ్రావని

# అంతర్జాతీయ సదస్సుకు అనంత ఆచార్యులు



చంద్రశేఖర్

**అనంతపురం, న్యూస్‌టుడే:** జిల్లా ఆచార్యుడికి అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధనా పత్రాన్ని అందజేసే అవకాశం కలిగింది. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో ఐదుసార్లు పరిశోధనా పత్రాలు, వేదికల్లో ప్రసంగాలు చేసిన ఆయనకు మరో అవకాశం దక్కింది. జేఎన్‌టీయూలో రీసెర్చి డెవలప్‌మెంట్ సంచాలకులు ఆచార్య కె.బి.చంద్రశేఖర్ అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక అయ్యారు. ఈనెల 10 నుంచి 14వతేదీ వరకు దుబాయ్‌లో 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కెమిస్ట్రీ అంతర్జాతీయ 3వ ప్రపంచ సదస్సు' నిర్వహిస్తున్నారు. ఇందులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరు కానున్నారు. రసాయన శాస్త్రంలో వచ్చిన విప్లవాత్మక మార్పులపై సరికొత్త పోకడలను ఇందులో వివరించాల్సి ఉంది. ఆచార్య చంద్రశేఖర్ 'ఔషధ మొక్కల నుంచి రసాయన పదార్థాలను వేరు చేసి వాటిని ఔషధంగా ఎలా వాడుకోవాలో' తన పరిశోధనా పత్రంలో తెలియజేనున్నారు. అంతర్జాతీయ వేదికలో అనంత నుంచి పరిశోధనా పత్రం ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని ఆచార్య చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# వైభవంగా ఉత్సవ పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కలశాలలకు ప్రత్యేక పూజలు

**కడప, న్యూస్‌టుడే :** జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేకంమహోత్సవాలు వైభవంగాకొనసాగుతున్నాయి. తితిదే ఆగమ పండితులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శనివారం చతుస్థానార్చనలు నిర్వహించారు. అగ్ని, కుంభ,మండల, బింభతదితర పూజలు చేశారు. ఉదయం నుంచేకలశస్థాపన, మహాకుంభ, ఉప కుంభ ఆరాధన, అగ్నిప్రతిష్ట, హోమాలు, లఘుపూర్ణాహుతిని విశేషంగా జరిపించారు. అంజన్నకు గ్రామోత్సవం జరిపేందుకు వీలుగా తితిదే నుంచి తృష్ట వాహనాన్ని తీసుకొచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. సూపరింటెండెంట్ లీలాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.



# ఆలోచింపజేసిన 'మారీచ్ సంబద్'

హైదరాబాద్, న్యూస్‌టుడే: **సమాజంలో అసమానతలపై జరిగే అనంత వర్గ పోరాటాన్ని కథావస్తువుగా తీసుకొని చేతన కళాకారుల బృందం (కోల్‌కత)చే 'మారీచ్ సంబద్' శీర్షికన సందేశాత్మక నాటకాన్ని ప్రదర్శించారు. హైదరాబాద్ బెంగాలి సమితి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు జరిగిన సభలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి చందనా ఖన్ నిర్వాహకులను అభినందించారు. సమితి ప్రధాన కార్యదర్శి సుమిత్ సేన్ తదితరులు పాల్గొన్నారు.**

## భక్తులతో కిటకిట

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే :** ఆంజనేయస్వామి నామస్మరణతో బీచుపల్లి మారుమోగింది. భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో హాజరు కావడంతో బీచుపల్లి భక్తులతో కిటకిటలాడింది. వా నడ్డిగడ్డ వాసులతో పాటు కర్నూలు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు.

# నమ్మాళ్వార్ తిరునక్షత్రోత్సవం ప్రారంభం

**దర్శన మార్గంలో స్వల్ప మార్పులు**

**ఖమ్మం, న్యూస్‌టుడే:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. బంగారు తులసి పూజలు చేశారు. నిత్య కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. నమ్మాళ్వార్ తిరునక్షత్ర ఉత్సవ వేడుకలను ఆరంభించినట్టు ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు తెలిపారు. దూపదీప నైవేద్యాలను సమర్పించి అభిషేకం జరిపి మంగళశాసనం నిర్వహించారు. దివ్య ప్రబంధాలను పఠించి శాత్తుమరై చేశారు. 11వరకు తిరునక్షత్ర ఉత్సవాలు జరుగుతాయన్నారు. 9న చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం, జపం, అష్టోత్తరం ఉంటుందన్నారు. అదేరోజు ఏకాదశి కూడా ఉన్నందున లక్ష కుంకుమ పూజలు ఉంటాయన్నారు. రాములవారి దర్శనమార్గంలో స్వల్ప మార్పులు జరిగాయి. ఉచిత దర్శనం గతం కన్నా ఇప్పుడు స్వామివారికి సమీపానికి చేరింది. ఇది భక్తులకు ఆనందం కలిగించే విషయం. ఈ మార్గంలో సీతా రామలక్ష్మణులు మరింత శోభాయమానంగా కనిపిస్తున్నారు. రూ.20 దర్శనం కూడా కొద్దిగా ముందుకు జరిపి స్వామికి చేరువగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రవేశ మార్గంలో ఉన్న హుండీలను కదిపి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఉత్సవాల సమయంలో ఈ పద్ధతి కష్టమేనని చెబుతున్నారు. ఈ మార్గం ఇరుకుగా ఉన్నందున భక్తులు దేవుడ్ని దర్శించుకునే భావంలో నడుచుకుంటే వెళ్లేక్రమంలో ఇక్కడ అడ్డుగా ఉన్న చెక్క మెట్లుగానీ స్తంభంగానీ కాళ్లకు తగులుతుందని భావిస్తున్నారు. చిన్న చిన్న లోపాలను సవరిస్తే ఇప్పటి విధానంతో భక్తులకు భగవంతుడికి మధ్య దూరాన్ని తగ్గించవచ్చు.



పూజలు చేస్తున్న అర్చకుడు



పూజల్లో పాల్గొన్న భక్తులు

# ఉత్తమ విద్యార్థి శుకమహర్షి



**భా**రతీయ యోగులందరిలోనూ సుప్రసిద్ధుడు, మహామహిమాన్వితుడు, సకల యోగ శాస్త్రాలను అభ్యసించినవాడు శుకయోగేంద్రుడు. ఈయన జననమే ఒక పవిత్ర కార్యంగా భాసిల్లింది. తన తండ్రి వ్యాస మహర్షికి తగిన తనయుడిగా, ఆయన జ్ఞాన సంపత్తిలో రెండింతల జ్ఞానసంపత్తి కలిగిన వాడిగా కూడా ఈ శుకమహర్షి పేరు తెచ్చుకున్నాడు. అరణి గర్భం నుంచి ఈశ్వరానుగ్రహం చేత జన్మించిన శుకుడు స్వయంగా వేద వేదాంగాలను అవగతం చేసుకున్నాడు. అయినా సంప్రదాయానుసరించి గురుశిష్య శిష్టాచారపాలన కోసం దేవగురువైన బృహస్పతి దగ్గర విద్యాభ్యాసం చేశాడు. అలాగే తన తండ్రి అయిన వేదవ్యాసుడి దగ్గర సాంఖ్యయోగం లాంటి సమస్త శాస్త్రాలను నేర్చుకున్నాడు. బ్రహ్మవేత్తగా పేరు పొందాడు. ఆనాడు గొప్ప బ్రహ్మవేత్తగా పేరు పొందిన జనక రాజర్షి దగ్గర తత్త్వజ్ఞానాన్ని సంపాదించాలని శుకుడిని ఆయన తండ్రి ఆజ్ఞాపించాడు. దీన్ని అనుసరించి జనకుడి దగ్గరకు బయల్దేరాడు.

### ఇంద్రియ నిగ్రహాన్ని పరీక్షించిన జనకుడు

ఎక్కడో సుదూర ప్రాంతాన ఉన్న జనకుడి దగ్గరకు వెళ్లటానికి శుకుడు తన తపశ్శక్తిని వినియోగించి శ్రమలేకుండా వెళ్లగలడు. అందుకు భిన్నంగా ఒక సామాన్యుడిలాగా ఎంతో శ్రమపడుతూ కాలినడకన జనకుడి రాజధాని అయిన మిధిలా నగరానికి చేరాడు. విద్యార్థిగా ఉన్న ఒక శిష్యుడు ఎలా వినయంగా ప్రవర్తించాలి అనే విషయాన్ని శుకుడు ఇక్కడ నిరూపించాడు. రాజమందిరం వద్ద ద్వారపాలకుల ద్వారా శుకుడు వచ్చాడని తెలుసుకున్న జనకుడు ఎంతగానో ఆనందించాడు. జనకుడి మంత్రి ఎంతో ఆదరంగా శుకుడికి అతిథి సత్కారాలను ఏర్పాటు చేశాడు. విలాసవంతమైన అంతఃపురంలో ఆయనను ఉంచి, అసమాన సౌందర్యరాశులను ఆయన సేవకు నియమించాడు. అలా ఎందరెందరో శృంగారవతులు శుకమహర్షి సేవకు సిద్ధంగా ఉన్నప్పటికీ శుకుడు ఏమాత్రం చలించక తన పద్ధతిలో తాను ధ్యాన నిమగ్నుడై ఆ రాత్రి అంతా గడిపాడు. శుకుడి ఇంద్రియ నిగ్రహాన్ని గురించి తెలుసుకున్న జనక మహారాజు ఎంతగానో ఆనందించాడు. ఆయన దగ్గరకు వెళ్లి అలా తన దగ్గరకు రావటానికి కారణమేమో చెప్పమన్నాడు. అప్పుడు శుకుడు తన తండ్రి ఆజ్ఞచేత మోక్ష మార్గానికి సంబంధించిన విషయాలలో సంశయాలను తీర్చుకోవటానికి వచ్చానని చెప్పాడు. అప్పుడు జనకుడు తనకు తెలిసిన జ్ఞానాన్నంతా శుకుడికి వివరించి చెప్పాడు. మోక్షార్థి అయిన జీవుడు శమదమాల వంటి వాటితో సకల వేదవేదాంగవేత్త అయి గురువు అనుగ్రహంతో బ్రహ్మతత్త్వాన్ని నిర్దిష్టంగా తెలుసుకొని నిరంతర కర్మానుష్ఠానపరుడై భగవంతుడిని కీర్తిస్తూ ధ్యాన తత్పరతతో ఉన్నవాడు పరబ్రహ్మను పొందగలడు అని చెప్పాడు. అలా పరబ్రహ్మను పొందగలిగే అర్హతలన్నీ శుకుడిలో ఉన్నాయని అసలు సిసలైన యోగికి కావలసిన యోగ్యతలన్నీ శుకుడి దగ్గర ఉన్నాయని జనకుడు ఎంతగానో మెచ్చుకుంటూ చెప్పాడు. అలా శుకుడు జనక రాజర్షి లాంటి మహోన్నత తత్త్వజ్ఞానుల చేత కూడా కీర్తినందుకున్నాడు. మోక్ష జ్ఞానాన్ని సముపార్జించుకొని మిధిలా నగరం నుంచి మేరుశృంగం మీద ఉన్న తండ్రి వ్యాసుడి దగ్గరకు తిరిగి వచ్చాడు శుకుడు. తన కుమారుడిని చూసి వ్యాసమహర్షి పరమానందభరితుడయ్యాడు. బ్రహ్మవేత్తగా మారి తండ్రిని మించిన తనయుడిగా, తండ్రి పేరును పది కాలాల పాటు నిలబెట్టగలిగిన సుపుత్రుడిగా అలా శుకుడు విలసిల్లాడు.

### విష్ణువు నిశ్వాస రూపమే పరావహ

ఒక రోజున తండ్రీకొడుకులిద్దరూ వేదాధ్యయనం చేస్తుండగా శుకయోగి కంఠం నుంచి ఒక మహావాయువు ఉద్భవించింది. ఆ వాయువు వేగానికి మేరుపర్వతమే కాక సకల ప్రకృతి చలించింది. అప్పుడు వ్యాసుడిని శుకుడు ఆ వాయువు ఏమిటని? ఎందుకలా తాను వేదాధ్యయానాన్ని మధ్యలో ఆపవలసి వచ్చిందని అడిగాడు. అందుకు సమాధానంగా వ్యాసమహర్షి ప్రవహ, ఆవహ, ఉద్వహ, సంవహ, వివహ, పరివహ, పరావహ అనే పలు వాయువులు ఉంటాయని, వాటి స్వరూపాన్ని వివరించాడు. ఆ ఏడింటిలో పరావహ అనే వాయువు అతివేగవంతంగా వీస్తుందని, సృష్టి, స్థితి, లయకర్త అయిన శ్రీమహావిష్ణువు నిశ్వాస స్వరూపమైన వాయువే అది అని వివరించి చెప్పాడు. ఈ వివరణలో అష్టాంగ యోగాలకు సంబంధించిన ఎన్నెన్నో విషయాలను కూడా శుకుడు తన తండ్రి ద్వారా తెలుసుకున్నాడు. ఇలా కొంత కాలం గడిచిన తర్వాత అష్టాంగయోగ సాధనలో కూడా పరాకాష్ఠకు చేరిన శుకుడి దగ్గరకు నారదుడు వచ్చాడు. ఆ సమయంలో వ్యాసమహర్షి స్నానవిధులాచరించటం కోసం వెళ్లాడు. నారదుడు శుకుడికి మోక్ష స్వరూపాన్ని వివరించాడు. సుదీర్ఘంగా ఆలోచించిన శుకయోగేంద్రుడు బ్రహ్మప్రాప్తికి ఉత్తమ సాధనమైన యోగం ద్వారా శరీరాన్ని త్యజించి సూక్ష్మశరీరంతో సూర్య మండలాన్ని చేరాలనుకున్నాడు. అందుకు తన తండ్రి అనుమతిని కూడా ఆయన పొందాడు. అయితే వేదవ్యాసుడు పుత్ర వాత్సల్యాన్ని ఆపుకోలేక ఆయనను విడిచిపెట్టి ఉండలేక కొంత మానసికంగా బాధపడ్డాడు. తనను విడిచిపెట్టవద్దని కూడా కోరాడు. కానీ శుకుడు మాత్రం బంధాలను కాదని దృఢచిత్తంతో కైలాసగిరిని చేరి ఏకాగ్రతతో ధ్యేయాన్ని, ప్రాణాయామాన్ని ప్రారంభించాడు. ఇంతలో నారద మహర్షి మళ్లీ శుకుడి దగ్గరకు వచ్చాడు. శుకుడాయనకు ప్రదక్షిణ, నమస్కారాలను చేసి యోగ మార్గాన దేవలోకానికి చేరాడు. వాయువేగంతో అలా వెళుతున్న శుకయోగిని చూసి రుషులు, దేవతలు ఎంతో ఆశ్చర్యాన్ని పొందారు. దివ్య శరీరంతో సూర్యమండలం వైపు వెళుతున్న శుకుడికి హిమాలయ పర్వతశృంగం, మేరుపర్వత శృంగం కలసిన ప్రాంతం అడ్డుగా కనిపించింది. ఆ రెండు శృంగాలు కలిసి వంద యోజనాల విస్తీర్ణం వరకూ వ్యాపించాయి. అయితే తన యోగబలం చేత తన మార్గానికి అడ్డుగా ఉన్న ఆ శృంగ భాగాలను చీల్చుకొని ముందుకు వెళ్లాడు శుకయోగేంద్రుడు. తన కుమారుడలా దూసుకు వెళుతుండగా వ్యాస మహర్షికి పుత్రుడి ఎడబాటు ఎంతో బాధించసాగింది. అప్పుడు పరమేశ్వరుడు వ్యాసుడిని అనునయించి శుకమహర్షికి ఛాయారూపాన్ని అనుగ్రహించాడు. ఆ రూపంతో ఆయన ఎంతో వేగంగా సర్వత్రా సంచరించగలుగుతాడని చెప్పాడు. ఈ కథాంశాన్నంతటినీ ధర్మరాజుకు కురువృద్ధుడైన భీష్మాచార్యుడు మహాభారతంలో వివరించాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**



మూలవిరాట్‌కి ప్రత్యేక అలంకరణ

## నేత్రానందంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం

**అనంతపురం, న్యూస్‌టుడే:** పట్టణంలోని లక్ష్మీపురంలో బాలాజీదేవాలయం చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివార్లకు నిర్వహించిన కల్యాణోత్సవం నేత్రానందంగా సాగింది. ఆలయసమీపంలోని ప్రత్యేకంగా ఏర్పాటుచేసినకల్యాణవేదికపై వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవవిగ్రహాలను ఉంచి పండితులు కల్యాణోత్సవానికి ముస్తాబు చేశారు. నవదంపతులైన వీరికి అర్చకులు ప్రత్యేక పూజలు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి మధ్యాహ్నం స్వామివారి చేతులమీదుగా మాంగళ్యధారణ చేయించారు. ఈ కల్యాణవైభోగాన్ని తిలకించటానికి పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఆలయంలోని మూలవిరాట్‌కి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలందించారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోహినీ అవతారంలో గోవిందరాజస్వామి

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో స్వామివారు ఆలయం నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ పుష్కరిణి మీదుగా తిరిగి ఆలయం వరకు కొనసాగింది.

## చచ్చి కడుపున పుట్టడం...

**కొ**న్ని జాతీయాలు కొన్ని విశ్వాసాల ఆధారంగా అవతరించాయి. అలాంటి జాతీయాలలో ఇదొకటి. సంతానం కలగటమనేది రుణానుబంధానికి సంబంధించిందన్నది చాలా కాలం నుండి వస్తున్న ఓ విశ్వాసం. పశువులు, పుత్రులు, సుతులు, గృహాలు ఇలాంటివన్నీ పరస్పరం రుణానుబంధానికి సంబంధించినవే. నీటిరుణం, నిద్రరుణం అనేవి ఉంటాయని, ఆ రుణం తీరటం కోసమే కొన్ని చోట్లకు వెళ్లి నీళ్ల తాగటం, నిద్రపోవటం అనే లాంటివి జీవనక్రమంలో జరుగుతుంటాయని చెబుతుంటారు. ఈ జన్మలో ఒకరివల్ల సహాయం పొందితే మరుసటి జన్మలో వారికి సంతానంగా జన్మించి ఆ రుణాన్ని తీర్చుకోవచ్చనేది కొందరిలో ఉన్న విశ్వాసం. ఆ విశ్వాసం ఆధారంగా ఈ నాటికీ ఏదైన గొప్పసహాయం పొందబోతున్నప్పుడు కానీ, పొందినప్పుడుకానీ ఈ జాతీయం వాడుకలో కనిపిస్తుంది.

## మృగశిర.. భక్తుల కిటకిట

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే :** ఆమనగల్లు మండలం మైసిగండి మైసమ్మ ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. మృగశిర కార్తెతోపాటు విద్యార్థులకు వేసవి సెలవులు ముగుస్తుండటం, వ్యవసాయ పనులు ప్రారంభమవుతుండటంతో భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలుచేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. బుల్లితెర నటుడు సెల్వారాజ్ కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు సెల్వారాజ్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శిరోళి, ఈవో రంగారెడ్డి, భాస్కర్‌నాయక్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాదగిరిగౌడ్, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణశోభలో.. శ్రీబాలబాలాజీస్వామి

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** శ్రీబాలబాలాజీస్వామి కల్యాణోత్సవాలకు అర్చకస్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీకారం చుట్టారు. సుప్రభాత సేవలు, సహస్ర నామార్చనలతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీస్వామి, ఉభయ దేవేరుల ఉత్సవమూర్తులకు మంగళస్నానం అనంతరం బుగ్గన పెళ్లి చుక్క, నుదిటిన కల్యాణ తిలకం దిద్ది శ్వేత వస్త్రాలతో నయనానందకరంగా అలంకరించారు. ప్రధాన ఆలయాల్లోని శ్రీస్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లను పలు రకాల పూలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అంతకుముందు గ్రామానికి చెందిన భక్త మహిళలు శ్రీలలితా విష్ణు సహస్రనామ పారాయణాన్ని కమనీయంగా ఆలపించారు.



ఆలయ ప్రాంగణంలో వేద పారాయణం చేస్తున్న మహిళలు



స్వామి దర్శనానికి వస్తున్న విశాఖ శారదా పీఠాధిపతి

## మల్లన్న సేవలో శారదా పీఠాధిపతి

**కర్నూలు, న్యూస్‌టుడే:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామిని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద ఈవో ఆజాద్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వరూపానంద సరస్వతి స్వామికి రుద్రాభిషేకం చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతి గౌరవార్థం దేవస్థానం వేదగోష్ఠి నిర్వహించింది. స్వామి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆయనకు అందజేశారు.



అమ్మవారి దగ్గర పూజలు చేస్తున్న భక్తులు

# కైలాసగిరిపై వింతలెన్నో..!

మన పురాణాలలో దేవ నివాసాలకు సంబంధించిన వివరణ వరాహ పురాణంలో కొంత విపులంగా ఉంది. కైలాసం అనగానే అక్కడ పార్వతీ పరమేశ్వరులు మాత్రమే ఉంటారని చాలా మంది భావిస్తారు. కానీ కైలాసపర్వతం మీద ఎన్నెన్నో విశేషాలున్నాయి. కైలాస పర్వతం నూరు యోజనాల పొడవు, నూరు యోజనాల వెడల్పున వ్యాపించి ఉంది. దాని నడుమ ఒక పెద్ద సభ ఉంది. అక్కడే పుష్పకమనే విమానముంటుంది. అది కుబేరుడి నివాసం, విమానమూ కూడా. పద్మం, మహాపద్మం, మకరం, కుముదం, శంఖం, నీలం, నందం అనే మహానిధులు ఉంటాయి. అక్కడే చంద్రుడు తదితర లోకపాలకుల నివాసాలు ఉంటాయి. మందాకినీ నది అక్కడి నుండే ప్రవహిస్తుంటుంది. అలాగే కనకమంద, మంద అనే పేర్లతో రెండు నదులుంటాయి. వాటితో పాటుగా మరికొన్ని నదులు కూడా ఆ ప్రాంతంలో ప్రవహిస్తుంటాయి.



### కార్తికేయుడి వనం అక్కడే..

కైలాసానికి తూర్పువైపున నూరు యోజనాల పొడవు, ముప్ఫైయోజనాల వెడల్పుగల పది గంధర్వ పురాలుంటాయి. ఆ పురాలలో సుబాహుడు, హరికేసుడు, చిత్రసేనుడులాంటి గొప్ప గొప్ప రాజులుంటారు. దాని పడమటి శిఖరం మీదనే ఒక్కొక్కటి ఎనభై యోజనాల పొడవు, నలభై యోజనాల విస్తీర్ణం ఉన్న యక్షుల నగరాలుంటాయి. వాటిలో మహామాలి, సునేత్రుడు, చక్రుడు తదితర యక్షరాజులుంటారు. అక్కడికి దక్షిణం వైపున పొదలు, సెలయేళ్లు, గుహలు, సముద్రాలు కూడా ఉంటాయి. ఆ సముద్రాల ప్రాంతంలో నూరు కిన్నరుల పురాలుంటాయి. ద్రుముడు, సుగ్రీవుడు, భగదత్తుడు లాంటి వంద మంది రాజులక్కడ ఉంటారు. రుద్రుడు, ఉమాదేవి వివాహమాడింది అక్కడే. ఇక్కడ రుద్రుడు కిరాతరూపంలో కనిపిస్తాడు. శంకరుడు ఉమతో కలిసి ఇక్కడి నుంచే జంబూద్వీపాన్ని వీక్షించాడు. ఇక్కడికి సమీపంలో ఎందరెందరో కిన్నరులు, గంధర్వులు గానం చేస్తూ ఉండే విమానం అనే అద్భుతవనం ఉంది. అందులో అనేక రకాల సుగంధభరిత పుష్పాలు, మనోహర లతలు, తీగలతో పాటు అప్సరసలు కూడా ఉంటారు. పరమేశ్వరుడికి అర్ధనారీశ్వర శరీరం లభించింది ఆ ప్రదేశంలోనే. ఆ వనానికి సమీపంలోనే కార్తికేయుడికి చెందిన శరద్వనం కూడా ఉంది. పుష్పచిత్ర క్రౌంచ గిరులు అక్కడికి సమీపంలో కనిపిస్తాయి. అక్కడే కార్తికేయుడికి అభిషేకం జరిగింది. అక్కడికి తూర్పు దిక్కుగా సిద్ధులు, మునిగణాలు నివసించే కలాపం అనే గ్రామం ఉంది. మార్కండేయుడు, వసిష్ఠుడు, పరాశరుడు, నలుడు, విశ్వామిత్రుడు, ఉద్దాలకుడు లాంటి గొప్పగొప్ప మహర్షుల వేలాది ఆశ్రమాలు అక్కడ ఉన్నాయి.

### శ్రీమహావిష్ణువు కొలువుండే నిషధాచలం

ఇవన్నీ కైలాసగిరి విశేషాలైతే నిషధాచలం అనే మరో గిరి విశేషాలు ఆశ్చర్యజనకంగా ఉంటాయి. నిషధాచలం నడిమి శిఖరంపై శ్రీమహావిష్ణువు కొలువుంటాడు. దాని ఉత్తర తటం పైన ముప్ఫై యోజనాల విస్తీర్ణంలో ఒక మహాపురం ఉంది. ఆ పురం పేరు లంబం. అది రాక్షసులకు నివాసం. దానికి దక్షిణం వైపుననే బిలప్రవేశనగరం అనే నగరం ఉంది. మనకున్న త్రిమూర్తులలో లయకారకుడైన ఈశ్వరుడి నివాస స్థానం, స్థితికారకుడైన శ్రీమహావిష్ణువు స్థానం అలా గొప్పగొప్ప గిరుల మీద ఉన్నాయని వివరిస్తోంది వరాహ పురాణం. కైలాసగిరి మీద దేవముని గణాలతో పాటు యక్షులు, కిన్నరులు, కింపురుషులు లాంటివారు నివాసాలు ఏర్పరచుకొని ఉంటారు. అక్కడ పుట్టి భూమి మీదకు వచ్చిన కారణంగానే గంగానదికి అంతటి పవిత్రత వచ్చింది. పరమేశ్వర రూపాలలో ఆయన తన భార్యకు తనలో సగభాగమిచ్చి గౌరవించిన ప్రదేశం అక్కడే ఉంది. ఇలా కైలాసగిరి విశేషాలు కనబడుతుంటే విష్ణువుకు సంబంధించిన నివాసానికి దగ్గరలో లంబం అనే రాక్షస నగరం ఉండటం విశేషం.

ధర్మపథం

సాధారణంగా రాక్షసగణాలు శివుడిని ఆరాధిస్తుంటాయని, శివుడు వారికి రక్షకుడిగా ఉంటాడని చాలా చోట్ల కనిపిస్తుంది. కానీ వరాహ పురాణం చెప్పిన వివరణలో శివుడి సభ చుట్టూ దేవముని, గంధర్వ తదితర గణాలు ఉండగా పడమటి దిక్కున ఉన్న నిషధాచలం పైన ఉన్న విష్ణు నివాసం పరిసరాలలో లంబం నగరంలో రాక్షసులుండటం కొంత విశేషంగా అనిపిస్తుంది. అయితే ఈ విషయాన్ని తాత్విక ధోరణితో పరిశీలిస్తే విష్ణు మహేశ్వరులు ఎటువంటి భేద భావాలు లేకుండా తమనాశ్రయించిన వారిని రక్షిస్తున్నట్లుగానే కనిపిస్తుంది.

– డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు

## చీకటిని నెత్తినేసుకొని వెళ్లటం...

తెల్లవారుజామునే బయటకు వెళ్లిపోవటం అనే అర్థంలో ఈ

జాతీయాలు నుడికారాలు

జాతీయం ప్రయోగంలో ఉంది. తెల్లవారుజామున చీకటిగానే ఉంటుంది. ఎండలో అయితే రక్షణ కోసం గొడుగును నెత్తిన పట్టుకొని వెళ్లటం జరుగుతుంటుంది. అదే చీకటిలో బయటకు వెళ్లేటప్పుడు ఆ చీకటినే గొడుగు లాగా నెత్తిన పెట్టుకు వెళ్లాడన్న భావనతో రూపొందింది ఈ జాతీయం. చీకటితో వెళ్లటం, చీకటితో ప్రయాణం కావటం అనే లాంటి అర్థాల్లో కూడా ఈ జాతీయం ప్రయోగంలో ఉంది.

## హంస వాహనంపై నరసింహస్వామి

**సింగరాయకొండ, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే :** దక్షిణ సింహాచల క్షేత్రంగా పేరుగాంచిన పాతసింగరాయకొండలోని శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి వేదపండితులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై భక్తులకు అభయప్రధానం గావించారు. సూర్యప్రభవాహనంపై ఆసీనుడైన స్వామివారిని దర్శించుకున్న ఆయన దివ్యమైన చూపుతో అజ్ఞానం తొలగి జ్ఞానం కలుగుతుందని పండితులు తెలిపారు. శీలం రాధాకృష్ణయ్య కుమారుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉభయం నిర్వహించారు. అలాగే రాత్రిసమయంలో స్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనం చేసుకొనే భాగ్యం కలిగించారు. హంస వాహన సేవ పాకలకు చెందిన సోలా ప్రకాశరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వహణాధికారి వై. భైరాగి, అర్చకస్వాములు వెంకటశేష లక్ష్మీనరసింహచార్యులు, లక్ష్మీనరసింహచార్యులు, నారాయణం శ్రీనివాసాచార్యులు, చక్రవర్తి పర్యవేక్షిస్తున్నారు.



ఊరేగుతున్న స్వామివారు

## వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం చండీహోమం

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** సత్యదేవుని ఆలయ క్షేత్ర రక్షకులుగా కొలిచే రత్నగిరిపై ఉన్న వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఇకపై ప్రతీ శుక్రవారం చండీహోమం నిర్వహించాలని వైదిక కమిటీతో ఇ.ఒ. ప్రసాదం వెంకటేశ్వర్లు మంగళవారం చర్చించారు. రానున్న శుక్రవారం నుంచే దీనిని అమలు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వనదుర్గ ఆలయంలో ప్రతీపౌర్ణమికి ప్రత్యంగరీ హోమం నిర్వహిస్తున్నారు. అయితేభక్తుల సౌకర్యార్థం ఇకపై ఆలయంలో ప్రతీ శుక్రవారం చండీహోమం కూడా నిర్వహిస్తే బాగుంటుందని వైదికకమిటీ సూచించింది. ఈ హోమంలోలో పాల్గొనే భక్తులకు ఎంత టికెట్టు నిర్ణయించాలనేదానిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని కమిటీకి ఇ.ఒ. ఆదేశించారు. పరిస్థితులకు అనుగుణంగా చండీహోమం ప్రతీ రోజూ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.



వనదుర్గ అమ్మవారి ఆలయం

## వైభవంగా లఘు పూర్ణాహుతి

**కడప, న్యూస్‌టుడే :** అన్నమాచార్యుల ఆరాధ్య దైవం తాళ్లపాక చెన్నకేశవ, సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో గత రెండు రోజులుగా జీర్ణోద్ధారణ మహాకుంభాభిషేక ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన లఘుపూర్ణాహుతి వైభవంగా సాగింది. అంతకు ముందు చెన్నకేశవ స్వామి ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, మంగళ శాసనములు, ఆరాధన, కుంభాగ్ని, చక్రఘన మండల ఆరాధనలు, హోమాలు, శాతుమూరి, ఏకాంతసేవ, సిద్ధేశ్వరస్వామి ఆలయంలో యాగశాల అలంకరణ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, దిశహోమం, రక్షాబంధనం, ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తాళ్లపాక ఆలయాల ఇన్‌స్పెక్టర్ వినోద్, గ్రామ పెద్దలు, భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులందరికీ వేదపండితులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



లఘు పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

## ఘనంగా అహోబిలేశుడి స్వాతి వేడుకలు

**అహోబిలం(ఆళ్లగడ్డ),న్యూస్‌టుడే:** అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకుని మంగళవారం స్వాతి వేడుకలు ఘనంగా జరిగాయి. నవనారసింహులను దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా అహోబిలానికి చేరుకున్నారు. దిగువలో వేకువ జామునే అర్చకులు వేదమంత్రాల మధ్య నరసింహస్వామి మూల విగ్రహానికి అభిషేకం చేశారు. స్వామికి నిత్యపూజ జరిపించారు. శ్రీదేవి, భూదేవి సహిత ప్రహ్లాద వరదుడి సమక్షంలో సుదర్శన హోమం జరిగింది. మొదటగా అర్చకులు భక్తులతో హోమ సంకల్పం చేశారు. కుంభారాధన, మండల పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం యాగసమిధలు అగ్నికి సమర్పించారు. 108 కలశాలతో స్వామికి అభిషేకించారు. మహాపూర్ణాహుతి అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



శ్రీదేవి, భూదేవి సహిత ప్రహ్లాదవరదుడు

## అమ్మానాన్నల ప్రేమ అమూల్యం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అమ్మానాన్నల ప్రేమ పవిత్రమైంది... స్వచ్ఛమైంది... అమూల్యమైనదని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. ఆకృతి 24వ వార్షికోత్సవం సందర్భంగా పెంటమరాజు సుశీల, రంగారావుల పేరిట నెలకొల్పిన స్మారక పురస్కారాలను ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, గాయకులు, సంగీత దర్శకులు కె. రామాచారిలకు ప్రదానం చేశారు. మంగళవారం రవీంద్రభారతి కళావేదికపై జరిగిన ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి ప్రారంభోపన్యాసం చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి బాపురెడ్డి, సంఘ సేవకురాలు వై. గీత గంగాధర్, ఆకృతి సంస్థ నిర్వాహకులు సుధాకర్ సభలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పురస్కారాలు అందుకున్న అశోక్‌తేజ, రామాచారితో జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

# దేవతలందరిలో ఘనుడు ఆయనే!

దేవతలందరి కంటే ఘనుడు ఎవరు? ఈ ప్రశ్న మాములు మనుషులకే కాదు ఓ సందర్భంలో సాక్షాత్తు దేవతలకు కూడా ఎదురైనట్లు వారాహపురాణం పదిహేడో అధ్యాయం వివరిస్తోంది. మరి ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటి? అని చూస్తే సకల చరాచర జగత్తుకు ఆధారభూతుడైన నారాయణుడే గొప్ప అని నిరూపితమైనట్లుగా ఈ కథాంశం వివరిస్తోంది. ఓసారి బ్రహ్మాది దేవతలు, పితరులు, బ్రహ్మాండ మధ్యస్థులైన దేవతలంతా ఓ చోట చేరారు. వారిలో అగ్ని, అశ్వినీదేవతలు, గౌరి, గజాననుడు, నాగులు, కార్తికేయుడు, ఆదిత్యులు, దుర్గ, మాతృకలు, దిక్కులు, ధనపతి, విష్ణువు, యముడు, రుద్రుడు, శశి, పితరులు ఎవరికి వారే గర్వితులై ఎవరికి వారు తాము లేనిదే ఏ దేహం కూడా మనగలగ లేదని కనుక తాము గొప్పంటే తాము గొప్పని వాదులాడసాగారు.



## దేవతల అహం తొలగిన వైనం

ముందుగా అగ్నిదేవుడు లేచి తననందరూ పూజించాలి. శరీరంలో తాను లేకపోతే ఆ శరీరం నశిస్తుందని అన్నాడు. తన గొప్పేంటో నిరూపించటానికి శరీరం నుంచి బయటకు కూడా వచ్చాడు అయినా శరీరం శిథిలం కాలేదు. ఇంతలో ప్రాణాపాన వాయుస్వరూపులైన అశ్వినీదేవతలు లేచి తాము లేకపోతే శరీరం లేదని వారూ బయటకు వచ్చారు. అయినా శరీరం అలాగే ఉంది. ఇంతలో గౌరీదేవి అందరికంటే తాను ప్రధానురాలిని కనుక తాను లేకపోతే ఇక శరీరమెక్కడ చూడండంటూ బయటకు వచ్చింది. కానీ ఏమీ జరగలేదు. ఆ వెంటనే ఆకాశ నామకుడైన గణపతి లేచి పైవారిలాగానే పలికి బయటపడ్డాడు. అయినా ఏమీకాలేదు. శరీర ధాతువుల రూపంలో ఉన్న నాగులు తాము లేనిదే శరీరమేమిటన్నట్లు చూస్తూ బయటకు వచ్చినా అంతకంటే ముందు జరిగిన దానికి భిన్నంగా ఏదీ జరగలేదు. అహంకారరూపుడైన స్కందుడు లేచి నేను లేకపోతే శరీరానికి పుట్టుకే లేదు అంటూ బయటకు వచ్చాడు కానీ శరీరం చెక్కు చెదరలేదు. అది చూసిన తరువాత సూర్యుడు లేచి తాను లేనిదే ఏ శరీరమైనా ఉండలేదన్నాడు. కానీ ఆయన బయటకు వచ్చినా శరీరం శిథిలం కాలేదు. అనంతరం మాతృకలు అనే కామాదిగణం లేచి మేం లేకపోతే శరీరానికి ఉనికి లేదు సుమా అంటూ వెళ్లిపోయాయి. అయినా శరీరంలో మార్పేమీ కనిపించలేదు. ఆ తర్వాత దుర్గ అనే పేరున్న మాయ కోపంతో లేచి తానే గొప్ప అంటూ శరీరం నుంచి బయటకు వచ్చింది. అదే పద్ధతిలో దిక్కులు లేచి మేము లేనిదే ఏ కార్యమూ ఉండదు చూడండంటూ క్షణంలో తొలిగాయి. అనంతరం వాయురూపంలో ధనపతి నేను తొలిగితే ఇక ఉండేదేమి లేదు అంటూ బయటకు వచ్చాడు.

## రెండేసి రూపాలిచ్చిన నారాయణుడు

ఆ తరువాత మనసు రూపంలో ఉన్న విష్ణువు కూడా అలాగే చేశాడు. అనంతరం ధర్ముడు లేచి, ఎదీనినంతటినీ పాలించేవాడిని నేను. నేను లేకపోతే శరీరానికి అర్థమే లేదు' అన్నాడు. ఆ తరువాత భూతభావనుడు, అవ్యక్తస్వరూపుడు, మహతత్త్వం అనే మహాదేవుడు లేచి అంతకు ముందున్న దేవతల్లాగానే ప్రవర్తించారు. అలాగే పితృదేవతలు, పంచతన్మాత్రలు ముందుకు వచ్చి మేం తొలగితే ఈ శరీరం తప్పక నశిస్తుందంటూ దేహాన్ని విడిచిపెట్టి అంతర్ధానమయ్యారు. ఇలా అగ్ని, ప్రాణాపానాలు, ఆకాశం, సర్వధాతువులు, అహంకారం, భానుడు, కామాదులు, మాయ వీరంతా శరీరాన్ని విడిచినా ఆ శరీరం చెక్కు చెదరకుండా అలానే ఉంది. దానికి కారణం సర్వజ్ఞుడైన తేజోవిరాజిత ఏకైక దివ్యమూర్తి అయిన పరమపురుషుడు నారాయణుడు పాలించటమే. ఆ విషయాన్ని దేవతలంతా చివరికి కానీ తెలుసుకోలేకపోయారు. సర్వజ్ఞుడు పాలిస్తున్న ఆ శరీరం మునుపటిలాగానే ఉండటాన్ని చూసి దేవతలంతా తమ గొప్పేమీ లేదని అంతా ఆ నారాయణుడేనని గ్రహించారు. అప్పుడు ఎవరికి వారు మానవ దేహంలో మళ్లీ తమతమ స్థానాలను పొందగోరి ఆ నారాయణుడిని స్తుతించారు. అప్పుడాయన ప్రత్యక్షమై ఆ క్షేత్ర దేవతలందరినీ ప్రేమతో చూస్తూ వారినందరినీ తాను ఆడే ఆట కోసం తాను సృష్టించినట్లు చెప్పాడు. ఇక మీదట వారికి రెండేసి రూపాలిస్తున్నట్లుగా వరమిచ్చాడు. ఆ క్షేత్ర దేవతలంతా ప్రాణుల శరీరాలలో రూప రహితంగానూ, దేవలోకంలో రూప సహితంగానూ ఉంటారని అన్నాడు. సకల దేహాలకు మూలకారణం తానేనని చెప్పాడు. అప్పటికీ కానీ పూర్తిగా తమ కంటే ఎవరు గొప్పో దేవతలకు బాగా అర్థమైంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## చీకిపోయిన గుండెలు...

అధికమైన వ్యథ, తీరని దుఃఖం అనేలాంటి అర్థాల్లో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. గుండె బద్దలు కావటం లాంటిదే ఇది. అయితే పాతవస్త్రాలు, చివికి (చీకి) పోయినట్లుగా బాధతో గుండె కూడా అలా అయిపోయింది అని కొద్దిగా అతిశయోక్తిగానే చెప్పే సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. ఏదేమైనా మితిమీరిన మనోవ్యథ, విరహబాధ లాంటి వాటి తీవ్రతను ఈ జాతీయంతో సూచించటం కనిపిస్తుంది





కల్యాణం నిర్వహిస్తున్న పండితులు; అలంకరణలో అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి

## కల్యాణం.. కమనీయం

**కరీంనగర్ , న్యూస్‌టుడే:** సుందరమైన కల్యాణ మండపం.. మేళతాలాలు.. మంగళ వాయిద్యాలు.. ముత్యాల తలంబ్రాలు.. పూల పరిమళాలు.. గోవిందా.. గోవిందా, వేంకటేశ్వర నామ స్మరణలు.. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వేంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. మంకమ్మతోటలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణలో అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేదికలకు దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ దూస రాజేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై పట్టు వస్త్రాలను సమర్పించారు. శేషం వెంకటరమణాచార్యులు, విజయసారథి, అర్చకులు పీచెర వెంకటరమణాచార్యులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద, కల్యాణ అక్షింతల వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పిట్టల శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి పీచెర కిషన్‌రావు, నరసింహాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బందితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కనులపండువగా కల్యాణ మహోత్సవం

**కోడూరు, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** కోడూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భక్తులకు ప్రత్యేకంగా దర్శనమిస్తున్నాడు. బ్రహ్మోత్సవాలలో మూడో రోజైన బుధవారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షణలో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధానార్చకులు ధుంబాల శ్రీధరాచార్యులు, బ్రహ్మోత్స యాజ్ఞిక బ్రహ్మ కోగంటి రామానుజాచార్యులు, వేదపండితులు కల్యాణాన్ని శాస్త్రోక్తకంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఉత్సవకర్తలుగా యిమ్మడి రాంబాబు, వెంకట రామకృష్ణప్రసాద్ (చిన్నా), కోట వెంకట అనిల్‌కుమార్ దంపతులు వ్యవహరించి భక్తితో కార్యక్రమంలో పాల్గొన్నారు. కల్యాణ కార్యక్రమానికి ముందు లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కళాకారుడైన కడవకొల్లు రాము అన్నమాచార్య కీర్తనలను గానం చేసి అందరినీ అలరించారు.



కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

# ఆదిగురువులు తల్లిదండ్రులు

### 'మా అమ్మానాన్న' కవితా సంపుటి ఆవిష్కరణోత్సవం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** 'తల్లిదండ్రులను దేవతా స్వరూపులుగా భావించే సంప్రదాయం మనద'ని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. తేజ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి, ఉపాధ్యాయురాలు మిర్యాల లలిత రచించిన 'మా అమ్మానాన్న' కవితా సంపుటి ఆవిష్కరణ సభ బుధవారం రాత్రి బొగ్గులకుంటలోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో కనుల పండువగా జరిగింది. ఆవిష్కర్త సినారె మాట్లాడుతూ అమ్మానాన్నలు ఆదిగురువులు అన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్పకు రచయిత్రి మిర్యాల లలిత తన అమ్మానాన్నలు మిర్యాల హనుమంతు, ముక్తికాంతల పేరిట నెలకొల్పిన పురస్కారాన్ని ప్రదానం చేశారు. సభలో దేవాదాయ శాఖ పూర్వ కమిషనర్, నల్గొండ జిల్లా పూర్వ కలెక్టర్ నంది వెలుగు ముక్తేశ్వరరావు, రచయిత పురస్కార గ్రహీత సుద్దాల అశోక్‌తేజ, బైస దేవదాసు, మౌనశ్రీ మల్లిక్, పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న సినారె తదితరులు



తెప్పలపై ఊరేగుతున్న శ్రీపద్మావతీ అమ్మవారు

## నేత్రపర్వం... అమ్మవారి తెప్పోత్సవం

**తిరుపతి, న్యూస్‌టుడే:** తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. విశేషాలంకరణ శోభితురాలైన శ్రీపద్మావతీదేవి తెప్పలపై విహరిస్తూ... తనను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వరాలను ప్రసాదించారు. ఇందులో భాగంగా ఉదయం అయిదు గంటలకు అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా పద్మసరోవరంలోని నీరాడ మండపంలో కొలువుదీర్చి ఆరాధించారు. అనంతరం ఉత్సవమూర్తికి పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం తెప్పోత్సవం కోసం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయం సంధ్య వేళ పద్మసరోవరంలో తెప్పలపై కొలువుదీరిన అమ్మవారు దేదీప్యమానంగా వెలుగొందారు. అమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో పుష్కరిణి కిటకిటలాడింది. అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజవాహనసేవ జరిగింది. అమ్మవారు తనకు అత్యంత ఇష్టమైన గజవాహనంపై మహాలక్ష్మిరూపంలో భక్తులను కనువిందు చేశారు. అంతకు ముందు తెప్పోత్సవం ముగిసిన తర్వాత అమ్మవారిని వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి అలంకరణ చేశారు. అనంతరం విశేషాభరణ శోభితురాలైన అలమేలు మంగ గజ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో సాక్షాత్కరించారు. భక్తుల నామస్మరణల నడుమ వాహనసేవ అత్యంత రమణీయంగా సాగింది. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## గుట్టలో భక్తుల పూజలు

**నల్గొండ, న్యూస్‌టుడే:** శ్రీయాదగిరీశుడి సన్నిధిలో భక్తుల పూజల నిర్వహణతో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. సెలవుల్లో చివరి రోజు కావడంతో క్షేత్ర సందర్శన కోసం వచ్చిన భక్తజనులు మొక్కు పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన దేవాలయంతో పాటు అనుబంధ శివాలయంలో భక్తులు పూజలు చేపట్టారు. నమ్మాళ్వార్ల తిరునక్షత్ర వేడుకల్లో భాగంగా రుత్వికులతో దివ్యప్రబంధ పఠనం కొనసాగింది. శ్రీస్వామి అమ్మవార్లను ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్ది తిరువీధి సేవోత్సవాన్ని నిర్వహించారు.

# చందమామకు పట్టాభిషేకం

ఆకాశంలో వెన్నెలలు కురిపిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ కనిపించే చందమామ పట్టాభిషేకం జరిగింది. అది ఎప్పుడు జరిగింది, ఎలా జరిగింది? అనే విషయాలను గురించి తెలియచెప్పే కథాసందర్భం ఇది. స్కందమహాపురాణం ద్వితీయ వైష్ణవ ఖండం ఏడో అధ్యాయంలో ఈ విషయాలన్నీ ఉన్నాయి. బదరికాశ్రమంలోని సోమకుండం అనే తీర్థం గొప్పతనాన్ని శివుడు వివరిస్తూ చెప్పిన విషయాలే ఇవన్నీ. పూర్వం ఓసారి అత్రి కుమారుడైన చంద్రుడు శివుడి దగ్గరకు వెళ్లి తనకు స్వర్గంతో పాటు గ్రహ, నక్షత్ర, తారక, ఓషధులకు అధిపతిగా ఉండే స్థితి ఎలా వస్తుందో చెప్పమని అడిగాడు. అప్పుడు శివుడు యమనియమాలతో గోవిందుడిని పూజించమని, అలా చేస్తే పొందలేనిది ఏదీ ఉండదని అన్నాడు. అలా శివుడి దగ్గర నుంచి బయటకు వచ్చి గోవిందుడి పూజ ఎక్కడ చేయాలని ఆలోచిస్తూ ఉన్నంతలో నారదమహర్షి కనిపించాడు.



### చంద్రుడి గోవిందపూజ

నారదుడి దగ్గర బదరికాశ్రమ మాహాత్మ్యాన్ని తెలుసుకొని అక్కడికి వెళ్లి గోవింద పూజ చేసేందుకు నిర్ణయించుకున్నాడు చంద్రుడు. బదరికాశ్రమానికి వెళ్లి అష్టాక్షరీ మహామంత్రాన్ని పఠిస్తూ పలురకాల దివ్య ఫలాలతో గోవిందుడిని పూజిస్తూ తపస్సు చేయసాగాడు. ఆ తపస్సు వేల సంవత్సరాల పాటు ఎంతో కఠోరంగా సాగింది. ఓ రోజున ఆ తపస్సుకు మెచ్చిన శ్రీమహావిష్ణువు చంద్రుడికి ప్రత్యక్షమై వరం కోరుకోమని అడిగాడు. అప్పుడు చంద్రుడు శ్రీమహావిష్ణువును స్తుతించి తాను గ్రహాలకు, నక్షత్రాలకు, ఓషధులకు అధిపతిగా అయ్యేలా వరం ఇమ్మన్నాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు ఆ వరం ఇవ్వటం సాధ్యంకాదని మరేదైనా వరం కోరుకోమని అన్నాడు. కానీ తనకు ఆ వరమే కావాలని చంద్రుడు అనటంతో శ్రీమహావిష్ణువు అంతర్ధానమయ్యాడు. ఆ తర్వాత చంద్రుడు మళ్లీ విష్ణువు గురించి తపస్సు చేశాడు. విష్ణువు ప్రత్యక్షమై మళ్లీ వరం కోరుకోమన్నప్పుడు చంద్రుడు అంతకు ముందు తాను కోరుకున్న వరాన్నే కోరుకున్నాడు. శ్రీమహావిష్ణువు అప్పుడు కూడా అది సాధ్యం కాదని చెప్పి అంతర్ధానమయ్యాడు. పట్టువదలని చంద్రుడు మరో నలభైవేల సంవత్సరాలపాటు కఠోరంగా తపస్సు చేశాడు. అప్పుడు వైకుంఠవా

## ధర్మపథం

సుడు ప్రత్యక్షమై చంద్రుడికి అడిగిన వరాన్నిచ్చి అంతర్ధానమయ్యాడు.

### నెరవేరిన కోరిక

చంద్రుడికి ఆ వరం లభించగానే దేవతలంతా అక్కడికి వచ్చి చంద్రుడిని రాజుగా అభిషేకించారు. దాంతో గ్రహాలకు, నక్షత్రాలకు, తారకలకు, ఓషధులకు రాజుగా అయ్యాడు చంద్రుడు. ఆ శుభ సందర్భంలో చక్కని వస్త్రాలను ధరించి దివ్య విమానమెక్కి దేవతాస్తుతులను అందుకొంటూ బదరికాశ్రమం నుంచి తన స్థానానికి చేరుకున్నాడు చంద్రుడు. బదరికాశ్రమంలో వైకుంఠవాసుడు చంద్రుడిని అనుగ్రహించిన ప్రదేశమే సోమకుండం అనే తీర్థంగా అనంతరకాలంలో ప్రసిద్ధికెక్కింది. ఆ సోమకుండం మానవుల పాపాలన్నీ పోగొడుతుంది. దాన్ని తాకి స్నానం చేసి అక్కడ పితరులకు తర్పణాలనిస్తే వారు సోమలోకం దాటి విష్ణులోకం దాకా వెళతారు. సోమకుండం దగ్గర మూడు రోజులపాటు ఉపవాసం చేసి స్వామిని పూజిస్తే పునర్జన్మ ఉండదు. మూడు రాత్రులు నిలబడి స్వామిని పూజిస్తూ విశేష జపం చేస్తే తెలిసీ తెలియక చేసిన పాపాలన్నీ నశిస్తాయి. ఇంతటి మహిమాన్వితమైన శక్తి కలది సోమకుండ తీర్థం. ఇక్కడ చంద్రుడి కథలో గమనించాల్సిన విషయం ఒకటుంది. ఎవరైనాసరే తాము కోరుకున్నది దక్కాలంటే దానికి కావలసిన అర్హతను కలిగి ఉండాలి. ఊరికే కోరుకొని నాకది రాలేదు అని బాధపడితే కుదరదు. చంద్రుడు గ్రహాలకు, నక్షత్రాలకు, తారకలకు, ఓషధులకు తాను అధిపతిగా ఉండాలని కోరుకున్నాడు. అయితే అంతటి అధిపతిగా కావటానికి అర్హతగా తగిన తపస్సును చేసిన తర్వాతే స్వామి అనుగ్రహం లభించింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన అర్హత ఉన్నప్పుడే ఉన్నతమైన వాటిని కోరుకోవటం మేలు అనే సందేశం ఇక్కడ కనిపిస్తుంది. అలాగే శివుడు గోవిందుడిని గురించి తపస్సు చేయమని చంద్రుడికి చెప్పిన దాన్నిబట్టి శివకేశవుల అభేదం ఇక్కడ కనిపిస్తుంది.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు

## బంగారం చిలుము పట్టదు

ఇత్తడికి చిలుము పట్టినట్టు బంగారానికి చిలుము పట్టదు. అయితే ఇక్కడ ఈ రెండు లోహాలను ఒకటి సత్పురుషులకు, మరొకటి దుర్మార్గులకు పోలికగా తీసుకోవటమే విశేషం. ఇత్తడి దుర్మార్గులకు ప్రతీక. దానికి పట్టే చిలుము చెడ్డతనానికి పోలిక. బంగారానికి చిలుము పట్టదు అనంటే మంచిమార్గంలో

## జాతీయాలు నుడికారాలు

నడవాలని స్థిర నిర్ణయం తీసుకొని జీవితాన్ని సాగించేవారికి అవినీతి అక్రమాల లాంటివి అబ్బవని తెలియచెప్పే సందర్భాలలో ఈ జాతీయం కనిపిస్తుంది.




# వైభవంగా గరుడోత్సవం



శ్రీవెంకటేశ్వరస్వామిని, అమ్మవార్లను దర్శించుకుంటున్న రాజేంద్రప్రసాద్, కమిటీసభ్యులు

**గుడివాడ, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** జగన్నాథపురంలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అత్యంత వైభవంగా గరుడోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల ఆరాధన, యాగశాలలో శాంతిపాఠం నిర్వహించారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్ర నామపారాయణం గావించారు. అనంతరం గరుడ వాహనంపై ఆసీనులైన శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూనీలాదేవిలను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్తల కమిటీ ఛైర్మన్ కామినేని బాబూ రాజేంద్రప్రసాద్, కమిటీసభ్యులు పీవీవీభానుశంకరరావు, గోసాల వసంతరావు, వి.శ్రీహరిరావు, సీహెచ్‌ప్రమీలారాణి, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# నేత్రానందంగా అన్నపూర్ణమ్మ దర్శనం

**భీమవరం , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని అన్నపూర్ణమ్మవారు విశేష పుష్పాలంకరణలో నేత్రానందంగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, కనకాంబరం, మల్లె, సన్నజాజి పుష్పాలతో పూజ ప్రత్యేకాలంకరణ మధిర అయ్యప్పశర్మ నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి ఆశీస్సులు పొందారు.





పుష్కరఘాట్‌వద్ద గోదావరికి హారతిస్తున్న వేదపండితులు

# గోదారమ్మకు పున్నమిహారతి

బుద్ధవరపు ఛారిటబుల్ ట్రస్ట్, దేవాదాయ ధర్మాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గోదారమ్మకు వైభవంగా హారతి ఉత్సవం జరిగింది. గురువారం రాత్రి స్థానిక పుష్కరఘాట్‌వద్ద జరిగిన కార్యక్రమంలో ముందుగా మహిళలు విష్ణుసహస్ర నామపారాయణం చేశారు. అనంతరం వేదపండితులు ముందుగా గోదావరిమాత విగ్రహానికి హారతిచ్చి అనంతరం గోదావరికి మంత్రోచ్ఛారణల మధ్య హారతి మహోత్సవం నిర్వహించారు. హారతిని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

– రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే

# నేత్రపర్వంగా గరుడోత్సవం

**తిరుపతి, న్యూస్‌టుడే:** అప్పలాయిగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడోత్సవం వైభవోపేతంగా జరిగింది. మెడలో లక్ష్మీ సహస్రహారం, వక్షస్థలంపై పచ్చ తదితర విశేషాభరణాలతో దివ్యాలంకరభూషితుడైన స్వామివారు ప్రియ వాహనం గరుత్మంతుడిపై ఆసీనులయ్యారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గరుత్మంతుడి వాహనం ఊరేగుతుండగా.. చిద్విలాసం చిందిస్తూ స్వామివారు అభయ హస్తంతో భక్తులను కటాక్షిస్తూ వీధుల్లో విహరించారు. గరుడ వాహన సేవ అనంతరం స్వామివారు ఆలయ మండపానికి చేరుకున్నారు. అక్కడ అర్చకులు శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారికి స్నపనతిరుమంజనంజరిపించారు. కార్యక్రమంలో జేఈవో భాస్కర్, ఆలయాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవంలో భాగంగా స్వామివారికి ప్రీతిపాత్రమైన గరుడ వాహన సేవను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.



గరుడ వాహనంపై ప్రసన్న వెంకన్న విహారం

# భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు

**సింగరాయకొండ, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** మండలంలోని పాతసింగరాయకొండ నరసింహస్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ఉదయం సుప్రభాతం, పూల అలంకరణ, బాలభోగం, యాగశాల యందు నిత్యహోమం, బలిహరణ, కుంభారాధన స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకస్వాములు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలనంతరం చొప్పరంపై ఊరేగారు. చప్పరసేవ ధర్మకర్తలుగా సూది పెదవెంకయ్య ధర్మపత్ని సావిత్రమ్మ కుమారుడు వెంకటసుబ్బయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామివారు శేషవాహనంపై భక్తులకు అభయమిచ్చారు.



హంసవాహనంపై స్వామి

# హనుమంతుడికి ఆయువునిచ్చిన దేవుడు



ఆంజనేయస్వామి చిరంజీవి అని అందరికీ తెలిసిందే. అయితే ఆ ఆంజనేయస్వామికి బలాన్ని, శక్తిని, దీర్ఘాయువును ప్రసాదించిన దేవుడి గురించి కొంత మందికి తెలిసి ఉండకపోవచ్చు. ఆ దేవుడెవరు? ఏ రూపంలో ఎలా హనుమంతుడికి అంతటి శక్తినిచ్చాడు? అని తెలియచెప్పే కథాసందర్భమే ఇది. స్కంద మహాపురాణం డెబ్బైతొమ్మిదో అధ్యాయంలో ఈ విషయాలన్నీ ఉన్నాయి. శ్రీరామచంద్రుడు రావణాసురుడిని వధించి లోకంలో ధర్మసంస్థాపన చేసి అయోధ్యానగరాన్ని హాయిగా పరిపాలిస్తున్న రోజులవి. రామరాజ్యం సుభిక్షంగా సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నందున ఆనందిస్తూ రాజారామచంద్ర ప్రభువును అభినందించి ఆశీర్వదించేందుకు అగస్త్యుడు తదితర రుషులు, మునులు ఆ స్వామి దగ్గరకు బయలుదేరారు. రామరాజ్య వైభవాన్ని కీర్తిస్తూ రామ దర్శనం చేశారు ఆ రుషులు.

### రుద్రాంశ స్వరూపుడు హనుమ

రుషులందరికీ రాముడు అతిథి పూజాసత్కారాలను చేసి ఆనందపరిచాడు. అప్పుడు అగస్త్యుడు రామసభలో ఉన్న వారందరినీ ఓసారి కలయచూస్తూ హనుమంతుడిని మరింతగా ప్రశంసించాడు. అలా ప్రశంసించటంలోని అంతరార్థం రామచంద్రప్రభువుకు తెలిసినా సభలో ఉన్న చాలామందికి అర్థం కావాలన్న ఆలోచనతో లక్ష్మణుడిని వదిలిపెట్టి హనుమంతుడిని ప్రశంసిస్తున్నారెందుకు? అని అగస్త్యుడిని, ఇతర మునులను రాముడు అడిగాడు. అప్పుడు రుషులందరి పక్షాన అగస్త్యుడు హనుమంతుడి గొప్పతనాన్ని వివరించాడు. హనుమంతుడు సాక్షాత్తూ రుద్రాంశ స్వరూపుడు. అంతేకాదు రుద్రస్వరూపమైన ఓ ఈశ్వర లింగ స్పర్శతో చిరంజీవత్వాన్ని పొందాడు. ఆ కథంతా చాలామందికి తెలిసుండకపోవచ్చు. ఆ కథ జరిగినప్పటి నుంచే ఓ శివలింగానికి హనుమత్కేశ్వర శివలింగమని పేరొచ్చింది. ఆ శివలింగం ఉజ్జయినిలోని మహాకాలవనంలో ఉంది అని కథనంతా వివరించటం ప్రారంభించాడు. అంజనాదేవికి, వాయు దేవుడికి రుద్రాంశతో జన్మించాడు హనుమంతుడు. చిన్నప్పుడే ఆకాశంలో ఉదయిస్తున్న ఎర్రటి బాలసూర్యుడిని చూసి బాలాంజనేయుడు అదేదో పండు అని భ్రమించాడు. ఆ పండును తినటం కోసం బాలభానుడి దాకా ఎగిరాడు. ఆ పరిస్థితిని గమనించిన ఇంద్రుడు భానుడిని ఎవరో మింగబోతున్నారని గ్రహించి తన వజ్రాయుధాన్ని విసిరాడు. అది బాలాంజనేయుడి దవడకు తగిలింది. దాంతో బాలాంజనేయుడు సొమ్మసిల్లి కిందపడ్డాడు. తన కుమారుడికి ప్రమాదం జరిగిందని బాధపడుతూ వాయుదేవుడు కిందపడ్డ బాలుడిని ఎత్తుకొని ఆ పిల్లవాడికి మేలు కలిగేలా చేయమని ఉజ్జయిని మహాకాలవనంలోని శివలింగం ముందు కొచ్చి ప్రార్థించాడు. అంతేకాక ఆ శివలింగానికి తన కుమారుడిని తాకించాడు.

### శివలింగ స్పర్శ తగలగానే...

శివలింగ స్పర్శ తగిలిందే లేదో వెంటనే ఆంజనేయుడు నవ్వుతూ లేచి కూర్చున్నాడు. ఇంతలో జరిగిన తప్పు తెలుసుకొని ఇంద్రుడు ఇతర దేవతలను వెంటపెట్టుకొని అక్కడకువచ్చి వాయుదేవుడిని క్షమించమని వేడుకొన్నాడు. తన వజ్రాయుధంతో ఆంజనేయుడి దవడకు దెబ్బతగిలింది కనుక ఆ రోజు నుంచి ఆంజనేయుడికి హనుమంతుడు అనే పేరు స్థిరపడుతుందని చెప్పాడు. హనుమ అంటే దవడ కలిగినవాడు అని అర్థం. వజ్రాయుధంతో దెబ్బతిన్న దవడ కలిగినవాడు అని హనుమంతుడు అనే పదానికి అర్థం. ఆ సమయంలోనే రుద్రుడక్కడ ప్రత్యక్షమై ఆంజనేయుడికి అమిత బలపరాక్రమాలు ప్రసాదించాడు. ఆనాటి నుంచి హనుమంతుడు తాకిన శివలింగానికి హనుమత్కేశ్వర శివలింగం అని పేరొస్తుందని చెప్పి అంతర్ధానమయ్యాడు. ఆ తర్వాత ఇంద్రుడి వెంటవచ్చిన వారిలో ఉన్న బ్రహ్మాది దేవతలు హనుమంతుడికి చిరంజీవత్వం లాంటి ఎన్నెన్నో గొప్పగొప్ప వరాలను ఇచ్చి అంతర్ధానమయ్యారు. ఇలా మృత్యుంజయుడైన రుద్రుడు తన భక్తులను మృత్యుంజయులుగా చేస్తాడనే విషయం ఇక్కడ అంతర్లీనంగా ధ్వనిస్తుంది. ఇప్పటికీ శివాలయాలలో చాలా చోట్ల శివలింగస్పర్శ మహాపుణ్య ప్రదమన్న నమ్మకం ఒకటి కనిపిస్తుంది. ఆ నమ్మకంతోనే భక్తులు శివలింగ స్పర్శ కోసం ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ఇలా ఈ శివలింగస్పర్శ అనే అంశం ఆంజనేయస్వామి కథలో ఓ ప్రధానాంశంగా మనకు కనిపిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# వైభవంగా అప్పన్నకు చందన సమర్పణ

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం అప్పన్నస్వామికి మూడో విడత చందన సమర్పణ వైభవంగా జరిగింది. సంప్రదాయం ప్రకారం స్వామికి వేకువజామున 1.30 గంటలకు సుప్రభాత సేవ, ఆరాధనలు జరిగాయి. అనంతరం మూడు మణుగుల పచ్చి చందనాన్ని స్వామికి సమర్పించారు. భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆస్థాన మండపంలో ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి వెండి సింహాసనంపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాల నడుమ స్వామికి జ్యేష్టాభిషేకం నిర్వహించారు. తర్వాత స్వామికి నిత్యకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తుల శిరస్సు, ఎదపై పచ్చి చందనం అలంకరించారు. ఒడిశా ప్రాంతానికి చెందిన కృష్ణచైతన్య భక్త బృందం సింహగిరిపై నృత్యాలు చేస్తూ.. భజనలు చేశారు. కృష్ణచైతన్య పాదాల మండపం వద్ద నుంచి రాజగోపురం వరకు నృత్యాలు చేశారు. కృష్ణ చైతన్య చిత్రపటాన్ని మాడవీధుల్లో సంకీర్తనల నడుమ ఊరేగించారు.



చందనంతో అలంకరించిన స్వామి ఉత్సవమూర్తులు

# పూచిన తంగేడు

చెట్టూచేమ మొక్కమోడు రాయిరప్ప అన్నీ మన జాతీయాల ఆవిర్భావానికి స్ఫూర్తిప్రదాతలే. ఈ జాతీయంలోని తంగేడు అనే పదానికి అర్థం తంగేడు మొక్క అని. తంగేడు మొక్క ఆకులు కనిపించనంతగా పూత పూస్తుంది. దూరం నుంచి చూస్తే మొక్కంతా పువ్వులే ఉన్నట్టు కనిపిస్తుంది. ఇది జాతీయంగా అయ్యేసరికి ఒంటినిండా నగలను అలంకరించుకొని లేదా బాగా ఎక్కువగా ఎంత అలంకారమైతే చేసుకోవాలో అంతకన్నా ఎక్కువ అలంకారం చేసుకొని తిరిగేవారిని గురించి చెప్పేందుకు వాడుకలోకొచ్చింది. తంగేడు మొక్క పూలతో ఎలా అయితే నిండి ఉందో ఆ వ్యక్తి కూడా అలంకారాలతో అలా నిండి ఉన్నాడన్నది జాతీయంలోని భావన. అలాగే తంగేటి మొక్క పాలను జున్ను అని అంటారు. ఈ తంగేటి జున్ను పూర్వకాలంలో ఆహారంగా వాడుకలో ఉండేది. కాస్తంత తాగితే చాలా ఆకలి తీరి హాయిగా ఉండేది. పేదవారికి ఇది ప్రాణదాతగా, కడుపునిండి ఆహారపదార్థంగా ఉంటూ ఉండేది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే గృహస్థుడైనవాడు అందరికీ అందుబాటులో ఉండే తంగేటి జున్నులాంటివాడని మనుచరిత్రలో పెద్దన వర్ణించి చెప్పాడు.

# కోర్కెలు తీర్చే కల్పవల్లి..

## నేటి నుంచి శ్రీవెంగమాంబతల్లి బ్రహ్మోత్సవాలు



శ్రీవెంగమాంబ దంపతులు

**దుత్తలూరు, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** పతి భక్తికి ప్రతిరూపంగా.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. అంటరానితనం నిర్మూలన కర్తగా.. ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలో ప్రశాంత వాతావరణంలో వెలసిన శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే 19వ తేదీ వరకు జరగనున్నాయి. శ్రీ కృష్ణదేవరాయుల పాలన కాలంనాటి ఆమె విశిష్టతను భక్తులు నేటికీ మరచిపోకుండా శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా ఏటా జరుపుకొంటారు. ఏటా చైష్టమాసం (జూన్) పౌర్ణమి గడిచిన తదుపరి ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజులపాటు తిరునాళ్ల వేడుకలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు సుమారు ఏడు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఉత్సవాలలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా దేవాదాయశాఖ అధికారులు, ఉత్సవ పాలక మండలి సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశాయి. జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు వలసలు వెళ్లినవారు ఈ తిరునాళ్లకు హాజరై బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

### 18న కల్యాణోత్సవం

ఐదు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు 15వ తేదీన జరిగే నిలుపు కార్యక్రమంతో ప్రారంభమవుతాయి. అదే రోజున సంతానంలేని మహిళలు అమ్మవారి ముందు వరపడతారు. 16న గ్రామోత్సవం, సంతానంలేనివారు వరపడుట కార్యక్రమాలు, 17న గ్రామోత్సవం, 18న పగలు కల్యాణోత్సవం, పసుపు, కుంకుమ ఉత్సవం, రాత్రి ప్రధానోత్సవం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవాలలో చివరి రోజైన 19వ తేదీ బండ్ల పొంగళ్లు, ఎడ్లు బండలాగు పందేలు జరుగుతాయి.

# నేత్రోత్సవం... వేంకటేశ్వరుని జేష్ఠాభిషేకం



ప్రధాన కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు



పంచసూక్త హోమాన్ని నిర్వహిస్తున్న అర్చక బృందం

**అనంతపురం, న్యూస్‌టుడే:** పట్టణంలోని కొత్త పేటలో వెలసిన శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంలో శుక్రవారం జేష్ఠాభిషేకం కార్యక్రమం నేత్రోత్సాహంగా జరిగింది. ట్రస్టు ఉపాధ్యక్షుడు మెటికల కుళ్లాయప్ప, డైరెక్టర్లు దత్తశివ, కోటం సూర్యనారాయణ, శంకర సంజీవులు, శాగా సురేష్, బెళ్లే నాగప్ప, గుద్దిటి రామాంజనేయులు, సేవాదళ్ అధ్యక్షుడు ఊకా నాగరాజు పర్యవేక్షించారు. బెంగళూరుకు చెందిన అర్చకుడు యల్దూరి శ్రీనివాసాచార్యుడు, కోలారు జిల్లా రామశేషాచార్యులు దేవస్థాన ప్రధాన అర్చకుడు నరసింహాచార్యులు వేదమంత్రోచ్ఛారణ చేస్తుండగా అర్చక బృందం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనసేవను చేశారు. ఈ క్రమంలో వేంకటేశ్వర, విశ్వక్సేన, బింబ, ఉప దేవతా హోమాలు నిర్వహించారు. జేష్ఠమాసంలోని శ్రవణా నక్షత్రం రోజున శ్రీవారి ఉత్సవ మూర్తులకు తిరుమంజనసేవ చేస్తే సకల శుభాలు కలుగ చేస్తాయని భక్తుల విశ్వాసం. అనంతరం చక్రస్నానం, అభిషేకం నిర్వహించారు. అంతకుమునుపు విశ్వక్సేనారాధన, పుణ్యాహరాధన, కలశారాధన తదితర కార్యక్రమాలను చేపట్టారు. సేవా దళ్ కార్యకర్తలు, భక్తులు హాజరయ్యారు.

# గోమాత ఆవిర్భావ విశేషాలు

**గో**వు ఎలా పూజనీయురాలైంది? గోమాత ఆవిర్భావ విశేషాలేమిటి? అనే విషయాలను ఈ కథ వివరిస్తోంది. గోవులలో తొలిగా అవతరించింది సురభి. సురభి అవతరణ గోలోకంలో జరిగింది. దీనికి సంబంధించిన కథ దేవీ భాగవతం నవమస్కంధంలో కనిపిస్తుంది. నారదుడికి నారాయణుడు సురభి ఆవిర్భావానికి సంబంధించిన విషయాలను వివరించాడు. గోలోకంలో ఒకప్పుడు శ్రీకృష్ణుడు బృందావనానికి వెళ్లి రాధతో, గోపికలతో విహరించాడు. కొద్ది సమయం తర్వాత అలసిపోయాననే నెపంతో ఒకచోట శ్రీకృష్ణుడు కూర్చొని విశ్రాంతి తీసుకున్నాడు. అప్పుడాయనకు పాలు తాగాలని కోరిక కలిగింది. మరుక్షణంలో తన ఎడమ భాగం నుంచి సురభి అనే గోవును దూడతో సహా సృష్టించాడు. ఆ దూడ పేరు మనోరథం. సురభి పొదుగు పాలతోటి బాగా నిండి ఉంది. శ్రీకృష్ణుడి ప్రియభక్తుడు శ్రీరాముడు ఒక కొత్త పాత్రను తెచ్చి సురభి పొదుగును పితికాడు. సురభి ఇచ్చిన పాలు శ్రీకృష్ణుడు ఎంతో తృప్తిగా ఆరగించాడు. ఆ పాలు అమృత సమానంగా ఉన్నాయని శ్రీకృష్ణుడు అభివర్ణించాడు. శ్రీకృష్ణుడు తాగగా మరికొన్ని పాలు ఆ పాత్రలోనే ఉన్నాయి.

### గోలోకంలో క్షీరసరోవరం

ఓ క్షణం గడిచిన తరువాత శ్రీకృష్ణుడి చేతి నుంచి పడినచోట మెల్లమెల్లగా పెద్ద పాల సరోవరంలా మారి పోసాగింది. చివరకు ఆ సరోవరం నూరుయోజనాల పొడవు, వెడల్పులతో కళకళలాడుతూ అవతరించింది. గోలోకంలో అలా క్షీరసరోవరం ఏర్పడింది. ఆ సరోవరం రాధకు, ఇతర గోపికలకు ఎంతో మానసిక ఉల్లాసాన్ని కలిగించింది. ఆ సరోవరమే వారికి సరాగక్రీడాసరోవరంగా మారింది. ఆ వెంటనే చాలా విచిత్రంగా ఆ క్షీర సరోవరానికి రత్నాలు పొదిగిన మెట్లు తయారయ్యాయి. అనంతరం శ్రీకృష్ణుడి సంకల్పంతో అసంఖ్యాకంగా కామధేనువులు అక్కడ ప్రత్యక్షమయ్యాయి. ఆ గోవులన్నింటికీ కావలసిన గోపాలకులు సురభి గోవు రోమ కూపాల నుంచి అవతరించారు. కామధేనువుల సంతానం అలా తామరతంపరగా లోకమంతా వ్యాపించింది. శ్రీకృష్ణుడు తాను సృష్టించిన గోమాతను ఎంతో గొప్పగా పూజించాడు. అలా శ్రీకృష్ణుడు గోమాత పూజను చేస్తున్నాడన్న విషయం మూడు లోకాలలోనూ వ్యాపించి



ముల్లోకవాసులంతా సురభిని పూజించటం ప్రారంభించారు. ప్రత్యేకంగా దీపావళి మరునాడు సురభి పూజ చెయ్యటం శ్రేష్ఠమన్న సంగతి లోకాలన్నిటా ప్రచారం అవ్వటంతో సురభి పూజ విశిష్టత విశేషంగా వ్యాప్తి చెందింది. బ్రహ్మాది దేవతలు కూడా శ్రీకృష్ణుడు సృష్టించిన సురభిని స్తుతించి ఎన్నెన్నో సందర్భాలలో వారికి కావలసిన కోరికలను సిద్ధింపచేసుకున్నారు. సురభి పూజావిధానాన్ని గురించి యజుర్వేదంలో కూడా ప్రస్తావన కనిపించటంతో వేదోక్తంగా గోపూజ ఏనాటి నుండో ఆచారంగా వస్తోందన్న విషయం సృష్టమవుతుంది.

### గోవుకు అవమానం జరిగితే...

గోవుకు అవమానం జరిగితే లోకాలన్నీ ఎలా తల్లడిల్లుతాయనే విషయం కూడా ఒక ఉదాహరణగా సురభికి సంబంధించిన కథా భాగంలోనే ఉంది. ఒకసారి సురభికి కారణాంతరాల వల్ల కోపం వచ్చి పాలివ్వటం మానివేసింది. అమృత తుల్యమైనక్షీరధారలు దేవతలకు సహితం అందకపోవటంతో వారెంతో మనస్తాపానికి గురయ్యారు. ఎలాగైనా సురభిని ప్రసన్నం చేసుకొమ్మని బ్రహ్మదేవుడిని ఆ దేవతలంతా కోరారు. అయితే బ్రహ్మ దేవతలందరి పక్షాన సురభిని భక్తిశ్రద్ధలతో పూజించి ప్రసన్నం చేసుకొమ్మని దేవేంద్రుడికి చెప్పాడు. ఇంద్రుడు బ్రహ్మదేవుడి సూచన మేరకు గోమాత సురభిని స్తుతించి ప్రసన్నం చేసుకున్నాడు. ఆనాటి నుంచి మళ్లీ క్షీరధారలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. గోవులను నిరాదరించటమంటే సాక్షాత్తూ లక్ష్మీదేవిని నిరాదించటమే. సంపదలలో గోసంపద కూడా ఒకటి. తల్లితో సమమైన గోవును ప్రతివారూ గౌరవించి, పూజించి భోగభాగ్యాలతో పాటు ఆయురారోగ్య ఐశ్వర్యాలు కూడా పొందవచ్చన్నది మన వారి ప్రగాఢ విశ్వాసం.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

### మంటమారితనం

అతికోపాన్ని ప్రదర్శించటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. కోపం అగ్నితో సమానం. అందుకే కోపాగ్ని అనే పదం ప్రయోగంలోకి వచ్చింది. కోపాగ్నికి ప్రతిరూపమే మంటమారితనం. మండిపడటం అన్నా కూడా విపరీతమైన కోపాన్ని ప్రదర్శించటం అనే అర్థముంది. ఈ అర్థాల క్రమంలోనే ఈ జాతీయం కూడా ప్రయోగంలోకి వచ్చింది.

# వైభవంగా ఎర్రితాత రథోత్సవం



అలంకరణలో ఎర్రితాత



రథోత్సవం

**అనంతపురం, న్యూస్‌టుడే:** బెళుగుప్పలో ఆదివారం శ్రీ ఎర్రితాత రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రి భక్తులు పల్లకి సేవ నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి మేళతాళాలతో వినాయక ఆలయం నుంచి పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సోమవారం ఉట్లపరుష, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# ముగిసిన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

**కోడూరు, న్యూస్‌టుడే:** కోడూరులో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమతే శ్రీకల్యాణ వేంకటేశ్వరుని 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రితో వైభవంగా ముగిశాయి. ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ఆఖరి రోజైన శనివారం రాత్రి ఆలయంలో విశ్రాంత అర్థశాస్త్ర అధ్యాపకులైన, కోట హరీష్‌బాబు బంధువైన భిక్షాలరావు దంపతులు కర్తలుగా సహస్ర దీపాలంకరణ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు ధుంబాల శ్రీధరాచార్యులు, బ్రహ్మోత్సవ యాజ్ఞిక బ్రహ్మ కోగంటి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కోడూరుకు చెందిన మల్లంపాటి సత్యన్నారాయణ(బుజ్జి) దంపతులు స్వామివారి పవళింపు సేవకు కర్తలుగా వ్యవహరించారు. కోడూరు ఎస్ఐగా చేసిన ఆదుర్తి గంగాధర సత్యనారాయణ మూర్తి సహకారంతో పూలతో అలంకరించిన అలంకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారికి నిర్వహించిన ద్వాదశ ప్రదక్షిణల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామి పల్లకి మోశారు. అనంతరం స్వామివారి పవళింపు సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమాలలో తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మప్రచార పరిషత్ సభ్యులు పండితులు మొవ్వ రఘుశేఖర ప్రసాద్, కోట సంపత్‌కుమార్, కోట లీలా ప్రసాద్, నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





ప్రదక్షిణల్లో పాల్గొన్న భక్తులు

ప్రత్యేకాలంకరణలో వెంకన్నస్వామి

# చాముండేశ్వరి తెప్పోత్సవం

**నెల్లూరు, న్యూస్‌టుడే :** ఇందుకూరుపేట మండలం గంగపట్నం చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టాలైన కల్యాణోత్సవం, రథోత్సవం తర్వాత అమ్మవారి ఆలయం వద్ద కోనేరులో తెప్పోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ప్రధానార్చకులు సుధీర్, రామకృష్ణ, వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ నిర్వహించగా చాముండేశ్వరి, త్రిశూలేశ్వరస్వామి తెప్పపై విహరించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సీఐ బీటీ నాయక్ ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్సైలు, వంద మంది కానిస్టేబుళ్లు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి నెల్లూరు కార్ జోన్ అధినేత నావూరు మురళీమనోజ్‌కుమార్, అరుణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ధ్వజారోహణం వేడుకగా జరిగింది.



అలంకరణలో అమ్మవారు

# తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి

## ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** తలసీమియావ్యాధితో ఓ బాలుడు బాధపడుతున్నాడు. పేద కుటుంబంలో పుట్టిన సదరు బాలుడికి రూ.లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల కోసం ఎదురుచూస్తున్నాడు. బాలుడికి తరచూ రక్తం ఎక్కించడంతోపాటు ఎముకల్లోని కణాలను మార్చాల్సి వస్తోందని వైద్యులు చెప్పారు. వైద్యం చేయించుకోకపోతే ప్రాణాలకే ప్రమాదమన్నారు. హఫీజ్‌పేటలోని మార్తాండనగర్‌లో ఉండే తోలు నాగరత్నం, ఈశ్వరమ్మ దంపతులకు పవన్(7), సిద్ధార్థ్(3) అనే ఇద్దరు కుమారులున్నారు. నాగరత్నం వంట మాస్టర్‌గా పనిచేస్తుండగా.. ఈశ్వరమ్మ కూలీ పనిచేస్తోంది. పెద్దకుమారుడైన పవన్ ఐదునెలల క్రితం అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. బాలుడ్ని పరీక్షించిన వైద్యులు.. తలసీమియా మేజర్ వ్యాధితో బాధపడతున్నట్లు నిర్ధరించారు. సుమారు రూ.లక్షన్నర ఖర్చు పెట్టి తాత్కాలికంగా వైద్యం చేయించినా.. నయం కాలేదు. పూర్తిస్థాయి వైద్యం చేయించేందుకు వేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కళాశాల(సీఎంసీ) ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పవన్ ఎముకల్లోని కణాలను తొలగించి ఇతరుల(సరిపడేవారి) కణాలను ఎక్కించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు సుమారు రూ.14లక్షలు ఖర్చవుతుందని, వెంటనే వైద్యం ప్రారంభించాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. పవన్ సోదరుడు మూడేళ్ల వయస్సున్న సిద్ధార్థ ఎముకల్లోని కణాలు సరిపోవడంతో వెంటనే వైద్యం చేయించుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రస్తుతం పవన్‌కు తరచూ రక్తం ఎక్కించాల్సి వస్తోందని, కొంత మేర ప్రభుత్వం నుంచి ఉచితంగా రక్తం లభిస్తున్నా.. అనేకమార్లు డబ్బుతోనే కొనుగోలు చేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. అపన్నహస్తం అందించి తమ కుమారుడిని ఆదుకోవాలని దాతలను కోరుతున్నారు.



బాధిత బాలుడు

# సీతాదేవి సీమంతం

*ధర్మపథం*

**సీ**తా పరిత్యాగానికి సంబంధించిన పూర్వాపరాలు జైమిని మహాభారతంలో ఇరవై ఆరో అధ్యాయంలో విపులంగా కనిపిస్తున్నాయి. జైమిని మహర్షి జనమేజయ మహారాజుకు రామరాజ్యం గురించి వివరిస్తూ పదివేల సంవత్సరాల పాటు శ్రీరామచంద్రుడు తన పూర్వరాజులాగానే రాజ్యమేలాడని చెప్పాడు. రాముడు అలా పాలన చేస్తున్న కాలంలో వైష్ణవమైన శ్రవణ నక్షత్రంలో విష్ణు దేవతాకమైన నాల్గోపాదంలో తల్లికి దేశాంతరవాసం కలిగించే చరలగ్నంలో సీతాదేవి గర్భాన్ని ధరించింది. ఆ తరువాత రామచంద్రుడు సీతాదేవితోపాటు నాలుగు నెలల కాలం సుఖంగా గడిపాడు. అయిదో నెల రాగానే రాముడికి ఒక కల వచ్చింది. అందులో లక్ష్మణుడు సీతను తీసుకెళ్లి గంగానది ఒడ్డున విడిచిపెట్టినట్లు, అక్కడ సీతాదేవి శోకిస్తున్నట్లు రాముడికి కల వచ్చింది. ఉదయాన్నే లేచి అనుష్ఠానాదులు ముగించుకొని ఆ తరువాత ఆయన వసిష్ఠుడిని చేరపిలిచి రాత్రి తనకు వచ్చిన స్వప్న వృత్తాంతాన్ని వివరించాడు. ఆ స్వప్న ప్రభావం వల్ల గర్భవిఘ్నం కలుగుతుందేమోనని భావించి అందుకు ఏదైనా శాంతి జరిపించమని కోరాడు. దాంతోపాటు సీతకు సీమంతం (పుంసవనం) చేయించమని వసిష్ఠుడికి చెప్పాడు శ్రీరాముడు.

## శుక్లపక్షంలోనే చేయాలి

ఆ మాటలను విన్న వసిష్ఠుడు సీమంతం శుక్లపక్షంలో చెయ్యాలని ప్రస్తుతం కృష్ణపక్షం నడుస్తుందని కనుక కృష్ణపక్షం వెళ్లిపోయాక శుద్ధపంచమి పుష్య నక్షత్రయుక్త ఆదివారంనాడు సీమంతం చేయటం బాగుంటుందని వసిష్ఠుడు సూచించాడు. ఆ మాటలు విన్న రాముడు వెంటనే లక్ష్మణుడిని పిలిచి జనక మహారాజును ఇతర మునిగణాలను, విశ్వామిత్ర మునిని సీమంతం సమయానికి తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. అనంతరం రాముడు ఒక సువిశాలమైన మండపంలో వసిష్ఠమహర్షితో ఒక చక్కని వేదికనొకదానిని నిర్మింపచేశాడు. దానిమీద మేడిపండ్ల దండను, రక్షాబంధనాన్ని, మేడిక్రరతో తయారుచేసిన నాలుగు కోళ్లు ఉన్న చదరంగా ఉండే పీట, ఒక వీణ, సీమంతానికి కావలసిన వస్తువులను సమకూర్చాడు. రామాజ్ఞమేరకు జనకమహారాజు విశ్వామిత్రాది మునులను లక్ష్మణుడు తీసుకొచ్చాడు. శ్రీరాముడు వారందరికీ అతిథి పూజలు చేసి సత్కరించాడు. ముహూర్త సమయం సమీపిస్తుండటంతో వసిష్ఠుడి సూచన మేరకు సీతారాములు మంగళస్నానాలు ముగించారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు అంతా ఆ ఉత్సవానికి ఏర్పాటు చేసిన మండపం వద్దకు చేరుకున్నారు. వేదవేత్తలు, సదాచార పరాయణులు, స్మృతి పండితులు, కర్మకాండ విషయాలన్నీ బాగా తెలిసిన వారు అప్పటికే ఆ మండపం వద్దకు చేరారు. వసిష్ఠమహర్షి సీతారాములను ఆ పీఠం మధ్య కూర్చోబెట్టాడు. తిలలు, ఆజ్యంలాంటి ఆహూతులతో వారితో హోమం చేయించాడు. సీతాదేవి శిరోజాలపై జలాభిషేకం చేసి రక్షాసూత్రం ఉంచాడు. ఆ తర్వాత తామర గింజలతోనూ, మేడిపండ్లతోనూ తయారు చేసిన దండలు కూడా సీతాదేవి శిరోజాలపై ఉంచాడు. వసిష్ఠమహర్షి సీతాదేవి శిరస్సుపై ఉంచిన ఆ మాలలన్నీ గొప్ప అలంకారాలుగా అక్కడి వారందరికీ కనిపించాయి. బ్రహ్మాండగోళాలను ధరించిన గొప్ప దేవిగా సీత ఆ క్షణంలో అందరికీ కనిపించింది. ఆ ఆనంద సమయంలో భరతుడు తన వీణావాదన నైపుణ్యాన్ని అంతటినీ ప్రదర్శించాడు. సీత గర్భంలోని సంతతికి అప్పుడే భరతుడు ప్రేమతో వీణా వాదనం నేర్పుతున్నవాడిలాగా అందరికీ కనిపించాడు. అలాంటి శుభకర, మంగళకర కార్యాలతో సీమంతం ప్రక్రియసాగింది. అక్కడున్న మునీశ్వరులను పాయసాలతో, చక్కెరలతో, నేతులతో సంతృప్తిపరిచి వస్త్రాలు, బంగారు నగలు, గుర్రాలు లాంటివాటిని దానమిచ్చాడు శ్రీరామచంద్రుడు. అదే సమయంలో జనకమహారాజు తన రాజ్యాన్ని శ్రీరామచంద్రుడికి అప్పగించి విశ్వామిత్రుడితో కలిసి వనవాసానికి వెళ్లిపోయాడు. అలా సీతాదేవి సీమంత ఉత్సవం సాగింది. ఈ ఘట్టంలో ఆనాడు సీమంతోత్సవం ఎలా జరిగేది? ఏ విధమైన వస్తువులను సమకూర్చేవారు? అనే విషయాలు అవగతమవుతాయి. అన్నింటినీమించి భరతుడు వీణావాదన నిపుణుడన్న విషయం విశదమవుతుంది. అలాగే స్వప్నాన్ని నమ్మేవారిని, దుస్వప్నాలు కలిగినప్పుడు వాటి ప్రభావం తగ్గేందుకు కొన్ని శాంతులవంటివి జరిపించేవారిని కూడా ఈ కథాంశంవల్ల తెలుస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**



# వైభవంగా రథోత్సవం



**కర్నూలు, న్యూస్‌టుడే:** ఆదోని పట్టణం అర్లయ్య వీధిలో వెలసిన అర్లయ్యస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆలయంలో అర్లయ్యస్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఆశీనులను చేసి పురవీధుల గుండా రథాన్ని ఊరేగించారు. చిన్నారులు కలశాలతో రథానికి స్వాగతం పలికారు.



రథోత్సవంలో శ్రీదేవిభూదేవి సమేత ప్రసన్న వెంకన్న

# రథంపై ప్రసన్న వెంకన్న వైభోగం

## జనసందోహంగా అప్పలాయిగుంట

**తిరుపతి, న్యూస్‌టుడే:** వడమాలపేట మండల పరిధి అప్పలాయిగుంటలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో రథోత్సవం వేడుకగా జరిగింది. జనసందోహంగా మారిన తిరుమాఢవీధుల్లో ప్రజలు భక్తి పారవశ్యంతో రథాన్ని లాగుతుండగా.. స్వామివారు ముందుకుసాగుతూ భక్తుల కర్పూర నీరాజనాలు అందుకున్నారు. అంతకుముందు వాహన మండపంలో స్వామివారికి శుద్ధి, తోమాలసేవ, అర్చన, మొదటిగంట, బలి, శాత్తుమొర తదితర పూజలు నిర్వహించారు. చూడచక్కని సుమనోహర రూపంతో సర్వాలంకార భూషితుడైన స్వామివారు ఊరేగింపుగా రథమండపానికి వేంచేసి తిరువీధుల్లో ఊరేగారు.

### ఊయలపై ఒలలూడిన వేంకన్న

ఉదయం రథంపై తిరుగుతూ భక్తులకు వరాలందించిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి శ్రీదేవిభూదేవి సమేతంగా మండపానికి చేరుకున్నారు. అనంతరం వేద పండితులు ఉత్సవర్లను ఊంజల్ పై అధిరోహించి వింజమరలను ఊపుతుండగా. . స్వామివారు ఉయలపై ఒలలూడారు. ప్రసన్న వేంకన్న ఊంజల్ సేవలో ఉండగా.. భక్తులు భక్తిపారవశ్యంతో మైమరిచిపోయారు.

### అశ్వవాహనంపై ప్రసన్న వెంకన్న విహారం

ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు సర్వాలంకారభూషితుడై అశ్వవాహనంపై తిరుమాఢవీధుల్లో విహరించారు. మరకగమాణిక్యాలు, పట్టుపీతాంబరాలు, ప్రత్యేక పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకృతుడైన స్వామివారు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. కార్యక్రమంలో ఆలయాధికారి శ్రీనివాసులు, అర్చకులు పాల్గొన్నారు.

# గాడిద చాకిరి

*జాతీయాలు నుడికారాలు*

**మి**తిమీరిన సేవ అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. పూర్వకాలం వస్తువులను మోసుకెళ్లేందుకు గాడిదలాంటి జంతువులను వినియోగించేవారు. చాకిరేవుల దగ్గర దుస్తులు ఉతకటం కోసం వాటి మూటలను గాడిదలమీదే వేసుకెళ్లేవారు. ఉప్పు కొఠారుల దగ్గర ఉప్పుమూటలను మొయ్యటానికి కూడా గాడిదలనే వినియోగించేవారు. ఇలా ఎక్కువ బరువును మోసేందుకు ఈ జంతువులను ఎంచుకొనేవారు కానీ, వాటికి కావలసిన ఆహారాన్ని అందించటంలోనూ, విరామాన్ని ఇవ్వటంలోనూ వాటి యజమానులు అంతగా శ్రద్ధ చూపేవారు కారు. అయినా ఆ జంతువులు యజమాని తమ మీద వేసిన భారాన్ని మోస్తూనే కాలం గడిపేవి. ఇలాంటి సేవనే కొంతమంది మనుషులు కూడా చేస్తుంటారు. అలాంటి సందర్భాలలో ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తుంది. ‚ఇంటిలోని వారంతా తినేందుకు అతడొక్కడే పొద్దుటి నుంచి అర్ధరాత్రి దాకా గాడిద చాకిరిలా ఏదో ఒకపని చేస్తున్నాడు' అనే లాంటి సందర్భాలలో ఈ జాతీయం ప్రయోగంలో కనిపిస్తుంది.

# అమ్మ దర్శనానికి భక్తజన వెల్లువ

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** బాసర సరస్వతి ఆలయం భక్తజనులతో కిటకిటలాడింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసాల నిమిత్తం భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు, గోదావరి స్నానఘట్టాలు భక్తులతో నిండిపోయాయి. 1650 మంది చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు నిర్వహించారు. దర్శనానికి, పూజలకు మూడుగంటల సమయం పట్టింది. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి ₹ 6,50,000 ఆదాయం సమకూరింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు, బాసర పోలీసులు చర్యలు చేపట్టారు.



వరుసలో వేచిఉన్న భక్తులు

*ఆంధ్రావని*

## ఆంజనేయ స్వామికి ఆకుపూజ

**నల్గొండ, న్యూస్‌టుడే:** శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. ఉదయం 4గంటలకు సుప్రభాతం, 4.30 గంటలకు బిందెతీర్థం, ఆరాధన, 5గంటలకు బాలభోగం, 7గంటలకు సహస్రనామార్చన, 8గంటల నుంచి దైవ దర్శనాలు. శ్రీసుదర్శన నారసింహ హోమం, 10గంటలకు శ్రీస్వామి నిత్యకల్యాణోత్సవం. 12 గంటలకు నివేదన, 1గంటలకు సర్వదర్శనాలు, సాయంత్రం 4గంటలకు ప్రత్యేక దర్శనం, 5గంటలకు సర్వ దర్శనం కల్పించారు.

# ముక్కంటికి రుద్రాభిషేకం

**నల్గొండ, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం నిత్యపూజలు విశేషంగా కొనసాగాయి. క్షేత్ర సందర్శన కోసం వచ్చిన భక్త జనులు నిర్వహించిన పూజలతో ఆధ్యాత్మికత నెలకొంది. వైష్ణవ ఆలయంతో పాటు కొండపై ఉన్న శివాలయంలో నిత్యపూజలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం చేపట్టిన ఆచార్యులు ప్రధాన దేవాలయంలోని మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించారు. వేదమంత్ర పఠనాల మధ్య అభిషేకించిన ఆచార్యులు తులసీదళాలతో అర్చన చేపట్టారు. దర్శన మూర్తులను ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. శ్రీలక్ష్మీనరసింహుల నిత్యకల్యాణోత్సవ పర్వాలను శాస్త్రోక్తంగా జరిపారు. తొలుత శ్రీసుదర్శన నారసింహ హోమం జరిగింది.

**శివునికి...** కొండపైనే ఉన్న శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరుడి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. బిల్వ పత్రాలతో అర్చన జరిపారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణమూర్తులను ఆలయ వీధులలో ఊరేగించారు. పలువురు భక్తులు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. పుష్కరిణిలో పుణ్యస్నానం చేసి సంకల్పం చేపట్టారు.



శివాలయంలో పూజలు...

**తలనీలాలు సమర్పణలో...**గుట్ట దేవుని ఆలయాన్ని సందర్శించిన భక్తులతో పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తలనీలాలు సమర్పించడంతో ఆలయ సన్నిధిలోని కల్యాణకట్ట సందడిగా మారింది.

# అభిషేకం పూజల ఉపయోగాలు

దేవాలయాలలో నిత్యం అభిషేకాలు, పూజలు, ఉపచారాలు జరుగుతూ ఉంటాయి. ఇవన్నీ దేవుడికి చేయటం వల్ల ఉపయోగమేమిటి అనే విషయాన్ని గురించి వివరించి చెప్పే కథాసందర్భం ఇది. శివమహాపురాణం విద్యేశ్వర సంహితలో ఈ విషయాలున్నాయి. దేవతలకు, అభిషేకాలు పూజలు చేయటం వల్ల అలా చేసిన భక్తులకే ఎంతెంతో మేలు కలుగుతూ ఉంటుంది. అత్యంత సులభంగా ఎంతో విలువైన వాటిని ఆ భక్తులు సొంతం చేసుకోవచ్చు. దేవతలకు అభిషేకం చేస్తే కలిగే ప్రయోజనం అంతా ఇంతా కాదు. సాక్షాత్తూ ఆత్మశుద్ధి కలుగుతుంది. గంధాన్ని అద్దటం వల్ల పుణ్యం ప్రాప్తిస్తుంది. నైవేద్యం సమర్పించటం వల్ల ఆయువు వృద్ధి చెందుతుంది. జీవితంలో తృప్తి లభిస్తుంది. ధూపాన్ని ఇవ్వటం వల్ల ధన ప్రాప్తి సులభమవుతుంది. ధూపాన్ని ఇచ్చే విషయంలో మంచి అగరులాంటి పరిమళ ద్రవ్యాలను ఎలాంటి కల్తీలేనివి, శుభ్రమైనవి ఎంచుకోవాలి. దేవుడికి పూజాసమయంలో దీపం దర్శయామి అంటూ దీపం చూపిస్తుంటారు. ఈ దీప దర్శనం వల్ల జ్ఞానోదయమవుతుంది. భగవంతుడికి పూజాసమయంలో జరిపే ఉపచారాలలో తాంబూలం ఇవ్వటం ఒకటి. తాంబూల సమర్పణంతో భోగ లబ్ధి కలుగుతుంది. పూజలోని పదహారు రకాల ఉపచారాలలో స్నానం మొదలుకొని ఆరు ఉపచారాలు ఉన్నాయి. ఈ స్నానాది ఉపచారాలు తప్పనిసరిగా జరిపించాలి. దేవుడికి నమస్కారం చేయటం, జపం చేయటం ఈ రెండూ సంపూర్ణంగా కోరిన కోర్కెలను తీర్చేలా చేస్తాయి. భోగాలను, మోక్షాన్ని కోరుకునేవారు పూజాంతంలో జపం, నమస్కారం చేయాలి. పూజ చేసేవారు ముందుగా మానసిక పూజ చేసి ఆ తర్వాత పదహారు రకాల ఉపచారాలతో పూజ చేయటం మేలు. దేవతలకు అభిషేకాలు, పూజలు చేయటం వల్ల కలిగే లాభాలు ప్రధానమైనది ఆయా దేవతల లోకాలు లభించటం. నిరంతరం

ధర్మపథం

విష్ణుపూజ చేస్తే విష్ణులోక ప్రాప్తి కలిగినట్లే ఏ దేవతకు పూజ చేస్తే ఆ దేవతకు సంబంధించిన లోకం ప్రాప్తిస్తుంది. ఆయా లోకాలలో భోగవస్తువులు కూడా లభిస్తాయి.

### ఇహలోకంలో శుభాలు

విఘ్నరాజైన వినాయకుడిని పూజిస్తే భూలోకంలో ఉత్తమమైనవి, కోరుకున్న వస్తువులు ప్రాప్తిస్తాయి. ఇదే తీరులో ఇతర దేవతాపూజలు చేసినప్పుడు కూడా ఆయా దేవతల లోక ప్రాప్తితో పాటు ఇహలోకంలో కూడా అనేకానేక శుభాలు కలుగుతుంటాయి. శ్రావణ, భాద్రపద



మాసాలలోని శుక్రవారంలోనూ, ఆయా మాసాలలో శుక్లపక్ష చతుర్థినాడు, పుష్యమాసంలో శతభిష నక్షత్రం వచ్చినప్పుడు విధిపూర్వకంగా గణేశుడిని పూజించాలి. వందకానీ, వెయ్యికానీ రోజులను నియమంగా పెట్టుకొని అలా రోజుకొకసారి గణేశపూజ చేయాలి. దేవతలతోపాటు అగ్ని మీద శ్రద్ధ నుంచి నిత్యం పూజలు చేసే వారికి కోరిన వస్తువులు, సంతానం ప్రాప్తిస్తాయి. ఇలా పూజచేయటం వల్ల పాపాలు నశిస్తాయి. పూజల వల్ల ఆత్మశుద్ధి కలుగుతుంది. తిథి, నక్షత్ర, యోగ, వారాల మీద పూజాఫలాలు ఆధారపడి ఉంటాయి. ఒక్కో దేవతకు ఒక్కో వారం, తిథి పూజకు అనువుగా ఉంటుంది. అది తెలుసుకొని పూజలు జరపటం వల్ల ఆయా దేవతల అనుగ్రహాన్ని సులభంగా పొందవచ్చు. పూజ కోసం దేవతాప్రతిమలను స్వయంగా సిద్ధం చేసుకోవటం ఉత్తమం. ప్రతిమను తయారుచేయటం కోసం నదులు, కొలనులు, బావుల నీటి అడుగు భాగంలో ఉన్న మట్టిని వినియోగించాలి. దాన్ని మంచిగంధపు పొడితే కలిసి శుద్ధి చేయాలి. ఆ మట్టిని శుభ్రమైన మండపం మీద పెట్టి మెత్తగా ముద్దచేసి చేతితో అనుకున్న దేవత ప్రతిమ చేయాలి. ఆ తర్వాత కొద్దిగా పాలతో సంస్కరించాలి. ఆ దేవతామూర్తికి సంబంధించిన అంగప్రత్యంగాలన్నింటినీ సమకూర్చాలి. దాన్ని అన్ని విధాలా ఆయా దేవతలకు సంబంధించిన అస్త్రశస్త్రాలతో సుపంపన్నం చేయాలి. తర్వాత ఆ ప్రతిమను చిత్రించిన పద్మాసనం మీద ఉంచి పూజ చేయాలి. గణేశుడు, సూర్యుడు, విష్ణువు, దుర్గ, శివ పంచాయతనాన్ని శివలింగాన్ని కూడా ఇదే తీరులో సిద్ధం చేసి పూజ చేయవచ్చు. పూజలో పదహారు రకాల ఉపచారాలుంటాయి. వీటినే షోడశోపచారాలు అంటారు. వాటన్నిటినీ వరుస క్రమంలో చేయాలి. ప్రతిమను ప్రోక్షణం చేయటం కోసం పుష్పాన్ని వినియోగించి సంబంధిత దేవతామంత్రాన్ని పఠిస్తూ ముందు అభిషేకం ఆ తర్వాత పూజ చేయటం పద్ధతి. పూజ తర్వాత నైవేద్యాన్ని ఇవ్వాలి. ఇలా క్రమపద్ధతిలో చేసిన అభిషేక పూజలు వాటిని చేసిన భక్తులకు పాపాలు పోగొట్టి శుభాలు కలిగిస్తాయని శివమహాపురాణం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## సాయినాథునికి పంచామృతాభిషేకాలు

**గుంటూరు , న్యూస్‌టుడే:** వడ్డూరి వారివీధిలోని శ్రీవిఘ్నేశ్వర దత్త సాయి మందిరంలో ఆలయ 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా కాకడహారతి, నిత్యార్చనలు జరిగాయి. విశేష కార్యక్రమాల్లో భాగంగా బాబాకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వీటితో పాటు లక్ష్మీగణపతి, రుద్ర, దత్త హోమాలు జరుగుతాయి. హోమ కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు వి.కోటేశ్వరరావు పూజలు నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి, గీతామృత పారాయణం, పెద్దమహాలక్ష్మమ్మ దేవస్థానం నుంచి వచ్చిన భక్తులు నిర్వహించారు.



అలంకరణలో సాయినాథుడు

## పులి మీసాలను మెలిపెట్టడం

జాతీయాలు నుడికారాలు

అసాధ్యమైన పని అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. పులిని ముచ్చటపడితే దూరం నుంచి చూస్తే చూడవచ్చేమో. కానీ దగ్గరకు వెళ్లటం ప్రాణాంతకం. దగ్గరకు వెళ్లటమేకాక ఆ పులి మీసాలను పట్టుకొని మెలివేయటమంటే అది దాదాపు అసాధ్యమైన పని, ప్రమాదకరమైన పని అవుతుంది. అలా చేసినట్లు ఎవరైనా చెప్పినా నమ్మబుద్ధి కాదు. అదే పద్ధతిలో సామాన్య మానవుడికి చెయ్యటానికి కుదరని ప్రమాదకరమైన పనిని ఎవరైనా చేసినట్లు చెప్పినప్పుడు దాన్ని ఈ జాతీయంతో పోల్చి చెబుతుంటారు.

## ఘనంగా సహస్ర రుద్రాభిషేకం



**వరంగల్, న్యూస్‌టుడే:** వరుణుడి కరుణ కోసం రెండో రోజు బుధవారం కాజీపేట శ్వేతార్క మూల గణపతి ఆలయంలోని సంతానలింగేశ్వరస్వామికి సహస్ర రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్య సిద్ధాంతి రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా చేశారు. ఈ సందర్భంగా సిద్ధాంతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని రుద్రాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, దేవాలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

**విజయవాడ, న్యూస్‌టుడే:** పెనమలూరు శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్ల కల్యాణ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువుగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహించగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివార్ల కల్యాణమహోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవ విగ్రహాలకు పూలతో అలంకరించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం జరిగింది. బుధవారం ఉదయం శ్రీయాగం, తీర్థగోష్ఠి, గరుడసేవ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఆంధ్రావని

## వైభవంగా శ్రీచక్రమేరు ప్రతిష్ఠ మహోత్సవం

**శ్రీకాకుళం, న్యూస్‌టుడే:** పట్టణంలో గుడివీధిలో పంచలింగ క్షేత్రం ఉమారుద్రకోటేశ్వరాలయంలోలలితా ఉత్సవ విగ్రహ శ్రీచక్రమేరు ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆరవెల్లి ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆరవెల్లి హరగోపాలశర్మ, ఆరవెల్లి రామ్‌జీ, చందు, చంద్రశేఖరశర్మ, విశ్వనాథశర్మల నిర్వహణలో ప్రతిష్ఠ, అమ్మవారికి విశేష పుష్పాలంకరణ పూజలు జరిపారు. అంతకు ముందు మహాపూర్ణాహుతి పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సన్యాసి రాజు, శ్యామలరావు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారు

## బలుసులమ్మ జాతర పుస్తకం ఆవిష్కరణ

**తాడేపల్లిగూడెం , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** గూడెం పురదేవత బలుసులమ్మ జాతర మహోత్సవం పుస్తకాన్ని అమ్మవారి ఆలయం వద్ద పురపాలకసంఘ తెదేపా ఛైర్మన్ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు దశాబ్దాల తర్వాత నిర్వహిస్తున్న జాతర మహోత్సవంలో పాల్గొనేందుకు ప్రవాసాంధ్రులు, విదేశాల్లో ఉన్న గూడెం ఆడబడుచులు కూడా వస్తున్నారని తెలిపారు. పురపాలక సంఘ మాజీఅధ్యక్షుడు ఈతకోట తాతాజీ మాట్లాడుతూ జాతర నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వ్యాపార సంస్థల వారు, ప్రజలు ముందుకువచ్చి వస్తు, ధనరూపేణా విరాళాలివ్వడం అభినందనీయమన్నారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గ్రంథి సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ సహకరిస్తే జాతర మహా వైభవోపేతంగా జరుగుతుందని తెలిపారు. తమ కళాశాల తరపున మహా అన్న సమారాధనకు అవసరమైన మొత్తం కిరాణా సరుకులు ఇస్తున్నట్టు ప్రకటించారు. పురపాలక సంఘ మాజీ ఉపాధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కౌన్సిలర్ కాకర్ల సుభద్ర, భాజపా నాయకుడు కంచుమర్తి నాగేశ్వరరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు గొర్రెల శ్రీధర్, కమిటీ సభ్యులు పెదప్రోలు భాస్కర్, ఆరేపల్లి ఉమ, పైలు శ్రీనివాసరావు, కల్యాణం రామచంద్రరావు, మాజీకౌన్సిలర్ సింగం పట్టాభి, కేబుల్ సాయి తదితరులు మాట్లాడారు. వడ్డి వెంకటదొరయ్య, గుండుమోగుల సురేశ్, వడ్డి వెంకటదొరయ్య, పాలడుగు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు. పట్టణ ఎస్సై వి.శ్రీనివాసరావు, అమ్మవారి ఆలయ ప్రాంతాన్ని పరిశీలించారు. భక్తుల భద్రత, వాహనాల నిలుపుదల తదితర అంశాలపై జాతర కమిటీ సభ్యులతో మాట్లాడారు.

# దైవ కటాక్షానికి లక్ష పూజ

చాలా చోట్ల దేవతలకు ఉత్సవాలు, పూజలు జరిపేటప్పుడు లక్ష బిల్వార్చన, లక్ష మారేడు దళార్చన, లక్ష మల్లెల అర్చన, లక్ష నాగవల్లీదళ లేదా తమలపాకుల అర్చన ఇలా లక్ష సంఖ్యలో పూజలు జరపటం కనిపిస్తుంది. ఈ లక్ష సంఖ్యలో పువ్వులతో, ఆకులతో పూజలు ఎందుకు చేస్తుంటారు అనే విషయాన్ని వివరించి చెప్పే కథాసందర్భం ఇది. శివపురాణం రుద్రసంహిత సృష్టిఖండంలో బ్రహ్మదేవుడు నారదుడికి ఇవన్నీ వివరించి చెప్పినట్టుంది. ఒక్కొక్క దేవుడికి ఒక్కొక్క పుష్పం లేదా పత్రం అంటే ఎంతో ఇష్టం. ఆ పుష్పాలను, పత్రాలను లక్ష సంఖ్యలో సేకరించి ఆయా దేవతలకు పూజ చేయడం వల్ల విశేష ఫలసిద్ధి కలుగుతుంది. ఒక్క శివుడి విషయాన్నే తీసుకొన్నట్లైతే శివుడికి లక్ష దర్భలతో పూజ చేసిన వారికి మోక్షం ప్రాప్తిస్తుంది. దీర్ఘాయువు కావాలనుకున్నవారు లక్ష దర్భలతో పూజ చేయడం మంచిది.

### ఏయే పూలతో ఎలాంటి ఫలితం?

సంతానాన్ని కాంక్షించేవారు లక్ష ఉమ్మెత్తపూలతో శివపూజ చేయాలి. ఉమ్మెత్తలలో ఎర్రకాడలున్న ఉమ్మెత్తపూలు శివపూజకు శ్రేయస్కరం. లక్ష అవిశెపూలతో పూజచేస్తే గొప్ప యశస్సు కలుగుతుంది. లక్ష తులసీ దళపూజతో భోగమోక్షాలు ప్రాప్తిస్తాయి. ఎర్రని, తెల్లని జిల్లేడుపూలు లేదా తెల్లకమలాలతో శివపూజ చేసిన భోగమోక్షప్రాప్తి సులభంగా దక్కుతుంది. లక్ష దాసానిపూలతో చేసిన పూజవల్ల శత్రునాశనం, లక్ష గన్నేరుపూలతో రోగనాశనం కలుగుతాయి. ఆభరణాలు, భూషణాలు కోరుకున్నవారు మంకెనపూలతో పూజ చేయాలి. జాజిపూలతో చేసే పూజ వాహన లాభాన్ని కలిగిస్తుంది. అవిశెపూలతో చేసే పూజ శివుడి అనుగ్రహాన్నే కాక విష్ణువు అనుగ్రహాన్ని కూడా కలిగిస్తుంది. లక్ష జమ్మి ఆకులతో శివుడికి చేసే పూజ మోక్షాన్ని కలిగిస్తుంది. మల్లెపూలతో చేసే పూజ శుభలక్షణాలతో ఉన్న సంపన్నులను జీవిత భాగస్వామిగా ప్రసాదిస్తుంది. అడవిమొల్ల పుష్పాలతో పూజ చేసిన వారికి ఇంట్లో ఎప్పుడూ తిండికి లోపం ఉండదు. గన్నేరుపూల పూజ వస్త్రాలను కూడా ప్రసాదిస్తుంది. నల్లవావిలిపువ్వులు లక్షను సేకరించి శివపూజ చేస్తే మనసులోని కలతలు పోయి మనసు నిర్మలంగా అవుతుంది. లక్ష



మారేడుదళాలను భగవంతుడికి సమర్పిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. పారిజాతపుష్పాలతో చేసే పూజవల్ల సుఖసంపదలు పెంపొందుతాయి. ఏ రుతువులో దొరికే పువ్వులను ఆ రుతువులో సేకరించి శివపూజ చేయటంవల్ల మోక్షం లభిస్తుంది. నల్లఆవాల పుష్పాలతో చేసే పూజ శత్రునాశనం చేస్తుంది. చంపక, మొగలిపుష్పాలు తప్ప మిగతా పుష్పాలన్నీ శివపూజకు అర్హమైనవే. సంపదలను కోరేవారు కమలం, బిల్వపత్రం, శంఖపత్రాలతో పూజ చేయవచ్చు. కందిఆకులతో చేసే పూజ సంపూర్ణ సుఖాలను ఇస్తుంది.

### మృత్యుంజయ మంత్ర జపం

శివపూజ చేసేటప్పుడు మృత్యుంజయ మంత్రాన్ని చదవటం ఎంతో క్షేమకరం. అయిదులక్షల సార్లు మృత్యుంజయ మంత్రాన్ని జపించినవారు శివుడికి ప్రీతిపాత్రులవుతారు. అదే మంత్రాన్ని లక్షసార్లు జపిస్తే శరీరశుద్ధి కలుగుతుంది. మృత్యుంజయ మంత్రాన్ని రెండు లక్షల సంఖ్యలో చేసినప్పుడు పూర్వజన్మ స్ఫురణ కలుగుతుంది. మూడు లక్షల సార్లు చేసిన భక్తుడికి శివుడు స్వప్నంలో దర్శనమిస్తాడు. పది లక్షల మంత్ర జపం పూర్తి చేస్తే సంపూర్ణ ఫలం సిద్ధిస్తుంది. అవిశెపూలు, శంఖపుష్పాలు, ఆవాలపువ్వులు లాంటివి తేలికగా ఉండి దాదాపు ఒక బరువులో ఉంటాయి. కమలాలు ఎక్కువ బరువులో ఉంటాయి. తూచేటప్పుడు లక్షసంఖ్యకు సరిపడా వచ్చేలా పువ్వులు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి. పువ్వులన్నీ చక్కగా పరిశుభ్రంగా ఉండి తీరాలి. పవిత్రమైన ప్రదేశాలలో సేకరించాలి. అంత భారీ సంఖ్యలో పువ్వులను తెచ్చి పూజచేసేటప్పుడు పొరపాటున కూడా సోమరితనం, నిర్లక్ష్యం లాంటివాటితో పూజ చెయ్యకూడదు. చిత్తశుద్ధితో పూజ చేసినప్పుడే చెప్పిన ఫలితం దక్కుతుందని ఈ కథాసందర్భం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## అమరేశ్వరాలయంలో వరుణ జపారాధన

**గుంటూరు, న్యూస్‌టుడే:** వర్షాలను కాంక్షిస్తూ అమరావతి అమరలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వరుణ జపారాధన ఆద్యంతం భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు జగర్లపూడి వెంకటేశ్వరశాస్త్రి, ముఖ్య అర్చకుడు శంకరమంచి మధుసూదనశర్మల ఆధ్వర్యంలో అర్చకులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, వరుణ పారాయణ, అరుణ పారాయణ, నవగ్రహ మండపారాధన, రుత్విగ్వరుణ, ఇంద్రాది అష్టదిక్పాలకారాధన, ఏకాదశ రుద్ర కలశారాధన, పంచరుద్ర కలశారాధన, ప్రద్యుమ్నో వరుణ జపాలు, విరాట్ పర్వ పారాయణ, రుష్యశృంగారాధనలను శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. ఆలయ ఈఓ ఎమ్.పానకాలరావు చేతులమీదుగా కలశస్థాపన జరిపించి వరుణదేవుడ్ని ఆవాహన చేశారు.

## అంజన్నకు అష్టోత్తర శతకలశాభిషేకం



అంజన్న ఆలయంలో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

**కరీంనగర్, న్యూస్‌టుడే:** జ్యేష్ఠ మాసంలో వచ్చే స్వామి వారి తిరునక్షత్రం సందర్భంగా లోక కళ్యాణార్థం, వరుణుడి కటాక్షం కోసం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై పూర్ణకుంభంతో పాటు 108 కలశాలను ప్రతిష్ఠించి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వేదగోష్ఠి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు 108 కళశాలతో పంచామృత అభిషేకం చేశారు. స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలంకరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ ఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌శర్మ, ఆలయ ధర్మకర్త నర్సమ్మ, పాలకవర్గం సభ్యులు మంద శ్రీనివాస్, పవన్, ఆలయ స్థానాచార్యులు తిరుక్కోవెల మారుతి, ప్రధాన అర్చకులు రామకృష్ణ, చిరంజీవి, కపిందర్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## గోడకేసిన సున్నం

ఒకరికి ఇచ్చిన తర్వాత తిరిగిం~నిది అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. గోడలు అందంగా ఉండేందుకు సున్నం వేస్తుంటారు. సున్నం గోడలకు వెయ్యటానికి సిద్ధం చేసినప్పుడు పెద్దపెద్ద తొట్లలో ఎక్కువ మొత్తంలో ఉన్నట్లు కనిపిస్తుంది. అదే సున్నాన్ని గోడకు వేసినప్పుడు గోడలు చూడటానికి చక్కగా ముచ్చటగా బాగానే ఉన్నట్లు కనిపిస్తుంటాయి. కానీ ఆ గోడలకు వేసిన సున్నాన్ని తిరిగి తీసుకోవాలని ప్రయత్నం చేస్తే దానివల్ల శ్రమతప్ప ఫలితం ఉండదు. వేశ్యలలాంటి వారికి ఇచ్చిన ధనం గోడలకు వేసిన సున్నంలాంటిదని అంటుంటారు.



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో శ్రీవారి కల్యాణం

**ఒంగోలు , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే**

**పిడికిట తలంబ్రాల పెళ్లకూతురు**
**కాస్త పెడమరలి నవ్వేనే పెళ్లికూతురు**
**పేరంటాండ్ర నడిమి పెళ్లికూతురు**
**విభుపేరు గుచ్చ సిగ్గుపడే పెళ్లికూతురు**

అంటూ అన్నమాచార్య కీర్తించిన విధంగా గురువారం వేంకటేశ్వరస్వామి భక్తబృందం స్వామి కల్యాణ మహోత్సవాన్ని రమణీయంగా నిర్వహించింది. కేశవస్వామిపేట, చెన్నకేశవ ఆలయాల ప్రాంగణంలోని శ్రీనివాస ఆలయం వార్షిక మహోత్సవం సందర్భంగా జరిగిన కల్యాణం గోవిందుని వైభవాన్ని కళ్లకుకట్టింది. ఇరుగడల దేవేరులు కొలువుదీరి స్వామిని క్రీగంట చూస్తూ, తమ విభుని అర్చకస్వాములు అచ్యుతుడు, అనంతుడంటూ స్తుతిస్తున్న విధానానికి అచ్చెరువొందారు. పుష్పమాలికలు సైతం పురుషోత్తముని చేరినందుకు పులకిస్తుండగా, వైష్ణవ స్వాములు పరాంకుశం రామకృష్ణాచార్యులు, రమానాధాచార్యులు , మురికిపూడి త్రినాధచక్రవర్తి కల్యాణ ఘట్టాన్ని మనోహరంగా నడిపించారు. వారణ మాయిరం, తలంబ్రాలు, మంగళసూత్ర ధారణ తదితర ఘట్టాలు వ్యాఖ్యాన సహితంగా శ్రోతలను అలరించాయి. భక్తబృందం ప్రతినిధులు మట్టా పిచ్చయ్య, వేమా పెద వెంకటేశ్వర్లు, గుర్రంబదరీనారాయణ నిర్వాహకులుగా వ్యవహరించారు. ఆలయకార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పెద్దినేని అప్పారావు, ఎం.సుబ్బారావు, బి.శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా జాతర

**భీమవరం , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** భక్తుల ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయం భక్తులతో కళకళలాడింది. జ్యేష్ఠమాస విశేష జాతరను పురస్కరించుకుని అమ్మవారి గ్రామోత్సవం, జాతర కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల రామలింగేశ్వరశర్మ, ఉప ప్రధానార్చకుడు కొడమంచిలి సుబ్రహ్మణ్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర వేడుకకు శ్రీకారం చుట్టారు. ఆలయం ఎదురుగా ఉన్న దుకాణాలన్నీ మూసివేసి వ్యాపారులు జాతరలో పాల్గొనడంతో పట్టణం అంతాపండుగ వాతావరణం సంతరించుకుంది.

# 106 దేవాలయాలలో వరుణజపాలు



ఆర్ఆర్‌పేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

**ఏలూరు , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** దేవాదాయశాఖ అమాత్యులు పైడికొండల మాణిక్యాలరావు ఆదేశాలను అనుసరించి ఆశాఖ కమిషనర్ వై.వి.అనురాధ ఉత్తర్వుల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 106 దేవాలయాల్లో వరుణదేవుడి కటాక్షం కోసం వరుణజపాలు, విశేషపూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వేములపూడి సత్యనారాయణ పర్యవేక్షణలో నాలుగు డివిజన్‌ల తనిఖీదారులు జి.పవన్‌కల్యాణ్(ఏలూరు), వీవీఎల్ఎన్ రెడ్డి(భీమవరం), బాలాజీ రాంప్రసాద్(తణుకు), రమణ (తాడేపల్లిగూడెం)ల మార్గదర్శకత్వంలో ఆలయాలలో వైభవంగా ఏర్పాట్లు చేశారు. ఏలూరు నగరంలోని ఆర్‌ఆర్‌పేటలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వరుణదేవుడి ప్రీత్యర్థం స్వామి వారికి అర్చకులు ఇల్లెందుల శ్రీనివాసాచార్యులు, కిలాంబి మారుతీ శ్రీనివాసరామానుజాచార్యులు ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. వరుణ దేవునికి జపాలు చేశారు. జిల్లాలో పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం, గునుపూడి భీమవరం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయం, పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయం, అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం, తణుకు కేశవమహాలక్ష్మి ఆలయం నత్తా రామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం, నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయాలలో గురువారం వరుణ జపాలు, మహా శివుడికి పంచామృత అభిషేకాలు చేశారు. విరాట పర్వంలోని ఘట్టాలను వేద పండితులు ప్రవచనాలు చేశారు.

# బృందావన మహిమ

యమునా నదీతీరంలో ఉన్న బృందావనం అసామాన్యమైనది. దాని మహిమను తెలుసుకోవటం దేవతలకు కూడా అంత సులభసాధ్యం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే భూమండలం కీర్తి రహస్యం బృందావనమే. మామూలుగా అయితే భూమి మీద అడుగుపెట్టడానికి స్వర్గవాసులైన దేవతలు ఇష్టపడరు. కానీ పవిత్రమైన బృందావనం భూమి మీద ఉంది కనుక ఆ కారణంగా భూమి మీదకు వచ్చి మళ్లీ తమ తమ స్థానాలకు వెళుతూ ఉంటారు దేవతలు. ఈ విషయాన్ని వివరించి చెప్పే కథాసందర్భం ఇది. నారదమహాపురాణం ఉత్తరభాగం ఎనభయ్యో అధ్యాయంలో ఈ విషయాలన్ని ఉన్నాయి.

### శ్రీకృష్ణుడి ప్రియసః బృంద

ఓసారి నారదుడు భూమండలంలో ఉన్న బృందావనాన్ని దర్శించాలనుకున్నాడు. బృందావనానికి అధిదేవత శ్రీకృష్ణుడి ప్రియసః బృంద. ఆమె పేరు మీదనే ఆ వనానికి ఆ పేరొచ్చింది. బృందావనమంటే శ్రీకృష్ణుడికి రాధ, బృంద, కుబ్జ లాంటి ప్రియసఖుల లాగా ఎంతో ఇష్టం. రాధ అంశే కుబ్జ. అందుకే కృష్ణుడికి ఆమె అంటే అంత ఇష్టం. నిత్యం ఆ స్వామి ఆ వనంలో సంచరిస్తూనే ఉంటాడు. అయితే ఆయనను దర్శించే భాగ్యం మాత్రం ఏ ఒకరిద్దరికో తప్ప అందరికీ కుదిరే పనికాదు. అయితే బృందావన దర్శనం వల్లనే కృష్ణదర్శనం వల్ల కలిగే అమూల్య అమిత పుణ్యఫలాలు దక్కుతుంటాయి. అందుకే బృందావన దర్శనం కోసం ఎందరెందరో రుషులు, దేవతలు, మునులు నిత్యం ఉత్సాహపడుతుంటారు. ఇలాంటి ఉత్సాహమే ఓసారి దేవముని నారదుడికి కలిగింది. వెంటనే ఆ త్రిలోకసంచారి మధురలోని బృందావనానికి చేరుకున్నాడు. ఆ సుందర బృందావనంలో స్వామి ఎక్కడ కనిపిస్తాడా అని వెతుకుతూ ముందుకు నడిచాడు. అక్కడ ఆయనకు ఓ సరోవరం కనిపించింది. అప్పటికి మధ్యాహ్న సమయం కావటంతో మధ్యాహ్నిక సంధ్యావందన విధులను పూర్తిచేశాడు. ఆ తర్వాత మళ్లీ ఆ వనంలో కృష్ణదర్శనం కోసం ముందుకు నడవసాగాడు. అలా వెళుతున్న ఆ మునికి ఓ చోట ఎంతో సుందరమైన ఓ ఆశ్రమం కనిపించింది.

### నారదుడి అనుభవాలు

అది కృష్ణసః, ఆ వన అధిదేవత అయిన బృంద ఉండే ఆశ్రమం. బృంద నారద మునికి అతిథి పూజాసత్కారాలు చేసి ఆదరించి ఏంకావాలో చెప్పమంది. అప్పుడు నారదుడు తనకు కృష్ణుడు కావాలన్నాడు. బృంద వెంటనే తన సః అయిన మాధవిని పిలిచి నారదుడికి కావలసిన ఏర్పాట్లను చూడమని చెప్పింది. మాధవి నారదుడిని తీసుకొని మొదట ఆ ముని చూసిన సరస్సు తీరానికి వచ్చింది. ఆ సరస్సు వాయువ్య



భాగంలో స్నానం చేయమని చెప్పి పంపింది. నారదుడు స్నానం చేస్తూ శ్రీకృష్ణుడిని ధ్యానిస్తూ ఆ సరస్సులోని జలంలో ఒక్కసారి మునిగి పైకి లేచాడు. నారదుడు అలా పైకి లేవగానే ఆయన పురుషరూపం పోయి స్త్రీగా మారిపోయాడు. ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే స్త్రీరూపాన్ని పొందిన నారదుడు ఆ సరస్సుకు ఈశాన్య కోణంలో ఒక సౌందర్యవతిని చూశాడు. ఆమె స్త్రీరూపంలో ఉన్న నారదుడిని తన దగ్గరకు రమ్మనమని చేతితో సైగ చేస్తూ పిలిచింది. నారదుడు ఆమె దగ్గరకు వెళ్లాడు. అక్కడ కాస్తంత ముందుకు వెళ్లగానే ఎంతో మంది స్త్రీలతో కళకళలాడుతూ రత్నాలతో నిర్మితమైన ఓ భవనం కనిపించింది. అక్కడున్న స్త్రీలలో విశాఖ లాంటి స్త్రీలు స్త్రీరూపంలో ఉన్న నారదుడిని ఒక అంతఃపురంలోకి తీసుకువె'ళ్లారు. ఆ అంతఃపురం మధ్యలో ఎంతో అందమైన ఆసనం మీద గోపికాపతి కనిపించాడు. వనితారూపంలో ఉన్న నారదుడిని సమీపించి గోపికాపతి అయిన శ్రీకృష్ణుడు అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు. అంతలోనే కనిపించి అంతలోనే అంతర్ధానమైన స్వామిని వెతుకుతూ స్త్రీ రూపంలో ఉన్న నారదుడు మళ్లీ బృందావనంలోని సరస్సు దగ్గరకు చేరాడు. అప్పటికే అక్కడ బృంద చెలికత్తె

మాధవి ఉంది. మాధవి నారదుడిని ఆ సరోవరం నైరుతి కోణం దగ్గరకు తీసుకువెళ్లి స్నానం చేయమని చెప్పింది. అక్కడ ఒక్కసారి నీళ్లల్లో మునిగి పైకి లేవగానే నారదుడికి మళ్లీ పురుషరూపం వచ్చింది. ఆ తర్వాత బృందాదేవి ఆజ్ఞతో నారదుడు ఆ సరస్సు ఆగ్నేయ కోణానికి చేరి కృష్ణదర్శనాన్ని కోరుతూ తపస్సు చేయసాగాడు. అలా తపస్సు చేస్తున్న నారదుడికి బృందాదేవి బృందావనంలో దొరికే మధుర ఫలాలను ఆహారంగా పంపుతూ ఉండేది. బృంద పంపిన మధురఫలాలను తింటూ తపస్సు చేస్తూ ఉన్న నారదుడికి ఓ రోజున ఎంతో సమ్మోహనంగా ఉన్న ఓ స్త్రీ స్వరం. వినిపించింది. ఆ గొంతు వినిపించిన దిక్కుతో పాటు ఆ పరిసరాలన్నీ ఎంత వెతికినా నారదుడికి ఎవరూ కనిపించలేదు. అదే విషయాన్ని మరుసటి రోజున బృందాదేవికి చెప్పాడు నారదుడు. అప్పుడు బృంద ఆ స్వరం కుబ్జాదేవిదని, ఆమె భూమికి అడుగున ఎక్కడో దూరంగా ఉన్న గుహలో ఉంటుందని, కృష్ణుడికి ఆ కుబ్జాదేవి అంటే అధికమైన ప్రేమ అని, కుబ్జాకృష్ణులు బృందావనంలో నిరంతరం విహరిస్తుంటారని చెప్పింది. ఇలా విహరించటానికి ఆ శ్రీకృష్ణుడి ప్రాణసః అయిన రాధే కుబ్జగా ఉండటం ప్రధాన కారణమని బృంద నారదుడికి చెప్పింది. బృందావనంలో ఆ రాధాకృష్ణుల రాసలీలావిలాసం నిత్యం జరుగుతూనే ఉంటుందని, అయితే ఆ రాసలీలా వైభవాన్ని చూడగలిగే శక్తి తనకు తప్ప దేవతలకు కూడా సాధ్యం కాదని, నారదుడికి వినిపించిన మధురమైన గొంతు రాధమ్మదని బృంద తెలియచెప్పింది. తన పేరున ఉన్న వనంలో రాధాకృష్ణుల సంచారం అలా నిరంతరం ఉంటుంది కనుకనే బృందావనానికి అంతమహిమ వచ్చిందని భూలోకం మొత్తం మీద అది పవిత్రమైన ప్రదేశంగా యమునానదీ తీరంలో విలసిల్లుతోందని నారదుడికి చెప్పింది బృంద.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

---

## సువర్ణ పుష్పాలతో అర్చన

**నల్గొండ, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో విశేష పూజలు కొనసాగాయి. స్వయంభువులకు సువర్ణ పుష్పాలతో అర్చన... అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, ఊంజలి సేవ పర్వాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాతం చేపట్టిన ఆచార్యులు వేదమంత్ర పఠనాల మధ్య మూలవర్యులను అభిషేకించి, తులసీదళాలతో అర్చన చేపట్టారు. మహామండపంలో భక్తుల ఆర్జిత పూజల్లో భాగంగా సువర్ణ పుష్పార్చన, కుంకుమార్చన, అష్టోత్తరం జరిపారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణోత్సవాన్ని సంప్రదాయంగా నిర్వహించారు. శ్రీగోదాదేవిని అండాలుమాతగా అలంకరించి తిరువీధులలో ఊరేగించారు. సేవ విశిష్టతను ఆచార్యులు భక్తులకు వివరించారు. రాత్రి గర్భాలయంలోని మూలవర్యులకు ఆరాధన చేపట్టారు.

**గుట్టకు బస్సు సౌకర్యం...** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నుంచి యాదగిరిగుట్టకు వచ్చే భక్తుల సౌకర్యార్థం స్థానిక ఆర్టీసీ డిపో అదనపు వసతిని కల్పించింది. హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి గుట్టకు రాత్రి 11గంటలకు బస్సు బయలుదేరుతుందని గుట్ట డిపో మేనేజర్ మద్దిలేటి తెలిపారు.



తిరువీధులలో అలంకార సేవ ఊరేగింపు

## చేయెత్తి చెప్పటం

**స్ప**ష్టం చేయటం, నిర్భయంగా భావాన్ని ప్రకటించటం అనే లాంటి అర్థాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. ఏదైనా ఒక విషయాన్ని ఎవరైనా దీన్ని నేనే చేసాను అని స్పష్టం చేయటాన్ని కూడా ఈ జాతీయంతోనే పోల్చి చెప్పటం కూడా కనిపిస్తుంది. జంకు, భయంలాంటివి లేనప్పుడు చేసిన పనిలో తప్పు లేదని అనిపించినప్పుడు ఎవరైనాసరే ఎంతో ధైర్యంగా ముందుకొచ్చి దీన్ని చేసింది నేనే అని చెప్పటం అనేది ఈ జాతీయంలోని ప్రధానార్థం.

## నృత్య పరిశోధకుడు..!

**కడప, న్యూస్‌టుడే:** కఠోర సాధనతో జానపదం, శాస్త్రీయ నృత్య రంగంలో నైపుణ్యం సాధించారు. ఆరేళ్లల్లో నాట్యం గొప్పతనాన్ని దశదిశలా చాటి అవార్డులు అందుకున్నారు. నృత్యంపై నిరంతర పరిశోధనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. కళామతల్లి సేవలో పునీతుడై తాను నేర్చుకున్న విద్యను పలువురికి అందించి కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు... పులివెందులకు చెందిన నృత్య మాస్టర్ సురేష్‌కుమార్. పులివెందులకు చెందిన సురేష్‌కుమార్‌కు చిన్నప్పటి నుంచి శాస్త్రీ నృత్య రంగంపై ఆసక్తి ఉండడంతో ఆదిశగా అడుగులు వేశారు. తన ఎనిమిదో తరగతి నుంచి జానపదం, శాస్త్రీయ నృత్యంలో అనంతపురంలో గురువు కృష్ణకుమార్ వద్ద సాధన ప్రారంభించారు. పట్టుదలతో సాధన చేసి మంచి కళాకారుడిగా తయారయ్యారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కళాశాలలో భరతనాట్యంలో డిప్లొమా కోర్సు చేశారు. అదే యూనివర్సిటీలో 1994లో డ్యాన్స్ మాస్టర్‌గా చేరడం విశేషం. పులివెందుల స్వామి వివేకానంద పాఠశాలకు అనుబంధమైన శృతి కళాక్షేత్రంలో డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర ప్రాంతాలకు చెందిన యువతీ యువకులకు జానపదం, భరతనాట్యంలో శిక్షణ ఇచ్చారు. దాదాపు 5వేల మందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారు. వారంతా జమ్మూ, పంజాబ్, చండీఘడ్, పటియాల, లూథియా, బర్నాలా, దుబాయ్ తదితర ప్రాంతాల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రదర్శనలు చేసి అవార్డులు పొందారు. ఆయన శిష్యులు సినీ కథానాయకులు, ప్రముఖుల నుంచి దాదాపు 500 అవార్డులు అందుకున్నారు. ఈటీవీలో ప్రసారమవుతున్న ప్రముఖ ప్రాయోజిత కార్యక్రమం 'అదుర్స్'లోనూ నృత్యం చేశారు. పులివెందులలోని స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు మొదటి రౌండ్‌లో విజేతలుగా నిలిచి న్యాయనిర్ణేతల నుంచి ప్రశంసలు అందుకున్నారు.



జ్ఞాపికలతో సురేష్‌కుమార్

## సనాతన ధర్మప్రచారానికి ప్రాధాన్యం

**మచిలీపట్నం , కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** జనజీవనానికి వెన్నెముకగా నిలిచే సనాతన ధర్మ ప్రచారానికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నట్లు కంచికామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. స్థానిక శంకరమఠంలో జరుగుతున్న నిర్మాణ పనులను స్వామీజీ పర్యవేక్షించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పురాతన దేవాలయాల పునరుద్ధరణకు నడుం కట్టాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు సంఘాల ప్రతినిధులు స్వామీజీని ఘనంగా సత్కరించారు. పట్టణ మున్సిపల్ కమిషనర్ మారుతీదివాకర్‌తో పాటు పట్టణ ప్రముఖులు స్వామీజీ ఆశీస్సులను అందుకున్నారు. శంకరమఠం నిర్వాహకులు, బ్రాహ్మణ సంఘం తదితర సంఘాల బాధ్యులు, సభ్యులు, భక్తులుపాల్గొన్నారు.



శంకరమఠానికి తరలివస్తున్న స్వామీజీ

## వేడుకగా చిలుక వాహన సేవ

**నెల్లూరు, న్యూస్‌టుడే :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన విడవలూరు మండలం రామతీర్థంలోని శ్రీ కామాక్షిదేవి శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వేడుకగా చిలుక వాహన సేవ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, శ్రీనివాసులు శర్మ, ఎన్ శ్రీనివాసులుశర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను చిలుక వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, విశేష కుంకుమార్చనలు, మణిహరణ, చప్పరోత్సవం జరిగాయి. సాయంత్రం పూలంగి సేవను వేడుకగా నిర్వహించారు. రాత్రి జరిగిన చిలుక వాహన సేవకు కొమారి పట్టాభి జ్ఞాపకార్థం కొమారి రాము పొన్నపూడి పెద్దపాళెం ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



చిలుక వాహనంపై స్వామి, అమ్మవార్లు

# పుణ్యప్రదం బృందావన దర్శనం

**య**మునాతీరంలో ఉన్న బృందావనాన్ని చూడటం ఎంతో పుణ్యప్రదం. ఆ పుణ్యం వల్ల కీర్తి కూడా వర్థిల్లుతుంటుంది. ఇంతటి శక్తి బృందావనానికి ఎందుకొచ్చింది అనే విషయాన్ని కృష్ణుడి భక్తురాలైన బృంద స్వయంగా దేవరుషి నారదుడికి వివరించి చెప్పిన కథాసందర్భం ఇది. నారదపురాణం ఎనభయ్యో అధ్యాయంలో ఈ విషయాలన్నీ ఉన్నాయి. బృందావనం గొప్ప పవిత్ర క్షేత్రం. మధుర ప్రాంతంలో బృందావనంతోపాటు మరో పదకొండు వనాలలో కూడా గోపికాపతి అయిన కృష్ణుడు తిరుగాడినా బృందావనంలో కృష్ణుడి బాల్య క్రీడావిశేషాలు, రాసలీలలు ఎంతో ఎక్కువగా అద్భుతంగా జరిగాయి. కృష్ణుడు తన తత్వాన్ని ఈ వనంలోనే బ్రహ్మకు దర్శింపచేశాడు. అలా చూపించిన ప్రదేశమే బృందావనంలో బ్రహ్మకుండం అనే పేరున ప్రసిద్ధి చెందింది. బృందావనంలోని బ్రహ్మకుండం దగ్గరకు వచ్చిన భక్తుడు స్వామి మూలరూపాన్ని ధ్యానిస్తూ స్నానం చేయాలి. అలా చేసిన వారు ఆ గోపికాపతి అనుగ్రహాన్ని పొందుతారు. అలాగే బృందావనంలో గోవిందకుండం అనే ఓ కుండముంది. ఈ ప్రదేశంలో ఇంద్రుడు గోవిందుడిని గురించి ధ్యానం చేశాడు. ఇక్కడ స్నానం చేసిన వారికి గోవిందుడి వైభవం దర్శించే అదృష్టం ఇహపరలోకాలలో ప్రాప్తిస్తుంది. అలాగే బృందావనంలో ఉన్న అనేకానేక పొదరిళ్లలో కృష్ణుడు ఏకరూపంతోనూ, మరికొన్ని సార్లు బహురూపాలతోనూ గోపికలతో రాసక్రీడ జరిపాడు.



ఇక్కడే నందుడిలాంటి గోపాలకులకు శ్రీహరి తానెవరు అనే విషయాన్ని తెలియచెప్పాడు. ఆ స్వామి తత్వాన్ని నందాదులు ఆనాడు అలా గ్రహించారు. అందుకే దాన్ని తత్వప్రకాశతీర్థం అని అంటారు.

### పవిత్ర పుణ్యతీర్థాలు

గోపాలకులకు కాళీయమర్దనం చూపిన ప్రదేశం కూడా బృందావనంలోనే ఉంది. ఈ ప్రదేశం సర్వ పాపహరణ తీర్థం. గోపగోపీజనాన్ని దావానలం నుంచి కాపాడిన ప్రదేశం కూడా యమునాతీరంలోని బృందావన భూభాగంలోనే ఉంది. శ్రీకృష్ణభగవానుడు ఎంతో విలాసంగా గుర్రం రూపంలో వచ్చిన కేశి అనే రాక్షసుడిని సంహరించిన ప్రదేశం మరో గొప్ప పుణ్యప్రదేశం. ఇక్కడ స్నానం చేసిన వారు జీవితాంతంలో శ్రీహరి లోకాన్ని పొందుతారు. దుష్టుడైన వృషాసురుడిని సంహరించిన ప్రదేశం పేరు అరిష్టకుండం. ముక్తి కోరుకొనేవారు ఇక్కడ స్నానం చేయటం మేలు. ధేనుకాసురుడు, అఘాసురుడు, బకాసురుడు, వత్సాసురుడు, వ్యోమాసురుడు, లంబాసురుడు లాంటి అసురులంతా కృష్ణుడు చేతిలో లీలగా మరణం పొందారు. అలా దుష్టసంహారం జరిగిన ప్రదేశాలన్నీ యమునానదీ తీరంలోని బృందావనంలో పవిత్ర పుణ్యతీర్థాలయ్యాయి. అక్కడ స్నానం చేసి పితృదేవతలకు తర్పణాలిచ్చిన వారు శ్రీకృష్ణుడి అనుగ్రహం వల్ల సకల అభీష్టాలను పొందుతారు. కృష్ణభగవానుడు నిద్రపోయిన, భోజనం చేసిన, తిరుగాడిన, వినిన, చూసిన ప్రదేశాలన్నీ పవిత్ర పుణ్యతీర్థాలే. ఈ తీర్థాలన్నీ ఎక్కడెక్కడో కాక బృందావనంలోనే ఉండటం కృష్ణభక్తులు మోక్షం కోసం చేసే సాధనను సులభతరం చేస్తుంటాయి. విలక్షణ క్షేత్రాలైన ఈ తీర్థదర్శనం, స్నానం పాపాలను పోగొట్టి స్వర్గ ప్రాప్తినిస్తుంది. అలాగే ఆనాడు గోపాలకులు స్వామి చరితాన్ని విని చూసి ధ్యానించి నమస్కరించి యాచించిన ప్రదేశాలన్నీ బృందావనంలో ఉండి పరమపావనాలుగా విలసిల్లుతున్నాయి.

ధర్మపథం

### శ్రీకుండం వైశిష్ట్యం

రాధాదేవి తపస్సు చేసిన ప్రదేశం శ్రీకుండం అనే పేరున బృందావనంలో ఉంది. ఇక్కడ చేసే స్నానజపాదులు ఎప్పటికీ తరగని పుణ్యానిస్తాయి. వత్సతీర్థం, చంద్రసరస్సు, అప్సరసరస్సు, రుద్రకుండం, కామకుండం, శ్రీహరి మందిరం, ధర్మకుండం, భోజనస్థలం, బలస్థానం, బృహత్‌సానువు, శ్రీహరిసంకేతస్థానం, నందిగ్రామం, కిషోరకుండం, కోకిలకాననం, శేషసాయిపయోబ్ధి, క్రీడాదేశం, అక్షయవటం, రామకుండం, చీరచౌర్యం, భద్రబాండేర బిల్వకం, మానసరస్సు, భక్తభోజనం, అక్రూరం, తార్‌క్ష్యగోవిందం, బహులారణ్యకం ఇలాంటివన్నీ బృందావనమంతటా నిండి ఉన్నాయి. ఈ బృందావనం పంచ యోజనాల విస్తీర్ణంలో ఉంది. కేవలం ఈ బృందావనాన్ని ఏ పక్కనుంచైనా సరే ఒక్కసారి దర్శించినా అది ముక్తిప్రదమే. బృందావనాన్ని చూడటానికి దేవతలు కూడా నిరంతరం ఉత్సాహపడుతుంటారు. బృందావనం అని నోరారా పలకటం కూడా పుణ్యప్రదమే. బృందావనంలో నివసించే జీవులన్నీ దేవతల అనుగ్రహాన్ని పొంది మోక్షస్థితికి చేరుతుంటాయి. యమునా నదీతీరంలో ఉన్న బృందావనాన్ని నిత్యం ఎందరెందరో భక్తులు కావ్యాలు, కీర్తనల ద్వారా సంకీర్తించటం కనిపిస్తుంది. ఈనాటికీ భారతావని అంతటా అలా ఎందుకు జరుగుతోంది అనంటే బృందావనం అసామాన్యమైన పుణ్యక్షేత్రం కనుక. అనే విషయాన్ని ఇలా ఈ కథాసందర్భం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# వేదమంత్రాలతో సహస్ర ఘటాభిషేకం

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** నాదస్వర మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ సింహగిరిపై త్రిపురాంతకస్వామి ఆలయంలో సహస్ర ఘట్టాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. వరుణజపాల ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామికి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాసం, మహా రుద్రాభిషేకం, మహా వరుణజపం, తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కలశాలతో పవిత్ర గంగధార నుంచి జలాలు తీసుకొచ్చారు. సంప్రదాయబద్ధంగా అంతరాలయంలో త్రిపురాంతకస్వామికి వేదమంత్రోచ్చారణలతో సహస్ర ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. మంత్రపుష్పం, హోమం, పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అప్పన్నస్వామికి వైదిక వర్గాలు విశేష అర్చనలు నిర్వహించారు. ఆస్థానమండపంలో స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం వరుణ జపంలో భాగంగా విరాటపర్వం పారాయణం చేశారు. స్వామి నిత్యకల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణకర్తలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



రవీందర్‌కు అన్నం తినుపిస్తున్న తల్లి వినోద

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** చిన్నతనంలో తమ పిల్లల ఆలనా పాలనా చూస్తూ మురిసిపోతుంది కన్నతల్లి. తమ కొడుకు పెద్దవాడై ప్రయోజకుడైన తరువాత ముసలితనంలో తమను కూడా ఇలాగే మురిపెంగా చూసుకుంటాడని కొండంత ఆశతో ఎన్నో కలలు కంటుంది. కానీ విధి వారిని వెంటాడింది. ఆ కన్నతల్లి ఆశలు అడియాశలు అయ్యాయి. ఫలితంగా చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి వెన్నుముక చికిత్స జరిగింది. అనంతరం మెరుగైన వైద్యం చేయించే స్తోమత లేకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. నాలుగేళ్ళుగా కొడుకు మంచంపైనే ఉండడంతో ఆ కన్నతల్లి దుఃఖాన్ని దిగమింగుకుని కంటికి రెప్పలా కాపాడుతూ దేవుడు కరుణించకపోతాడా అని కోటి ఆశలతో ఎదురు చూస్తోంది. ఈ వయస్సులో కన్న తల్లి ఆలనా పాలన చూడాల్సి ఉండగా తన బాగోగులే తల్లి చూస్తుండడంతో నిత్యం నరకం అనుభవిస్తూ మౌనంగా రవీందర్ రోదిస్తున్నాడు. మందమర్రి పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో నివాసం ఉండే బట్లూరి రాజయ్య-వినోద దంపతులకు ఐదుగురు సంతానం అందులో నాలుగో సంతానం రవీందర్. ప్రస్తుతం రవీందర్ నడుం కింది భాగం చచ్చుబడిపోవడంతో నడవలేని స్థితిలో మంచానికే పరిమితం అయ్యాడు. రవీందర్ అన్నదమ్ముల పరిస్థితి అంతంత మాత్రం ఉండడంతో చేతికొచ్చిన కొడుకు ఆలన పాలన తల్లి వినోద దగ్గరుండి చూసుకుంటోంది. దాతలు ఆదుకోవాలని రవీందర్ అతని తల్లి వినోద వేడుకుంటున్నారు.

ఆంధ్రావని

## రెక్కలు కట్టుకు వాలటం

**అ**త్యంత వేగంగా రావటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. రెక్కలున్న పక్షులు మనిషి కన్నా వేగంగా ఒక చోట నుంచి మరోచోటికి మరలివెళతాయి.

జాతీయాలు నుడికారాలు

అంతటి వేగంతో ఎక్కడికైనా వెళ్లటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఇష్టమైనవారి దగ్గరకు ఎవరైనా వేగంగా వచ్చి చేరుతున్న సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. రెక్కలు కట్టుకు వాలేవాడిని, రెక్కలు కట్టుకురావాలనిపించింది లాంటి ప్రయోగాలున్నాయి.



# జులై మొదటి వారంలో
## సత్యదేవుని ప్రచార రథయాత్ర

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్, అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో 10వ విడత సత్యదేవుని ప్రచార రథయాత్ర జులై మొదటివారంలో ప్రారంభమిస్తున్నామని పీఆర్వో దామెర కృష్ణారావు తెలిపారు. ఈ విడతలో విజయనగరం జిల్లాలో వారం రోజుల పాటు యాత్ర ప్రచార రథయాత్ర ద్వారా హిందూ ధర్మ ప్రచారం అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో సత్యదేవుని శాంతి కల్యాణాలు కూడా నిర్వహిస్తామన్నారు. దీనికి అనుగుణంగా ఈవో ప్రసాదం వెంకటేశ్వర్లు ఆదేశానుసారం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.

# వైభవంగా బలుసులమ్మ ఊరేగింపు

**తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పురదేవత శ్రీబలుసులమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం ఊరేగింపు మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అష్టలక్ష్మీనృత్యాలు, కోబ్రానృత్యాలు, అవతార్ వేషాలతో నృత్యాలు, ఆసాధుల గరగల నృత్యాలు, తీన్‌మార్ డప్పుల విన్యాసాలు, బుట్టబొమ్మలు, విచిత్రవేషాలతో ఊరేగింపు కోలాహలంగా సాగింది. కేరళ కళాకారులు చేసిన వాద్యవిన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కన్నులు మిరిమిట్లు గొలిపేలా బాణసంచా కాల్చారు. తెల్లవారుజామున అమ్మవారిని పాతూరులోని పుట్టింటికి తీసుకొచ్చారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారి పుట్టింటివారు పాశం కాశీవిశ్వేశ్వరరావు, తులసీ విజయలక్ష్మి దంపతులు పూజలు చేశారు. పుట్టింటి పాన్పు వేశారు. దీంతో అమ్మవారి ఊరేగింపు ప్రారంభమైంది. అనంతరం మహాలక్ష్మీనగర్‌లో కర్రి ప్రభాకరబాలాజీ ఇంటి వద్ద అమ్మవారికి అత్తవారింటి పాన్పు వేసి పూజలు చేశారు. పాతూరు నుంచి ప్రారంభించి దారిపొడవునా మహిళలు అమ్మవారికి పసుపునీటి బిందెలతో స్వాగతం పలికారు. చలిమిడి, పానకాలు సమర్పించారు. పాతూరు, మహాలక్ష్మీనగర్, డి.ఎస్.చెరువు, శేషమహల్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, గొల్లగూడెంకూడలి, ఓవర్‌బ్రిడ్జి, జయలక్ష్మిథియేటర్, ఏలూరుమార్గం, తణుకుమార్గం, సవితృపేట మీదగా బలుసులమ్మ ఆలయానికి ఊరేగింపు చేరింది. పురపాలకసంఘం తెదేపా ఛైర్మన్ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, ఈతకోట తాతాజీ, మార్కెట్‌కమిటీ మాజీఅధ్యక్షుడు తోట గోపీ, పురపాలక సంఘ మాజీఅధ్యక్షుడు కరణం అప్పారావు పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపు



# రమణీయం.. వేంకట రమణుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**ఒంగోలు , ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** మహాగణపతి, రాజ్యలక్ష్మి సహిత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామివారి ఆలయం తృతీయ వార్షికోత్సం కనుల పండువగా జరిగింది. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు విచ్చేసి స్వామివార్ల ఆశీస్సులందుకున్నారు. ఇందులో భాగంగా జరిగిన కల్యాణ ఘట్టం భక్తులను విశేషంగా అలరించింది. శ్రీదేవి, భూదేవీ సమేతుడై స్వామివారు విశిష్ట పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం ప్రసాదించాడు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యుల నిర్వహణలో వైష్ణవ స్వాములు విశ్వక్సేనారాధన, గణపతి పూజలతో కార్యక్రమాలకు శ్రీకారం చేశారు. స్నపన తిరుమంజనం, కర్పూర నీరాజనాలు వైభవంగా జరిగాయి. అనంతరం జరిగిన కల్యాణోత్సం భక్తులకు మధురానుభూతులను కలిగించింది.

# కృష్ణ భక్తుడు గోవర్ధనుడు

**గో**వర్ధనగిరిధారి అని శ్రీకృష్ణపరమాత్ముడిని కీర్తిస్తుంటారు. గోవర్ధనగిరిని ఎత్తి గోపాలకులను కాపాడి తన భక్తవాత్సల్యాన్ని నిరూపించాడు కనుక అలా ఆ స్వామిని గోవర్ధనగిరిధారి అని సంకీర్తిస్తూ ఉండటం కనిపిస్తుంది. అయితే అసలీ గోవర్ధనగిరి ఎవరు? అనే విషయాన్ని గురించి కొంతమందికి తెలిసుండకపోవచ్చు. ఆ విషయాలను తెలియచెప్పే కథాసందర్భమే ఇది. నారదపురాణం ఉత్తర ఖండం ఎనభయ్యో అధ్యాయంలో గోవర్ధనగిరి ఎవరు అనే విషయం స్పష్టంగా ప్రస్తావితమై ఉంది.



పూర్వం గోవర్ధనుడు అనే ఓ పండితుడు ఉండేవాడు. ఆ పండితుడు కృష్ణభక్తి పరిపూర్ణుడు. ఎలాగైనా సరే ఆ స్వామిని తన సొంతం చేసుకోవాలని, ఎప్పుడూ తన దగ్గరే ఉండేలా చూసుకోవాలని సంకల్పించుకున్నాడు గోవర్ధనుడు. ఆ సంకల్పంతోనే శ్రీహరికి క్రీడా స్థలమైన బృందావన ప్రాంతానికి వచ్చి ఆ భగవానుడిని గురించి తపస్సు చేశాడు. ఆ తపస్సుకు శ్రీకృష్ణపరమాత్ముడు ఆనందించాడు. వెంటనే గోవర్ధనుడి ముందు ప్రత్యక్షమయ్యాడు. స్వామి ప్రత్యక్షంకాగానే సాష్టాంగ దండప్రణామం చేసి ఆయన పాదాలముందు అలాగే ఉండిపోయాడు గోవర్ధనుడు. అప్పుడు స్వామి ఏం వరం కావాలో కోరుకోమని అడిగాడు. గోవర్ధనుడు క్షణం కూడా ఆలస్యం చేయకుండా బోర్లా పడుకున్న తన మీదకు పాదాలభాగం నుంచి నడిచొచ్చి తన వీపు మీద ఉండమన్నాడు ఆ శ్రీహరిని గోవర్ధనుడు. భక్తుడి మాటను కాదనలేక అలాగే చేశాడు శ్రీహరి.

### గోవర్ధనుడికి శ్రీహరి వరం

అప్పుడు శ్రీహరి ఇంకా ఏ వరం కావాలో కోరుకోమని గోవర్ధనుడిని అడిగాడు. తన వీపు మీద నుంచి భగవానుడిని కిందకు దిగిపొమ్మనటం తనకిష్టం లేదని, అందుకే ఎప్పటికీ తన మీద అలాగే ఉండమని, తనవల్ల శ్రీహరి భక్తులకు మేలుకలుగుతూ ఉండాలని చెప్పి ఆ వరాన్ని అనుగ్రహించమన్నాడు. గోవర్ధనుడు భక్తులకు మాత్రమే వశుడయ్యే వాసుదేవుడు తన భక్తుడి కోర్కెను తీర్చాలనుకొన్నాడు. అందుకే వెంటనే గోవర్ధనుడికి గిరిరూపాన్ని అనుగ్రహించాడు. ఆ తర్వాత ఆ గోవర్ధన పర్వతం మీదకు వెళ్లి నిలిచాడు. ఆనాటి నుంచి గోవర్ధన పర్వతమే శ్రీకృష్ణపరమాత్ముడిగా అయిపోయినట్లయింది. కృష్ణపరమాత్ముడిని దర్శిస్తే ఎంతటి పుణ్యమో గోవర్ధన పర్వతాన్ని చూసినా, మనసులో స్మరించినా అంతటి పుణ్యం ప్రాప్తిస్తుంది. ఎందుకంటే ఆ పర్వతం శ్రీహరికి నివాసమైంది. గోవర్ధనుడు భక్తుడే అయినా తన అచంచల భక్తితో వాసుదేవుడికి మిత్రుడయ్యాడు. దానితోపాటుగా తన వల్ల భగవంతుడి భక్తులందరికీ మేలు కలగాలని గోవర్ధనుడు ఆ స్వామిని కోరుకోవటం కూడా గోవర్ధనుడిలోని సత్పురుష సద్భక్తిని నిరూపిస్తోంది. అలాంటి సత్పురుష సాంగత్యాన్నే ప్రతి భక్తుడు కోరుకొని తరించాలన్న స్ఫూర్తి కూడా గోవర్ధనగిరి పేరును తలచుకోగానే మనసులో కలుగుతుంది.

గోవర్ధనగిరి ప్రదక్షిణం అక్షరాలా మోక్షప్రదమని ఆనాడు సాక్షాత్తూ శ్రీహరి అనుగ్రహించాడు. గోవర్ధన పర్వతాన్ని ఒక్కదాన్ని దర్శిస్తే చాలు భారతావనిలో ఉన్న పుణ్యపర్వతాలన్నింటినీ దర్శించినంతటి పుణ్యం లభిస్తుంది. యమునా తీరంలో ఉన్న అత్యంత పుణ్యప్రదేశాలలో గోవర్ధనగిరి కూడా ఒకటి. కలికల్మషాలన్నింటినీ యమునాతీర బృందావన ప్రాంతంలోని గోవర్ధన దర్శనం హరించి తీరుతుంది.

### కృష్ణ రాసలీలలు

గోవర్ధనగిరి పరిసరాలు అణువణువూ శ్రీకృష్ణుడి స్పర్శతో పునీతమై ఉన్నాయి. ఈ పర్వత సమీపంలోని బృందావన ప్రాంతంలోనే రాత్రి వేళల్లో కృష్ణరాసలీలలో నిరంతరం ఈనాటికీ జరుగుతూ ఉంటాయి. చంద్రుని వెన్నెలల కాంతితో మెరిసే పొదలలో గోపికలతో కృష్ణుడు ఆనాడు క్రీడించాడు. ఇప్పటికీ ఆ స్వామి లీలలు అలాగే అక్కడ జరుగుతున్నా కలియుగ ప్రభావం వల్ల ఆ యోగీశ్వరేశ్వరుడి లీలలను కేవలం గొప్పగొప్ప యోగులు మాత్రమే దర్శించగలుగుతున్నారు. ఈ ప్రాంతంలో పరమేశ్వరుడు అర్ధనారీశ్వరరూపుడై భక్తితో శ్రీకృష్ణభగవానుడిని దర్శిస్తుంటాడు. బ్రహ్మదేవుడు గాయత్రీ స్వరూపంలో ఉన్న భగవానుడిని తన హృదయంలో నింపుకొని ధ్యానిస్తుంటాడు. ఇంద్రుడు తన వేయి కళ్లతో ఆ స్వామిని గోవర్ధనగరి ప్రాంతంలో వెతుకుతూ దర్శించటానికి నిత్యం ఉత్సాహం చూపుతుంటాడు. గోవర్ధనగిరి ఇంతటి అసామాన్యమైనదని ఆ గిరి దర్శనం మోక్షప్రదమని ఈ కథాసందర్భం స్పష్టం చేస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## మూడు ముక్కల్లో చెప్పటం

**సం**గ్రహంగా, సంక్షిప్తంగా చెప్పటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. రామాయణం మొత్తాన్నీ కట్టె, కొట్టె, తెచ్చె అనే మూడు మాటల్లో చెప్పొచ్చంటారు. అంత పెద్ద రామాయణ కథను అలా సంగ్రహంగా, సంక్షిప్తంగా చెప్పినట్టుగానే కర్త, కర్మ, క్రియలు ఉంటూనే ఎక్కువ నిడివిలేకుండానే అందరికీ అర్థమయ్యేలా విషయాన్ని చెప్పటమే ఈ జాతీయానికున్న అర్థం. మాట అనే పదానికి ముక్క అనే పదం పర్యాయపదంగా వాడుకలో ఉంది. ఒక్కమాట కూడా మాట్లాడలేదు అని అనటానికి బదులు ఒక్క ముక్కా చెప్పలేదు అని అనటం అందరికీ తెలిసిందే.



బాలికల లంబాడీ నృత్య ప్రదర్శన

## ముగిసిన శ్రీరంగాపురం స్వర్ణోత్సవాలు

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే :** మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో చేపట్టిన స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రారంభమై 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గ్రామస్థులు స్వర్ణోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి వెంకటస్వామి ఆధ్యక్షన గత శుక్రవారం నుంచి వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు. చివరిరోజు ముగింపు వేడుకలకు వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు, గ్రామస్థులను అభినందించారు.



ఏఎన్నార్ వేషధారణలో ఆకట్టుకున్న వ్యక్తి

## ప్రపంచవ్యాప్తంగా వాసవీక్లబ్ సేవలు

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే :** ప్రపంచవ్యాప్తంగా వాసవీక్లబ్ సేవలు విస్తరిస్తున్నాయని వాసవీక్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు నారాయణసురేష్ అన్నారు. ఆదివారం జడ్చర్లలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్ టు డస్క్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక వాసవీకన్యాక పరమేశ్వరీ ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఏటా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 1103 క్లబ్బులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేదలకు, విద్యార్థులకు వాసవీక్లబ్ సేవలు అందించాలని సూచించారు. జడ్చర్ల వాసవీక్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు అభినందన అవార్డు అందజేశారు. ఐఐటీ పరీక్షలో 983వ ర్యాంకు సాధించిన గుబ్బా మనోజ్‌కుమార్‌ను సన్మానించారు. అంతకు ముందు కావేరమ్మపేట సరస్వతి శిశుమందిరం పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి వసతి కోసం నీటి ట్యాంకును వితరణ చేశారు. అనురాగిణి ఆశ్రమంలో విద్యార్థులకు పాదరక్షలు అందజేశారు. గంగాపురం రహదారిపై ఆశ్రమం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ ఆంజనేయులు, స్థానిక వాసవీక్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్‌గుప్తా, శివరాజు, మేడిశెట్టి రామకృష్ణ, ఆనంద్‌రాజు, గుబ్బాశ్రీను, డి. రాఘవేందర్, దిలీప్, వంశీ, విజయానంద్, బాలస్వామి, నవీన్, సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వాసవీక్లబ్ సభ్యులు

## బాసరలో అక్షర సందడి

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** పాఠశాలలు పునఃప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా.. చదువుల తల్లి కోవెలకు భక్తుల తాకిడి తగ్గటం లేదు. త్వరలో ఆషాడమాసం ఆరంభం కానుండటం..ఆ లోపు శుభదినాలు ఉండటంతో ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తున్నారు. సెలవు దినం, దశమి శుభదినం కావటంతో ఆదివారం బాసర ఆలయం భక్తులతో పోటెత్తింది. 2150 మంది చిన్నారులకు ఆలయంలో అక్షరాభ్యాసాలు నిర్వహించారు. దర్శనానికి, పూజలకు సుమారు 3 గంటల సమయం పట్టింది. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ₹ 11,50,00 ఆదాయం సమకూరింది. సైబరాబాద్ జాయింట్ కమీషనర్ మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

### ఆలయంలో తనిఖీలు

భద్రత చర్యల్లో భాగంగా ఆదివారం బాసర ఆలయంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ముథోల్ సీఐ రవీంద్రకుమార్, బాసర ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో ఆలయం, ఆలయ ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భైంసా నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు, బాసర పోలీసులు సంయుక్తంగా ఆలయంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ బాసర ఎస్సై నాగరాజుకు, ఆలయ భద్రతా వ్యవహారాలు చూసే ప్రత్యేక దళాలకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలిచ్చారు.



సరస్వతీ ఆలయంలో భక్తుల బారులు



ఆలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న బాసర ఎస్సై నాగరాజు, ప్రత్యేక బృందాలు

## వరసిద్ధుని సన్నిధిలో భక్తుల రద్దీ

**తిరుపతి, న్యూస్‌టుడే :** స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో..... వినాయకుని కొలువులో రద్దీ బాగా పెరిగింది. స్వామివారి దర్శనార్థం వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. రూ.10, రూ.51, రూ. 100 దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయి... భక్తుల వరుస వెలుపలి వరకు కొనసాగింది. భక్తుల రద్దీ క్రమబద్ధీకరించేందుకు అధికారులు ఆలయంలో మహాలఘు దర్శనం కొనసాగించారు. ఆలయంలో నిజరూప దర్శనాలు రద్దు చేశారు. భక్తులకు కావాల్సిన వసతులను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

# వ్రజభూమి విశేషాలు

ఒకప్పుడు శ్రీకృష్ణుడు నివాసం ఉన్న మధురా రాజ్య ప్రాంతమే వ్రజభూమిగా కూడా పేరొందింది. వ్రజం అని పేరెందుకొచ్చింది, దాని విశేషాలేమిటి అనే విషయాలను వివరించి చెప్పే కథాసందర్భం ఇది. స్కందపురాణాంతర్గతంగా ఉన్న మహాభాగవత మాహాత్మ్యంలో ఈ వివరాలన్నీ ఉన్నాయి. వీటిని శాండిల్య మహర్షి కృష్ణుడి మనుమడైన వజ్రనాభుడికి, ధర్మరాజు మనుమడైన పరీక్షిత్తుకు తెలియచెప్పాడు. వ్రజం అనే పదానికి వ్యాప్తి అనే అర్థం ఉంది. ఈ వ్రజంలో శ్రీకృష్ణుడు సర్వత్రా వ్యాప్తిచెంది ఉంటాడు. యమునా నదీతీరంలో ఉన్న వ్రజభూమిలో ఆయన దివ్యలీలలు ఎన్నెన్నో జరిగాయి. సత్వరజస్తమోగుణాలకు అతీతుడు, పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణపరమాత్ముడు ఈనాటికీ ఆ ప్రదేశం అంతటా నిండి ఉన్నాడు. వ్రజభూమి కూడా ఆ కారణంగానే పరబ్రహ్మ స్వరూపమై ప్రకాశిస్తుంటుంది. ఆ శ్రీకృష్ణపరమాత్ముడి స్వరూపం సంపూర్ణంగా సచ్చిదానంద స్వరూపం. ఆ పరమపురుషుడు ఆత్మారాముడు. శ్రీకృష్ణభగవానుడి ఆత్మస్వరూపమే



రాధిక. ఆ రాధాకృష్ణులిద్దరూ వ్రజం అంతటా విహరిస్తుంటారు. కామం అనే పదానికి అభిలాష అని అర్థం. వ్రజభూమిలో శ్రీకృష్ణభగవానుడు తనకు అత్యంత ప్రీతిప్రాతమైన గోవుల మీద, గోపాలకుల మీద, గోపికల మీద అభిలాషతో ఉంటాడు. అందుకే వ్రజభూమి అంత పవిత్రతను పొందింది. ఆప్తుల మీద అంత అభిలాషతో ఉంటాడు కనుకనే ఆ భగవానుడిని ఆత్మకాముడు అని అంటారు పండితులు. శ్రీకృష్ణుడి వాస్తవ లీలలన్నీ అక్కడ నిరంతరం జరుగుతూనే ఉంటాయి. అయితే ఆయన లీలలను చూడగలిగే శక్తి అందరికీ ఉండదు. అనన్యభక్తి కలిగిన భక్తులు మాత్రమే ఎన్ని యుగాలు గడిచినా వ్రజభూమిలో తమ కళ్లతో తాము ఆ స్వామి లీలలను చూస్తూనే ఉంటారు.

### కృష్ణ భక్తులలో మూడు శ్రేణులు

కృష్ణుడి భక్తులలో మూడు శ్రేణులవారు ఉంటుంటారు. అందులో ప్రథమ శ్రేణికి చెందినవారు భగవంతుడి ఆంతరంగిక పార్షదులు. వీరెవరూ ఏనాటికీ భగవంతుడి నుంచి దూరం కారు. అలా దూరంకానివారినే పార్షదులు అని అనాల్సి ఉంటుంది. రెండో శ్రేణి భక్తులు భగవంతుడిని పొందాలనే కోరిక కలిగి ఉంటారు. అలాంటి వారు ఆ భగవంతుడు తన లీలలను ప్రదర్శించేటప్పుడు ఆ లీలాప్రదేశానికి వచ్చి చేరుతుంటారు. ఇక మూడో శ్రేణివారు దేవతలు తదితరులు. సమయానుకూలంగా, సందర్భానుసారంగా భగవంతుడు వీరిని తన దగ్గరకు రప్పించుకోవటం మళ్లీ, పంపించటం చేస్తూ ఉంటాడు. ఈ మూడు రకాల భక్తులు వ్రజభూమిలో కృష్ణుడి లీలల్లో ఉంటుంటారు. వీరిని చూడాలంటే మాత్రం అనన్యభక్తిని పెంచుకొని భగవంతుడి అనుగ్రహాన్ని పొందాల్సిందే. అంతశక్తి లేనప్పుడు వ్రజభూమినిండా కనిపిస్తున్న చెట్లు, పుట్టలు, గుట్టలు, సరస్సులు, తీర్థాలు అన్నిటికీ నమస్కరిస్తూ వాటినే ఆ కృష్ణపరమాత్ముడిగా భావించుకుంటే సరిపోతుంది. ప్రతి ద్వాపరయుగాంతంలోనూ ఆ స్వామి గోకులంలో అవతరించి గోప బాలకులతోనూ, గోవులతోనూ, గోపికలతోనూ వ్రజభూమి అంతటా విహరిస్తూ ఉంటాడు. ధర్మసంస్థాపన కోసం పాలకడలిలో శేషశయ్య మీద ఉండే ఆ మహావిష్ణువు కృష్ణుడిగా అవతరించేది ఇక్కడే. ఆ స్వామికి అండగా బలభద్రుడనే పేరుతో అవతరించేది ఆదిశేషుడు. అలా సాక్షాత్తూ వైకుంఠవాసుడు వ్రజభూమికి కృష్ణుడిగా తానొక్కడే రాడు. యదుకులంలో ఆయా దేవతాంశలతో కొందరిని జన్మింప చేస్తుంటాడు. తన పార్షదులను కూడా గోప గోపీజన రూపంలో ఉద్భవింప చేస్తుంటాడు. అక్కడి నుంచి ధర్మ పరిరక్షణ కోసం, అధర్మ వినాశనం కోసం ఆ స్వామి అనంతమైన లీలలను ప్రకటిస్తూ ఉంటాడు. మళ్లీ ద్వాపరయుగం ముగిసే సమయానికి ఏదో ఒక మిషతో ఆయా దేవతలను వారివారి స్థానాలకు పంపుతుంటాడు. భూలోకంలో వైకుంఠమంతటి పవిత్రమైన ప్రదేశంగా ఈ పద్ధతిలో ఎప్పుడూ వ్రజభూమి విరాజిల్లుతుంటుంది. యమునాతీరంలో ఉన్న ఈ ప్రాంతం ఎంతో మహిమాన్వితమైనదిగా ఇలా వివరించి చెబుతోంది స్కందపురాణాంతర్గతంగా ఉన్న ఈ కథాసందర్భం.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు

## పూటగడవటం

సామాన్యమైన రాబడి అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. రోజులో మూడు పూటలుంటే కనీసం ఒక పూటైన తినటానికి తగిన ఆదాయం రావటమంటే అది చాలా సామాన్యమూ, సాధారణమూ అయిన రాబడికింద లెక్క. అంత రాబడి కూడా లేని నాడు పూటగడవటం కూడా కష్టంగా ఉంది అని అనటం వ్యవహారంలో వినిపిస్తుంది. ఏ పూటకాపూట గడవటమే అంతంత మాత్రం అని అన్నా ఇట్లాంటి అర్థమేవస్తుంది.

## వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** మండలంలోని పాల్తేరులో కొలువై ఉన్న భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరునికల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గత పదేళ్లుగా గ్రామంలోని ఆలయంలో క్రమం తప్పకుండా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది స్వామి వారి దశమ వార్షిక కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 27వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కల్యాణం రోజు మధ్యాహ్నం నియోటెక్ రబ్బరు ప్రోడక్ట్స్ అధినేత దేవవరపు రాజబాబు ఆధ్వర్యంలో 15 వేల మందికి భోజనం ఏర్పాటు చేశారు. దీంతోపాటు సప్తాహం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.


కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి

## నేత్రానందంగా మావుళ్లమ్మ ఉయ్యాల సేవ

**భీమవరం , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** చల్లని తల్లి మావుళ్లమ్మ జ్యేష్ఠమాస జాతర ముగింపును పురస్కరించుకుని అమ్మవారి గరగల ఉయ్యాల సేవ నేత్రానందంగా సాగింది. ఆలయ సన్నిధిలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన ఉయ్యాలలో గరగలను ఏర్పాటు చేయగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఉయ్యాల సేవ నిర్వహించారు. ట్రస్టుబోర్డు సభ్యులతోపాటు పుట్టినింటివారైన మెంటేవారి కుటుంబ సభ్యులు ఉయ్యాల సేవలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గత నెల 30 నుంచి ప్రారంభమైన జ్యేష్ఠమాస జాతర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.


ఉయ్యాల సేవలో ట్రస్టుబోర్డు సభ్యులు, మెంటేవారి కుటుంబ సభ్యులు

## రచన.. రాగం
### నవనీత బహుముఖ ప్రజ్ఞ

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే :** ఆమె హృదయభావం అందమైన గీతంగా మలిచే ఓ గానసరస్వతి.. ఆ గానానికి అనుగుణంగా అభినయించగలిగే నట పార్వతి.. అయితే ఆమె కళ వినోదాన్ని పంచేందుకు మాత్రమే కాదు.. తెలంగాణ ప్రజల్లో వివిధ సమస్యలపై ఉద్యమించేందుకు అంకితం చేసింది.. ఉద్యమానికి ఆమె గీతంప్రాణం పోసింది.. ఆమే నవనీత. ఈమె కథలోకి వెళితే..

**ప్రతి గీతం.. 'నవనీత'ం.. :** అక్షరసేవలో తరించడానికి పంతులమ్మగా పది మందికి చదువును అందించడానికి ముందుకుసాగుతున్న బీఈడీ విద్యార్థిని నవనీత.. అంతకుముందు నుంచే కళాసేవలో అలుపెరుగని సేవచేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రఘుపతి నవనీత పట్టణంలోనివివేకానంద బీఈడీ కళాశాలలో ఇటీవలే బీఈడీ పూర్తిచేశారు. తండ్రి నారాయణ క్యాటరింగ్ పనిచేస్తుండగా, తల్లి లక్ష్మి బీడీలను తయారు చేస్తోంది. నలుగురు అక్కాచెల్లెళ్లలో మూడో కుమార్తె నవనీత.. రెండో అక్క నర్మద గాయని కావడంతో ఆమె వెంట కార్యక్రమాలకు వెళ్లి ఈ రంగంపై ఆసక్తి పెంచుకున్నారు. క్రమక్రమంగా ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. అంతేకాకుండా 2010 నుంచి స్వయంగా పాటలురాసి దానికి తానే స్వరకల్పన చేసి పాడడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో కళాకారిణిగా మంచిపేరు తెచ్చుకున్నారు.


సాంస్కృతిక కార్యక్రమంలో నవనీత

**ఇదీ ఘనత.. :** ఇప్పటికీ స్వయంగా 20వరకు పాటలు రాసినఈమె తన పాటలకు స్వరకల్పన చేశారు. మరోవైపు అద్భుతంగా నృత్యంచేస్తారు. ఇప్పటి వరకు 1500పైగా ధూం..ధాం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు గుజరాత్, సూరత్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. కళాకారులు లింగాల రమేష్, నరేష్ స్ఫూర్తిగా ఈ రంగంవైపు దృష్టిసారించినట్లు చెబుతున్న ఈమే పలుబహుమతులు, పురస్కారాలు అందు కున్నారు. ఆమె రాసిన గీతాలకు సంబంధించి ఆల్బమ్ తయారుచేసే పనిలో ఉంది. ఆమె రచించిన పాటల్లో రైతుల కష్టాలను చూసి స్పందించి రాసిన 'నేల తల్లి ఎందుకింత చిన్నబోయిందో', వివేకానందుడిపై రాసిన 'ఎలాగమిమ్ము మరుస్తామయ వివేకానంద' అన్న పాటలు తనకు గుర్తింపు తెచ్చాయని చెబుతున్నారు. ఇక తెలంగాణ ఉద్యమానికి సంబంధించి పలు గీతాలు రాయడమేకాకుండా, స్వరపరచి అభినయం ద్వారా జనంలో చైతన్యం తెచ్చేందుకు గ్రామాల్లో పలు ప్రదర్శనలు ఇచ్చారు. తాజాగా రాగాల పల్లకీ పేరుతో ప్రేమగీతాలను రచిస్తున్నట్లు తెలిపారు. ఐపీఎస్ కావాలనేలక్ష్యం ఉందని, ప్రస్తుతం ఉపాధ్యాయురాలిగా చదువునేర్పించడం కళాకారిణిగా చైతన్యం తేవడం లక్ష్యమని చెబుతున్నారు.

## వైభవంగా సహస్ర ఘటాభిషేకం

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** వరుణుడు కరుణించి వానలు కురవాలనీ.. పంటలు పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని మండలంలోని లక్ష్మణేశ్వరంలో దుర్గాలక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో సహస్ర ఘటాభిషేకం సోమవారం నిర్వహించారు. వరుణ జపాలు ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం చేశారు. ఆలయంలో స్వామి వారి లింగాన్ని నీటిలో ఉంచి అర్చకులు యలమంచిలి ప్రసాద్‌శర్మ, మంచిలి రాంప్రసాద్ బృందం జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది వెంకటేశ్వరరావు, శేఖర్ తదితరులు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కమనీయం.. నందిసేవ ఉత్సవం

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నందిసేవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక రీతిన అలంకరణలు చేశారు. స్వామి వారిని నందీశ్వరునిపై, జ్ఞానాంబికను సింహ వాహనంపై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య దేవదేవుని పురవీధుల మహోత్సవం ఘనంగా జరిగింది.


పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

# తాతలకు తగిన మనుమలు



ఓ ఇద్దరు మనుమలు తమ తాతల పేర్లను నిలిపి వారి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన కథాసందర్భం ఇది. ఈ మనుమల ఆదర్శ ధార్మిక జీవన విధానాన్ని గురించి స్కందపురాణాంతర్గతంగా ఉన్న భాగవత మాహాత్మ్యం వివరిస్తోంది. మహాభారత యుద్ధానంతరం ధర్మరాజు రాజ్యాధికారాన్ని చేపట్టాడు. అలా కొంతకాలం గడిచాక కలియుగం వస్తుండటంతో శ్రీకృష్ణపరమాత్ముడు అవతారాన్ని చాలించాడు. ఆయనతోపాటే భూలోకంలో ఆయన బంధువులుగా, స్నేహితులుగా అవతరించిన దేవతాంశ స్వరూపులైన యాదవులు తదితరులు కూడా దేహాలను చాలించి తమతమ లోకాలకు చేరు

ధర్మపథం

కున్నారు. దాంతో మధుర ప్రాంతం దాదాపు నిర్జనంగా మారిపోయింది. ధర్మరాజు ఈ పరిస్థితినంతటినీ గమనించాడు. తాను, తనతోపాటు సోదరులు, భార్య ద్రౌపది అంతా స్వర్గారోహణం చేసే సమయం వచ్చిందని తెలుసుకున్నాడు. వెంటనే ఉత్తరాభిమన్యులకు జన్మించిన తన మనుమడు పరీక్షిత్తును రాజుగా అభిషేకించాడు. అలాగే శ్రీకృష్ణుడికి మనుమడు, అనిరుద్ధుడి కుమారుడైన వజ్రనాభుడిని (వజ్రుడు) మధురారాజ్యానికి పట్టాభిషిక్తుడిని చేసి తన సంకల్పం ప్రకారం సోదరులు, భార్యతోసహా స్వర్గారోహణ కోసం హిమాలయాలకు వెళ్లిపోయాడు ధర్మరాజు. ఆ తర్వాత పరీక్షిన్మహారాజు హస్తినాపురంలో హాయిగా పరిపాలన చేస్తూ ఓ రోజున తనతోపాటే పట్టాభిషిక్తుడైన కృష్ణపరమాత్ముడి మనుమడు వజ్రుడు ఎలా ఉన్నాడా అని తెలుసుకోవాలనుకున్నాడు. వెంటనే స్వయంగా మందీమార్బలంతో మధురకు వెళ్లాడు. పరీక్షిత్తు వస్తున్నాడని తెలుసుకొని వజ్రుడు ఎదురువెళ్లి ఆహ్వానించి తీసుకువచ్చి అతిథి పూజాసత్కారాలు చేశాడు.

### వజ్రుడి కష్టాలు

పరీక్షిత్తు వజ్రనాభుడి భవనంలో అప్పటికింకా జీవించి ఉన్న కృష్ణుడి భార్యలైన రోహిణీ తదితరులకు భక్తితో నమస్కారం చేసి యోగక్షేమాలడిగి తెలుసుకున్నాడు. ఆ క్రమంలోనే వజ్రుడు తన కష్టాలను పరీక్షిత్తుకు చెప్పాడు. మధుర రాజ్యంగా పేరుకు మాత్రమే ఉందని, కృష్ణభగవానుడి నిర్యాణం అనంతరం మధురలో తనలాగా ఏ ఒకరిద్దరో తప్ప ఎవరూ లేరని, అలా జనవాహిని లేని రాజ్యాన్ని తానెలా పరిపాలించగలనని అన్నాడు. అప్పుడు పరీక్షిత్తు శాండిల్య మహర్షిని పిలిపించి వజ్రుడికి అసలు విషయాన్ని చెప్పించాడు. కృష్ణుడి నిర్యాణానంతరం ఆనాటి వారంతా మధురలో రహస్య రూపాలతో సంచరిస్తుంటారని, పరమ యోగులకు మాత్రమే వారి దర్శనం కలుగుతుంటుందని తెలియచెప్పాడు శాండిల్యుడు. అయితే మధుర మళ్లీ జనవాహినితో కళకళలాడేందుకు తనవంతు సాయం చేస్తానని పరీక్షిత్తు వజ్రుడికి చెప్పాడు. తన తండ్రి, తాతలందరికీ వజ్రుడి తండ్రి అనిరుద్ధుడు, తాత శ్రీకృష్ణుడు లాంటి వారంతా ఎంతో ఆరాధ్యులని, వారి దయవల్లే తమ తండ్రులు, తాతలు హాయిగా జీవించగలిగారన్నాడు. అంతేకాక తాను కూడా క్షేమంగా ఉండగలుగుతుంది వారి ఆశీస్సుల వల్లనేనని అందుకే తాను వజ్రుడికి కావలసిన సహాయం చేయాలనుకుంటున్నట్లు చెప్పాడు. అంతేకాక తన రాజ్యమైన ఇంద్రప్రస్థం నుంచి వేలాదిగా గొప్పగొప్ప సంపన్నులను, పురప్రముఖులను పిలిపించి మధురానగరంలో నివసించమని చెప్పాడు. వారందరికీ కావలసిన వసతులు, తదితర ఏర్పాట్లన్నింటినీ చేయించాడు.

### మధుర మళ్లీ కళకళ

ఆ తర్వాత శ్రీకృష్ణుడి భక్తులు, అప్పటికింకా మధురానగరంలో మిగిలిఉన్న కొందరు బ్రాహ్మణులు, ప్రాచీన వానరులను పిలిపించి వారందరికీ గౌరవ మర్యాదలు కల్పించి ఆ నగరంలోనే ఉండమని చెప్పాడు. ఇలా మధుర పరీక్షిత్తు చొరవతో మళ్లీ కళకళలాడింది. ఆ తర్వాత వజ్రనాభుడు మధురలో శ్రీకృష్ణపరమాత్ముడు లీలలను ప్రదర్శించిన ప్రదేశాలన్నిటి గురించి తెలుసుకున్నాడు. ఆయా ప్రదేశాలన్నిటికీ కృష్ణలీలలకు సంబంధించిన పేర్లనే పెట్టి అక్కడంతా మంచి గ్రామాలను నిర్మింపచేశాడు. ఆ గ్రామాల కూడళ్లల్లో, ప్రధాన ప్రదేశాలలో కృష్ణపరమాత్ముడి విగ్రహాలను ప్రతిష్ఠింపచేశాడు. అక్కడక్కడ ఆ భగవంతుడి పేర్లతో సరోవరాలను, బావులను తవ్వించాడు. వనాలను, ఉపవనాలను ఏర్పాటు చేయించాడు. శివాలయాలు తదితర దేవతల ఆలయాలను కట్టించాడు. ప్రత్యేకంగా గోవిందదేవ, హరిదేవలాంటి పేర్లతో మందిరాలను నిర్మించి వాటిలో కృష్ణుడి విగ్రహాలను నెలకొల్పాడు. వజ్రనాభుడి పరిపాలనలో ప్రజలు కూడా శ్రీకృష్ణభగవానుడి మధురమైన నామాలను, లీలలను కీర్తిస్తూ కృష్ణభక్తిలో తన్మయులవుతూ ఉండేవారు. ఇలా ధర్మరాజు మనుమడైన పరీక్షిత్తు సహాయంతో నిర్జనారణ్యంగా ఉన్న మధుర కృష్ణుడి మనుమడైన వజ్రుడి సుపరిపాలనలో ఎంతో గొప్పగా వర్ధిల్లిందని ఈ కథాసందర్భం తెలియచెబుతోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## నోరు రావటం

**మా**ట్లాడటం, మనసులోని భావాన్ని ప్రకటించటం అనేలాంటి అర్థాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. మాటకు ప్రత్యామ్నాయ పదంగా నోరు అనే పదాన్ని వాడటం అలవాటుగా

జాతీయాలు నుడికారాలు

ఉంది. మాట నోటి నుంచే వస్తుంది. కనుక అలా మాట, నోరు సమానార్థకాలయ్యాయి. ఏ విషయాన్ని గురించైనా చెప్పాల్సింది చెప్పలేనప్పుడు నోరు రాలేదు అని అనటం కనిపిస్తుంది. అంటే ఈ సందర్భాన్ని బట్టి నోట మాట రాలేదు అనేదే దీనికున్న అర్థం.

## లాల్‌దర్వాజా బోనాలు జులై 11న

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** తెలంగాణలో ప్రసిద్ధి చెందిన లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు వచ్చే నెల 11 నుంచి ప్రారంభమవుతాయని లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ దేవాలయ కమిటీ అధ్యక్షుడు బి.బల్వంత్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్ వెల్లడించారు. ఈ ఉత్సవాలను పదకొండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రంగం, అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు ఉంటాయన్నారు.

## మల్లెల అలంకరణలో దాసాంజనేయుడు

**భీమవరం, న్యూస్‌టుడే:** మారుతీటాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారు మల్లెల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి వివిధ రకాల పండ్లరసాలతో అభిషేకాలు, సహస్ర సింధూర్చన, ఐదు వేల తమలపాకులతో ఆలయ అర్చకుడు భాస్కరశర్మ పూజలు నిర్వహించారు. రాత్రి సాయి భక్తసమాజం వారిచే 'స్వామివారి సంకీర్తన' నిర్వహించగా స్వామిని మల్లె, కనకాబంరం, చామంతి పుష్పాలు, తమలపాకులతో అలంకరించారు.



విశేష పుష్పాలంకరణలో దాసాంజనేయస్వామి

అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శనించి ఆశీస్సులు పొందగా ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## వైభవంగా నందిసేవ

**నెల్లూరు, న్యూస్‌టుడే :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన విడవలూరు మండలంలోని రామతీర్థం గ్రామంలో ఉన్న శ్రీ కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరుడికి మంగళవారం రాత్రి వైభవంగా నందిసేవ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, శ్రీనివాసులుశర్మ, శ్రీనివాసులు శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, చప్పరోత్సవ సేవలు నిర్వహించారు. రాత్రి వైభవంగా



నందిసేవలో ఉత్సవమూర్తులు

నందిసేవను నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సముద్ర స్నానాలు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఆంధ్రావని

## సంప్రదాయ సౌరభం.. అమ్మవారి చల్లదనం

*విజయనగరం, న్యూస్‌టుడే:* ఆంధ్రుల ఆరాధ్యదేవత, దయా స్వరూపిణి, తేజోమయి, చల్లని తల్లి, ఎల్లవేలల ప్రజలను కంటికి రెప్పలా కాపాడే కారుణ్య మూర్తి పైడితల్లి అమ్మవారు. కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లి పైడితల్లి. మంగళవారం పట్టణంలో అమ్మవారి చల్లదనం ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఏసీ భానురాజా పర్యవేక్షణలో ప్రధాన పూజారి తాళ్లపూడి భాస్కర్రావు ఆధ్వర్యంలో హుకుంపేట, ఇతర ప్రాంతాల నుంచి 500 మంది మహిళలు పసుపు నీళ్ల బిందెలను తలలపై ధరించి జైపైడిమాంబ నినాదాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. వర్షాభావంతో వస్తున్న అనర్థాలు నివారించాలనే మహదాశయంతో ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం నిర్వర్తించారు. 500 బిందెల పసుపు నీళ్లతో జరిగిన ఈ అభిషేకం అందరిలో భక్తిపారవశ్యాన్ని నింపింది. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించమని అందరూ ఆశతో, ఆర్తితో అమ్మవారిని అర్థించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ భానురాజా మాట్లాడుతూ జూన్ చివరి వారం వచ్చినా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడని, వర్షాలు కురిసి జిల్లా పాడిపంటలతో కళకళలాడాలని ఉన్నత ఆశయంతోనే ఈ అమ్మవారి చల్లదనం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దూసి కృష్ణమూర్తి, వెంకటరావు, వెంకటరమణ, మూలా పాపారావు, ఆలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సిబ్బంది ఎం.అప్పలనాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.



పసుపు నీళ్ల బిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు (అంతరచిత్రంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పసుపు నీళ్లతో అభిషేకం చేస్తున్న మహిళలు)

## కొండగట్టుకు పోటెత్తిన భక్తజనం



**కరీంనగర్, న్యూస్‌టుడే:** కొండగట్టు అంజన్న ఆలయం పరిసరాలు మంగళవారం భక్తజనం పోటెత్తారు. వర్షాలు పడకపోవడంతో సాగు పనులు లేక రైతాంగం అంజన్నను దర్శించుకొని వెళ్లారు. ఎములాడ రాజన్నను దర్శించు కొన్న భక్తులు కొండగట్టు అంజన్నకు మొక్కులు చెల్లించుకోవడానికి బారులు తీరారు. ఉచిత, ప్రత్యేక దర్శనం కోసం గంటల తరబడి వేచివున్నారు. దాదాపు 60 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొనివుంటారని అధికారుల అంచనా. ఒకే ప్రసాదం కౌంటరు కావడంతో గంటల తరబడి ప్రసాదం కోసం క్యూలైన్లో పడిగాపులు కాశారు. అధికారులు క్షురకులకే తలనీలాల టిక్కెట్ల విక్రయం బాధ్యతను అప్పగించి చేతులు దులుపుకొన్నారు. ఆలయ సూపరింటెండెంట్‌లు సూర్యనారాయణశర్మ, శ్రీనివాస్‌శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పాపాలను హరించే పూరి

**పూ**రీక్షేత్ర దర్శనం సర్వపాపాలనూ హరిస్తుంది. ఇంతటి పవిత్రమైన క్షేత్రం మరొకటి లేదన్నది బ్రహ్మదేవుడే చెప్పిన మాట. ఈ పూరీక్షేత్రాన్నే పురుషోత్తమ పట్టణం అని పురాణాలు, శాస్త్రాలు పేర్కొంటున్నాయి. పురుషోత్తముడైన దేవదేవుడు, వైకుంఠవాసుడు, వాసుదేవుడు కొలువుతీరి ఉండే క్షేత్రం కనుక ఇది పురుషోత్తమ క్షేత్రం అయింది. ఈ క్షేత్ర మహిమను గురించి నారదపురాణం యాభై రెండో అధ్యాయం వివరిస్తోంది. వసుమహారాజు మోహినికి ఈ విషయాలన్నీ వివరించాడు. ఆ వివరించే క్రమంలో పురుషోత్తమ పట్టణ ఆవిర్భావం కృతయుగం నాడే జరిగిందని, దాంతో పాటు సంభవించిన మరికొన్ని విశేషాలను సంపూర్ణంగా వసుమహారాజు వివరించారు. వసుమహారాజు తన ప్రియురాలైన మోహినికి కాశీక్షేత్ర

ధర్మపథం

మహిమను తెలిపిన తర్వాత పూరీక్షేత్రాన్ని గురించి తెలియచెప్పాడు. భూమండలంలో ఉన్న భారతవర్షం కర్మభూమిగా ప్రసిద్ధి చెందింది. ఈ భారతవర్షంలో దక్షిణ సముద్రతీరంలో ఉత్కల ప్రాంతం ఉంది. అది చాలా పవిత్రమైంది. సముద్రతీరానికి ఉత్తర భాగంలో విరజా మండలం వరకూ వ్యాపించి ఉంది. ఇక్కడ ఉండే వారంతా పవిత్రమూర్తులు, పుణ్యాత్ములు. ఈ ప్రదేశంలోనే ఎన్నెన్నో పుణ్యతీర్థాలు, పర్వతాలు అన్నీ ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతం అంటే దేవతలకు, పితృదేవ




తలకు, రుషులకు ఎంతో ఇష్టం. ఈ ప్రదేశమంటే అంతకంటే ఎంతో ఎక్కువ ఇష్టపడుతుంటాడు పురుషోత్తముడు. అందుకనే ఆయన స్వయంగా ఇక్కడ నివసిస్తుంటాడు. ఉత్కల క్షేత్రంలో స్నానం చేసి పురుషోత్తముడిని దర్శించుకుంటే స్వర్గప్రాప్తి సులభమవుతుంది.

### విష్ణు ఆరాధన

కృతయుగంలో ఇంద్రద్యుమ్నుడు అనే ఓ మహారాజు ఉండేవాడు. స్వర్గలోకంలో ఇంద్రుడు ఎంత గొప్పగా ఉంటాడో భూలోకంలో ఇంద్రద్యుమ్నుడు అంత గొప్పగా ఉంటూ ఉండేవాడు. ఆ ఇంద్రద్యుమ్న మహారాజుకు మహావిష్ణువంటే మహాభక్తి. ఆ మహావిష్ణువు ఆరాధనకు భూమండలంలో తగిన ప్రదేశం ఏదీ అని తీవ్రంగా సమీక్షించాడు ఆ రాజు. ఆ సమీక్షలో ఉత్కల ప్రాంతం విష్ణువు ఆరాధనకు తగిన ప్రదేశమని తెలుసుకున్నాడు. వెంటనే చతురంగ బలసమేతుడై అక్కడకు వెళ్లాడు. అశ్వమేధ యాగాన్ని ఆ ప్రాంతంలో చేసి గొప్ప దక్షిణలనిచ్చాడు. ఆ తర్వాత ఆ మహారాజే పురుషోత్తమ క్షేత్రంలో తొలిగా బలరామ, శ్రీకృష్ణ, సుభద్ర ప్రతిమలను ప్రతిష్ఠించాడు. ఆ పుణ్యకార్యంతోనే జీవితం ముగిశాక మోక్షం పొందాడు. ఇంద్రద్యుమ్న మహారాజు బలరామ, శ్రీకృష్ణ, సుభద్ర విగ్రహాలను అక్కడ ప్రతిష్ఠించటానికి ముందు శ్రీమహావిష్ణువు విగ్రహం అక్కడ ఒకటుండేది. ఆ విగ్రహం ఇంద్రనీలమణికాంతులతో విరాజిల్లుతుండేది. ఆ శ్రీమహావిష్ణు విగ్రహాన్ని దర్శించిన వారికి దర్శన మాత్రం చేతనే నరకబాధ తప్పి నేరుగా మోక్షం లభిస్తుండేది. దాంతో నరకానికి అధిపతైన యమధర్మరాజుకు పని లేకుండా పోయింది. అప్పుడు ఆ యముడు నేరుగా వైకుంఠానికి వెళ్లి శ్రీమహావిష్ణువును ప్రార్థించి తనకొచ్చిన కష్టాన్ని చెప్పాడు. అప్పుడు విష్ణువు యమధర్మరాజుకు అభయమిచ్చి ఇక మీదట ఆ విగ్రహం అక్కడ ఉండదని చెప్పి పంపాడు. ఆ వెంటనే శ్రీమహావిష్ణువే స్వయంగా తన విగ్రహాన్ని సముద్రపు ఒడ్డున ఉన్న ఇసుకలో లోతుగా కూరుకుపోయేలా చేశాడు. ఆ తర్వాత దాని మీద చెట్లు తీగలు మొలిచి ఆ విగ్రహం మరెవరికీ కనిపించకుండా పోయింది. అయితే భక్తవత్సలుడైన శ్రీహరి తన భక్తులకు మరీ మరీ దూరం కావటం ఇష్టంలేక ఇంద్రద్యుమ్న మహారాజు చేత బలరామ శ్రీకృష్ణ సుభద్ర విగ్రహాలను రూపొందింపచేసి ప్రతిష్ఠించేలా చేశాడు. అప్పటి నుంచే పూరీక్షేత్రంలో బలరామశ్రీకృష్ణ సుభద్రలకు పూజలు జరుగుతున్నాయి అని నారదపురాణం పేర్కొంటోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# మెరుగు కవి

**నల్గొండ, న్యూస్‌టుడే:** తండ్రి వద్ద లభ్యమైన ఆధ్యాత్మిక పుస్తకాలే ఆయనకు పాఠాలు నేర్పాయి. అద్భుత గ్రంథాల్ని రచించేలా ప్రేరణ కల్గించాయి. పండితులకు మాత్రమే సాధ్యమయ్యే కావ్యాలు రచించడం ద్వారా ఆయన మహాపండితుల సరసన చేరారు. పీహెచ్‌డీ పరిశోధనకు అర్హత సాధించారు. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన నర్సింహ, ఎల్లమ్మల కుమారుడైన మెరుగు వెంకటదాసు చదువులో అంతంత మాత్రమే. అయినా ఎన్నో గ్రంథాలను రచించి మహాపండితుల ప్రశంసలు పొందారు. తన కుటుంబంలో కవులు, రచయితలు ఎవరూ లేరు. సహజ రచనలను సాహితీ ప్రియులకు అందించిన వెంకటదాసు సహజకవి, అభినవ పోతన, వేదశ్రీ బిరుదులతో పలు సత్కారాలు అందుకున్నారు. ఈయనపై పీహెచ్‌డీ పరిశోధన కూడా త్వరలోనే పూర్తి కానుంది. చదువుపై ఆసక్తి లేని వెంకటదాసు నాలుగో తరగతి వరకే చదివి మానేశారు. దీంతో తండ్రికి వ్యవసాయ పనులలో చేదోడు వాదోడుగా ఉండేవారు. తండ్రికి ఉన్న ఆధ్యాత్మిక చింతనతో తండ్రి వద్ద లభించిన భారతం, భాగవతం, భగవద్గీతలను పారాయణం చేశారు. భజనలు, వీధి భాగవత పద్యాలను పునికి పుచ్చుకున్నారు. వెంకటదాసు భగవద్గీత పఠనం చేస్తున్న క్రమంలో పద్యకృతితో భగవద్గీతను రచించాలనే యోచన కలిగింది. వెంటనే తేలికైన పదాలతో భగవద్గీత(పద్యకృతి)ని రచించారు. తొలి రచనతోనే ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.



ప్రముఖులతో సన్మానం అందుకుంటున్న వెంకటదాసు

# పూర్ణాహుతితో వరుణయాగం పరిసమాప్తం

**తిరుమల, న్యూస్‌టుడే :** తిరుమలలో తితిదే నిర్వహించిన వరుణయాగం పరిసమాప్తమైంది. కారీరిష్ఠి, వరుణజప, పర్జన్య శాంతియాగం, పూర్ణాహుతి, అవబృదేష్టిలతో వైదికంగా యాగం ముగిసింది. పార్వేట మండపం వద్ద పూర్ణాహుతి అనంతరం వరాహస్వామి ఆలయం ఎదుట శ్రీవారి పుష్కరిణిలో అవబృదేష్టి కార్యక్రమాన్ని వైదికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తితిదే ఈవో గోపాల్ మాట్లాడుతూ లోకకల్యాణం కోసం తిరుమలలో వరుణయాగం నిర్వహించినట్లు వివరించారు. దక్షిణ భారతదేశానికి చెందిన వంద మంది రుత్విక్కులు యాగాన్ని ఆరు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. కారీరిష్ఠియాగంతో త్వరలో శ్రీవారి కృపాకటాక్షాలతో మంచి వర్షాలు కురుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేదపాఠశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్. అవధాని, ఇతర ఘనాపాఠీలు పాల్గొన్నారు.



పుష్కరిణిలో నవధాన్యాలు వదులుతున్న రుత్విక్కులు

## నిప్పులు కక్కటం

**తీ**వ్రమైన కోపాన్ని ప్రదర్శించటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. కోపంగా మాట్లాడే మాటలు పరుషంగా ఉండి ఎదుటివారి మనసును బాధతో దహింపచేస్తాయి.

జాతీయాలు నుడికారాలు

దహించటమనేది నిప్పులకున్న లక్షణం. కోపానికి కూడా ఇటువంటి లక్షణమే ఉండటంతో దాన్ని నిప్పుతో పోల్చి చెబుతుంటారు. ఇలా ఈ జాతీయం బాగా కోపగించి పరుషంగా ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు ప్రయోగంలో కనిపిస్తుంది.

# ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే:** మొదటి సంతానంగా కుమారుడు పుడితే వంశోద్ధారకుడు జన్మించాడని తల్లిదండ్రులు సంబరపడ్డారు. ముగ్గురు మగ సంతానం. పెద్ద కుమారుడికి నాలుగేళ్ల ప్రాయంలోనే మాయదారి క్యాన్సర్ కబళించింది. శివాలయంలో భక్తులు వేసే దక్షిణతోనే కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి వారిది. ఇది నాలుగేళ్ల చిన్నారి జంగం కార్తీక్, తండ్రి వీరభద్రయ్య ఎదుర్కొంటున్న దుస్థితి. ఆత్మకూర్ మండల పరిధిలోని మోట్లంపల్లి గ్రామానికి చెందిన వీరభద్రయ్య, పవిత్ర దంపతులకు మొదటి సంతానంగా కార్తీక్ జన్మించాడు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ వైద్యశాలలో కార్తీక్ అనారోగ్య పరిస్థితిపై వైద్య పరీక్షలను నిర్వహించి బ్లడ్ క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు తల్లిదండ్రులకు వివరించారు.

ఆంధ్రావని

ఎలాంటి మెరుగైన వైద్య సాయం అందించలేని పరిస్థితి ఉండడంతో తల్లిదండ్రులు సొంత గ్రామానికి తీసుకొచ్చారు. ఇప్పటికీ కార్తీక్‌కు వైద్య పరీక్షలు, వైద్య సాయానికి తండ్రి వీరభద్రయ్య రూ.70 వేల వరకు ఖర్చు చేశాడు. ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా అప్పులు చేసి వైద్య సహాయం అందించేందుకు తండ్రి సిద్ధపడిన కార్తీక్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే అవకాశాలు కరవయ్యాయి. వైద్య సాయం అందిస్తున్నా.. కుమారుడు కళ్లెదుటే మృత్యువుతో పోరాడుతుండటం ఆ పంతుల గుండెను పిండేస్తోంది. కార్తీక్ బాధతో తల్లడిల్లుతుంటే చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఆ తల్లిదండ్రులను ఇరుగుపొరుగు కుటుంబాలకు చెందిన వారు ఓదార్చేందుకు యత్నిస్తున్నారు. స్వయంగాలేచి నిలిచి ఉండలేని పరిస్థితిలో ఉన్న కార్తీక్‌ను కాపాడుకునే అవకాశం లేకున్నా ఉన్నంతలో ఎక్కువ కాలం బతికించుకునేందుకు వీరభద్రయ్య కుటుంబం ఆరాటపడుతోంది.



కార్తీక్‌ను ఓదారుస్తున్న తండ్రి వీరభద్రయ్య

# సంప్రదాయంగా రథ ప్రతిష్ఠ

**యాదగిరిగుట్ట, నల్గొండ జిల్లా, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో భక్తుల ఆర్జిత బ్రహ్మోత్సవంలో రథోత్సవ వేడుకలను నిర్వహించేందుకు సరికొత్త చిన్న రథాన్ని దేవస్థానం నిర్వాహకులు దాత సహకారంతో రూపొందించారు. ఈ రథానికి బుధవారం సంప్రదాయ పూజలతో ప్రతిష్ఠ పర్వాన్ని నిర్వహించారు. ఈ రథాన్ని ఆర్జిత బ్రహ్మోత్సవాల్లో వినియోగించనున్నట్లు ఆచార్యులు తెలిపారు.



రథానికి పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

### గుట్టలో భక్తుల పూజలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం విశేష పూజలు జరిగాయి. నగరానికి చెందిన పలువురు భక్తులు శ్రీస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. వేకువ జామున సుప్రభాతం నిర్వహించిన ఆచార్యులు స్వయంభువులకు అభిషేక, అర్చనలు జరిపారు. భక్తుల మొక్కు పూజల్లో భాగంగా వ్రతాల నిర్వహణతో శ్రీసత్యనారాయణస్వామి మండపంలో వ్రతాలు చేపట్టారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం జరిగిన అలంకార తిరువీధి సేవోత్సవం శాస్త్రోక్తంగా కొనసాగింది. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు సంకల్పం చేపట్టారు.

### ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేల పూజలు

పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చిత్తూరు తెదేపా ఎమ్మెల్యే సత్యప్రభ, సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిత్య బుధవారం సందర్శించారు. వేర్వేరుగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేలు దైవదర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేపట్టి అష్టోత్తరంలో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించిన ఎమ్మెల్యేలకు ఆచార్యులు సంప్రదాయంగా శ్రీస్వామి ఆశీస్సులను అందజేశారు.

# పూరీలో తొలి విగ్రహ ప్రతిష్ఠ

ధర్మపథం

ప్రస్తుతం పూరీలో కనిపిస్తున్న జగన్నాథ స్వామి ఆలయంలోని విగ్రహాలు తొలిగా ఎప్పుడు ప్రతిష్ఠితమయ్యాయి, వాటిని ఎవరు ప్రతిష్ఠించారు, అసలారూపాలతో విగ్రహాలను చెయ్యమని ఎవరు ఎవరికి చెప్పారు, వాటిని దేనితో రూపొందించారు, ఆ రూపొందించిన శిల్పి ఎవరు అనే విషయాలను గురించిన ఆసక్తికరమైన కథాంశం ఇది. నారదమహాపురాణం యాభైమూడో అధ్యాయంలో దీనికి సంబంధించిన వివరాలున్నాయి. వీటిని వసుమహారాజు మోహినికి వివరించి చెప్పాడు. కృతయుగంలో ఇంద్రద్యుమ్న మహారాజు విష్ణుభక్తితో ఉంటూ అశ్వమేధయాగం చేయాలనుకున్నాడు. అందుకు తగిన ప్రాంతం ఉత్కల దేశమని తెలుసుకున్నాడు. అక్కడికి వెళ్లి ముందుగా పాంచరాత్ర విధానంలో విష్ణువును పూజించాడు. అక్కడ తాను విష్ణు విగ్రహాన్ని స్థాపించాలని, ఆ విగ్రహాన్ని దేనితో తయారుచేయిస్తే బాగుంటుందా అని ఆలోచిస్తూ ఓ రోజు రాత్రి వేళ ఆ రాజు నిద్రలోకి జారుకున్నాడు. నిద్రపోతున్నాడన్న మాటేకానీ విష్ణుభక్తుడైన ఇంద్రద్యుమ్నుడు తన స్వామిని గురించే ఆలోచిస్తూ ఉండిపోయాడు. అలా కొద్ది సమయం గడిచిన



తర్వాత ఇంద్రద్యుమ్నుడికి ఓ కల వచ్చింది. ఆ కలలో చక్రధారి అయిన వాసుదేవుడు కనిపించాడు. ఆ స్వామిని చూసి అనేకవిధాలుగా స్తుతించాడు రాజు. అప్పుడాశ్రీహరి అక్కడికి సమీపంలోనే సముద్రతీరంలో ఒక మహావృక్షం ఉంటుందని అక్కడికి వెళ్లి ఆ వృక్షానికి ఉన్న కొమ్మలను కొడుతూ ఉంటే విగ్రహం లభిస్తుందని చెప్పి అంతర్ధానమయ్యాడు.

### విష్ణువు సూచించిన మార్గంలో...

నిద్రమేల్కొన్న రాజు మిగిలిన రాత్రి సమయంతా విష్ణువును స్మరిస్తూ గడిపి తెల్లారిన తర్వాత తానొక్కడే పదునైన గొడ్డలిని తీసుకొని విష్ణువు ఆనవాలు చెప్పిన వైపు వెళ్లాడు. స్వామి చెప్పినట్లుగానే అక్కడొక మహావృక్షం ఉంది. దానికి పూలు, పండ్లులాంటివేవీ లేవు. అది ఏ జాతి చెట్టో కూడా అర్థం కావటంలేదు. రాజు తన ఆలోచనలన్నిటినీ పక్కనపెట్టి కలలో దేవుడు చెప్పినట్టే ఆ చెట్టుకొమ్మలను కొట్టసాగాడు. ఇంతలో ఆ నిర్జన ప్రదేశంలోకి ఇద్దరు వేదపండితులొచ్చారు. ఆ చెట్టును ఎందుకు కొడుతున్నావు, దానివల్ల ప్రయోజనమేమిటని అడిగారు. ఎంతో మృదువుగా సమ్మోహనకరంగా ఆ ఇద్దరి మాటలున్నాయి. అప్పుడారాజు తన కల సంగతి చెప్పి విష్ణు విగ్రహం కోసమే తానాపని చేస్తున్నానని అన్నాడు. అందులో మొదటి పండితుడు రాజు మాటలను విని ఎంతో ఆనందించి తనతో వచ్చిన రెండో పండితుడు గొప్ప శిల్పాచార్యుడని సాక్షాత్తూ విశ్వకర్మ అంతటివాడని విష్ణుప్రతిమను రూపొందించటంలో సమర్థుడని చెప్పాడు. రాజు ఆ శిల్పాచార్యుడికి నమస్కరించి విగ్రహాన్ని సిద్ధం చేసిమ్మని అన్నాడు. అప్పుడు మొదటి పండితుడి రూపంలో ఉన్న శ్రీమహావిష్ణువు రెండో పండితుడి రూపంలో ఉన్న విశ్వకర్మకు తాను చెప్పినట్టుగా విగ్రహాలను రాజు నరికిన చెట్టుకొమ్మతో చేసిమ్మన్నాడు. వాటిలో మొదటి విగ్రహంగా శ్రీకృష్ణపరమాత్ముడి విగ్రహాన్ని తయారుచేయాలని అది ప్రశాంత వదనంతో, పద్మాల్లాంటి కళ్లతో, శ్రీవత్సం, కౌస్తుభంతో అలరారుతూ ఉండాలని, శంఖచక్రగదాధరుడిగా ఉండాలని చెప్పాడు. అలాగే కృష్ణుడికి అన్న అయిన బలరాముడి విగ్రహం చూడముచ్చటగా ఉండాలని, నాగలిని ధరించి కనిపిస్తుండాలని అన్నాడు. బలరాముడు నీలాంబరధరుడుగా ఉగ్రస్వభావంతో ఉండాలని సూచన చేశాడు. బలరామ శ్రీకృష్ణ విగ్రహాలతో పాటు సర్వాభరణ అలంకృతంగా పద్మపత్రాల్లాంటి కన్నులతో ఎంతో సౌందర్యంతోనూ అలరారుతూ బలరామకృష్ణుల సోదరి అయిన సుభద్ర విగ్రహం ఉండాలని మొదటి పండితుడి రూపంలో ఉన్న విష్ణువు రెండో పండితుడి రూపంలో ఉన్న విశ్వకర్మకు చెప్పాడు. అంతేకాక విశ్వకర్మ ఆ విగ్రహాలను రూపొందించేలోపల ఇంద్రద్యుమ్నుడిని చెట్టునీడలో విశ్రాంతి తీసుకొంటూ ఉండమని చెప్పి పంపాడు. ఇంద్రద్యుమ్నరాజు విశ్రాంతి కోసం క్షణకాలంపాటు చెట్టుకింద కూర్చొనేంత లోపులోనే ఎంతో అద్భుతంగా ఉండే బలరామ, సుభద్ర, కృష్ణుల విగ్రహాలను రూపొందించాడు విశ్వకర్మ. ఆ పరిస్థితిని చూసిన రాజుకు తన దగ్గరకొచ్చింది ఎవరోకాదని సాక్షాత్తూ విష్ణువు, విశ్వకర్మలేనని అర్థమైంది. వెంటనే వారి పాదాలపైపడి స్తుతి చేసాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు తమ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తూ ఉండమని భూలోకవాసుల క్షేమం కోసమే తాము స్వయంగా విగ్రహరూపాలలో అక్కడ ఉంటామని చెప్పి అంతర్ధానమయ్యారు. అలా ఆనాడు బలరామ, జగన్నాథ, సుభద్రల విగ్రహాలు దైవసంకల్పంతో భూలోకంలో అవతరించినట్లు అందుకే పూరీ క్షేత్రం పరమపవిత్రమైన వైష్ణవక్షేత్రంగా వాసికెక్కినట్లు ఈ కథాసందర్భం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## నోరు నొక్కటం

జాతీయాలు నుడికారాలు

**మా**ట్లాడనివ్వకుండా చేయటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. నొక్కటం, నొక్కిపట్టడం అనే మాటలను పైకి రానివ్వకుండా అదుపు చేయటం అనే అర్థాలున్నాయి. ఈ అర్థాల నేపథ్యంలోనే ఈ జాతీయం అవతరించింది. చెప్పాలనుకుంటున్న మాటను చెప్పనీయకుండా ఏ విధంగా అడ్డుపడినా ఆ పరిస్థితిని ఈ జాతీయంతో పోల్చి చెప్పటం కనిపిస్తుంది. ఎనా నోరు నొక్కేశారు. అందుకే నేనేం చేయలేకపోయాను' అనే లాంటి ప్రయోగాలు ఉన్నాయి.

ఆంధ్రావని



## శ్రీమఠంలో ఉడిపి పీఠాధిపతి

**కర్నూలు, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మూలబృందావనాన్ని ఉడిపి భీమకట్ట మఠం పీఠాధిపతి శ్రీ రఘుమాన్యతీర్థులు గురువారం రాత్రి మంత్రాలయం శ్రీమఠానికి వచ్చారు. వీరిని శ్రీమఠం పీఆర్వో రాఘవేంద్రరావు, జోనల్ మేనేజర్ శ్రీపతి తదితర అధికారులు స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని హారతి ఇచ్చారు. స్వామి మూబృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన రథోత్సవంలో పాల్గొన్నారు.

## శోభాయమానంగా బోనాల జాతర

**ఖమ్మం, న్యూస్‌టుడే:** పాల్వంచ మండలం కేపీ జగన్నాథపురం పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల జాతరను అత్యంత వైభవోపేతంగా జరుపుకున్నారు. గురువారం కేశ్వాపురం గ్రామస్థులు ప్రతి ఏడాది ఆషాఢమాసం ముందుగా ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. మహిళలు నెత్తిమీద బోనం ఎత్తుకుని రహదారి గుండా ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. పెద్దమ్మతల్లి గుడి వరకు ఆటపాటలతో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మేళతాళాలు పిల్లలు, పెద్దల నృత్యాల మధ్య బోనాలను తోడ్కొని వచ్చారు. ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో పల్లెలు తులతూగాలని పెద్దమ్మతల్లికి గ్రామస్థులు మొక్కులు చెల్లించారు.



బోనాలు తీసుకువస్తున్న మహిళలు



పెద్దమ్మతల్లికి సమర్పించిన బోనాలు

## వేడుకగా అమావాస్య ఉత్సవం

**శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం స్వామి, అమ్మవార్లకు పురవీధుల ఉత్సవం ఘనంగా జరిగింది. అమావాస్యను పురస్కరించుకొని ఈ విశేషోత్సవాన్ని జరిపారు. శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కంధమూర్తి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ తనిఖీ అధికారి సుదర్శన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

## మూడేళ్ల ప్రాయంలోనే ఎంత కష్టం

**కరీంనగర్, న్యూస్‌టుడే:** ఆ ఇంటికి మహాలక్ష్మి పుట్టిందని అందరూ సంతోషించారు.. ముద్దు ముద్దు మాటలు, బుడి బుడి నడకలతో ఇళ్లంతా సందడి చేస్తుంటే మురిసిపోయారు.. వారి ఆనందం ఎంతో కాలం నిలవలేదు.. చిరు ప్రాయంలోనే తమ బిడ్డ మహమ్మారి వ్యాధి బారిన పడిందని తెలియగానే ఆ దంపతులు కుంగిపోయారు.. పేదరికం అడ్డొస్తున్నా పాపను కాపాడుకొనేందుకు అందినకాడల్లా అప్పు చేసి ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. . ఏడాదిన్నరగా చికిత్సలు ఎన్ని చేస్తున్నా వ్యాధి నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం అందించడానికి దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. జగిత్యాల మండల లక్ష్మీపూర్‌కు చెందిన సాదుల వెంకన్న, విజయ దంపతులకు కుమారుడు, కూతురు. గ్రామంలో చిన్న హోటల్ నిర్వహిస్తూ వెంకన్న కుటుంబాన్ని పోషిస్తున్నారు. కాగా ఈ దంపతుల కూతురు విష్ణుప్రియ(3)కు 18 నెలల వయసులో తీవ్ర జ్వరం వచ్చింది. ఎంతకూ తగ్గకపోవడంతో జగిత్యాల, కరీంనగర్‌లలోని ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స చేయించారు. రక్త పరీక్షలు నిర్వహించగా విష్ణుప్రియ బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. తొలి దశలో ఉన్నందున మందులతో నయమవుతుందని వైద్యులు సూచించడంతో ప్రతి నెలా పరీక్షలు చేయిస్తూ వస్తున్నారు. ఇలా ఏడాదిన్నర కాలంలో ఇప్పటివరకు రూ.3 లక్షల వరకు వెచ్చించారు. వ్యాధి పూర్తిగా నయం కావాలంటే మరో రూ.2 లక్షలు అవసరమని వెంకన్న, విజయ దంపతులు తెలిపారు.



విష్ణుప్రియ

# జగన్నాథుడు చెప్పిన పూరి గొప్పతనం

భారతదేశంలో అడుగడుగునా ఎన్నెన్నో గొప్పగొప్ప పవిత్ర ప్రదేశాలున్నాయి. వాటన్నింటిలో భగవంతుడు కొలువుదీరి ఉన్నాడని, ఆ క్షేత్ర సందర్శనంతోనే ముక్తి పొందవచ్చని తెలిపే కథలు పురాణాల్లో అనేకం కనిపిస్తాయి. ఇలాంటి వాటిలో పురుషోత్తమక్షేత్రం (పూరి) ఒకటి. ఇక్కడ ఉండే జగన్నాథుడు సకల సృష్టికి మూలపురుషుడైన ఆ వైకుంతవాసుడేనని పురాణాలు పేర్కొంటున్నాయి. జగన్నాథుడు నిరంతరం కొలువుదీరి ఉండే ఈ పురుషోత్తమక్షేత్రం ముక్తిప్రదమని స్కందపురాణం ద్వితీయ వైష్ణవ ఖండం మొదటి అధ్యాయం పేర్కొంటోంది. ఈ క్షేత్ర మాహాత్మ్యాన్ని ఆ జగన్నాథుడే బ్రహ్మదేవుడికి స్వయంగా వివరించాడు. ఎన్నిసార్లు ప్రళయాలు వచ్చినా ఆ ప్రళయాలలో అంతమైపోకుండా పురుషోత్తమక్షేత్రం నిలిచి ఉంటుందని దానికి కారణం తానక్కడ ఉండడమేనని శ్రీమహావిష్ణువు బ్రహ్మకు చెప్పాడు. అంతేకాక పురుషోత్తమక్షేత్రంలో ఏ జీవి మరణించినా ముక్తిని పొందుతుందని అన్నాడు. అంతటి పవిత్రత ఆ క్షేత్రానికి ఉందని బ్రహ్మకు పురుషోత్తమ క్షేత్రంలోనే విష్ణువు వివరించాడు.


పూరి క్షేత్రం

### యముడికి సందేహం

ఆనాడు బ్రహ్మదేవుడితోపాటు యముడు కూడా అక్కడ ఉండటంతో జగన్నాథుడు చెప్పిన విషయాలను యముడు చెవి ఒగ్గి ఆలకించాడు. ఇంతలో ఓ కాకి ఎక్కడి నుంచో వచ్చి ఆ పురుషోత్తమక్షేత్రంలో కిందపడి బాగా దెబ్బలు తగిలి విలవిలా తన్నుకుని ప్రాణాలు విడవబోయింది. అల్పజీవి అయిన ఆ కాకి పురుషోత్తమ క్షేత్రంలో ప్రాణాలు విడిచే స్థితి రావడంతో దానికి కూడా ఆ జగన్నాథుడు ప్రత్యక్షమై ముక్తిని ప్రసాదించాడు. బ్రహ్మ, యములు ఆ పరిస్థితికి విస్తుబోయి చూస్తుండగా అదే తన క్షేత్ర మాహాత్మ్యమని, తన దర్శనంతోనే ఎలాంటి వారికైనా ముక్తి కలిగించాలన్నది తన లక్ష్యమని జగన్నాథుడు చెప్పాడు. గొప్పగొప్ప యజ్ఞాలు, యాగాలు, క్రతువులు ఏవీ చేయకపోయినా పురుషోత్తమక్షేత్రంలో ఒక్కసారి తనను దర్శించుకుని ఒక్కరోజు అక్కడ ఉండగలిగితే ముక్తికి అర్హత లభించినట్లే అవుతుందని పురుషోత్తముడు బ్రహ్మకు వివరించి చెప్పి అంతర్థానమయ్యాడు. యముడికి అప్పుడు ఓ గొప్ప సందేహం కలిగింది. ఇక అలా అయితే తన శాసనం ఆ క్షేత్రంలో అమలు జరిగేదెలా అని బాధపడ్డాడు. వెంటనే జగన్నాథుడిని గురించి ఏకాగ్రతతో తపస్సు చేశాడు. అప్పుడు ఆయనకు వక్షస్థలం మీద లక్ష్మీదేవిని ధరించిన శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయ్యాడు. తన మనసులోని మాటను మళ్ళీ విన్నవించుకున్నాడు యముడు. అప్పుడు శ్రీమహావిష్ణువు ఆ క్షేత్ర మాహాత్మ్యాన్ని చెప్పమన్నట్లు సాలోచనంగా శ్రీలక్ష్మి వంక చూశాడు. ఆమె యముడికి పురుషోత్తమ క్షేత్ర విశిష్టతను వివరించింది. ఆ క్షేత్రంలో యముడి శాసనం చెల్లదని, శ్రీమహావిష్ణువుకు పురుషోత్తమక్షేత్రం ఎంతో ప్రీతికరమై ఉండడమే అందుకు కారణమని చెప్పింది. ఆ క్షేత్రం ఎన్ని ప్రళయాలు వచ్చినా అలాగే నిలిచి ఉంటుందని చెప్పడానికి చిరంజీవి అయిన మార్కండేయ మహర్షి ఒక ఉదాహరణ అంటూ ఆమె మార్కండేయుడికి సంబంధించి పూర్వం జరిగిన ఓ విషయాన్ని వివరించింది.

### మార్కండేయ వృత్తాంతం

ఇంతకుముందు ఒకసారి ప్రళయకాలంలో సృష్టి అంతా నశించిన తర్వాత చుట్టూ సముద్ర జలం మాత్రమే ఉందని, ఆ మధ్యలో ఒక మహా వటవృక్షం, దాని ఆకుల మీద వటపత్రశాయి అయిన శ్రీమహావిష్ణువు ఉన్నాడని తెలిపింది. విష్ణువు అజ్ఞ మేరకు మార్కండేయుడు వటపత్రశాయి నోటిలోకి ప్రవేశించి ఆ లోపల సర్వలోకాలను వీక్షించి మళ్ళీ పైకి వచ్చాడు. అలా రాగానే ఆయనకు శంఖచక్రగదాధారి అయిన శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చాడు. చుట్టూ చూస్తే అంతకు ముందు ఉన్న నీటిలో మునిగిన భూమికాక పురుషోత్తమక్షేత్రం కనిపించిందని లక్ష్మి యముడికి చెప్పింది. అంటే ఎప్పటికీ నాశనం కానిది ఆ క్షేత్రమని అప్పుడు మార్కండేయ రుషికి అవగతమైందని ఆమె చెప్పింది. అలాంటి నాశరహితమైనది, శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనది కావటం చేతనే పురుషోత్తమక్షేత్రంలో కాకిలాంటి అల్పజీవులు కూడా ముక్తికి అర్హతను పొందుతున్నాయని లక్ష్మీదేవి వివరించి చెప్పింది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## తలదూర్చటం

కలగచేసుకోవటం, జోక్యం చేసుకోవటం అనేవి ఈ జాతీయానికున్న అర్థాలు. తల అంటే ఆలోచన అని అర్థం. విషయం జరుగుతున్నప్పుడు ఆ విషయాన్ని పరిష్కరించేందుకు ఆ సందర్భంలో బయటి వ్యక్తి తన ఆలోచనలను చెప్పి అలా చేస్తే బాగుంటుందని అనటం తల దూర్చటానికున్న ప్రధాన లక్షణం. ఇక్కడ భౌతికంగా కాకపోయినా ఆలోచన రూపంలో సమస్య పరిష్కారానికి పూనుకోవటం అనే భావం ఈ జాతీయం ద్వారా స్ఫురిస్తుంది.

## ఊంజల్ సేవోత్సవం


అలంకరణలో అమ్మవారు

**యాదగిరిగుట్ట, నల్గొండ జిల్లా, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభువులకు సువర్ణ పుష్పాలతో అర్చన... అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, ఊంజలి సేవ పర్వాలను శాస్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాతం చేపట్టిన ఆచార్యులు వేదమంత్ర పఠనాల మధ్య మూలవర్యులను అభిషేకించి, తులసీదళాలతో అర్చన చేపట్టారు. మహామండపంలో భక్తుల ఆర్జిత పూజల్లో భాగంగా సువర్ణ పుష్పార్చన, కుంకుమార్చన, అష్టోత్తరం జరిపారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణోత్సవాన్ని సంప్రదాయంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్ది పల్లకిపై అధిష్ఠింపజేసి ఊంజలి సేవోత్సవాన్ని నిర్వహించారు. శ్రీగోదాదేవిని అండాలు మాతగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాలు, మంత్ర పఠనాలతో కొనసాగిన ఈ పర్వంలో భక్తులు అధికంగా పాల్గొన్నారు. మహిళా భక్తులు హారతులతో స్వాగతం పలికారు. కీర్తనలు, వేద పఠనాలతో ఊంజలి సేవ కొనసాగింది. సేవ విశిష్టతను ఆచార్యులు భక్తులకు వివరించారు. రాత్రి గర్భాలయంలోని మూలవర్యులకు ఆరాధన చేపట్టారు.

## పోటెత్తిన భక్తులు పులకించిన రామతీర్థం

**నెల్లూరు, న్యూస్‌టుడే:** జిల్లాలోని రామతీర్థం భక్తులతో పోటెత్తింది. రామలింగేశ్వరుడి బ్రహోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఇష్టదైవాన్ని తిలకించేందుకు పిల్లాపాపలతో కదిలివచ్చారు. గ్రామాల నుంచి తండోపతండాలుగా వచ్చారు. ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి బండ్లు, ట్రాక్టర్లు తదితర వాహనాల్లో వచ్చిన వారితో ఈప్రాంతం జనతరంగమైంది. ఒక వైపు సముద్ర కెరటాల హోరు.. మరోవైపు భక్తుల కోలాహలంతో రామతీర్థం పులకించిపోయింది. రామతీర్థం(విడవలూరు), న్యూస్‌టుడే: శ్రీ రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు భక్తులకోసం చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. రాత్రి జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆయన ఉదయం తీర్థవాది (సముద్ర స్నానానికి) కూడా హాజరయ్యారు. దేవాలయం, గ్రామంలోని దుకాణాల వద్ద తిరిగి భక్తుల సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి ఏర్పాట్లుచేశారు. దర్శనం కాని చిన్నపిల్లలు, మహిళలకు స్వామి వారి దర్శనం చేయించారు. పారిశుద్ధ్య ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి సర్పంచి చిమటా వెంకటేశ్వర్లుకు సూచనలిచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లలో నిర్వహణ గురించి ఎస్సై చిన బలరామయ్య తో సమీక్షించి దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధుల్లో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తెలుగుయువత జిల్లా అధ్యక్షులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, జడ్పీటీసీ చిమటా రమాదేవి, సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు, కొప్పర్తి హరనాధ్, సన్నపరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, సూరిశెట్టి శ్రీనివాసులు, విడవలూరు మండల నాయకులు, రామతీర్థం మత్స్యకారనాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో ఉన్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన తీర్థవాదికి వచ్చే భక్తుల సౌకర్యాల నిమిత్తం బీఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అవసరమైన మంచినీరు, మజ్జిగ ఉచితంగా అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

## దేవాదాయశాఖ పరిధిలోకి బలుసులమ్మ ఆలయం

**తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం బలుసులమ్మవారి దేవాలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. ఈ విషయాన్ని ఆ శాఖ గూడెం డివిజన్ తనిఖీదారు కె.వి.రమణ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈమేరకు దేవదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ వేములపూడి సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆలయంలోని బంగారు, వెండి, ఆభరణాలు, ఇత్తడి, ఇనుము, కర్రసామగ్రి, విద్యుత్తు సామగ్రి ఆలయంలోని ఆశాదుల నుంచి ఆలయ ఉత్సవ కమిటీ సమక్షంలో తనిఖీదారు రమణ స్వీకరించారు. శుక్రవారం అమ్మవారికి కుంకుమ పూజలు, నిత్య పూజలు చేశారు. దాత గంధం బేబీస రోజిని కుమారుడు మణికంఠ పేరుతో శుక్రవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యనిర్వాహణాధికారులు వై.శ్రీధర్, ఎన్.ఎస్.ఎస్.వి.లక్ష్మణకుమార్, మేనేజరు పి.అబ్బులు, సిబ్బంది బండి బలుసులు రావు, తమ్మిరెడ్డి హరిబాబు, ఎం.జయరాం, ఎన్.సత్యనారాయణ కార్యక్రమ నిర్వాహణకు కృషి చేశారు. ఇకపై ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో, పర్వదినాల్లో కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తనిఖీదారు రమణ వెల్లడించారు. కార్యక్రమాలను పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఆలయానికి సమర్పించే విరాళాలు, వస్తు సామగ్రి నిమిత్తం సిబ్బంది నుంచి దాతలు రసీదు పొందాలని కోరారు.



## సినారెకు ఆటా జీవిత సాఫల్య పురస్కారం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ఉత్తర అమెరికాలోని అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఆటా) సంస్థ 13వ మహోత్సవాల సందర్భంగా జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డికి జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. మహోత్సవాలు జులై 3, 4, 5 తేదీల్లో అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జరుగుతాయి. సినారె అమెరికా వెళ్లలేకపోవడంతో ఫిలింనగర్‌లోని ఆయన స్వగృహంలో జులై 5న ఆటా తరఫున పురస్కారాన్ని, లక్ష రూపాయల చెక్కును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కేవీ రమణాచారి ఆయనకు అందజేస్తారు. ఈ దృశ్యాన్ని అమెరికాలోని ఆటా సభలలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తారని ఆటా అధ్యక్షులు కరుణాకర్ మాధవరం పక్షాన ఆయన ప్రతినిధిగా వంశీ సంస్థల వ్యవస్థాపకుడు రామరాజు వెల్లడించారు. ఆయన ఆటా వారి ఆహ్వాన పత్రాన్ని సినారెకి అందజేశారు.

## అప్పన్నస్వామికి అష్టదీపారాధన

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** భక్తకోటి పరంధాముడు సింహాద్రి అప్పన్నకు వేకువజామున అష్టదీపారాధన సంప్రదాయబద్ధంగా జరిగింది. స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి విశేష ఆరాధనలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భోగమండపంలోని గోవిందరాజస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. నాదస్వర మంగళవాయిద్యాలు మోగుతుండగా స్వామిని ఆస్థానమండపంలో అధిష్ఠింపజేశారు. వేదమంత్రాల నడుమ ఉత్సవమూర్తులు నిత్యకల్యాణం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం సింహాద్రినాథుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థానమండపంలో పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఎండీ శ్రీనివాసరెడ్డి సింహగిరిపై పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సమాచార కేంద్రం భవనం పనులను పరిశీలించారు.


పుష్పాలంకరణలో అప్పన్నస్వామి ఉత్సవమూర్తులు

# జగన్నాథ సోదరి సుభద్ర

పురుషోత్తమపురిలో జగన్నాథుడి పక్కన కనిపించే సుభద్ర ఎవరనే అంశం గురించి సామాన్య ప్రజల్లో కొంత అవగాహన రాహిత్యం కనిపిస్తుంది. కానీ ఈ విషయమై పురాణాలను, సంప్రదాయ సాహిత్యాన్ని పూర్తిగా పరిశోధించిన పండితులు, జగన్నాథ స్వామి ఆలయ విశేషాలు తెలిసిన పండితులు సుభద్రమ్మ ఎవరో తేల్చి చెబుతున్నారు. అవగాహన లేక కొంతమంది అక్కడక్కడ కనిపించే నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే సుభద్రా ప్రాణనాథాయ జగన్నాథయ మంగళం అనే శ్లోకం తరచూ చదువుతుంటారు. ఈ శ్లోకంలో సుభద్రా ప్రాణనాథాయ అనే పాదాన్ని తీసుకుని జగన్నాథస్వామి శ్రీకృష్ణుడి అవతారమే కనుక కృష్ణుడి ఎనిమిది మంది భార్యలలో ఉన్న భద్ర అనే ఆమె ఈ సుభద్ర అని అనుకోవడం కనిపిస్తుంది. మరికొంతమంది కృష్ణుడి సోదరి అర్జునుడిని వివాహమాడిన సుభద్రే మరుసటి అవతారంలో కృష్ణుడిని పతిగా పొందిందనే భావనలో కూడా ఉంటారు. అసలీ భేదాభిప్రాయాలన్నింటికీ మూలకారణమైనది సుభద్రాప్రాణనాథాయ అనే శ్లోకపాదమే కానీ ఈ భావనలేవీ సరైనవి కావని, అసలా శ్లోక పాదం కూడా సరైనది కాదని పూరీ జగన్నాథాలయంలో అర్చకస్వాములు చదివే శ్లోకం వల్ల స్పష్టంగా తెలుసుకోవచ్చని పరిశోధకులు, పండితులు చెబుతున్నారు.

### నాటి యోగమాయే..

ఆలయంలో స్వామి దగ్గర నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే సుభద్రా బలభద్రాభ్యామ్ జగన్నాథాయ మంగళమ్ అనే శ్లోకాన్ని చదువుతారు. ఈ శ్లోకంలో మూడో పాదం సుభద్రా బలభద్రాభ్యామ్ అని ఉంది. దీనివల్ల సుభద్ర అంటే కృష్ణుడి భార్య కాదని అవగతమవుతుంది. అయితే మరి ఆమె ఎవరు అని అంటే అందుకు సమాధానం కోసం శ్రీకృష్ణుడి బాల్య విశేషాల దగ్గరకు వెళ్లాల్సి ఉంటుంది. దేవకీ గర్భంలో పెరుగుతూ



ఉన్న బలరాముడిని రోహిణీదేవి గర్భంలోకి మార్చిందీ, అలాగే యశోదమ్మ దగ్గరకు చేరేలా చేసిందీ ఆనాడు యోగమాయ. ఆమెనే కంసుడు పైకి ఎగరేసి చంపడానికి ప్రయత్నం చేశాడు. ఆ యోగమాయాదేవికీ భద్ర, సుభద్ర, భద్రకాళి లాంటి ద్వాదశ నామాలున్నాయి. వీటన్నింటినీ పరిశీలిస్తే యోగమాయాదేవే సుభద్రాదేవి అని, జగన్నాథస్వామి, బలరాముడితోను రథాల మీద ఊరేగేది ఆమేనని నిర్ధారణ అవుతుంది. పూరీ క్షేత్రంలో సకల లోకనాథుడైన ఆ జగన్నాథుడు, ఆదిశేషుడి అంశావతారమైన బలరాముడు, యోగమాయాదేవి అయిన సుభద్రలు ఊరేగే దృశ్యం చూసిన వారికి సర్వపాపాలు నశిస్తాయని ఆస్తిక లోకంలో ఓ గట్టి విశ్వాసముంది. జగన్నాథస్వామి, సుభద్ర, బలరాముల విగ్రహాల అవతరణ విషయంలో బ్రహ్మపురాణం, స్కంధపురాణం లాంటి వాటిలో ప్రత్యేక కథాసందర్భాలు కనిపిస్తాయి. పురుషోత్తమక్షేత్ర మాహాత్మ్యం అనే పేరున ఉన్న ఈ కథాంశాలలో పూర్వం ఇంద్రాది దేవతల పూజలను సైతం జగన్నాథుడు అందుకున్నాడని చెప్పడం కనిపిస్తుంది. ఎక్కడైనా ఒకచోట కొద్దిపాటి పాఠాంతరాలున్నా భూమి మీద పురుషోత్తమక్షేత్రంలో ఆ స్వామి వేంచేసి ఉండడానికి ప్రధాన కారకుడు ఇంద్రద్యుమ్న మహారాజేనని అన్ని పురాణాలు పేర్కొంటున్నాయి. రాజ్యాన్ని ఒక రాజు ఎంత చక్కగా పరిపాలించాలి, రాజు ఎలా ఉండాలి, ప్రజలను సన్మార్గంలో ఎలా నడపాలి అనే విషయాలకు ఇంద్రద్యుమ్నుడి చరిత్ర ఓ ఉదాహరణగా కనిపిస్తుంది. అలాంటి ప్రజాపాలకులను నేటివారు ఆదర్శంగా తీసుకుని దేశాన్ని సుఖశాంతులతో నింపాలన్నది మన ఆర్షవాణి లక్ష్యం.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## అడ్డుగోడ

ఆటంకంగా నిలవటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. ఒక వ్యక్తి మరో వ్యక్తి అభివృద్ధికి కానీ, అభీష్టానికి కానీ ఆటంకం కలిగిస్తూ ఇబ్బంది పెడుతుండే సందర్భాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. కంటి చూపు మేర చూడటానికి గానీ, చక్కగా నడిచి వెళ్లడానికి కానీ వీలున్న సందర్భంలో ఎవరైనా మధ్యలో అడ్డంగా గోడ కడితే ఇటువారు అటు వెళ్లటం కానీ, చూడటం కానీ వీలుకాదు. హాయిగా గడిచిపోవాల్సిన పనులు నిలిచిపోతాయి. ఈ భావన ఆధారంగానే ఈ జాతీయం ఆవిర్భవించింది. అతడు తన దుర్మార్గ ప్రవర్తనతో మన అభివృద్ధికి అడ్డుగోడగా నిలుస్తున్నాడు అనేలాంటి సందర్భాలలో ఈ జాతీయాన్ని గమనించవచ్చు.

# గుట్టలో సేవోత్సవాలు



ఆలయ సన్నిధిలో సేవోత్సవం

**నల్గొండ, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అలంకార తిరువీధి సేవోత్సవాలు సంప్రదాయంగా నిర్వహించారు. ఆషాఢమాసం మొదలు కావడంతో దేవాలయ సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ తగ్గి తిరువీధులు బోసిపోయి కన్పించాయి. ఈ మాసంలో భక్తుల రాక గణనీయంగా తగ్గుతుంది. తొలి రోజే భక్తులు తగ్గుముఖం పట్టడంతో ఆలయ వీధులే గాకుండా మండపాలలో సందడి సద్దుమణిగింది. నిత్యపూజలు యథావిధిగా కొనసాగుతాయని భక్తుల రద్దీ మాత్రం తగ్గుతుందని ఆచార్యులు తెలిపారు. నిత్యపూజల్లో భాగంగా శ్రీస్వామికి అభిషేక, అర్చనలు నిర్వహించిన పూజారులు నిత్యకల్యాణోత్సవ పర్వాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అలంకరించిన సేవోత్సవాలను సాయంత్రం తిరువీధులలో ఊరేగించారు. కొండపైనే గల శివాలయంలో పరమేశ్వరునికి అభిషేక, అర్చనలు చేపట్టిన పూజారులు నవగ్రహాలకు తైలాభిషేకం నిర్వహించారు. వేదమంత్రపఠనాల మధ్య శివార్చనలు కొనసాగాయి. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఖజానాలో శనివారం వివిధ విభాగాల ద్వారా రూ. 7,50,246 నిత్యరాబడి పద్దు ద్వారా జమయ్యాయని దేవస్థానం ఈవో కృష్ణవేణి తెలిపారు. ప్రధాన పూజలతో రూ. 72,464, ప్రత్యేక దర్శనాలతో రూ. 81,175, వ్రతాలతో రూ. 77,500, కల్యాణకట్ట ద్వారా రూ. 13,000, ప్రసాదాల విక్రయంతో రూ. 3,03,450 సమకూరాయని వివరించారు.





# నయనానందం... సప్త నృత్య మంజరి

హైదరాబాద్‌లో భారత సంప్రదాయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, కథాకళి, కథక్, ఒడిస్సీ, మోహినియాట్టం, కేరళ నటనం కళాప్రియులకు నయనానందాన్ని పంచాయి. శ్రీ సాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డాన్స్ ఆధ్వర్యంలో రమాదేవి నేతృత్వంలో ప్రదర్శించారు. జయదేవుని అష్టపదిని ఇందుకు ఎంచుకున్నారు. – హైదరాబాద్, న్యూస్‌టుడే

# సామాజిక చైతన్యం కలిగించిన నాటికలు

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ 30వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ సూర్యకళామందిరం ప్రాంగణంలో 16వ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదర్శించిన నాటికలు ఆలోచింపజేసేలా సాగాయి. తొలుత రైతులు ఎలా దోపిడికి గురవుతున్నారో తెలియజేసే మాకంటూ ఓరోజు నాటికను లిఖితసాయిశ్రీ క్రియేషన్స్ గోవాడ వారు ప్రదర్శించారు. అనంతరం రాత్రి 8.30 శ్రీసాయి ఆర్ట్స్ కోలకలూరు వారిచే శ్రీకారం నాటిక ప్రదర్శించారు. ప్రేమిస్తే తప్పులేదని ఎవరైనా ప్రేమించి పెళ్లి చేసుకోదలిస్తే భయపడకుండా ఆ విషయాన్ని పెద్దలకు చెప్పి ఒప్పించి, పెళ్లి చేసుకోవాలన్న ఇతివృత్తంతో ఇది కొనసాగింది.

# బుద్ధి వికాసానికి అధిపతి గణపతి

**కరీంనగర్ , న్యూస్‌టుడే:** 33 కోట్ల దేవతల్లో విఘ్నాలను తొలగించే ఆదిదేవునిగా గణపతి పూజించబడుతున్నారని... విద్యార్థులు నిత్యం తల్లిదండ్రులను గౌరవించి, గణపతిని పూజిస్తే బద్ధి వికసిస్తుందని జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతీ తీర్థ స్వామీజి అన్నారు. చైత్యపురిలోని మహాశక్తి ఆలయం చతుర్థి వార్షికోత్స వేడుకల్లో భాగంగా ఆలయంలో విద్యార్థులతో స్వయంగా గణపతికి క్షీరాభిషేకం చేయించి విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. ఉదయం ఆలయంలోని అనంతనాగేంద్రస్వామికి ఫలపంచామృత అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగమారుతి శర్మ ముగ్గురమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీజీ ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిని, వేలు పట్టుకుని తప్పటడుగులు నేర్పిన తండ్రికి ఉదయాన్నే పాదాభివందనం చేయాలన్నారు. చెడుదారులు తొక్కకుండా చిరుప్రాయం నుంచే భక్తిని అలవరుచుకోవాలన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న విద్యారణ్య భారతి స్వామీజీ

# కనులపండువగా జగన్నాథుని కల్యాణోత్సవం



పూజలందుకుంటున్న జగన్నాథుడు, సుభద్ర, బలబద్రుడు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** టౌన్ కొత్తరోడ్డు ప్రాంతంలో కొలువైవున్న శ్రీజగన్నాథస్వామి రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయంలో స్వామివారి కల్యాణవేడుక కనులపండువగా జరిగింది. ఉదయం పూర్ణాహుతి, నేత్రోత్సవం, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలు అర్చకులు సంప్రదాయపద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం 6.12 నిమిషాలకు ప్రారంభమైన కల్యాణోత్సంలో జగన్నాథ, సుభద్ర, బలబద్రస్వామి విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. లోక కల్యాణార్థం జరుగుతున్న జగన్నాథ, సుభద్రాదేవి శాంతి కల్యాణ వేడుకను చూడటానికి స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం వేడుకలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఈఓ అల్లు జగన్నాథరావు మాట్లాడుతూ రథోత్సవం ఆదివారం సాయంత్రం 4గంటలకు ప్రారంభమవుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# అదృష్టప్రదం సద్గురువు అనుగ్రహం

ప్రతి మనిషీ తన జీవితం సుఖవంతం కావటానికి సద్గురువును ఆశ్రయించాలి. అలా గురువు అనుగ్రహం పొందగలిగినప్పుడే జీవితం విజయవంతమవుతుంది. జన్మ సార్థకత కూడా అప్పుడే లభిస్తుంది. ఎందుకంటే గురువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపుడు. త్రిమూర్తులు ఒక్కటై అనుగ్రహిస్తే ఇక అంతకంటే ఎవరికీ కావాల్సిన అదృష్టం ఉండదు. భారతీయ సనాతన సంప్రదాయంలో గురువును ఆశ్రయించాలి అని శాస్త్రాలు, పురాణాలు నిరంతరం చెబుతూ ఉండేది ఈ కారణం చేతనే. అలాంటి సద్గురువు పూర్వం ఓ రాజుకు దొరికాడు. ఆ తర్వాత ఆ రాజు జీవితమంతా ఎంతో గొప్పగా మారిపోయింది. ఆ గురుశిష్యులే దత్తాత్రేయుడు, కార్తవీర్యార్జునుడు. గురుశిష్యుల కథ మార్కండేయ పురాణం పదిహేడో అధ్యాయంలోని దత్తాత్రేయ మాహాత్మ్యంలో కనిపిస్తుంది. పూర్వం కార్తవీర్యార్జునుడు అనే మహారాజు ఉండేవాడు. ఆయనకు శత్రుపీడ అధికంగా ఉండేది. ఆ శత్రుపీడను వదిలించుకోవటానికి, తన జీవితం సుఖంగా గడవటానికి మార్గం ఏమిటా అని చాలాకాలంపాటు రాజు ఆలోచించాడు. అయినా ఆయనకు ఏ మార్గమూ కనిపించలేదు. చివరకు ఓ రోజున తన సమస్యను గర్గమహామునిని పిలిచి తనకేదైనా దోవ చూపించమన్నాడు రాజు. గర్గమహాముని క్షణకాలంపాటు ఆలోచించి దత్తాత్రేయ స్వామిని గురువుగా ఎంచుకోమని ఆ గురువు అనుగ్రహం ఉంటే సమస్యలన్నీ వాటంతట అవే పరిష్కారమవుతాయని అన్నాడు. అయితే దత్తాత్రేయుడు అంత త్వరగా రాజును శిష్యుడుగా చేసుకోకపోవచ్చని, ఆయన పెట్టే పరీక్షలన్నీ నెగ్గితేనే ఆ గురువు అనుగ్రహం లభిస్తుందని చెప్పాడు గర్గముని.



## పట్టుదల, దృఢసంకల్పం

కార్తవీర్యార్జునుడిలో సమస్యను అధిగమించాలన్న పట్టుదల, గురువు అనుగ్రహం పొందాలన్న దృఢ సంకల్పం బాగా పెరిగాయి. గర్గముని చెప్పిన ఆనవాళ్లను పట్టుకొని దత్తాత్రేయుడుండే ఆశ్రమం దగ్గరకు వెళ్లాడు. గురువును దర్శించి తన సమస్యలను చెప్పి శిష్యుడిగా చేర్చుకొమ్మని కోరాడు. కానీ దత్తుడు అందుకు సమ్మతించలేదు. తనకంత శక్తిలేదని, శక్తిసంపన్నులైనవారు చాలాచోట్ల చాలామంది ఉంటారు వారి దగ్గరకు వెళ్లమని అన్నాడు. రాజు నిరుత్సాహపడకుండా దత్తాశ్రమం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. ఆశ్రమంలో దత్తుడిని ఎన్నిసార్లు కలిసినా మొదట చెప్పిన సమాధానమే వస్తూ ఉండేది. మరికొంత కాలం పోయాక దత్తుడు తన దగ్గర అసలు గురువుకు ఉండాల్సిన లక్షణాలు లేవని, తన బలహీనతలన్నిటినీ గురించి రాజుకు చెప్పాడు. అయినా కార్తవీర్యార్జునుడు ఆ మాటలను పట్టించుకోకుండా మళ్లీమళ్లీ ఆ స్వామి అనుగ్రహం కోసం ప్రాధేయపడుతూ స్వామీ నీవు నన్ను శిష్యుడిగా స్వీకరించి తీరాల్సిందేనని శరణాగతిని ప్రకటించాడు. దత్తుడు చెప్పిన దోషాలేవీ వాస్తవంగా దోషాలు కావని వివరించాడు.

అప్పుడు దత్తుడు కార్తవీర్యార్జునుడిలో ఉన్న పట్టుదలను గమనించి తన శిష్యుడిగా స్వీకరిస్తున్నట్టు చెప్పి వరాలను అనుగ్రహించాడు. ఆ అనుగ్రహం ప్రకారం కార్తవీర్యార్జునుడు గొప్ప అదృష్టవంతుడయ్యాడు. ధర్మం చెడకుండా రాజ్యపాలన చేసే బుద్ధి లభించింది. అనంత ఐశ్వర్యం ప్రాప్తించింది. యుద్ధరంగంలో శత్రువులను సంపూర్ణంగా నాశనం చేసే శక్తి దక్కింది. అంతేకాక వెయ్యి బాహువులు కూడా లభించాయి. ఆకాశం, జలం, భూమి, పర్వతాలు ఇలా ఎలాంటి ప్రదేశాలలోనైనా సరే అడ్డులేకుండా వేగంగా వెళ్లే గమనశక్తి సొంతమైంది. అంతేకాక కార్తవీర్యుడు అనే పేరు ఎవరు తలిస్తే వారికి కష్టనష్టాలు నశిస్తాయని ఈ వరాలన్నిటినీ తన శిష్యుడైన కార్తవీర్యార్జునుడికి అనుగ్రహిస్తున్నట్లు చెప్పాడు దత్తాత్రేయుడు.

## కష్టనష్టాల తర్వాతే

దత్తుడు చెప్పినట్లుగానే అన్ని వరాలు కార్తవీర్యార్జునుడికి సమకూరాయి. దేవతలు, సముద్రాలు, నదీదేవతలు, ఋషులు స్వయంగా కార్తవీర్యార్జునుడిని చక్రవర్తిగా అభిషేకించారు. ఆ చక్రవర్తి పేరు తలచుకుంటే చాలు దొంగలు, సర్పాలు, అగ్ని, శస్త్రాలు, శత్రువులు, జలం ఇలాంటి వాటి వల్ల కలిగే భయాలు, ప్రమాదాలు అన్నీ నశిస్తూ ఉండటంతో ఆయన రాజ్యంలో ప్రజలు సుఖంగా ఉన్నారు. ఇన్ని వరాలు ఇచ్చాడు కదాని ఆ శిష్యుడు గురువును ఎప్పటికీ మరిచిపోలేదు. గురుభక్తితో కృతజ్ఞతాపూర్వకంగా దత్తయజ్ఞాలు, యాగాలు, పూజలను తాను చేస్తూ తన రాజ్యంలోని ప్రజలందరిచేతా చేయిస్తూ ఉండేవాడు. ఈ కథాసందర్భంలో జీవితంలో సద్గురువు అనుగ్రహం దొరకటమే కష్టమని ఎన్నెన్నో పరీక్షలను ఎదుర్కొన్న తర్వాతే అనుగ్రహం లభిస్తుందని దానివల్ల కలిగే అదృష్టం అంతా ఇంతా కాదనే విషయం ప్రస్తావితమై ఉంది. గురువు అనుగ్రహాన్ని పొందే విషయంలో స్థిరబుద్ధితో ఉండాలి. దర్శనానికి వెళ్లి నమస్కరించిన మరుక్షణమే అనుగ్రహం లభించాలని అనుకోకూడదు. అనుగ్రహం లభించేదాకా కార్తవీర్యార్జునుడిలా పట్టుదల విడిచిపెట్టకుండా ఉండాలి అనే సందేశం కూడా ఇక్కడ కనిపిస్తుంది.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు



బోనాలతో మహిళలు

## అమ్మా బైలెల్లినాదో.. తల్లీ బైలెల్లినాదో!

**కరీంనగర్, న్యూస్‌టుడే:** డప్పు చప్పుళ్లు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, మంగళ హారతులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. బోయవాడ చౌరస్తా, కట్టారాంపూర్ నుంచి పెద్దఎత్తున బోనాలతో బయలుదేరిన ముదిరాజ్ కులస్థులు, మహిళలు, అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చారు. అక్కడి నుంచి భగత్‌నగర్ చౌరస్తా మీదుగా పెద్దమ్మతల్లి ఆలయం చేరుకొని అమ్మవారికి పసుపు, కుంకుమలతో వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మతల్లి బోనాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండగ్గా గుర్తించిన తరుణంలో పెద్దఎత్తున ఇంటికో బోనంతో బయల్దేరి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురవాలని పెద్దమ్మతల్లిని కోరుకున్నారు.

## ముఖం చిట్లించటం

మనిషి స్వభావం, హావభావ ప్రకటనల తీరు కూడా జాతీయాల ఆవిర్భావానికి వేదిక అయింది. మనసులో ఉన్న భావం శారీరకంగా ఉండే కదలికల వల్ల కూడా ప్రకటితమవుతూ ఉంటుంది. ఆనందం కలిగినప్పుడు కళ్లు విప్పారినట్టే కోపం కలిగినప్పుడు ముఖాన్ని చిట్లించినట్టు, కనుబొమ్మలు ముడిపడేటట్టు చేసి చూడటం అనేవి స్వాభావసిద్ధంగా జరుగుతుంటాయి. కోపాన్ని ప్రకటించే ముందు జరిగే ప్రక్రియే ముఖం చిట్లించటం.

## అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం

**కడప, న్యూస్‌టుడే:** వీరబల్లి జడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం తితిదే ఆధ్వర్యంలో శ్రీనివాసకల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. వేదమంత్రోచ్చారణల మధ్య, సంప్రదాయబద్ధంగా కల్యాణక్రతువును పూర్తి చేశారు. శ్రీనివాసుడి, శ్రీదేవి, భూదేవిల విగ్రహాలను కన్నులవైకుంఠంగా అలంకరించారు. అన్నమయ్య భజన మండలి, ఆస్థానమండలి కళాకారులు ప్రత్యేక కీర్తనలతో భక్తులకు వీనులవిందు చేశారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. వారం రోజులుగా శ్రీనివాసుని కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. తితిదే జేఈవో పోలా భాస్కర్, కడప జేసీ రామారావు, కల్యాణ ప్రాజెక్టు ఎస్.ఈ రామచంద్రారెడ్డి, ఓఎస్డీ రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జున రెడ్డి విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణ పెద్దగా జేఈవో పోలా భాస్కర్ దంపతులు నిలిచారు. అన్ని పార్టీల రాజకీయనాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తితిదే జేఈవో పోలా భాస్కర్ అన్నారు. తాను చదివిన ఉన్నత పాఠశాలలో, సొంత మండలంలో ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా తమకు కలిగిందన్నారు. రాజంపేట నియోజకవర్గంలోనే అతి మారుమూల మండలంలో శ్రీనివాసుడి కల్యాణం జరగడం ఆనందదాయకమని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు.



వేదమంత్రాల మధ్య కల్యాణక్రతువు

## మత్స్యావతారంలో జగన్నాథస్వామి

**ద్వారకాతిరుమల, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం శ్రీజగన్నాథస్వామి వారి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు మత్స్య అలంకారంలో భక్తులను కనువిందు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపాన్ని అలంకరించి దానిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి వేదపండితులు మత్స్యావతారంలో తీర్చిదిద్దారు. బ్రహ్మదేవుని వద్ద వేదాలను రాక్షసుడు అపహరిస్తాడు. దీంతో బ్రహ్మదేవుడు జగన్నాథస్వామి దగ్గరకు వెళ్లి మొరపెట్టుకోవడంతో స్వామివారు మత్స్యావతారంలో రాక్షసుడిని చంపి వేదాలను తీసుకొస్తాడు. ఈ నేపథ్యంలో స్వామివారు మత్స్యావతారమెత్తారని అర్చకులు తెలిపారు.



అలంకరణలో శ్రీజగన్నాథస్వామి

## తెలుగుభాషలోని గొప్పదనమే పద్యాలు

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు పద్యాన్ని రాగయుక్తంగా పలికి... ఆ అర్థాన్ని విద్యార్థులకు తెలిపితే వారి మనస్సులో నాటుకుపోతుందని, ఈనాటికి పద్యాలు, అవధానాలు ఆకట్టుకుంటున్నాయంటే తెలుగుభాషలోని గొప్పదనమేనని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం కాకినాడలోని సూర్యకళామందిరం ప్రాంగణంలో ఆస్వాదన సాహితీ సమితి, కాకినాడ ప్రాచీనాధునిక సంస్కృతాంధ్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో దివంగత డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు విరచిత అధ్యాపకులలో అమృతమూర్తులు గ్రంథావిష్కరణ నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన గావించి, ఉపసభాపతి చేతుల మీదుగా గ్రంథావిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పద్యంమీద తెలుగువారికి అనురక్తి ఉందన్నారు. మనదైన శైలిలో ఉపాధ్యాయులు తెలుగుభాషను బోధించడం ద్వారా ఆకట్టుకుంటున్నారన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తి కల్గించడానికి అధ్యాపకుల్లో అమృతమూర్తులున్నారని చెప్పారు. ఇటీవల గుంటూరులో తెలుగుభాషా అభివృద్ధి పునశ్చరణ తరగతులు ఏర్పాటు చేశారని. ప్రతి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. తెలుగుభాషా వికాసంతో సమాజాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఆయన తెలిపారు. అధ్యాపకుల్లో అమృతమూర్తులు కొండలను అద్దంలో చూపినట్లు ఈ పుస్తక రచన ఉందని, విద్యార్థులందరూ తప్పక చదవాల్సిన పుస్తకమన్నారు. కాకినాడ ఎంపీ తోట నరసింహం మాట్లాడుతూ కాకినాడ కళలకు పుట్టినిల్లని, ఆంధ్ర సాహిత్య పరిషత్ తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందన్నారు. అనంతరం కలెక్టర్ నీతూప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారు పరభాషా వ్యామోహంలో పడుతున్నారని, బాల్యదశలోనే మాతృభాష పట్ల అభిమానం చూపిస్తే భవిష్యత్తులో వారే భాషను ముందుకు తీసుకెళతారన్నారు. అనంతరం కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర సాహిత్య పరిషత్ తెలుగుభాషా వికాసానికి ఎంతో కృషి చేస్తోందని, వారి ఆశయాలను కాపాడటంలో తాను తోడుగా ఉంటానన్నారు. కాకినాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దంటు సూర్యారావు మాట్లాడుతూ ఆంధ్ర సాహిత్య పరిషత్ తెలుగుభాషా వికాసానికి కృషి చేయడంతోపాటు అనేక గ్రంథాలను ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దంటు భాస్కరరావు స్మారక జీవిత సాఫల్య సాహిత్య పురస్కారాన్ని ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు అందజేశారు. అనంతరం తెలుగుభాషా వికాసం-ఉపాధ్యాయుల పాత్ర పై బేతవోలుచే విద్యా సదస్సు నిర్వహించారు.



గ్రంథావిష్కరణ చేస్తున్న బుద్ధ ప్రసాద్, కలెక్టర్, తదితరులు

# ఎప్పుడూ ఒకేలా ఉండడం మేలు

కష్టాలొచ్చినప్పుడు కుంగిపోవడం, సుఖాలొచ్చినప్పుడు పొంగిపోవటం మంచిది కాదు. ఎప్పుడూ ఒకే స్థితిలో ఉండటమే మేలు. దీన్నే స్థితప్రజ్ఞత్వం అని అంటారు. భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు ప్రత్యేకంగా దీని గురించి వివరించి చెప్పాడు. చాలాసార్లు ఈ స్థితప్రజ్ఞ చాలామందిలో ఉండదు. ఓసారి దేవేంద్రుడు కూడా దీన్ని కోల్పోయాడు. అప్పుడు రాక్షస రాజైన బలిచక్రవర్తి దేవతలందరికీ రాజైన ఇంద్రుడికి జ్ఞానబోధ చేశాడు. ఈ జ్ఞానబోధలో కాలం మహిమ, జీవితంలో ఎలా ప్రవర్తించాలి అనే లాంటి విశేషాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయి.

## ధర్మపథం

ఈ కథాసందర్భాన్ని భీష్ముడు ధర్మరాజుకు తెలియచెప్పినట్లు మహాభారతం శాంతిపర్వం వివరిస్తోంది. ఒకసారి జరిగిన యుద్ధంలో అప్పటివరకు స్వర్గాన్ని పాలిస్తున్న బలిచక్రవర్తి దేవేంద్రుడి చేతిలో ఓడిపోయాడు. ఓడిన తర్వాత ఓ గాడిదగా రూపాన్ని మార్చుకొని ఎక్కడో మారుమూల గుహలో పొట్టు తింటూ కాలం గడపసాగాడు. విజయోత్సాహంతో ఉన్న ఇంద్రుడు బలిచక్రవర్తి ఎక్కడున్నాడో చూడాలని, అవమానించాలని, వీలైతే సంహరించాలని అనుకున్నాడు. తన మనసులోని మాటను బ్రహ్మదేవుడికి చెప్పాడు. బ్రహ్మ బలిచక్రవర్తికి అనేక మాయారూపాలను ధరించే శక్తి ఉందని ఒంటె, గోవు, గాడిద, గుర్రం ఇలాంటి వాటిలో ఏదో ఒక జంతువు రూపాన్ని పొంది ఎక్కడో ఒక చోట ఉంటాడని వెతకమని చెప్పాడు. అప్పుడు ఇంద్రుడు బలిచక్రవర్తి కనిపిస్తే సంహరించాలా? వద్దా? అని అడిగాడు. బ్రహ్మదేవుడు అతడిని సంహరించవద్దని గాడిద రూపంలో ఉండి కూడా గొప్ప జ్ఞానాన్ని బోధించగల ఉత్తమజ్ఞాని బలిచక్రవర్తి అని ఇంద్రుడికి చెప్పాడు.

### కాలస్వరూపం తెలియని పిల్లలు

ఇంద్రుడు బ్రహ్మ చేసిన సూచన ప్రకారం చాలాచోట్ల వెతికాడు. చివరకొక గుహలో పొట్టు తింటూ కనిపించాడు బలిచక్రవర్తి. అప్పుడు ఇంద్రుడు బలిని అవహేళన చేశాడు. ఇంతకు ముందువరకు గొప్ప సంపదలను అనుభవిస్తూ సుఖభోగాలలో మునిగి ఇప్పుడిలా దీనంగా నీచంగా జీవిస్తున్నందుకు సిగ్గుపడటం



లేదా అని అడిగాడు. ఎన్నెన్నో రాజలాంఛనాలు, బ్రహ్మదేవుడిచ్చిన దివ్యమాలలాంటివేవీ లేకుండా మందీమార్బలం లేకుండా ఎలా బతకగలుగుతున్నావని అడిగాడు. అప్పుడు బలి ఇలా సమాధానం ఇచ్చాడు. చిన్నపిల్లలు కాలస్వరూపాన్ని తెలుసుకోలేరు. అలా అమాయకంగా ఉండటం దేవరాజు స్థానంలో ఉన్న వ్యక్తికి తగదు. నిర్మల బుద్ధులు, జ్ఞానతృప్తులు, సహనశీలురు, బుద్ధిమంతులు అయిన సజ్జనులు దుఃఖం కలిగినప్పుడు శోకించరు. సంపద కలిగినప్పుడు పొంగిపోరు. అలాంటి సంస్కారాన్నే అందరూ అలవాటు చేసుకోవాలి.

### అన్నింటికీ కాలమే ప్రధానం

జీవితంలో జరిగే మార్పులన్నింటికీ కాలమే ప్రధాన కారణం. కాలం నిరంతరం మారుతూ ఉంటుంది. కాలం ఆధారంగా ఉండే ఈ లోకంలో అన్నీ అనిత్యాలే. ఈ విశ్వమంతా ఎప్పటికైనా నశించేదే. ప్రాణుల శరీరాలన్నీ ఎప్పటికో అప్పటికి నశించిపోతాయి. జీవితమూ, శరీరమూ పుట్టుకతోనే వస్తాయి. రెండూ కలిసే పెరుగుతాయి. కలిసే నశిస్తాయి. నదులకు చివరి గతి సముద్రం. ప్రాణులకు చివరి గతి మరణం. ఇది కళ్లెదుట కనిపిస్తున్నా చాలామంది ఈ సత్యాన్ని పట్టించుకోకుండా మోహంలో పడిపోతుంటారు. రజోబుద్ధికి, మోహానికి లోనైనవారు ఈ విషయాన్ని గ్రహించలేరు. బుద్ధి నశించినవారు మాత్రమే కష్టాలు కలిగినప్పుడు దుఃఖిస్తూ కూర్చుంటారు. కానీ బుద్ధిమంతులలా కాదు. తన సమయాన్ని సద్వినియోగం చేసుకొని పాపాలన్నింటినీ పోగొట్టుకుంటారు. ఆ తర్వాత సాత్వికుడుగా మారిపోతారు.

### అంతా అశాశ్వతం

ఈ సృష్టిలో కనిపించేదంతా అశాశ్వతం. ఆ విషయాన్ని బాగా తెలుసుకున్న వారెవరైనా సరే బాధపడరు. కాలం ముందుగా దహిస్తుంది. ఆ తర్వాతే దాన్ని అగ్ని దహిస్తుంది. ఇలా ఏ వస్తువునైనా సరే ముందు నాశనం చేసేది కాలమే. ఆ తర్వాతే అగ్ని కానీ మరేవైనా కానీ నాశనం చేస్తుంటాయి. కాలం తీరినవాడే మరణిస్తాడు. ఏదైనా సరే కాలం నిర్ణయించినప్పుడే అది మనిషికి దక్కుతుంటుంది. సముద్రానికి అవతలి గట్టుందేమో కానీ కాలం అవతలి ఒడ్డులేని అనంతమైంది. అందుకే కాలానుగుణంగా జరుగుతున్న దేన్నీ ఎవరూ పరిహసించకూడదు. సిరిసంపదలు, విజయాలు ప్రాప్తించటం కాలనుగుణంగా జరిగేదే. సిరి మరీ చంచలమైంది. అది ఎప్పుడు ఎక్కడికి మారుతుందో ఎవరూ చెప్పలేం. కనుక కాలగమనంలో పేదలైన వారిని చూసి లేదా ఓడిపోయిన వారిని చూసి అవహేళన చేయటం పద్ధతి కానేకాదు. అని ఇంద్రుడికి బలిచక్రవర్తి కాలానికి సంబంధించిన జ్ఞానోపదేశాన్ని చేశాడు. ఈ ఉపదేశాన్ని ఏ కాలానికి చెందినవారైనా సరే అనుసరించవచ్చు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** లక్షలాది మంది భక్తులు వీక్షిస్తుండగా.. వేద మంత్రోచ్ఛరణల మధ్య.. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆశ్లేష నక్షత్రయుక్త శుభలగ్న సుముహూర్తాన బల్కంపేట రేణుకా ఎల్లమ్మ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సుమారు 5 లక్షల మంది భక్తులు ఈ వేడుకను వీక్షించి తరించారు. తెల్లవారుజాము 3 గంటల నుంచే ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్పొరేటర్ ఎన్.శేషకుమారి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. రఘునందన్‌రావు, సూపరెంటెండెంట్ శర్మ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది, స్థానిక బస్తీలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు భక్తులకు ఇబ్బంది కలుగకుండా స్వచ్ఛందంగా తమవంతు సేవలందించారు. అదనపు డీజీపీ నాగరాజు, ఏసీపీ వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డినగర్ ఇన్‌స్పెక్టర్ రమణగౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీస్



అలంకరణలో అమ్మవారు

బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎల్లమ్మ తల్లిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి టి.పద్మారావు, సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ, అచ్చంపేట ఎమ్మెల్యే బాల్‌రాజ్, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల తెరాస ఇన్‌ఛార్జిలు దండె విఠల్, బి.సతీష్‌రెడ్డి, దేవాదాయశాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు, తెరాస నగర నాయకులు బి.ఆర్.నారాయణరాజు, తెదేపా రాష్ట్ర నాయకులు హనుమంత్‌రావు, వి.కరుణాకర్‌రెడ్డి, తాళ్ల రవీందర్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన 63 కేజీల లడ్డూ ధర రూ. 2,81,500లు పలికింది. నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన అమ్మవారి భక్తురాలు కందారి రామలక్ష్మి, కుమారుడు నరేందర్, వేలంపాట ద్వారా ఈ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

తెలుగు వాణి

# పుష్పాలంకరణలో దాసాంజనేయస్వామి

**భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** మారుతీటాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారు కనకాంబరం పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి పండ్లరసాలతో అభిషేకాలు, సహస్ర సింధూర్చన, ఐదు వేల తమలపాకులతో పూజలు ఆలయ అర్చకుడు భాస్కరశర్మ నిర్వహించారు. రాత్రి సాయి భక్త సమాజం వారిచే 'స్వామివారి సంకీర్తన' నిర్వహించారు. స్వామివారిని కనకాబంరం, చామంతి పుష్పాలు, తమలపాకులతో అలంకరించారు. ఈవో ఎన్.సతీష్‌కుమార్, ఆలయ సిబ్బంది రఘు, రాము కార్యక్రమాలను పర్యవేక్షించారు.



# 8 నుంచి నెమలి ఆలయంలో కృష్ణమాల

**గంపలగూడెం, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాల స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈ ఏడాది నుంచి 'కృష్ణమాల' ప్రారంభిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో జులై 8, 9, 10 తేదీల్లో ఆసక్తి ఉన్న భక్తులచే కృష్ణమాల ధరింపజేస్తారు. మాల ధరించిన భక్తులు 40 రోజులపాటు కృష్ణుని సేవించి ఆగస్టు 18న నిర్వహించే కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో స్వామివారికి ముడి సమర్పించి దీక్ష విరమిస్తారు. కృష్ణమాల ధరించే భక్తులు దీక్షలో ఉండే 40 రోజులపాటు పసుపు రంగు వస్త్రాలు ధరించాల్సి ఉంటుందని ఆలయ సహాయ కమిషనరు ఎం.శారదాకుమారి తెలిపారు.



# వరాహావతారంలో జగన్నాథస్వామి

**ద్వారకాతిరుమల, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం శ్రీజన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం వరాహ అలంకారంలో భక్తులను కనువిందు చేశారు. హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు భూమిని అతలాకుతలం చేస్తుండడంతో భూదేవి జగన్నాథస్వామిని ప్రార్థిస్తారు. అప్పుడు స్వామివారు వరాహావతారంలో భూదేవిని కాపాడుతారు. ఈ నేపథ్యంలో స్వామి వరాహావతారం ఎత్తారని అవతార ప్రాశస్త్యాన్ని అర్చకులు మరోమారు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని తరించారు.



# లేనిబతుకు

నీచపుబతుకు. బాగా దరిద్రంలో బాధపడుతూ జీవించటం అనే లాంటి అర్థాల్లో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. లేనితనం. లేనివాళ్లు అనంటే పేదరికం, పేదవాళ్లు అనే అర్థాలున్నాయి. ఈ అర్థాలాధారంగా లేనిబతుకు అనే జాతీయం దారిద్ర్యాన్ని సూచించేదిగా కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

# సృజనకు ప్రోత్సాహం

## ఫొటోగ్రఫీలో నాగరాజుకు జాతీయ పురస్కారాలు

**గుంటూరు, న్యూస్‌టుడే :** ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ నిర్వహించిన డిజిటల్ ఫొటోగ్రఫీ పోటీల్లో బాపట్ల మండలం ముత్తాయపాలేనికి చెందిన ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజు రెండు జాతీయ పురస్కారాలను సాధించి సత్తా చాటారు. ప్రధాన పోటీల విభాగంలో ఆయన తీసిన 'సూర్యలంక సముద్రతీరంలో సూర్యోదయం సమయాన పూజలు' చిత్రం జాతీయ స్థాయిలో మూడో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ కంపోజిషన్ చిత్రంగా ఆయన తీసిన ప్రకృతి సౌందర్యం చిత్రం ఎంపికైంది. ఫొటోగ్రఫీ పోటీల్లో రెండు జాతీయ పురస్కారాలను సాధించిన నాగరాజును బాపట్ల ప్రగతి ఫొటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కె.రవికుమార్, పి.నాగేశ్వరరావు, అధ్యక్షుడు ఎం.సుధాకర్, కార్యదర్శి బి.జయరావు, ఉపాధ్యక్షులు వి.ప్రసాద్, కోశాధికారి ఎస్.ఏడుకొండలు అభినందించారు.



పీవీఎస్ నాగరాజు



జాతీయ పోటీల్లో తృతీయ బహుమతి సాధించిన చిత్రం

# కనిపించనంత మాత్రాన లేదని కాదు

ఆత్మ ఎలా ఉంటుంది అని ఎవరైనా అడిగితే దానికి సమాధానం సామాన్య మానవులెవరూ చెప్పలేరు. అయితే ఈ ఆత్మ స్థితి ఏమిటి అనే విషయాన్ని గురించి ఎలా తెలుసుకోవాలి, దీనికేవైనా ఉదాహరణలున్నాయా అని అంటే ఉన్నాయి అని వివరించి చెబుతుంది ఈ కథాసందర్భం. మహాభారతం శాంతిపర్వంలో మనువుకు బృహస్పతికి జరిగిన సంభాషణ క్రమంలో ఈ వివరాలు కనిపిస్తాయి. మనిషి కంటితో ఆత్మను చూడలేడు. చర్మంతో ఆత్మను స్పృశించలేడు. అయితే ఆత్మను ఇంద్రియాలకే ఇంద్రియం అని పెద్దలు వివరిస్తారు. ఇంద్రియాలకే ఇంద్రియంలాంటిదే అయినా దాన్ని చెవితో వినడం సాధ్యం కాదు. ఎందుకంటే ఆ ఆత్మ శబ్దరహితం. అలాంటి దాన్ని కేవలం జ్ఞాన విచారం ద్వారానే తెలుసుకోవటం సాధ్యమవుతోంది. అలా తెలుసుకోవటాన్నేఆత్మసాక్షాత్కారం పొందటం అని అంటారు. చెవి తదితర ఇంద్రియాలు స్వయంగా తమను తాము చూడలేవు. ఆత్మ సర్వజ్ఞుడు... సర్వదర్శి. కనుక తాను ఇంద్రియాలన్నింటినీ చూడగలడు. ఇంద్రియాలకే ఇంద్రియమైన ఆత్మకు సాధారణ ఇంద్రియాలైన చెవి, ముక్కులాంటి వాటికి ఇదే ప్రధానమైన తేడా. మనిషి హిమాలయాన్ని ఒకవైపు నుంచే చూడగలడు. అదే సమయంలో రెండోవైపు ఎలా ఉందో చూడటం అతడికి సాధ్యపడదు. హిమాలయానికి రెండోవైపు ఉన్న ప్రాంతం

ధర్మపథం

నాకు కనిపించటం లేదు కదా. కనుక అది లేనట్టే అని ఎవరైనా అంటే ఎంత తెలివితక్కువతనంగా ఉంటుందో కనిపించనంత మాత్రాన ఆత్మను లేదు అని అనటం కూడా అంతే తెలివితక్కువతనంగా ఉంటుంది.

### సర్వప్రాణులలోనూ...

సర్వ ప్రాణులలోనూ జ్ఞానస్వరూపుమైన



ఆత్మ ఉందన్నది సత్యం. ఆ ఆత్మను మన కళ్లు చూడలేవు. ఎందుకంటే సాధారణమైన చర్మచక్షువులు చూడలేనంత సూక్ష్మంగా ఆత్మ ఉంటుంది. అమావాస్యనాడు చంద్రుడు కనిపించడు. అంతమాత్రాన చంద్రుడు నశించినట్టు ఎవరూ చెప్పరు. అలాగే ఆత్మ కనిపించనంత మాత్రాన అది నశించిందని చెప్పటం సమంజసం కాదు. ఆత్మకు ఉపాధి లేకపోవటమే కనిపించకపోవటానికి కారణం. అమావాస్యనాడు చంద్రుడి స్థూలశరీరం క్షీణించి ఉంటుంది. అప్పటిదాకా ఉన్న రూపం నుంచి విముక్తుడై శరీరి కనిపించడు. మళ్లీ మరో జన్మగా మరో ఉపాధి దొరకగానే నెలపొడుపునాడు ఆకాశంలో నెలవంక లాగా చంద్రుడు కనిపించినట్టు కొత్త ఉపాధిలో కనిపిస్తాడు. పుట్టుక, వృద్ధి, నాశనం అనే ఈ మూడు శరీరానికి ప్రత్యక్షంగా కనిపిస్తాయి. అయితే బాల్యాది అవస్థలు జీవితంలో ఎన్ని మారినా శరీరంలో ఉండే ఆత్మ మాత్రం మారదు. ఆత్మ మరో శరీరంలోకి చేరినా దానికి వేరే మార్పేమీ ఉండదు. చీకటి చంద్రుడిని సమీపిస్తున్నా తెలియదు. విడిచిపెడుతున్నా తెలియదు. అలాగే ఆత్మ కూడా శరీరాన్ని పొందుతున్నా, విడిచిపెడుతున్నా ఎవరూ గమనించలేరు. అమావాస్యనాడు చంద్రుడు నక్షత్రాలతో కూడి ఉంటాడు. అలాగే జీవుడు లేదా ఆత్మ తనకు సంబంధించిన కర్మఫలాలతో కూడి ఉండటం జరుగుతుంది. ఉత్పత్తికి ముందు, వినాశనానికి తర్వాత వస్తువులు రూపాన్ని కోల్పోయి మూలరూపంగా మిగిలిపోతాయి. అలాగే మూలపదార్థంలాగా ఆత్మ శరీరధారణ ముందు, శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత తాన్కొటిగా మిగిలిపోతుంది. ఈ ఆత్మను బుద్ధి అనే దీపం ద్వారా వివేకం కలిగిన వారు, జ్ఞానవంతులు ఇంద్రియాతీతంగా ఉన్నప్పటికీ సాక్షాత్కరింప చేసుకుంటారు. అందరిలోనూ ఉండే పరమాత్మరూపమైన కర్మను తెలుసుకోవటం జ్ఞానం ద్వారానే సాధ్యమవుతుంది. ఈ జ్ఞానాన్ని సద్గురువు మాత్రమే ఉపదేశించగలడు. అందుకే ప్రతి మనిషీ తన జీవన గమనంలో ఒక సద్గురువును ఎంచుకొని ఆ గురువు చెప్పిన మార్గంలో జీవనం సాగిస్తే జ్ఞానోదయమై ఆత్మజ్ఞానం కలుగుతుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

---

# 'విరోధినీ' మాతగా భద్రకాళి



**వరంగల్, న్యూస్‌టుడే:** శ్రీభద్రకాళి శాకంభరీ ఉత్సవాల్లో భాగంగా అయిదో రోజు అమ్మవారు 'విరోధినీ' అలంకరణలో, సాయంత్రం వహ్నావాసినీ క్రమంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో భద్రకాళి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. విరోధినీ మాతగా అమ్మవారిని సేవించిన వారికి సకల శుభాలు కలుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు.

తెలుగు వాణి

# పోకకు పుట్టెడు

అధికంగా దొరకటం, పంట బాగా పండటం, తక్కువ ధరకు ఎంతో ఎక్కువ ఫలితం లభించటం అనే అర్థాల్లో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. పోకచెక్క అనంటే వక్క అని అర్థం. కేవలం అతి స్వల్పధర ఉన్న వక్కముక్కను ఇచ్చి పుట్టెడు ధాన్యాన్ని తెచ్చుకొన్న తీరులో లాభం వచ్చినప్పుడు ఈ

జాతీయాలు నుడికారాలు

జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది. ఇదే పద్ధతిలో ఎప్పుడు ఎక్కడ కొద్దిపాటి శ్రమకు కానీ, ధనానికి కానీ అంతకంటే ఎక్కువరెట్ల లాభం వచ్చినప్పుడు ఈ జాతీయంతో సూచిస్తుంటారు.

# శ్రీవారి సాక్షాత్కారం.. పరవశించిన భక్తజనం

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి మూడురోజుల సాక్షాత్కార వైభవోత్సవం బుధవారం ప్రారంభమైంది. ఏటా ఆషాఢ శుద్ధమాసంలో వచ్చే ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో శ్రీవారి సాక్షాత్కార వైభవోత్సవాలన్ని ఈఏడు విశేషంగా నిర్వహించాలని తితిదే శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈవో శ్రీధర్, ఏఈవో ధనంజయ, సూపరింటెండెంట్లు కృష్ణారావు, దినకర్‌రాజు, ఆలయ ఇన్‌స్పెక్టరు అచ్చు రమేష్, ఆర్జిత సేవా ఇన్‌స్పెక్టరు శ్రీనివాసులు భక్తులు పాల్గొన్నారు.



**ఊంజలసేవలో శ్రీహరి ఉత్సవర్లు**

# నరసింహావతారంలో జగన్నాథుడు



**జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా అనకాపల్లి, కశింకోట ఆలయాల్లోని జగన్నాథస్వామి నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.**

– విశాఖపట్నం, న్యూస్‌టుడే

# సోమసుందర స్వామి ఆలయంలో ఘటాభిషేకం

**గుంటూరు, న్యూస్‌టుడే:** వరుణుడు కరుణించి పాడిపంటలు సస్యశ్యామలమై రాష్ట్రం సుభిక్షం కావాలని కాంక్షిస్తూ అరండల్‌పేటలోని గంగా మీనాక్షి సమేత సోమ సుందర స్వామి ఆలయంలో సహస్ర ఘటాభిషేక పూజా కార్యక్రమాలు బుధవారం పెద్ద ఎత్తున జరిగాయి. ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు, ప్రత్యేక కలశ పూజలు చేసి ఘటాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కడవలతో బారులుదీరి నీళ్లు పోశారు. సాయంత్రం బిల్వార్చన కార్యక్రమం జరిగింది. పురోహిత, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుందుర్తి భాస్కరశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, నరసింహామూర్తి, సురేష్, రామకృష్ణశర్మ, జగదీష్, ప్రసాద్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



**ఘటాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు**



**స్వామివారికి కలశపూజ చేస్తున్న పూజారులు**

# శేషశయనునికి భక్త నీరాజనం



**శేషవాహన సేవలో శ్రీమహావిష్ణువు**

**ఒంగోలు, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** ఒంగోలు గాంధీరోడ్డు పత్తివారి వీధిలో శ్రీరామ బాలభక్త సమాజం నిర్వహిస్తున్న 57వ సీతారామ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై దర్శనమిచ్చి భక్తులను కరుణించాడు. శంకు, చక్ర, గదాధరుడైన స్వామి శ్రీలక్ష్మి సేవిస్తుండగా, భక్తులకు మనోజ్ఞానందం కల్గించాడు, భక్తబృంద సభ్యులు నిర్వాహకులుగా వ్యవహరించారు.

# వైభవంగా రథోత్సవం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడువ రోజున నిర్వహించే అమ్మవారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఒంటెలు, గుర్రాలు ముందు నడవగా, కోలాటం, బంజారాల నృత్యాల నడుమ అందంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. ముందుగా రథం వద్ద స్థానిక కార్పొరేటర్ ఎన్. శేషుకుమారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. రఘునందన్‌రావుతో కలిసి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గుమ్మడికాయ కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల జేజేల మధ్య విద్యుత్ కాంతులతో..టపాసుల మోతలతో రథం ముందుకు కదిలింది. భక్తులు అమ్మవారికి పూలదండులు, కొబ్బరికాయలతో దారిపొడవునా పూజలు చేశారు. దేవస్థానం నుంచి బల్కంపేట, వెంకటేశ్వర దేవాలయం, బీకేగూడ, శ్రీరామ్‌నగర్‌ల మీదుగా ఈ రథోత్సవం ఊరేగింపు కొనసాగింది. యువకులు, శివసత్తులు నృత్యాలు అలరించారు.



**అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు**

# లోభగుణంతో అనర్థాలు



ప్రతిరోజూ ఎన్నెన్ని మహానదులొచ్చి సముద్రంలో కలిసినా ఆ సముద్రం నిండదు. అలాంటి సముద్రంతో పోలిక ఉన్న ఓ గుణం మానవాళిలో ఉంటుంది. అయితే అది ఏ విధంగా చూసినా మంచి గుణం కాదు. దాన్ని ఎలాగైనా సరే విడచిపెట్టి తీరాలి. ఇంతకీ అంత దుర్మార్గమైన గుణం ఏమిటి, దానివల్ల కలిగే నష్టాలేమిటి అంటే దానికి తగిన సమాధానంగా మహాభారతం శాంతిపర్వంలోని ఈ కథాసందర్భం కనిపిస్తుంది.

భీష్ముడు ధర్మరాజుకు తన జీవితానుభవంలోని అనేకానేక విషయాలను వివరిస్తూ లోభగుణం వల్ల జీవితంలో ఎదురయ్యే నష్టాలను కూడా ఇలా తెలియచెప్పాడు. పాపానికి అధిష్ఠానం లోభం. లోభం వల్లనే అన్ని పాపాలు సంక్రమిస్తుంటాయి. అందుకే ప్రతి వ్యక్తీ ఎంత కష్టపడైనా సరే లోభగుణాన్ని విడిచిపెట్టాలి. అధర్మం, దుఃఖం అనేవి ఒకదాని వెంట ఒకటిగా లోభగుణంతో ప్రవర్తించే వారిని వెంబడించి పీడిస్తాయి. నిక్కచ్చిగా చెప్పాలంటే కపటానికి, మోసానికి మూలకారణం లోభమే. దీనివల్లనే మనిషి పాపాలు చేస్తుంటాడు. లోభం వల్ల కోపం కలుగుతుంది. లోభం వల్లనే కామం ఏర్పడుతుంది. మోహ, మాయ, అభిమానం, పరాధీనత ఇలాంటి దోషాలన్నీ మనిషిలో వచ్చి చేరుతుంటాయి. సహనం లేకపోవటం, సంపద నాశనం, ధర్మక్షయం, చింత, అపకీర్తి అనేవి లోభం వల్లనే కలుగుతాయి. ఈ చెడుగుణం వల్లనే పీనాసితనం అధికమవుతుంది. ఆశ, శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించటం, కులాభిమానం, విద్యామదం, ధనమదం, కనిపించిన ప్రతి వారికి అపకారం చేయాలనుకోవటం, ఎంతటి వాడినైనా సరే లెక్కచేయకుండా తిరస్కరించడం, ఎంత మంచివారినైనా సరే నమ్మలేకపోవడం అనేవి కేవలం లోభగుణం వల్లనే కలుగుతాయి.

### సమాజానికి వీరు చీడపురుగులు

రుజువర్తనం లేకపోవడం, పరద్రవ్యాన్ని అపహరించడం, పరస్త్రీలపై వ్యామోహం, తొందరపడి పరుషంగా మాట్లాడటం, మనసులో ఆవేశం ఇవన్నీ లోభం వల్లనే కలుగుతాయి. ఇవి ఎవరి దగ్గర ఉంటే వారిని తోటి మనుషులు అసహ్యించుకుంటూ ఉంటారు. సమాజానికి అలాంటి వారు చీడపురుగులు అన్న భావం అందరిలోనూ కలుగుతుంది. మితిమీరిన ఆకలి, మితిమీరిన స్త్రీ సంయోగ ఆసక్తి, అప్పుడప్పుడు ఆత్మహత్యాయత్నం ఇవన్నీ లోభికుండే లక్షణాలు. ఈర్ష్య, అజ్ఞానం, తనకు సంబంధించిన విషయాలు కాకపోయినా అలాంటివన్నీ వినాలన్న ఆసక్తి, తన గురించి గొప్పలు చెప్పుకోవటం అనేవి లోభి దగ్గర కనిపిస్తుంటాయి. చేయకూడని పనులు చేయడం, అనకూడని మాటలను అనటం, తినకూడనివి తినాలనుకోవటం కూడా ఈ దుర్మార్గ లక్షణానికి ప్రతీకలే. కేవలం లోభం వల్లనే బాల్యం, కౌమారం, యౌవనం, వృద్ధాప్యం ఇలా ఏ దశలోనైనా సరే చెడు పనుల మీదకు మనసు మళ్లుతూ ఉంటుంది. ముసలితనంలో శరీరం చిక్కిశల్యమైనా లోభగుణం మాత్రం పట్టిపీడిస్తూనే ఉంటుంది. లోభం అనేది ఎప్పటికీ నిండని ఓ పెద్ద పొట్టలాంటిది కూడా. కొంతమంది ఎంత తిన్నా ఇంకా కావాలని అడిగినట్టుగానే లోభి ప్రవర్తన ఉంటుంది. ఎన్ని భోగాలు అనుభవించినా తృప్తి ఉండదు.

### దేవతలకూ కష్టమే

ఈ లోభం గురించి తెలుసుకోవటం చాలా సందర్భంలో దేవతలకు కూడా కష్టమైపోతుంటుంది. ఎంత గొప్పగా ఇంద్రియనిగ్రహాన్ని అలవాటుచేసుకున్నా లోభగుణాన్ని విడిచిపెట్టకపోతే దానివల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. చాలామంది విద్వాంసులు అనేకానేక శాస్త్రాలను కంఠస్థం చేసి ఉంటారు. ఇతరుల సందేహాలను కూడా తీరుస్తుంటారు. కానీ ఇలాంటి గొప్ప పండితులు కూడా లోభగుణానికి బానిసలై అనేక కష్టాలను కొని తెచ్చుకుంటుంటారు. వారు ద్వేష, క్రోధాలలో మునిగి దుర్మార్గానికి, దురాచారాలకు పాల్పడుతూ ఉండటం కూడా కనిపిస్తుంది. పైకి తియ్యని మాటలు చెప్పటం, మనసులో మహాక్రూరంగా ఆలోచించటం, గడ్డి కప్పిన నేలబావుల్లాగా ప్రమాదకరంగా ఉండటమనేది కేవలం లోభం వల్లనే జరుగుతూ ఉంటుంది. కొందరు ధర్మం పేరుతో లోకాన్ని మోసం చేస్తుంటారు. ధర్మాత్ముల వేషంలో ఉండి ప్రజలను దోచుకుంటుంటారు. ఇదంతా జరిగేది కేవలం లోభం వల్లనే. అందుకే లోభాన్ని ఎలాంటి పరిస్థితులలోనూ దరిచేర నివ్వకూడదు అని భీష్ముడు ధర్మరాజుకు వివరించి చెప్పాడు. ఈ వివరణ నేటి వారికి కూడా అనుసరణీయమే.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## శాకంబరిగా మహంకాళీ అమ్మవారు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** చరిత్రాత్మక శ్రీఉజ్జయిని మహంకాళీ అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి సుమారు 15 వేల మంది భక్తులు ఆలయానికి చేరుకోనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో అశోక్‌గౌడ్ తెలిపారు.



## దిగబట్టటం

**కిం**దకి లాగటం, కష్టాలపాలు చేయటం, అభివృద్ధికి ఆటంకంగా నిలవటం లాంటి అర్థాలలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. దిగువ భాగమంటే కింది భాగం. పైకి ఎదుగుతున్న దేనినైనా పట్టుకొని కిందికి లాగటమే ఈ దిగబట్టడం. అంటే అభివృద్ధి జరగకుండా పతనం చేయటం అనేది ఈ జాతీయానికున్న అర్థం.

## అరచేతిలో సువార్త

**కరీంనగర్, న్యూస్‌టుడే:** అరచేతిలో ఇమిడే అతిచిన్న బైబిల్‌ను పెద్దపల్లి నగరపంచాయతీ ఉద్యోగి బైరీ నవీన్ ఆవిష్కరించారు. మత్తైసువార్తలోని కొంత భాగాన్ని తీసుకుని దీనిని రూపొందించారు. కేవలం 8 గంటల వ్యవధిలో 108 పేజీలతో తయారుచేసిన ఈ పవిత్ర గ్రంథం రూపాయి నాణేం పరిమాణం కంటే చిన్నగా ఉండి ఇట్టే ఆకట్టుకుంటున్నది. 5 మి.మీ. మందం, 8మి.మీ. వెడల్పు, 9మి.మీ. పొడవు కలిగిన ఈ గ్రంథం బైబిల్‌లోని కొన్ని అధ్యాయాల సారాంశాన్ని తెలియజేస్తుందని నవీన్ చెప్పారు.





అతిచిన్న బైబిల్, నవీన్ (అంతరచిత్రంలో)

## హనుమంత వాహనం... శ్రీకోదండరామ స్వరూపం...



కోదండరామ స్వరూపంతో శ్రీహరి

**తిరుపతి, న్యూస్‌టుడే:** శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవోత్సవంలో భాగంగా గురువారం రాత్రి అభయహస్తం దాల్చిన శ్రీకోదండరామస్వామి స్వరూపంతో శ్రీహరి హనుమంతుడిపై భక్తజనులను ఆశీర్వదించారు. ఆషాఢ శుద్ధమాసంలో వచ్చే ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో శ్రీవారి సాక్షాత్కార వైభవోత్సవాలను తితిదే వారు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. దివ్యాభరణాలతో శ్రీకోదండరామస్వామి స్వరూపంతో అలంకృతులైన శ్రీహరి హనుమంతుడి భుజస్కంధాలపై అధిరోహించి భక్తాదులను తన్మయపరిచారు. గురువారం ఉదయాత్పూర్వం సుప్రభాతసేవలతో స్వామివారిని మేల్కొలిపి నిత్యపూజలను వైఖానస ఆఘమోక్తంగా నిర్వహించారు. దవళ వస్త్రాలతో అలంకృతులైన శ్రీవారి ఉత్సవర్లను వేంచేపుగా వివాహమండపంలోని ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి సుగంధపుష్పద్రవ్యాలతో స్నపన తిరుమంజనం సేవలు నిర్వహించారు. సాయంత్రం ఊంజల మండపంలో పుష్పపు ఊయలపై శ్రీవారు భక్తులను తన్మయపరిచారు. శ్రీనివాసుడి సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీకోదండ రామస్వామి స్వరూపంతో చతుర్మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు దివ్యాశీస్సులను అందించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందుగా శ్రీదేవి.. భూదేవి సమేతులైన శ్రీవారు ఊంజలసేవలో భక్తులను తన్మయపరచారు. రాత్రి 9 గంటలకు శుద్ధి, ఏకాంతసేవలతో స్వామివారిని విశ్రమింపజేశారు.



హనుమంతుడి వాహనంపై ఊరేగుతున్న శ్రీహరి

## కూచిపూడి కళా కిరణం



కూచిపూడి నాట్య ప్రదర్శన ఇస్తూ..

**నృత్యకళే ఆధారంగా జీవనం సాగిస్తున్న వంశానికి చెందిన ఆ బాలుడు చిన్నతనంలో నాట్యంలో అద్భుతంగా రాణిస్తున్నాడు. తల్లిదండ్రుల వద్దే కళలో నైపుణ్యం సాధించి పదహారేళ్లకే అయిదు వందలకు పైగా ప్రదర్శనలిచ్చి ప్రశంసలు అందుకుంటున్నాడు. స్త్రీ, నాయక, ప్రతినాయక పాత్రల పోషణతో పాటు గాత్ర సంగీత, నట్టువాంగ నిర్వహణలోనూ ప్రావీణ్యం కలిగి కూచిపుడి నాట్యంలో వేదాంతం వారి వంశ ప్రతిష్ఠను నిలుపుతున్నాడు.**

- సంప్రదాయ పాత్రలతో రాణింపు
- 16 ఏళ్లకే 500లకు పైగా ప్రదర్శనలు

**కూచిపూడి, కృష్ణా జిల్లా, న్యూస్‌టుడే:** కూచిపూడిలోని 'కూచిపూడి నాట్య కళాపీఠం' ప్రిన్సిపల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, దుర్గాభవానీల రెండవ కుమారుడు వేదాంతం వాగ్దేవీప్రసాద్ ఈ ఘనత సాధించాడు. అయిదవ ఏటనే గజ్జెకట్టిన ఈ కూచిపూడి నాట్య కిరణం సంగీత, నృత్య, సాహిత్యాలను అవపోసన పడుతూ సంప్రదాయ పాత్రలన్నింటిని ధరించి మెప్పించాలనే కృషితో ముందుకు సాగుతున్నాడు. మొవ్వ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇతడు కూచిపూడి నాట్యంలో సర్టిఫికెట్ కోర్సు,యక్షగానం, సాత్వికాభినయంలో డిప్లొమోలో ఉత్తమ స్థాయిలో ఉత్తీర్ణుడయ్యాడు. కర్ణాటక సంగీతంలోనూ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాడు. నాట్య సంప్రదాయంలోని అన్ని జాతులలోని జతులను తాళ, లయాత్మకంగా పట్టుతో పల్కడం, స్వీయ కల్పనలను చేయడంలోనూ పట్టుసాధిస్తున్న వాగ్దేవీప్రసాద్ బాల్యంలో చిన్నికృష్ణుడు, వినాయకుడు, కుమారస్వామి వంటి పలు పాత్రలలో రాణించాడు. ఇటీవల నారధుడు, శ్రీకృష్ణుడు, దేవారికుడు, మయావిష్ణువు పాత్రలలో రాణించాడు. భామాకలాపంలో సత్యభామగా, మరికొన్ని వ్యస్త నృత్యాంశాలను స్త్రీపాత్ర ధారణలో ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాడు. 16 ఏళ్లలోపు కళాకారులతో శ్రీసిద్ధేంద్ర యోగి కళాపీఠం మలిచిన ఉషాపరిణయం యక్షగానంలో యువనాట్యాచార్యులు చింతా రవిబాలకృష్ణ పర్యవేక్షణలో బాణాసురపాత్రలో ప్రముఖుల అభిమానాన్ని చూరగొన్నాడు. ఇప్పటికి దేశంలోని ముఖ్యపట్టణాలలో, ఆధ్యాత్మిక కేంద్రాలు, ప్రముఖ సంస్థలతో పాటు బ్యాంకాక్‌లోనూ ప్రతిభను చూపాడు. ఆదివారం విశాఖపట్నంలో భామాకలాపంలో శ్రీకృష్ణునిగా నర్తించి ప్రముఖుల ఆదరాభిమానాలు అందుకున్నాడు.

# సంసార చక్రంలో ఎందుకు పడతారంటే...

**మ**నుషులు సంసారచక్రంలో ఎందుకు పడాల్సి వస్తుంది? పుట్టుక, మరణాల మధ్య ఎందుకు కొట్టుమిట్టాడాల్సి వస్తుంది? అనే ప్రశ్నలకు సమాధానం ఇచ్చే కథాసందర్భం ఇది. వ్యాస మహాభాగవతం ఆరో స్కంధంలో చిత్రకేతు మహారాజుకు సంకర్షణదేవుడు ఈ విషయాలన్నింటినీ వివరించాడు.

జీవుడు సర్వసాధారణంగా దేవుడి మీద మనసు నిలిపే ఉంటాడు. దేవుడంటే ఎవరో కాదని ఆత్మస్వరూపుడేనని గ్రహించి మెలగుతూనే ఉంటాడు. అప్పటివరకు అంతా బాగానే ఉంటుంది. అయితే జీవుడు తన ఆత్మస్వరూపుడైన దేవుడిని ఏదో ఓ కారణం వల్ల విస్మరిస్తూ ఉంటాడు. దాంతో ఆ జీవుడికి సంసారచక్రంలో పడే పరిస్థితి వస్తుంది. అప్పుడతడికి జన్మపరంపరలు, మృత్యుపరంపరలు తప్పవు.

### అన్ని జన్మలలోకి మానవ జన్మ గొప్పది

జీవుడు మానవజన్మలోనే జ్ఞానవిజ్ఞానాలు పొందటానికి అవకాశం కలుగుతుంది. అందుకే అన్ని జన్మలలోకి మానవజన్మ గొప్పదని పెద్దలంతా అంటూ ఉంటారు. అలాంటి మానవ జన్మను పొంది కూడా ఆత్మ స్వరూపుడైన పరమాత్మను తెలుసుకోలేకపోతే ఇక జీవుడికి వేరే ఏ జన్మలోనూ శాంతి లభించదు. సాంసారిక సుఖాల కోసం చేసే చేష్టల వల్ల శ్రమ కలగటమే కాక కష్టాలు కూడా ప్రాప్తిస్తాయి. సుఖం కోసం చేసే కర్మల వల్ల సుఖానికంటే విరుద్ధమైన పరమదుఃఖాలే ప్రాప్తిస్తాయి. జగత్తులో స్త్రీలు, పురుషులు సుఖం ప్రాప్తించటం కోసం, దుఃఖాలను పోగొట్టుకోవటం కోసం వివిధ కర్మలను చేస్తుంటారు. కానీ అలాంటి కర్మల వల్ల వారి దుఃఖాలు తొలగవు సరికదా సుఖం లభించదు. మనిషి



తాను గొప్ప బుద్ధిమంతుడినని భావిస్తూ కర్మల వలలో చిక్కుకొనిపోతుంటాడు. దానివల్ల తాను కోరుకున్న ఫలాలకన్నా విపరీతమైన ఫలాలను పొందుతుంటాడు. ఈ విపరీత పరిస్థితిని గ్రహించగలిగిన మనిషి మాత్రం తనలో ఉన్న ఆత్మస్వరూపుడైన భగవానుడిని శరణువేడి ముక్తి పొందుతుంటాడు.

### అవస్థలకంటే విలక్షణం

వాస్తవానికి ఆత్మస్వరూపం అత్యంత సూక్ష్మంగా ఉంటుంది. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలను ప్రకాశింపచేసేది ఆత్మే అయినా ఆ ఆత్మ ఆ అవస్థల కంటే విలక్షణంగా ఉంటుంది. అందుకే విషయభోగాల మీద ఆసక్తి విడిచిపెట్టి అంతరాత్మను తెలుసుకొనే దిశగా ప్రతి మనిషీ ముందడుగేయాలి. సద్గురువు ద్వారా జ్ఞానవిజ్ఞానాలను తెలుసుకొని ఆత్మస్వరూపుడైన భగవానుడి మీద భక్తి కలిగి ఉండాలి. మానవుడు బుద్ధి నైపుణ్యం ద్వారా యోగమార్గతత్త్వాన్ని తెలుసుకోవాలి. అలా తెలుసుకోగలిగినప్పుడు పరబ్రహ్మమే ఆత్మరూపమన్న సంగతి స్పష్టమవుతుంది.

### ఆత్మతోనే జగత్తు

ఆత్మ కార్యకారణాత్మకమైన జగత్తంతా వ్యాపించి ఉంటుంది. ఆ జగత్తు ఆత్మతో కలిసి ఉంటుంది. ఆ రెండింటికీ అధిష్ఠాత ఆ వాసుదేవుడు. ఆత్మ, కార్యకారణాత్మకమైన ఆ జగత్తు వాసుదేవుడిలో నిలిచి ఉంటాయి. జీవుడిలో ఉండే జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు వాసుదేవుడు కల్పించినవే. ఇలా ఆత్మ అనేది సర్వవ్యాపకమైందని, ఆ సర్వవ్యాపకమైనదంతా వాసుదేవ తత్త్వమేనని ప్రతి మనిషీ గ్రహించగలగాలి. అప్పుడు వాసుదేవాత్మకమైన ఆత్మ ఎదురుగా ఉన్న ప్రతి ప్రాణిలోనూ నిలిచి ఉంటుంది. కనుక ఆ ప్రాణులన్నింటినీ వాసుదేవుడి రూపంగా భావించాలి. ఈ భావన సర్వభూతదయను కలుగజేస్తుంది. సర్వభూతదయ ద్వారా హింస నశించి విశ్వశాంతి వర్ధిల్లుతుంది.

అలాకాక జీవుడు తన ఆత్మస్వరూపుడైన వాసుదేవుడిని విస్మరించటం, ఆ దైవానికి వ్యతిరేకంగా అధర్మ మార్గాలను అవలంబించటం లాంటివి చేసినప్పుడు సంసారచక్రంలో పడి కొట్టుమిట్టాడక తప్పదు అనే విషయాన్ని ఈ కథాసందర్భం ప్రకటిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

## 'ఉగ్ర ప్రభా' అలంకరణలో భద్రకాళి

**వరంగల్, న్యూస్‌టుడే:** భద్రకాళి శాకంబరి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం ఉదయం 'ఉగ్ర ప్రభా' అలంకరణలో, సాయంత్రం త్వరితాక్రమంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవమూర్తికి నవరాసభిషేకాలు నిర్వహించారు. నాలుగు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. భద్రకాళి మాతకు కుంకుమార్చన నిర్వహించారు.



## వైభవంగా వరుణయాగం

**కరీంనగర్, న్యూస్‌టుడే:** వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న వరుణయాగం వైభవంగా సాగుతోంది. రెండో రోజు శనివారం స్వామివారికి సంతతధారాభిషేకం, హవనములు నిర్వహించారు. స్వామివారికి నిరంతర అభిషేక పూజలు చేశారు. వరుణయాగం సందర్భంగా భక్తులు స్వామివారికి చెల్లించే ఆర్జితసేవలు, నిత్య పూజలు రద్దు చేశారు. వరుణుడు కరుణించాలని రాజన్న సన్నిధిలో చేపట్టిన పూజల్లో స్థానిక శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్‌బాబు పాల్గొని మొక్కులు చెల్లించారు.



వరుణ యాగం నిర్వహిస్తున్న అర్చకులు

# నేత్రోత్సవం... వరుణపూజోత్సవం



ఋత్వికులకు వస్త్రదానం చేస్తున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

## వరుణ యాగాన్ని జరిపిస్తున్న ఎమ్మెల్యే సూరి

**అనంతపురం, న్యూస్‌టుడే:** సకాలానికి వర్షం కురవక రైతాంగం విలవిలలాడుతోందని, వారిని ఆదుకోవాలని కోరుకుంటూ శనివారం సాయంత్రం స్థానిక దేశాయి కాశీ విశ్వనాథ దేవాలయంలో ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆధ్వర్యంలో వరుణయాగం నిర్వహించారు. శాసనసభ్యుడిగా అందుకున్న మొదటి నెల జీతంతో ఈ పూజోత్సవాన్ని చేపట్టారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ బీరే గోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ అంబారపు శ్రీనివాసులు, కౌన్సిలర్లు తెదేపా జిల్లా మాజీ కన్వీనర్ శ్యామరావు ఉన్నారు.

## డేగకన్ను

**ని**శితదృష్టి, జాగ్రత్తగా కనిపెట్టి ఉండటం, పరీక్షగా చూడటం అనే లాంటి అర్థాలు ఈ జాతీయానికున్నాయి. పక్షులలో డేగ కంటిచూపు చాలా నిశితంగా ఉంటుందంటారు. ఆకాశంలో చాలా ఎత్తున తిరుగుతూనే నేల మీద తనకు కావలసిన ఆహారాన్ని కనిపెట్టగల కంటిచూపు డేగకుంటుంది. అంత నిశితంగా ఎవరైనా, ఏదైనా విషయాన్ని చూస్తున్నప్పుడు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.

## శ్రీరాముడిగా జగన్నాథస్వామి



**ద్వారకాతిరుమల, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం శ్రీజన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు శ్రీరాముడి అలంకారంలో భక్తులను కనువిందు చేశారు. మహావిష్ణువు ఎత్తిన దశావతారాల్లో శ్రీరామావతారానికి సంబంధించి ఎంతో వైశిష్ట్యం ఉంది. ఈ అవతారం ద్వారా మానవాళి ఎంతో నేర్చుకోవలసి ఉంది. ధర్మసంస్థాపన కోసం జగన్నాథస్వామి శ్రీరామావతారంలో రావణుడిని సంహరిస్తాడు. స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు.

## చాతుర్మాస యాగం పరిసమాప్తం

**తిరుపతి, న్యూస్‌టుడే:** తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో వేదోక్తంగా జరిగిన చాతుర్మాస యాగం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. తితిదే ఈవో గోపాల్ చేతులు మీదుగా లోకకల్యాణార్థం గత నెల 30న యాగాన్ని ప్రారంభించబడింది. 6 రోజుల యాగంలో 15 మంది రుత్తిక్కులు 13 ఇష్టిలను నిర్వహించారు. వేదాల్లో విశేషంగా పేర్కొన్న వైశ్వదేవపర్వ, ప్రఘాస పర్వ, సాకమేధీయపర్వ, శునాసరీయపర్వ పారాయణాన్ని వైదికులు శాస్త్రోక్తంగా చేశారు. యాగ కార్యక్రమాలను తితిదే ఆగమ సలహాదారు సుందరవదనాచార్యులు ఆధ్వర్యంలో ఆర్. సుందరరామ వాజపేయాజి నిర్వహణలో జరిగాయి.



తిరుమల వేద పాఠశాలలో చాతుర్మాస యాగం నిర్వహిస్తున్న వైదికులు

# ఆయనకు ఆమెంటే ఇష్టం

ఆయనకు ఆమె అంటేనే ఎంతో ఇష్టం. ఆమె ఉన్నదని తెలిస్తే ఎక్కడికైనాసరే, ఎంత కష్టమైనాసరే ఆయన వచ్చి తీరుతాడు. ఇంతకీ ఆమె ఎవరు, ఆయన ఎవరు, ఆయన ఆమెకు అనుగ్రహించిన సంతానం ఎవరు, ఆమెకుండే దాసీ ఎవరు అనే విషయాలను వివరించి చెప్పే కథాసందర్భం ఇది. పద్మపురాణం ఉత్తరఖండంలో ఉన్న శ్రీమద్భాగవతమాహాత్మ్యం రెండో అధ్యాయంలో ఉన్న విషయం. జగన్నాయకుడు, భక్తవత్సలుడు శ్రీకృష్ణుడు. ఆయనకు ఎంతో ఇష్టమైన సః భక్తి. జ్ఞానస్వరూపుడైన ఆ శ్రీహరి తన సత్యస్వరూపంతో ఆ భక్తిని సృష్టించాడు. పరమ సౌందర్యవతి అయిన ఆమె శ్రీకృష్ణుడికి ప్రియురాలైంది. శ్రీకృష్ణుడి ఆజ్ఞ మేరకే కృష్ణుడి భక్తులను చేరి వారందరినీ పోషిస్తూ ఉంటుంది భక్తిదేవి. తన ఆజ్ఞను పాటిస్తోందన్న ఆనందంతో కృష్ణుడు భక్తికి సేవ చేయటం కోసం ముక్తి అనే ఒక దాసిని ఇచ్చాడు. అలాగే ఆమెకు జ్ఞానం, వైరాగ్యం అనే ఇద్దరు పుత్రులను ప్రసాదించాడు.



### అదృశ్యరూపంలో భక్తి

భక్తి తన సహజ సౌందర్యరూపంతో వైకుంఠంలో భక్తులను పోషిస్తూ ఉంటుంది. భూలోకంలో మాత్రం ఆమె ఎవరికీ కనిపించకుండా అదృశ్యరూపంతో భక్తులకు సేవిస్తూ ఉంటుంది. శ్రీకృష్ణుడి ఆజ్ఞను అనుసరించి భక్తి తన దాసి అయిన ముక్తిని, కుమారులైన జ్ఞానవైరాగ్యాలను వెంటపెట్టుకొని వైకుంఠం నుంచి భూమికి వచ్చింది. అలా వచ్చిన తర్వాత సత్యయుగం నుంచి ద్వాపరయుగాంతం వరకూ బాగానే గడిచింది. మూడు యుగాలలోనూ భక్తి, ఆమె బిడ్డలు, దాసి పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. కానీ కలియుగం రాగానే కష్టాలు ప్రారంభమయ్యాయి. ముందుగా భక్తికి, దాసి అయిన ముక్తికి పాషండం లేక నాస్తికం అనే రోగం సంక్రమించింది. ఈ రోగంతో ఆమె చిక్కిశల్యమవుతూ ఉండటాన్ని భక్తి గమనించి వెంటనే వైకుంఠానికి వెళ్లి స్వామిని ఆశ్రయించమని చెప్పింది. భక్తి ఆజ్ఞను అందుకొన్న ముక్తి వైకుంఠానికి చేరి దేవాదిదేవుడి సందర్శనంతో కుదుటపడింది. అప్పటి నుంచి భక్తి తనను స్మరించినప్పుడు మాత్రమే ముక్తి భూలోకానికి వచ్చి మళ్లీ తన పనికాగానే తిరిగి వైకుంఠధామానికి వెళుతూ ఉంటుంది. ఈ సమస్య ఇలా పరిష్కారమైందని ఆనందిస్తూ ఉన్నంతలోనే భక్తికి మరో పెద్ద సమస్య ఎదురైంది. కలియుగంలో భక్తిదేవి కుమారులైన జ్ఞానవైరాగ్యాలను ఎవరూ లెక్కచేయలేదు. ఆ ఇద్దరూ ఉపేక్షకు గురై నిరుత్సాహంతో బలహీనులై కుంగిపోసాగారు. దాంతో ఆ బిడ్డలిద్దరూ తమ తల్లికంటే చిన్నవయస్సు వారైనా తల్లికంటే పెద్ద వయస్సు వారిలాగా ముసలితనంతో జీవితాన్ని వెళ్లదీయటం మొదలు పెట్టారు. అలా తన బిడ్డలు తన కంటే వయస్సులో పెద్దవారుగా ముసలి రూపాలతో ఉండటం చూసి భక్తిదేవి దుఃఃంచసాగింది.

### కృష్ణుడి అనుగ్రహం

భక్తిదేవి దుఃఖాన్ని నారదమహర్షి గమనించాడు. త్రిలోక సంచారి అయిన నారదుడు కలియుగంలో భక్తికి ఆదరణ తగ్గినందువల్లనే ఆమె బిడ్డలకు, దాసికి కష్టాలు వాటిల్లుతున్నాయని గమనించాడు. అప్పుడా మహర్షి భక్తిదేవి దుఃఖాన్ని పోగొడుతూ కలియుగంలో భక్తి ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుందని దాన్ని గుర్తించిన వారు ముక్తి పొందుతారని అలాంటి మంచిరోజులు మెల్లగా వస్తాయని చెప్పాడు. భక్తిని కలిగిఉన్నవారినే కృష్ణుడు అనుగ్రహించి ఆదరిస్తాడని, గోపికలు భక్తిని కలిగిఉన్నందువల్లనే ముక్తిని పొందగలిగారని వివరించి చెప్పాడు. భక్తికి ఆదరణ బాగా పెరిగినప్పుడు జ్ఞానవైరాగ్యాల ద్వారా ముక్తిసాధన సులభమవుతుందని అందరూ గ్రహించగలగాలన్నాడు. భక్తి ఉన్నవారిని భూతప్రేతాలు, రాక్షసులు తదితరులెవరూ కలలో కూడా తాకలేరు. తపస్సు, వేదాధ్యయనం, జ్ఞానం, కర్మలు ఇలాంటివన్నీ భక్తి చేతనే వశమవుతాయని నారదమహర్షి వివరించాడు. నిర్మలమైన భక్తి ఉంటే గొప్పగొప్ప వత్రాలు, యజ్ఞయాగాలు కష్టపడి చేయాల్సిన అవసరం లేదని అలాంటి భక్తి ఉన్నవారికి వైకుంఠవాసుడు సులభంగా ముక్తిని ప్రసాదిస్తాడని ప్రజలంతా తెలుసుకొనే రోజు వచ్చితీరుతుందని, అప్పుడు జ్ఞానవైరాగ్యాలు కూడా బాగా బలం పుంజుకుంటాయని నారదమహర్షి వివరించి చెప్పాడు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# పురాతన శివాలయంలో సహస్ర ఘటాభిషేకం



**ఖమ్మం, న్యూస్‌టుడే:** వర్షాభావం నేపథ్యంలో వరుణుడి కటాక్షం కోరుతూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కూసుమంచిలోని పురాతన శివాలయంలో భక్తులు ఆదివారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో తొలుత విఘ్నేశ్వర, గౌరీపూజ చేశారు. అనంతరం గర్భగుడి ద్వారాన్ని గోడతో మూసేసి సుమారు మూడు అడుగుల మేరకు నీటిని నింపారు. ఆ తరువాత నీటిని తీసేసి శివలింగానికి జలాభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కించాలని, దండిగా వర్షాలు కురిపించాలని, పంటలు బాగా పండాలని దేవుడికి మొక్కులు చెల్లించారు.

# వైభవంగా బోనాల పండగ

**ఆదిలాబాద్, న్యూస్‌టుడే:** నందిగుండం దుర్గామాత ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన బోనాలపండగ జాతర వైభవంగా జరిగింది. స్థానిక ఎన్టీఆర్ మినీస్టేడియం నుంచి గండిరామన్న ఆలయ సమీపంలోని దుర్గామాత ఆలయం వరకు బోనాలు, అమ్మవారి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. శాసనసభ్యుడు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పురపాలకసంఘ అధ్యక్షుడు అప్పాల గణేశ్‌చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరై బోనం కుండల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో పాల్గొని ఉత్సాహంగా డోలు వాయించారు. బాగులవాడ, నగరేశ్వరవాడ, చింతకుంటవాడ, పాతబస్టాండ్, బుధవార్‌పేట్ మీదుగా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి వేషధారణలో పలువురు బాలికలు ఆకట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు ఐలయ్య ఆధ్వర్యంలో బృందసభ్యులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. నందిగుండం ఆలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



అమ్మవారి వేషధారణలో బాలిక

# చితగ్గొట్టడం

**చి**తగొట్టడం లేదా చితుకకొట్టడం అనే రూపంలో ఈ జాతీయం కనిపిస్తుంటుంది. ఇటీవలి కాలంలో బహుళ ప్రచారంలోకి వచ్చిన జాతీయం ఇది. ఏ విషయంలోనైనా గొప్ప విజయాన్ని సాధించాడని చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడుతుంటారు. క్రికెట్‌లాంటి ఆటలాడే సమయంలో, చలన చిత్రాల్లో నటుల నటన బాగా ఉందని చెప్పాల్సి వచ్చినప్పుడు ఇలా ఏదైనా సరే సంపూర్ణ విజయ సూచనగా ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

# 12 అడుగుల ఎత్తులో వేంకటేశ్వరుడు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జగన్నాథస్వామి దశవతారాల్లో భాగంగా ఆదివారం చోడవరంలో 12 అడుగుల ఎత్తులో వేంకటేశ్వరుడు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. పట్టణంలో బొల్లవీధి ఇంద్రజ్యుమ్నం హాల్‌లో జగన్నాథుడు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. ఇక్కడ గత ఐదేళ్ల నుంచి వేంకటేశ్వరుని రూపంలో స్వామిని విశేషంగా అలంకరిస్తున్నారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించడంతో కలియుగ దైవమైన స్వామిని చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే వేంకటేశ్వరుని అలంకరణ చోడవరంలో మాత్రమే ఉంటుందని ట్రస్టు బోర్డు ఛైర్మన్ ఉప్పలబాబు తెలిపారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ప్రధాన అర్చకులు రామకృష్ణాచార్యులు, సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఆర్వో సకలా సూరిబాబు, కమిటీ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



వేంకటేశ్వరుడి రూపంలో జగన్నాథుడు

# వేడుకగా సుదర్శన హోమం

**చీమకుర్తి, ప్రకాశం జిల్లా, న్యూస్‌టుడే:** మండలంలోని అగ్రహారం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన హోమం వేడుకగా నిర్వహించారు. దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఏడు రోజుల పాటు అఖండ హరినామ సంకీర్తన సప్తాహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. వేద పండితులు కొదమగుండ్ల రాజగోపాలస్వామి ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులు ఈ హోమం నిర్వహించారు.



పూజలు చేస్తున్న వేదపండితులు

# భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

**కడప, న్యూస్‌టుడే :** బ్రహ్మోత్సవాల్లో భాగంగా సౌమ్యనాథస్వామి ధ్వజారోహణాన్ని ఆదివారం ఆగమశాస్త్ర పండితులు ఎ.వి.కె నరసింహాచార్యుల శిష్యబృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ మహావిష్ణు అవతారమైన సౌందర్యవంతుడు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలను తిలకించడానికి తరలిరావాలని వేదపండితులు బ్రహ్మాది దేవతలను ధ్వజారోహణం ద్వారా ఆహ్వానించారు. అంతకుముందు ఆదివారం ఉదయం ఆలయ యజ్ఞశాలలో పలుహోమాలు చేశారు. ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామిని తిరుమాడవీధుల్లో గ్రామోత్సవం, అష్టదిగ్బంధనం చేశారు. గ్రామోత్సవానికి ముందు తిరుమాడ వీధుల్లో దుష్టశక్తులు పారిపోవడానికి దిష్టిబొమ్మను ఊరిగేంచి దహనం చేశారు. బ్రహ్మోత్స నిర్వహణ కమిటీ ప్రతినిధులు చక్రాల రామసుబ్బన్న, పల్లె సుబ్రహ్మణ్యం, వసంతరాయులు, కొండపల్లె సుబ్బరాయుడు, వల్లూరు సుమన్‌బాబు తదితరుల పాల్గొన్నారు. సౌమ్యనాథస్వామికి సోమవారం రాత్రి హంసవాహన సేవ, ఉదయం పల్లకి సేవ, తిరుమంజనం, గ్రామోత్సవాలుంటాయని బ్రహ్మోత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



సౌమ్యనాథస్వామి ఆలయంలో వాస్తుహోమం

# తెలుసుకోవలసిన జీవిత సత్యం

### ధర్మపథం

కొన్ని కొన్ని సందర్భాలలో ఆత్మీయులు దూరమైనప్పుడు ఆ ఎడబాటు భరించరానిదిగా ఉంటుంది. దూరమవటం అనేది మరణపూర్వకమైనదైతే ఆ దుఃఖం వర్ణనాతీతం. తల్లిదండ్రులు, బిడ్డలు, సోదరులు, మిత్రులు ఇలాంటి అనుబంధాలు మరణకారణంగా భరించలేనంత శోకాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఇంత శోకాన్ని కలిగించే బంధుత్వాల లేదా అనుబంధాల అసలు రూపాన్ని గురించి వివరించి చెప్పే కథాసందర్భం ఇది. ఈ జీవిత సత్యాన్ని తెలుసుకొన్నప్పుడు ప్రతిమనిషీ అసలు తానెవరు అని ఆలోచించడం ఎంతో కొంత అలవాటవుతుంది. ఈ ఆత్మప్రబోధాత్మకమైన కథాసందర్భం మహాభాగవతం ఆరో స్కంధం పదహారో అధ్యాయంలో ఉంది. పూర్వం చిత్రకేతువు అనే ఓ మహారాజు ఉండేవాడు. ఆ మహారాజుకు లేకలేక ఓ మగబిడ్డ కలిగాడు. రాణివాసంలో రేగిన అసూయాద్వేషాల విషజ్వాలకు ఆ బిడ్డ కన్నుమూశాడు. దాంతో పట్టపురాణి, రాజు, రాజబంధువులు అంతా దుఃఖంలో మునిగిపోయారు. చిత్రకేతు మహారాజుకు నారదాది మహర్షులతో స్నేహసంబంధాలుండేవి. ధర్మాత్ముడైన రాజు దుఃఖంలో మునిగిపోయాడన్న విషయం తెలుసుకొని ఆ రాజును ఓదార్చేందుకు నారదుడు తదితర రుషులంతా వచ్చాడు. అనేక విధాలుగా ఆ రుషులు రాజును ఓదార్చారు. ఆ క్రమంలో నారదుడు చిత్రకేతు మహారాజుకు జీవిత సత్యాన్ని, జీవాత్మ సత్యాన్ని తెలియచెప్పాలని సంకల్పించుకున్నాడు.



#### కర్మను బట్టే జన్మ

మరణించిన బిడ్డ చుట్టూచేరి రాజు, ఆయన బంధువర్గమంతా శోకిస్తున్నప్పుడు నారదుడు మృతుడైన రాజకుమారుడి జీవాత్మను పిలిచాడు. ఆ జీవాత్మ అక్కడకు రాగానే నారదుడు ఇలా అన్నాడు. ఓ జీవాత్మా! నీ తల్లిదండ్రులు, బంధువులు నీ ఎడబాటును సహించలేక శోకంలో మునిగి ఉన్నారు కనుక నీవు మళ్లీ నీ కళేబరంలోకి ప్రవేశించు. శేషజీవితాన్ని నీ బంధుమిత్రులతో గడుపుతూ నీ తండ్రి ద్వారా సంక్రమించే రాజసింహాసనాన్ని అధిష్ఠించు అని అన్నాడు. నారదుడి మాటలను విన్న జీవాత్మ అక్కడున్న వారందరికీ వినిపించేలా ఇలా అంది. ఓ దేవర్షీ నేను నా కర్మానుసారం దేవ, మనుష్య, పశుపక్ష్యాది అనేకానేక జన్మలను ఎత్తుతూ ఉన్నాను. ఆ క్రమంలో నాకు ఎందరెందరో తల్లిదండ్రులు, బంధువులు ఉన్నారు. ఇక్కడున్న తల్లిదండ్రులు మాత్రమే నాకు తల్లిదండ్రులు కారు. వేరు వేరు జన్మలలో అందరూ ఒకరికొకరు బంధువులు, జ్ఞాతులు, శత్రువులు, మిత్రులు, మధ్యస్థులు, ఉదాసీనులు, ద్వేషించేవారుగా ఉంటూనే ఉంటారు. బంగారం, భూమి లాంటివి క్రయవిక్రయాలు జరిగినప్పుడు ఒక వ్యాపారి నుంచి మరొకరి దగ్గరకు చేరుతుంటాయి. జీవుడు కూడా కర్మానుభవాన్ని అనుసరించి బంగారం చేతులు మారినట్టే జన్మలు మారుతూ ఉంటాడు. భూమిని లేదా ఇల్లును ఒకరికి అమ్మి ఆ తర్వాత ఇంతకుముందు ఈ భూమిలో, ఈ ఇంట్లో నా తాత, ముత్తాత, తండ్రి అందరం తరతరాలుగా ఉన్నాం. మళ్లీ మా ఇల్లు మాకిచ్చేయండి అని కొన్ని తరాల తర్వాత ఎవరైనా అంటే అది ఎలా హాస్యాస్పదంగా ఉంటుందో ఒక జన్మ నుంచి మరణం ద్వారా ముక్తిపొందాక మళ్లీ ఆ జన్మకు సంబంధించిన శరీరంలోకి వచ్చి చేరటం కూడా అంతే హాస్యాస్పదంగా ఉంటుంది.

#### క్షణభంగురం జీవితం

ఈ బంధాలు, అనుబంధాలు అనేవి ఒక రకంగా ఆలోచిస్తే క్షణికాలు మాత్రమే. జీవాత్మ మాత్రం నిత్యం. అది అహంకార రహితం. స్వయంప్రకాశం. జీవాత్మ భగవంతుడి అంశ అయినందువల్ల విశ్వమంతటా కర్మానుసారం అనుభవించిన అనేక రూపాలలో కనిపిస్తుంటుంది. జీవాత్మకు ఇష్టమైనవికానీ, ఇష్టం కానిదికానీ ఏదీ ఉండదు. తనవాడు, పరాయివాడు అనే భేదం అసలే ఉండదు. కనుక ఒకసారి శరీరాన్ని విడిచాక అది మళ్లీ తనకు ఇష్టమైనదని, ఆ శరీరం ద్వారా ప్రియమైన బంధువులను కలుసుకోవచ్చనే ఆలోచన జీవాత్మకు ఎప్పుడూ ఉండదు. కనుక విడిచిపెట్టిన శరీరంలోకి మళ్లీ వెళ్లే ఆలోచనే ఉండదు అని జీవాత్మ నారదుడికి చెప్పింది. ఆ మాటలను అక్కడున్న చిత్రకేతు మహారాజుతో సహా అందరూ విని జీవిత సత్యం తెలుసుకొని దుఃఖాన్ని విడిచిపెట్టారు.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# రాఘవేంద్రస్వామి ఆరాధన సప్తరాత్రోత్సవాలు

- ఆగస్టు 9 నుంచి 15 వరకు
- రాఘవేంద్రానుగ్రహ పురస్కారాలకు భారత రత్న డా॥ సీ.ఎన్.ఆర్ రావు, డా॥ ఎన్.ఆర్ నారాయణ మూర్తి, ఆచార్యులు ఎ.హరిదాస భట్‌లు ఎంపిక

**కర్నూలు, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి 343వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు ఆగస్టు 9తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయి. 11వ తేదీన పూర్వారాధన, 12న మధ్యారాధన, 13న ఉత్తరారాధన జరగనుంది. ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠాత్మక శ్రీరాఘవేంద్ర అనుగ్రహ పురస్కారాలకు ఈ ఏడాది ముగ్గురు ప్రముఖులను ఎంపిక చేశారు. సైన్స్ శాస్త్రవేత్త భారత రత్న డాక్టర్ సీ.ఎన్.ఆర్ రావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ ఎన్.ఆర్ నారాయణ మూర్తి, విద్వాన్ ఎ.హరిదాస భట్‌లు ఎంపికయినట్లు శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. వీరి చిత్రాలు, వివరాలతో ఈ ఏడాది ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలను త్రీడీ చిత్రాలతో ముద్రించినట్లు పేర్కొన్నారు. చెన్నైకి చెందిన భక్తుడు, జి.వై.ఆర్‌కు ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు జి.రాజు రూ.2.20లక్షల ఖర్చుతో ఆహ్వాన పత్రికలను ముద్రించినట్లు శ్రీమఠం మేనేజర్ తెలిపారు. వీటితో పాటు శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఈ నెల 24 నుంచి చేపట్టే చతుర్మఖ దీక్షల కోసం 3500 పత్రికలను ముద్రించారని పేర్కొన్నారు. శ్రీమఠం చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్స్‌ను పదివేలు ఉచితంగా ముద్రించి శ్రీమఠానికి అందజేసినట్లు అధికారులు తెలిపారు.




సిద్ధమైన ఆహ్వాన పత్రిక



పత్రికపై పూర్వ, ప్రస్తుత పీఠాధిపతులు చిత్రాలు

తెలుగు వాణి

# అంజన్న ఆలయంలో వరుణ పూజలు



కొండగట్టు కోనేరులో వరుణ పూజలు చేస్తున్న అర్చకులు

**కరీంనగర్, న్యూస్‌టుడే:** వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వరుణ పూజలు సోమవారం నాటితో ముగిశాయి. ఆలయ అర్చకులు బిందెలతో నీళ్లు తీసుకొచ్చి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. పుష్కరిణిలో పూజలు చేసి వర్షాలు కురిపించాలని వరుణ దేవున్ని కొలిచారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, స్థానాచార్యులు తిరుక్కోవెల మారుతి, అర్చకులు ప్రధాన అర్చకులు మారుతిస్వామి, చిరంజీవి, కపిందర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్కి అవతారంలో జగన్నాథస్వామి



**ద్వారకాతిరుమల, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం శ్రీజన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామి కల్కి అవతారంలో భక్తులను కనువిందు చేశారు. మహావిష్ణువు ఎత్తిన అవతారాల్లో ఈ అవతారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ అవతారంలో స్వామివారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు.

## నిండుచెరువు

**బా**గా సమృద్ధిగా ఉండటం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. చెరువు నిండుగా ఉన్నప్పుడు వ్యవసాయానికి లేదా మంచినీటికి కొరతే ఉండదు. అంతా సమృద్ధిగా ఉంటుంది. చెరువులో నీరులాగే సిరిసంపదలు ఎవరి దగ్గరైనా సంమృద్ధిగా ఉన్నప్పుడు అలాంటి వారిని నిండుచెరువుతో పోల్చి చెప్పటం కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

# కన్నుల పండువగా కల్యాణోత్సవం

**మహబూబ్‌నగర్ , న్యూస్‌టుడే :** సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం కమణీయంగా సాగింది. జిల్లాకేంద్రం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న శ్రీకృష్ణకాలచక్రం అతిరుద్రయాగం మూడోరోజు విశేషపూజలు, హోమాలు సాగాయి. సాయంత్రం జరిగిన స్వామీజీ ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. పాలమూరు జిల్లాలో సాంప్రదాయక ఆంగ్లమాధ్యమ పాఠశాలను ఏర్పాటుచేయనున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ వెల్లడించారు. వచ్చే ఏడాది మేలో పాఠశాలను ప్రారంభించనున్నట్లు స్వామీజీ పేర్కొన్నారు. మానవజీవితం ఎన్నో జన్మల పుణ్యఫలం అని అన్నారు. దేశంలో పాశ్చాత్య సంస్కృతి పేరుకుపోకుండా ధర్మస్థాపన, హైందవ సంస్కృతి పరిరక్షణకు ఇలాంటి మహోన్నత కార్యక్రమాలను అనేక ప్రాంతాల్లో చేపడుతున్నట్లు వివరించారు. అంతకుముందు ఉదయం 8గంటలకు సూర్యహోమాలు, చండీహోమం నిర్వహించారు. సాయంత్రం వేదికపై అక్కాచెల్లెళ్లు మేఘన, శ్రావణి ఆలపించిన భక్తిపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లా ప్రజలకు శుభం చేకూరాలని కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ నేతృత్వంలో సాగుతున్న అతిరుద్ర మహాయాగం ఇక్కడి ప్రజల పుణ్యఫలంగా భావించాలని బ్రాహ్మణ సేవాసమితి జిల్లా ప్రధానకార్యదర్శి రాఘవేంద్రశర్మ అన్నారు.



యాగంలో పాల్గొన్న భక్తులు

# ఉత్తమోత్తమం...శుకశాస్త్రం

భారతీయ సనాతన సంప్రదాయంలో జ్ఞానవిజ్ఞానాలను బోధించే శాస్త్రాలు ఎన్నెన్నో ఉన్నాయి. వాటన్నిటిలోకి ఉత్తమోత్తమమైన శాస్త్రం శుకశాస్త్రం. ఈ శాస్త్రం మనిషికిచ్చే జ్ఞాన భాగ్యాన్ని గురించి తెలియచెప్పే కథా సందర్భం ఇది. పద్మపురాణాంతర్గతంగా ఉన్న శ్రీమద్భాగవత మహాత్మ్యంలో ఉన్న సారాంశమిది. శుకశాస్త్రమంటే శుక మహాయోగి ప్రవచనం చేసిన శాస్త్రం. శుకయోగి తన తండ్రి అయిన వ్యాసభగవానుడు తీర్చిదిద్దిన మహాభాగవతాన్ని పరీక్షిన్మహారాజుకు వివరించి చెప్పాడు. భాగవతం అక్షరాలా ఓ శాస్త్రం. అది మానవ జీవితానికి మార్గదర్శక సూత్రాలను, సన్మార్గ దర్శనాలను గురించి తెలియచెబుతూ ఉంటుంది. శుకుడు బోధించటం వల్ల భాగవతానికి శుకశాస్త్రం అనే పేరొచ్చింది. భాగవతం ఎంతో మహిమాన్వితం. పాపప్రక్షాళన చేసే పుణ్యతీర్థం. అహర్నిశలు అర్థం తెలుసుకొని భాగవత శాస్త్రాన్ని పఠించేవారికి వెనుకటి జన్మల పాపమంతా నశిస్తుంది. ప్రతి నిత్యం భాగవతంలోని సగం శ్లోకాన్ని కానీ లేదా కనీసం ఒక శ్లోకపాదాన్నైనా సరే చదివేవారికి రాజసూయ, అశ్వమేధ యజ్ఞాలు చేసిన ఫలం దక్కుతుంది. నిత్యం భాగవతాన్ని చదవటం, భగవంతుడిని ధ్యానం చేయటం, తులసికి నీరు పోయటం, గోసేవ చేయటం అనే ఈ నాలుగు పనులు సమానమైన పుణ్యఫలాన్నిస్తాయి. ప్రాణాలు విడిచే సమయంలో భాగవతంలోని వాక్యాలను వినే వారి మీద పరమాత్ముడు కరుణ చూపుతాడు. అలాంటి వారికి ఆ గోవిందుడే నేరుగా వైకుంఠధామాన్ని ప్రసాదిస్తాడు.



### భాగవతం గోవింద స్వరూపం

భాగవతం సాక్షాత్తు గోవింద స్వరూపం. అందుకే భాగవతాన్ని బంగారు సింహాసనం మీద ఉంచి పూజ చేసి ఆ తర్వాత దాన్ని ఒక విష్ణుభక్తుడికి దానం ఇవ్వాలి. అలా ఇచ్చేవారు భగవంతుడి సాయుజ్యాన్ని పొందుతారు. జీవితకాలంలో ఎప్పుడో ఒకసారైనా సరే భాగవతాన్ని వినాలి. అలా వినని జీవితాలు వ్యర్థాలు. భాగవత కథను వినని వారిని స్వర్గంలోని ఇంద్రాది దేవతలు నిరసిస్తారు. ఈ ప్రపంచంలో భాగవత కథను వినటం కానీ, చదవటం కానీ పాపాత్ములకు సాధ్యం కాదు. కోట్లకొద్దీ జన్మలలో పుణ్యం చేసుకున్నవారికి మాత్రమే ఆ భాగ్యం దక్కుతుంది. భాగవతాన్ని వినటానికి ప్రత్యేక దినాలు అని నియమం ఏమీలేదు. నిరంతరం దాన్ని వినటమే శ్రేయస్కరం. సత్యం పలుకుతూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ భాగవతాన్ని వినటం మంచిది. కానీ కలియుగంలో అలా ఉండటం చాలా కష్టం. అందుకే శుకయోగి ఒక విశేషమైన పద్ధతి ప్రవేశపెట్టారు.

### భాగవత సప్తాహంతో సత్ఫలితం

కలియుగంలో చిత్తవృత్తులను నియంత్రింటం, నియమాలకు కట్టుబడి ఉండటం, దీక్ష వహించటం అంత సులభంకాదు. అయితే అందరికీ అనువైన ఓ పద్ధతిని శుకయోగి ప్రవేశపెట్టారు. అదే ఏడు దినాల శ్రవణ విధానం. దీన్నే భాగవత సప్తాహం అని కూడా అంటారు. ప్రతి నిత్యం భాగవతాన్ని నియమాలను పాటిస్తూ విన్నంత ఫలితం భాగవత సప్తాహంలో భాగవతాన్ని విన్నందువల్ల వస్తుంది. మనస్సు చంచలం కావటం, రోగాలు అధికం కావటం, ఆయువు తగ్గిపోవటం లాంటివన్నీ కలియుగంలో సంభవిస్తుంటాయి. భాగవత సప్తాహ శ్రవణం వీటన్నిటినీ పోగొట్టి శుభాన్ని, పుణ్యాన్ని కలగచేస్తుంది. తపస్సు, యోగం, సమాధివల్ల లభించని పుణ్యఫలం ఏడు రోజులపాటు వరుసగా భాగవత కథాశ్రవణం చేయటంవల్ల చాలా సులభంగా సంపూర్ణంగా లభిస్తుంది. సప్తాహ శ్రవణం గొప్పగొప్ప యజ్ఞాలకన్నా వ్రతాలకన్నా మిన్న. అది ధ్యానంకంటే, జ్ఞానంకంటే ఉన్నతమైంది. భాగవతాన్ని శ్రవణం చేస్తేచాలు శారీరక, మానసిక పాపాలు ఉపశమిస్తాయి. గయ, గంగ, కాశీ, పుష్కరం, ప్రయాగ వంటి పుణ్యక్షేత్రాల వల్ల, తీర్థాల వల్ల కలిగే పుణ్యఫలం భాగవత శ్రవణపుణ్యఫలం కంటే కొద్దిగా తక్కువగానే ఉంటుంది. ఓంకారం, గాయత్రీ, పురుషసూక్తం, మూడు వేదాలు, శ్రీమద్భాగవతం ఒకేలాంటి పుణ్యాన్ని అనుగ్రహిస్తాయి. అగ్నిహోత్రం, గోవు, ద్వాదశీతిథి, తులసీ, వసంతరుతువు, పురుషోత్తముడైన పరమాత్ముడు ఎంత మహత్తుతో ఉంటారో అంతే మహత్తు భాగవతానికి ఉంది. శుకశాస్త్రం అనే మరోపేరున్న భాగవత శాస్త్రం ఇంత గొప్పది కనుక దాన్ని ప్రతి వారూ భక్తిశ్రద్ధలతో చదవటం మేలని ఈ కథాసందర్భం వివరిస్తోంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# ఆకట్టుకున్న శాకాంబరీ అలంకారం!

**కడప, న్యూస్‌టుడే :** పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మంగళవారం సాయంత్రం అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) సందర్భంగా ఇలా అలంకరించినట్లు ఆర్యవైశ్య సంఘం మహిళలు తెలిపారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని సుందరంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం లక్ష మల్లెపూలతో అమ్మవారిని ఆరాధించనున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో గునిశెట్టి భ్రమరాంబ, శశికళ, గాదంశెట్టి సత్యవతమ్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, మనోహర్ పాల్గొన్నారు.



శాకాంబరీదేవిగా దర్శనమిస్తున్న జగన్మాత

# ముక్కంటి చెంతకు 'దుర్గా మల్లేశ్వరుడు'

**శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా, న్యూస్‌టుడే:** విజయవాడ దుర్గా మల్లేశ్వరుని ప్రచార రథం మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చింది. ఈ సందర్భంగా ఇక్కడి ఆలయ అధికారులు ప్రచార రథానికి ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి అర్చన చేసిన కుంకుమతో పాటు దివ్య ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముక్కంటి ఆలయం తరఫున అక్కడి అర్చకులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు హరియాదవ్‌తో పాటు పలువురు హాజరయ్యారు.



## దేవదేవుడికి నీరాజనం



**తొలి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీమహావిష్ణువును, ఆయన అవతార అంశలను ప్రజలు విశేషంగా ఆరాధించి పూజలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఆలయాల్లో హరినామస్మరణ మార్మోగింది.**

ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో వెంకన్నకు ప్రత్యేక అలంకరణ ←

మార్కాపురంలో చెన్నకేశవుడు →



## ఏనుగు మీద ఎలుక

జాతీయాలు నుడికారాలు

**భా**రం అనిపించని విషయం, తేలికైనది, సులువైనది అనే లాంటి అర్థాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. ఏనుగుతో పోలిస్తే ఎలుక చాలా అల్పమైన జంతువు. ఎలుకను ఒకవేళ ఏనుగు మొయ్యాల్సివస్తే దానికి ఎలుక బరువు అని అనిపించదు. అసలు తన మీద ఎలుక ఉందన్న భావం ఏనుగుకు ఉండనే ఉండదు. అలాగే సంపన్నులు కొద్దిపాటి సహాయాన్ని చెయ్యటానికి ఏ మాత్రం బాధపడరు. ఆ సహాయం వారికి భారం కానీ, నష్టమని కానీ అనిపించదు. అలాంటి సంఘటనలను గురించి చెప్పాల్సివచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

తెలుగు వాణి

# వైభవంగా పాండురంగస్వామి శాంతి కల్యాణం

**ఏలూరు , పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** తొలిఏకాదశి గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా స్థానిక పాత బస్‌స్టేషన్ వద్ద గల పాండురంగస్వామి దేవస్థానంలో మంగళవారం వైభవంగా పాండురంగస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. అర్చకులు డి.కనకసుందరశర్మ ఆధ్వర్యంలో పాండురంగస్వామిని శ్రీకృష్ణపరమాత్మగా అలంకరించి తులసీ దళార్చన చేశారు. ఉదయం సర్వకార్యసిద్ధికి మహాగణపతి, లక్ష్మీహోమం చేశారు. భక్తులకు పేలాల పిండి ప్రసాదం అందజేశారు. సంగీత విద్వాంసురాలు చల్లపల్లి సుభద్రాదేవి గానం చేసిన ఆధ్యాత్మిక సంకీర్తనలు భక్తులను అలరించాయి. జయలక్ష్మీరామచంద్రన్(వయోలిన్), చల్లపల్లి లక్ష్మీనారయణన్(మృదంగం) వాద్యసహకారం అందించారు. ఆలయ ఈవో కేవీఆర్ నాగేశ్వరరావు, ఎం.పాండురంగారావు, సరోజినిదేవి దంపతులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.



శ్రీకృష్ణ పరమాత్మ అలంకారంలో పాండురంగస్వామి దివ్యదర్శనం

# గుట్టలో శ్రీపాశుపతహవన రుద్రాభిషేకం

**నల్గొండ, న్యూస్‌టుడే:** విశ్వశాంతి, సుభిక్షతల కోసం ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శ్రీపాశుపతహవన పూర్వక రుద్రాభిషేకం నిర్వహణకు సన్నాహాలు చేపట్టింది. ఈనెల పదో తేదీ వరకు వరుణయాగం నిర్వహించనున్నట్లు దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. వర్షాభావంతో ఏర్పడ్డ దుర్భిక్ష వాతావరణాన్ని సుభిక్షం చేసేందుకు వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ ఈ ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొండపైనే ఉన్న శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరుడి ఆలయంలో నాలుగు రోజుల పాటు కొనసాగే శ్రీపాశుపతహవన పూజల్లో మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, వరుణానువాక పారాయణం, మూల మంత్రజపం, పాశుపతహవనం నిర్వహిస్తారు. ఈ పర్వాల నిర్వహణ కోసం ప్రధాన దేవాలయం చెంత సంప్రదాయ ఏర్పాట్లు చేపట్టారు. వచ్చే సోమవారం సాయంత్రం విఘ్నేశ్వర పూజతో శ్రీకారం జరుగుతుంది. మంగళవారం యాగశాలలో నవగ్రహ, క్షేత్రపాలక మండప ఆరాధనలు, కలశస్నాపన చేపడతారు. అదే రోజు సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ వర్ష




పాశుపతహవనం నిర్వహిస్తారు. మూడో రోజు బుధవారం విరాటపర్వ పారాయణం, వరుణహోమం, నిర్వహించి అనుగ్రహ భాషణం చేపడతారు. చివరి రోజు గురువారం వర్షపాశుపతహోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఋష్యశృంగ విగ్రహ నిమజ్జనం జరుగుతుందని అధికారులు వివరించారు. తొగుట్ట స్వామి మాధవానంద సరస్వతీ స్వామిజీ పర్యవేక్షణలో వరుణయాగం కొనసాగుతుందని, టీకేవీ రాఘవన్ ప్రసంగిస్తారని ఈవో కృష్ణవేణి పేర్కొన్నారు.

# అగస్త్యమహాముని మహాజ్ఞాని

అగస్త్యభ్రాత అనంటే అగస్త్యమహాముని సోదరుడు అని అర్థం. సర్వసాధారణంగా అగస్త్యభ్రాత అనే పదం ప్రస్తుత సమాజంలో కూడా చాలా చోట్ల వినిపిస్తూనే ఉంటుంది. ఇది జాతీయంగా ప్రయోగంలో కూడా ఉంది. తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు లేనివాడు, ఎవరిదో పేరును అడ్డంపెట్టుకొని బతికేవాడు అనేలాంటి అర్థాలు జాతీయంగా ప్రయోగంలో ఉన్న అగస్త్యభ్రాతకున్నాయి. ఇంతకీ ఈ అగస్త్యభ్రాతకు అసలేదైనా పేరుందా, లేదా అనంటే చాలా మంది పేరు లేదనే అంటారు. కానీ ఆయనకోపేరుంది. ఆయన

ధర్మపథం

గొప్పతనాన్ని అరణ్యవాస సమయంలో శ్రీరామచంద్రుడు నేరుగా దర్శించారు. అంతే కాదూ ఆయన ఆతిథ్యాన్ని సీతారామలక్ష్మణులు స్వీకరించారు. ఈ విషయాలను గురించి తెలియచెప్పే కథాసందర్భమే ఇది. వాల్మీకి రామాయణం అరణ్యకాండ పదకొండో సర్గలో ఈ విషయాలన్నీ ఉన్నాయి. సీతారామలక్ష్మణులు అరణ్యవాసం చేస్తూ అనేకానేక ఆశ్రమాలను దర్శిస్తూ ముందుకు వెళుతున్నారు. ఒక ఆశ్రమంలో దాదాపు పది మాసాలు, మరోచోట ఒక సంవత్సరం, వేరొక చోట నాలుగు మాసాలు ఉన్నారు. మరికొన్ని ఆశ్రమాలలో అయిదు మాసాలు, ఆ క్రమంలోనే వేరొక చోట ఆరు, ఏడు మాసాలపాటు నివసించారు. కొన్నిట్లో మాత్రం ఒక మాసం పాటే ఉన్నారు. మరికొన్ని ఆశ్రమాల్లో ఒక మాసంకంటే ఎక్కువగా, అర్ధమాసం కంటే ఎక్కువగా, మరికొన్నిట్లో మూడు మాసాలు, ఇంకొన్నింటిలో ఎనిమిది మాసాలపాటు హాయిగా నివసించారు. అలా తిరుగుతూ తిరుగుతూ సుతీక్ష్ణమహాముని ఆశ్రమానికి వెళ్లి అతిథిపూజలందుకున్నారు. సుతీక్ష్ణమహాముని నిత్యం ఎన్నెన్నో విషయాలను వారికి చెబుతుండేవాడు. ఆ కథల పరంపరలోనే దండకారణ్యంలో అగస్త్యమహాముని ఆశ్రమం ఉందని, ఆ అగస్త్యుడిని చూసి తీరాలని చెప్పాడు. ఆ ముని అగస్త్యుడి గురించి చెప్పేలోగా శ్రీరాముడు కూడా తనకు అగస్త్యమునిని చూడాలని కోరికగా ఉందని, ఆయన ఆశ్రమానికి దోవ చెప్పమని అడిగాడు. తాను



రాముడికి చెప్పాలనుకొన్న విషయాన్నే రాముడు తనతో ప్రస్తావించటంతో సుతీక్ష్ణమహామునికి ఆనందంవేసింది. వెంటనే తన ఆశ్రమానికి దక్షిణ దిక్కుగా నాలుగు యోజనాల దూరం వెళితే ముందుగా అగస్త్యభ్రాత ఆశ్రమం వస్తుందని చెప్పాడు.

### తల్లి గర్భంలోనే జ్ఞానోదయం

అగస్త్యభ్రాతకు పెద్దలు పెట్టిన పేరు సుదర్శనుడు. ఆయన మహాజ్ఞాని. తల్లిగర్భంలో ఉన్నప్పుడే ఆయనకు జ్ఞానోదయమైంది. ఆయనుండే ఆశ్రమ ప్రదేశం వివిధ పుష్ప, ఫల వృక్షాలతో ప్రత్యేకంగా రావి వృక్షాలలో విలసిల్లుతుంటుంది. అక్కడ అనేక విధాలైన పక్షుల కిలకిలరావాలు వినిపిస్తుంటాయి. నిర్మలమైన జలంతో, ఆ జలంలో పద్మాలతో కళకళలాడుతుంటాయి. అక్కడి సరస్సులు, హంసలు, కన్నెలేడి పిట్టలు, చక్రవాకాలు ప్రకృతి శోభను ఇనుమడింపచేస్తుంటాయి అని సుతీక్ష్ణమహాముని రాముడికి అగస్త్యభ్రాత ఆశ్రమ ఆనవాళ్లను చెప్పాడు. ఆ ఆశ్రమంలో ఒక రాత్రి గడిపి మరుసటి ఉదయం వేళ అక్కడి నుంచి దక్షిణ దిక్కుగా వనసమూహాలకు పక్కగా యోజన దూరం వెళితే అగస్త్యముని ఆశ్రమం వస్తుందని సుతీక్ష్ణముని చెప్పిన మాటను అనుసరించి సీతారామలక్ష్మణులు అటుగా బయలుదేరి వెళ్లారు.

### ఆ ప్రదేశం శోభాయమానం

అగస్త్యభ్రాత ఆశ్రమాన్ని దూరం నుంచి ముందుగా రాముడు చూసి గుర్తించి ఆ విషయాన్ని సీతాలక్ష్మణులకు తెలియచెప్పాడు. సుతీక్ష్ణముని చెప్పినట్టుగానే ఆ ప్రదేశం ఎంతో శోభాయమానంగా ఉంది. పక్వానికొచ్చిన పిప్పళ్ల ఘాటైన వాసనలు ఆనందపరుస్తున్నాయి. అక్కడక్కడ హోమకార్యాల కోసం పోగుచేసిన కట్టెపుల్లలు, సేకరించిన దర్భలు ఉన్నాయి. ఆశ్రమంలోని హోమగుండం నుంచి పొగలు వస్తూ ఆకాశంలో నల్లని మేఘాల అంచుల్లాగా కనిపిస్తున్నాయి. మెల్లగా సీతారామలక్ష్మణులు అగస్త్యసోదరుడి ఆశ్రమానికి సమీపంగా వెళ్లే సమయానికి సూర్యాస్తమయ సంధ్యాకాలమైంది. అప్పుడు రాముడు తమ్ముడితో కలిసి యథావిధిగా సంధ్యావందనం చేసి ఆశ్రమంలోకి ప్రవేశించి అగస్త్య సోదరుడికి నమస్కరించారు. ఆ ముని సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరాముడికి సాదరంగా స్వాగత మర్యాదలు చేసి కందమూల ఫలాలను ఆహారంగా ఇచ్చాడు. మరునాటి ఉదయం ఆ మహామునికి నమస్కరించి ఆయన ఆశ్రమంలో ఒకరాత్రి హాయిగా గడిపామని చెప్పాడు. ప్రస్తుతం తాను ఆయన సోదరుడైన అగస్త్యుడిని చూడాలనుకుంటున్నట్లు దయతో అనుమతి ఇవ్వమని కోరాడు రాముడు. అగస్త్య సోదరుడు అలాగేనని చెప్పి వారికి వెళ్లాల్సిన దోవను వివరించి చెప్పాడు. ఇలా రామాయణం అరణ్యకాండలో అగస్త్యభ్రాత ఆచూకీ కనిపిస్తోంది.

- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు



రథోత్సవంలో స్వామివారు

## ఘనంగా జగన్నాథస్వామి రథోత్సవం

**ద్వారకాతిరుమల, పశ్చిమగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చినవెంకన్న ఉపాలయమైన లక్ష్మీపురం జగన్నాథస్వామివారి రథోత్సవ కార్యక్రమాలు బుధవారంతో వైభవంగా ముగిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు దశావతారాల్లో భక్తులకు కనువిందు చేశారు. సాయంత్రం 5 గంటలకు జగన్నాథస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా రథాన్ని పుష్పమాలలతో, విద్యుద్దీపాలతో నయనానందకరంగా తీర్చిదిద్దారు. దీనిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం మేళతాళాల నడుమ ,స్వామివారి నామస్మరణతో రథం ఆలయం వద్ద నుంచి బయలుదేరి తిమ్మాపురం పురవీధుల్లో తిరిగింది. ఆలయ ఏఈవో ఎం.దుర్గారావు రథోత్సవాన్ని ప్రారంభించారు. వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని తిలకించారు.



జగన్నాథస్వామి

## వైభవంగా తిరుగు రథయాత్ర

### పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** నగరం కొత్తరోడ్డు ప్రాంతంలో కొలువై ఉన్న జగన్నాథస్వామి తిరుగు రథోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి రథాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి విగ్రహాలను భక్తుల దర్శనార్థం గుండిచాదేవి ఆలయం వద్ద రథంలో ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా తిరుగు రథోత్సవాన్ని ప్రారంభించారు. గోవిందనామ స్మరణలతో రథం ముందుకు సాగింది. రథోత్సవం నృత్యాలతో, సన్నాయి మేళతాళాలతో, జగన్నాథ నామ స్మరణలతో వైభవంగా జరిగింది. ఈ యాత్ర పూర్ణామార్కెట్, ఏవీఎన్ కళాశాల డౌన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డుకు చేరుకుంది. ఆలయ కార్యనిర్వాహణాధికారి అల్లు జగన్నాథరావు మాట్లాడుతూ దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిచ్చారన్నారు.

### అంకుశం

చాలా పెద్ద మదపుటేనుగును మావటివాడు చిన్న అంకుశంతో నియంత్రిస్తుంటాడు. ఆ మదపుటేనుగు ఆకారంతోకానీ, శక్తితోకానీ పోల్చుకుంటే అంకుశం చాలా అల్పమైనదే. కానీ అంత ఏనుగును లొంగదీసే శక్తి ఆ అంకుశానికే ఉంటుంది. అలాగే కొంత మంది ఎంతో బలవంతులనుకున్నవారిని, పెద్దవారిని తమ తెలివితేటలతోనో, ఇతరత్రా వ్యవహారాలతోనో లొంగదీసుకుంటుంటారు. అలాంటి వారిని గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు అంకుశంతో వారిని పోల్చి చెప్పటం ఈ జాతీయం విశేషం.

జాతీయాలు నుడికారాలు

## ఏకశిఖరునికి లక్షబిల్వార్చన

**యాదగిరిగుట్ట, నల్గొండ జిల్లా, న్యూస్‌టుడే:** వరుణదేవుడి కరుణ కోసం రుద్రాభిషేకం, జపం, పారాయణం, విరాటపర్వం, స్థాపిత దేవతాపూజలు, ముక్కంటికి లక్షబిల్వార్చన, వరుణ సూక్తం... శ్రీరుద్రక్రమార్చనలతో ఏకశిఖరుడి సన్నిధిలో కొనసాగుతున్న శ్రీపాశుపత హవన పూర్వక రుద్రాభిషేకంలో బుధవారం నాటి విశేషాలివి. ఏకశిఖరుడి సన్నిధిలో నిత్యపూజలందుకుంటున్న రామలింగేశ్వరుడి ఆలయంలో బుధవారం వర్షపాశుపత రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన నిర్వహించారు. నిరంతర అభిషేకంతో అభిషేక ప్రియుడిని కొలుస్తూ జపం, పారాయణాలు చేపట్టారు. మహానివేదన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

తెలుగు వాణి



పరమేశ్వరుడికి బిల్వార్చన చేస్తున్న పూజారి



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న తితిదే అర్చకులు



పెళ్లికుమారుని అలంకరణలో స్వామి



పెళ్లికుమార్తె అలంకరణలో శ్రీదేవి, భూదేవి

## నేత్రపర్వంగా శ్రీనివాసుడి కల్యాణం

**అనంతపురం, న్యూస్‌టుడే:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గోరంట్ల పట్టణంలో ఏర్పాటుచేసిన శ్రీనివాసకల్యాణం ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. వేలాది మంది భక్తుల మధ్య కలియుగవైకుంఠ శ్రీనివాసుడు శ్రీదేవి, భూదేవి మెడలో తాళికట్టారు. గోరంట్లలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైన వివాహ వేడుకలు రాత్రి పది గంటలకు ముగిశాయి. తితిదే అర్చకులు సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను చేపట్టి ఈవేడకల కార్యక్రమాన్ని నాలుగుగంటలపాటు నిర్వహించారు. గోరంట్లతోపాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు వేలసంఖ్యలో తరలివచ్చారు. తిరుమల వెళ్లినా చూడలేనంత ఆనందంగా కల్యాణోత్సవాలను ప్రజలు, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో తిలకించారు. గోవిందా, గోవిందా నామస్మరణతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. వెంకటేశ్వర స్వామిని పెళ్లికుమారుడిగా, భూదేవి, శ్రీదేవిలను పెళ్లికుమార్తెలను నయనానందంగా అలంకరించారు. గోరంట్ల ప్రాంత ప్రజలు ఎంతో అదృష్టం చేసుకొన్నారని, అందుకే ప్రజలచెంతకే స్వామి తరలివచ్చి వివాహం చేసుకొంటున్నాడని తితిదే సిబ్బంది ప్రసంగాల్లో హర్షం వ్యక్తంచేశారు. పట్టణంలో కల్యాణోత్సవాలు నిర్వహించడం ఇది రెండోసారి. ఇదివరలో 2011 నవంబరులో వైభవంగా నిర్వహించిన తితిదే రెండోసారి బుధవారం అంగరంగ వైభవంగా ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించి ప్రజలు పులకించిపోయారు. మధ్యమధ్యలో నిర్వహించిన వెంకటేశ్వర భక్తి గీతాలాపాన కార్యక్రమం ఆకట్టుకొంది.

# పంచవటి ప్రాముఖ్యం

**పం**చవటి అనగానే రామాయణకథలోని సీతారామలక్ష్మణుల వనవాసం గుర్తుకొస్తుంది. ఇలా గుర్తుకురావటానికి అనేకానేక కారణాలున్నాయి. అసలు రామాయణకథంతా ఓ పెద్ద మలుపు తిరిగింది పంచవటి దగ్గరేనని అనిపిస్తుంది. రామాయణం అరణ్యకాండలో ఈ పంచవటి, దాని విశేషాలు కనిపిస్తాయి.

శ్రీరామచంద్రుడు తండ్రి ఆజ్ఞననుసరించి అరణ్యవాసానికొచ్చాడు. ఆయనను సీతాలక్ష్మణులు అనుసరించారు. ఆ క్రమంలో వారు ముందుగా అగస్త్యుడి సోదరుడి ఆశ్రమాన్ని దర్శించి అనంతరం అగస్త్యుడి ఆశ్రమానికి వెళ్లారు. అగస్త్యుడు రాముడిని గౌరవించి సత్కరించి ఆ అరణ్యంలో ఆయనకు నివాసానికి యోగ్యమైన ప్రదేశం పంచవటి అని అది అక్కడికి సమీపంలోనే ఉందని సూచించటంతో సీతారామలక్ష్మణులు పంచవటీ ప్రదేశాన్ని చేరారు. అక్కడ లక్ష్మణుడు స్వయంగా అన్నావదినల కోసం చక్కటి పర్ణశాల నిర్మించాడు. అలా అక్కడ వారి నివాసం ప్రారంభమైంది.

### రాక్షస సంహారానికి నాంది ఇక్కడే..

పంచవటిలోనే రామాయణంలో భవిష్యత్తులో జరగబోయే సంఘటనలకు ఆనవాళ్లు కనిపిస్తాయి. రాముడు చేసిన భయంకర రాక్షస సంహారానికి నాంది కూడా ఇక్కడే జరిగింది. శ్రీరామచంద్రుడి గృహస్థ జీవితంలోని ప్రధానఘట్టాలు ఇక్కడే ప్రారంభమయ్యాయి. ఆయన జీవితం ఈ వనవాసం వల్ల ఎన్నెన్నో మార్పులు చెందింది. ఈ మార్పుల్లో సీతావియోగం ఆ స్వామికి చెప్పలేనన్ని బాధలను తెచ్చిపెట్టింది. పంచవటి నివాసం వరకు అరణ్యవాసంలోని ఆయన జీవితం సాఫీగానే జరిగినట్లు కనిపిస్తుంది. వనవాసం వల్ల అప్పటివరకు శారీరకంగా ఏవైనా ఉంటే బాధలున్నాయోమో కానీ మానసిక బాధలు లేవు. పంచవటిలో సీతావియోగం తర్వాత అంతకుముందు ఎప్పుడూ లేనంత మానసిక వ్యధను రాముడు అనుభవించాడు.



### తీపి, చేదు గుర్తులు

పంచవటి నివాస సందర్భంగానే ఆయనకు తన తండ్రి దశరథ మహారాజుకు మిత్రుడైన జటాయువుతో పరిచయం ఏర్పడింది. ఇక్కడే శూర్పణఖ రాముడిని చూసి మోహానికి గురైంది. జనస్థానంలోని పద్నాలుగువేల మంది రాక్షసులను రాముడు హతమార్చింది ఇక్కడే. శ్రీరాముడి చేతిలో రెండుమూడు సార్లు చావకుండా తప్పించుకొన్న మారీచుడు రాముడి చేతిలో మరణించింది కూడా ఈ పంచవటీ ప్రాంతంలోనే. శ్రీరాముడు తన గృహస్థ జీవితాన్ని హాయిగా గడుపుతున్న సమయంలో సీతాపహరణం జరిగినందువల్ల ఆయన జీవితంలోని తీపిగుర్తులు, చేదుగుర్తులు రెండూ ఇక్కడే కనిపిస్తాయి. రామాయణకథలో శ్రీరాముడి వ్యక్తిత్వ ఔన్నత్యం పంచవటిలో జరిగిన కొన్ని సంఘటనల ద్వారా స్పష్టంగా వ్యక్తమవుతోంది. ఓ రోజు లక్ష్మణుడు తమ వనవాసానికి కారణం కైక అని కొద్దిగా పరుషంగా అంటున్నప్పుడు రాముడు ఆ మాటలను వారించటాన్ని బట్టి ఆయనలోని సౌమ్యగుణం వ్యక్తమవుతోంది. పంచవటిలోని పర్ణశాల వద్దకు రోజూ పరిసరాలలోని ఆశ్రమవాసులైన మునులు కొందరు వచ్చి రాముడితో మాట్లాడి వెళుతూ ఉండేవారు. ఇలాంటి సంఘటనలు పెద్దలు రాముడిని ఎంతగా అభిమానించే వారనే విషయం స్పష్టంచేస్తోంది.

### వానరులతో స్నేహం

శ్రీరామచంద్రుడి పంచవటి నివాస జీవితం ఆయన వ్యక్తిత్వాన్ని ప్రకటించటంతో పాటు రామాయణకథలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించుకుంది. ముల్లోకాలకు పీడగా మారిన రావణుడు సీతను అపహరించటానికి వేదికైంది. ఈ కారణంతోనే రాముడు ఉత్తరాపథాన్ని విడిచి దక్షిణాపథానికి వచ్చి వానరులతో స్నేహం చేశాడు. ఆ వానరులతో మహాగొప్పసేనను రూపొందించి లంక మీదకు దండెత్తాడు. ఆ దండయాత్రతో దక్షిణాపథంలోని ఎందరెందరో రాక్షసులు హతమయ్యారు. ఏదో ఒక రూపంలో తాను అవతరించి ధర్మరక్షణ చెయ్యటం ఆ భగవంతుడి కర్తవ్యం. అలాంటి కర్తవ్య నిర్వహణకు పంచవటి కేంద్రం కావటం మరీమరీ విశేషంగా కనిపిస్తుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

ధర్మపథం

---



కాయగూరల అలంకరణతో దర్శనమిచ్చిన అమ్మవారు

## నమో...నమో.. శాకాంబరి

**శ్రీకాకుళం, న్యూస్‌టుడే:** అవలంగి గ్రామ నీలమణి దుర్గ అమ్మవారు శాకాంబరి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. వర్షాలు కురవాలని కోరుతూ అమ్మవారి సన్నిధిలో మూడురోజులపాటు ఉత్సవాలు నిర్వహించాలని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్ణయించింది. మొదటి రోజైన గురువారం అమ్మవారిని 150 కిలోల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## నెత్తుటికూడు

**హిం**సతో సంపాదించిన ధనం అని ఈ జాతీయానికున్న అర్థం. పాపాన్ని తెచ్చిపెట్టే విధంగా ప్రవర్తించి సంపాదించటం, ఒకరిని కష్టపెట్టి వారి సొమ్ముతో తాను సుఃంచటం అనేలాంటి వాటిని గురించి చెప్పాల్సినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

## వనదేవతా... ప్రణమామ్యహం



అమ్మవారి ఉత్సవ విగ్రహం

**విజయవాడ , న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై శాకాంబరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భవానీ దీక్షా మండపంలో జగన్మాత దుర్గమ్మ విగ్రహాన్ని పతిష్ఠించారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, మండపారాధన, మూలమంత్ర హవనాలు జరిగాయి. దుర్గగుడి ఈవో త్రినాథరావుతో వైదిక కమిటీ సభ్యులు విఘ్నేశ్వరపూజ చేయించారు. ఉదయం స్నపనాభిషేకం అనంతరం అమ్మవారిని కాయగూరలు, ఆకుకూరలతో అలంకరణ చేశారు. స్వర్ణాభరణ కాంతులతో దర్శనమిచ్చే కనకదుర్గ వనదేవత అయిన శాకాంబరిగా భక్తుల మనసును దోచుకుంది. కోరిన వారికి కొంగు బంగారమై జీవరాశి ఆకలి దప్పికలు తీర్చే చల్లని తల్లి దుర్గమ్మ శాకంబరిదేవిగా అలంకరించారు.

---

## అపర శబరి పోకల దమ్మక్క

**రాముడ్ని పూజించిన మానవోత్తమురాలు / ఈ భక్తురాలి వంశవృక్షంపై అస్పష్టత**

**ఖమ్మం, న్యూస్‌టుడే:** అయోధ్య నుంచి రాములవారు వనవాసం సమయంలో భద్రాచలం వచ్చాడంటే ఆ స్వామికి ఈ ప్రాంతంలో గిరిజనంతో విడదీయలేని బంధం ఉన్నట్లేనని పండితులు నమ్ముతారు. భక్తులు కూడా దీన్ని విశ్వసిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆయన తిరిగిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గిరిజనుల్లో రామతత్వం పెంచేందుకు దేవాదాయ శాఖ పూనుకుంది. ఇప్పటికే తొలిసారి శబరి మాత ఉత్సవాలు వైభవంగా సాగగా ఈ నెల 12న దమ్మక్క సేవా యాత్ర పేరిట ఈవో రమేశ్ బాబు నేతృత్వంలో సంబరాలు నిర్వహించనున్నారు. దాదాపు 16వ శతాబ్దంలో భద్రాద్రిపై సీతారామలక్ష్మణుల విగ్రహాలను తొలిసారిగా చూసిన భాగ్యశాలి పోకల దమ్మక్క. నివాసిత ప్రదేశం భద్రిరెడ్డిపాలెంగా కొన్నిచోట్ల భద్రిరెడ్డిపల్లిగా ఇంకొన్ని చోట్ల ఉంది. గిరిజన తెగకు చెందిన వృద్ధురాలి వంశవృక్షం గురించి పూర్తిస్థాయి వివరాలు లభించనప్పటికీ క్షేత్ర చరిత్రలో ఓ ఆసక్తికర అంశం దాగి ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ఓ ఇతివృత్తం ఉంది. దమ్మక్క ప్రతినిత్యం స్వామికి తాటి పండును నైవేద్యంగా అందించేది. ఓ రోజు తనకు వేరే పని ఉండి తన పెంపుడు కూతురు సుగుణకు స్వామి పూజల బాధ్యతలు అప్పగించింది. ఇలా కొన్ని రోజుల తర్వాత దమ్మక్క రాముడి పూజ కోసం తాటి పండు పట్టుకుని వెళ్లగా అక్కడ ఇన్ని రోజుల పాటు సుగుణ సమర్పించిన తాటిపండ్లు కానరాలేదు. తాటిపండ్లు ఏమయ్యాయని అడిగితే సీతారాముల



ఉత్సవాల కోసం తయారు చేయించిన దమ్మక్క చిత్రపటం

వారే వచ్చి వీటిని తిన్నారు అని చెప్పింది ఆ గిరిజన యువతి. ఈ యువతి మాటల్లో నిజమెంతో తెలుసుకునేందుకు మళ్లీ సుగుణకు తాటిపండు ఇచ్చి పూజకు వెళ్లమని చెప్పి గ్రామస్థులతో కలిసి దమ్మక్క వెళ్తుంది. అప్పుడు పండు తినేందుకు ఎవ్వరూ రారు. దీన్ని అవమానంగా భావించిన యువతి రాయికి తలను బాదుకుని కిందపడిపోవడంతో సీతారాములు వచ్చి ఆ తాటిపండును తిని యువతిని దీవిస్తారని పురాణాల్లో ఉంది. ఆ వంశం రాముడి సేవ చేసే భాగ్యాన్ని పొందడం విశేషం. తరతరాలపాటు తపస్సు చేశాకే భద్రుడికి రామయ్య దర్శనం కలిగింది. దేవర్షి నారదుడు ఇక్కడ పూజలు చేసినట్లు ఉంది. మహాభక్తుడైన తిరుమంగై ఆళ్వార్ ఈ స్వామిని దర్శించుకున్నారు. శంకరాచార్యులు ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. రాజా తూము లక్ష్మీనరసింహదాసు ఇక్కడ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. రామదాసు చరిత్రను అందించిన వరద రామదాసు ఈ క్షేత్రంలో పూజలు చేశారు. రాముడు కొలువైన ప్రతీ చోట ఆంజనేయస్వామి అదృశ్య రూపంలో సంచరిస్తారని భక్తుల నమ్మకం. ఇలా ఎంతో మంది పావన చరితుల సందర్శనం ఇక్కడ జరిగింది. వీరందరిలో ఏదో శక్తి ఉంది.



దమ్మక్క జాతరలో స్వామివారికి అందనున్న ఫల, పుష్ప పూజలు

---

## కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం

**నల్గొండ, న్యూస్‌టుడే:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణం గురువారం నగరవాసులను భక్తిపరావశ్యంలో ముంచెత్తింది. హిందూ ఆధ్యాత్మిక సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరో వారికోత్సవంలో భాగంగా గురువారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరగింది. కార్యక్రమానికి తిరువాన్మియూరులోని శ్రీరామచంద్ర వైద్య విశ్వవిద్యాలయ మైదానం వేదికైంది. వందలాది మంది భక్తులు కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించారు. నగరంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించడం ఇదే ప్రథమమని, యాదగిరిగుట్ట స్వామివారి కల్యాణం ఇలా బయట ప్రాంతంలో అత్యంత వైభవంగా జరిపించడం కూడా ఇదే మొదటిసారని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా కార్యక్రమం పూర్తయి వెంటనే భారీ వర్షం కురవడం విశేషం.

తెలుగు వాణి

### మండపంలో మహాపూర్ణాహుతి

రామలింగేశ్వరుడి ఆలయంలో స్థాపిత దేవతారాధన.. దేవతాహోమం.. రుద్రస్వాహాకారం.. వర్షపాశుపత హవనం... జయాధిహోమం.. మండపంలో అవబృదస్నానం.. వరద పాయసం... పూర్ణాహుతి పూజలు... మహాపూర్ణాహుతి.. ఋష్యశృంగ విగ్రహ నిమజ్జనంతో గురువారం శ్రీ పాశుపతహవన పూర్వక రుద్రాభిషేకం, వరుణయాగం పర్వాలకు తెరపడింది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర సన్నిధిలోని శివాలయంలో చేపట్టిన రుద్రాభిషేకంలో భాగంగా చివరి రోజు వేకువ జామున సుప్రభాతం నిర్వహించిన పూజారులు ఆరాధన, హోమాది పూజలను చేపట్టారు. శ్రీ రుద్రస్వాహాకారంలతో వర్షపాశుపతహవనాన్ని చేపట్టారు. ప్రధాన దేవాలయం పక్కనే ఏర్పాటైన మండపంలో వరుణయాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాపూర్ణాహుతితో వాతావరణం కరుణిస్తుందని యాగ నిర్వహణను పర్యవేక్షించిన మాదవానందస్వామీజీ, ప్రభాకరాశ్రమస్వామీజీ వెల్లడించారు.



అలంకరణలో స్వామివారు

# అహింసా లోకంలో జ్ఞానకైలాస నగరం

ధర్మపథం

లోకాలెన్ని? అనంటే సర్వసాధారణంగా ఆ.. ఏముంది ఏడేడు పద్నాలుగు లోకాలే కదా అంటారు. అన్నింటికంటే ఎత్తైన లోకం ఏదంటే సత్యలోకమే కదా. దాన్నే బ్రహ్మలోకమని అంటారు కదా అని అనటం సహజం. కానీ శివమహాపురాణం విద్యేశ్వర సంహిత పదిహేడో అధ్యాయంలో మరికొన్ని కొత్త లోకాల ప్రస్తావన ఉంది. ఈలోకాలను స్థూలంగా విష్ణులోకాలు అని అంటారు.

పాతాళం నుండి సత్యలోకం వరకూ పద్నాలుగు లోకాలుంటాయి. అవే కాదూ సత్యలోకం నుంచి మళ్లీ ఆపైకి చూస్తే క్షమ అనే లోకం వరకూ మరో పద్నాలుగు లోకాలుంటాయి. అవి విష్ణువుకు సంబంధించిన లోకాలు. అలాగే క్షమాలోకం పై భాగాన శుచిలోకం వరకూ మరో ఇరవై ఎనిమిది లోకాలు కూడా ఉంటాయి. శుచిలోకం లోపల మళ్లీ ఓ కైలాసం ఉంటుంది. రుద్రదేవుడక్కడ సృష్టిలయం కోసం ఉంటాడు. అంతేకాదూ ఆ పైన మళ్లీ అహింసాలోకం వరకూ యాభైఆరు లోకాలు వరుసగా ఉంటాయి. ఆ అహింసాలోకాన్ని ఆశ్రయించుకొనే జ్ఞానకైలాసం అనే పేరున్న ఓ మహానగరం ఉంటుంది. అక్కడ మహేశ్వరుడు ఉంటాడు. ఆ అహింసాలోకం చివరన కాలచక్రస్థితి కనిపిస్తుంది. ఈ కాలచక్రస్థితి వరకూ ప్రళయకాలంలో సృష్టి లయమవుతూ ఉంటుంది. ఇక్కడ విచిత్రమేమంటే అహింసాలోకానికి కొద్దిగా కిందగా కర్మభోగాలు, జ్ఞానభోగాలు ఉంటాయి. జ్ఞానభోగం కింద కర్మమాయ, జ్ఞానమాయ అనేవి ఉంటాయి. ఈ భోగాలు, జ్ఞానాలు అన్నీ మహాశక్తిస్వరూపిణి అయిన లక్ష్మీదేవి ఆధీనంలో ఉంటాయి. ఈ భోగాలకు కిందవరకూ మాత్రమే కర్మమయ పాశబంధాలు ఉంటాయి. ఆ పైన మాత్రం బంధాలుండవు. అందుకే కింది వరకూ జీవుడు సకామకర్మలను అనుసరిస్తూ అక్కడి నుంచి కింద ఉన్న లోకాలలో తిరుగాడుతుంటాడు. ఆ పైన మాత్రం నిష్కామకర్మ మాత్రమే భోగంగా ఉంటుంది. అంటే నిష్కామ కర్మలననుసరించి సాధన చేసిన యోగులు మాత్రమే ఆ పైకి వెళ్లి భోగాన్ని



అనుభవిస్తుంటారు. నిష్కామ భావనతో శివలింగపూజ చేసే ఉపాసకుడు ఈ పైలోకంలోకి రావటానికి అర్హతను పొందుతాడు. జ్ఞానభోగాలకు కిందిభాగంలో జీవకోటి ఉంటే ఆ పైన ఈశ్వరకోటి ఉంటుంది. కింద ప్రాపంచిక జీవులుంటారు. పైన ముక్తి పొందినవారుంటారు. అలాగే పై లోకాలలో మదం, అహంకారం లాంటి వాటిని నశింపజేసే నమ్రత ఉంటుంది. స్థూలంగా చెప్పాలంటే ఆది భౌతికమైన పూజలు చేసేవారు కింది లోకాలలోనూ, ఆధ్యాత్మిక ఉపాసన చేసేవారు పైలోకాలలోనూ ఉంటుంటారు.

పైన ఉండే అహింసాదిలోకాలలో సంచరించే వ్యక్తి కాలచక్రాన్ని అధిగమించే శక్తితో ఉంటాడు. అక్కడ కాలచక్రేశ్వరుడి వరకూ విరాట్ మహేశ్వరలోకం అనే లోకముంటుంది. ఆ లోకం పైన వృషభాకారంలో ధర్మస్థితి ఉంటుంది. ధర్మస్థితిలో ఉండే ఆ వృషభం ఎంతో అసామాన్యమైనది. మూర్తీభవించిన బ్రహ్మచర్యానికి ప్రతిరూపం ఆ వృషభం. సత్యం, శౌచం, అహింస, దయ అనే నాలుగూ ఆ ఎద్దుకు నాలుగు కాళ్లు. విరాట్ మహేశ్వర ద్వారం దగ్గర ఉండే ఆ ఎద్దుకు క్షమ అనేది రెండు కొమ్ములుగా ఏర్పడి ఉంటుంది. ఇంద్రియనిగ్రహాన్ని శమం అని అంటారు. ఆ శమం ఎద్దుకు రెండు చెవులుగా ఉంటుంది. ఆ వృషభం వేదనాదాన్నే రంకె పెడుతుంటుంది. ఆస్తికత్వం అనేది దానికి రెండు కళ్లలాగా అమరి ఉంటుంది. విశ్వాసం ఆ ఎద్దుకు బుద్ధి, మనస్సుగా అమరి ఉంటుంది. ఇటువంటి క్రియారూప వృషభాకార ధర్మం మీదనే కాలాతీతుడైన శివుడు ఎక్కి కూర్చొని ఉంటాడు. ధర్మరూపమైన ఈ వృషభాన్ని ఎక్కిన శివుడుండే ప్రదేశం ఎంతో గొప్పది. అయితే అక్కడి నుంచి మళ్లీ ఒక వరుసలో పద్నాలుగు లోకాలు అక్కడి నుంచి మళ్లీ కారణరూప రుద్రుడికి చెందిన ఇరవైఎనిమిది లోకాలు. ఆపైన మళ్లీ శివుడికి సంబంధించిన అరవైఆరు లోకాలు ఉంటాయి. ఆ లోకాలు దాటాక అయిదు మండలాలు. అయిదు బ్రహ్మకడలతో ఆదిశక్తితో కూడిన ఆదిలింగం ప్రతిష్ఠితమై ఉంటుంది. దాన్నే పరమాత్మ అయిన శివుడి శివాలయమని శివజ్ఞాన పండితులు చెబుతుంటారు.

ఈ కథా సందర్భంలో ఇలా కొన్నికొన్ని కొత్త కొత్త లోకాల విషయాలు ప్రస్తావితమయ్యాయి. బ్రహ్మాండగోళమనేది కోటానుకోట్ల గ్రహాలతో ఉందని నేటి ఆధునిక శాస్త్రవేత్తలు కూడా అంటున్న మాటే. ఇన్నిన్ని లోకాల విషయాలను, అక్కడుండే ప్రత్యేకతలను ఎంతో పూర్వకాలంలోనే మన రుషులు చెప్పగలిగారు. ఈ విషయాన్ని గమనిస్తే మన పూర్వరుషుల బ్రహ్మాండగోళ, ఖగోళ, అంతరిక్ష పరిశోధనా జ్ఞానం ఎంత విశేషమైనదో అర్థమవుతుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# ఘనంగా సాయిబాబా రథోత్సవం

**శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** గురుపౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం శ్రీరాంపూర్‌లోని కార్మిక వీధుల్లో సాయిబాబా రథోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా విగ్రహంతో కూడిన రథాన్ని ఆర్కే-8 కాలనీలోని సాయిబాబా ఆలయం నుంచి ఆర్కే-8, గాంధీ నగర్, హిమ్మత్‌నగర్, భగత్‌సింగ్ నగర్, ఆర్కే-6 కొత్తరోడ్ ఏరియాల్లోని కార్మిక వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, ఏరియాలోని భక్తులు పాల్గొన్నారు.



**సాయిబాబా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు**

# ఉప్పు నిప్పు

జాతీయాలు నుడికారాలు

**ఓ** ఇద్దరి మధ్యన ఉండే మనస్పర్థలను, తగాదాలను గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది. తగాదా వల్ల ఎప్పుడూ తిట్టుకోవడం లాంటివి జరుగుతుంటాయి. ఇదంతా శబ్దానికి సంబంధించినది. నిప్పులో ఉప్పు వేసినప్పుడు చిటపటమంటూ శబ్దం వస్తుంటుంది. ఈ చిటపటలను తగాదా వల్ల కలిగే తిట్లతో లేదా అభిప్రాయభేదాలతో పోల్చి చెప్పటం ఇక్కడ విశేషం. ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు నిప్పనుకుంటే మరొకరు ఉప్పు అని భావించడం వల్ల ఈ జాతీయం ప్రయోగంలోకి వచ్చింది.

# శాకంబరికి శతకోటి వందనం



**నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:** స్థానిక హరిహరక్షేత్రం అయ్యప్ప ఆలయప్రాంగణంలోని దేవి లలితాంబ ఆలయంలో శుక్రవారం శాకంబరి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలు, పండ్లు, కూరగాయలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి రాధాకృష్ణశర్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అల్లోల వినోద మురళీధర్‌రెడ్డి దంపతులు, ఆలయ గురుస్వామి చెనిగారపు చిన్నయ్య, వేణుగోపాల్, సదాశివశర్మ, సంతోశ్‌శర్మ, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.






**తిరుమలలో జరుగుతున్న వైఖానసాగమ సదస్సులో వ్యాసవైజయంతి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న తితిదే ఈవో గోపాల్ తదితరులు , కార్యక్రమానికి హాజరైన పండితులు**

# సర్వవేదాల సారం వైఖానసాగమం

## తితిదే ఈవో గోపాల్

**తిరుమల, న్యూస్‌టుడే :** భరతభూమిలోని అన్ని వేదాలు, సకల శాస్త్రాల సమాహారం శ్రీవైఖానసాగమంగా తితిదే ఈవో ముక్కామల గిరిధర్ గోపాల్ ఉద్ఘాటించారు. తిరుమల ఆస్థాన మండపంలో శుక్రవారం వైఖానసాగమ సదస్సును ఈవో ప్రారంభించి మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో ఏళ్లతరబడి వైఖానసాగమం ప్రకారం స్వామివారి నిత్య కైంకర్యాలు, వార, పక్ష, మాస, సంవత్సరాది ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశిష్టమైన ఆగమశాస్త్రాన్ని భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అర్చకత్వంలో పరిపూర్ణత తెచ్చేందుకు త్వరలో తితిదే ఆగమ పండితులకు తత్త్వశాస్త్రంలో శిక్షణ ఇస్తామన్నారు. తితిదే ఆలయాల్లో 1,548 మంది అర్చకుల కొరత ఉందని, పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆగమ పండితులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తితిదే జేఈవో భాస్కర్, ఆగమ సలహాదారు ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్యులు, శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య కె.ఇ.దేవనాథన్, సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి ఆచార్య హరేకృష్ణ శతపతి పాల్గొన్నారు.

## వైఖానసాగమంపై పరిశోధన

పుస్తక రూపంలో ముద్రణకు చర్యలు

తిరుమల, న్యూస్‌టుడే : తిరుమలలో జరుగుతున్న వైఖానసాగమ సదస్సులో వేద పండితులు పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. పరిశోధన పత్రాలను కూర్పుచేసి పుస్తకరూపంలో ముద్రించాలని సదస్సులో తీర్మానించారు. ఆగమ పండితులు తమ పిల్లలను వేద పాఠశాలల్లో చేర్పించాలని తితిదే ఈవో గోపాల్ సూచించారు. తద్వారా దేశంలో ఆగమ పండితుల కొరతను అధిగమించవచ్చునని వివరించారు. జేఈవో పోలా భాస్కర్ మాట్లాడుతూ మానవ సమాజ మనుగడకు దేవాలయాలు కీలకమని, మందిరాలు చెడును దూరం చేస్తాయని అభిప్రాయపడ్డారు. వేదాలు, ఆగమాల పరిరక్షణకు తితిదే పలు కార్యక్రమాలు ప్రవేశపెట్టినట్లు వివరించారు. సదస్సులో తితిదే వైఖానసాగమ సలహాదారు ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్యులు రచించిన వ్యాసవైజయంతి గ్రంథాన్ని తితిదే ఈవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రత్యేకాధికారి ఎస్.రఘునాథ్, తిరుమల ఎస్వీడీఎస్వీ సభ కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు, విఖనస ట్రస్టు కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

# మల్లన్న పెద్దపట్నం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



**ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానం**

**ఓదెల, న్యూస్‌టుడే:** ప్రసిద్ధ శైవక్షేత్రం ఓదెల శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 13న జరుగనున్న పెద్దపట్నం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం రాత్రి ఆలయంలో ఒగ్గు పూజారులు, అర్చకుల మంత్రోచ్ఛారణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు దాటే కార్యక్రమం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా దక్షయాగ కథాశ్రవణం, గెలుపు ఉత్సవం, స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు వైభవంగా జరిపేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.మారుతి తెలిపారు. రాష్ట్రంలోని ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న దర్శనానికి తరలివస్తుంటారు. ప్రతియేటా ఉగాది పర్వదినంతో మొదలై ప్రతి ఆది, బుధవారాల్లో మల్లన్న జాతర జరుగుతుంది. పెద్దపట్నం బ్రహ్మోత్సవాలతో ముగుస్తుంది.

# జైమిని భారతం హాస్య రస సందర్భాలు

**భా**రతీయ పురాణ వాఙ్మయం ఈ జాతి మనుషులందరి గుండెల్లోనూ ఒక అద్భుతరీతిలో ఆనంద గంధంతో సమ్మిళితమై ఉంది. వాల్మీకి కృతమైన రామాయణం, వ్యాసప్రోక్తమైన అష్టాదశ పురాణాలు, మహాభారతం ఇవన్నీ భారతజాతి నరనరాన జీర్ణించుకొని ఉన్నాయి. అయితే మొన్నమొన్నటి వరకూ అంతగా లిఃతరూపమైన సాహిత్యం వెలువడని కారణంగా, చదువరులు అంతగాలేని కారణంగా మౌఃక సాహిత్యం మాత్రమే విస్తృత ప్రచారంలోకి వచ్చింది. ఈ నాటికీ జానపదులు చాలామందిలో మౌఃకంగా మాత్రమే

ధర్మపథం

తరతరాలుగా పురాణగాథలన్నీ ప్రచారమవుతూ వస్తున్నాయి. ఈ విధమైన ప్రచారంలో కొన్నిచోట్ల వ్యాస, వాల్మీకులు మూలాలలో చెప్పని ఎన్నెన్నో కథలు ప్రచారంలోకి వచ్చాయి. లిఃత సాహిత్యం వచ్చిన తరువాత రచయితల, కవుల ఇష్టానుసారంగా మూలకథకు కొన్ని మార్పులు చేర్పులు జరుగుతూ వచ్చాయి. అయితే అచ్చంగా ఇలాంటివే కాక జైమిని మహాముని రచించిన భారతం అశ్వమేధ పర్వంలాంటి గ్రంథాల నుంచి కొన్ని చిత్ర విచిత్ర కథలు హాస్యరస ప్రధానంగా ఉండేవి అవతరించాయి. ఈ కథల్లోని హాస్యం నర్మగర్భ సంభాషణలతోనూ, చతురోక్తులతోనూ, హాస్యం ఉద్భవించే కార్యాలతోనూ ముడిపడి కనిపిస్తుంది. జైమిని భారతంలో అశ్వమేథ పర్వంలో కృష్ణుడు ద్వారక నుంచి హస్తినకు ద్వారకావాసులందరితో కలిసి ఎంతో కోలాహలంగా బయలుదేరాడు.

### ఆయన దర్శనం గొప్ప వరం

కృష్ణుడంటే అందరికీ ఓ గొప్ప ఆరాధనా భావం. ప్రధానంగా స్త్రీ జనవాళికి ఆయన దర్శనమే ఓ గొప్ప వరం. వయసుమీరిన స్త్రీలైనా, యౌవనవతులైనా ఎవరైనా కృష్ణుడిని చూడటానికి తహతహలాడేవారు. అలా వారు కృష్ణ దర్శనం కోసం ఆనాడు పాకులాడిన సన్నివేశాలలో హాస్యం తొణికిసలాడిన సంఘటనలు అశ్వమేథపర్వంలో ఉన్నాయి. కృష్ణుడితోపాటు బయలుదేరినవారిలో ఒక వృద్ధ స్త్రీ కూడా ఉంది. అయితే ఆమె ఆ జనవాహినిలో చివర ఎక్కడో ఉంది. ముందువరుసలో ఉన్న కృష్ణుడిని చూడటానికి తన సావాసగత్తెలతో పరుగెడుతూ ఎంతకీ ఆయన కనిపించకపోతుండటంతో ఃఓ అమ్మలారా! ఎందుకీ వృథా ప్రయాస. ఈ శ్రీకృష్ణుడు ఉత్త అవివేకి. ఆయనకు ఎవరి మీద మెప్పు కలిగితే వారి సొమ్ము కాజేస్తుంటాడు' అని చిరుకోపంతో మూతి మూడువంకరలుగా తిప్పి, ఆ పక్కనే నడుస్తున్న ఓ ఎద్దుమీద వయ్యారంగా ఎక్కి ముందుకు పోసాగింది. అయితే ఆ ఎద్దుకు కొద్దిదూరంలో ఒక ఒంటె కనిపించింది. ఒంటెను చూసిన ఎద్దు బెదిరి పరుగులంకించుకోవటంతో ఆ వృద్ధ స్త్రీ నేల మీదకు జారి పడింది. ఆమె కోపమూ, తత్తరపాటుతనమూ, ఎద్దు మీద నుంచి కిందపడటమూ లాంటి సన్నివేశాలన్నీ హాస్యరస భరితంగా కనిపిస్తాయి. కిందపడిన ముసలిదానిని సైనికులు చూసి శ్రీకృష్ణుడిని నిందించినందుకు ఫలితం అనుభవించిందిలే అనుకొంటున్నప్పుడు ఆమె వారిని ఏమాత్రమూ తిట్టక తనకు కృష్ణ దర్శనమైందని, కృష్ణా అని పలుకుతున్నప్పుడే ఆయన తనకు కనిపించాడని ముందుకు వెళ్లింది.



### సుమనోదానం

మధ్యాహ్నసమయానికి ద్వారకానగరం దాటి హస్తినకు వెళ్లేమార్గానికి చేరాడు కృష్ణుడు. ఆ దోవలో అలా వెళుతుండగా ఒక పూలదండలు కట్టే స్త్రీ శ్రీకృష్ణుడిని చూసి ఆనందంతో కృష్ణా ఈ మిట్టమధ్యాహ్నవేళ ఇలా బయలుదేరావేమిటి? నాలాంటి పుష్పలావికలు ఇబ్బందులు పడతారు కదా. ఇవిగో నీకోసమని ఈ సుమనోదామం తీసుకువచ్చాను. ఇది వాడిపోకూడదు. దీనికి ప్రతిఫలంగా మౌక్తికం ఇప్పించు. ఈ దండ నీముఖం అనే గొడుగునీడలో విలసిల్లాలి సుమా. తపించిపోతూ ఉన్న నేను నీ అడుగు జాడలను అనుసరించి రాలేను కదా. సుగుణసంయుక్తాలైన ఈ సుమనోదామాలను అందుకొని నన్ను అనుగ్రహించు అని వేడుకొంది. పుష్పలావిక కృష్ణుడితో పలికిన పలుకులలో రెండు అర్థాలు కనిపిస్తాయి. పైపైకి చూస్తే సుమనోదామం అంటే మంచి పూలున్న పూలదండ మాత్రమే అని అర్థం. అంతరార్థంలో మంచి మనస్సు అనే అర్థం ధ్వనిస్తుంది. తానిచ్చిన పూలమాలకు మౌక్తికం అంటే ముత్యం. ప్రతిఫలంగా ఇమ్మన్నది వెలుపలికి వినిపించే అర్థం. అయితే అంతరార్థం మాత్రం తన మనసును స్వీకరించి అందుకు ప్రతిఫలంగా ముక్తిని ప్రసాదించమని కోరుతున్నట్లుగా కనిపిస్తుంది. తానిస్తున్న పూలమాలలోని పూలన్నీ సుగుణసంయుతాలు. అంటే సువాసన, అందం లాంటి లక్షణాలన్నీ కలిగినవి అని పైపైకి కనిపించే అర్థం. అంతరార్థం తన మనసంతా సుద్గుణాలే నిండి ఉన్నాయని అలాంటి తనను అనుగ్రహించమని వేడుకోవటంగా ధ్వనిస్తుంది. కృష్ణుడు ఆమె మాటలను మన్నించి నాలుగు అడుగులు ముందుకు వేయగానే నూనె వ్యాపారం చేసే ఒక స్త్రీ కృష్ణుడిని సమీపించి ఓ దేవా! నన్ను అనుగ్రహించు. నా ఈ పాత ఘటం బీటలువారి నూనె అంతా వృథాగా బయటకు స్రవించిపోతుంది. గానుగలో నుండి నూనెను తీయటంలోని నా కష్టం నీకు తెలియదు. కనుక ఇప్పటికిప్పుడే దిగివచ్చి నా స్నేహాన్ని స్వీకరించు. నూనె బండ్లు ఎన్నెన్నో నిండివున్నా ఈ దోవలో నేను ముందుకు కదలిరాలేకపోతున్నాను. నీవే నాకు ఏదో ఒక ఉపాయం చెప్పు అని కృష్ణుడిని బతిమాలుకుంది. ఈ నూనె అమ్మే స్త్రీ మాటలను పైపైకి చూస్తే ఏదో ఆ స్త్రీ త్వరగా తనవద్ద ఉన్న నూనెను తీసుకొని తనకు ప్రతిఫలాన్ని ఇప్పించమని వేడుకోవటం మాత్రమే కనిపిస్తుంది. కానీ అంతరార్థాన్ని పరిశీలిస్తే పాత ఘటం అంటే ముసలి శరీరం అనే అర్థం ధ్వనిస్తుంది. తాను ఏనాటినుంచో కృష్ణ భక్తితో ఉండటం అనేది గానుగ నుంచి కష్టపడి నూనె తీయటం అనే దానికి సమానార్థం. వెనువెంటనే దిగివచ్చి తన దగ్గర ఉన్న స్నేహాన్ని స్వీకరించు అని అనటం చూస్తే స్నేహం అనే పదానికి నూనె అని, మైత్రి అని రెండర్థాలు ఉన్నాయి. పైకి తనవద్ద ఉన్న నూనె తీసుకోవాల్సింది అని కోరుతున్నట్లున్నా తన మైత్రిని స్వీకరించమని, తనను అనుగ్రహించమని కోరుకోవటం ఆమె మాటల్లోని అసలు అర్థం. జానపద కళలైన తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ, జముకుల కథలలో ఇలాంటి నర్మగర్భోక్తులతోనూ, శ్లేషార్థాలతోనూ హాస్యరసంతో కూడి నడిచే కథలు ఈ నాటికీ కనిపిస్తూ ప్రేక్షకులకు అప్పటికప్పుడు హాస్యరసానుభూతి కలిగిస్తుంటాయి.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

# నేత్రానందం.. సౌమ్యనాథుని కల్యాణం



కల్యాణ సౌమ్యనాథుడి గ్రామోత్సవం

**కడప, న్యూస్‌టుడే:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని మనోహరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో కల్యాణం జరిపించారు. ఆఖిల్‌స్వామి ఆధ్వర్యంలో ఆగమశాస్త్రయుక్తంగా ఈ క్రతువును కొనసాగించారు. కాగా స్వామివారి కల్యాణానికి ప్రభుత్వం తరపును ప్రభుత్వ విప్ మేడా వెంకట మల్లికార్జునరెడ్డి ముత్యాల తలంబ్రాలను తీసుకొచ్చి సమర్పించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన దాత సతీష్ వితరణగా ఇచ్చిన ముత్యాల తలంబ్రాలను ఆయన ప్రతినిధి గంటా వాసుదేవయ్య అందజేశారు. ప్రొద్దుటూరుకు చెందిన భక్తుడు బుక్కపట్నం జయశంకర్ ముత్యాల తలంబ్రాలను అందజేశారు. స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు తిరుపతికి చెందిన పారిశ్రామికవేత్త సోమలరాజు చంద్రశేఖరరాజు వితరణతో పెళ్లి భోజనాలు పెట్టారు. వేలాదిగా విచ్చేసిన భక్తులు స్వామి కల్యాణాన్ని కనులారా తిలకించారు. వ్యాఖ్యాతగా ఆకాశవాణి కళాకారుడు సోట్టు సాంబమూర్తి వ్యవహరించారు. కల్యాణోత్సవానికి హాజరైన కల్యాణోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా రాజంపేట డీఎస్పీ జి.వి.రమణ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.

## సొరకాయకోత

**సొ**రకాయ మిగిలిన కూరగాయలకన్నా ఎంతో మెతకగా ఉంటుంది. అదే సొరకాయ మరింత లేతగా ఉంటే దాని మెత కదనానికి సాటి మరొకటి ఉండదు. అలాంటి లేత సొరకాయను కొయ్యటం ఎంతో సులభం. లేత సొరకాయలను ఇట్టే కోసినంత సులభంగా కొంత

జాతీయాలు నుడికారాలు

మంది తెగ గొప్పలు చెబుతుంటారు. గొప్పలు చెప్పటాన్ని కోతలు కొయ్యడం అని అంటారు. ఇది వాస్తవానికి మరీమరీ దగ్గరగా ఉంటే, అంటే విపరీతంగా ఎవరైనా గొప్పలు చెబుతుంటే ః ఃవాడు సొరకాయలు కోస్తున్నాడురోయ్' అని అనటం కనిపిస్తుంది.



నమోగురు

**గురుపౌర్ణమి సందర్భంగా జిల్లాలోని సాయి బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిత్తూరు, తిరుపతిలో విశేష అలంకరణలో సాయినాథుడు దర్శనమిచ్చారు... తిరుపతి టి.కె.స్ట్రీట్‌లో విశేషాలంకరణలో దర్శనమిస్తున్న సాయిబాబా - తిరుపతి, న్యూస్‌టుడే**

తెలుగు వాణి

# వైభవం.. శాకంబరి ఉత్సవం

**కర్నూలు, న్యూస్‌టుడే:** క్షామంతో అల్లాడి పోయే జగత్తుకు ఆపద్బాంధువు పరాశక్తి. వేదాలు రక్షించి వైదిక ధర్మలను పురరుద్ధరించిన జగన్మాత శాకంబరి అలంకారంలో శ్రీశైలం భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. లోకమంతా సుభిక్షంగా ఉండాలని దీవించే చల్లని తల్లిని వివిధ కూరగాయలతో అలంకరించడం శ్రీగిరి భక్తులకు నేత్రానంద భరితం కలిగించింది. శ్రీశైల క్షేత్రంలో ఆశాఢపౌర్ణమి సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో శాకాంబరి ఉత్సవం వైభవంగా జరిగింది. భ్రమరాంబాదేవిని అమ్మవారి ఆలయం ఎదురుగా ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తిని శాకాంబరి అలంకారంలో ముస్తాబుచేశారు. అమ్మ వారికి ఎదురుగా శివ లింగా కృతులు, పక్షులు, జంతువులు, పుష్పాల ఆకారంలో వివిధ ఫలాలు, కూరగాయలతో తయారుచేసి అలంకరించారు. మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి ఆలయ ప్రాంగణం, శనగల బసవన్న, ధ్వజస్తంభాలు, రాజరాజేశ్వరీ దేవి, వృద్ధమల్లికార్జునస్వామి, సింహ మండపం, సప్త మాతృకలతోపాటు గ్రామదేవత అలంకాలమ్మ, వివిధ దేవతా మూర్తులను కూరగాయలు, ఆకుకూరలతో ముస్తాబుచేశారు. అనంతరం శాకాంబరీదేవికి ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు షోడశోపచార పూజలు నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు.



ఆలయ వేదికపై శాకంబరి

# ఘనంగా దమ్మక్క సంబరాలు

**ఖమ్మం, న్యూస్‌టుడే:** భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి వారి ఆలయం పరిసరాలు భక్తుల సంబరాలతో పులకించాయి. గిరిజన సంప్రదాయంలో అపరశబరి పోకల దమ్మక్క సేవా యాత్ర పేరిట జరిగిన వేడుక భక్తుల్ని ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. ముఖ్య కూడళ్లలో ఆదివాసీలు చేసిన కొమ్ము నృత్యాలు, రేల ఆటలు అలరించాయి. గిరిప్రదక్షిణ చూడముచ్చటగా సాగింది. కలెక్టర్ శ్రీనివాస శ్రీనరేశ్ ఉత్సవాన్ని ప్రారంభించి దమ్మక్క చిత్రపటాన్ని పట్టుకుని ప్రదక్షిణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు. చిత్రకూట మండపంలో స్వామి వారికి కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వర్ణ తులసి పూజ, తామరాల పూజ చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కన్యావరుణ, కంకణధారణ, మహా సంకల్పం, ప్రవర, కన్యాదానం తదితర కార్యక్రమాలు నిర్వహించినప్పుడు జైశ్రీరాం నినాదాలు మార్మోగాయి.

# కాశీ.. అందుకే అంత గొప్పది

భారతీయులకు అనాది కాలం నుంచి కాశీ మహానగరం ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రం. కాశీలో మరణించిన కుక్క కూడా స్వర్గానికే వెళుతుందన్నది నమ్మకం. కాశీ మహానగరంలో ఉండే అన్నపూర్ణమ్మ తల్లి, విశ్వేశ్వరుడు నమ్మిన భక్తులకు కొంగుబంగారం లాంటివారు. కాశీ నగర మహాత్మ్యాన్ని తెలిపే కథ ఒకటి దేవీభాగవతం పదకొండో స్కంధంలో కనిపిస్తుంది. ఆ నగరంలోని అన్నపూర్ణాదేవి గుడి చుట్టూ చేసిన ప్రదక్షిణల ప్రభావం ఎంత గొప్పదో ఈ కథ సూచిస్తుంది. పూర్వం హిమాలయ పర్వతాల్లో ఒక చక్రవాక పక్షి ఉండేది. అది ప్రతి రోజూ ఉదయాన్నే ఆహారం కోసం తన నివాసాన్ని వదిలి ఆకాశమార్గాన అలా అలా పయనిస్తూ ఎన్నెన్నో దేశాలను దాటుకుంటూ కాశీ నగరానికి వచ్చి చేరేది. అంత దూరం ప్రయాణించి మిట్టమధ్యాహ్న సమయానికి ఆ చక్రవాక పక్షి కాశీలోని అన్నపూర్ణాదేవి మందిరానికి చేరే సరికి దానికి ఆకలి వేస్తుండేది. ఆ ఆకలి తీర్చుకోవటం కోసం అన్నపూర్ణాదేవి మందిరం చుట్టూ పడిఉన్న మెతుకులను ఏరుకొని తింటూ పొట్ట నింపుకొనేది. ఇలా మెతుకులను ఏరి తినేందుకు దానికి తెలియకుండానే అది గుడి చుట్టూ ప్రదక్షిణ చేసేది. అలా చాలా కాలం గడిచింది. కాలాంతరంలో ఆ చక్రవాక పక్షి ఆయువు తీరి మరణించింది.

### నేరుగా స్వర్గానికే...

ఇతర పక్షులలాగా మరణానంతరం కూడా నరకయాతనలేవీ పడకుండా నేరుగా స్వర్గానికి చేరుకుంది. రెండు కల్పాలపాటు స్వర్గంలో ఆ పక్షి భోగాలను అనుభవించింది. ఆ తర్వాత భూలోకంలో ఓ రాజుగారి ఇంట మగశిశువుగా ఆ చక్రవాక పక్షి జన్మించింది. పెద్దలు ఆ శిశువుకు బృహద్రథుడు అని పేరు పెట్టారు. పెరిగి పెద్దయిన రాకుమారుడికి పెద్ద రాజు రాజ్యాభిషేకం కూడా చేశాడు. బృహద్రథుడికి త్రికాలజ్ఞత ఉండేది. భూత, భవిష్యత్తు వర్తమానాలు ఆయన కళ్లెదుట ఎప్పుడూ కనిపిస్తుండేవి. బృహద్రథుడు ప్రజారంజకమైన పరిపాలకుడుగా పేరు తెచ్చుకొన్నాడు. యజ్ఞయాగాది క్రతువులు చేస్తూ ఉత్తముడిగా పెద్దలందరి చేత ప్రశంసలందుకున్నాడు. వీటన్నిటితోపాటు బృహద్రథుడికి పూర్వజన్మ జ్ఞాపకాలు ఉండేవి. అతడి త్రికాలజ్ఞత, పూర్వజన్మ స్మృతి లాంటివి ఆనాడు ఆనోటా ఆనోటా ప్రజలందరికీ చేరాయి. గొప్ప గొప్ప మునులు సైతం ఆ రాజు మహత్తర శక్తికి ఆశ్చర్యపోతూ అంతటిశక్తి ఆయనకు ఎలా కలిగిందో తెలుసుకోవాలని ఉత్సాహపడుతుండేవారు. అలాంటి మునులలో కొందరు పెద్దవారు ధైర్యం చేసి ఒక రోజు రాజు దగ్గరకు బయలుదేరారు. మునులందరి రాకను గమనించిన బృహద్రథుడు తాను రాజునన్న అహంకారభావాన్ని కొంచమైనా మనసులో పెట్టుకోక ఆ మునులకు ఎదురు వెళ్లి నమస్కరించి, పూజించి, అతిథి సత్కారాలను చేసి, ఉచితాసనాలను సమర్పించి సత్కరించాడు. యోగక్షేమపరామర్శలు అయ్యాక మునులు బృహద్రథుడికి త్రికాలజ్ఞత, పూర్వజన్మ స్మృతి ఎలా కలిగాయో చెప్పమని అడిగారు.



### ప్రదక్షిణ ఫలితమే..

అప్పుడు బృహద్రథుడు ఎంతో వినయంగా, అందులో పెద్ద రహస్యమేమీ లేదని, తాను ఆ శక్తుల సాధనకోసం ప్రత్యేకించి చేసిన యజ్ఞయాగాలు, క్రతువులు కూడా ఏవీ లేవన్నాడు. ఆ మాటకు మునులకు ఆశ్చర్యం కలిగింది. వారి ఆశ్చర్యాన్ని గమనించి బృహద్రథుడు మళ్లీ చెప్పసాగాడు. గత జన్మలో తాను ఒక చక్రవాక పక్షినని ఆహారాన్వేషణలో తనకు తెలియకుండానే కాశీ మహానగరంలో ఉన్న అన్నపూర్ణాదేవి మందిరానికి ప్రదక్షిణం చేశానని చెప్పాడు. ఆ ఫలితమే తనకు ఎంతో పుణ్యాన్ని చేకూర్చి పెట్టి రెండు కల్పాలపాటు స్వర్గ సుఖాలను ఇచ్చి ఈ జన్మలో మహారాజయోగాన్ని కూడా కలగజేసిందన్నాడు. తనకు లభించిన శక్తులు, భోగాలు అన్నీ కాశీ అన్నపూర్ణాదేవి మందిరానికి చేసిన ప్రదక్షిణల ఫలితమేనని, జగదాంబ అయిన ఆ అన్నపూర్ణాదేవికి అంతటి మాహాత్మ్యం ఉందని బృహద్రథుడు చెప్పాడు. ఇలాంటి ఉదాహరణల వల్లనే కాశీ అన్నపూర్ణావిశ్వేశ్వర దేవుల ఆలయ దర్శనం, ప్రదక్షిణ నమస్కారాలు ఎంత విలువైనవో ఆస్తికలోకానికి అవగతమవుతూ ఉంటుంది.

**- డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు**

ధర్మపథం

# పేరిగాడి రాజ్యం

తెలివితక్కువ వాడి వ్యవహారం అనే అర్థంలో ఈ జాతీయం ప్రయోగంలో ఉంది. దారిని పోయే దానయ్య, ఎల్లయ్య, పుల్లయ్య ఇలాంటి పేర్లను అనామకులు అనే అర్థంలో వాడటం ఓ అలవాటుగా ఉంది. ఇక్కడున్న పేరిగాడు కూడా ఆ జాబితాలోవాడే. వీళ్లంతా ఏ ఒక్క వ్యక్తిని మాత్రమే సూచించేవారుకాక మొత్తం సమాజంలోని తెలివితక్కువ వారికి, అనామకులకు మారుపేర్లుగా వ్యవహారంలోకి రావడం విశేషం. ఈ విశేషాన్ని అనుసరించే ఎవరైనా తెలివితక్కువగా ఓ వ్యవహారాన్ని నడుపుతున్నప్పుడు, నాయకత్వ లక్షణాలు సరిగాలేనప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది.

జాతీయాలు నుడికారాలు

తెలుగు వాణి



**తిరుపతమ్మకు హరితహారం**

పెనుగ్రంచిపోలు, కృష్ణాజిల్లా, న్యూస్‌టుడే: **ప్రముఖ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న పెనుగంచిప్రోలులోని శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారితో పాటు సహదేవతల విగ్రహాలనూ పలు రకాల కూరగాయలతో ఆకర్షణీయంగా అలంకరించారు.**

# కాంచినవారిదే భాగ్యం..!

**కడప, న్యూస్‌టుడే :** తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో అన్నమయ్య ఆరాధ్య దైవాలైన సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవానికి తితిదే తరుపున ఏఈవో సుబ్రహ్మణ్యం పట్టువస్త్రాలను అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఒకే వేదికపై నిర్వహించిన శివకేశవుల కల్యాణ మహోత్సవానికి ఆలయ ఇన్‌స్పెక్టర్ వినోద్, మాజీ సర్పంచి బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు బాలరాజు నవీన దంపతులతో పాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఇందులో భాగంగా మెదట కామాక్షి సమేతుడైన సిద్ధేశ్వర; శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామివారిని ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి కల్యాణ వేదికపై కూర్చోబెట్టారు. వేదపండితులు అడుగడుగునా స్వామి వారి కల్యాణోత్సవాన్ని భక్తులకు వివరిస్తూ వేదపారాయణం చేస్తూ స్వామి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ అనంతరం కల్యాణ టిక్కెట్లు కొనుగోలుచేసిన దంపతులను తితిదే ఆధ్వర్యంలో సత్కరించి వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. చివరిగా కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులందరికీ ప్రసాదాలను అందజేశారు.



**అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవ స్వామి**

# నేత్రపర్వంగా బాబాకు నగరోత్సవం



**విశేషాలంకరణతో పురవీధుల్లో ఊరేగుతున్న బాబా**

**నెల్లూరు, న్యూస్‌టుడే :** గురుపూర్ణమ మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి నాయుడుపేట అగ్రహారపేటలోని శ్రీషిర్డీ సాయి బాబా నగరోత్సవం వైభవంగా జరిగింది. పుష్పాలతో విశేషంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై సాయినాథుని ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. విద్యుద్దీపకాంతులు, బాణసంచావెలుగులు, పండరి భజన, తప్పెట్లు, కోలాటాలతో నగరోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకొని పూజలు చేశారు. నృత్య ప్రదర్శనలు, కళాకారుల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# ‘సత్య’ వైభోగం...

**రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, న్యూస్‌టుడే:** అన్నవరం పుణ్యక్షేత్రం... రాష్ట్రంలో అతిపెద్ద దేవస్థానాల్లో ఒకటి. రోజూ సుమారు 30 వేల మంది భక్తులు వస్తుంటారు... ఈ సంఖ్య నానాటికీ పెరుగుతున్న పరిస్థితి ఉంది. అవసరాలకు తగ్గట్టుగా ఆ అభివృద్ధి ఏవిధంగా చేయాలి... ఎలా ముందుకుపోవాలి... అన్న విషయంపై విజన్-2040ని సిద్ధం చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. రానున్న 25 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని రూ. 500 కోట్లతో అభివృద్ధికి అతిపెద్ద ప్రణాళిక సిద్ధం చేశారు. అన్నవరం దేవస్థానం బృహత్తర ప్రణాళికను ఆగమశాస్త్రం ప్రకారం ప్రసాద్ డిజైన్ టీమ్ అనే ప్రయివేటు సంస్థ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. దీన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ సంస్థ బృందం దేవస్థానం ఈవో ప్రసాదం వెంకటేశ్వర్లు, ఛైర్మన్ ఐ.వి.రామ్‌కుమార్, ఇతర ఇంజినీరింగ్ అధికారులకు గురువారం వివరించి... వారి నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ ప్రణాళికను ఐదుగురు సభ్యుల ప్రత్యేక కమిటీ బృందం పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతిస్తుంది. తర్వాత దశలవారీగా అమలు చేస్తారు. అంతకంతకూ పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో భక్తులకు వసతిసౌకర్యాల కోసం కొండ దిగువునే బేస్ క్యాంప్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఘాట్ రోడ్డు ప్రారంభంలోని హైస్కూల్‌ను పంపా సత్రంలోకి, జూనియర్ కళాశాలను జాతీయ రహదారి వద్ద ఉన్న డిగ్రీ కళాశాల ప్రాంగణానికి మార్చడానికి యోచిస్తున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో, కొత్తపేట ప్రాంతంలోని గోశాల వద్ద దేవస్థానం స్థలం వద్ద కూడా ఇలాంటి బేస్ క్యాంపులు నిర్మించాలని ప్లాన్‌లో రూపొందించారు.



**అన్నవరం దేవస్థానం**

# ఆలోచింపజేసిన ‘ఆయుధం’

**విజయవాడ, న్యూస్‌టుడే:** మీరు ఓటు, ఓటూ అంటుంటే అది మా చెవులకు నోటు, నోటూలా వినిపిస్తుంది. మీరియ్యాల, మేమెయ్యాల(మద్యం) ఓటుకి గిట్టుబాటు ధర నిర్ణయించే స్థాయికి వీరు ఎదిగారు.. ఇలాంటి ఆకట్టుకునే మాటలతో సహా దంగేడు చెట్టుకింద వీరనాగమ్మో, నాబాలచంద్రమ్మో వంటి జానపద గీతాలతో ప్రేక్షకులను కనువిందు చేయడంతోపాటు నేటి సామాజిక రాజకీయ పరిస్థితికి దర్పణం పట్టింది ‘ఆయుధం’ నాటకం. ప్రముఖ సినీకథారచయిత డాక్టర్ పరుచూరి గోపాలకృష్ణ రచించి, ప్రముఖ దర్శకులు నల్లూరి వెంకటేశ్వర్లు దర్శకత్వంతో ఈ నాటకాన్ని ప్రజానాట్యమండలి విజయవాడశాఖ ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ప్రదర్శించారు.